Rs. 15/-

అఖిల

అఖిల భారత పత్రిక

జనవరి 2009

పదార్థము పరార్థమును ఆవిష్కరించును

- శ్రీమాతారవిందుల వాక్కులు

అఖిల

భారత పత్రిక - జనవరి 2001

పదార్థము పరార్థము నావిష్కరించును.

విషయసూచిక

(శ్రీమాతారవిందుల వాక్కులు)

నాకు ఉన్న భగవదిచ్ఛ నాకెలా తెలుస్తుంది? నా లోలోపల సందుల్లో దాగిఉన్న అహాన్ని బయటికి తరిమికొట్టాలి. స్వచ్ఛమైన, చాటుమాటులేని నా అంతరాత్మను ఆయన యొక్క అనంత (దివ్య) కార్యకలాపాలలో పునీతం కావించాలి. అపుడు ఆయనే దానిని నాకు బహిర్గతం కావిస్తాడు.

- శ్రీఅరవిందులు

ప్రార్థన

ఓ దేవా! ఏకైక దివ్యసత్యానివి నువ్వు. మాలో కాంతికి మూలమైన దివ్యతేజస్సువి. మా జీవితానికి దివ్య జీవితానివి. అత్యున్నత దివ్యప్రేమవి. విశ్వరక్షకుడవు. నీ సుస్థిర దివ్య సమక్షం యొక్క ఎరుక నాలో అధికాధికముగ, నిర్దుష్టముగ మేల్కొల్పుము. నేను చేసేవన్నీ నీ దివ్య న్యాయమునకనుగుణముగా నుండునట్లు చేయుము. నీ దివ్య సంకల్పానికి, నా సంకల్పానికి తేడా లేకుండ చేయుము. నా మనస్సు యొక్క చైతన్య భ్రాంతి నుండి, అభూత కల్పనల నుండి నాకు విముక్తి కలిగించుము. నీ పరమశుద్ధ దివ్యచైతన్యమునకు, నాకు భేదము లేకుండునట్లు చేయుము.

అంతిమ లక్ష్యము సాధించుటకు నా సంకల్పమునకు దృఢత్వము నిమ్ము. బద్ధకము, బడలికలను కుదిపి వేసే ధైర్యము, శక్తి మరియు సుదృఢత్వము నాకు ప్రసాదించుము.

సంపూర్ణ నిరాసక్తత వల్ల కలిగే శాంతిని నాకొసగుము. నీ దివ్యసమక్షం యొక్క అనుభూతిలో కలిగే శాంతిని మరియు నీ దివ్యజోక్యం యొక్క ఫలితాల్ని నాకనుగ్రహించుము. ఏ శాంతి నిరంతరం దుష్టసంకల్పాలన్నింటి పైనా మరియు ప్రతి అదృశ్య శక్తిపైనా విజయవంతమ తుందో ఆ శాంతిని నాకు ప్రసాదించుము.

నాలోగల సమస్తము నీలో విలీనమగునట్లు చేయుమని వేడుకుంటున్నాను. అత్యున్నతమైన నీ దివ్యస్పృహ నాలో పూర్తిగా జాగృతం కావాలి. అది నేను నీ దివ్య ప్రేమజ్వాలగానే తప్ప మరేమీ కానట్టు అనుగ్రహించుము.

- శ్రీమాత

అనంతుని దిశగా ఉన్మీలనము

మానవ చైతన్యానికి, అనంతంవైపు తెరచుకొనే కిటికీలు వుంటాయి. కాని సాధారణంగా మనుషులు ఆ కిటికీల్ని జాగ్రత్తగా మూసి వుంచుతారు. అవి విశాలంగా తెరవబడాలి. ఆ దివ్యఅనంతుని స్వేచ్ఛగా మనలోకి ప్రవేశింపచెయ్యాలి. మనలో పరిణామం జరగనివ్వాలి.

కిటికీలు తెరవడానికి రెండు షరతులు తప్పనిసరి.

1. గాఢమైన ఆకాంక్ష
2. అహం నిర్మూలనలో పురోగతి సాధన

ఎవరైతే చిత్తశుద్ధి కలిగివుంటారో వారికి పరమాత్మ తప్పక సహకరిస్తాడు.

తీవ్ర ఆకాంక్ష

ఈ మార్గం ప్రారంభ దశలోను, తర్వాత చాలా కాలం తర్వాత కూడా ప్రాధమికంగా, అనుభవం యొక్క అభివృద్ధి వేగం, ఔన్నత్యంలో గాఢత మరియు దాని ఫలితాల శక్తి, సాధకుడి వ్యక్తిగత ప్రయత్నం, ఆకాంక్షల మీద ఆధారపడుతుంది. బాహ్య దృశ్యాలు, ఆకర్షణలలో నిమగ్నమయిన అహంకారపూరిత చైతన్యస్థితి నించి, దేనిలో సర్వాతిశాయి అనిర్వచనీయ శక్తి అయిన విశ్వాత్మ తననితాను ప్రవేశ పెట్టుకుని తీర్చిదిద్ది పరిణామం చెందించగలదో ఆ ఉన్నత స్థితిలోకి మలుపు తిరిగేటట్టు చేసే యోగ పద్ధతే మానవ జీవాత్మకి మలుపు. అదే దివ్యసిద్ధి యొక్క మొట్ట మొదటి ఖచ్చితమైన మూలపదార్థం.

మూలం : శ్రీఅరవిందులు

అనువాదం : యన్. విజయలక్ష్మి

అహంకారమే సహాయకారి అహంకారమే అవరోధం

అచేతన నుండి, అవచేతన నుండి వ్యక్తి తననుతాను విడిపోవడానికి, స్వతంత్రమైన సజీవ మనస్సుగా, జీవశక్తిగా, ఆత్మగా, ప్రత్యగాత్మగా మారి, తన చుట్టూవున్న ప్రపంచంలో సహకరించడానికి, అందులో మునిగి అంతర్ధానమై, పోకుండా, ఉండడం కోసం ప్రకృతి అహంకారాన్ని సృష్టించుకుంది. విడిగా దానికి అస్తిత్వం లేదు. ప్రభావమూలేదు. వ్యక్తి విశ్వాత్మలో ఒక భాగం. కాని అంత కన్న ఎక్కువే. విశ్వాతీత పరతత్వం నుండి అవరోహించిన ఆత్మ అతడు. దీనిని అతడు అభివ్యక్తం చేయలేడు. ఎందుకంటే విశ్వ నిశ్చేతనకు అతను మరీ దగ్గరగా ఉన్నాడు. మూల అవచేతనను సమీపించలేడు. తను ఆత్మగా తెలుసుకోడానికి ముందు తను, మానస, ప్రాణిక అహంకారం అని కనుగొనాలి.

మానసప్రాణిక అహంకారాన్ని శరీర గత ఇంద్రియ స్పర్శతో ముడివేసి రూపకల్పన చేయడం విశ్వజీవ చైతన్యం తన ప్రగతిశీల పరిణామక్రమంలోని తొలి గొప్ప పరిశ్రమ. భౌతిక పదార్థ సీమలో చైతన్యవంతమైన వ్యక్తిని సృష్టించడానికి తను కనుగొన్న మార్గం ఇదే. ఈ పరిమితం చేసే, అహంను అంతరింపచేయడం ఒక షరతు. ఈ విశ్వజీవచేతన దివ్య సాఫల్యం పొందడానికి ఇది ఎంతో అవసరం. ఈ విధంగా మాత్రమే వ్యక్తి తన విశ్వాతీత ఆత్మను కని, తన నిజమైన దివ్య పురుషతత్వాన్ని ఆవిష్కరించగలడు.

- శ్రీఅరవిందులు

క్రమంగా అంతర్థానమయ్యే అహం

అహంకార పూరితమైన తన ఆత్మ అస్పష్ట ఉపరితలం క్రిందకు మనిషి అవలోకించి, తనను తాను తెలుసుకునే ప్రయత్నం చేయవలసిన సమయం ఆసన్నమై తీరుతుంది. యదార్థ మానవుని కనుగొనడానికి అతను ఆయత్తమై తీరాలి. ఆ యత్నం లేకపోతే మనిషి ప్రకృతి యొక్క ప్రాథమిక విద్యస్థాయిలోనే ఆగిపోతాడు. ప్రకృతి దాచిన మరింత ప్రగాఢమైన, విస్తృతమైన ప్రబోధాలవైపు వెళ్లలేడు. అతని ప్రయోగాత్మక జ్ఞానం, సామర్థ్యం ఎంత గొప్పవైనా, మృగాలకన్నా కొంచెం ఉన్నతంగా మనగలడు. మొదట తన మనస్తత్వంవైపు తిరగాలి. అందులోని ప్రకృతి సహజమైన విభాగాలు - అహం, మనస్సు, దాని ఉపకరణాలు, జీవం, శరీరం - వాటిని తను విడిగా విశ్లేషించాలి. ఈ సహజ విభాగాలు పనిచేసే తీరుగాక, అహంకారాన్ని సమర్థించుకోడం, సంతృప్తి పరచుకోడం కాకుండా తన యావత్ అస్తిత్వం విశదం చేసుకోవలసిన అవసరం ఉందని అతను కనుగొనే వరకు ఈ ప్రక్రియ సాగవలసిందే.

* * *

మన అస్తిత్వంలోని అంతరాంతరాలలోని ఆత్మలో ప్రవేశించినప్పుడు మనలో, అందరిలోను ఉన్న ఆత్మ, దైవత్వం ఒక్కటేనని గ్రహించగలం. ఆ దైవాన్ని ప్రకృతి సేవిస్తూ అభివ్యక్తం చేస్తుంది. మనం ఆ ఆత్మకు చెందిన ఆత్మగా, ఆ దివ్య

ప్రతిమ నుండి ప్రతినిధిగా వచ్చిన శరీరంగా ఈ జీవితం భగవజ్జీవిత దివ్యలయలోని కదలికగా, మన మనస్సు ఆయన చైతన్యపు కోశంగా, మన ఇంద్రియాలు ఆయన ఉపకరణాలుగా, మన ఉద్వేగాలు, సంవేదనలు ఆయన ఆనంద అన్వేషణలుగా, మన చర్యలు, ఆయన లక్ష్యసాధనాలుగా, మన స్వేచ్ఛ ఒక నీడ మాత్రమేనని ఒక సూచన, ఒక వీక్షణంగా - మనం అజ్ఞాన స్వరూపాలుగా గుర్తిస్తాం. మనం ఆయన్ని తెలుసుకున్నప్పుడు మన జీవితాలు ఆయన అమర స్వేచ్ఛా ప్రవాహాలుగా గ్రహిస్తాం. మన శక్తిసామర్థ్య పరిపూర్ణతలు ఆయన శక్తి ప్రతిబింబాలు. మన అత్యుత్తమ జ్ఞానం ఆయన జ్ఞానంలోని పాక్షిక కాంతి మాత్రమే. మన ఆత్మయొక్క అత్యంత శక్తివంతమైన సంకల్పం సర్వత్రా భాసించే పరమాత్మ శక్తి ప్రతినిధి మాత్రమే. ఆయనే ఈ విశ్వ సార్వభౌముడు. ఈ ప్రపంచాత్మ. ప్రతివ్యక్తి హృదయంలో స్పందించే ప్రభువు - అజ్ఞానంలో వున్నా మన లోపలి, బాహ్యా కర్మల్ని ఆయనే నడిపిస్తాడు. ఈ నిమ్న ప్రకృతి అనే మాయాజాల చక్రభ్రమణంలోని యంత్రంపై మనల్ని నిలబెట్టినట్లు మన జీవితాలను ఆయనే నడిపిస్తాడు. అజ్ఞానంలో మన జీవితాలను మసక బారిన, జ్ఞానంలో దీపించినా, మనలోని ఆయన కోసం, ఈ ప్రపంచంలోని ఆయన కోసం మనం ఊపిరి తీస్తున్నాం. ఈ సత్యంలో, ఈ జ్ఞానంలో సమగ్ర పూర్ణత్వంతో, చైతన్యంతో జీవిస్తే మనం అహంకార వలయం నుండి తప్పించుకోగలం. "మాయా"జాలం నుండి బయటపడగలం.

* * *

ప్రతిసాధకుని తొలిదశలలో సాధన అహంకారం కేంద్రంగానే సాగుతుంది. ఇది నా సాధన, ఇది నా ప్రయత్నం, ఇది నా స్వీయ వికాసం, నా పూర్ణత్వం, నా సిద్ధి.... ప్రతి సాధకునిలో ఆలోచన అదే కదా! చాలామందికి అటువంటి భావన అనివార్యం. అటువంటి వ్యక్తిగత ప్రయత్నం లేకపోతే తొలి అవసర మార్పులు తీసుకొనిరాగల సంకల్పం కాని, ప్రోత్సాహం కాని ఉండదు. ఈ అహంకారవైఖరి భగవంతుడే కేంద్రంగా సాధన జరగాలన్న సంకల్పంగా మారేంత వరకు, అది

అంతా భగవత్ చైతన్యపు వికాసంగా, పరిపూర్ణత్వంగా, సిద్ధిగా మారేంతవరకు, ఆ భగవత్ చైతన్య సంకల్పమై, ఈ శరీరంలో అదే పని చేయడం ప్రారంభించే వరకు - పైన చెప్పిన వికాసం, పరిపూర్ణత్వం, సిద్ధిపూర్తిగా ఫలించిన నిండు తనంతో మనకు లభించవు. వాటికి మనం ద్వితీయ ప్రాధాన్యం ఇవ్వాలి. భగవంతుని కోసం భక్తి, ప్రేమ, మన సంకల్పంలో, చైతన్యంలో, మనశరీరాలలో భగవంతునిలో ఏకత్వం పొందడం మన ఏకైక లక్ష్యం కావాలి. మిగతాదంతా భగవచ్ఛక్తితో భగవత్ సంకల్ప సాఫల్యం మాత్రమే.

- శ్రీఅరవిందులు

అనువాదం : కె. యజ్ఞన్న

మరుగుజ్జు అహం

ఈ కీలు బొమ్మ అహం విశ్వమాత సృష్టి,
ప్రకృతి అద్భుతాల నుండి తృప్తిపొందే
చిన్న లాభపాటి వ్యాపారి
అహం ఆయుఃపరిమితిలో ఆమె విశ్వాసం సన్నగిల్లింది.
ఈ అహం కోరికలకు అంతులేదు.
దివ్యమాత ఋణం ఏనాటికీ చెల్లించదు. అది
మన జీవితం ప్రతి కదలికలో ఈ అహం నిండి ఉంటుంది.
అస్తిత్వమంతా దట్టంగా పడుగు పేకలా అల్లుకుంది
మనం గొప్పగా చాటుకునే స్వార్థంలో
నీచమైన భాగాన్ని అది ఆక్రమిస్తుంది.
ఏకాస్త చోటూ వదలదు.
మా ఆత్మ హృదయాలను, మనశ్శరీరాలను
ప్రతి కణాన్ని నీకే, నీకే అర్పించాలి.

నీ ప్రపంచానంతంలోనే మునిగి అవి జీవించాలి.

అప్పుడు కాంతిలో కనుమరుగై

ఈ దురహంకార ఇంద్రజాలం మటుమాయమవుతుంది.

ప్రతి ఘటించే ఈ అహంనుండి దూరమై

ప్రకృతి - పరమాత్మ అనంత ప్రశాంత

ఉచ్ఛ్వాసమై ప్రసరిస్తుంది.

- శ్రీఅరవిందులు

అనువాదం : కె. యజ్ఞన్న

చేతనను విశాలం చేసుకోవడం ఎలా?

ప్రశ్న :- మధుమయిా మాతా! మనం మన చేతనను విశాలం చేసుకోవడం ఎలా?

విశాలమా?... ఓహో! దానికి చాలా మార్గాలున్నాయి. చాలా సులువైన మార్గం, ఏదైనా విశాలమైన దానితో నీవు తాదాత్మ్యత చెందడం. ఉదాహరణకు నీవు చాలా ఇరుకైన, పరిమితమైన ఆలోచనలో కోరికలో, లేదా చేతనలో బంధించబడినట్లుగా వున్నాననుకున్నపుడు, నీవేదైన పెంకులాంటి పరిమితమైన దానిలో ఇరుక్కు పోయినట్లుగా భావించినపుడు, అప్పుడు నీవు ఏదైనా విశాలతరమైన దానిని గురించి ఆలోచించాలి, అంటే, ఉదాహరణకు సముద్రంలోని అపారమైన జలరాశిని గురించి అది ఎంతో దూరంగా, దూర దూరంగా అన్నివైపులా, ఇలా (మదర్ తన అరచేతులను దూరంగా సాచి చూపుతున్నారు.), అదెంతో దూరంగా నీ వెనుకగాని, ముందుగాని, కుడివైపుగానీ, కుడి ఎడమల వైపుగానీ ఆవలి తీరాలను నీవు చూడలేనంతగా, దాని తుదిని నీవు చేరుకోలేనంతగా అది విశాలంగా, ఇంకా ఇంకా ఆ జలరాశిపై నీవు తేలియాడుతున్నట్లు విశాలంగా నీవు భావన చేసి, దానికి హద్దులు లేనట్లు భావించి చూడు, ఇది చాలా సులుదైన మార్గం. అపుడు నీ చేతన కొంతలో కొంత విశాలమౌతుంది.

మరికొందరు, ఉదాహరణకు ఆకాశంవైపు చూస్తారు. నక్షత్రాల మధ్యలోవున్న దూరాన్ని అలా అనంతమైన ఆ దూరాలను ఊహిస్తారు. ఆ స్థాయిలో ఈ భూమి, అది భూమి మీదవున్న చీమలా, ఒకచిన్న బిందువులా అన్పిస్తుంది. అలా నీవు ఆకాశంవైపు చూస్తూ గ్రహాల మధ్యనున్న సువిశాల క్షేత్రాల మధ్య తేలియాడుతున్నట్లు నీవు విశాలంగా, సువిశాలంగా, ఇంకా ఇంకా విశాలతరంగా ఊహించు. కొంతమంది ఈ ప్రక్రియలో విజయంచెందారు.

నిన్నునీవు ఈ భూమిమీదవున్న సమస్తంతోనూ తాదాత్మ్యత చెందే పద్ధతికూడా వుంది. ఉదాహరణకు ఎవరైనా నిన్ను నిష్ఠూరాలిడినపుడు ఖిన్నత చెందుతావు. అపుడు నీ చేతనను అక్కడి నుండి తప్పించి, వేరే చోటికి మార్చే ప్రయత్నం చేయవచ్చు. దానిని ఇతరులందరితో ఏకంచేసి ఇతరుల ఆలోచనలతో ఏకంకావచ్చు. ఇది ఇంకొంచెం - నీకెలా చెప్పను .... అపాయకరంగూడా. ఎవరైనా ఇతరుల ఆలోచనలతో ఏకం కావడమంటే అదివారి దుష్ట సంకల్పాలతో, మూర్ఖత్వంతో గూడా ఏకంకావడం. (మదర్ నవ్వుతున్నారు) ఇది అనేక సమస్యలను కొనితెచ్చుకోవడమే అవుతుంది. అదేమంత మంచిది కాదు. అయినా ఈ పద్ధతిని చాలామంది చాలా తేలికగా అనుసరిస్తారు. ఉదాహరణకి ఇలా తమ చేతనను విస్తరించుకొనడంలో అవరోధాలు ఏర్పడినపుడు చేతనతో అంగీకరించలేనపుడు వారు దానిస్థానంలో వారి భావాలకు బదులు ఉన్నతమైన వాటిని వూహిస్తారు. ఇలా చేయడం వల్ల వారి చేతన విస్తారమౌతుంది. ముందుగా మేము చెప్పిన విధంగా కాకున్నా అందువల్ల వారి (దుష్ట) సంకల్పాలు వీరిని అంతగా భాధించవు. వారికి మంచే జరుగుతుంది. అవి వారికి ప్రశాంతతనే ఇస్తాయి.

మేధోపరంగా కూడా చేతనను విశాలతరం చేసుకొనే మార్గాలున్నాయి. వీటిని గురించి నా పుస్తకంలో చాలా విస్తారంగా వివరించాను. అయితే ఏది ఏమైనా, నీవు దేనితోనైనా విసిగి వేసారినపుడు, నీవు దేనితోనైనా వ్యాకులత చెందినపుడు లేదా బాధపడినపుడు, నీవు ఇంతవరకూ నీముందు గడిచిపోయిన అపారమూ అనంతమునైన దేశకాలాల గురించి ఆలోచించినపుడు, వాస్తవానికి

ఈ క్షణం అనంతమైన కాలంలో ఒక శ్వాసవంటిది; గడిచిపోయిన దానిని గురించి తలక్రిందులు కావడం అనేది ఒక తెలివి తక్కువతనమే అవుతుంది. ఎందుకంటే అనంతమైన కాలంలో అది ఒక క్షణమాత్రమైందే కదా....? దాని సరైన విధంగా వాడుకోనడం తెలిసినపుడు ... దానిని గురించి నీకు ఎలా చెప్పాలబ్బా... ఈ చిన్న భూమిమీద ఇంత చిన్న మనిషి ఎంత? గడచిపోయిన ఆ క్షణం ఎంత? దానిని గురించి బాధపడాల్సిన అవసరం లేదు. అది నీ ఉనికిలో క్షణమాత్రమైంది. మరి ఇంతకు ముందు అలాంటివెన్నోవున్నాయి. అలాంటివి ఇంకా ఎన్నో గడవాలి గూడా. గత దశాబ్దకాలంలో అలా గడిచిన వాటినెన్నింటినో మరిచిపోయావు. వాటిని గుర్తుచేసుకున్నపుడు "వాటికి నేను ఏమాత్రం ప్రాధాన్యత నివ్వలేదేమిటి? అనుకుని విస్తుపోతావు. దానిని గురించి నీ అస్థిత్వాన్ని అర్థం చేసుకున్నపుడు అనంతమైన దానిలో అదొకక్షణ మాత్రం - క్షణం కూడా కాదు. క్షణం కంటె గూడా చాలా తక్కువ. అసలది లెక్కలోకేరాదు, ప్రపంచం ఆ అనంతకాలంలో ఎంతో తిరిగిపోయింది. ఇంకా గడవాల్సింది ఎంతోవుంది - అదే మీ లెక్కకందదు - గడిచిపోయింది, గడవాల్సింది నీకు జరిగిన దానిని గురించి ఆలోచించడం ఎంత తెలివితక్కువో ... నిజంగా నీవు అలాగే అనుకుంటావు - నీ జీవితంలో సంభవించిన వాటికి నీకు జరిగిన దానికి అనవసర ప్రాధాన్యతనిచ్చినట్లు తెలుసుకుంటావు. ఒక్క మూడు నిమిషాలు ఇలా ఆలోచించగలిగితే నీకు బాధగలిగించిదంతా తుడిచిపెట్టుకు పోతుంది. ప్రగాఢమైన బాధకూడా తుడిచిపెట్టుకుపోతుంది. అనంతమైన దాని గురించి, శాశ్వతమైన దాని గురించి కొంచెం సేపు ఏకాగ్రత వహిస్తే చాలు. అంతా మటుమాయం అవుతుంది. అంతా శుభ్రపడి బయటపడతావు. అన్ని అనుబంధాల నుండి గాఢమైన వ్యాకులపాటుల నుండి - అంతటి నుండి ఈ విధంగా బయటపడతావని అందుకివే సరైన పద్ధతని నేను అంటున్నాను. ఇలా చేస్తే నీ చిన్న అహంకారం నుండి నీవు బయట పడతావు. అపుడే మనం మనంగా వుంటాం.

- శ్రీమాత

అనువాదం - కొంగరభాస్కరరావు

సృష్టి : పరాత్పరుని ప్రణాళిక

స్వీయ అంతరాత్మను, సాక్షాత్కరింపజేసుకొని, దానితో సంయోగం చెంది, తన జీవితాన్ని దానికధీనం చేయడానికి, ఆంతరికమైన కృషి అత్యంతావశ్యకం. అంతరాత్మతో మమేకమై, తన జీవితాన్ని దాని పాలనకంకితం చేయడమనేది ఒక అద్భుత పారవశ్యత కలిగించే ఆవిష్కారం. ఇటువంటి కృషిచేసే చాలామంది విషయంలో, చాలా తరచుగా, ఈ ఆవిష్కార ఫలితంగా, అప్రయత్నంగా, సహజంగా జరిగేదేమిటంటే "నాక్కావలసింది నాకు లభించింది, అనంత ఆనంద ప్రాప్తి కలిగింది" అని అనుకోవడం.

అంతరాత్మను ఆవిష్కరించుకొన్న దాదాపు అందరిలోనూ ఇలా జరిగింది. వీరిలో కొంతమంది, సాక్షాత్కారానికి ఒక సూత్రంగా ఈ అనుభవాన్ని స్థిరీకరించారు. "నీవది సాధిస్తే సమస్తం జరిగిపోయినట్లే, ఇంక చేయవలసిందేమీ లేదు. గమ్యాన్ని చేరుకొన్నావు. నీ ప్రయాణ గమ్యం ఇదే" అన్నారు.

ప్రతివ్యక్తీ, నేడుగాని, రేపుగాని తానుచేరిన స్థితికి చేరతాడని అనుకొంటాడు. తాను చేసినట్లే వాళ్ళకూడా కృషి చేయడం, వాళ్ళకే మంచిది, లేదా తనకు ప్రాప్తించిన ఈ ఆంతరిక జ్ఞానంతో - "మహనీయ శుభకామనతో" ప్రగాఢ సానుభూతితో" - ఆ స్థాయికి చేరేందుకు వాళ్ళకు సాయంచేస్తాను అనుకొంటాడు. అలా ప్రతి వ్యక్తీ ఆ స్థితిని సాధించుకొన్నపుడు, ఇహ అంతకన్నా ప్రపంచానికి కావలసిందేముంటుంది. కష్టాల నుండి విడుదల పొందాలనుకొనే వారికి ఇంతకన్న జరిగే మంచేముంటుంది! అని ఇతరులు దుఃఖంతో బాధ పడుతున్నా తనకు తాను హాయిగా వుండిపోకుండా, తన ఒక్కరి ఆంతర ఆనందంతో తృప్తి పడకుండా, నిర్భయంగా ముందుకు సాగిపోయే యోధునిలా, అతడు ముందుకు పోవడానికి నిజంగా చాలా ధైర్యం వుండాలి.

కాని .... ఇక్కడొక "కాని (మెలిక) వుంది. సృష్టి చేసినపుడు పరాత్పరుని లక్ష్యం ఇదే, వుద్దేశ్యం ఇదే అని నీకు ఖచ్చితంగా తెలుసా?

(మౌనం)

ఇదే అతని లక్ష్యం, ఇదే అతని వుద్దేశ్యం అని చివరకు తేలితే, ఈ జగదభి వ్యక్తి అంతా ఒక విషాదభరిత పరిహాసాస్పద కార్యంగా కన్పిస్తుంది. సృష్టిలో నుండి బయటికి పోవడానికి మాత్రమే ఇదంతా ఉంది, అంటే అసలు దాన్నెందుకు మొదలుపెట్టాలి? ఇంతగా సంఘర్షణకు లోనవ్వడంగాని, ఇంతగా బాధపడడం గాని, చూడ్డానికి ఎంతో విషాదభరితంగా, నాటకీయంగా కన్పించే ఇదంతా కేవలం ఇందులో నుండి బయటపడడం ఎలాగో బోధించడానికే అయితే, దానివల్ల ఏం ప్రయోజనం - అసలు మొదలుపెట్టకుండా వుంటేనే ఎంతో బాగుండేది గదా!

కాని విషయాల లోతుకుపోతే, అహంకారాన్ని మాత్రమేగాక, అహాన్ని గూడా పూర్తిగా తొలగించుకొంటే, సంపూర్ణంగా, ఏ మాత్రం మినహాయింపు లేకుండా, దాపరికం లేకుండా, సంగరహితుడై తనను సమర్పించుకొంటే, అపుడు, జగన్నాధుని ప్రణాళికనర్థం చేసుకోగలుగుతాడు. ఇదొక విషాదభరిత పరిహాసంగాని, నాటకంగాని కాదని, చావుదెబ్బలుతిని, తిరిగి తానెచటి నుండి వచ్చాడో ఆ మూలానికి చేరుకొనే యాతనామయ మార్గం కాదిది అని తెలుసుకుంటాడు. ఈ మొత్తం సృష్టి ఈ రకమైన అస్తిత్వం కలిగివుండడంలోగల ఆనందానుభవాన్ని తెలియజెప్పడానికని, అస్తిత్వపు సౌందర్యాన్ని, అస్తిత్వపు గొప్పదనాన్ని, పవిత్ర జీవిత ఘనతను తెలియజెప్పడానికి, ఆ ఆనందం, ఆ సౌందర్యం, ఆ మహనీయత, నిరంతర వికాసం, నిరంతర పురోభివృద్ధి జరగడానికి, ఈ అభివ్యక్తి ఉద్దేశించబడిందని అర్థం చేసుకోగలుగుతాడు. అపుడు ప్రతిదానికీగల అర్థం తెలుస్తుంది. సంఘర్షణకు లోనైనందుకు, బాధావ్యధలననుభవించినందుకు ఇహనేమాత్రం విచారించడు. దివ్య గమ్యాన్ని సిద్ధింపజేసుకొనేందుకు అమితోత్సాహం మాత్రమే అతనిలో వుంటుంది. గమ్యాన్ని చేరుకొంటాను, విజయం తథ్యం అనే సుస్థిర భావనతో సాక్షాత్కార ప్రక్రియలో మునిగిపోతాడు.

కాని దాన్ని గ్రహించాలంటే, అహంకరించడం మానుకోవాలి. పరాత్పర మూలంనుండి తనను తాను వేరుచేసుకొని, తనకుతాను గానే వుండిపోయే

ప్రత్యేక వ్యక్తిగా జీవించడం మానుకోవాలి. స్వీయ అహంకారాన్ని విడిచి వేయడం జరిగితీరాలి. అపుడతనికి యదార్థ గమ్యం తెలుస్తుంది - ఇదొక్కటే మార్గం! జీర్ణవస్త్రంలా అతని అహంకారం రాలిపోవాలి.

ఆ మార్గంలో ఎంత కష్టమైన కృషైనా చేసి సాధించవలసిన మహత్కార్యమిది. అలా పయనించే మార్గంలో అతడు ఏమాత్రం ఒంటరివాడు కాదనే పరిపూర్ణ విశ్వాసముంటే భగవంతుని సాయం తప్పక లభిస్తుంది. దైవ కృపతో సంపర్కం క్షణమాత్రం లభించినా, అది నిన్ను అవలీలగా గమ్యం చేర్చే అద్భుతమైన మార్గంలో, త్వరపడాలనే భావం కూడా కలగనంత వేగంగా నీ పయనం సాగేట్లు చేస్తుంది. దైవకృపతో క్షణిక సంపర్కం కలిగినా, దాన్ని మరచిపోకుండా, వుండాలని గాని, వుండడానికిగాని పెనుగులాట ఉండదు. ఏ సమస్యలూలేని పసిపాప నిష్కాపట్యంతో, సరళ స్వభావంతో, ఆ దైవకృపకు నిన్నునీవు అర్పించుకొని, నీలో సమస్త కార్యాన్ని దానినే చేయనివ్వు.

దాన్ని ఆటంకపరచే దేన్నీ వినకపోవడం, దానితో విభేదించే దేన్నీ నమ్మకపోవడం, దేన్ని గురించి పట్టించుకొనకుండా, దేనికోసమూ అర్థించకుండా నిన్నునీవు సమర్పించుకోగల, దైవకృప ఉన్నదనే ఒక నిరంతర సంవేదన, నిజమైన సంవేదన, ఆ సంవేదనా ఫలితమైన, ఒక దృఢనమ్మకం చాలా అవసరం.

దైవకృప ఉన్నదనే సంవేదనే "ఇది చెయ్యి, నాకిది చేసిపెట్టవలసింది నువ్వే" అని దైవానికి చెప్తుంది.

ఇదే అత్యుత్తమ మార్గం.

- శ్రీమాత

అనువాదం : కె.వి. రావు

సమర్పణ అంటే మన అల్పమనస్సును, దాని మానసిక భావాలను, ఇష్టాయిష్టాలను, ఒక దివ్య కాంతిలో, ఉన్నత విజ్ఞానంలో వదిలి వేయడం. సమర్పణ అంటే మన నీచ వ్యక్తిగత, బాధించే, అంధ, తడబడుతూండే సంకల్పాన్ని ఒక గొప్ప, స్థిరమైన, ప్రశాంతత, ప్రకాశమయ దివ్యసంకల్పం మరియు దివ్యశక్తిలో విడిచివేయడం. సమర్పణ అంటే మన నిమ్న అశాంతితో కలత చెందే సంవేదనలను ఒక విశాల, తీవ్రావేశంగల దివ్యప్రేమ ఆనందాలలో ముంచి వేయడం. సమర్పణ అంటే బాధకు లోనవుతుండే, మన వ్యక్తిత్వాన్ని, అది దేని నుండి అస్పష్టరూపంతో వెలువడిందో ఆ దివ్యపరుషునిలో నిమజ్జనం చేయడం. స్వీయాభిప్రాయాల మీద, హేతుభావాల మీద పట్టుబడుతుంటే, ఉన్నత తరవెలుగు, జ్ఞానం ప్రవేశించలేదు, లేదా ప్రవేశించేదారిలో ప్రతిదశలో నిమ్నమైనది జోక్యం చేసుకొని వికృతం చేస్తుంది, అడ్డుపడ్తుంది. స్వీయ వాంఛలమీద, చిత్త భ్రమలమీద పట్టుబడ్తుంటే, ఆ మహనీయ ప్రకాశమయ దివ్య సంకల్పం, దివ్యక్రియాశక్తి తన యదార్థ సామర్థ్యంతో పనిచేయలేదు - ఎందుకనంటే దానిని సేవకునిగా నీ కోరికలను తీర్చమని కోరావు. అనుభూతుల కొరకు అనుసరించే నీచ విధానాలను విడనాడడానికి తిరస్కరిస్తే, శాశ్వత దివ్యప్రేమ, బ్రహ్మానందాలు దిగిరావు, లేదా అదివరకే నిండిపోయి పొంగిపొరలుతున్న అనాగరిక భావోద్వేగాల పాత్రలో కలుషితమై వొలికిపోతాయి.

- శ్రీఅరవిందులు

అనువాదం : కె.వి. రావు

పూర్ణయోగ ప్రక్రియ

ఈ పూర్ణయోగ ప్రక్రియ మూడు దశలుగా కొనసాగుతుంది. ఈ మూడూ అంత నిశ్చితంగా వర్గీకరింపబడక లేక ప్రత్యేకింపబడక ఉండక పోయినప్పటికీ, కొంతవరకు క్రమబద్ధంగా వచ్చేవిగా ఉంటాయి. తొలుతగా తనను తాను అధిగమించి దైవత్వాన్ని స్పృశించాలనే ప్రయత్నం ఉండాలి. తర్వాత తనలో ఏదైతే

అధిగమనం పొందిందో, ఏ సంస్పర్శను పొందిందో దాన్ని మనలోకి తెచ్చుకొని తద్వారా తన సత్వమునంతటినీ సంపూర్ణంగా పరివర్తన చేసుకొనడం, చివరగా పరివర్తన చెందిన మానవతను ప్రపంచంలో ఒక దివ్యకేంద్రంగా వినియోగించడము. దైవంతో సంగత్వం తగినంతగా స్థిరపడకపోయినా, దైవం యొక్క నిరంతర సాయుజ్యం లేకపోయినా సాధారణంగా మానవ ప్రయత్నం ప్రబలంగా ఉండాలి. ఈ దైవ సాన్నిహిత్యం ఎంతవరకూ స్థిరపడిందో దాన్ని సాధకుడు గ్రహించగలగాలి. ఈ దైవ సంసర్గం తనలో సుస్థిరపడిన మేరకు, తన వ్యక్తిగత కృషి, సమర్థతలను అధిగమించే అతీతశక్తి తనలో ప్రవర్తిస్తున్నదనే స్పృహలో సాధకుడు తప్పనిసరిగా ఉండాలి. దాని చైతన్యాన్ని పొందుతూ, క్రమక్రమంగా తనను తాను ఆ శక్తికి ఆత్మార్పణం చేసుకుంటూ తన యోగసాధనను దానికే అధీనం కావించాలి. తుదిగా తన సంకల్పమూ, తన శక్తి కూడా ఉన్నతతర శక్తితో కలిసిపోవాలి; ఆ విధంగా దివ్యసంకల్పమూ, దాని అధిగమన విశ్వశక్తితో సమ్మిళితం కావిస్తాడు. ఇక అప్పట్నించి ఆ శక్తి అధ్యక్షతలోనే తన మానసిక, ప్రాణిక, భౌతిక సత్తల పరివర్తన కొనసాగటం సాధకుడు గమనిస్తాడు. ఇంకా అత్యంత ఆకాంక్షతో, కుతూహలంగా ఉన్న తన అహంకు సాధ్యంకాని ఆ పరివర్తనను నిష్పాక్షిక విజ్ఞత, అసామాన్య సామర్థ్యాలతో దివ్యశక్తి సాధించడం గమనిస్తాడు.

ఈ విధమైన తాదాత్మ్యత, ఆత్మవిలీనత పరిపూర్ణమైనప్పుడు ప్రపంచంలో ఒక దివ్యకేంద్రం సంసిద్ధమవుతుంది. పవిత్రమై, విముక్తమై, మృదులమై, తేజోపూరితమైన ఆ శక్తి పృథ్విపై తన కార్యం ప్రారంభించగలదు. అది ఒక మాధ్యమముగా అఖిల మానవాళి, అతిమానస మానవతల యోగము మీద సూటిగా పనిచేయగలదు. అదే పృథ్వియొక్క ఆధ్యాత్మిక వికసనమూ, పృథ్వీ పరివర్తనము.

మూలం - శ్రీఅరవిందులు

అనువాదకులు : అమరవాది ప్రభావతి

అమరవాది వేంకటరామశాస్త్రి

శ్రీమాత
నూతన సంవత్సర సందేశాలు

1933

నూతన సంవత్సర ఆవిర్భావము, మనకు, నవచైతన్య ఆవిర్భావమగుగాక
గతాన్ని దూరంగా వెనక్కి వదిలేసి కాంతివంతమైన భవిష్యదిశగా పరుగెడదాం.

* * *

1934

ప్రభూ, సంవత్సరాంతమవుతోంది. మాకృతజ్ఞత నీకై వినమ్రంగా శిరసు వంచుతోంది. ప్రభూ ! మరో సంవత్సరము ఉద్భవించింది. మా కైమోడ్పు నీకై పైకెగసింది. అదిమాకుకూడ నవజీవన ఉషోదయమగుగాక

* * *

1935

కపటము, అనుకరణ, కృతకము, అసత్యములతో కూడినదంతా ఈసాయంత్రం, నీ వశం కావిస్తున్నాం. సంవత్సరాంతంతో ఇదంతా మాయమై పోనీ.
ఆరంభం కాబోయే సంవత్సరంలో పరిపూర్ణ స్వచ్ఛసరళ నిష్కాపట్యాలు మాత్రము సజీవంగా ఉండనీ

* * *

1936

ఓప్రభూ! ఈ సంవత్సరం నీయొక్క దిగ్విజయోత్సవ వత్సరమవనీ.
పరిపూర్ణ విశ్వసనీయతను ఆకాంక్షిస్తున్నాము. అది మమ్ములను అందులకు యోగ్యులను కావిస్తుంది.

* * *

1937

ఏ అవరోధాన్నైనా జయించే ఓ ప్రభూ! దివ్యతేజో వైభవం నీది. మాలో ఏదీ, నీ దివ్యకార్యానికి ఆటంకం కానట్లు మమ్ము అనుగ్రహించు.

* * *

1938

మాలో సర్వస్వము నీ దివ్యసిద్ధిని పొందటానికి సంసిద్ధమయేలా అనుగ్రహించు, ప్రభూ. సర్వోన్నత సంసిద్ధి ప్రదాయకా! ఓ ప్రభూ! నూతన సంవత్సరాది ముంగిట తలవంచి నీకు ప్రణమిల్లుతున్నాం.

* * *

1939

పునీతమవబోయే సంవత్సరం. ఓ ప్రభూ! దివ్యకర్మానుష్ఠానంలో ఉన్నవారంతా అహం ఏలుబడి నుంచి సర్వోత్కృష్ట ప్రక్షాళణంతో విముక్తులు కావాలని నిన్ను వేడుకుంటున్నారు.

* * *

1940

నిరీక్షణ, నిశ్శబ్దముల సంవత్సరం ....

నీ దివ్యానుగ్రహంలో, ఓ ప్రభూ! మేము పరిపూర్ణ ఆశ్రయము పొందెదముగాక!

* * *

1941

ఒక్కుమ్మడిగా పైబడే ప్రతికూల ఆశురిక శక్తులచే భయపెట్టబడే ఈలోకం తన ఆధ్యాత్మిక జీవనం కోసం పోరాడుతోంది.

ఓ ప్రభూ! నీ దివ్యవైభవాన్ని ఈ నేలపై అభివ్యక్తీకరించే శౌర్యోపేత యోధులమవాలని ఆకాంక్షిస్తున్నాము.

* * *

1942

శతృభయంకరుడవైన ఓ ప్రభూ! నీకు దిగ్విజయ నీరాజనం.

నీ దివ్యదిగ్విజయాన్ని పంచుకొని భరించే శక్తిని మాకు ప్రసాదించు.

* * *

1943

నిశ్చయమైన తీవ్ర నిర్ణయం తీసుకోవలసిన క్షణం ఆసన్నమైనది.

అసత్యమును తిరస్కరించి నీయొక్క దివ్య పరిశుద్ధ సత్యములోనికి ఆవిష్కృతులం కాగలందులకు, నీ దివ్య దిగ్విజయానికి మేము అర్హులమై ఉండేందుకు మాకు శక్తిని ప్రసాదించు ప్రభూ!

* * *

1944

ఓ ప్రభూ, ప్రపంచం నిన్ను వేడుకుంటోంది - ఆ బుద్ధి హీనతలలోనికి తిరిగి దిగజారకుండా ఆపమని.

చేసిన పొరపాట్లే పునరావృతం కాకుండా అనుగ్రహించమని.

తుదిగా, తనకర్మలు కచ్చితంగా చిత్తశుద్ధితో కూడినవై తాను ప్రకటించే ఆదర్శములకు వ్యక్తీకరణలుగా ఉండేలా అనుగ్రహించమని.

* * *

1945

ప్రజలు తమ అంతర్జాతీయ లావాదేవీలలోకూడా తప్పనిసరిగా ఋజువర్తనులై ఉండాలని తెలుసుకున్నపుడు ప్రపంచంలో సజీవంగా నిలిచి ఉండే ప్రశాంతతను పొంది వారు ఆనందిస్తారు.

మేము ఈ పరిపూర్ణ ఋజువర్తనమునే ఆకాంక్షిస్తున్నాము, ప్రభూ.

* * *

1946

ప్రభూ, మాకు కావల్సినది పరమమైన ప్రశాంతత. అంతేకాని పనికిమాలిన బూటకమైనది కాదు; పరమమైన స్వేచ్ఛ, దాని పోలికతో ఉన్నదికాదు; పరమమైన సమైక్యత, అంతేకాని అలా కనపడేది కాదు. ఎందుకంటే నీ దివ్యశాంతి, స్వాతంత్ర్య సమైక్యతలు మాత్రమే, ఈ ప్రపంచంలో ఇంకా రాజ్యమేలుతున్న హింస, మోసం, అసత్యాలను జయించగలిగేవి.

నీ యొక్క దివ్య దిగ్విజయం కోసం వీరోచితంగా పోరాడినవారికి, బాధ పడినవారికి ఆ విజయం యొక్క సిసలైన నిజ ఫలితాలు ఈ లోకంలో సిద్ధించేలా వారిని అనుగ్రహించు.

* * *

1947

సర్వమూ క్రమంగా దిగజారుతున్న క్షణంలో, సరిగా అపుడే విశ్వాసంతో సర్వోత్కృష్ట కర్మనాచరించాలి. అపుడు దైవకృప మనలను ఎన్నడూ నిరాశపర్చదని తెలుసుకోవాలి.

* * *

1948

ముందుకు, ఎప్పుడూ ఇంకా మున్ముందుకు !

సారంగ మార్గానికి చివరే కాంతి ఉంటుంది .....

అంతిమ పోరాటానికే విజయం !

* * *

1949

ప్రభూ, నూతన సంవత్సరాదిని నేను చెప్పవలసినదేమిటని తమను అడిగాను.

నాకు రెండు అత్యంత అంతిమ సంభావ్యతలను దర్శింపచేశారు.

నిశ్శబ్దం పాటించమని ఆదేశించారు.

* * *

1950

మాట్లాడకు, పనిచెయ్యి,

సిద్ధిపొందు. ప్రకటించకు.

* * *

1951

నీ దివ్యకార్యము-రూపాంతరీకరణం-నిర్వర్తించటానికి మేము భూమిపై ఉన్నాము ప్రభూ, అదే మా ఏకైక ఇచ్ఛ; మా ఏకైక మానసిక నిమగ్నత. అదే మాకు ఏకైక వృత్తియై, మా సర్వకర్మలూ ఈ ఏకైక లక్ష్యంకోసం సాగేలా మాకు సహకరించు.

* * *

1952

ఓ ప్రభూ, నీ గీటురాయిపై మాయొక్క విశ్వాస గుణశ్రేష్ఠతను, చిత్తశుద్ధిని పరీక్షించి ఆమోదముద్ర వేయుటకు నిశ్చయించినావు. ఈ అగ్ని పరీక్షనుంచి మేము మరింత ఉన్నతంగా, పరిశుద్ధంగా బయటపడేలా అనుగ్రహించు.

* * *

1953

ప్రభూ, నీవు మాకు చెప్పావు: సడలింపువద్దు, గట్టిపట్టు పట్టు. అంతా పోతుందనుకున్నపుడు, సర్వమూ సంరక్షింపబడుతుంది. (అని)

* * *

1954

నా ప్రభూ! ఈ సంవత్సరానికి ఇదిగో ఇదే అందరికీ నీ దివ్యసందేశం :

"ఎపుడూ దేనినిగురించి గొప్పలు చెప్పకు, నీ పనులే మాట్లాడనీ నీకు బదులు".

* * *

1955

దైవసంకల్పానికి వ్యతిరేకంగా ఏ మానవ సంకల్పమూ చివరికి నిలువలేదు. సమగ్రంగాను, మనః పూర్వకంగాను దైవానికి పొదిగి దైవం వైపునే ఉందాము. ఆఖరికి విజయం తప్పనిసరి.

* * *

1956

ఉన్నతోన్నత విజయాలు నిశ్శబ్దంగానే ఉంటాయి.

నూతన ప్రపంచ అభివ్యక్తీకరణ దండోరాతో

ప్రకటించబడదు.

* * *

1957

ఆశురికతను మించిన దివ్యశక్తి మాత్రమే విజయాన్ని సాధిస్తుంది.

హింసింపబడిన శరీరంకాక మహిమాన్వితమైన శరీరము

ప్రపంచాన్ని రక్షిస్తుంది.

* * *

1958

ఓ (దివ్య) ప్రకృతీ, (దివ్య) భౌతికమాతా! నీవు సహకరిస్తానని చెప్పావు.

నీ ఉజ్వలవైభవోపేత సహకారానికి అంతెక్కడదీ !

* * *

1959

అత్యంత తీవ్రమై, కఠినమై, ఇరుకై ఊపిరాడని అచేతన అగాధాన పరమేశ్వర మూల ఉత్పత్తి స్థానాన్ని కనుగొన్నాను. అది నన్ను వెంటనే నవలోకపు బీజములతో స్పందించే అవధిలేని రూపరహిత అనంతం లోనికి విసిరి వేసింది.

* * *

1960

తెలుసుకోవటం మంచిది

(అలా) బ్రతకటం ఇంకా మంచిది

అదేకావటం పరిపూర్ణత

* * *

1961

అద్భుతమైన ఈ ఆనందపులోకం నేలమీదికి దిగి రావటానికి మన వాకిలి ముందు మన పిలుపు కోసం వేచి ఉంది.

* * *

1962

మన పిపాస పరిపూర్ణతకే. అది ఈ మానవ పరిపూర్ణత కోసం కాకూడదు. అది అహంకార యుతమైనది. దివ్యపరిపూర్ణతకే ఆటంకం. ఈ భూమిపై దివ్య సత్యాభివ్యక్తీకరణకి సాధ్యమైనది ఏదో, అదే ఏకైక పరిపూర్ణత.

* * *

1963

దైవీ ముహూర్తానికి సంసిద్ధులమవుదాం

* * *

1964

మీరూ సిద్ధమేనా ?

* * *

1965

దివ్యసత్య అవతరణానికిదే అభివందనం

* * *

1966

దివ్యసత్యమును సేవిద్దాం

* * *

1967

మనుష్యులు, దేశాలు, ఖండాలు !

(ఎవ్వరికైనా) ఎంపిక అనివార్యం ;

సత్యము - లేకపోతే - అగాధము

* * *

1968

యౌవ్వనోత్సాహంతో ఉండు. పరిపూర్ణతకై శ్రమించటం మానకు.

* * *

1969

మాటలు కాదు. క్రియలు

* * *

1970

గొప్ప మార్పుకై ప్రపంచం సంసిద్ధమవుతోంది. సహకరిస్తావా ?

* * *

1971

దివ్య భవితవ్యం వైపు ఉత్సాహంతో ముందుకు దూకిన వారు ధన్యులు.

* * *

1972

శ్రీఅరవిందులవారి శతాబ్దికి తగువారమై ఉందాం, మనమంతా.

* * *

1973

ఒకేసారిగా నీవు విశ్వచేతనుడివి అయినపుడు, దివ్యచేతనుడివీ అపుడు కాగలుగుతావు.

అనువాదం : కర్రా వెంకటేశ్వర్లు

పుస్తక అనుబంధం

యోగానికి మూలాధారాలు

ఆకాంక్ష:

నిశ్శబ్ద హృదయాంతరంగంలో నిశ్చల ఆకాంక్షాగ్ని ప్రజ్వరిల్లుతుంది.

* * *

సత్వములో అంతా నిశ్శబ్దం. అయితే ఆ నిశ్శబ్ద హృదయకుహరంలో రగిలే ఇక ఆరని జ్వాల మరియు సమగ్ర దివ్య జీవనం తెలుసుకొని జీవించాలని రగుల్తూన్న ఆకాంక్ష

నవంబరు 6, 1954

* * *

తీవ్ర ఆకాంక్షాజ్వలిత జ్వాల ఆలోచనలకు, మాటలకు అతీతంగా అనవరతము నిశ్చల ప్రభాపూరంగా జ్వలిస్తూనే ఉండాలి.

మార్చి 5, 1955

నిరవధిక హర్షాతిరేకము దివ్యానందసోభితము అయిన స్వచ్ఛ సరళ మహత్తర చైతన్య దిశగా నీ ఆకాంక్ష ముందుకు దూసుకు పోనీ.

ఆకాంక్షభానుడు అహంకార మేఘాలను చెదరకొట్టనీ.

* * *

భక్తి

హృదయపు లోతులలో ఏకీకృతమై నిశ్శబ్దంగా పదిలపరచబడి సేవాకార్యాలలో సవినయంగా వ్యక్తీకరింపబడే భక్తి, ఏడ్పులతో పెడబొబ్బలతో కూడిన భక్తి కంటె మరెంతగానో వాస్తవమైనది, శక్తివంతమైనది, దివ్యమైనది. త్రికరణ శుద్ధితో కూడిన భక్తి గంగాజలం కంటె కూడా అమోఘమైనది.

* * *

అర్పణ

తనకు తానే దైవార్పణం కావించుకున్న పుష్పంలా జీవితం పుష్పించాలి.

* * *

అర్పణ : (అంటే) మంచి, చెడు, సత్యము, అసత్యము, తప్పు, ఒప్పు - వీటి యొక్క చరిత చాలనములతో కూడిన నీ సర్వసత్వము రూపాంతరీకరణ నిమిత్తం దైవసన్నిధిలో ఉంచటం.

* * *

శ్రద్ధాళువై, నీ అస్పష్టతలన్నీ దైవానికి సమర్పించు. వెలుగును స్వీకరించ గలుగుతావు.

* * *

భగవదర్పణ

చిత్తశుద్ధితో కూడి, సాధన కొరకు, భగవదర్పణగా కావించే నీ ప్రతిచర్య. నీ సర్వస్వము ధ్యానం కంటె మరెంతో సార్థకమైనది.

* * *

ధ్యానము వల్ల పొందే నిశ్చల మనస్సు, నిజానికి, తక్కువకాలం నిలిచి ఉంటుంది. ఎందుకంటే, ధ్యానంలో నుంచి నీవిలా బయటికి వచ్చేస్తావో లేదో. వెంటనే అదే సమయంలో నిశ్చల మనస్సులో నుంచి కూడా బయటికి వచ్చేస్తావు. ప్రాణిక, శారీరక, మానసికాలలో నిలిచి ఉండే నిజమైన నిశ్చలత దైవార్పణం వల్లనే వస్తుంది. ఎందుకంటే అపుడు నీవిక ఆవాహన చేయవల్సినదేదీ ఉండదు. నీవు, నీదైనా నీ ప్రతీదీ - నీ శరీరము, సంవేదనలు, భావాలు, ఆలోచనలు దైవానికే చెందినవై ఉంటాయి. కాగా దైవమే సర్వానికి బాధ్యత వహిస్తుంది అపుడు నీకిక ఏ పూచీ ఉండదు.

ఆత్మసమర్పణ

నీకంటే ఉన్నతమైన దానికి నిమ్ననీవు పూర్తిగా అర్పణ చేసుకోవటంలో ఉండే ఆనందానికి మించిన పరిపూర్ణ ఆనందం ఇక వేరే లేదు. దైవము, సర్వోన్నత ఆదిమూలము (Supreme Origin) దివ్యసాక్షాత్కారము, సమగ్రదివ్య సత్యము-పేరు ఏదైనా-లేదా-ఏ దృక్పథంతో సులువుగా దివ్యసన్నిధి చేరినా-సమగ్ర సమర్పణలో నిన్ను నీవు మరిచిపోవటం దైవసిద్ధికి నిశ్చయమైన మార్గం.

జనవరి 13, 1952

* * *

మన ఆలోచనలు దైవము వైపు మరలినపుడు, మనం దైవానికి అర్పించుకున్నపుడు, అంతా, ఎంతో, సరళ సుందరంగా, నిశ్చలంగా, విశిష్టంగా అయిపోతుందో కదా!

మే 11, 1954

* * *

నిన్ను నీవు పరిపూర్ణంగా దైవానికి అర్పణ కావించుకో. నీ బాధల అంతు చూస్తావు.

* * *

నిన్ను నీవు అర్పించుకో - ఇదే నిన్ను నీవు తెలుసుకునే ఉత్తమోత్తమ మార్గము.

* * *

ఆత్మార్పణే నిజమైన ప్రార్థన

* * *

దైవానికి ఆత్మ సమర్పణ మూడు రీతులు

1. సవినయంగా, నిగర్వంగా ఆయన దివ్యపాదములకు సాష్టాంగ ప్రణామం.
2. తన సత్వము నంతటినీ ఆపాదమస్తకము పుస్తకం తెరిచినట్లు ఉన్మీలనం కావించి, దాపరికం లేకుండా, పరిపూర్ణ చిత్తశుద్ధితో, తన కదలికలన్నీ కనపడేలా తనలోని కేంద్రములన్నిటినీ బహిర్గతం కావించటం.
3. ప్రేమపూర్వక పరిపూర్ణ నమ్మకంలో ఆయన బాహుబంధంలో ఇమిడిపోయి ఉండి ఆయనతోమమేకమవటం.

మూడు సూత్రములచే లేదా అవసరానుగుణంగా ఏదో ఒకదానితో ఈ చలనాలు అనుసంధానం కావింపబడాలి :

1. నీ ఇచ్ఛయే జరుపబడనీ - నాదికాదు
2. నీ సంకల్పం ప్రకారమే, అంతా నీ సంకల్పం ప్రకారమే.
3. నేనెప్పటికీ నీవాడనే.

సాధారణంగా సక్రమమార్గంలో ఈ మూడు చలనాలు నిర్వహింపబడినపుడు అహం అంతరించి పరిపూర్ణతాదాత్మ్యతానుసారంగా ఉన్నతానందం ఉత్పన్నమవుతుంది.

* * *

నీయుక్తాయుక్త జ్ఞానంతో నీ ఆలోచనలను సమర్పించుకో.

నీ హృదయంతో నీ సంవేదనలను సమర్పించుకో.

నీ శరీరంతో నీకర్మలను సమర్పించుకో.

మార్చి 21, 1965

* * *

ఆలోచలనకి, మాటలకీ అతీతమైన గాఢ ఆకాంక్షా పూరిత విశ్వాసాత్మక తేజోమయ నిశ్శబ్దంలో నిన్ను నీవు పూర్తిగా, ఏ అరమరికలు లేకుండా, సమగ్రంగా, సర్వఅస్తిత్వ సర్వోన్నత సామ్రాట్టుకు సమర్పణం కావించుకో. ఆయన తన దివ్యసంకల్పానుసారంగా నిన్ను తీర్చిదిద్దుతాడు.

మార్చి 5, 1966

* * *

దైవసేవ

దైవసేవలోని ఆనందంకన్న మిన్నయైన ఆనందమెక్కడాలేదు.

మే 14, 1954

జీవితంలో నీవేమి చేసినా అది దైవసేవగా చేయబడాలేకాని మరియే ఇతరమూ కాకూడదు.

నీవెవరినైనా, నీవేమి భావించినా లేక ఆలోచించినా అందుకు నీవు దైవమునకే తప్ప మరెవ్వరికీ బాధ్యుడవు కావు.

నీ సత్వమునకు, జీవితమునకు ఏకైక అధిపతి ఆయన మాత్రమే.

చిత్తశుద్ధితో నీవు ఆయనకే పరిపూర్ణంగా శరణాగతుడవై ఉంటే నీ బాధ్యత ఆయనే వహిస్తాడు. నీ హృదయం ప్రశాంతంగా ఉంటుంది.

మిగిలినదంతా అవిద్యా ప్రపంచానికి చెందినది. అజ్ఞానంచే నియంత్రింపబడేది. అంటే బాధ, గందరగోళం (అన్నమాట).

1966

* * *

శరణాగతి

దారి బహుదూరమే అయినా ఆత్మార్పణ దగ్గర కావిస్తుంది. దారి ప్రయాసతో కూడినదే, కాని పరిపూర్ణ నమ్మకం దానిని సుగమం చేస్తుంది.

దైవానికి అర్పణ కావించుకోవటం అంటే నీ సంకుచితపరిధుల నధిగమించి దైవముచే నీవు పరివ్యాప్తుడవై, దివ్యక్రీడాకేంద్రబిందువు కావటమే.

* * *

నీ జీవిత బాధ్యతను దైవానికి వప్పగించే నిర్ణయం - అర్పణం. ఇది మానసికంగా లేదా ఆవేశం వల్ల లేక జీవిత ప్రచోదన వల్ల లేదా వీటన్నిటి సమాహారం వల్ల జరుగుతుంది.

* * *

సవివరంగా అర్పణ కావించుకోవటం అంటే జీవితానికి సంబంధించిన అన్ని వివరాలతో - అల్పాతి అల్పమైన, చూడటానికి అంత గుర్తించనవసరంలేని వివరణలతో కూడా సమర్పణ. అంటే దీని అర్థం అన్ని పరిస్థితులలోను దైవాన్ని గుర్తుంచుకోవటం. మనమేమి ఆలోచించినా, భావించినా, చేసినా ఆయనకోసమే చేస్తూ ఆయనకు సన్నిహితంగా చేరుకునేటట్లుగా, మనలను ఆయనెలా ఉండాలని భావిస్తారో అలా ఉంటూ, ఆయన ఇచ్ఛాశక్తిని, పరిపూర్ణ పరిశుద్ధత, చిత్తశుద్ధి -లతో అభివ్యక్తీకరించగలిగేటట్లు ఆయనకు దివ్య ప్రేమోపకరణమై ఉండటం.

* * *

నిజమైన అర్పణ నిన్ను విస్తృతపరుస్తుంది. నీ శక్తిని పెంపుచేస్తుంది. నాణ్యత, పరిమాణములలో నీకు నీవుగా పొందలేని వాటిని, పెంచుతుంది.

* * *

భగవంతుడు ఇచ్ఛగించినదే ఇచ్ఛగించుట

భగవంతుడు ఇచ్ఛగించనదే ఇచ్ఛగించడం - అదే మహత్తమమైన రహస్యం.

* * *

భగవంతుని ఇచ్ఛ ఏమంటే మనమెప్పుడూ వాహికలుగా తెరచుకొని ఎల్లప్పుడూ విస్తృతమై ఆయన శక్తులు సమృద్ధంగా పాత్రలోనికి ప్రవహించేటట్లుగా ఉండాలి.

అక్టోబరు 16, 1954

* * *

దైవసమక్షంలో మనమెప్పుడూ పూర్తిగా ఒక పుస్తకంలో కాళీపేజీలా ఒదిగి ఉండాలి - దైవము యొక్క ఇచ్ఛాశక్తి ఆయనకిచ్ఛగించిన రీతిలో కష్టం లేకుండా మరి దేనితోనూ కలియకుండా మనలో ముద్రింపబడటానికి.

నవంబరు 20, 1954

ఫలితం దైవానికి వదిలిపెట్టి, ప్రతిక్షణం చేయగలిగినంతగా అత్యుత్తమమైనదే మనం చేయటం, ప్రశాంతతకి, ఆనందానికి, బలానికి, అంతిమ పరిపూర్ణతకు నిశ్చయాతి నిశ్చయమైన మార్గం.

నీవు చేయవల్సినదల్లా కలత చెందకుండా, నిశ్చలంగా, పూర్తిగా దైవంవైపు మరలి, మిగిలినది ఆయనకు వదిలిపెట్టి ఉండటం.

జూలై 18, 1955

* * *

నిశ్చలంగా ఉండు. ప్రశాంతంగా, నమ్మకంగా ఆత్మసమర్పణ కావించుకో. జరిగేదంతా ఎప్పుడూ సర్వోన్నతుని యొక్క ఇచ్ఛాశక్తి ఫలితమే అవుతుంది.

మానవ కార్యము అవకాశమే అవుతుంది. కాని ఎప్పుడూ కార్యము కాదు.

ఆగష్టు 3, 1968

* * *

అభివ్యక్తీకరణను నియంత్రించే సర్వోన్నతుని చైతన్యమొకటి ఉన్నది. వానియొక్క వివేచన మనదానికంటే నిశ్చయంగా ప్రముఖమైనది. అందుచేత జరగబోయే దాని గురించిన వ్యాకులపాటు మనకవసరము లేదు.

* * *

మానవమార్గంలో కాక ఆయన మార్గంలో, మానవేచ్ఛననుసరించి గాక, తన స్వేచ్ఛకనుగుణంగా భగవంతుడు ఎప్పుడూ దిగ్విజయుడే.

భగవంతుడెప్పుడూ ప్రత్యక్షమయే ఉంటాడు. కాకపోతే మనం అది గ్రహించం.

- శ్రీమాత

అనువాదం : కర్రావెంకటేశ్వర్లు

"కాంతికిరణాలు"-సంకలనం-నుంచి సేకరణ

(సశేషం)

సమాచార పత్రము

2009, ఫిబ్రవరి నెల 22 నుండి 28వ తేదీ వరకు డా॥ అలోక్ పాండే గారు సొసైటీ బీచ్ ఆఫీసులో శ్రీఅరవిందుల 'సావిత్రి' కావ్యముపై ప్రతిరోజు సా॥ 5.00ల నుండి 7.00 గం.ల వరకు ప్రసంగించెదరు. ఈ ప్రసంగముల కొరకు ఏవిధమైన రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు.

సెప్టెంబర్ 30 నుండి అక్టోబరు 3వ తేదీ వరకు పాండిచ్చెరిలో మన సొసైటీ ప్రతినిధులకు పరిపూర్ణమైన అవగాహనా కార్యక్రమము ఏర్పాటు చేయబడును. దీని ముఖ్యోద్దేశము శ్రీఅరవిందుల యోగంలోని వివిధ అంశములు మరియు వాటిని నిజజీవితములో ఆచరించాల్సిన విధానము గురించి మన సభ్యులకు పూర్తి అవగాహన కల్గించుట మరియు మన కేంద్రములలో పృచ్ఛకుల నుండి సాధారణముగా ఎదురయ్యే ప్రశ్నలకు సమాధానముల ఇవ్వవలసిన తీరులో తగు శిక్షణ ఇచ్చుట.

పాండురంగశాస్త్రి విద్యాపీఠం, ముంబాయి నుండి కొందరు విద్యార్థులు అక్టోబరు 8 మరియు 9వ తేదీలలో ఆశ్రమమును సందర్శించగా వారికి శ్రీఅరవిందాశ్రమం, శ్రీఅరవింద సొసైటీ మరియు అరోవిల్‌ల గురించి కొంత ప్రాథమిక సమాచారం ఇవ్వబడినది.

ముంబాయి: ఇంటర్నేషనల్ స్కూల్ ప్రిన్సిపాల్ మరియు కొందరు విద్యార్థులకొరకు సొసైటీ వారిచే 26 అక్టోబర్ నుండి 1 నవంబరు వరకు ఆరు రోజుల పాటు ఎడ్యుకేషన్ కాంపు నిర్వహించబడింది.

గుంటూరు: శ్రీ పి.సి. స్వరూప్ (యూత్ కో-ఆర్డినేటర్) చే శ్రీఅరవింద భవన్‌లో "ఆధునిక కాలంలో శ్రీఅరవిందుల అవసరం" అన్న విషయంపై చక్కని ప్రసంగం నొకదానిని 27 సెప్టెంబరున ఏర్పాటు చేయబడినది.

భోపాల్: భోపాల్ నందు సెప్టెంబరు 19న శ్రీమనోజ్ శర్మగారిచే శ్రీఅరవిందసొసైటీ భోపాల్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ప్రసంగం ఏర్పాటు చేయబడినది. డా॥ డి.యన్. జోషి భోపాల్ కేంద్రంచే నిర్వహించబడుచున్న వివిధ కార్యకలాపాల గురించి ఒక నివేదిక సమర్పించబడింది.


ఇవిగాక పొద్రా (యమ్.పి.) చెన్నై, తిరుచ్చి మొదలైన కేంద్రముల నుండి అనేక కార్యక్రమములు నిర్వహించినట్లు వార్తలు అందుచున్నవి.

Rs. 15/-

అదితి

అఖిల భారత పత్రిక

ఫిబ్రవరి 2009



- శ్రీమాతారవిందుల వాక్కులు

అఖిల

భారత పత్రిక - ఫిబ్రవరి ౨౦౦౧

విషయసూచిక

తెలుసుకోవటం మంచిది.
అలా జీవించటం మరింత మంచిది.
అదేకావటం - పరిపూర్ణత అంటే అదే.

- శ్రీమాత

దైవం నీతోనే ఉన్నాడు

నేను నీతోనే వున్నాను. ఎందుకంటే నీవే నేను, నేనే నీవు గనక. నేను నీతోనే ఉన్నాను. ఇది సకల ప్రపంచానికీ ప్రతీక. ఏలన పరమచేతన నుండి అట్టడుగుననున్న నా భౌతిక చేతన పర్యంతం అన్ని భూమికలలోనూ, అన్ని స్థాయిలలోనూ నేను నీతోనే ఉన్నాను. ఇంక ఇక్కడ పాండిచ్చేరీలో నా చేతన ప్రమేయం లేకుండా నీవు శ్వాస కూడా తీసుకోలేవు . . . .

ఆశ్రమంలో అన్నిచోట్ల శ్రీఅరవిందులు మీకు అనుక్షణం గుర్తుండడంకోసం "శ్రీమాత సర్వదా మీ వైపు చూస్తున్నట్లుగానే ప్రవర్తించండి. ఎందుకంటే ఆమె సన్నిధి సర్వకాల సర్వావస్థల యందు ఉండే వుంది గనుక".

ఇదేదో ఒకసామెతగానీ వట్టిమాట గాని కాదు. అదొకవాస్తవం. నేను విస్పష్టంగానే మీతో వున్నాను. ఎవరికైనా సూక్ష్మ దృష్టి వుంటే నన్ను స్పష్టంగానే చూడవచ్చు.

ఇది కాకుండా మీకూ, నాకూ మధ్యన ఒక ప్రత్యేక అనుబంధం ఎప్పడూ ఉండనే వుంది. శ్రీఅరవిందుల వైపు మరియు నావైపు తిరిగి మా ప్రబోధాలవైపు ఆసక్తిగొన్న వారందరూ, వారు ఫ్రాన్స్‌లో వున్నా, పాండిచ్చేరిలో వున్నా, ప్రపంచానికి ఆవలితీరంలో వున్నా దూరం అనేది ఎన్నదగిన విషయమే కాదు అనేది అందరికి తెలిసిన సంగతే. వారితో వున్న ఈ అనుబంధం వాస్తవికం మరియు సజీవం కూడా. పిలుపువచ్చిన ప్రతీసారీ, అది నాకు తెలియవలసిన అవసరముంది. అందిన ప్రతీసారీ నేను అందుకు ప్రతిగా అవసరాన్ని బట్టి ఒక ప్రేరణగానీ, ఒక శక్తినిగానీ, రక్షణను గానీ, మరేదైనా గానీ వారికి కావలసిన సహాయం అందజేస్తాను.

నన్ను చెప్పమంటే వ్యక్తిగత చేతన అనేది ఒక వడపోత, ఒక సూచికలాంటిదని చెప్తాను. అనంతమైన దివ్య అవకాశాలలో ఒక అవకాశాన్ని వ్యక్తీకరించడం కోసం దానిని వాడుకుంటుంది. నిజానికి దైవం ప్రతివ్యక్తికీ అతని ద్వారా ఏమి జరగాల్సివుందో దానినే ఇస్తాడు. నీవు దైవాన్ని అత్యంత దూరస్థునిగానూ, కఠినుడిగానూ తలిస్తే అతడు అలాగే దూరంగానూ,

కఠినుడిగానే వుంటాడు. ఏ[illegible] చివరికి అతడు కఠినుడన్న భావనే నీకు మేలు చేస్తుంది. కాళీమాత భక్తులకు అతడు కాళికాదేవి. భక్తులకతడు సుందర స్వరూపుడు. జ్ఞానపిపాసులకతడు సర్వజ్ఞుడు. మాయావాదులకు సర్వాతీతుడైన అవ్యక్తస్వరూపుడు. నాస్తికులకు నాస్తికుడు. ప్రేమికులకు ప్రేమస్వరూపుడు. అతడు సోదరునిలా సన్నిహితుడు. విశ్వాసపాత్రుడై స్వాంతన నిచ్చేందుకు ఎల్లప్పుడు సిద్ధంగా వుండే స్నేహితుడు. అంతరంగ మార్గదర్శి అని విశ్వసించే వారికి అనుక్షణం మార్గం చూపుతాడు.

అతడు నీ తప్పులను మన్నిస్తాడని విశ్వసిస్తే, నీ తప్పులన్నింటినీ, అవిశ్రాంతంగా తుడిచి వేస్తూనే వుంటాడు. అనుక్షణం అతని అనంతమైన అనుగ్రహాన్ని చవిచూస్తావు. నీ అగాధ ఆకాంక్షమూలంలో నీవేవిధంగా తలుస్తావో అలాగే వుంటాడు.

నీ ఆకాంక్ష ననుసరించే దైవం నీతో వుంటాడు. అలాగని నీ బాహ్యచేతనలోని నీ తెలివితక్కువ ఆలోచనకు అనుకూలంగా తలవంచి వుంటాడని అర్థం కాదు - నేనిక్కడ ప్రస్తావిస్తున్నది నీ సత్తలోని సత్యాన్ని గురించి. అయిన్నప్పటికి కొన్ని సమయాలలో దైవం నీ బాహ్య ఆకాంక్షలను బట్టి నీపట్ల తన వైఖరిని మార్చుకుంటూ ఉండడం కూడా జరుగుతుంటుంది. నీవు భక్తుల లాగా దైవంతో కలిసి ఉండడం లేదా వేరుగా ఉండటం, ఆనందంలోనూ, నిరాశా నిస్పృహలోనూ, ఉండటం కద్దు. ఆయా సమయాలలో దైవం కూడా నీతో మమైకం చెందడం లేదా వేరుగా ఉండటం నీ నమ్మకాన్ని బట్టి తన తీరును మార్చుకుంటూ ఉంటాడు. కనుక నీ వైఖరి మీదే సర్వమూ ఆధారపడి ఉంటుంది. విశ్వాసం యొక్క అద్భుతమేమిటో, దాని ప్రాధాన్యత ఏమిటో, అది చేసే అద్భుతాలు ఏమిటో ఎవరికీ తెలియదు. అది అద్భుతాలకే అద్భుతం. అనుక్షణం దైవం నిన్ను ఊర్ధ్వస్థాయిలలోకి లేవనెత్తాలని అనుకున్నపుడు, నిన్ను అలా లేవనెత్తేందుకు నీకు సన్నిహితంగా, చాలాచాలా సన్నిహితంగా అతడు మెదులుతూనే ఉంటాడు.

అనువాదం : కొంగర భాస్కరరావు

భయం - తొలి ఆటంకం

(శ్రీఅరవిందుల ఒక సూక్తి విషయంలో భయము, అపనమ్మకము, సంశయము అనే మూడు ఆటంకాల గూర్చి మాట్లాడుచు శ్రీమాత "భయము"ను గురించి తెల్పారు)

దైవసాక్షాత్కార సంభూతులైనవారైనాసరే యేదో సంభవిస్తుందన్న ఆందోళనతో కూడిన "భయము" అనే దానికి వ్యతిరేకంగా, శక్తివంతంగా, దృఢంగా, పోరాటం సాగించాల్సి ఉంటుంది. కాని యీ భయం తెలివిమాలిన తనంతో కూడుకొన్నది. ఎందుకనగా చివరి పర్యవసానంగా, ప్రతి వ్యక్తి భవితవ్యం ఒకే విధంగా వుంటుంది. నీవు జన్మిస్తావు. కొంతవరకు తృప్తికరంగానే జీవిస్తావు, మరణిస్తావు. ఆపై కొంతకాలం వేచివుంటావు. మరలా జన్మిస్తావు. కొంతవరకు తృప్తికరంగానే జీవిస్తావు. మరణిస్తావు. అలానే మరల మరల అనంతంగా పునరావృతమయే జనన మరణ చక్రభ్రమణంలో 'యీ జీవితం చాలు. ఇక వద్దు" అనుకునే దాకా తిరుగుతుంటావు.

ఆ తర్వాత? దేన్ని గూర్చి భయం? మార్పులేని జీవన్మరణవలయం నుండి బయటపడినందుకా? స్వేచ్ఛగా వున్నందుకా? లేక జీవితఖైదీగా మరి కొంత కాలం వుండకుండ విముక్తి పొందినందుకా? దేనికి భయం?

★ ★ ★

భయం కల్మషభూయిష్టమైనది. మహాకల్మష భూయిష్ఠమైన వాటిలో ఒకటి. భువిపై దైవకార్యాన్ని నాశనం చెయ్యడానికై నేరుగా అసురశక్తుల నుండి యే తెంచిన వానిలో ఒకటి భయం. కనుక యోగసాధన చేయదలచిన వారు తమ చేతన నుండి భయాన్నే కాదు, భయం నీడను సహా, తమ సర్వశక్తులను ఒడ్డి, పట్టుదలతో, ఓరిమితో ప్రయత్నించి తొలగించాలి. అది వారి ప్రథమ కర్తవ్యం. యోగపథంలో సాగిపోయేవారు నిర్భయంగా వుండాలి. అల్పమైన హేయమైన, బలహీనమైన క్షుద్రమైన భయానికి, తమను కృంగదీసే భయానికి ఎన్నటికీ లోనుకారాదు.

అనువాదం : బి. నరసింహయ్య, ప్రొద్దుటూరు.

★ ★ ★

ఎవరైనా అసలు ఎందుకు భయపడాలి?

భయం మరిన్ని ఊహాజనిత ఆందోళనలను సృష్టిస్తుంది. వాస్తవంగా ఆందోళన పడవలసినదేమైనా ఉన్నా కూడా దానిని గురించి బెదిరిపోవటం వల్ల ఉపయోగం లేదు. అది వివేకాన్ని మసక బారేటట్లు చేస్తుంది. సద్య: స్ఫూర్తిని హరిస్తుంది. సక్రమ కర్తవ్యాన్ని నిరోధిస్తుంది.

★ ★ ★

ఉన్నత దివ్యప్రకృతిలో భయానికి స్థానం లేదు. భయం, ప్రాణిక స్థాయిలో జనించేది. అజ్ఞాన ప్రవృత్తి. భయానుభూతి ప్రబలమైన ప్రాణిక ప్రతిక్రియలో విషయ వివేకాన్ని, భ్రష్టపరుస్తుంది. ఆటంకమై నిలుస్తుంది. సాధారణంగా దాని స్థానాన్ని ఇది ఆక్రమిస్తుంది. ఇది చాలావరకు ప్రతికూలశక్తుల కల్పనగా భావింపబడవలసినదే!

★ ★ ★

భయాందోళనలు ఇచ్ఛాశక్తికి వక్రరూపాలు. నీవు ఏ భయాన్ని గురించి పదేపదే తలుచుకుంటూ చింతనచేస్తూ, బెదురుతూ ఉంటావో అది సంభావ్యం కావటానికి నీవే దోహదకారివి అవుతావు. మేల్కొని ఉన్న నీ ఉపరితల ఇచ్ఛాశక్తి దానిని నిరాకరించినా అంతర్మానసం దానిని సంకల్పిస్తూనే ఉంటుంది. అవచేతనా మానసం, మెలకువలో ఉండే శక్తి, వివేకముల కంటె ప్రబలతరమైనది. విశాలమైనది. సాధించటానికి సిద్ధపడేదిగా ఉంటుంది. అయితే అంతరాత్మ ఈ రెండింటికంటే ప్రబలతరమైనది. (అందుచేత) మహత్తమమైన ప్రశాంతతలో మరియు అలవోకగాస్వాయత్తమై ఉండే అంతరాత్మలో ఆశ్రయం పొంధు.

వ్యాకులపాటుతో అధైర్యంగా నీవున్నపుడు ఇలా అనుకో, "I am Bacchuss, and Ares and Apollo; ఇంకా నేను అసాధ్యమైన, స్వచ్ఛమైన అగ్నిహోత్రాన్ని, బ్రహ్మాండంగా వెలుగొందే సూర్యదేవుణ్ణి" - అని.

- శ్రీఅరవిందులు

అనువాదం : కర్రా వెంకటేశ్వర్లు

భయం - కారణం

ప్ర : భయమెందుకు వేస్తుంది ?

బహుశా అహంకారం వల్ల కావచ్చు.

దానికి మూడు కారణాలు ఉన్నాయి. తన భద్రతకు ఏం ముప్పు వాటిల్లుతుందో అనే మితిమీరిన ఆందోళన మొదటిది. తెలియని దాన్ని చూసినప్పుడు, కొత్త పరిస్థితులు ఎదురైనప్పుడు కలిగే బెడద రెండవది. వీటన్నిటిని మించి నీకు దైవంతో స్వతస్సిద్ధమైన విశ్వాసం లేకపోవడం - నువ్వు లోతుగా పరిశీలిస్తే ఇదే ముఖ్య కారణం అని తేలిపోతుంది. భగవంతుడు (That) ఉన్నాడు అన్న విషయం కూడా తెలియని వారున్నారు. “మీ భవితవ్యంలో మీకు విశ్వాసం లేదు.” “భగవంతుని కారుణ్యం సంగతి మీకు అసలు తెలియదు” అని మనం వారితో చెప్పి చూడవచ్చు. ఏవిధంగా మనం అనుకున్నా మూలకారణం భగవంతునితో నమ్మకం లేకపోవడమే. అన్ని పరిస్థితులలోనూ మంచే జరుగుతుందని నమ్మినట్లయితే, అటువంటి వారికి అసలు భయం అనేదే లేదు. జరిగేదంతా మనమంచికేనా ?

(తరువాత చాలా ఏళ్లకు ఒక సాధకుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ సంభాషణ సాగింది.)

అన్ని పరిస్థితులలోనూ మంచే జరుగుతుందన్న భావన కలిగితే, ఆ వ్యక్తికి భయమనేదే ఉండదు. (అంతా మనమంచికే అన్న భావం.) అన్ని పరిస్థితులలోనూ మంచే జరుగుతుందా ?

ప్రపంచ పరిస్థితిని బట్టి అది మంచే, కాని సంపూర్ణంగా మాత్రం కాదు. రెండు అంశాలు ఉన్నాయి. ప్రతిక్షణం, సమగ్ర, సంపూర్ణ పద్ధతిలో దివ్య గమ్యం వైపుగా అది మంచే. భగవత్ సంకల్పంతో ఎరుకతో సంబంధం పెట్టుకున్న వ్యక్తికి భగవత్ సాక్షాత్కార సిద్ధికి అది ఎంతో అనుకూలమైనది.

ఇదీ అసలు విశదీకరణ అని నా నమ్మకం. ప్రతిక్షణం సమగ్ర దృష్టితో చూస్తే దివ్య పరిణామానికి అది అత్యంత అనుకూలం. భగవంతునితో సంబంధం వున్నంతమేరకు వారి పరిపూర్ణ సాయుజ్యానికి అది మంచిది. (అత్యుత్తమం).

అయితే ఈ మంచి అన్నది మారుతుంటుంది. ఎప్పడూ నిలకడగా అదే మంచి అని చెప్పలేము. దానిని అలా సంరక్షిస్తే అది మంచిదే. కాని మరుక్షణంలో అది మంచిది కాకపోవచ్చును. తను మంచిది అనుకున్న దానిని నిశ్చల మైనదిగా సంరక్షించాలని మానవ చేతన భావిస్తుంది. అది అందని దానిని గ్రహిస్తుంది. సంరక్షించాలన్న ఈ ప్రయత్నమే మంచిని చెడుగా మారుస్తుంది.

భయం అచేతన జనితం

భయం అనేది అచేతనలో నుండి ప్రభవించిన ఒక వైపరీత్యం. అజ్ఞానం నుండి పెల్లుబికే ఒక వ్యధ. మనుష్యులకు వస్తువుల తత్వం తెలియదు. ఏం జరుగుతుందో తెలియదు. వారి చర్యల పర్యవసానాలు తెలియవు. వారికి చాలా విషయాలు బోధపడవు. ఈ అజ్ఞానమే భయానికి మూలకారణం. ఒక వ్యక్తి తనకు తెలియని దానిని గూర్చి భీతి చెందుతాడు. ఒక పసిపిల్ల సంగతి చూద్దాం. ఒక తెలియని వ్యక్తి దగ్గరికి ఆ పిల్లని తీసుకొని వెళ్తే అది ముందు భయపడుతుంది. (జాగృతమైన అంతశ్చేతన గల పిల్ల సంగతి నేను మాట్లాడడం లేదు.) కొంతమంది అరుదైన శిశువులు చాలా ధైర్యంగా వుంటారు. వారిలో మరో చైతన్యం వుంటుంది. రాబోయే ప్రమాదాల విషయమైన ఒకానొక భయవిహ్వలత, సహజాతం కలగా పులగంగా ఉంటాయి. ఏదో ప్రమాదం సంభవిస్తున్నదనే భావన కలిగినప్పడు ఆ ప్రమాదాన్ని ఎలా నివారించుకోవాలో మార్గం తెలియనప్పడు, దానినుండి తనను తాను రక్షించుకొనే విధానం తెలియనప్పడు, ఆ శిశువు భయపడుతుంది.

మనకు అసలు విషయం తెలిస్తే భయం అనేది ఉండదు. పరిపూర్ణంగా జాగృతమై, పూర్తిగా ఎరుకతో వుండి, తెలుసుకుంటే భయం అనేది దరి దాపులలోకి రాదు. భయం వేసినప్పడు, దాని మీద చైతన్యం, జ్ఞానం, శక్తి కాంతుల్ని గనుక ప్రసారం చేయగలిగితే, దానిని పూర్తిగా నిర్మూలించవచ్చును. క్రైస్తవ మతంలో భయం గూర్చి ఒక సూక్తి వుంది. ఈడెన్ తోటలో ఆపిల్ పండును ఎవరైనా కోసి తింటే వారిని భయం పట్టుకుని పీడిస్తుందని ఆ మతం చెబుతుంది. అంటే, జ్ఞానంతో పాటు భయం వచ్చినట్లు, భూమిపై ఈ భయమే మానవాళి జీవితాలను శాసిస్తుందని ఆ మతం అంటుంది. ఇక్కడ నా వాదాన్ని తిరిగి చెబుతున్నాను.

మరి మృగాలకు కూడా భయం వేస్తుంది కదా! మృగాలు ఏం పాపం చేయలేదే అవి ఆ ఆపిల్‌ను తినలేదే! కాబట్టి వాటికి ఉండకూడదు మరి! నిజానికి అజ్ఞాన పూరితమైన, సహజాతం (instinct) తో కలిసిన మిశ్రమ చేతనే ప్రమాదానికి దోహదమవుతుంది. పరిష్కారం దానికే తెలియదు. కాని భగవంతుని దివ్య కార్యాన్ని ప్రతిఘటించే అసుర శక్తులు, ప్రాణిక జగత్తులోని శక్తులు ఈభయాన్ని విస్తృత స్థాయిలో ఉపయోగించుకుంటాయని మాత్రం నిశ్చయంగా చెప్పవచ్చును. ఆ భయం ఆసరాగా అవి మానవుల్ని గట్టిగా పట్టుకుని ఆడిస్తాయి. అంతే కాదు. రాజకీయాలు, మతం ఆకోవకు చెందినవే. మృత్యుభయాన్ని కలిగించి, జీవితం ముగిసిన పిమ్మట జరిగే దానిని గూర్చి భయపెట్టి తాము ప్రవచించే శాసనాలు కనుక గుడ్డిగా అనుసరించకపోతే మరణం పిమ్మట సంభవించే ఉపద్రవాలు గూర్చి భయపెట్టి కొన్ని మతాలవారు, వారిని నమ్మే ప్రజల్ని లోబరుచుకుంటారు.

సామరస్య భావం లోపించినప్పుడు కూడా భయం ఆవహించవచ్చు.

కొందరు నిప్ప అన్నా, నీరు అన్నా భయపడిపోతారు. మరికొందరికి కొన్ని జంతువులంటే తగని భయం. ప్రాణిక స్పందనలలో సామరస్య స్థితి లోపించినప్పడు ఇటువంటి భయాలు ఏర్పడతాయి. శరీరంలోని అచేతన విభాగంలో ఆ సామరస్య రాహిత్యం భయంగా మారుతుంది. శరీరం అచేతనామయం. దానికి కొంచెం చైతన్యం కల్గించడానికి ఎంత శ్రమ పడాలో! అలవాట్లతో కరుడుకట్టుకుపోయిన స్వభావం దీనిది. అది చెప్పలేనంతగా అచేతనామయం.

యోగ సాధనతో భయం మటుమాయం

భయం మొదటి చలనం దానంతటదే వస్తుంది. ఒక గొప్ప సైంటిస్టు వున్నాడు. ఆయన మనస్తత్వ శాస్త్రవేత్త కూడా. (ఆయన పేరు నాకు గుర్తు లేదు). ఆయన అంతర్గత చైతన్యాన్ని బాగా అభివృద్ధి చేసుకొన్నాడు. దానిని పరీక్షించాలనుకున్నాడు. ఒక ప్రయోగం చేయదలచాడు. చైతన్యం ద్వారా శరీరం చేసే Reflex actionsను అసంకల్పక్రియ - నియంత్రించడం సాధ్యమేనా అని తలిచాడు. (ఆ పని చేయడానికి ఆలోచించనక్కరలేదు. అది సాధ్యమే. కాని అది ఆయన దృష్టిలో అసంభవం. ఆయన జంతుప్రదర్శనశాలకు వెళ్లాడు.

అక్కడ ఒక గాజు బోనులో సర్పాలను ప్రదర్శిస్తున్నారు. వాటిలో బుసలు కొట్టే త్రాచు పాము ఒకటి ఉంది. ఆ గాజు పలక నుండి ప్రజలు చూస్తుంటే, అది మహా కోపంతో బుసలు కొట్టడం ప్రారంభించింది. మన శాస్త్రవేత్త ఆ మందిరం దగ్గరగా వెళ్లి నిలబడ్డాడు. ఆగాజు పలక చాలా గట్టిది. ఎట్టి పరిస్థితులలోనూ ఆ పాము గాజు పలకను పగులగొట్టలేదు. తనను ఆ పాము ఏం చేయలేదు. అక్కడి నుండి కేకలు వేస్తూ, చేతులు వూపుతూ ఆ పామును రెచ్చగొట్టసాగాడు. ఆ పాముకు వొళ్లుమండి గాజు పలక వైపుగా దూసుకు వచ్చింది. వెంటనే సైంటిస్టు కళ్లు మూసుకున్నాడు. ఇలా రెండు మూడు సార్లు జరిగింది. "ఈ పాము గాజు పలకను ఛేదించుకొని బయటకు రాలేదు. నేనెందుకు కళ్లు మూసుకుంటున్నాను." అని ఆ మనస్తత్వవేత్త తనను తాను ప్రశ్నించుకున్నాడు. అటువంటి ప్రతిక్రియను జయించడం కష్టం. అది మన రక్షణ కోసం జరిగిన ఏర్పాటు. తనను తాను రక్షించుకోలేనని ఒక వ్యక్తి భావించినప్పుడు అతను భయపడతాడు. కళ్ల ద్వారా వ్యక్తమైన భయం మానసికమైన భయం కాదు. ప్రాణిక భయం కాదు. శరీర కణాలలోని భయం. ప్రమాదం లేదని వాటికి నచ్చచెప్పలేకపోవడం జరిగింది. ప్రతిఘటించడం ఎలాగో వాటికి తెలియదు. యోగసాధన లేకపోవడం అసలు కారణం. యోగశక్తితో కళ్లు తెరచి చూడవచ్చును. వాటిని మూయనవసరం లేదు. మరొకదాని సహాయం యోగి తీసుకుంటాడు. ఆ 'మరేదో' అదే లోపలి దివ్య సాన్నిధ్యము. అది అన్నింటికన్నా బలమైనది.

అనువాదం : కె. యజ్ఞన్న

భయము - నివారణ

భయానికి నివారణోపాయాలు చాలా ఉన్నాయి. అయితే నీకేది అనుకూలమో దానిని నీవు కనుగొనాలి. కొంతమందికి సూక్ష్మంగా - నీ భయం ఒక బలహీనత మాత్రమే - అని చేప్తే చాలు, అంతే - దానిని వారు వెంటనే అసహ్యించుకుంటారు. వారికి బలహీనత అంటే కంపం . ఇంకా కొంతమందికి - ఇది నీకు అననుకూల శక్తుల నుంచి వచ్చే సూచన. దీనిని అవతలకి తోసి

పారవేయి ప్రతికూల శక్తులకు నెట్టివేసినట్లు అని చెప్పినా సరిపోతుంది. ఒక్కొక్కరిది ఒక్కో రకం. అయితే ముందు నువ్వు తెలుసుకోవలసినదేమంటే - **భయం** అనేది **చాలా చెడ్డది. ఒక dissolved acid - కరిగించే ఆమ్లంలాంటిది. ఓ చుక్క దేంట్లోనైనా పడితే చాలు, ఆ పదార్థాన్ని అది నిర్వీర్యం చేస్తుంది. అందుచేత నీవు ముందు చేయవలసినది భయం నీలో ప్రవేశించే అవకాశం ఇవ్వకూడదు. ఇదే ముందు తీసుకోవలసిన జాగ్రత్త.** కొంతమంది ఉంటారు. నాకు తెలుసు. వాళ్లు తమ భయాన్ని గోరంతలు కొండంతలు చేసి మాట్లాడతారు. వీళ్లకి మరి చికిత్స లేదు. వాళ్లు చాలా సహజంగా ఏమంటారంటే "అబ్బ ! నేనెంత భయపడిపోయానో !" అని. ఇదేదో చాలా గొప్ప విషయం, గర్వించ తగినదిగా మాట్లాడతారు. అలాంటి వారికి ఎవళ్లూ ఏమీ చేయలేరు.

అయితే, భయం మహా చెడ్డది. ప్రతికూలమైనది. హీనమైనది, చైతన్యానికి తగనిది. ఈ గుర్తింపుతో నీకు ఏ మాత్రం జ్ఞానోదయమైనా దానికి వ్యతిరేకంగా పోరాటం ప్రారంభిస్తావు. ఒకరి మార్గం మరొకరికి పనికి రాదు. ఎవరి మార్గం వారే నిర్దేశించుకోవాలి. ఎవరి మార్గం వారిదేనంటాను. **భయమనేది భయంకరమైన అంటువ్యాధి.** మిగిలిన అంటువ్యాధులన్నిటికన్నా ఇది చాలా వేగంగా వ్యాపిస్తుంది. భయవాతావరణంలో ఊపిరిపీల్చిన వెంటనే నిన్ను భయం ఆవహిస్తుంది - ఎలాగో, ఎందుకో నీకు తెలియకుండానే. ఎందుకంటే భయంకర వాతావరణం అక్కడ ఉన్నందువల్లనే. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు అక్కడ అందరూ భయంతో హడలిపోతారు. కారణం - భయంకర వాతావరణం వాళ్లని చుట్టుముట్టి ఉండటం వల్లనే. కాని ఇది సులువుగా నివారింపబడేదే. ఇలా భయాన్ని అదుపు చేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఇది ఎలాగంటే - భయానికి సంబంధించిన సూచనలను తిరస్కరించి, వ్యతిరేక సూచనలతో వాటిని త్రిప్పికొట్టి విఫలం చేయటమే.

ఏ భయం కలిగినా వెంటనే దైవాన్ని సంభావించి ఆయన ఒడిలో వొదిగిపోవటం లేదా ఆయనకు పాదాక్రాంతమవటమే, అన్యథాశరణం నాస్తి త్వమేవ శరణం మమ అనుకుంటూ. ఇది ఆధ్యాత్మిక ప్రవృత్తి కలవారికి

ఉత్తమోత్తమమైన చికిత్స. అపుడు భయం వెంటనే మాయమైపోతుంది. ఇది అన్నిటి కన్నా సులువు అయినది. కాని అందరూ ఆధ్యాత్మిక ప్రవృత్తి కలిగి ఉండి దివ్య కృపను అందుకోలేరు.

ప్రశ్న : ఎవరైనా భయపడినపుడు ఏమిచేయాలి ?

అది వ్యక్తిత్వాన్ని బట్టి ఉంటుంది. భయం పోగొట్టే విధానాలు చాలా ఉన్నాయి.

నీకు చైత్యపురుష సాంగత్యం కనుక ఉంటే, వెంటనే దానిని ఆవాహనం చేయాలి. ఆ వెలుగులో విషయాలనన్నిటిని పునరుద్ధరింపచేయాలి. ఇది చాలా శక్తివంతమైన మార్గం.

చైత్యపురుష సంసర్గం లేనివాళ్లు, హేతు బద్ధంగా ఆలోచన చేయగలిగే సత్వము కలిగిఉండి, బుద్ధిని ఉపయోగించి, తమకుతామే తర్కించుకొని, పిల్లవానికి నచ్చచెప్పినట్లు నచ్చ చెప్పుకోవాలి. ఈ భయం చాలా దుర్మార్గమైనది. ఏమాత్రం ప్రమాదం వచ్చినా దానిని భయంతో యెదుర్కొనటం ఎంతో తెలివితక్కువ పని. నిజంగా ఏదైనా ప్రమాదం వస్తే సూటిగా ధైర్యంగా దానిని యెదుర్కొనటమే. ఆవిధంగానే దానినుంచి బయటపడ గలుగుతావు. ఏమాత్రం భయం నీలో ఉన్నా, అంతే, నీ పని అయిపోయినట్లే! కాబట్టి హేతువాద బుద్ధితో నీలో ఏభాగం భయానికి లోనై ఉందో, దాన్ని భయపడవద్దని నచ్చచెప్పి ఒప్పించు.

నీకు విశ్వాసం కనుక ఉండి, దైవానికి అర్పణ కావించుకోబడి ఉంటే, నీకు ఒక్కటే సరళమైన మార్గం - "నీ దివ్యేచ్ఛయే నిర్వర్తింపబడనీ. నేను మాత్రం దేనికీ భయపడను. ఎందుకంటే నీవేకదా నా జీవితాన్ని మార్గనిర్దేశంచేసి నడిపించేది ! నేను నీవాడను. నా జీవిత మార్గదర్శివి నీవే" - అని విన్నవించుకో. అది వెంటనే పనిచేస్తుంది. అన్ని పద్ధతులకంటే నిజంగా ఇదే ఎంతో అమోఘమైనది. అంటే ఏమన్నమాట ? దైవానికి నీవు పరిపూర్ణంగాను వాస్తవంగాను, అర్పణకావించుకోవాలి. ఇది తప్పనిసరి. అర్పణభావం వెంటనే పనిచేస్తుంది. కలలా అంతా మాయమైపోతుంది. చెడు స్వభావంతో కూడిన సత్వము కూడా భయంతో పాటు పారిపోతుంది.

కొంతమంది బలమైన ప్రాణికశక్తి కలిగి ఉంటారు. వాళ్లు Fighters.

పోట్లాటకు సిద్ధంగా ఉంటారు. "ఇక్కడే ఉన్నాడు శత్రువు. వాడిని మనం పడగొడదాం" - అంటారు. అందుకు కొంత పరిజ్ఞానంతో కూడిన ప్రాణికశక్తి ఉండాలి. ప్రాణికంగా మహాశక్తి సంపన్నుడు కావాలి. అందరికీ ఇది సాధ్యపడదు.

అందుచేత ఎన్నో మార్గాలు. అన్నీ మంచివే. కాకపోతే వాటినెలా ఉపయోగించుకోవాలో నీకు తెలియాలి. నీ స్వభావానికి అవి తగినవిగా ఉండాలి.

ప్రశ్న: నేను శరీర వ్యాయామం చేసేటప్పుడు jump చేద్దామనుకుంటాను, భయమేస్తుంది. ఎందుకని ?

ఆః! నాయనా, అక్కడ రెండు విషయాలున్నాయి. అది ప్రాణిక సంబంధిత భయమైతే నీకు నీవే నచ్చ చెప్పుకోవాలి. నీవే పరిష్కరించుకోవాలి. అది శారీరకమైన ప్రవృత్తి అయితే Physical instinct - దానిని జాగ్రత్తగా గమనించాలి. సాధారణంగా జరిగేది ఇదే. దానిని హేతువాదంతో అస్థిరపరచకూడదు. శరీరమే దానికి ఏది అవసరమో, ఏది కాదో తెలుసుకుంటుంది. తనకు కావలసినది తాను చేసుకోవలసినది ఏదో తానే చూసుకుంటుంది.

భయాన్ని జయించే ప్రతిక్రియలన్నిటిలోకి ఉత్తమమైనది భయాన్ని నిర్భయంగా ఎదుర్కొవటం. నీకు ఏదంటే భయమో దానిని నేరుగా ఢీకొన్నపుడు నీవిక భయపడవు. భయం మాయమైపోతుంది. యోగ దృక్పథంలోను, క్రమశిక్షణా పరంగాను ఈ పరిష్కారమే సిఫార్సు చేయబడింది. ప్రాచీన ఉపదేశాలలో, ప్రత్యేకంగా ఈజిప్టు దేశంలో, నిగూఢ అతీంద్రియ పరిజ్ఞాన ఉపదేశం పొందటానికి మృత్యుభయం పూర్తిగా లేకుండా ఉండాలి. ఆ రోజులలో అందుకు పాటింపబడే విధానం ఏమంటే - క్రొత్తగా దీక్ష పొందగోరే వానిని కొన్ని రోజులు ఒక శిలాశవపేటికలో, చనిపోయిన వానిగా, ఉంచేవారు. ఆకలితో, ఊపిరాడక వాడు మరణించటానికి కాదు. అలా ఉంచటం వల్ల భయం నుంచి విముక్తి కలుగుతుందని భావించేవారు.

అయితే ఇపుడు దీనికొక చాలా సులువైన పరిష్కారం ఉంది. ఇది వ్యక్తిగతమైనది. సాధారణ ప్రపంచ జ్ఞానం పై ఆధారపడిన ప్రశ్న - - - - నిన్ను నీవు కాస్త గమనించుకోవాలి. నీకు భయం కలిగినపుడు, నీవు దేనిని గురించి

భయపడుతున్నావో ఆ అంశం భయాన్ని ఆకర్షిస్తోంది. నువ్వు రోగం గురించి భయపడుతూంటే భయం రోగాన్ని ఆకర్షిస్తోంది. ప్రమాదాన్ని గురించి భయపడుతూంటే నీ దృష్టిప్రమాదం వైపు మరలుతోంది. నీ ఆంతర్యాన్ని గమనించు. ఇది నీవు గ్రహిస్తావు. ఇది వాస్తవం. నీలోనే ఉంటుంది. అందుచేత కాస్త లోక జ్ఞానం ఉపయోగించు. దేనిని గురించైనా భయపడటం మూర్ఖత్వం. అంటే నువ్వు భయపడే దానిని నీ దగ్గరికి స్వాగతీకరించటమే అన్న మాట. ఇలా నీవు భావించుకో, నిన్ను ఎవడైనా చంపాలనుకుంటే నువ్వు చంపాలనుకున్న వాడిని నేను అనివాడి దగ్గరికి వెళ్లి చెప్తావా ! అలాంటిదే ఇది. భయం మహాచెడ్డది. కాబట్టి మనకది వద్దు. నీవు దీనినిలా హేతుబుద్ధితో ఆపలేకపోతే, నీపై నీకు ఆత్మవిశ్వాసం లేదన్నమాట. ఇందుకు కృషి చేయాలి. నిన్ను నీవు నియంత్రించుకునే కృషి నీవు చేయాలి. మరి అంతే.

నీ సత్వములో ఒక భాగం మరొక భాగం కంటే దృఢంగా నిర్భయంగా ఉంటుంది. దానియొక్క నిర్భీతితో భయపడే భాగాన్ని ప్రభావితం కావించు. ఇదే భయాన్ని అధిగమించే విధానం.

మొండిధైర్యం, పరిపూర్ణచిత్తశుద్ధి, ప్రతిఫలాపేక్షతో లాభనష్టాలు చేరీజు వేయకుండా ఉండే చిత్తశుద్ధితోకూడిన ఆత్మార్పణ, సంరక్షణ నపేక్షించే భావం పట్ల విముఖత, సాక్ష్యాధారాలు కోరకుండా ఉండే విశ్వాసం - ఇదీ అత్యావశ్యకమైనది; ఎట్టి ప్రమాదం నుంచైనా రక్షణ కల్పించేది.

హింసను పూర్తిగా వదిలిపెట్టు. నీకెలాంటి భయము ఉండదు.

ప్రతికూల శక్తుల పోరాటంలో నీకు ఓటమి ఎపుడు కలుగుతుందంటే దేవుని సహకారంలో నీకు నిజమైన నమ్మకం లేనప్పుడు మాత్రమే.

భయపడకు. అప్పుడు ఏ చికాకులు ఉండవు. నా బిడ్డకు భయమనేదే ఉండదు.

శుభాకాంక్షలు

- శ్రీమాత

అనువాదం : కర్రా వెంకటేశ్వర్లు

సరైన దృక్పథానికి గల శక్తి

తక్షణం ప్రభావం చూపే ప్రతి ప్రతికూల సంఘటనను సరైన దృక్పథం ఉంటే దాని పరిధిలోనే దానిని అనుకూలంగా మార్చగల శక్తినే కాకుండా, ఆ సంఘటననే కూడా మార్చగలదు. ఉదాహరణకు, ఒక మనిషి నిన్ను చంపడానికి వచ్చినప్పుడు నీవు నీ సాధారణ చైతన్యంలో ఉండి, నీ తెలివితేటలతో ఏదేదో ఊహించుకుని భయపడితే, అతను తాను ఏమి చేయాలనుకుని వచ్చాడో దానిని నిర్వర్తించడంలో చాలా మటుకు సఫలీకృతుడౌతాడు. అలాకాక, నీవు పూర్తిగా భయపడుతున్నప్పటికీ, కొద్దిగా ఊర్ధ్వముఖుడవై, దైవ సహాయం అర్థిస్తే, అతని గురి కొద్దిపాటి గాయం వరకే పరిమితమై తప్పిపోతుంది. ఏది ఏమైనప్పటికి, నీకు సరైన దృక్పథం ఉండి, సంపూర్ణ చైతన్యంతో నీ చుట్టు పక్కల అంతటా భగవత్ సాన్నిధ్యపు ఎరుకను కలిగి ఉంటే, అతను నీపై వేలెత్తి కూడా చూపలేడు.

సరైన దృక్పథం అనేది ఎలా ఉంటుందో అనే దానిని తెలియచెప్పడానికి నా వద్ద లెక్కలేనన్ని ఉదాహరణలున్నాయి. ఒక్కని సరైన దృక్పథం మూలంగా జన సమూహాలు రక్షించబడటం నేను చూశాను. కాని, ఆ దృక్పథం అనేది శరీరాన్ని దాని మానాన దాని భయాలకు వదిలివేసి, ఎక్కడో పై ఎత్తులో ఒక చోట ఉండటం వంటిది కాకూడదు. నీవు ఆవిధంగా పైస్థాయిలో ఉండి, అంతా "దైవేచ్ఛ ప్రకారమే జరుగును గాక" అని అంటే అప్పుడు నీవు చంపబడటం ఖాయం. ఎందువల్లనంటే, నీ శరీరం పూర్తిగా దివ్యత్వం కాకపోవచ్చు, గజగజ భయంతో వణికిపోతూ ఉండవచ్చు; ఆ సమయంలో చేయతగింది ఏమిటంటే, సత్యచైతన్యాన్ని నీ శరీరంలో నిలిపి ఉంచాలి, ఇసుమంతైనా భయం ఉండకూడదు, అంతటా పూర్తిగా దివ్య ప్రశాంతిని కలిగి ఉండాలి, అప్పుడే ప్రమాదమనేది ఉండదు. ఆవిధంగా, మనుషుల నుంచి ఎదురయే దాడులను తొలగించగలగడమే కాకుండా, జంతువులనే కాక మూల పదార్థాలను సైతం ప్రభావితం చేయవచ్చు. నేను మీకు ఒక చిన్న ఉదాహరణనిస్తాను. మీకు ఆ రాత్రి వచ్చిన పెనుతుఫాను, పెద్దశబ్దంతో అంతటాపడిన కుంభవృష్టి గుర్తుంది కదా. అప్పుడు నేను శ్రీఅరవిందులవారి గదిలోకి వెళ్ళి కిటికీ తలపులు మూయటానికి

సహకరిద్దామను ...న్నాను. నేను గది తలుపు తెరవగానే కనపడిందేమిటంటే ఆయన నిశ్చలం గా టేబుల్ వద్ద కూర్చుని వ్రాసుకుంటున్నారు. ఆ గదిలో ఎంత ప్రశాంతత ఉందంటే, బయట అంతపెద్ద తుఫాను చెలరేగుతున్నదని ఎవరూ ఊహించలేరు. కిటికీలన్నీ పూర్తిగా తెరచి ఉన్నాయి, ఒక చిన్న వాన తుంపర కూడా లోపలికి రావటం లేదు.

ప్రియమైన మాతా, ఇక్కడ (Bases of Yoga Chapter 3, In difficulty) శ్రీఅరవిందులు ఈ విధంగా చెపుతున్నారు. "ఎవరైనా తమకు కలిగిన కష్టాన్ని సరైన ఆత్మస్థితిలో (Right Spirit) ఉండి ఎదుర్కొని జయించితే, వారికి ఆ అడ్డంకి వైదొలగినట్లుగా తెలుసుకుంటారు."

మాతా, సరైన ఆత్మస్థితి (Right Spirit) అంటే ఏమిటి ?

శ్రీమాత సమాధానం : సరైన ఆత్మ స్థితి (Right Spirit) అనేదాని అర్థాన్ని శ్రీఅరవిందులు ఈవిధంగా తెలియజేశారు, అచంచలమైన నమ్మకంతో ప్రశాంతచిత్తులై ఉండటం. కాని, అది (అందుబాటులోకి రావటానికి) కొద్దిగా దూరంగా ఉంటుందని నేను అనుకుంటాను. ఓర్పు వహించి దాడి తొలగిపోయే దాకా, అచంచలమైన నమ్మకంతో నిరీక్షించడమే. అది లేదా ? మరోమార్గం ఉంది. ఏదైనా గాని, సరైన ఆత్మస్థితి అంటే ధైర్యాన్ని కోల్పోకుండా, విశ్వాసం కోల్పోకుండా, ఓరిమి కోల్పోకుండా, క్రుంగిపోకుండా, బాగా ప్రశాంత చిత్తంతో, శాంతం వహించి, ఎంతగా ఆకాంక్షను నిలుపుకోగలిగితే అంతగా ఆకాంక్షిస్తూ, జరుగుతున్నదాని గురించి బాధపడకుండా ఉండటం. ఈ పరిస్థితి తొలగిపోతుందని, అంతా శుభమే అవుతుందని ప్రగాఢ విశ్వాసం కలిగి ఉండాలి. ఇదే మంచి పద్ధతి.

- శ్రీమాత

అనువాదం : డా॥ టి. ప్రసన్నకృష్ణ.

జుగుప్స ఎందుకుండాలి ?

ప్రశ్న : పాములు, తేళ్ళు మొదలైన కొన్ని జంతువులను చూడగానే స్వతస్సిద్ధమైన జుగుప్స కలగడానికి కారణమేమిటి ?

ఈ విధంగా గానీ మరొకరకమైన అసహ్యం కలగటమనేది తప్పనిసరియైన అవసరం ఏమీ కాదు. ఏ విధమైన ద్వేష భావం లేకపోవటమే యోగాభ్యాసంలో సాధించవలసిన ప్రాథమిక అంశము.

నీవు చెపుతున్న ఈ ద్వేషం భయం వల్ల కలుగుతుంది. భయమేలేకపోతే, అది ఉండదు. ఇటువంటి భయమనేది కారణజనితం కాక సహజాతం. అది జాతికి సంబంధించినది, మానవజాతి చైతన్యమునకంతటికీ చెందిన ఒక సహజాత సూచన. మానవజన్మ ధర్మం పాటించడంతో బాటు ఇటువంటి సాధారణ సూచనలు, జాతికి సంబంధించిన భావాలు, సంవేదనలు, సంఘాలు, సమాజాలు, ఆకర్షణలు, వికర్షణలు అన్నీ కూడా మనిషి స్వీకరిస్తాడు.

అయితే మరో దృక్పథంలో చూస్తే ఈ ఆకర్షణ, వికర్షణలనేవి ప్రత్యేక వ్యక్తిత్వానికి సంబంధించి ఉండటం కనిపిస్తుంది. ఇవి అందరిలోనూ ఒకే విధంగా ఉండవు, వారి వారి ప్రాణికస్పందనలను బట్టి వేర్వేరుగా ఉంటాయి. కొంతమందికి ఈ పాములు మొదలైన వాటిని చూస్తే అసహ్యం లేకపోగా అవంటే ఇష్టపడతారు, వాటిపై ప్రాణికస్థాయిలో ఆకర్షణ, మక్కువ పెంచుకుంటారు.

ఈ ప్రపంచంలో ఇంపుగా లేనివీ, అందంగా లేనివీ అనేకమున్నాయి, అయితే ఎప్పుడూ వీటిని అసహ్యించుకుంటూ బతకాలని లేదు. మనసును కించపరుస్తూ, విసిగిస్తూ, భయపెట్టి, బలహీనపెట్టే భావాలను చక్కగా అధిగమించవచ్చు. ముఖ్యంగా యోగులైన వారు ఇటువంటి ప్రతిచర్యలను అధిగమించవలసిందే; యోగ మార్గంలో ఉన్నప్పుడు సమస్త జీవాలమీదా, సంఘటనలపైనా, వస్తువులపైనా సంపూర్ణ సమభావాన్ని ఏర్పరచుకోవటమే మొదటి సాధన. సర్వదా నిశ్చలంగా, ప్రతిదీ పట్టించుకోకుండా సుస్థిరంగా నిలబడటంలోనే ఒక యోగికి బలం ఉంటుంది. పూర్తి నిశ్చలత్వంతో ప్రశాంత చిత్తంతో ఉన్నట్లయితే భయంకర, క్రూర జంతువులు కూడా నీ ముందు నిర్వీర్యమైపోతాయి.

జుగుప్స ఒక అజ్ఞాన చలనము. అది ఆత్మరక్షణకై కలిగే సహజాతచర్య. అయితే నిన్ను కాపాడేది మాత్రం ఈ విధమైన అహేతుక ప్రతిస్పందన కాదు. ఆ

అపాయాన్ని గురించిన పూర్తి పరిజ్ఞానం, దాన్ని రూపుమాపటానికిగానీ, తొలిగించడానికిగానీ కావలసిన సాధనాన్ని తెలుసుకొని దాన్ని చైతన్యవంతంగా ప్రయోగించాలి, ఇటువంటి అజ్ఞాన సంచలనం సాధారణ మానవులకి కలుగుతుంది, దాన్ని జయించటం కష్టం కాదు; మనం ఆ విధంగా మొరటు మానవ స్వభావం కలిగిన బాహ్యసత్తకు కట్టుబడిలేము.

చైతన్యం వృద్ధి చెందుతుంటే అజ్ఞానం పటాపంచలవుతుంది. నీకు కావలసిందల్లా చైతన్యమే, స్నిగ్ధ, సరళచైతన్యం, అత్యధిక చైతన్యం పరిపూర్ణమైన చైతన్యపు కాంతిలో ప్రతిదీ ఉన్నది ఉన్నట్లు కనిపిస్తుందే తప్ప అవి కనబడాలనుకున్నట్లుకాదు. విషయాలు జరుగుతుండగానే తెర మీద కనపడినట్లు ఉన్నది ఉన్నట్లుగానే కనిపిస్తాయి. ఏది కాంతివంతంగా ఉన్నదో, ఏదినల్లగా ఉందో, ఏది తిన్నగా ఉందో, ఏది వంకరగా ఉందో అన్నీ నీవు చూడగలవు. నీ చైతన్యమే ఒక తెరగా, ఒక అద్దముగా అవుతుంది. అయితే ఇదంతా నీవు ధ్యానావస్థలో ఒక పరిశీలకునిగా ఉన్నప్పుడే జరుగుతుంది. నీవు చలాకిగా ఉన్నప్పుడు అది ఒక వెతకటానికి ఉపయోగించే దీపము లాగా ఉంటుంది. నీవు దేన్నైనా, ఎక్కడైనా కాంతిలో, పరీక్షగా చూడాలనుకుంటే మరతో దీపకాంతిని దానిపైకి ప్రసరింపచేసి చూడాలి.

ఈ విధమైన పరిపూర్ణ చైతన్యాన్ని పొందాలంటే ప్రస్తుతమున్న గాడిలో నుంచి, పరిమితులలోనుంచి దాన్ని బయటకు తీసి తెలియచెప్పి, ఉచ్ఛ్రలనంగావించి దివ్యకాంతి దానిలో ప్రసరించి పూర్తి స్వేచ్ఛతో పనిచేసేటట్లుగా దానిని తయారు చేయాలి. ఆ దివ్యకాంతి నీలో నిరాటంకముగా, సంపూర్ణంగా పని చేయాలంటే నిన్ను బంధించి, మందమతిని చేసే తృష్ణలను, భయాలను పారద్రోలాలి; మానసిక వివక్షతలు, పక్షపాతాలు, దుశ్శంకలు, ఆకర్షణలు ఉండరాదు.

వికర్షణ ఒక దుర్బలత్వజనితమే. నిన్నేదైనాతాకి, బాధించినప్పుడు దానితాకిడికి ప్రతిచర్యగా ఇది కలుగుతుంది. ఒక జీవినుండి గానీ, ఒక మనిషి, జంతువు లాటి దేన్నుంచైనా ఉద్ఘాతమై వెలువడే ఉత్పాదనలు నీకు

హానికరంకావచ్చు; నీకే సూటిగా తగలవచ్చు. మిగతావారికి తగలక పోవచ్చు. అటువంటప్పుడు నీవు కుంచించుకుంటావు. దృఢంగా ఉన్నట్లయితే అవి నీ దాకా రాకుండా దూరం నుంచే వాటిని ఆపగలవు. నీకు ఏదో అపాయం కలుగబోతున్నట్లు నీవు చూసి వెంటనే గ్రహించగలుగుతావు. వెంటనే నీ చుట్టూ ఒక రక్షణ వలయాన్ని ఏర్పాటు చేసుకుంటావు. ఆ అపాయం నీ దగ్గరకు వచ్చినా నిన్నేమీ చేయలేదు. దాని ఉనికి వల్ల ఏ మాత్రం చలించకుండా క్షేమంగా ఉంటావు.

- శ్రీమాత

అనువాదం : అమరవాది ప్రభావతి

అమరవాది వెంకటరామశాస్త్రి

భయము, యోగము కలియవు

నీవు యోగసాధన చేయాలంటే భయము నుండి విముక్తి పొందాలి. యోగము, భయము కలిసి ఉండవు.

★ ★ ★

నీవు దేనిని గూర్చి భయపడుతుంటావో, దానిని దీటుగా ఎదుర్కొగలిగి, తన్మూలంగా కృంగిపోకుండా తేరుకునే వరకు, అది నీకు తారసపడుతూనే ఉంటుంది. అది దాని నైజము. భగవంతునిపై భారం వేసి, భయాన్ని అధిగమించుటను అలవరచుకోవాలి. విషయాలు విషాదకరమే కావచ్చు. ప్రతికూలమేకావచ్చు. దైవ సహాయంపై గట్టి నమ్మకముంచి వాటిని దాటుట నేర్చుకోవాలి. అట్టి విషమ పరిస్థితులలో కూడతోడ్పడి, అన్వేషకుని గమ్యానికి చేర్చగల శక్తి ఒకటుంది.

★ ★ ★

భయంతోగానీ, విచారంతో కుమిలిపోతూగాని, పురోభివృద్ధి సాధిస్తాననుకొనుట, పొరపాటు. భీతి సదా వర్జనీయము. కారణం, నీవు దేనిని గురించి భయపడుతున్నావో అదే నీకు దాపురిస్తుంది. భయమెప్పుడు, భయపడేదానినే ఆకర్షిస్తుంది. విచారం నిస్సత్తువను కలుగచేస్తుంది. మరింత

విచారాన్ని కలుగచేస్తుంది.

విషయాలను అల్పజ్ఞానంతో తేలికగా తీసుకోకుండానే, శాంతంగా సంతోషంగా, ఉల్లాసంగా ఉండగలగాలి. ఆ ఆనందం నీలో ఎలాంటి మౌలిక పరమైన మార్పును కలిగించనవసరం లేదు. నీవు చేయవలసిన దానినంతా శ్రద్ధతో మెలకువగా గమనిస్తుండాలి. దానిపట్ల జాగరూకతతో మెలుగుతుండాలి. తప్పడు పనులకు తావివ్వకూడదు. అజ్ఞానము, అస్పష్టతల్లాంటి పాత పాతపాడుపడిన భావనలు పునరావృతం కాకుండా మెలకువ వహించాలి. మెలకువగా నుండుట వలన నీకు అండగానున్న దివ్యశక్తి ఉధృతమవుతుంది. తత్కారణంగా ఒక ఆత్మ నిగ్రహ శక్తి ఉదయిస్తుంది. తప్పడు మలుపులు, తప్పడు ప్రతిస్పందనలు నిరసించినపుడు వాటిని నిరాకరించగల శక్తి కలుగుతుంది. భయంకాని, దుఃఖం కాని వాటిని నీదరి చేరనీయవు. ఇట్టి మెలకువకు తోడు, ఆధారభూతమైనట్టు మరియు మార్గదర్శకమైనట్టి దివ్యశక్తికి తెరుచుకొని యుండుట మూలంగానే అది సాధ్యపడుతుంది.

(భయాన్ని పోగొట్టే మార్గాలు) శక్తిని, నిశ్చలతను అధో ప్రాణిక స్థావరానికి దించుట వలన (నాభికి క్రింద నుండే ప్రాణిక భాగము) భయం కలిగినప్పడు సంకల్పించుట ద్వారా మరియు శారీరక ప్రకృతిని నిశ్చలంగా ఉంచే విధంగా నియంత్రించుట ద్వారా ఇంకా ఈ రెండు మార్గాలలో ఏదో ఒక దానిని పాటించుట ద్వార గాని లేదా రెండింటిని జతగా పాటించుట ద్వారా గాని, ఇది సాధ్యపడుతుంది.

- శ్రీఅరవిందులు

జీవితంలో అవచేతన వలన జరిగే కార్యాచరణకే అధిక భాగమున్నది. చైతన్య ప్రచోదిత భాగాలు నిర్వహించే దాని కన్నా వందరెట్లు అధిక శక్తివంతంగా పనిచేస్తుంది. సాధారణ మానవ జీవన స్థితి, అనుమానంతోను, భయంతోను నిండి వుంటుంది. నీ మనస్సును పది నిమిషాల పాటు స్థిరంగా గమనించితే, ఆ పదిలో తొమ్మిది, భయంతో నిండి వుంటాయి. అందులో ఎన్నో విషయాలను గురించిన భయాలు, చిన్నవి పెద్దవి, దగ్గరివి దూరపువి, కనిపించేవి కనపడనివి. మామూలుగా వీటిని అంతగా పట్టించుకోకపోయినా కూడా, ఆవిధంగానే వుంటుంది. అన్ని భయాల నుండి విముక్తి, దీర్ఘ ప్రయత్నం మరియు క్రమశిక్షణ

ద్వారా మాత్రమే లభిస్తుంది.

క్రమశిక్షణ మరియు ప్రయత్నం ద్వారా మనస్సుకు, ప్రాణికమునకు భయాందోళనల నుండి విముక్తిని సాధించగలిగినా, శరీరాన్ని అందుకు ఒప్పించుట ఎక్కువ కష్టం. కాని అది కూడ చేయవలసిన పనే. ఒకసారి యోగ మార్గంలోప్రవేశించితే, అన్ని భయాలను వదిలించుకోవాలి. - మానసిక భయాలు, ప్రాణిక భయాలు, దేహ కణాల్లో నాటుకొని వున్న శారీరక భయాలు. యోగ మార్గంలో నీకు తగిలే తాకిడుల వల్ల, దెబ్బల వల్ల కలిగే ఎన్నో ప్రయోజనాలలో, అన్ని భయాల నుండి విముక్తిని పొందుట ఒకటి. నీ భయానికి కారణాల పట్ల స్వేచ్ఛగా, విముఖతతో, నిర్వికారంగా, నిర్మలంగా వుండి వాటిని ఎదిరించి దృఢంగా నిలువరించగలిగే వరకు, అవి నీపైకి లంఘిస్తూనే వుంటాయి. ఒకనికి సముద్రమంటే భయం, మరొకనికి అగ్ని అంటే భయం. ఈ రెండో వానికి, అగ్నిని చూచినా వాని దేహంలో ఒక్క కణమైనా చలించనంత తీవ్ర శిక్షణ గరిపేటంత వరకు, కార్చిచ్చుపై కార్చిచ్చు ఎదురవుతున్న భావనలకు లోనవుతుంటాడు. నీ భయానికి ఏది మూలమో, అది పోయేటంత వరకు పునరావృతమవుతునే వుంటుంది. ఎవరైతే పరివర్తనను ఆశించి యోగమార్గాన్ని అనుసరిస్తారో, వారు పూర్ణంగా నిర్భయులు గావాలి. ఎంతగానంటే, వారి ప్రకృతికి సంబంధించి ఏ అణువైన, దేని వల్లనైన, వికారానికి లోను కాకూడదు, చలించబడకూడదు.

ఈ భయం యోగమార్గాన్ని అనుసరించే ప్రయత్నంలో నరముల బలహీనత మరియు ప్రాణిక నిస్సత్తువ వలన ఏర్పడుతుంది. ఈ భయాన్ని తప్పనిసరిగా వదిలించుకోవాలి.

దేనిపైనైనా ఏకాగ్రతకై ప్రయత్నించినపుడు, ఊపిరి ఆగిపోయి నట్లనిపిస్తుంది. ఆ కారణంగా నీవు భయపడతావు. అంత భయస్తుడవైతే, ఈ మార్గంలోకి ప్రవేశించకు, ఏదో చెడు జరిగిందే అనుకో; అప్పుడు జరిగేదేమిటట? నీవు చనిపోవచ్చు - ఆ తరువాత ? నీవు చనిపోతే మాత్రం అంత పెద్ద హాని ఏం జరుగుతుంది ? మన యోగసాధన పిటికిపందలకు కాదు; నీకు ధైర్యం లేకపోతే, వదిలి పెట్టడం ఉత్తమం, నీ భయాలు ఉపద్రవాలను తెస్తాయి.

యోగ సాధనవల్ల కలిగే వత్తిడుల కారణంగా, శారీరక సంచలనాలు ఏర్పడతాయి. అవి కొన్నిసార్లు అకారణ భయాలను కలిగిస్తాయి. అట్టి భయాలను నిరాకరించకపోతే, అవి హానికరం కావచ్చు. ఉదాహరణకు, శిరస్సులో ఒక విధమైన వత్తిడి కలుగుతుంది. అది సమస్యాత్మకంగా ఉంటుంది. ఆ అనుభవం చాలామందికి, ముఖ్యంగా ప్రాధమిక దశలో ఉన్మీలనం లేకపోవటం వల్ల కలుగుతుంది. అది కేవలం ఒక అసౌకర్యమే. అది దేనికీ దారి తీయదు. ఏ శక్తుల కోసం నీవు ఉన్మీలుడవు కావాలనుకున్నపుడు అవి ఒక ఫలితాన్ని సమకూర్చుటకై నీ శరీరంపై గట్టిగా పనిచేయునప్పుడు మరియు పరివర్తనను వేగవంతం చేయునప్పుడు కలిగే వత్తిళ్ళ కారణంగా అది సంభవిస్తుందని తెలుసుకోగలిగితే, దాని నుండి సులభంగా తేరుకోగలవు. అలజడి చెందకుండా స్వీకరించగలిగితే, ఆ అనుభవం అంత అసౌకర్యమేమి కాదు. భయభ్రాంతుడవైతే మాత్రం అత్యంత బాధాకరమైన తలనొప్పిగా మారటం ఖాయం. అంతేకాదు, అది జ్వరానికి కూడ దారి తీయవచ్చు. ఈ అసౌకర్యం స్వభావంలో ఏదో అవరోధం ఏర్పడినందువలన కలుగుతుంది. ఆ ప్రతిబంధకం నుండి విముక్తి నెలా పొందాలో తెలుసుకుంటే, తక్షణమే తొలగించుకోవచ్చు. భయపడ్డావంటే మాత్రం, అది మరింత విషమించవచ్చు. నీకు కలిగే అనుభవం ఏలాంటిదైనా, భయానికి తావి వ్వకూడదు. ఒక దృఢ నమ్మకాన్ని కలిగివుండాలి. ఏం జరిగినా, జరగవలసిందే జరుగుతుందని భావించాలి. ఒకసారి ఈ మార్గాన్ని ఎంచుకున్నావంటే, అందువల్ల ప్రాప్తమయ్యే పరిణామాలన్నీ ధైర్యంగా స్వీకరించాలి. ఒకమారు ఎంచుకొని, తరువాత వెనుకంజవేసి, మళ్ళీ ఎంచుకొని మళ్ళీ తిరోగమిస్తూ, మాటి మాటికి అటు ఇటు ఊగిసలాడుతూ, అనుమానిస్తూ, సర్వదా భీతి చెందుతుంటే, నీ అస్తిత్వంలో ఒక అసమ్మతిని సృష్టించుకుంటావు. అది నీ పురోభివృద్ధిని క్షీణింప చేయుటయేగాక, మానసిక మరియు ప్రాణిక అస్తిత్వంలో అన్నిరకాల సంక్షోభాలకి, శారీరక బాధలకు, రుగ్మతలకు మూల కారణం అవుతుంది.

- శ్రీమాత

అనువాదం : అందుగులపాటి కైలాసపతి, జానకి.

భయం - అస్వస్థత

నీవు భయపడకూడదు. నీకు కలిగే యిబ్బందులు చాలా వరకు భయం వల్లే సంభవిస్తాయి. వాస్తవానికి, తొంభై శాతం అస్వస్థతలు దైహిక అవచేతనలోని భయం ఫలితంగానే సంభవిస్తాయి. భౌతిక అనారోగ్యం గురించి సాధారణ దైహిక చేతనలో, కొంచెం హెచ్చు తగ్గులుగా, ఒకరకమైన బెంగ దాగివుంటుంది. భవిష్యత్తును గురించి "ఏం జరుగుతుందో" అనే అనుమానం రూపంలో వుంటుంది. ఇదిగో ఈ బెంగనే నిలువరించాలి. దైవకృప మీద నిజమైన నమ్మకం లేకపోవడమే ఈ బెంగకు కారణం. నీ ఆత్మనివేదన అసంపూర్ణం, అపరిపూర్ణం అనే దానికిది తిరుగులేని ఉదాహరణ.

నీలో వివేకం కలిగిన భాగం దైవకృప మీద పూర్తి విశ్వాసం కలిగి వుండవలసిన ఆవశ్యకతను గురించి, అవచేతన నుండి భయం తలెత్తినప్పుడల్లా దానికి నొక్కి చెప్పాలి. దైవకృప మనలోనూ, సర్వంలోనూ అత్యున్నత శుభపరిణామానికే నిశ్చయంగా పని చేస్తున్నదని నొక్కి చెప్పాలి. దైవేచ్ఛకు పూర్తిగా ఏ మినహాయింపులు లేకుండా విధేయం కావాలని నొక్కి చెప్పాలి.

అంతస్తత్వంలో తాను దైవమేనని, దైవకార్యం సాగే మార్గానికి ఆటంకం లేకుండా చేస్తే, మనకేదీ అపకారం కలిగించలేదని దేహం తెలుసుకోవాలి, అది నమ్మేట్లు చేయాలి. భయం తిరిగి తిరిగి యెన్నడూ తలెత్తకుండా ఆగిపోయేంత వరకూ ఈ ప్రక్రియ స్థిరంగా కొనసాగాలి. అస్వస్థత తిరిగి తలెత్తకుండా సంపూర్ణంగా జయించబడే లోపు అది తలెత్తినా దాని బలం, అది మనలో తిష్ఠ వేసేకాలం, క్రమంగా తగ్గిపోతాయి.

భౌతిక అస్వస్థత కలిగినపుడు భయపడకూడదు. దాని నుండి పారిపోగూడదు, ధైర్యంతో, స్థిరచిత్తంతో, దృఢనమ్మకంతో దాన్నెదుర్కోవాలి. అస్వస్థత అసత్యమనీ, పూర్ణనమ్మకంతో, సంపూర్ణ ప్రశాంతితో దైవకృప వైపు తిరిగితే, అది ఈ జీవకణాల్లో కుదురుకొని, అస్తిత్వపులోతుల్లో ప్రతిష్ఠితమౌతుంది. అపుడు జీవకణాలే స్వయంగా శాశ్వత దివ్యసత్యంలో, దివ్యానందంలో పాలుపంచు కొంటాయి.

★ ★ ★

భయమే నిజమైన జబ్బు. నీ భయాన్ని పారద్రోలుకో, జబ్బు మాయమౌతుంది.

★ ★ ★

నీకు జబ్బు చేస్తే, ఆ జబ్బును ఎంతో ఆత్రుతతో, భయంతో గమనిస్తావు. నీకు సాయం చేయగల ఏకైకుని నుండి సాయం కోరడం కూడా నీవు మరచిపోయేంతగా నిన్ను గురించి నీవు ఎంతో జాగ్రత్త తీసుకుంటావు. నీవొక విషయ వలయంలో పడి నీ అస్వస్థత మీద నీలో నీకే ఒక అవాంఛనీయ ఆసక్తి ఏర్పడుతుంది.

★ ★ ★

అమ్మా ! జబ్బు చేస్తుందని ఒక వ్యక్తి ముందుగా గ్రహించినపుడు దాన్నతడెలా నివారించాలి?

ఆహ్! అన్నింటికంటె ముందు, దాన్ని నీవు కోరకుండా వుండాలి. అంతేగాదు దేహంలో ఏదీ కూడా దాన్ని కోరగూడదు. జబ్బు పడగూడదనే ఒక బలమైన సంకల్పం నీకుండాలి. నీలో వుండవలసిన మొట్టమొదటి షరతు ఇది. సమచిత్తంకి సంబంధించిన వెలుగును, శాంతికి సంబంధించిన వెలుగును నీవు ఆవాహన చేయడం రెండో స్థితి. ప్రశాంతత, సమతూకం కలిగి వాటిని నీదేహ కణాలలోనికి, భయపడకూడదని వత్తిడి చేస్తూ ప్రవేశపెట్టడమనేది మళ్ళీ మరో స్థితి.

ప్రప్రథమంగా జబ్బును కోరకూడదు, ఆ తరువాత జబ్బుకు భయపడగూడదు. దానిని ఆకర్షించనూగూడదు, దాన్ని చూసి వణికి పోనూగూడదు. ఎట్టి పరిస్థితులలోనూ నీవు అస్వస్థతను ఆహ్వానించగూడదు. అంటే భయపడి కోరుకోకపోవడం గాదు. దానికి భయపడగూడదు. దైవకృప యొక్క శక్తి, సమస్తం నుండి నీకు రక్షణ కలిగించి ఆశ్రయమిస్తుందనే సంపూర్ణ విశ్వాసం, ఒక ప్రశాంత నిశ్చయభావం నీకుండాలి. అస్వస్థతతో ఏ మాత్రం సంబంధంలేని మరేదైనా విషయాన్ని గురించి ఆలోచించు. నీ సంకల్ప మంతటిలో అస్వస్థతను నిరాకరిస్తూ, దేహ కణాల్లో భయాన్ని సంపూర్ణంగా

తుడిచిపెట్టే ఒక దృఢ నమ్మకాన్ని చొప్పించడం, జబ్బు ఉన్నదనే విషయాన్నే మాత్రం ఆలోచించకుండా దాన్ని మరచిపోయేట్లు మరేదో వ్యాపకంతో నీకు నీవు తీరిక లేకుండా చేసుకోవడం, అనే రెండు విషయాలున్నాయి. వాటినెలా సాధించుకోవాలో నీకుతెలిస్తే, అంటురోగాలు కల మనుష్యులతో సంబంధం కలిగినా, నీకు అవి అంటవు. కాని ఇదేలా సాధ్యమో నీకు తెలిసుండాలి.

చాలామంది "నాకేం భయంలేదు" అంటుంటారు. వాళ్లకు మనస్సులో భయం వుండదు, వారి మనస్సు భయపడదు, అది చాలా గట్టిది అందుకని భయపడదు. కాని శరీరం వణికిపోతుంది, అది వాళ్లకే తెలియదు. ఎందుకంటే ఆ వణుకు సంభవించేది దేహకణాల్లో, దేహం ఒక భయంకరమైన ఆత్రుతతో వణికిపోతుంది. ఇదే జబ్బును ఆకర్షిస్తుంది. అదిగో, అక్కడ నీవు క్రియాశక్తిని, పరిపూర్ణశాంతికి సంబంధించిన పరమప్రశాంతతను, దైవకృప యందు నిరపేక్ష విశ్వాసాన్ని నిలపాలి. ఏదేమైనప్పటికీ ఈ భౌతిక ప్రపంచమంతా రోగాల మయం, పైగా అవి అంటురోగాలు, రోగంతో వున్న మనిషితో సంపర్కం కలిగితే, అతని క్కూడా ఆ రోగం తప్పకుండా సోకుతుందని, ఒకసారి గనుక అది అంటుకొంటే, ఆంతరిక పద్ధతులు భౌతికం మీద పనిచేయలేవు, అనేటటువంటి సూచనలు సర్వత్రా సామాజిక వాతావరణంలో బాగా నిండివుంటాయి. వాటినీ, తదితరాలైన మౌఢ్యాలన్నింటినీ అటువంటి క్రియాశక్తితో నీ ఆలోచనల నుండి తరిమివేయక తప్పదు. ఒకరి నుండి మరొకరికి ప్రసారమయ్యే సార్వత్రిక సూచనలివి. ఇద్దరు ముగ్గురు వైద్యులు కూడా అక్కడుండడం యాదృచ్ఛికంగా తటస్థిస్తే, ఇహ చెప్పనక్కరలేదు, వాతావరణమంతా భయంకరంగా తయారౌతుంది. (నవ్వులు)

సాధారణంగా అనేక సందర్భాల్లో, మామూలుగా, భయం - అది మానసిక భయం గావచ్చు, ప్రాణిక భయం గావచ్చు, కాని దాదాపు అన్ని సందర్భాల్లోనూ భౌతిక భయం, జీవకణాల్లోని భయం - సర్వ అంటు రోగాలకు ద్వారం తెరుస్తుంది. స్వీయనియంత్రణ కలిగినవారూ లేదా ఏవిధమైన మానవ హుందాతనం వున్నా వారూ దానిని లేకుండా చేసుకోవచ్చు. ప్రాణిక భయం ఇంకా సూక్ష్మమైనది. దానిని లేకుండా చేయాలంటే ఇంకా అధికతరమైన నియంత్రణ కావాలి. భౌతిక

భయాన్నధిగమించాలంటే నిజమైన యోగం అవసరం. ఎందుకనంటే దైహిక జీవకణాలు, దుఃఖం, బాధ కలిగించే దేనికైనా, చెప్పకోదగినంతగా లేకపోయినా, అలజడి చెందుతాయి. దుఃఖపరిస్థితి వాటికిష్టముండదు. దానినధిగమించాలంటే సచేతన సంకల్పంతో నియంత్రించడం అవసరం. మామూలుగా ఇటువంటి భయమే అస్వస్థతకు ద్వారం తెరుస్తుంది. మొదటి రెండు రకాల భయాన్ని గురించి నేను చెప్పడం లేదు. దానిని నేను చెప్పినట్లు మనిషి అనే పదానికుండే గంభీరమైన అర్థంలో, జీవించే ఏ మానవుడైనా అధిగమిస్తాడు, ఎందుకనంటే అలా భయపడటం పిరికితనం అవుతుంది. కాని భౌతికమైన భయాన్ని అధిగమించడం చాలా కష్టం. ఆ భయం లేకపోతే అత్యంత తీవ్రమైన దాడులను గూడా త్రిప్పి కొట్టవచ్చు. దేహం మీద కనీస నియంత్రణైనా వుంటే, భయం వల్ల కలిగే దుష్ఫలితాలను తగ్గించవచ్చు. అలా తగ్గించుకొన్నంత మాత్రాన, దానిని జబ్బులకతీతస్థితిగా చెప్పలేం. వస్తుద్రవ్యంలో గల ఈ విధమైన భయకంపనం, దేహ కణాల్లోని భౌతికమైన భయం, సమస్త అస్వస్థతలను ఇనుమడింపజేస్తాయి.

కొంతమంది తమ దేహాలలో సైతం ఈ విధమైన భయం నుండి అప్రయత్నంగానే స్వేచ్ఛ కలిగి వుంటారు. భయం లేకపోవడానికీ భయపడక పోవడానికీ తగినంత ప్రాణిక సమతుల్యత వాళ్లకుంటుంది. వారి భౌతిక జీవన లయగతిలో ఒక సహజ సామరస్యత ఉంటుంది. అదే వారి అస్వస్థతను కనీస స్థాయికి అప్రయత్నంగా తగ్గించి వేస్తుంది. అలాగాక ఇంకా కొంతమంది వున్నారు. వాళ్ల విషయంలో పరిస్థితులెంత అధ్వాన్నంగా తయారు కాగలవో అంతగా తయారవుతాయెప్పుడూ. కొన్ని సందర్భాల్లో విపత్కరస్థితి దాకా గూడా దిగజారిపోతాయి. ఇదొక విస్తృతమైనశ్రేణి, దీన్నంతా సునాయాసంగానే చూడవచ్చు. వాళ్లలో నీ జీవనగమనానికి సంబంధించిన ఒక విధమైన సుఖప్రద లయమీద ఇది ఆధారపడివుంటుంది. అది బాహ్యం నుండి అస్వస్థత చేసే దాడులను నిరోధించగలిగిన సామరస్యతతోనైనా నిండివుంటుంది. లేదా అసలే లేకుండానో లేదా చాలినంత శక్తిలేనిదైనా అయివుండి వుంటుంది. సామరస్యత స్థానంలో భయప్రకంపనాలు చోటు చేసుకుంటాయి. ఏమాత్రం విషాదకర

సంస్పర్శనైనా ఎంతగానో బాధకలిగించే, హాని కలిగించేదిగా మార్చివేసే పరితాపం చోటు చేసుకొంటుంది. అత్యంత దారుణమైన అంటురోగాలు, మహోపద్రవాల మధ్య నుండి పయనించినా ఏమీ అంటకుండా బయటపడే వాని దగ్గర్నుండి, ఏకాస్త దానికైనా కూడా జబ్బుపడిపోయే వాని దాకా ఎంతో విస్తృతమైన శ్రేణి వుంది. అందుచేత అది సహజంగానే వ్యక్తి యొక్క దైహిక నిర్మాణం మీద స్వభావం మీద ఆధారపడివుంటుంది. అందుచేత అతను పురోభివృద్ధి కోసం ప్రయత్నించాలనుకోగానే, ఆ పురోభివృద్ధి తన మీద తాను సాధించిన నియంత్రణ మీద ఆధారపడి ఉంటుంది. అతని దేహం, ఉన్నత దివ్య సంకల్పం యొక్క విధేయ పరికరంలాగా తయారయ్యే వరకు ఇలా జరుగుతుంది. ఆ దివ్య సంకల్పంతో సమస్త దాడులను నిరోధించే శక్తిని పొందాతారు.

కాని భయాన్ని రూపుమాపుకోగలిగితే అతడు దాదాపు పూర్తి రక్షణలో వున్నట్లే, ఉదాహరణకు, విపత్తులు లేదా మనం విపత్తులు అని పిలుచుకొనే, ప్రస్తుతం చెలరేగుతున్నటువంటివి, నూటికి తొంభైతొమ్మిది భయంవల్లే సంభవిస్తున్నాయి. అత్యంత క్షుద్రరూప భయాన్ని వార్తాపత్రికల వ్యాసాలు,వదంతులు, తదితరమైనవి పెంచి పోషిస్తున్నాయి.

ప్రశ్న: భయం మనిషికి కీడు కలిగిస్తుందా?

అవును. భయంతో ఒక వ్యక్తి కలరా పాల్పడటం నాకు తెలుసు. పొరుగింట్లో కలరావుంది, అతడెంతో భయపడి పోయాడు, దానితో అతడు మరే కారణం లేకుండానే జబ్బుపడ్డాడు. అతడికది సోకడానికి మరే ఇతర కారణం లేదు, కేవలం భయంవల్లే అలా జరిగింది. సార్వత్రిక విపత్సమయాల్లో అధికులకది వ్యాపించడానికి భయమే కారణం. భయం ద్వారా నీలో ద్వారం తెరచుకొంటుంది, నీకు జబ్బు పట్టుకొంటుంది. భయంలేని వాళ్ళు స్వేచ్ఛగా సంచరిస్తారు. సాధారణంగా వారికేం అంటదు. కాని నేను పైన చెప్పినట్లు నీమనసులో భయంలేకపోవచ్చు, నీ ప్రాణికంలో సైతం భయంలేకపోవచ్చు, కాని దేహంలో భయం లేనిదెవరికి? .... చాలా కొద్ది మందికి.

దేహానికి భయంలేకుండా చేయాలంటే ఒక కఠినమైన శిక్షణ అవసరం.

శిక్షణ ద్వారానే, యోగం ద్వారానే ఈ భయాన్నధిగమించవచ్చు. కాని భయం ద్వారా ఏదైనా సరే పట్టుకొంటుంది, చివరకు దుర్ఘటనను కూడా ఆహ్వానించి, అందుకు గురయ్యే ప్రమాదముంది.

శ్రీమాత

అనువాదం : కె.వి. రావు

పీడకలలు - ప్రాణికలోకం

ప్రాణిక జీవులు భౌతిక ప్రపంచానికి ఊర్ధ్వంగా మసులుతూ ఉంటాయి. ఇక్కడ మానవులు ప్రవేశించటం సంభవిస్తే నిస్సహాయంగా, రక్షణ లేకుండా, అగమ్యగోచరంగా ఉన్నట్లుగా ఉంటారు. భౌతిక శరీరంలో ఉన్నప్పుడే మానవునికి క్షేమం, సుఖం. కొంతమందికి శరీరం అంటే గొప్ప అసహ్యం. మరణించి శరీరంవదిలిపెట్టి ఉండటంలోనే ఎంతో హాయి అనుకుంటారు. నిజానికి శరీరం నీకు రక్షణ కవచం. అందులో నీవు నివాసియై ఉన్నప్పుడు ప్రతికూల శక్తులు నిన్ను వశం చేసుకోలేవు. వాటికది అసాధ్యమవుతుంది. పీడకలలు అనేవి ఏవి? ప్రాణిక లోకంలో నీకివి రక్షణ దళాలు. నీవు పీడకల పిడికిలిలో చిక్కుకుని ఉన్నప్పుడు నీవు మొదట ఏమి చేయటానికి ప్రయత్నిస్తావు? వెంటనే నీ శరీరంలోనికి ప్రవేశిస్తావు. సాధారణ భౌతిక చైతన్యంలోనికి వేగంగా కదిలిపోతావు. ప్రాణికశక్తుల తాలూకు లోకంలో నీవు పరాయి వాడివి. దిక్సూచి చుక్కానిలేని అగమ్యనావికుడవి.

★ ★ ★

స్వప్నావస్థలో నీవు ప్రాణిక లోకపు దేశకాలాలలో ఉంటావని గుర్తుంచుకోవాలి. భౌతిక శరీరంలో ఉన్నట్లు నీవు వ్యవహరించకూడదు. అక్కడ నెలకొని ఉన్నటువంటి విషయ పరిజ్ఞానం కనుక నీ కంటే నిన్ను భయపెట్టి కలవరపర్చే ప్రాణికజీవులవల్ల నీకువచ్చే భీభత్సమైన పీడకలలతో పటిష్ఠంగా వ్యవహరించగలుగుతావు. ప్రాణిక సంబంధమై దేశకాలాలలో కార్యకలాపాలు విలక్షణంగా ఉంటాయి. అందులో ఒకటి-ఆ జీవులు కావలసినపుడు బ్రహ్మాండమైన ఆకృతులు దాల్చి గొప్ప భీభత్సాన్ని నీలో సృష్టించగలవు. నిన్నుపట్టి

ఆవహించే శక్తివంతమైన వాటి సాధనలలో ఇదొకటి. భయభ్రాంతులు సృష్టించే వాటి శక్తిని నీవు తప్పక గర్తుంచుకొని, భయాన్ని వదుల్చుకోవాలి. ఒక్కమారు నువ్వు వాటిని తిరుగులేని ధైర్యంతో ఎదుర్కొని వాటిని ముఖాముఖి ఢీ కొన్నప్పడు అవి తమలోని మూడు వంతుల శక్తిని కోల్పోతాయి. మా సహకారం కూడా అభిలషిస్తే మిగిలినది కూడా పోతుంది. అపుడిక అవి పలాయనాన్ని చిత్తగించటమో, మాయమైపోవటమో జరుగుతుంది. నా స్నేహితుడొకాయన రాత్రిళ్లు ప్రాణిక శరీరంలో బయటికి వెళ్లేవాడు. అలా వెళ్లినపుడల్లా ఆయనొక బ్రహ్మరాక్షసిలాటి పెద్దపులిని యెదుర్కొనేవాడు. ఫలితంగా రాత్రంతా ఆయనకి కాళరాత్రే ఆయేది. అతనికి చెప్పాను భయాన్ని పూర్తిగా పారద్రోలి ఆ క్రూరజంతువును నేరుగా యెదుర్కొను. దాని కళ్లలోకి సూటిగా చూడు. అవసరమైతే మా సహాయాన్ని అభ్యర్థించు. అతనలానే చేశాడు. ఓ! మరేముంది! ఆ పులికాస్తా పిల్లిగా దిగజారిపోయింది!

ఒక ప్రాణికజీవి కళ్లలోకి నిర్భయంగా తేరిపారజూసినపుడు పొందే అద్భుత ఫలితం గురించి నీకు Idea లేదుకానీ - ప్రాణికశక్తుల అవతారాలను మనం సాధారణంగా జంతువులంటాం. వాటితో కూడా ఈ విధంగా వ్యవహరిస్తే you are assured of easy mastery - నీకు స్వాధిపత్యం భద్రంగా సమకూడుతుంది. పాము నిన్ను కాటువేయలేదు - నీవు కనుక దాని దృష్టిని నీ ఏకాగ్ర దృష్టితో బిగిస్తే. కాని నీలో ఏకాస్తంత కూడా కంపం ఉండకూడదు. నీకాళ్లు వణకుతూంటే దానికళ్లలోకి తదేకంగా దృష్టి సారించినా ఫలితం ఉండదు. నీలో ఏమాత్రం అలజడి, కంపం ఉండకూడదు. అది తన పడగవిప్పి ఊగుతూ నిన్ను భయభ్రాంతం చేస్తూ మంత్రముగ్ధుణ్ణి చేస్తుంది. అపుడు నిన్ను నీవు కూడతీసుకొని నిశ్చలంగా ఉండాలి. మనుష్యులకళ్లలో ఉండే ఒకరకమైన తేజస్సు మృగాలకు తెలుసు. దానిని వాటిపై కేంద్రీకరిస్తే అవి దానిని భరించలేవు. మనుష్యుల చూపులో ఒకరకమైన శక్తి ఉంది. అది వాటిని నిర్వీర్యం చేస్తుంది. కాని ఆ ఏకాగ్రత నిర్భయంగా ఉండాలి.

చివరికి సంక్షిప్తంగా రెండు విషయాలు మనసులో ఉంచుకో. ఎట్టి పరిస్థితులలోను, ఎన్నడూ భయపడకు. నీశక్తిని శతాధికంగా పరిపూర్ణం కావించుకోవటానికి తగిన సహాయాన్ని అర్థించు.

- శ్రీమాత

అనువాదం : కర్రావెంకటేశ్వర్లు

విద్యాబోధనలో భయం యొక్క నిష్ప్రయోజనం

నీకు నీ బిడ్డకు మధ్య భయాన్ని రానీయకూడదు. భయం విద్యావిధానంలో హానికరమైనది. కపటాన్ని, కుయుక్తిని పన్నుటకు తప్పనిసరిగా భయం దోహదకారి అవుతుంది. సున్నితమైన, దృఢమైన వివేచనతో కూడిన అనురాగం మాత్రమే వలసినంత క్రియాశీల పరిజ్ఞానము, విశ్వాసము అనే అనుబంధాన్ని సృష్టిస్తుంది. ఇవి నీ బిడ్డకు సమర్థవంతముగా విద్య గరుపుటకు తప్పనిసరిగా కావలసి ఉన్నాయి.

ఆరోగ్యకరమైన అలవాట్లతో, పరిశుభ్రతను పాటించటం బిడ్డకు బాల్యము నుంచే తప్పక బోధించాలి. పరిశుభ్రతను పాటించటం, ఆరోగ్యసూత్రాలను గౌరవించటం మప్పుతూనే అనారోగ్యం, భయం బిడ్డలో లేకుండా జాగ్రత్త వహించాలి. భయం, విద్యావిధానంలో హేయమైన ఉపకరణం. భయం భయపడే దానిని ఆకర్షించే మార్గంకూడా. రోగం పట్ల నిర్భయంగా ఉంటూనే దానిపట్ల నిరాసక్తంగా ఉండాలి. తెలివైన వాళ్లు శారీరకంగా బలహీనులై ఉంటారనేది ఒక నానుడి. కాని అది ఆధారము లేని ఒక అపోహ మాత్రమే.

బిడ్డ తాను చేసే అల్లరికి పడేశిక్షకు భయపడక, అది తగని పని అని తెల్సుకొని తన అల్లరిని విరమించుకోవాలి.

మొదటగా అలా అతను నిజమైన పురోగతిని సాధిస్తాడు. తర్వాత భయం తన చైతన్యాన్ని నిమ్న స్థాయికి చేరుస్తుంది, అని, నీచస్థితికి దిగజారుస్తుంది అని తెలుసుకుంటాడు.

- శ్రీమాత

అనువాదం : త్రివేణి

మరణభీతి నివారించే నాలుగు పద్ధతులు

మనిషి ప్రగతిని నిరోధించే అన్నిటిలో అతిపెద్ద ఆటంకం భయం అని సాధారణంగా చెప్తూ వుంటారు. ఈ భయమనేది అనేక కోణాల్లో, అనేక రూపాల్లో వుంటుంది. స్వయం వ్యతిరేకత, తర్క విరుద్ధత, నిర్హేతుకత యిలా అనేక రకాలుగా వుంటుంది. తరచు నిర్హేతుకత కారణమవుతుంది. అన్ని భయాలలోకి అత్యంత

నిగూఢంగా, దృఢంగా వదలకుండా పట్టుకుని వుండేది మరణ భయం. ఇది మనిషి అవచేతనలో సులభంగా పెకలించడానికి సాధ్యంకానంత లోతుగా వేళ్ళుపాతుకుని వుంటుంది. ఇది స్పష్టంగా వాటిలో అవి అల్లుకుపోయిన అనేక అంశాలతో ఏర్పడి వుంటుంది. అవేమంటే సాంప్రదాయ స్ఫూర్తి, ఆత్మభద్రతాభావం, అలాగే నిరంతర చైతన్య భద్రతకోసం తెలియనిదంటే సంకోచం, వూహాతీతమయిన ముందుగా తెలియని దాని వలన కలిగే యిబ్బంది వీటన్నిటి వెనక జీవకణాలలో లోతుల్లో దాగిన సహజప్రవృత్తికి మరణం తప్పనిసరికాదు అన్న స్పృహవుంటుంది. ఆ స్పృహకి పరిస్థితులు అనుకూలించినట్లయితే మరణ భయం జయించ గలుగుతాము. ఏదేమైనా వాస్తవానికి భయమే స్వయంగా మరణ భయాన్ని జయించడానికి పెద్ద అడ్డంకి. దేనిని చూసి భయపడతాడో మనిషి దానినెప్పటికి జయించలేడు. మరణానికి భయపడేవాడు ఆ మరణం చేత అప్పటికే జయింపబడి వుంటాడు.

మనిషి ఈ భయాన్ని ఎలా అధిగమించగలుగుతాడు? దీనికి ఎన్నో పద్ధతులున్నాయి. అన్నిటికంటె ముందుగా కొన్ని ప్రాథమిక భావనలు మన ప్రయత్నానికి సాయపడతాయి. ప్రప్రథమంగా మనం తెలుసుకోవలసినది జీవం అంతా ఒక్కటే, అది శాశ్వతమైనది. దాని రూపాలు మాత్రం లెక్కలేనన్ని. అవి క్షణభంగురాలు, నీటి బుడగల్లా పగిలిపోయేవి. ఈ జ్ఞానం భద్రంగా, శాశ్వతంగా మనస్సులో ప్రతిష్టించుకోవాలి. సాధ్యమయినంత వరకు శాశ్వత జీవంతో వ్యక్తి తన చైతన్యాన్ని సమైక్యం చేయాలి. అది ప్రతిరూపంలోను స్వతంత్రంగా వుంటుంది. అంతేకాదు అన్ని రూపాల్లోను అభివ్యక్తమై వుంటుంది. ఈ భావన అత్యావశ్యకమయిన మానసిక ఆధారాన్నిచ్చి దానితో ఈ సమస్యని యెదుర్కొనేలా చేస్తుంది. అయినా ఆ భయం వుంటుంది. ఈ భయాలన్నింటికి అతీతంగా అంతరంగ జీవి జాగృతం చేయబడినా, యింకా శరీరకణాల్లో ఎక్కడో యీ భయం దాక్కునే వుంటుంది. అస్పష్టంగా, అప్పటికప్పుడు, కారణాలకతీతంగా చాలావరకు తెలియకుండానే సర్వసాధారణంగా యిది శరీరకణాల్లో దాగి వుంటుంది. ఈ అస్పష్టపు లోతుల్లోంచి దాన్ని కనిపెట్టి వదలకుండా గట్టిగా పట్టుకుని పైకి లాగి దృఢత్వంతో దానిపై జ్ఞానకాంతుల్ని ప్రసరింపజేయాలి.

జీవునికి మరణం లేదు. కాని రూపం కరిగి అదృశ్యమయి పోతుంది. ఈ అదృశ్యమయిపోయే రూపాన్ని గురించే భౌతిక చైతన్యం భయపడుతుంది. అయినప్పటికీ రూపం క్రమక్రమంగా మారుతుంది. ఈ మార్పునిగాని, పురోగమనాన్నిగాని ఆపగలిగేశక్తి దేనికీ లేదు. ఈ పురోగామి అయిన మార్పు మాత్రమే మరణం ఎప్పటికైనా అనివార్యం కాకుండా చేసేది. కాని అది అత్యంత కష్టసాధ్యం. దానికవసరమయిన పరిస్థితులు చాలా కొద్దిమంది మాత్రమే సాధించగలరు. ఒక్కొక్క చైతన్యస్థితి, సందర్భ స్వభావం వీటిని బట్టి మరణ భయాన్ని అధిగమించడానికి అనుసరించే విధానాలు వేర్వేరుగా వుంటాయి. ఈ విధానాలు ప్రధానంగా నాలుగు రకాలుగా వర్గీకరించవచ్చు. స్థూలంగా నాలుగే అయినా మళ్లీ ఒక్కొక్కదానిలో అనేక రకాలు వుంటాయి. వాస్తవానికి ప్రతివ్యక్తి తనదైన ఒక స్వంత పద్ధతిని తను అభివృద్ధి చేసుకోవాలి.

మొదటి పద్ధతి హేతువాద పద్ధతి. ప్రస్తుత పద్ధతిని బట్టి మరణం అనివార్యమని ప్రతి ఒక్కడు అనుకోగలగాలి. పుట్టిన ప్రతిజీవి తప్పకుండా ఇవాళో రేపో, ఏదో ఒకరోజు గిట్టకతప్పదు. చాలావరకు ప్రతి సందర్భంలో మరణం వచ్చి తీరుతుంది. దాని సమయం వచ్చినప్పుడు తప్ప అంతకంటె వేగంగాగాని ఆలస్యంగా గాని వచ్చేటట్టు ఎవరూ మార్చలేరు. ఎవరైనా మరణాన్ని కోరుకున్నాగాని దానిని పొందడానికి చాలాకాలం వేచి వుండాల్సి వస్తుంది. మరణానికి భయపడి ఎన్నోముందు జాగ్రత్తలు తీసుకున్నాగాని హఠాత్తుగా దెబ్బతీసి పడగొట్టవచ్చు. అందుచే ఎవరి యిష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా మరణసమయం ముందే ఖచ్చితంగా తీసుకున్నా కఠిన నిర్ణయంగా కనిపిస్తున్నది. ఏ కొద్దిమంది మానవాతీత శక్తులు గలిగిన మహాత్ములకో యిది వర్తించకపోవచ్చు. తార్కికంగా ఆలోచిస్తే తప్పించుకోడానికి వీలులేని దానిని గురించి భయపడడం అవివేకమనిపిస్తుంది. మృత్యుభావనని అంగీకరించి రాబోయే దానిని గురించి ఆలోచిస్తూ దిగులు పడకుండా మన శక్తివంచన లేకుండా ప్రతిక్షణం యేమరకుండా ప్రశాంతంగా కర్తవ్య నిర్వహణ చేయ్యాలి. హేతుబద్ధంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకునే వాళ్ళకీ పద్ధతి చాలా శక్తి వంతమయినది. కాని భావుకులై వాళ్ళ భావాల కనుగుణంగా నడుచుకునే వుద్రేకపరులకీ పద్ధతి అంతగా పనిచెయ్యదు.

వీరికి రెండవ పద్ధతైన అంతరంగ శోధనే నిస్సందేహంగా సరైనది. అన్ని వుద్రేకావి అధిగమించి నిశ్శబ్దంలో జీవి ప్రశాంతమైన అంతరంగపులోతుల్లో నిరంతరం స్థిరంగా వెలుగుతున్న చైత్యపురుష చైతన్య కాంతి the light of the psychic consciousness ఒకటి ఉంటుంది. ఆ కాంతిని వెతుకుతూ వెళ్ళు. నీ ఏకాగ్రత దానిమీద కేంద్రీకరించు. అది నీలోనే వుంది. తదేక దీక్షతో వెతికితే తప్పకుండా దాన్ని కనుక్కుంటావు. అందులో ఎంత వేగంగా నువ్వు ప్రవేశిస్తావో అంతవేగంగా శాశ్వతత్వం నీలో జాగృతమవుతుంది. నువ్వు ఎప్పుడూ జీవించివున్నావు. ఇక మీదట కూడా ఎప్పుడూ వుంటావు. నీ శరీరం నుండి నువు స్వతంత్రుడివయిపోతావు. నీ చైతన్యపు వునికి యిక నీ శరీరం మీద ఆధారపడదు. ఈ శరీరం కేవలం క్షణభంగురమయిన రూపాల్లో ఒకటని, దాని ద్వారా తను అభివ్యక్తమవుతున్నానని గ్రహిస్తాడు మనిషి. మరణం ఎప్పటికీ వినాశన కరమయినది కాదు. అది రూపానికి, రూపానికి మధ్య సంభవించే మధ్యస్థ సంఘటన మాత్రమే. అదిగ్రహించిన మరుక్షణమే భయమంతా పోయి జీవితమంతా ప్రశాంతమైన మనోదారుఢ్యంతో స్వేచ్ఛా జీవిగా గడుపుతాడు.

మూడవ పద్ధతి తాము నమ్మిన ఒక దైవాన్ని త్రికరణ శుద్ధిగా ఆరాధించే వారికి. వారు, వారు నమ్మిన యిష్ట దైవానికి తమని తాము సంపూర్ణంగా అర్పించుకుంటారు. వారి సర్వస్వం ఆ దైవమే. వారి జీవితంలో ప్రతిసంఘటన దైవఘటనే. అందుచేత ఏది జరిగినా కృతజ్ఞతతో, ఎంతో వినమ్రంగా, ప్రశాంతంగా సమర్పణ భావంతో స్వీకరిస్తారు. ఏది జరిగినా అంతా వారి మంచికే అని విశ్వసిస్తారు. వారు వారి దైవంపై ఆధ్యాత్మిక విశ్వాసం పెంచుకుంటారు. వారు భగవంతుడితో వ్యక్తిగత బాంధవ్యం కూడా ఏర్పరచుకుంటారు. వారు పరిపూర్ణంగా వారి యిష్ట దైవసంకల్పానికి అంకితమై ఆ దైవం యొక్క అవ్యాజ ప్రేమని, రక్షణని అనుభవిస్తారు. జీవన్మరణ ఘటనలనుండి పూర్తిగా స్వతంత్రులవుతారు. వారి యిష్టదైవం చరణాల వద్ద పరిపూర్ణ ఆత్మ సమర్పణ చేసుకొని శాశ్వతత్వపు అనుభవాన్ని అనుభవిస్తారు. ఆ దైవం హస్తాలలో హాయిగా సురక్షితంగా వుయ్యాల లూగుతూ ఆనందానుభూతి పొందుతారు. ఇక వారి చైతన్యంలో ఎన్నటికీ

భయం, ఆదుర్దా, ఆందోళనలకి చోటే వుండదు. వాటి స్థానంలో ప్రశాంతమైన బ్రహ్మానందస్థితి అనుభవమౌతుంది.

కాని ప్రతివారికి ఆధ్యాత్మిక చిత్తం కలిగి వుండడమనే అదృష్టం కలగదు.

ఆఖరి పద్ధతి జన్మతః పోరాట యోధులకి వర్తిస్తుంది. వాళ్ళు జీవితాన్ని యథాతథంగా అంగీకరించలేరు. లౌకికమయిన శాశ్వతత్వం పరిపూర్ణత్వం యివి వారి జన్మహక్కుగా భావించి వారిలో వారు గిలగిల లాడుతూ వుంటారు. మరణమనేది ఒక దుష్ట సాంప్రదాయం అనే ఆత్మ ప్రబోధం వారిలో వుంటుంది. మరణాన్ని జయించడానికి తీర్మానించుకొని పుట్టినట్లు కనిపిస్తూ వుంటారు. కాని ఇది భయంకరమైన అజ్ఞాత శత్రువుతో చేసే నిరాశా పూరితమైన నిరంతరాయంగా సాగే యుద్ధం. దేనికీ లొంగని మొండిపట్టుదల వున్నవాళ్ళు మాత్రమే యీ ప్రయత్నం చెయ్యాలి. ఈ యుద్ధానికి అనేక రంగాలుంటాయి. అనేక స్థాయిల్లో (దశల్లో) ఒకదానితో ఒకటి కలిసిపోతూ, పరస్పరం సహకరించుకుంటూ పోట్లాడుతూ ఉండాలి.

మరణ భయాన్ని జయించే మరొక పద్ధతి కూడా వుందనుకోండి. ఇది కొద్దిమందికి మాత్రమే అందుబాటులో వుంటుంది. ఇదొకటుంది అని తెలియడానికి మాత్రమే దీనిగురించి చెప్తున్నాను. అదేమిటంటే మృత్యు సీమలోకి నేరుగా బ్రతికి ఉండగానే, కావాలని ప్రవేశించడం. చనిపోయి, తిరిగి వచ్చి భౌతిక శరీరంలో మళ్లీ ప్రవేశించడం. బ్రతికి తిరిగి వచ్చి మళ్ళీ పదార్థ ప్రపంచంలో తనపని తాను చేసుకోడం. కాని దీనికి మనిషి గురూపదేశం పొందినవాడై ఉండాలి.

మూలం : శ్రీమాత

అనువాదం : నడిమింటి విజయలక్ష్మి

దైవభీతి, పాపభీతి

దైవభీతి అనేది నైతిక ప్రవర్తనకు ప్రేరణ కలిగిస్తుంది. కాని ఆత్మబలం తగినంతగా ఎదిగి తనకు తానుగా మంచిని ఆచరించగలిగిన నాడు ఋజుమార్గంలో నడవటానికి దైవభీతికాని, ఆయనచే విధింపబడే నిష్పాక్షిక

శిక్షపైగాని భయపడాల్సిన అవసరం వుండదు. ఈ విధంగా ఆధ్యాత్మికత దిశగా ఎదగగలిగిననాడు దైవభీతి, పాపభీతి అనే భావనలతో నిమిత్తం లేకుండానే నైతికత కోసమే నైతికతను అనుసరించవచ్చు. (ఒక వేళ ఈ భావనలు మనసులో ఏదోమూల ఒక అవశేషంగా, పాత అలవాటుగా ఉండవచ్చుగాక) మరో విషయం ఏమిటంటే, యోగమార్గం కోరుకునే నైతిక ధర్మం పైకి కనబడే సద్గుణ సంపద వంటిది కాదు. నైతిక వర్తనం మనిషిని ఋజుమార్గంలో నడిపించే ఒక యంత్రాంగంగానే పరిగణింపబడుతుంది. మంచి పనులు నెరవేర్చటమే దాని లక్ష్యం. అదే దాని బాధ్యత, సమస్యకూడా!

యోగికి సత్ప్రవర్తన ఒక్కటే అభిలషనీయమైన గమ్యం కాదు. అది దైవాభిముఖంగా ఆత్మపరిపక్వత దిశగా మానవుని నడిపించే మార్గము. మన ఆధ్యాత్మిక గ్రంథాలు నైతికతను కేవలం సత్కర్మ నిర్వహణంగా మాత్రమే కాకుండా అంతరంగ గుణ శ్రేష్ఠత్వానికి అందు నుంచి పర్యవసించి, కొనసాగి, పొంగిపొరలే సత్కర్మకు ప్రాధాన్యత నిచ్చాయి. అవే స్వచ్ఛత, ప్రేమ, దయ, కరుణ, ఔదార్యము. పాశ్చాత్య భావన ఇందుకు భిన్నంగా ఉంటుంది. వారి భావనలో ఆత్మ స్వతః **పాపభూయిష్టమైనదనీ, పుణ్యకార్యాలు చేయటం ద్వారా ఆ పాపాన్ని** పరిహరించుకోవాలనీ వారు సూచించారు. ఇది మన ప్రాచీన యోగ సాంప్రదాయానికి విరుద్ధమైనది. భారతీయ యోగమార్గం ప్రకారం మనసులోని రాజసిక, తామసిక భావాలను అదుపులో ఉంచటానికి మనసులో అంతర్గతంగా ఉన్న సాత్విక భావాలను ప్రోత్సహించటమే సరియైన మార్గమనీ, ఇదే నైతికత యొక్క ముఖ్యోద్దేశమనీ భావించబడింది. ఈ విధంగా మనసులోని దివ్యప్రకృతిని **వెలికి తీసికొనిరాగలిగితే మనసులోని దానవ, రాక్షస గుణాలను** జయించగలుగుతాము. ఈ విధంగా భావించటం వలననే భారత సాంప్రదాయం యోగులను భగవద్భక్తులను పవిత్రత, ప్రేమ, పరిశుద్ధత, దయ, సత్యము, ధైర్యము, అహింస మున్నగు లక్షణాలు గల వ్యక్తులుగా పరిగణించింది. కాని హీబ్రూ విశ్వాసంలో దైవభీతి, పాపభీతి అనేవి దైవారాధకుల ముఖ్యలక్షణాలుగా పేర్కొనటం జరిగింది. స్థూలంగా చెప్పాలంటే నైతిక

సత్వమునకు పరాకాష్ఠగా దైవీ స్వభావం పరిణతి చెందుతుంది. దీన్ని సాధించాలంటే మనచే ప్రేమించబడి ఆరాధించబడే పరమాత్మగా, మనలను ఉన్నత మార్గాల వైపు నడిపించే మార్గదర్శిగా దైవాన్ని భావించాలి. భగవంతుడంటే భయపడి ఆచరించే నైతిక జీవనం కన్నా ఆయన యొక్క అమర దివ్యత్వం వలన ఉద్ధరింపబడిన దివ్యేచ్ఛతో ఆచరించే ధర్మవర్తన సర్వవిధాలా ఉత్తమమైనది. భయం అనేది యజమాని - సేవకుడు లేదా తండ్రి-తనయుల మధ్య కూడా ఉండవచ్చు కదా. భయం వలన అదుపు-ఆజ్ఞ అనే భావాలు జనిస్తాయి. దీని వలన ప్రేమ, అధికారం అనే ముసుగు క్రింద మరుగున పడిపోతుంది. అంతేకాదు, దైవం యొక్క యాజమాన్యంలో దండన, బెదిరించటం వత్తిడి ఉండనే ఉండవు. కాబట్టి జీవాత్మ అజేయమైన పరమాత్మకు తనకు తానుగా సమర్పించుకోవాలి. అప్పుడు ఆ దివ్యశక్తి జీవాత్మను తనలోనికి తీసికొని ఔన్నత్యాన్ని ప్రసాదిస్తుంది. తనదైన దివ్యానందాన్ని దానికి అందిస్తుంది. అప్పుడు దైవం అంటే ప్రేమ జనిస్తుంది. పరమాత్మకు చేసే సేవ ప్రీతితోనూ, పవిత్ర భావావేశంతోనూ జరుగుతుంది.

లోక పాలకుడైన ప్రభువు తనను ప్రియంతో సేవించే భక్తులను తాము కేవలము ఆయన చేతిలోని పనిముట్టుగా భావించమని అభిలషిస్తాడు. తనను మిత్రునిలా, మార్గదర్శిలా లాలించి పాలించే వానిగా భావించగోరుతాడు. ఆయన సర్వలోకాధీశుడే, కాని సర్వభూతములకు సుహృత్తు. ఈ స్థితిలో ప్రేమ - అధికారము పరస్పర పూరకాలు. ఒకటి లేకుండా వేరొకదానికి పరిపూర్ణత్వము లభించదు. దైవం వినయ విధేయతలను ఆశించే నిరంకుశ ప్రభువుకాదు. ఆయన తన ప్రేమాధిక్యతతో పితృత్వ భావన కలిగిస్తాడు. ఈ విధమైన ప్రేమ భావన సహాయంతో పరమాత్మను చేరే ప్రయత్నమే యోగము.

భక్తునిలోనూ, భగవంతునిలోనూ ఉండేది ప్రేమ మాత్రమే. పరిపూర్ణమైన ప్రేమ ఉన్నచోట భయానికి తావులేదు కదా! ఈ విధంగా ప్రేమ జీవాత్మ - పరమాత్మలను సన్నిహితం చేస్తుంది. భయాన్ని దూరంగా ఉంచుతుంది. అడ్డుకొంటుంది. భగవంతుడు అనగానే ఆశ్చర్య గౌరవాలు కలిగినా అవి కూడా దూరాన్నే సూచిస్తాయి. ఒక్క ప్రేమ భావన మాత్రమే సాన్నిహిత్యాన్ని సూచిస్తుంది.

భయము నిమ్న ప్రకృతికి చెందినది. ఊర్ధ్వ చేతనలో ప్రవేశించాలంటే భయాన్ని గెంటివేయాలి.

గీతాచార్యుడు అర్జునకు ఈ విధంగా ఉపదేశించాడు. పాపభీతితో

ఇహపరబాధల భయంతో మానవులు పీడించబడుతున్నారు; దైవం యొక్క నిజసత్వాన్ని విశ్వసంకల్పాన్ని గ్రహించక పోవటం వలననే ఈ విధమైన భయం జనిస్తుంది. అజ్ఞానంతోను, అవివేకంగాను దుష్టసంకల్పాలతోను వ్యవహరిస్తాడు. కాబట్టే మనిషి స్వకర్మల చేతనే తాను బంధింపబడుతున్నాడు. స్వేచ్ఛతో కూడిన ఆత్మను కర్మబంధాలు బంధించవు. ఆశ, నిరాశ, క్రోధము, దుఃఖము, అనిత్యానందము ఇవి అవివేకం వల్ల కలుగుతాయి. అందుకు భిన్నంగా కర్మలు స్వేచ్ఛగాను, నిరాకులంగాను ఆచరించటానికి సంభావ్యమైనవే.

- శ్రీఅరవిందులు

భావానువాదం : కె.ఆర్.యల్. నరశింహారావు

ప్రాచీన యోగపుత్రా !

అహంకారంగాని కలిగితే ఇష్టాయిష్టాలు - అవే ఆదిమ ద్వంద్వాల జోడీలు జనిస్తాయి. అపారమైన ఆశకు దోహదం చేసే ఆసక్తి, అడ్డుతగిలితే అయిష్టం, కబళించే గుణం నష్టపోయాననే వేదనా, ఆకర్షణ విముఖత, శోభ, రోత, ప్రేమ అసూయ, జాలి, క్రూరత్వం, దయ, క్రోధం - ఇదే - శాశ్వత విరుద్ధాల నిత్యానంత ద్వంద్వాల ఊరేగింపు. ఒక జంటగానీ చేరిందా మిగతావి వాటి వెనువెంటే కుప్ప తెప్పలుగా సిద్ధమవుతాయి. తనయందఖిలభూతములను చూస్తే ద్వేషముండదు. కుంచించుకు పోవడముండదు. అసహ్యం, భయం కలుగవు. ఆపైన వేటిపట్ల జుగుప్స ఉండదు.

సనాతన యోగకుమారా, నిజమైన నీ ఆత్మనందరిలో గ్రహించు. తాదాత్మ్యతా సిద్ధిపొందు, realise thyself in all things. భయమూ, అయిష్టమూవద్దు - నీ, నిజతత్వమే నీవై, జయాపజయాల్లో దైవాన్నే చూచి, మరణమైనా, యాతనైనా ఆయనేననుకో. ఆయన అజేయుడు. ఆయనకు మృత్యువులేదు. భయా, నిస్పృహలాయనకేవి? నీ మనశ్శరీర నిర్మాతలైన కీటకములకే భయం. వాటిలోపల నిశ్చలంగా ఉపనిష్ఠుడవై ఉన్న నీవు మాత్రం వాటి భయానికి సాక్షీ భూతుడవు మాత్రమే. ఎందుకంటే అవి కలలే, నిజమనుకొనే నీడలు. ప్రాణులన్నిటానున్న ఆత్మనూ, ఆపై, ఆత్మలో నిండియున్న జీవాలనూ గుర్తిస్తే భయమే నిన్నుచూచి భీతిల్లి పారిపోతుంది. నిన్ను అంటితే మాడిపోతానని బాధ నీ దరిరాదు. ఎక్కడ నశించిపోతానోనని మృత్యువే, నీ దాపుచేరదు.

- శ్రీమాత

అనువాదం : టి.యస్. రామచంద్రరావు


Rs. 15/-
అఖిల
అఖిల భారత పత్రిక
మార్చి 2009
- శ్రీమాతారవిందుల వాక్కులు

అఖిల

భారత పత్రిక - మార్చి, ౨౦౦౨

పదార్థము పరార్థము నావిష్కరిస్తుంది - శ్రీఅరవిందులు

విషయసూచిక

- - శ్రీమాతారవిందుల వాక్కులు - -

నిజమైన కానుక

తనకి అద్భుత శక్తులున్నట్లయిన అవి పరమాత్మ సన్నిధిలో వుంచి, అతడి మెప్పపొంది దైవసిద్ధిని పొందే దైవ కార్యాలు నిర్వహించగలనని, అంతులేని సంపదలేవుంటే భగవత్కార్యాలకి అవన్నీ అతడి పాదాల వద్ద సమర్పించాలని వుందని, యిది తన చిరకాల వాంఛితమని వొక వ్యక్తి నాకు వ్రాసేడు. "నువ్వు విచారించనవసరం లేదు. నీవద్ద యేదుంటే అదే సమర్పించు. ప్రతివొక్కరిని కోరేదేమంటే అతడి వద్ద యేవి వుంటే అవి, అవి యేవైనా కావచ్చు. తన శక్తి సామర్థ్యాలు, హోదా, తనకంటూ వున్నవన్నీ సమర్పించవచ్చు - వాటన్నిటితో సమంగా తన జీవితాన్ని కూడా - యింతకన్నా యెక్కువ కోరేదేమీ వుండదు. నువ్వేమిటో అదే సమర్పించు. నీకేముందో అదే యివ్వు. అదే నిర్దుష్టమైన నిజమైన కానుక. ఆధ్యాత్మిక దృక్పథంలో సమగ్రమైనదదే. అది నీకున్న అంతులేని సంపద మీద, అసంఖ్యాకమైన అర్హతలమీద ఆధారపడి వుండదు. సమగ్రత మీదే ఆధారపడి వుంటుందని చెప్పవలసి వుంది." అని చెప్పాను.

ఇటువంటి కథేదొకటి హిందూ పురాణగాథలో చదవినది గుర్తుకొస్తున్నది. నిరుపేద, పండుముసలి స్త్రీ వొక తె వొక పూరిపాకలో నివసిస్తూ వుండేది. ఆమెకి తనకంటూ యేమీ లేదు. ఒకరోజు ఆమెకి యెవరో వొక మామిడిపండు యిచ్చేరు. అది చాలా మధురమైన, అరుదైన పండు. అటువంటి పండు యెప్పుడో గాని ఆమెకి దొరకదు. అందుకని ఆ పండు సగంతిని మిగిలిన సగం మరునాటికి దాచుకుంది. రాత్రయింది. ఆమె పడుకున్నది. అర్థరాత్రి యెవరో బాటసారి ఆ జీర్ణకుటీరం తలుపుతట్టి ఆశ్రయమడిగాడు. ఆమె తలుపు తెరచి లోనికి రమ్మన్నది. లోనికి రాగానే ఆ ఆగంతకుడు పడుకోడానికి జాగా, ఆకలిగా వున్నది, తినడానికేమైనా పెట్టమని అడిగాడు. ఆమె సమాధానంగా, "నువ్వు చలికాచుకోడానికి నిప్ప చేద్దామంటే నా వద్ద యేమీ లేదు. కప్పకోడానికి యిద్దామంటే దుప్పటీ కూడా లేదు. నేను సగం తినగా మిగిలిన మామిడి పండు తప్ప నా వద్ద యింకేమీ లేదు. నీకభ్యంతరం లేకపోతే అది

యిస్తాను. తీసుకో అన్నది. ఆ ఆగంతకుడు శివుడు వెంటనే ఆమె యెదుట ప్రత్యక్షమయ్యాడు. ఆమె అంతర్యమంతా తేజోమయ మయిపోయింది. ఆమె యిచ్చినది నిజమైన కానుక. తనకున్న సర్వస్వం సాటి మనిషి ఆకలి తీర్చడానికి నిస్సంకోచంగా, చిత్తశుద్ధితో భగవంతుడని తెలియకపోయినా సమర్పించింది."

అదే నే చదివిన కథ. అద్భుతమనిపించింది. నిజమైన కానుకంటే యేమిటో తెలియజేయడానికే యీ కథ చెప్పడం జరిగింది.

బాగా ధనవంతుడైనా, జీవితంలో యెన్నో సౌకర్యాలు సమకూర్చుకుని చీకుచింతా లేనివాడైనా తన అవసరాలకి, ఆనందాలకి సరిపడిన డబ్బు వుంచుకుని యింకా మిగిలివుంటే అది గొప్పగా యెంతో వుదార పురుషుడిలా భగవత్కార్యాలకి ఖర్చు చేస్తాడు. అదీ లోకం తీరు. అసలేమీ ఇవ్వకపోవటం కంటే మేలే. కాకపోతే అలా యిచ్చినది లక్షలైనా సరే నిరుపేద వృద్ధురాలి సగం మామిడిపండుకు మాత్రం సాటిరాదు. అందుచేత భగవంతుడికర్పించేది తృణమైన పణమైనా ఉత్తమంగా వుండాలి. అది చిత్తశుద్ధితో పరిపూర్ణత సంతరించుకొని సమర్పించేది కావాలి.

ప్రశ్న : సాధారణ జీవితంలో ధనవంతులు వారి ధనాన్ని భగవంతుడి కర్పించాలనుకున్నప్పుడు, భగవంతుడు వారి యెదుట వుండడు కదా! అప్పుడు ఆ ధనం వారెవరికివ్వాలి ? ఆ ధనం యెక్కడ యివ్వాలో వారికి తెలియదు కదా ?

అవును. బాహ్యంగా గాని, అంతర్యంలో గాని యెక్కడా వారికి భగవదనుభూతే కలగనప్పుడు యీ ప్రశ్నే తలెత్తదు. తనకు తెలియని వారికిమ్మని యెవరూ అడగరు కదా !

వారు వారిలో భగవంతుణ్ణి దర్శించగలిగినట్లయితే, వారి సంపద వినియోగానికి ఆ దైవ సూచనల ప్రకారం నడుచుకుంటే సరిపోతుంది. వారు నిజాయితీగా వారందుకున్న సూచనల ప్రకారం నడుచుకున్నట్లయితే వారు కోరబడడం అనేది జరుగుతుంది. అంతవరకు వారిని కోరడమన్నదే వుండదు. "స్వామీ ! నన్ను నేను

నీకు కానుకగా సమర్పించుకొని సిద్ధంగా వున్నాను. ఆజ్ఞాపించు." అన్నప్పడే ఆజ్ఞాపించబడతాడు. అదే మొదలవుతుంది. తన్ను తాను సమర్పించుకున్న తక్షణమే కోరబడతాడు. కాని అంతకుముందు మాత్రం కాదు. అంతకుముందు అనాలోచితంగా నువ్వొక నాణెం జేబులోంచి బయటికి తీసి అక్కడుంచావు. మంచిదే. నువ్వు చెయ్యాలనుకున్నది అంటే నీ విధి అనుకున్నది చేసేవు. అంతే అంత మాత్రం, నువ్వేమీ కోరబడవు. నీ బాధ్యత తీసుకోమని భగవంతుణ్ణి కోరడానికి, సదుద్దేశంతో, నీ జీవితవిధానంలో ఏ మార్పును అపేక్షించే ఏ ఉద్దేశం లేకుండా, చేసే మంచిపనికి చాలా వ్యత్యాసం ఉంది.

ప్రశ్న : అమ్మా ! కొంతమంది డబ్బున్నవాళ్లు ఇక్కడికి వస్తూంటారు. వాళ్లకి ఉంటుంది. ఆ భక్తిని చాటుకుంటారు. కాని డబ్బు సంగతి వస్తే మాత్రం బేరసారలాడతారు -----

సమాధానం : వారు దైవం నించి ఎంత వీలైతే అంత తీసుకోవాలనే యెత్తుగడతో వస్తారు. అన్ని అర్హతలు, అన్ని సమర్థతలు, అన్ని సౌకర్యాలు, సదుపాయాలు యిలా ప్రతి వొక్కటి అంతే కాదు. ఒక్కొక్కసారి దివ్యశక్తులతో సహా ఒకటేమిటి సమస్తం తీసుకుపోడానికే వాళ్ళు వస్తారు. ఇవ్వడానికి రారు. వాళ్ళ భక్తి ప్రదర్శన వొకనెపం మాత్రమే. తీసుకోడంలోనే వాళ్ళ కోరిక బయటపడుతుంది. అది చాలా పెద్ద స్థాయిలో విస్తృతమయివుంటుంది. వ్యక్తి ఆత్మను కాపాడడం, ఆధ్యాత్మికానుభూతి పొందడం, దివ్యశక్తులను సంపాదించడం, ప్రశాంతమైన చక్కని జీవితం గడపడం, ఎక్కువ, తక్కువ అన్నది వదిలేస్తే మొత్తంమీద సుఖంగా జీవించడం, నిర్లక్ష్యంగా నిష్పూచీగా జీవితంలో యీతి బాధల కతీతంగా వుంటారు. ఈ రకంగా వారి జీవితం విస్తృతమై వుంటుంది. కాని వారు యివ్వడం దగ్గరకొచ్చేసరికి బేరసారాలు మొదలవుతాయి. ఇన్ని పొందాలంటే యేకొంచెమైనా యివ్వాల్సి వుంటుందని వారికి తెలుసు. అందుచేత పరమ భక్తుల్లా వారు నటిస్తూ వుంటారు. అది వుత్త నటనే తప్ప అందులో నిజాయితీ వుండదు.

దురదృష్టవశాత్తూ అది వారికే పరమితం. ఇంకెవర్నీ మోసం చెయ్యలేడు. కాకపోతే సహించబడుతుంది. దీనివల్ల మోసపోయేది ఎవ్వరూ ఉండరు.

బేరసారాలనేవి సర్వత్రా సత్వం అన్ని భాగాలలోనూ ఉంటాయి. అత్యున్నతమైన ఆధ్యాత్మిక అనుభవాలనించి అత్యల్ప భౌతిక అవసరాల వరకు నిరంతరం యిచ్చిపుచ్చుకోవడాలు జరుగుతూనే వుంటాయి. బేరం లేకుండా సమర్పించేవారు వెయ్యిమందిలో వొక్కరు కూడా వుండరు.

ఇంతకీ నే చెప్పిన కథలోవున్న అందం ఏమిటంటే తను పండు యిచ్చినప్పడు ఆ ముసలమ్మకి వచ్చినవాడు శివుడు అన్న విషయం తెలియదు. కేవలం తాను ఇవ్వడం ద్వారా వొక మంచి పనిచేస్తున్నానన్న ఆనందంతో దారినపోయే బిచ్చగాడికి యిచ్చింది. అంతేగాని అతడొక దేవుడని తనకి ముక్తి ప్రసాదిస్తాడని లేదా అందుకు ప్రతిఫలంగా తనకేదో జ్ఞానం ప్రసాదిస్తాడని యివ్వలేదు.

<u>**ప్రశ్న:**</u> అయినా కూడా, పరిపూర్ణ అర్పణేతప్ప ఏమాత్రం కోరిక కూడా ఉండకూడదని తెలుసుకున్నప్పటికీ కూడా, అదెప్పటికీ అలాసాగుతూనే ఉంటుంది----

సమాధానం: మరైతే ఏంచేయాలి? చిత్త శుద్ధితో ఉండాలి. అంతే. ఎప్పటికీ అంతే. పండులో పురుగులా మనలో వొక సందేహం తొలుస్తూ వుంటుంది. "అమ్మో ! నే చెయ్యలేను," అని. కాని అది నిజం కాదు. తలుచుకుంటే నీకిది సాధ్యమే అవుతుంది.

కొంతమంది నాతో అంటూ వుంటారు. "నాకు యిచ్ఛాశక్తి లేదు." అని. దానర్థం నీకు నిజాయితీ లేదని. నిజాయితీ అనేది ప్రపంచంలో అన్ని సంకల్పశక్తుల కంటే, అనంతమైన శక్తుల కంటె కూడా శక్తివంతమైనది. కన్నుమూసి తెరిచేలోగా ఏలాటి మార్పునైనా చేయగలడు. దేనినైనాసరే గట్టిగా పట్టుకుని, వశపరచుకొని బయటికి లాగుతుంది. అక్కడితో సరి. కాని నువ్వు కళ్ళు మూసుకుంటే యెన్నో సాకులు నీకు దొరుకుతాయి.

ప్రశ్న: ఈ సమస్య నిరంతరం పునరావృతమవుతూనే వుంటుందా?

అది తిరిగి వస్తుంది. ఎందుకంటే దానిని నువ్వు పూర్తిగా పెరికి వెయ్యలేదు. నువ్వేం చేసావంటే కేవలం కొమ్మను మాత్రమే నరికావు. అది మళ్లీ పెరుగుతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: నడిమింటి

విజయలక్ష్మి.

రాధప్రార్థన

తొలిచూపులోనే నీవు నా ప్రభువని, దైవమని తెలుసుకున్నాను. నీకిదే నానివేదన. స్వీకరింపుమో స్వామీ!

నా ఆలోచనలు, ఆవేశములు, మనోహృదయ భావనలు, సంవేదనలు, జీవన సర్వచలిత చాలనములు, శరీరములో ప్రతి జీవకణము, ప్రతిరక్త బిందువు - సర్వస్వము - ఏ మినహాయింపు లేక - అంతా పూర్తిగా నీదేస్వామి! నేను ఏమికావాలని నీవు అభిలషిస్తే అదే నేను కాగలను. జీవన్మరణములు, సుఖదు:ఖములు, ఖేదమోదములు -నాకై నీవేది ఎంపిక చేసినా నాకది ఆమోదయోగ్యమే. నీవు నాకందించిన ప్రతి పురస్కారము దివ్యపురస్కారమే; పరమానంద ప్రదాయకమే!

- శ్రీమాత

అనువాదం : కర్రా వెంకటేశ్వర్లు

అప్పుడొక తలుపు తెరుచుకుంటుంది

1) నీవు నిజాయితీగా మనమనుకునే కష్టాలనుండి, పొరపాట్లనుంచి బైట పడాలనుకుంటే అదంత కష్టమైన పనేమీ కాదు. అందుకు నీవేమీ చేయ పనిలేదు. దైవమే నీకోసం సర్వం చేయనిస్తేచాలు అప్పుడాయనే అంతా, సర్వమూ చేస్తారు. అది చాల అద్భుతంగా వుంటుంది.

2) ఏమైనా కూడా ఆయనే తీసుకుంటాడు, మనము అనుకునే సాధారణ వివేకాన్ని కూడా. ఈ వివేకాన్ని పక్కన పెట్టమంటాడు. దానిని

విశ్రాంతి తీసుకోమంటాడు. "ఆవేశపడకు. ప్రశాంతంగావుండు. నన్ను బాధించకు. నీ అవసరం లేదు" అని నీకు బోధిస్తాడు. నీవలా చేస్తే అప్పుడొక ద్వారం తెరుచుకుంటుంది. నీవా ద్వారాన్ని తెరవాల్సి వుంటుందన్న బాధ కూడా నీకుండదు. అది అలా విశాలంగా తెరువబడుతుంది. నీవు ఆవలి వైపునకు కొనిపోబడతావు. అదంతా జరిగేది నీ ప్రయోజకత్వం వలన కాదు. మరొక దివ్య శక్తి వల్లనే. ఇక అపుడు మరోలా జరగటం అసంభవం.

3) ఈ శ్రమ, అవగాహనకోసం పడే మనోవేదన , శిరోభారం - ఇదంతా అనవసరం. ఇదంతా మరింత గందరగోళాన్ని పెంచటానికే. పనికిమాలినది ఇదంతా .

4) ఏదేని ఒక విషయమై ఏమిచెయ్యాలి? ఎల్లా చెయ్యాలి? సమస్యగా నీకు ఎదురైనపుడు - నువ్వేమీ చెయ్యనవసరంలేదు. ఏమీ చెయ్యనక్కరలేదు. దైవానికి "దైవమా! ఇది ఇలావుంది. చూడండి" అని చెప్పుకో. అంతే. ఆపై ప్రశాంతంగా ఉండు. అంతట నీవాలోచించకుండానే నీ ప్రతిస్పందన లేకుండానే, నీ స్వల్ప ప్రయత్నమేదో లేకుండానే నీవేమి చెయ్యాలో, అదే చేస్తావు. అంటే దైవమే చేస్తాడు. అది నీవు కాదు. అవసరమైన పరిస్థితులను నీకు ఆయనే కల్పిస్తాడు. అవసరమైన మనుష్యుల్ని ఆయనే ఏర్పాటు చేస్తాడు. నీనోటి ద్వారాయే మాటలు వెలువడాలో ఆయనే నీచే పలికిస్తాడు లేదా వ్రాయిస్తాడు.ఆయనే సర్వం చేస్తాడు; సర్వం చేస్తాడు. నువ్వింకేమీ చేయనక్కరలేదు. నిన్ను నీవు ఆనందంగా వుంచుకోవాలి. కాని మనుష్యులు అలా నిజంగా దైవ జోక్యం కోరతారని నేను అనుకోను.

ప్రశ్న: కాని ముమ్ముందుగా ఆ కార్య రంగాన్ని సిద్ధపరచుకోవడం కష్టం.

సమాధానం: నీకు ఆ అవసరం లేదు. నీకోసం ఆయనే చేస్తాడు.

ప్రశ్న: కాని పాత ఆలోచనలు, చైతన్యము నిరంతరంగా చొరబడుతూ ఉంటాయి కదా ----

సమాధానం: అవును. అలవాటుగా అవి మళ్ళీ మళ్ళీ చొరబడుతుంటాయి. నువ్వు దైవానికిలా విన్నవించుకోవాలి - "ఓదైవమా! చూడండి, చూడండి ఇది యిలా వుంది. ఈ బుద్ధిహీనుణ్ణి చూడండి" అని మాత్రమే. వెంటనే అదంతా కూడా పూర్తి అయి ముగిసి పోతుంది.

ఓ బిడ్డా ! అంత అది అప్రయత్నంగా, నీప్రయత్నం స్వల్పమైనా అవసరం లేకనే మారిపోతుంది. కాని నీవు నిష్కపటంగా, నిజాయితీగా వుండాలి. అంతే. అంతా దైవ నిర్ణయంగా జరగాలని నీవు కోరాలి. అపుడు, దాన్ని గూర్చి నువ్వేమీ చేయలేవని, నీకా శక్తి లేదని తెలిసికొంటావు. ఈ విషయంలో జడచేతనము, జీవ కణాలు మొదలైనవాని కలయిక విచారకరము అని నేను మరి మరీ భావిస్తాను. ఇది విచారకరము. మనుషులు తామేశక్తివంతుల మని, జ్ఞానవంతులమని, సమర్థులమని భావించే కొన్ని పరిస్థితులు వున్నాయేమో నాకుతెలీదు. ఎందుకంటే వారెలావుండాలో వారికే తెలీదు. నీవెలా తయారు చేయబడ్డావో నిజంగా నీవు గ్రహించినపుడు, నీవేమీకావని, తెలిసికొంటావు. కాని దైవం నీద్వారా పనిచేయడానికి నీవు అనుమతించినపుడు, సర్వం సవ్యంగానే జరిగిపోతుంది. కాని తనకుతానే అంతా చేసికోవాలని కోరేది యేదో నీలోవుంటున్నది. అదేచిక్కును తెచ్చి పెట్టేది. లేకపోతే (సమస్యే) లేదు.

నీవు దయ కలిగి వుండవచ్చు. దానిని ఆచరణలో పెట్టనూవచ్చు. కాని అదే అంతటినీ గందరగోళపరుస్తుంది. లేదా నీకు దైవ విశ్వాసం లేకపోవచ్చు. దేవుడు ఆ పని చేయ శక్తిహీనుడని నీవు నమ్మవచ్చు. అందువల్ల నీవే ఆ పని చేయక తప్పదని భావింపవచ్చు. ఎందుకంటే ఆయనకు తెలీదు కాబోలు అనుకుని. (శ్రీమాత నవ్వారు). ఇలాంటి తెలివి తక్కువతనం సామాన్యం". దైవం మన సమాజ పరిస్థితులను ఎలా చూస్తాడు? మనం అసత్యప్రపంచంలో నివసిస్తున్నాం కదా? ఆయన అసత్యాన్ని ఎలా చూడగలడు?" కాని ఆయన సరిగ్గా వున్నది వున్నట్లు చూడగలడు.

నేను అవివేకుల గూర్చి మాట్లాడడం లేదు. తెలివి గలవారిని గూర్చే మాట్లాడుతున్నాను. "వాళ్ళిలా భావిస్తారు కాబోలు". మనం అజ్ఞాన, అసత్య ప్రపంచంలో నివసిస్తున్నాం. భగవంతుడు సత్యాత్ముడు. దైవం స్పష్టంగా, కచ్చితంగా సత్యాత్ముడే, కనుక అసత్యాన్ని గ్రహించలేడు. (శ్రీమాత నవ్వుతారు). ఆయన మన అసత్యాన్ని అర్థం చేసికోలేడు. కనుక నేనే దాన్ని చూడవలసి వుంది. ఇది చాల తీవ్రమైన భావన. ఇలా మనకు మనమే నిష్ప్రయోజన కరంగా గందరగోళం సృష్టించుకొంటాం.

ఈ విశ్వంలో జరుగుచున్న ప్రతిదానిలో భగవంతుడు తన శక్తి ద్వారా, ఆ చర్యల వెనక వున్నాడు. కాని ఆయన తన యోగమాయ చేత తెరవెనుక వుంటాడు. ఆయన నిమ్న ప్రకృతిలో జీవుని అహంకారం ద్వారా పనిచేస్తాడు.

యోగంలో కూడా దైవమే సాధకుడు, సాధనము. సాధనల ఆధారం పైన కూడా వెలుగు, జ్ఞానము, శక్తి, చేతన, ఆనందాలతో కూడిన ఆయన శక్తియే పని చేస్తున్నది. ఆయాధారం దైవ శక్తికి తెరువబడినపుడు, దివ్య శక్తులు దానిలో ప్రవహించి సాధన జరుగునట్లు చేయును. కాని నిమ్న ప్రకృతి చురుగ్గా పనిచేస్తున్నంత వరకు, సాధకుని స్వప్రయత్నం అవసరమగుచుండును.

-శ్రీఅరవిందులు

అనువాదం: బి. నరసింహయ్య

సంశయాత్మ

-శ్రీఅరవిందులు

సంశయాన్ని గురించి వ్రాద్దామని మొదలుపెట్టాను. వ్రాయడం గానీ, మరేదైనా గాని ఎంత చేసినప్పటికీ, మనిషికి పుట్టుకతో ఉన్న అజ్ఞానం విధించిన జరిమానాలాంటి శాశ్వత సంశయాన్ని తలెత్తకుండా చేయగలమా అనే సంశయం నన్ను వేధించింది. 60పుటల నుండి 600 పుటలు వ్రాసి ఇహచాలు అనుకోవచ్చు. కాని సంశయనివృత్తి కోసం 6000 పుటలు వ్రాసినా సంశయనివృత్తి కాదు. ఎందుకనంటే

సంశయం సంశయించడానికే. దాని పని ఎప్పుడూ సంశయిస్తూండడమే. ఒకవేళ దానిని నమ్మించాము, సంతృప్తి పరచామని అనుకొన్నా అదింకా సంశయిస్తూనే వుంటుంది. తనను పెంచి పోషించే వానిని నమ్మించడానికి మాత్రమే తనొక నిజాయితీగల సత్యాన్వేషిగా నటిస్తుంది. నాయొక్క, ఇతరుల యొక్క మానసిక అనుభవం నుండి నేను నేర్చుకొన్న విషయం ఇది. సంశయాన్ని వదలించుకోవాలనుకొంటే ఉన్న ఒకే మార్గం, సత్యాసత్యాలను పరిశోధించి తెలుసుకోనేందుకు విచక్షణా విజ్ఞానాన్ని ఆశ్రయించడం దాని కాపలా క్రింద స్వేచ్ఛగా, ధైర్యంగా సత్యాసత్యాల అనుభవం కోసం ప్రయత్నించడం.

వాద ప్రతివాదాల ద్వారా సంశయాలకు సమాధానాన్నివ్వడం పూర్తిగా నిష్ప్రయోజనమని గ్రహించి, చాలా కాలం క్రిందటే మానుకున్నాను. మేధోపరమైన వాదనకు, లేదా సిద్ధాంతాలు వల్లించడానికి యోగం సరైన క్షేత్రంగాదు. తార్కిక లేదా చర్చించే మనస్సునుపయోగించడం వల్ల యోగాన్ని గురించి యదార్థ అవగాహన గాని, లేదా దాన్ని అనుష్ఠించడం గాని జరగదు. బుద్ధి సంతృప్తి చెందాలి, ప్రతిదాన్ని బుద్ధి నిర్ణయించాలి అనే లక్షణంగల "సిసలైన సంశయం" మనస్సు చలించే బాహ్య క్షేత్రంలో చాలా సబబైన సంశయంగానే కన్పిస్తుంది. కాని యోగం మానసిక క్షేత్రానికి సంబంధించినది కాదు. మనం ప్రతిష్టించాలనుకొన్న చేతన మానసికమైనది, తార్కికమైనది లేదా చర్చలకు సంబంధించినది కాదు - బుద్ధ్యాత్మక లేదా తార్కిక మనస్సుతో సహా మొత్తం అంతా అచంచలంగా, నిశ్చలంగా తనంత తాను ఒక ఉన్నత, లోతైన చేతనకు, అంతర్దర్శనానికి, జ్ఞానానికి ఉన్మీలనమయ్యేంతగా మనస్సు నిశ్చలమవ్వాలి. ఆ నిశ్చలత లేకపోతే అంతవరకు సాధన గమ్యాన్ని చేరలేదు. ఆ కారణం చేతనే, భారతీయ ఆధ్యాత్మిక సాంప్రదాయంలో గురువును సంశయించని, ప్రశ్నించని, ఉన్మీలనం విధిగా శిష్యునికుండాలి. గురువుపై అపవాదులు వేయడం, విమర్శించడం, దాడి చేయడం, అనేది ఖండనీయమనీ, సాధనకు పెద్ద ఆటంకం కావడం ఖాయమనీ వక్కాణిస్తుంది.

వాదప్రతివాదాలతో ఎదుర్కొని సంశయాన్ని అధిగమించడం జరిగితే, తర్కంతో సంతృప్తి చెంది, దానిని నివృత్తి చేసుకోవాలనే తీవ్ర వాంఛలాంటిదేదో ఆ సంశయంలో వుండి వుంటుంది. కాని సంశయ లక్షణం సంశయించడం గనుక, అదెపుడూ సంశయం కోసమే సంశయిస్తూ వుంటుంది. తన ఈ ప్రత్యేక ధర్మంకోసం అది మనస్సును కేవలం తనకు ఉపకరణంగా వాడుకొంటుంది. తన అసలు సిసలైన అణచిపెట్టలేని సంశయాలకు పరిష్కారంకోసం నిజాయితీగా అన్వేషిస్తున్నానని ఆ మనస్సు అనుకొన్నపుడు, ఇది అల్పధర్మంగా దానికి కల్పించదు. (సంశయించడం తనకు గల గొప్ప ధర్మం అనుకొంటుంది.) వివిధ మానసిక స్థాయిలు ఎప్పుడూ వుంటాయి. పైగా ప్రతివాదిని నమ్మించడం జరగకపోయినా, నమ్మించలేమని తెలిసినా జనం వాదిస్తూనే వుంటారనేది అందరికీ తెలుసు. ఆధ్యాత్మికమైన, మరేవిధమైన ప్రయోజనం లేకపోయినా, ఆశ్రమం యొక్క ప్రధానోద్ధేశ్యానికి వ్యతిరేకంగా, కేవలం యోగలక్ష్యాన్ని దెబ్బతీయడానికి ఆశ్రమమంతా విస్తరించివున్న సదా తిరిగి తిరిగి తలెత్తే సంశయాలకు నిరంతరం సమాధానాలిచ్చుకొంటూ పోతూండడం ఇక్కడ జరుగుతోంది. ఎవరైనా, ప్రాథమిక సంశయాలనధిగమించారంటే అది తనలోని చైత్య సంబంధమైన అంతర్వికసం వల్ల లేదా అతని చేతన విశాలం కావడం వల్ల మాత్రమే గాని మరోవిధంగా కాదు. ఇతరులను ఖండించాలనీ, లేదా తన ఆధిక్యాన్ని చాటుకోవాలనీ గాక విచారణకోసం, జిజ్ఞాసలో భాగంగానూ ఉత్పన్నమయ్యే ప్రశ్నలకు సమాధానం చెప్పవచ్చు. కాని "సంశయపిశాచం" యొక్క ఆకలి తీరేది కాదు, సంశయం నివృత్తి అయ్యేదీ కాదు.

సంశయానికి సంబంధించిన ఈ దాడులను, వాటి స్వభావాన్ని, వాటి మూలాన్ని తెలుసుకొంటే వాటినతడు కాలక్రమేణా అధిగమించగలడు. అయితేమరి వాటిలో తగుల్కొనకూడదు. వాటి అగాధాల్లో పడి అంతర్ధానమై పోకూడదు. వాటిని వివేచించి, చివరకు వాటి వ్యవహారాన్ని తానొక సాక్షిగా అర్థంచేసుకోవాలి. ప్రాణికం వాటి

సుడిలో పడి కొట్టుమిట్టాడుతూ ఉంటుంది. బాహ్యమైన భౌతికమనస్సు ప్రతికూల సూచనలను ప్రకటిస్తూంటుంది. అయినా వాటికి బాహ్యమనస్సు అనుమతిని నిరాకరించే సామర్థ్యతను కాలక్రమేణా సముపార్జించుకోగలుగుతుంది. చివరకు ఈ దాడులు తమ శక్తిని కోల్పోతాయి, స్వభావం నుండి రాలిపోతాయి. అవి తిరిగి తలెత్తడం తగ్గిపోతుంది, ఒకవేళ తలెత్తినా ఎక్కువకాలం అతన్ని పీడించలేవు. వాటికి దూరం కావడం అనేది బలీయంగా జరిగితే సంశయాల నుండి త్వరలోనే లేదా వెనువెంటనే బయట పడడం కూడా జరుగవచ్చు. వాటి నిజస్వరూపం తెలుసుకొని, వాటినలా ఎలాఉంటే అలా పరిగణించే ధోరణి అన్నింటికంటె బలమైనది. భౌతిక మనస్సులో లేదా ప్రాణిక భాగంలో వుండే సందులలో నుంచి అంధకారశక్తులు, సంశయాలుగా చొరబడతాయి. స్వీయ నిజ అస్తిత్వం యొక్క అంశ నుండి గాకుండా లేదా స్వీయ ప్రకృతిలో అప్రయత్నంగా వెలువడినవి గాకుండా, సంశయాల రూపంలో అంధకారశక్తులు చొరబడతాయి. భౌతిక మనస్సులో సందిగ్ధతను, అంధకారాన్ని సృజించడం, పొరపాటుభావాలు, చీకటి ఆలోచనలు, అసత్య అభిప్రాయాలు, దానిలో చొప్పించడం లేదా రేకెత్తించడం చొరపాటుదారులైన అంధకారశక్తులకు ఇష్టం. తాను తలచింది సరైనదని, లేదా తన అభిప్రాయాలు, అనుమాన ప్రమాణాలు, సహజంగా సరైనవే అవుతాయని భావిస్తూ ఈ భౌతిక మనస్సు గనుక వీటికి ఊతమిస్తే వాటికి పండగే. యదార్థ మనస్సు అందుకే తనకుతానుగా నిలద్రొక్కుకొని ఈ కారు మేఘాలను పారద్రోల గలగాలి. ఏదో గాయంతో బాధపడ్తున్నట్లు లేదా నిమ్న ప్రాణిక భాగాల్లో విచారంతో ఏదో కుములుతున్నట్లు, ధ్యాసను ప్రేరేపించి, వాటినలా వీలైనంతకాలం గాయపరచడం, కుమిలేట్లు చేయడం సంశయాత్మకు గల మరో ఉపాయం. అటువంటి సందర్భంలో తన స్వభావంలో గల రంధ్రాలను అన్వేషించుకొని, అటువంటి దాడులు జరుగకుండా లేదా చొరబాటుదారులను వెంటనే లేదా వీలైనంత త్వరలో బయటకు తరిమివేసి, వాటిని మూసివేయడం ఎలాగో తెలుసుకోవాలి. అవి తిరిగి తలెత్తినా, దానినతని ప్రాథమిక అసమర్థతగా భావించగూడదు. సరైన

ఆంతర దృక్పథాన్నిలవర్చుకొంటే, దానినతడధిగ మించగలడు. అధిగమించితీరుతాడు. మన జీవితాన్ని, కర్మలను, శాసించే ఈశ్వరుడు, మనకు కన్పించకుండా తనను తాను ఎంతోకాలం మరుగు పరచుకొన్నపుడు గూడా, ఆతని యెడల మనం విశ్వాసం కలిగి వుండాలి. అతడు తగిన సమయంలో తనంత తానుగా మనకు దర్శన భాగ్యం కలిగిస్తాడు.

అనువాదం : కోనేరు వెంకటేశ్వరరావు

సంశయం

భువిపై ఆధ్యాత్మిక చైతన్యం పరిణమించాలి, పరిణమిస్తూన్నది కూడా. కాంతి, శాంతి, ఆనందం నిండిన ఈ ఉన్నత చైతన్యం పొందాలంటే, ప్రశ్న, సంశయాల ద్వారా రాదు. ఈ సంశయాత్మకత ఇపుడు ఉన్నదాని పైననే నిలుస్తుంది. ఇంకా ఏమంటుందంటే "గతంలో లేనిది భవిష్యత్తులో ఉండబోదు. అపరిపూర్ణంగా సాధించిన సిద్ధిని భవిష్యత్తులో మరింత ఉత్తమంగా సాధించలేడు. అది అసంభవం." అని సంశయం అంటుంది. కొత్త దానిని సాధించాలంటే విశ్వాసం, సంకల్పం, పట్టుదల, ఆకాంక్ష అవసరం. దానితోనే నేను తృప్తి పడలేను. అందుకోసం ఒక ప్రచోదనం, ఊపు దానిని సాధించే వరకు ఆ ఉత్సాహం ఆగరాదు అనేది ఉండాలి. లేకపోతే సంశయం, తిరస్కృతి అడ్డుపడతాయి. ఆధ్యాత్మిక అనుభవ వికాసానికి అనువైన పరిస్థితులకు అవి అడ్డు నిలుస్తాయి. ముందుకు సాగనీయవు.

కేవలం సంశయించే మనస్సు నిష్ప్రయోజనకరమవుతుంది. కాని నిమ్న జ్ఞానసీమలో సందేహానికి, సంశయానికి, తర్కానికి ప్రయోజనాలు ఉన్నాయి. ఉన్నత జ్ఞాన భూమిలో అవి అంతరాయాలు. అసలు రహస్యం సత్యాసత్యాలను సరితూచటం కాదు, (not balancing of truth and error). ఆవిష్కృత సత్యం సిద్ధికోసం ప్రగతిశీలకమైన నిరంతర సాధన అది. మేధోపరమైన విజ్ఞానంలో అసత్యం, అపరిపూర్ణత కలగాపులగంగా వుంటాయి. సంశయాత్మక విచారణ ద్వారా దీనిని వదిలించుకోవాలి. ఉన్నత జ్ఞానంలోకి అసత్యం ప్రవేశించలేదు. కొన్ని

అభిప్రాయాలకు మేధస్సు అంటిపెట్టుకుంటే, కేవలం ప్రశ్నించడం ద్వారా ఆ లక్షణం పోదు. సత్య సిద్ధికోసం పట్టుదల పెంచుకొనే కొలదీ ఆ లక్షణం రాలిపోతుంది. జ్ఞానంలోని అపరిపూర్ణత సిద్ధిపొందిన దానిని ప్రశ్నించడం ద్వారా కాకుండా, పరమాత్మ సాన్నిధ్యంలో ప్రగాఢంగా, విశాలంగా, ఉన్నతంగా ఆత్మజీవనంలో మరింత పరిపూర్ణ సిద్ధివైపు ప్రయత్నించడం ద్వారా ఆ అపరిపూర్ణతను వదిలించుకోవచ్చు.

కొత్తగా సిద్ధి పొందవలసిన దానిని సంశయం ద్వారా కాకుండా విశ్వాసం ద్వారా సన్నద్ధం చేసుకోవాలి. ఈ సత్యాన్ని మేధస్సు ఇవ్వలేదు. హేతువుకు, తర్కానికి అది వ్యతిరేకమైనది. ఋజువు చేయబడవలసిన సత్యం కాదది. అంతర్గతంగా జీవించబడవలసిన సత్యం అది. ఆ మహనీయ సత్యంలోకి మనం ఎదగాలి. అజ్ఞానం చేసే ఇంద్రజాల విన్యాసాలకు దూరంగా అది స్వయం అభివ్యక్తం, స్వయం సాక్ష్య సందీప్తం. అది దేనికీ అంటని స్వయం ప్రకాశితం. మనల్ని ఆ సత్యం వైపు వెళ్లనీయకుండా చేసే సంశయాలు, అనుమానాలు, కుశంకలు. ఆ అజ్ఞానం నుండి పుట్టినవే. ఇంద్రియాలతో, అభిప్రాయాలతో దిగ్భ్రాంతి చెంది, నతమతమయ్యే మనో హృదయాలనుండి అవి ఉద్భవిస్తాయి. నిమ్న, లౌకిక సత్యసీమలో అవి జీవిస్తుంటాయి. అందుకే ఉన్నత సత్యాలను అవి నిలదీసి ప్రశ్నిస్తాయి. (అజ్ఞాన సంభూతం హృత్ - స్థమ్ సంశయం).

మూలం : శ్రీఅరవిందులు

అనువాదం : యజ్ఞన్న

భయసందేహాలను జయించినప్పటికీ కూడా, ఇక సందేహం అనేది లేదని, సందేహం అసంభవమని - తన జీవితాన్నే సందేహించడం వంటిది - ఒకటి మిగిలివుంటుంది. అది భయానకం, అత్యల్పం, పొడిగా, మనసునే తినివేసేది - అది సంశయం (మత సిద్ధాంతాలలోని సత్యాల్ని శంకించడం) Scepticism - ఇది మనిషి గర్వాంధకారంపై ఆధారపడి వుంటుంది. అందువల్ల అది ఎక్కువకాలం ఉంటుంది. ఈ విషయాలకు అతీతంగా నేను ఉన్నాను. అని

ఆలోచిస్తావు. "ఈ వలలో నేను చిక్కుకోను. హేతువు నన్ను నడుపుతోంది. ఆచరణాత్మక కోణంలో నేను సమస్త విషయాలను గూర్చి పరిశీలిస్తాను. నేనంత తేలికగా మోసపోను."

అది భయంకరం ! ప్రమాదకరం ! క్షుద్రమైనది.

అత్యంత ఉత్సాహం పరవళ్లు తొక్కే క్షణాలలో సైతం అతి అరుదైన, అద్భుత అనుభవాలు కలిగినప్పుడు కూడా, ఈ సంశయం నిమ్న అగాధాల నుండి తల ఎత్తుతుంది. అది పరమ అసహ్యం, నీచం, వినుగెత్తిస్తుంది. అయినా అది తలఎత్తుతుంది. సమస్తాన్ని పాడుచేస్తుంది. దానిని జయించాలంటే ఒక గొప్ప వీరుడుగా మారాలి. ప్రకృతిలోని అస్పష్ట చీకటి కోణాలన్నింటితో పోరాడాలి. ప్రకృతి యుక్తులు, నీచ ప్రేరేపణలతో యుద్ధం చేయాలి.

నీకు ఈ సంశయం మనసు నిండా వుంటే, ఈ పరిస్థితి మారాలని నువ్వు కోరితే, ఈ మూడు భయానక శత్రువులను జయించడానికి తగిన ధైర్యం, మనో బలం, శక్తి నీ వద్ద వున్నట్టే. (ఆ మూడు fear, doubt, scepticism). నేను మళ్లీ మళ్లీ హెచ్చరిస్తున్నాను - ఏదో ఒక మంచిరోజున నిన్ను నీవు పరిశీలన చేసుకొని, నీలో వున్న ఈ శత్రువులతో పోరాడి ఒక్కసారి తుద ముట్టించగలనని అనుకోవద్దు. నీవు పోరాడాలి, మళ్ళీ మళ్ళీ పోరాటం సాగించాలి. ఇది ఒక అంతులేని పోరాటం. అవి పూర్తిగా నశించిపోయాయని రూఢి చేసుకోవాలి. నిజానికి నీవెన్నడూ వాటిని జయించలేవు. నీలోని నువ్వు ఏదో విభిన్నంగా వున్నట్లు, ఆ శత్రువులు నిన్ను స్పృశించలేవని భావించే కాలం వస్తుంది. వాటిని నువ్వు చూడగలవు. కాని నువ్వు చిరునవ్వుతో వాటిని వీక్షిస్తావు. ఒక చూపుతో, ఒక సూచనతో అవి పలాయనం చిత్తగిస్తాయి. అవి ఎక్కడ నుండి వచ్చాయో ఆస్థానంలోకి వెళ్లిపోతాయి. కొద్దిగా మార్పుచెంది, మరింత బలహీనపడి, దాడిచేసే శక్తి తగ్గిపోతుంది వాటికి. వాటి మూర్ఖపు పట్టు సడలిపోతుంది. దివ్యకాంతి బలీనమై మెరిసినప్పడు, చీకటి అంతా అంతర్ధానం అవుతుంది. తప్పదు.

- శ్రీమాత

అనువాదం : యజ్ఞన్న

అనంత ఆనందానుభూతులు, పరిపూర్ణ శక్తులు, స్వయం సిద్ధ విజ్ఞాన తేజోమయతీరాలు, మన అంతర్జీవితంలో సువిశాల ప్రశాంత రమణీయతలు ఉన్నాయని మానవాళి కనుగొనగలిగితే, క్షణికమైన అనుభవం ద్వారానైనా మెరుపులాంటి సాక్షాత్కారాన్ని వారి అంతర్నేత్రం దర్శించగలిగితే, వారు జీవితంలోని సమస్త బంధాల్ని, సుఖాలను పరిత్యజించి, ఆ (ఆత్మ) నిధుల్ని పొందేవరకు వారు విశ్రాంతి పొందరు. ఈ దివ్య సంపద అంతా మన మృగ పరిణామ దశ ఇంకా జయించని అజ్ఞేయ పథాలలో దాగివుంది. కాని ఆ దారి సన్ననిది, తలుపులు తెరవలేనంతగా బిగిసిపోయివున్నాయి. భయ, సందేహాలు, సంశయం - ఈ మూడు ప్రకృతి నియమించిన కాపలాదారులు. మనం సుఖాలు పొందే జీవన సామాన్య పరీవాహక సీమల నుండి వెళ్లి పోకుండా, మనల్ని అడ్డుకొంటాయి. అవి.

- శ్రీఅరవిందులు

అనువాదం : యజ్ఞన్న

విశ్రాంతి - విరామం

విరామం (Relaxation) గురించి చాలామంది అభిప్రాయం

ప్రశ్న : అమ్మా, నేను గమనించినదేమంటే, ఎవరైనా వ్యాపారం లేక పని గురించి బయటివారితో మాట్లాడేటప్పడు సంభాషణ చాలాచక్కగా, ఆసక్తికరంగా ఉంటుంది. కాని అదే సంభాషణ వ్యక్తిగత జీవిత విషయాలవైపు మరలిన మరుక్షణం అది ఒక్కసారిగా బాధ కలిగించేదిగా అవుతుంది. ఎందువల్ల ?

సమాధానం :

అవును, అది ఎందువల్లనంటే, పని గురించి మాట్లాడేటప్పడు, ముఖ్యంగా సాంకేతికపరమైనదైతే, అది మనిషి వ్యక్తీకరించే వాటన్నింటిలోకి శ్రేష్ఠమైనది. అదే అతని వ్యక్తిగత జీవితానికి సంబంధించినదైతే, చాలా తక్కువ సందర్భాలలో, కొన్నింటిని మినహాయించి, అతను తన స్థాయికి దిగువకు దిగజారుతాడు. కాబట్టి,

అసాధారణ విషయాలలో విఖ్యాతిగాంచిన పండితులు, రచయితలు, కళాకారులు వారి గృహాలకు చేరేసరికి రోత కలిగించే భర్తల గాను, సంతోషం కలిగించని తండ్రులుగాను, వారి చుట్టూ ఉన్న వారికి భరింపశక్యంకాని మనుషులగాను తయారవుతారు. ముఖ్యంగా, నేను మాట్లాడే దెవరి గురించి అంటే, ఉన్నత శ్రేణివర్గీయులై ప్రత్యేక అధ్యయనాలు చేసేవారు నూతన విషయాలు ఆవిష్కరించేవారు, పెద్దసంస్థలను నడిపేవారు : బయట వారు అసామాన్యులు, గొప్ప సామర్థ్యం కలవారు: వారే ఇల్లు చేరేసరికి తరచుగా నిస్సారంగా సాధారణ మనుషులవలె భరించలేని విధంగా తయారవుతారు. వారి జీవితం చాలా బాగుంటుంది, విశ్రాంతి, విరామాలు పొందుతుంటారు. కాని, వినోదించాలనుకుంటే మాత్రం, ఇక ఇంతే సంగతులు; దాని గురించి ఏమని చెప్పమంటారు, నాకు తెలిసిన గొప్ప తెలివితేటలు కలవారు, మెచ్చుకోతగిన కళాకారులు ఒక సమయంలో 'విరామం' పొందటం మొదలుపెట్టి, వారు మొత్తానికి మూర్ఖులైపొయ్యారు. వారు అతినీచమైన పనులు చేశారు. చెడ్డ పెంపకంలో పెరిగిన పిల్లలవలె దుష్టవర్తకులై పోయారు. అది వారికి విరామం కింద లెఖ్ఖ. అదంతా వారికి 'విరామం' పొందాలనే అవసరం కిందికి వస్తుంది. అంటే చాలామందికున్న అభిప్రాయం ఏమిటి ? దానర్థం ప్రతిసారీ దిగజారి పోతూండటం. అసలైన 'విరామం' పొందడానికి ఉన్న స్థాయికి ఒక మెట్టుపైకి పోవాలనే సంగతి వారికి తెలియదు. ఎవరైనా స్థాయికి దిగువకు పడిపోతే అది వారికి అలసట కలగజేసి, మైకం కమ్మేటట్లు చేస్తుంది. అంతేకాక, ఎవరైనా, ప్రతిసారి దిగువకు పడిపోతే, అధోచేతనాభారం ఎక్కువవుతుంది. ఎవరైనా ఎత్తులను అధిరోహించాలనుకుంటే, బ్రహ్మాండమైన అధోచేతనా భారాన్ని ఎన్నో మార్లు వదుల్చుకుని స్వచ్ఛంగా ఉండాలి. లేకపోతే అది వారికి సంకెళ్ళవలె తగులుకుని ఉంటుంది.

పనిలో అలసటను తొలగించుకోవటమంటే నిమ్నస్థాయికి క్రుంగి పోవడం కాదు. నిచ్చెన పైకి ఎక్కాలి. అక్కడే, ఉన్నతిలోనే ఎవరైనా అసలైన విశ్రాంతి పొందుతారు. ఎందువల్లనంటే, అప్పుడతడు అంతరంగ

ప్రశాంతత, ప్రకాశము, విశ్వశక్తిని పొందుతాడు. ఆవిధంగా, కొద్ది కొద్దిగా తనకు తాను ప్రయత్నించి, తన మూల అస్తిత్వ కారణమైన సత్యస్వర్శను పొందుతాడు.

కచ్చితంగా నీకాస్వర్శానుభవమే కలిగితే అది నీ అలసటను పూర్తిగా తొలగిస్తుంది.

- శ్రీమాత

అనువాదం : డా. టి. ప్రసన్నకృష్ణ

వినోదాలు తప్పనిసరా ?

విద్యాబోధనా ప్రక్రియ విధానాలలో, ఒక మాదిరి తేలికైన, ఏవిధంగానూ ఎక్కువగా ఉపకరించని, వినోదాన్నే ఎక్కువగా అందించే కార్యక్రమాలు అవసరమని, అవి పిల్లలకే కాక, పెద్దలకు కూడా ఉపశమనాన్నిస్తాయనే సంగతి చాలా వరకు ఆమోద యోగ్యమే. ఒక దృష్టితో చూస్తే, అది సత్యమే. కాని, దురదృష్టకరమైన విషయం ఏమిటంటే అనేక విషయాలను, నీచమైన, మోటైన, నిమ్న మానవ ప్రకృతికి చెంది దుర్వాసన కొట్టే వాటిని ఆచరించేటందుకు నిబద్ధతను కల్పించే నెపంగా ఈ రకమైన వెసులుబాటు స్వీకరించబడుతున్నది. ఈ మానవ ప్రకృతిలోని ముతక అశ్లీలప్రేరణలు, అపభ్రంశ అభిరుచులను ఈ వెసులుబాటును ఆసరాగా తీసుకుని ప్రదర్శించడానికై ఒక నెపంగా ఎంచుకుని, అనివార్యమైన అవసరాలుగా వాటిని తమ మీద రుద్దుకుంటారు. అలా ఉండనవసరం లేదు. పైగా నిమ్నస్థాయికి దిగజారకుండా వారు విరామం పొందవచ్చును, తుచ్ఛమైన పద్ధతిలో కాకుండా విశ్రాంతి పొందవచ్చును, స్వభావంలో మోటైన రోత పుట్టించే వాటిని పెరగనీయకుండా తమనుతాము ఉల్లాసపరచుకోవచ్చును.

సాధారణంగా గుర్తింపు పొందిన వినోదపు అవసరాన్ని అత్యావశ్యకమైనదనుకోకూడదు. ఇది కృషిని మందగించేదిగ, జీవిత లక్ష్యాన్ని, సృష్టి ప్రయోజనాన్ని, చాలాకాలం కాని, పూర్తిగా కాని విస్మరించేదిగా ఉండకూడదు. అలాగైతే అది కేవలం, ఆకాంక్షలో తీవ్రత లేకపోవడం,

బలహీనతకు లొంగిపోవడం, అస్థిరమైన సంకల్పం, అజ్ఞానం, నిశ్చైతన్యం, సోమరితనం అవుతుంది. ఇటువంటి చేతలను సమర్థించవద్దు. ఇవన్నీ అనవసరం అనే సంగతి నీకు త్వరలోనే అవగతం అవుతుంది. ఒకానొక సమయంలో అవి అసహ్యమైనవిగాను, ఆమోదయోగ్యం కానివిగాను అవుతాయి. పర్యవసానంగా, మానవులు సృష్టించిన వాటిలో అధిక భాగమైనటువంటివి, వాస్తవికతను మరుగుపరుస్తూ పటాటోపాలై నిజానికి అస్థిరతను కలుగజేసే సరదావినోదాలు తమబలాన్ని కోల్పోతాయి. అటువంటి వాటికి ప్రోత్సాహాన్నివ్వటం మానుకోవలసినదే.

- శ్రీమాత

అనువాదం : డా.టి. ప్రసన్నకృష్ణ

నైరాశ్యతను పోగొట్టుకోవడం ఎలా ?

అది చాలా తేలికగా అధిగమించవచ్చు. నైరాశ్యము సాధారణంగా ప్రాణిక దేహంలో ఏర్పడుతుంది. మనిషి తన చైతన్యాన్ని ప్రాణికంలో ఉంచి అట్టేపెట్టినప్పుడు నైరాశ్యత ఆవహిస్తుంది. అప్పుడు వెంటనే అక్కడ నుంచి తొలగిపోయి ప్రగాఢ చైతన్యంలో ప్రవేశిస్తే అది పోతుంది. ఇంకా ఉన్నతమైన ఆలోచనలను కల్పించే తేజస్విత ఊర్ధ్వ మనస్సుకు నైరాశ్యమును పోగొట్టే శక్తి ఉంది. ఆలోచనలు ఏమాత్రం ఉన్నత పద్ధులను చేరినా కూడా ఆ నైరాశ్యం మాయమవుతుంది. ఏమైనప్పటికీ చైత్య సత్తను ఆశ్రయిస్తే ఇక నైరాశ్యమనేదే ఉండదు.

వ్యక్తిలో ప్రాణిక సంతృప్తి కొరవడినా, విపరీతమైన నరాల బడలిక కలిగినా నైరాశ్యత తేలికగా రావచ్చు. బడలికవల్ల కలిగిన నైరాశ్యత పోగొట్టుకోవచ్చు. హాయిగా పడుకొని చక్కబడే వరకూ విశ్రాంతి తీసుకోవాలి; ఇంకా పడుకొని కలలుగంటూ నిద్రపోవాలి. ఇలా మొదటి కారణం వల్ల కలిగిన నైరాశ్యత పోతుంది. ఇక రెండవదైన ప్రాణిక సంతృప్తి కొరవడడమనేది సులభంగా జరుగుతుంది. అటువంటప్పుడు దాన్ని హేతుబద్ధంగా విచారించుకోవాలి. చాకచక్యంగా దాని కారణం కనుక్కొని, ప్రాణిక అసంతృప్తి ఎందుకు కలుగుతుందో విచారించుకోవాలి. ఆ తర్వాత దానిని నిస్సాక్షికంగా

పరిశీలించి అది తన ఆంతరంగిక ఆకాంక్షతో ముడిపడి ఉన్నదా లేక ఒక సాధారణ కోరికో గమనించుకోవాలి. సాధారణంగా ఆంతరంగిక ఆకాంక్షతో సంబంధం లేనిది గానే తెలుస్తుంది. అలా తెలుసుకుంటే దాన్ని తేలికగానే అధిగమించి తన ధోరణిలో కొనసాగవచ్చు. అది సరిపోనట్లయితే ఇంకా లోతుగా పరిశీలిస్తూ చైత్య పురుష వాస్తవికతను పట్టుకోవాలి. ఆ చైత్య పురుష వాస్తవికత నైరాశ్య చలనానికి సోకగానే నైరాశ్యం గాలిలో కలిసి పోతుంది.

- శ్రీమాత

స్వేచ్ఛానువాదం : అమరవాది ప్రభావతి

అమరవాది వెంకట రామ శాస్త్రి

విశ్రమించడం ఎలా ?

విశ్రమించడానికి మొదటి షరతు : సాధ్యమైనంత ప్రశాంత చిత్తత. ఏదైనా ఒక విషయం వచ్చి దానిని నీవు గ్రహించలేనప్పడు నీలో ఒక కుంగుబాటు కలుగుతుంది. శారీరక, ప్రాణిక, మానసికాలు బిగుసుకు పోతవి. బాధకు లోనౌతాయి. అప్పడు ఆయా భాగాలను నీ సంకల్పంతో సడలించాలి. ఏవిధంగా నీ శరీర భాగాలేవైనా బిగుసుకొంటే అంటే నరాలు మెలికబడినా, కండరాలు బిగతన్నినా వాటిని ఉపశమింపచేసి ఎలా విశ్రమింపచేస్తావో ఆ విధంగానే మానసిక, ప్రాణిక భాగాలను కూడా ఉపశమింపచేయటం నేర్చుకోవాలి.

నీ ప్రాణికంలో, మనస్సులో,దేహంలోకలిగే ఒత్తిడిని ఉపశమింప చేసుకునే పద్ధతి చూడటానికి వేర్వేరుగా ఉన్నప్పటికి తార్కికంగా విధానం ఒక్కటే. ఈ విధమైన ఒత్తిడిని నీవు సడలించగానే అసౌక్యరం తగ్గినట్లు కనిపిస్తే అది క్షణికమైన నిరోధమేనన్న మాట, అలాకాక బాధ కొనసాగినట్లైతే సహాయకారిగా ఉండేదాన్ని గ్రహించగల నీ సమర్థతను పెంచుకోవాలి. ఆ బిగువును సడలించిన క్షణమే నిన్ను నీవు విస్తరించుకునే ప్రయత్నం చేయాలి. దానికి చాలా విధానాలున్నాయి.

ఒకచెక్కపై పరుండి నీటిపై తేలుతూ వెళ్ళుతున్నట్లు చేసే భావన కొంతమందికి సహాయకారిగా ఉంటుందంటారు. అలాతేలుతూ, తేలుతూ ఆ నీరంతా వ్యాపించినట్లు వారే ఒక ద్రవ్యరాశిగా మారినట్లు భావించుకుంటారు. కొంతమంది ఆకాశంతోనూ,నక్షత్రాలతోనూ ఏకమైపోతూ , అలా అలా ఆకాశమంత విశాలంగా ఉండే ప్రయత్నం చేస్తారు. కొంతమందికసలు ఈ చిత్రించుకునే అవసరంలేకుండా చైతన్యవంతంగ చైతన్యాన్ని పొందుతూ దానిని విస్తృతపరుచుకుంటూ పోతూ,పోతూ అనంతం దాకా వెళ్ళిపోతారు. పృథ్విఅంతా, అనంత విశ్వమంతా విస్తరింప చేసుకోగలుగుతారు. అలాచేసుకోగలిగినప్పుడు ఇక చక్కగా ఓరిమితో గ్రహించగలిగేవారుగా తయారవుతారు. ఇదంతా శిక్షణను బట్టి ఉంటుందని చెప్పానుకదా. ఏది ఏమైనప్పటికీ ఏదైనా వచ్చినప్పుడు అదినీకు చాలా బలవత్తరమైందిగా తోచి భరించలేని తలనొప్పి కలిగిస్తుంటే నీవు చేయవలసింది అదే ఆ బిగుతును సడలించాలి. ఆలోచనాపరంగా దానిని నిగ్రహించవచ్చు. ప్రశాంతత నిర్మలత్వాలను ఆవహించుకోవాలి. ప్రశాంతంగా ఉన్నాననే భావనే కష్టాలను చాలావరకు తొలగిస్తుంది. శాంతి మంత్రం "శాంతి, శాంతి,శాంతి,శాంతి,ప్రశాంతి, నిశ్చలత" అనుకుంటూ ఉంటే చాలా చికాకులు, ఇంకా శారీరకమైన సూర్యనాడి జనిత బిగువులు, బాధలూ,వికారాలూ ఊపిరాడకుండా బిగుసుకుపోతున్నట్లుండే చికాకులూ మటుమాయం కాగలవు. వాటికన్నిటికీ కారణం నాడీకేంద్రమైన నాభిచక్రము.;ఇది చాలా తేలికగా కలత పడుతుంది. అందువల్ల దీనికేమైనా అదిపోయేదాకా నీవు శాంతి మంత్రాన్ని శాంతి, శాంతి,శాంతి,అంటూ పునశ్చరణ చేయవలసిందే.;

భావార్థ విషయంలోకూడా ఇదే ప్రక్రియ ఆచరించాలి. నీవేదైనా చదువుతున్నప్పుడు అందులోని భావం నీకుఅర్థంకాలేదనుకో, అది నీపరిధికి మించి ఉన్నప్పుడు నీవెంత ఆలోచించి బుర్రబద్దలు చేసుకున్నా బోధపడక బిగిసిపోయి ఆలోచించిన కొద్దీ తల గట్టిపడిపోయి తలనొప్పి

ప్రారంభ మవుతుంది. ఇక అప్పుడు చేయవలసిందొక్కటే. మాటలకోసం వెతుక్కోకుండా ఎక్కడివక్కడ వదిలేసి ఒళ్ళంతా సడలించుకొని చక్కటి విశ్రాంతి పొందాలి. ఇక అర్థం చేసుకొనే ప్రయత్నం మానివేసి అలా అలా విశ్రాంతి పొందుతుంటే నీ తలనొప్పి మాయమైపోతుంది. అలా దాని గురించి ఆలోచించకుండా వదిలేస్తే కొన్నాళ్ళైన తర్వాత దానంతటదే లోపల్లోపల నీకు బోధపడుతుంది. "అరే, అది వరకు లేనిది ఇప్పుడెంత తేలికై పోయింది".అనిస్తుంది.

ఈ రోజుల్లో నాడీరుగ్మతల నివారణ చికిత్సాపద్ధతుల్లో ఈ పద్ధతిని కూడా అవలంబిస్తున్నారు. అతి ఉద్రిక్తతకు లోనై నరాలవత్తిడితో నిద్రలేమివల్ల బలహీనపడిన వారిని ఒక అక్వేరియం (చేపలతొట్టి) ముందు కూర్చోపెడతారు. ఆ బంగారు వర్ణ మత్స్యద్వయాలను చూస్తూంటే చాలా ఆహ్లాదంగా ఉంటుంది కదా! అలా వాటిముందు స్థిమితంగా కూర్చొని ఏ విషయాన్నీ, ముఖ్యంగావున్న తన బాధలను గురించి ఆలోచించకుండా వాటినే చూస్తూ ఉండమంటారు. ఆచేపలు ఇటూ అటూ తిరుగుతూ, ఈతకోడుతూ ,ఒక్కొక్కప్పుడు నీటిపై తేలుతూ, వస్తూ,పోతూ విన్యాసాలు చేస్తూ ఒకదానినొకటి తరుముకుంటూ, ఆనీటిని కదులుస్తూఉండటం చూస్తూంటే ఆరోగి తనను తానే మరిచిపోయి తనూ ఒక చేప అయినట్లూ ఈదుతూ కదులాడి విన్యాసాలు చేస్తున్నట్లే భావిస్తాడు. ఒక గంట గడిచేసరికే అతని నరాలవత్తడి తగ్గి స్థిమితపడి చక్కటి విశ్రాంతిని పొందుతాడు.

దీనికి కావలసిందల్లా ఒక్కటే. తమ బాధలను మరిచిపోయి చేపలవైపే దృష్టి సారించడము.

- శ్రీమాత

అనువాదం : అమరవాది ప్రభావతి

అమరవాది వెంకటరామశాస్త్రి.

నిద్రకు ముందు విశ్రాంతి

స్వప్నాల్లో ఎన్ని వినూత్న విషయాలు బహిర్గతమవుతవో అంతే వుండదు. అయితే ఒక విషయం చాలా ముఖ్యం. అతిగ అలసి పోయినప్పడు నిద్రకు ఉపక్రమించకు, అలా చేసినట్లయితే ఒకరకమైన మైమరపు స్థితిలోనికి జారిపోతావు. ఏకాస్తంతకూడా అదుపులో నుంచ వీలుపడని కలలు నీతో చెలగాటమాడతాయి. ఎల్లప్పుడు భోజనం చేసే ముందు ఎలాగైతే విశ్రాంతి చెంది వుండాలో, పడుకునే ముందు కూడ విశ్రాంతి చెంది వుండాలని మీకందరికి నా సలహా, అయితే మీరు ఎలా విశ్రాంతి తీసుకోవాలో తప్పక తెలుసుకోవాలి.

అందుకు అనేక మార్గాలున్నాయి. వాటిలో ఇదొకటి, ముమ్ముందుగా మంచంపైనో లేక పడకకుర్చీలోనో శరీరాన్ని జారగిల పడవేసి దాన్ని నెమ్మదిపరచు. అటు పిమ్మట ఒకేసారిగాగాని లేక విడివిడిగా గాని నరాల బిగువును సడలించుటకు ప్రయత్నించు. ఈ ప్రయత్నాన్ని నీవు పూర్ణ విశ్రాంతి పొందేంత వరకు కొనసాగించాలి. అటు తరువాత నీ శరీరం ఒక గుడ్డపీలికలా మంచంపై అచేతనంగా పడివున్నప్పుడు , నీమెదడును స్పృహకోల్పోవునంత వరకు నిశ్శబ్దపర్చు . స్పందనలుడిగిన స్థాణువులా చెయ్యి. ఆపైన ఈ స్థితినుండి నెమ్మదిగా నిద్రలోకి జారిపో. మరునాడు ఉదయం మేల్కొనేటప్పటికి శక్తి పుంజుకుని చలాకీగా వుంటావు. అలాగాక, అలసి సొలసి విశ్రాంతి పొందకుండా నిద్రకుపక్రమించినట్లయితే ఒక బరువైన మొద్దునిద్రకు లోనౌతావు. నీప్రాణికమంతా శక్తి విహీనమై పోతుంది.

తక్షణ ఫలితం సాధించడం కష్టమవచ్చు, కాని పట్టు మాత్రం సడలించకు.

నిజమైన విశ్రాంతి

ప్రతిఘటించుటకు భయపడి శాంతి వాదులుగా మారిన వారిని, విశ్రాంతిని అనుభవించే అర్హతను ఆర్జించకుండానే, విశ్రాంతికై తహతహలాడే వారిని, అతి స్వల్ప అభివృద్ధిని సాధించుటతోనే సంతృప్తి

చెంది, అదే ఒక అత్యద్భుత సిద్ధిగా వూహించుకొని మార్గమధ్యంలోనే ఆగిపోవుటను సమర్థించు కొనుటకు , దానిని ఆసరాగా వాడుకునే వారిని ఎన్ని సార్లు మనం జీవితంలో కలవము?

సాధారణ జీవితంలో ఇది ఎన్నోసార్లు సంభవిస్తుంటుంది. నిజానికి మానవజాతిని నిర్జీవ పరచి, మనిషిని నేటి దుస్థితికి దిగుజార్చిన బూర్జువా సిద్ధాంమిది. "వయస్సులో వున్నప్పుడే శ్రమించు, సంపదను, గౌరవాన్ని, హోదాను సముపార్జించు, ముందు జాగ్రతతో వ్యవహరించు, కొంత దూరదృష్టిని కలిగి వుండు, ఎంతో కొంత వెనకేసుకో, మూలధానాన్ని కూడబెట్టు, ఉద్యోగస్తుడివికా- ఎలాగంటే , నీవు నలభైయోపడిలో పడినప్పుడు, కాలుపై కాలేసుక్కూర్చుని ముందుగా ఆదాయాన్ని ఆతర్వాత పెన్షను అనుభవించి, అందరూ అనుకొనే కష్టార్జిత విశ్రాంతిని పొంది సంతోషించు. చతికిలబడుట, మార్గమధ్యంలోనే ఆగిపోవుట, ముందంజ వేయకుండుట ,నిద్రపోవుట, సమయాసన్నం కాకముందే సమాధి లోనికి జారిపోవుట , జీవిత పరమావధిని సాధించలేకపోవుట ఇదంతా చతికిల బడటమే!

ఏక్షణాన్నైతే పురోగమనం ఆగుతుందో అప్పుడే నీవు వెనక్కు పడిపోయినట్టు, ఏక్షణాన్నైతే సంతృప్తి చెంది, ఆకాంక్షించుటను ఆపివేస్తావో, అప్పుడే నీమరణం మొదలైందన్నమాట. జీవితం ఒక గమనం, ఒక ఉద్యమం, ఒక ముందడుగు , నవ్యావిష్కరణల దిశగా సాగే ఆరోహణ, భావి సాఫల్యతల పొందుకై పడే ప్రయాస. విశ్రమించాలనే కోరికకన్నా ప్రమాదకరమైనది మరొకటి లేదు. దైవ కృపపై నుండే పూర్ణ విశ్వాసంలోను, కోరికలు లేకపోవుట లోనూ, అహంకారాన్ని అణచి వేయుటలోను వుండే నిజమైన విశ్రాంతిని కార్యసాధనలోను, ఉద్యమించుటలోను, ముందడుగు వేయుటలోను పొందగలగాలి.

నిజమైన విశ్రాంతి , చైతన్యాన్ని విస్తృతపరచుట ద్వారాను , విశ్వమంత విశాలంగావించుట ద్వారాను లభిస్తుంది. ప్రపంచమంత విశాలంగా ఎదుగు,అప్పుడు ఎల్లప్పడు విశ్రాంతిని పొందగలవు. కార్యాచరణలో

తలమున్కలైవునప్పుడు, పోరాటం కొనసాగిస్తున్నప్పుడు, పడే ప్రయాసలో నిత్యమైన, సత్యమైన అనంతమైన విశ్రాంతిని పొందగలుగుతావు.

- శ్రీమాత

అనువాదం : అందుగులపాటి కైలాసపతి

జానకి.

<u>అనుబంధం</u>

ఏప్రిల్ 4, 1910

శ్రీ అరవిందులు రాజకీయ కార్యాచరణకి ప్రవేశించి 1903 నుంచి 1910 వరకు అందులో కొనసాగేరు. వారి లక్ష్యం ఒక్కటే. స్వరాజ్యం, దానిని సాధించటానికి పోరాటం. అంతవరకు కాంగ్రెసువారు కొనసాగించే పనికి మాలిన వంగి సలాంచేసే బలహీన పద్ధతికి స్వస్తిచెప్పి ప్రత్యామ్యాయంగా పోరాటపద్ధతిని ప్రజలమనస్సుల్లో ప్రవేశింపచేయటం. ఇదీ వారి సంకల్పం. మానవాళికి ఒక ఆధ్యాత్మిక పరిణామ దశ ప్రారంభించటానికి ఏప్రిల్ 4,1910 న పాండిచేరి వచ్చేవరకు ఆ పోరాటం జరుపబడింది. పాండిచ్చేరి వచ్చాక, మానవాళికి ఒక నూతన ఆధ్యాత్మిక పరిణామ దశ ఆరంభింపబడింది. అది అస్పష్ట, చీకటి, అజ్ఞాన శక్తులనుండి మానవాళికి దాశ్య విమోచనం.

అప్పటికే పాండిచేరి ఒక తపోభూమి. వేదపురిగా పిలువబడే యజ్ఞవేది. నళినికాంతగుప్తగారి రచనలనుంచి సేకరించిన ఒక భాగాన్ని ఇక్కడ ఉటంకిస్తున్నాం.

ఆ రోజుల్లో పాండిచ్చేరిలోని College de France లో, ఫ్రెంచి ఆచార్యుడుగా, Jouveau Dubreuil అనే ఆయన ఉండేవాడు. తర్వాత ఆయన చాల ప్రఖ్యాతికాంచాడు. అప్పుడు అక్కడ ఆయన పురాతనచరిత్ర, పురాతత్వ శాస్త్ర పరిశోధకుడుగా ఉండేవాడు. పాండిచ్చేరి ప్రాచీనచరిత్ర గురించి పరిశోధన చేస్తూఉండేవాడు. ప్రాచీన శాసనాలు, పత్రాలు, స్మారకచిహ్నాలు మొదలైనవాటి అధ్యయనంవల్ల, పాండిచ్చేరి నగరం, వేదపురిగా ఒకప్పుడు ప్రసిద్ధి గాంచినదని ఆయన కనిపెట్టాడు. అంటే అప్పడది వేదాధ్యయన

కేంద్రంగా వేదపురిగా ప్రసిద్ధికాంచి ఉంటూ ఉండేది. ఈ వేదవిద్యాలయం సరిగ్గా మన ఆశ్రమ ప్రధాన కట్టడం ఉన్న చోటనే ఉండేదని మన ఫ్రెంచి ఆచార్యుడు పురాతన పటాలు, మరి ఇతర ఆధారాలను బట్టి తెలుసుకున్నాడు.

ఒక ప్రాచీన సంప్రదాయం ప్రకారం వైదిక వాఙ్మయాన్ని, ఆర్యుల విద్యావిభాగాన్ని దక్షిణాదిన విస్తరింప చేయటానికని ఋషి అగస్త్యుడు ఇక్కడికి వచ్చాడు. ద్రవిడ నాగరికతలో ఆర్య నాగరికతను ప్రవేశపెట్టడం ఆయన పథకంతోనే ప్రారంభం అయినట్లు కనిపిస్తుంది. బెంగాలీ కవి హేమచంద్రుని కవితా పంక్తులు ఈ సందర్భంగా గుర్తు చేసుకోతగ్గవి.

ఓ, పర్వతరాజమా, లే,
అగస్త్యులు తిరిగి వచ్చారు;
ఒక నవ సంకేతం కదలాడుతోంది
ఒక దివ్యకాంతి వెల్లువ ప్రబల వేగంతో పొంగి పొరలుతోంది;
అదిగో, ఒక ఉజ్వల నవోదయ కాంతి వైభవం గగనతలాన నిలిచింది
ఓ పర్వత రాజమా! ఈ కాంతిని పట్టిఉంచు,
ఒక నవోదయం నేలపై ప్రసరించేలా ;
అది ఈ నవ విజ్ఞానాన్ని పరిపోషించేలా,
మరో క్రొత్త జీవనం అలవర్చుకొనేలా ;
ఓ కొత్త కల పండించు మా అందరికోసం
బరువైన నీ నీలి బహుళ విస్తృతి నిలబెట్టు

ఈ చారిత్రక గాథ ప్రకారం అగస్త్యుడు దక్షిణాదికి పయనించాడు. వింధ్య పర్వతాలు వారికి దారి నివ్వటానికి క్రింది ఒదిగాయి. అప్పటి నుంచి అవి అలా ఒరిగే ఉన్నాయి. మహర్షి తిరిగివచ్చే దాకా. వైదిక ఋషి అగస్త్యుడి కథ సందర్భంగా మనకు అనాలోచితంగా వెంటనే శ్రీఅరవిందులు గుర్తుకువస్తారు. అగస్త్యుడులానే, వారూ దక్షిణాదికి వచ్చారు, ఒక నూతన దివ్యకాంతిని వెలువరింపచేయటానికి. ఈ ప్రాంతంలో వారు ఉత్తర యోగిగా ప్రఖ్యాతి కాంచారు కూడా. సాధనా

క్రియాకలాపాలలో కనీసం ఒక అంశంలో వారికి అగస్త్యులతో పోలిక ఉంది. అవచేతన భౌతిక అగాధాలలోకి అగస్త్యులు కొన్ని సంవత్సరాలు చొచ్చుకొనిపోతూ పదార్థ పరార్థ లోకాలు రెంటిని పరిపోషించి ఉద్ధరించారు. తననెచ్చెలి, లోపాముద్రతో కలిసి, ఇహలోకంలోనే, విజయసాధనకు కృషిచేశారు. వైదిక మహర్షులు తపోకృషిని మరింత ఉన్నతతర సిద్ధిసాధనలో శత, సహస్రగుణాలుగా కొనసాగిస్తూ సంపూర్ణ విజయాన్ని సాధించారు. శ్రీఅరవిందుల లక్ష్య సాధన కూడా సరిగ్గా ఇదే కదా!

అనువాదం : కర్రావెంకటేశ్వర్లు

మార్చి 29, 1914

మార్చి 29, 1914న శ్రీమాత ఫ్రాన్సునుంచి వస్తూనే శ్రీ అరవిందులతో సమావేశమయినారు. మరునాడు ఉదయం తమడైరీలో ఇలా వ్రాసుకున్నారు.

"వేలమంది గాఢ అజ్ఞానాంధకారంలో మునిగి ఉండి ఉందురుగాక, మరేం ఫర్వాలేదు. నిన్న మేము దర్శించినాయన ఈ భూమిమీద ఉన్నారు. వారి సమక్షమేచాలు, చీకటి, వెలుతురుగా రూపాంతరీకరింపబడే రోజు ఒకటి రాబోతుందని నిరూపించటానికి. నిజంగానే నీపాలన ఈ భూమిపై స్థాపిం పబడుతుంది. (ప్రభూ)..........".

1920 సంవత్సరానికి చంద్రనాగూరు పత్రిక అభ్యర్థనమేరకి శ్రీమాత ఈ విధంగా వ్రాశారు.

భూమిమీద నిర్వర్తించవలసిన ధర్మాచరణ చైతన్యం నాకు ఎలా ఎపుడు కలిగింది? శ్రీఅరవిందుల వారిని నేను ఎలా ఎప్పుడు కలిశాను?

నీవు ఈరెండు ప్రశ్నలు నన్ను అడిగావు. సంక్షిప్తంగా సమాధానాలు ఇస్తానని వాగ్దానం చేశాను.

ధర్మాచరణ పరిజ్ఞానంగురించి నాకు అది ఎప్పుడు కలిగిందో చెప్పటం కష్టం. దానితోనే నేను జన్మించాననిపిస్తుంది. మనసు, మెదడు పెరుగుదలతోబాటు ఈ చైతన్యం యొక్క నిర్దిష్టత, పరిపూర్ణత పెంపొందుతూ వచ్చాయి.

11,13, సం.రాల మధ్య చైత్యపురుష, ఆధ్యాత్మిక అనుభవాలు, భగవంతుని ఉనికి, ఆయనతో మానవుడు సమైక్యం కాగలిగే అవకాశం నాకు అవిష్కృతమైంది. చైతన్యంలోను,కర్మలోను సమగ్రంగా సిద్ధిపొందే అవకాశం, భూమిమీద దివ్యజీవనంలో వారి అభివ్యక్తీకరణకు సావకాశంకూడా విశదం కాబడింది. ఇది, దీనితోపాటు, దీనిని సిద్ధింప చేసుకోగలిగే ఆచరణాత్మక క్రమశిక్షణ నాకు నిద్రలో పలువురు గురువులద్వారా తెలిసింది. వారిని తర్వాత భౌతికంగా కలుసుకోవటం కూడా జరిగింది.

తర్వాత అంతర్గత, బహిర్గత అభివృద్ధి కొనసాగేకొలది వీరిలో ఒకరితో ఆధ్యాత్మిక చైత్యపురుష అనుబంధం తరుచుగా స్పష్టమయేది. నాకు అప్పట్లో భారతీయ తాత్వికచింతన, మతము వీటితో పరిచయ మంతగా లేకపోయినా ఆయనను 'కృష్ణ' పేరుతో పిలుచుకోనే దాన్ని. తర్వాత ఏదోనాడు జీవితంలో వారిని చూడకపోను అని, ఆయనతోనే నాదివ్యకార్యక్రమము నిర్వ హింపబడగలదని తెలుసుకున్నాను.

1910 సం.రంలో నాభర్త ఒక్కరే పాండిచ్చేరి వచ్చారు. అప్పుడు విలక్షణమైన ఆసక్తికర పరిస్థితులలో శ్రీఅరవిందులతో వారికి పరిచయ మేర్పడింది. అప్పటినుంచి మేమిద్దరం తిరిగి భారతదేశం రావాలని ప్రగాఢంగా కోరుకున్నాం. భారతదేశాన్ని నేనెప్పుడూ నానిజమైన మాతృభూమిగా భావించాను. 1914లోనూ ఆనందం నెరవేరింది.

శ్రీఅరవిందులవారిని చూచీ చూడగనే నేను 'కృష్ణ' అని పిలుచుకునే బాగా తెలిసిన వ్యక్తిగా ఈయన్ని గుర్తించాను. ఇది చాలునాకు నాజన్మభూమి, కర్మభూమి భారతదేశమేనని నమ్మటానికి.

- శ్రీమాత

అనువాదం : కర్రా వెంకటేశ్వర్లు

కాంతికిరణాలు

విశ్వాసము,నమ్మకము,నిశ్చయము:

విశ్వాసము- దైవంపై నమ్మకము, దైవముపట్ల దృఢ నిశ్చయము.

దృఢనిశ్చయమే విశ్వాసము ఇది అనుభవ విజ్ఞానములపై నాధారపడనవసరములేదు.

గాఢాంధకారంలో విశ్వాసము నిశ్చయాతినిశ్చయమైన మార్గదర్శి.

ఆగష్టు16,1954.

ప్రతిక్షణము కూడా మనమెన్నడూ అనుకోనిది ఊహించనది ,మనకు తెలియనిదీ తటస్థ పడుతుంటుంది. మనకప్పుడు ఏమి జరిగేదీ మన విశ్వాసముయొక్క తీవ్రత, స్వచ్ఛతలపై ఆధారపడుతుంది.

నవంబరు 03, 1954

పసివాని యొక్క అతిసాధారణ నమ్మకంలో గొప్ప శక్తి ఉంది.

నవంబరు17,1954

దైవముపై నిశ్చల ప్రశాంత నమ్మకమే కష్టాలనెదుర్కొనే అత్యుత్తమ మార్గము.

ఆగష్టు13,1966

నమ్మకంతో పురోగమిస్తాం. నిశ్చయంతో వేచి ఉంటాం.

దైవకృప:

ప్రపంచానికి దానిరక్షణకొరకు సర్వోన్నతుడు తన దివ్యకృపను పంపాడు.

మనమనుకునే మానవ వివేకం యొక్క సంక్లిష్టతలకు అతీతంగా పైన సరళసుందర ప్రకాశమానమైన దైవకృప పనిచేయటానికి సిద్ధంగా ఉంది. అది పనిచేయటానికిమనం మరి వీలు కల్పించాలి.

ఫిబ్రవరి21,1965

దైవకృప ముందు పనికిమాలినవాడు, పనికి వచ్చేవాడు అని ఎవరు?

అందరూ ఒకే తల్లి బిడ్డలే.

ఆమె అనురాగం, అందరిపైనా ఒకేలా ప్రసరిస్తుంది.

అయితే ప్రతిఒక్కరికీ, వారిస్వభావానుగుణంగా గ్రహించగలిగే శక్తి ఆమెవారికి ప్రసాదిస్తుంది.

దివ్యకృప అందరికీ సమానమే. ప్రతి ఒక్కరూ వారివారి చిత్తశుద్ధికి అనుగుణంగా దానిని అందుకుంటారు. బాహ్యపరిస్థితులపై అది ఆధారపడి ఉండదు. వారి చిత్తశుద్ధితో కూడిన ఆకాంక్ష ఉన్మీలనత (openness) - లపై ఆధారపడి ఉంటుంది.

ఏ అరమరికలు లేకుండా దైవానికి మనలను మనం సమర్పణ కావించుకుందాం.

గరిష్ఠ స్థాయిలో దైవకృప మనకు లభ్యమవుతుంది.

<u>దైవకృపపై విశ్వాసం :</u>

ఆకాంక్షించే వారందరికీ, కృప సహకారము ఎప్పుడూ ఉంటుంది. వారి శక్తి అపారము. కాకపోతే విశ్వాసం, నమ్మకంతో అందుకోవాలి.

అంతా దిగజారిపోతున్నదనుకుంటున్న తరుణంలో - సరిగ్గా అప్పడే మనం పరమోన్నత నమ్మకంతో వ్యవహరించాలి. దైవకృప ఎన్నడూ విఫలమవదని తెలుసుకోవాలి.

జనవరి1, 1947

మన జీవితంలో అనుక్షణము, అన్ని పరిస్థితులలోను మనకష్టాలనుంచి మనలను అధిగమింపచేయటానికి దైవకృప మనకు సాయంగా అక్కడ సిద్ధంగా ఉంటుంది.

అక్టోబరు 8, 1954

పైకి మనకు అగుపించే ఈ గందరగోళ పరిస్థితి ద్వారా ఒక వినూత్నము, మరింత శ్రేయోదాయకము అయిన విధివిధానం

రూపొందింపబడుతున్నది. అయితే మరి దానిని దర్శించేందుకు దైవకృప పట్ల విశ్వాసం ఉండాలి. సమధికోత్సాహంతో సిద్ధంకండి.

అక్టోబరు 13, 1956.

అంతా అయిపోయిందనుకున్నపుడే, సర్వమూ సంరక్షింపబడుతుంది. నీ పురుషకారం (Personal Power) పై నమ్మకం కోల్పోయినప్పుడు సరిగ్గా అపుడే దైవకృప పట్ల విశ్వాసం, సడలకుండా, కలిగి ఉండాలి.

జనవరి 28, 1970.

అంతిమ సారాంశంగా సర్వమూ దైవకృప పైననే వాస్తవంగా ఆధారపడి ఉంటుంది. నమ్మకంతో ప్రశాంతంగా భవిష్యత్తును దర్శించాలి. అదే సమయంలో వీలైనంత వేగంగా ముందుకు పురోగమించాలి.

<u>దైవకృపలో నమ్మకం:</u>

దైవము పట్ల మనకున్న నమ్మకమునకు తగిన ప్రమాణంలో దైవకృప మనపై ప్రవర్తించి సహకరించగలదు.

వాదన లేకుండా, వ్యాకులపాటు లేకుండా పసివానివలె దైవాన్ని నమ్ము, ఆయన ఇచ్ఛయే జరగాలని.

సెప్టెంబరు 7, 1954.

దైవకృపయందు పరిపూర్ణ విశ్వాసంతో పొందిన ప్రశాంతతతో పోల్చదగినది, ఏదీలేదు.

నీ బాధ్యతనంతా, నీ పురోభివృద్ధితో సహా దైవకృపకే విడిచిపెట్టు. ప్రశాంతంగా ఉంటావు.

మే 5, 1958.

దైవములో, ఆయన యొక్క వివేకములో, కరుణలో పరిపూర్ణ నమ్మకము కలిగి ఉన్నవానికి, ఇక, మరే సమస్యలు ఉండవు.

<u>దైవకృప, కష్టములు.</u>

దైవ కృపపట్ల దృఢమైన విశ్వాసం నమ్మకం కలిగి. పరిపూర్ణ నిశ్చల, ప్రశాంతలతో ఉన్నపుడు మాత్రమే పరిస్థితులు వీలైనంత

అనుకూలంగా ఉంచ గలుగుతావు. భగవంతునిలో భగవంతునిపై మాత్రమే పూర్తి నమ్మకం ఉంటేనే సర్వదా సర్వోత్కృష్టమైనదే సంభవిస్తుంది.

ఫిబ్రవరి, 9, 1930

ఈ భూమిపై మనుష్యులకు విముక్తిని కలిగించే పరస్పరపూరకమైన రెండు దివ్యకృపా పరిపూరిత క్రియా దృక్పథాలు ఉన్నాయి. ఈ రెండు దృక్పథాలు వాటి ఆవశ్యకతలో హెచ్చుతగ్గులు లేనివి. కాని వాటి విలువలు సమానంగా గుర్తింపబడలేదు.(అవి) ఆరాటం, ఉద్వేగం, బాధలనుంచి విముక్తినిచ్చే, నిలకడగా ఉండే సర్వోత్కృష్ట ప్రశాంతత.

బంధాలు, దాస్యం, జడత్వం, వీటినుంచి విముక్తి కలిగించే గమన శీలమైన సర్వ శక్తి వంతమైన పురోగతి.

ఈ ప్రశాంతత దివ్యమైనదని విశ్వజనీనంగా గుర్తించబడింది; ప్రశంశించబడింది. అయితే ఎవరి ఆకాంక్ష తీవ్రంగా ,సాహసోపేతంగా ఉంటుందో, వారే ఈ పురోగతిని స్వాగతీకరిస్తారు.

ఎప్రిల్,24,1958

జీవితంలో నీవొక కష్టాన్ని ఎదుర్కొన్నప్పుడు ప్రభువు అనుగ్రహంగా దానిని స్వీకరించు. వాస్తవానికి అది అంతే.

1962

నీవు ఏమి కోరుకుంటావో అంతాదానిపై ఆధారపడి ఉంటుంది. నీవు యోగము కావాలనుకుంటే జరిగేది సర్వమూ నీలక్ష్యాన్ని ముందుకు తీసుకొని వెళ్లే దివ్యకృప యొక్క వ్యక్తీకరణగా స్వీకరించు. పరిస్థితులు నీకు నేర్పిన పాఠాన్ని అవగాహన చేసుకునే ప్రయత్నం చెయ్యి.

ఏప్రిల్23,1964

దైవకృప అంటే జీవితాన్నంతటిని సుగమంగావించేదని ప్రజలు నమ్ముతారు. అది నిజం కాదు. నీ ఆకాంక్షను సిద్ధింపచేయటానికి

దైవకృప పనిచేస్తుంది. అతిత్వరితంగాను, వెంటనే సిద్ధిపొందటానికి అంతా సన్నద్ధం చేయబడుతుంది.

మే26,1967

ఒక్కవిషయం మనం ఒప్పుకుని తీరాలి. దైవంతో సమైక్యత, చివరికి దైవ అభివ్యక్తీకరణ జరిగేదంతా తప్పనిసరిగా జరగాల్సినదే వీలైనంత త్వరగా మనలను, ప్రపంచాన్ని లక్ష్యసాధన దిశగా నడిపించటానికే ఇది నిరంతరాయంగా చిత్తశుద్ధితో కూడిన విశ్వాసం, మనకు రక్షణ, సహకారముకూడ ఒకే పర్యాయం కలిగిస్తుంది.

చిత్తశుద్ధి:

దైవానికి ద్వారాలను తెరచే తాళంచెవి చిత్తశుద్ధి.

చిత్తశుద్ది అంటే సత్వముయొక్క అన్ని చలిత చాలనాలను సర్వోన్నత చైతన్య స్థాయికి ఉద్ధరించడం. అంతవరకు సాధించిన దానిని సిద్దింప చేసుకోవటం. దైవేచ్ఛకి కేంద్రస్థానం చుట్టూ సత్వమంతా అన్నిభాగాలలో సమైక్యతను, సామరస్యతను చిత్తశుద్ధి నిర్బంధిస్తుంది.

ఫిబ్రవరి21,1930

ఎప్పుడూ చిత్తశుద్ధితో ఉండు నిరవధికంగా ....

ప్రతి ఒక్కరు వానియొక్క ఆలోచనలలో ,భావాలలో, సంవేదవనలలో, కర్మలలో తన సత్వము యొక్క కేంద్రసత్యమునుతప్ప మరేదీ వ్యక్తీకరించకూడదు. ప్రతి ఒక్కరినుంచి చిత్తశుద్ది నిర్బంధించేది ఇది.

ఏప్రిల్4,1950

చిత్తశుద్ధితో ఉండటానికి సత్వము యొక్క అన్నిభాగాలు దైవంకోసం వాటి ఆకాంక్షలో సమైక్యంగా ఉండాలి. ఏదో ఒక భాగం కావాలని, మిగిలినవి తిరస్కరించటం లేదా ఎదురుతిరగటంకాదు. దైవము, దైవము కొరకే అంతే కాని పేరు,ప్రతిష్ఠ దర్జా,హోదా, ఆడంబరం కోసం కాదు. చిత్తశుద్ధితో కూడిన ఆకాంక్ష అంటే ఇది కాదు.

నిండైనమనసుతో నీవు మాత్రమే నాకు కావాలి అనినీవు భగవంతునికి నివేదించుకుంటే, చిత్తశుద్దితో ఉండే పరిస్థితులు ఆయనే నీకు కల్పిస్తాడు.

జూన్,8.1954

సత్వములో విభజన అంతా కృత్రిమమే. నీ నిజసత్వానికి, శరీరానికి మధ్య అగాధాన్ని సృష్టించటమే అన్నిటికీ మించిన కపటం.

అగాధము సత్యసత్వమును భౌతిక సత్వమునుంచి వేరు చేసినపుడు అన్నిరకాలైన పనికిమాలిన సూచనలతో ప్రకృతి దానిని నింపివేస్తుంది. వీటిలోకల్లా అన్నిటికంటే దుర్ఘటనమైనది,భయం, ఉపద్రవమైనది సందేహం.

నీ సత్వములో ఏదీ సత్యాన్ని నిరాకరించనీయకు.ఇదే చిత్తశుద్ధి.

జూలై7,1957

పరిపూర్ణచిత్తశుద్ధికి (మానసిక,ప్రాణిక)ఇష్టాలు,కోర్కెలు శత్రువులు. అవేకాక ముందుగానే ఏర్పర్చుకున్న అభిప్రాయాలు కూడా! ఇదిగో, ఈ ఆటంకాలనే అధిగమించాలి.

దివ్య సత్యచేతన ముందు ఏ కాస్తంత చిత్తశుద్ధి అయినాకూడా, సముద్రమంత కపటము, నటనకంటే, మరింతగానో విలువైనవి.

రాజీలేని చిత్తశుద్ధి ఆధ్యాత్మిక సాధనకి రాచబాట.

నటనవద్దు(వాస్తవంగా)ఉండు.

వాగ్దానంవద్దు.ఆచరించు.

కలలుకనకు -సిద్ధిపొందు.

(ఆత్మద్రోహంవద్దు.) నీకు నీవు నిజాయితీగా ఉండు.

దైవంపట్ల చిత్తశుద్ధి కలిగిఉండు(అర్చణలో బేరసారాలు వద్దు.)

మనుష్యులతో ముక్కుసూటిగా ఉండు.(నటన,కపటం, వద్దు)

జూన్25.1963

నీవు చిత్తశుద్ధి పాటించాలంటే ఇంకొకరికి కోసం కాచుకొని ఉండక్కర్లేదు.

మార్చి9, 1968

ఒకపురాతన chaldean గాధ

చాలాకాలంనాటి మాట. ఎడారిదేశమైన అరేబియాలో దివ్యప్రేమను మేల్కొల్పటానికి ఒక దివ్య మానవుడు అవతరించాడు. అనుకున్నట్లే ప్రజలు అతన్ని అపార్థంచేసుకున్నారు. అవమానపర్చారు. వెంటతరిమి హింసించారు. అతనిపై దండెత్తిన వాళ్లు అతన్ని బాగా హింసించారు. గాయపర్చారు. తాను ఏకాంతంగా ప్రశాంతంగా చచ్చిపోవాలనుకున్నాడు. ఆవిధంగానైనా తను సాధించాలనుకున్న పని సాధింపబడుతుందనుకున్నాడు. జనాలు వెంటతరిమారు. తప్పించుకు పారిపోయాడు వారి నుంచి. ఆకస్మికంగా విశాలమైన ఒక మైదానంలో ఓ చిన్నదానిమ్మ గుబురు అగుపించింది. ఈ రక్షకుడు ప్రశాంతంగా దేహం చాలిద్దామని నేలకు ఆనుకుని ఉన్న ఆ గుబురు కొమ్మల్లోకి దాకోటానికి చొరబడ్డాడు. వెంటనే ఆ గుబురు ఆశ్చర్యంగా విస్తృతం కావటం ప్రారంభమై, దట్టంగా, పుష్కలంగా పెరిగింది. ఆతన్ని వెంట తరిమేవాళ్ళు ఆ ప్రక్కగా వెళ్లినాకూడా ఈతనక్కడ దాగి ఉంటాడని అనుమానించలేక పోయారు. ముందుకలా సాగిపోయారు.

అతని పవిత్రమైన రక్తం బొట్లుబొట్లుగా పడి, నేల, ఆ పొద సారవంతమై ఎర్రని రేకులుగా విచ్చిన పువ్వులతో గుత్తులుగా విపరీతంగా అల్లుకుపోయింది.

ఈ పువ్వులే మనకు దివ్యప్రేమని పట్టి ఉంచి వ్యక్తపరుస్తాయి.

నవంబరు 14, 1955.

ప్రేమించేవాడే ప్రేమని గుర్తించగలుగుతాడు. నిష్కపటమైన ప్రేమలో తమనుతాము అర్పణ కావించుకోలేనివాళ్లు ప్రేమను ఎప్పుడు ఎక్కడా గుర్తించలేరు. అది ఇంకా నిస్వార్థమైన దివ్యప్రేమ అయినపుడు - మరీ అసలు గుర్తించలేరు.

దివ్యప్రేమచైతన్యం పొందాలంటే మిగిలిన సాధారణ ప్రేమను వదిలిపెట్టాలి.

దివ్యప్రేమ - మానవప్రేమ:

దివ్యప్రేమ పైనే సమగ్రంగా ఆధారపడి ఉండు. దివ్యప్రేమను పొందిన వానికి మానవప్రేమపై విలువేమి ఉంటుంది?

సెప్టెంబరు 2, 1939

ఒక్క విషయం మాత్రం మీకు నేను చెప్పగలను. ఇద్దరు వ్యక్తుల మధ్యన ఉండే సంబంధంలో చిత్తశుద్ధి, సారళ్యత, శుద్ధత ఎలాటిదైనా కానీయండి, అది దివ్యశక్తి సహకారాల నుంచి కొద్దోగొప్పో మరుగు పరుస్తుంది. వారి వారి బల, తేజ, శ్శక్తులను వారి యొక్క అంతర్నిహిత సాధ్యాసాధ్య ప్రమాణశక్తులకి పరిమితం చేస్తుంది.

ఫిబ్రవరి 15, 1950.

- శ్రీమాత

అనువాదం : కర్రావెంకటేశ్వర్లు

(సశేషం)

సమాచార పత్రం

సొసైటి సభ్యత్వ రుసుముల సవరణ (1-4-2009 నుండి)

మాగజైన్‌తో సభ్యత్వ రుసుము

		అమెరికన్ డాలర్లు	
ఒక సంవత్సరానికి	Rs.150/-	25	15
మూడు సం॥లకు	440/-	75	45
5 సం॥లకు	730/-	125	75
డొనార్ మెంబర్ 10సం॥లకు	3000/-	375	-
కంట్రిబ్యూటింగ్ మెంబర్ 1సం॥కు	300/-	80	-
కంట్రిబ్యూటింగ్ డొనార్‌మెంబర్ 15 సం॥లకు	10,000/-	100	-

మాగజైన్ లేని సభ్యత్వములు తక్షణం రద్దుచేయనైనది. ఏ సభ్యుడైనా సొసైటి సభ్యత్వము పొందదలిచినచో వారికి పైన చూపిన రుసుములే వర్తించును.

Rs. 15

పువ్వు: తపస్సు



చతుర్విధ తపస్సులు – మోక్షములు

అఖిల

అఖిల భారత పత్రిక, ఏప్రిల్ 2009

అఖిల

భారత పత్రిక - ఏప్రియల్, ౨౦౦౧

పదార్థము పరార్థము నావిష్కరిస్తుంది - శ్రీఅరవిందులు

శ్రీమాత వాక్కులు

విషయసూచిక

లక్ష్యములేని జీవితము సర్వదా దుర్భరమైన దైన్యజీవితమే.

- శ్రీమాత

Supreme Lord! Eternal Truth!

Let us Obey Thee alone

and live according to Truth.

- The Mother

విద్య

విద్యాభ్యాసము పుట్టుకతో ప్రారంభమై ఆమరణాంతము కొనసాగు చుండవలసినదే. సంపూర్ణమైన విద్యాఫలితముల నందవలెనన, పుట్టుకకు పూర్వమే విద్యారంభము కావలెను. ఈ దశలో బిడ్డతల్లియే ఈ కార్యక్రమమును రెండు శాఖలుగ నడిపించవలెను. ఒకటి, తన మేలు కొరకు తాననుసరించవలసినది; రెండవది; తనలో పెరుగుచున్న బిడ్డశ్రేయస్సు నాశించి చేయవలసినది. పుట్టబోయే బిడ్డ గుణ గణములు, స్వభావములు, ఆ బిడ్డతల్లి సంకల్పములు, ఆకాంక్షలపై నాధారపడియున్న విషయము విశదమే. అంతేకాదు, ఆమె నివసించు ప్రదేశ పరిస్థితులు వాతావరణముపై కూడ నాధారపడి యున్నది. తల్లికి సంబంధించినంత వరకు ఆమె మనోభావములు, మానసిక ప్రవృత్తులు నిర్మలములై, ఆనందజనకములై యుండవలెను ;ఆమె హృదయము నందలి ఊహలు, కోరికలు ఉదారములు, శ్రేయోదాయకములై యుండవలెను; ఆమె జీవిత పరిసరములు సామర్థ్యముతో నిండి, నిరాడంబరములై యుండవలెను ; ఇది తల్లి తెలుసుకొని ఆచరించవలసిన విద్య, ఇదిగాక, బిడ్డ ఆదర్శప్రాయుడుగ, మహోన్నతుడుగ జన్మించవలెనన, తల్లి మనస్సంకల్పము స్థిరమై ఎరుక గలదైనచో, అప్పుడు అనుకూలమైన పరిస్థితులేర్పడి, బిడ్డ మహత్తరమైన శక్తులతో ఈ ప్రపంచములో జన్మించును. ఈ విధమగు విధానము నవలంబించిన యెడల అనేకములైన కష్టభూయిష్ఠమగు ప్రయోగముల బారినుండియు, వ్యర్థమగు క్లిష్టపరిస్థితుల బారినుండి తప్పించుకొనవచ్చును.

మానవుని కర్మవిభాగములు అయిదుగాన, సమగ్రమైన విద్యా విధానములో వాటికి సంబంధించిన పంచవిధానములు కలవు. అవి శారీరక, ప్రాణిక, మానసిక, చైత్యిక (psychic), ఆధ్యాత్మిక విభాగములు, సాధారణముగ, ఈ విభాగములకు సంబంధించిన విద్యాభ్యాసము, కాలక్రమానుసారముగ, వ్యక్తి పెరుగుదల ననుసరించి ఆచరించ బడుచుండును. అంటే ఒకటి అయిన పిమ్మట మరొకటి అభ్యసించుట కాదు; అన్నియు ఏకకాలములో ఒకదాని నొకటి పూరించుకొనుచు జీవితాంతము అభ్యసించు చుండవలెను.

విద్యావిధానము నందలి ఈ అయిదు అంగములను దేనికి దానిని ప్రత్యేకముగ అధ్యయనము చేసి, వాటి పరస్పర సంబంధములను కూడ పరిశీలింతము. దీనిని ప్రారంభించుటకు ముందు తల్లితండ్రుల కొక సూచన. చాలా మంది తల్లిదండ్రులు అనేక కారణముల వలన, పిల్లలకు నేర్పవలసిన విద్యావిషయములో శ్రద్ధ వహించుట లేదు. బిడ్డను కని ఈ ప్రపంచములోనికి తీసుకొనివచ్చిన తరువాత, ఆ బిడ్డకు ఆహారమునిచ్చి పోషించుట, భౌతిక అవసరములను తీర్చుట, ఆరోగ్యమును జాగ్రత్తగ పరిరక్షించుటతో ఆ బిడ్డ యెడల తమ బాధ్యత పూర్తిగ నెరవేరినదని భావించుచుందురు. పిమ్మట బిడ్డను బడికి పంపి వాని విద్యాభ్యాసమును బడిపంతుల కప్పగింతురు.

కాని, కొందరు తల్లిదండ్రులు తమ బిడ్డల విద్యావ్యాసంగమునందు కూడ శ్రద్ధ వహించి, తాము చేయతగినంత చేయుచుందరు. కాని బిడ్డల విద్యాభ్యాసము నందు నిజమైన శ్రద్ధాసక్తులుగల తల్లిదండ్రులు కూడా బిడ్డలకు విద్య గఱపుటకు ముందు తాము విద్యనభ్యసించి, తమ ప్రవృత్తులందు, చర్యలందు ఎఱుకగల, స్వామిత్వము గల వ్యక్తులై యుండవలెను; లేనియెడల, బిడ్డలనుసరించుటకు తామే చెడ్డ ఉదాహరణలై, వారు చెడిపోవుటకు తామే కారకులమను విషయము తెలియక అజ్ఞానముతో ప్రవర్తింతురు. విద్యకు అన్నిటికంటె ప్రధానమైనది, ఆచరించి చూపించుట. ఇదియే ప్రబలమైన శక్తిగల విధానము. చిన్నపిల్లలకు, మంచి మాటలుగాని, తెలివిగల సలహాలు గాని రుచింపవు. తాను చెప్పిన మాటలు తానాచరించనిచో, అవి పిల్లలపై ప్రభావము కలుగజేయవు. నిష్కపట ప్రవృత్తి నీతి నిజాయితీలతో నిండిన ప్రవర్తన, ఒకేమాటకు కట్టుబడి నిలబడుట, ధైర్యము, అనాసక్తి, తొందరపాటు లేకుండుట, విసుగుదల లేకుండట, ఓరిమి, ప్రశాంతత, నిశ్చలత, ఆత్మసంయమనము మొదలగునవి అందమైన మాటలకంటె, ఆచరించి చూపించుట వలన ఎక్కువగ నేర్పవచ్చును. తల్లిదండ్రులు మంచి ఉన్నతమైన ఆదర్శము కలిగి దానికొరకై పాటుపడువారైనచో, వారి బిడ్డలు కొంచెము కొంచెముగ ఆ లక్ష్యముచే ఆకర్షించువారై సునాయాసముగ అందుకనువైన గుణములను ప్రకటించి వృద్ధిపొందించుకొను వారగుదురు. అప్పడు పిల్లలకు తల్లిదండ్రుల యెడల సహజమైన భక్తి-ప్రపత్తులేర్పడి, వారిని గౌరవించుట, శ్లాఘించుట

జరుగును. తల్లిదండ్రులు గుణహీనులు కానిచో, బిడ్డలు వారిని దేవతలుగ పూజించి వారిని సర్వవిధముల అనుకరింతురు.

ఎక్కడో తప్ప, సాధారణముగ తల్లిదండ్రుల యొక్క లోపములు, ఉద్రేకములు, బలహీనతలు, ఆత్మసంయమన రాహిత్యము మొదలుగాగల అవగుణముల యొక్క దుష్టభావము వారి పిల్లల నెంత పాడువేయునో వారికి తెలియదు. బిడ్డలు తల్లిదండ్రులను గౌరవించవలెనన, వారు ఆత్మగౌరవము కలిగి సర్వదా గౌరవ పాత్రులుగ మెలగవలెను. అధికారదర్పమునుగాని, నిరంకుశత్వమునుగాని, విసుగుదలను గాని పిల్లలముందు ఎన్నడును ప్రదర్శించకూడదు. చిన్నపిల్లలు ఏదైన ప్రశ్నవేసిన, వారు అర్థము చేసుకొనలేరను దురభిప్రాయముతో, వారికేదో సందర్భము లేని తెలివితక్కువ సమాధాన మీయకూడదు. కొంచెము శ్రమ తీసుకొనగలిగిన, పిల్లలకు బోధపడునట్లుగ వారి ప్రశ్నలకు జవాబు చెప్పవచ్చును. ఎల్లవేళలందు నిజమే చెప్పట మంచిది కాదని లోకములో బలమైన నమ్మకమున్నది. కాని నిజము చెప్పట మంచి పద్ధతియని నా ధృడమైన విశ్వాసము. వినువారి అంతస్తునకు అందుబాటులో నుండునట్లు చెప్పటయే అందలి నేర్పరితనము. బిడ్డకు పది రెండు లేక పది నాల్గువత్సరముల వయస్సు వచ్చువరకు, వాని బుద్ధి, నిగూఢమైన తత్త్వమునుగాని, సూత్రీకరింపబడిన సాధారణ భావములను గాని అర్థము చేసుకొనలేదు. కాని, వాటిని రూపకల్పనల ద్వారా గాని, సంకేతముల ద్వారా గాని, కథల రూపమునగాని అర్థము చేసుకొనుటకు అలవాటు పఱచవచ్చును. ఎంత వయస్సు వచ్చినను వారి బుద్ధి బాల్యావస్థలోనే నుండు కొందరికి బహుసిద్ధాంత వివరణల కంటె, ఒక వయస్సు వచ్చునంత దనుక, బాగుగ వివరించి చెప్పబడినచో, ఒక చరిత్ర, ఒక కథ లేదా ఒక గాథ, అధిక జ్ఞానదాయకమగును.

తప్పించుకొనవలసిన మఱియొక ప్రమాదము : చిన్నబిడ్డను తగినంత కారణమున్నను, అనివార్య పరిస్థితులలో తప్ప, నిర్హేతుకముగ ఎన్నడు తిట్టుట, కోపబడుట చేయరాదు. తరచు తిట్లకు అలవాటు పడిన బిడ్డ మొండితనమును పెంచుకొని, నీ తిట్లకు విలువ నీయక, నీ నిష్ఠుర వాక్కులను నిర్లక్ష్యము చేయును. నీవు చేసిన తప్పనకు నీ బిడ్డను దండించకుండునటుల జాగ్రత్త తీసికొనవలెను.

చిన్నపిల్లలు, నిశితముగ పరిశీలించగల, విస్పష్టముగ గమనించగల విచక్షణులు, వారు నీ యందలి దుర్బలత్వమును గ్రహించి, నిర్దాక్షిణ్యముగ జ్ఞాపక ముంచుకొందురు.

చిన్న బిడ్డ ఏదైనను తప్పు చేసినప్పుడు దానిని వెంటనే దాపరికము లేక నీ సమక్షములో నివేదించునట్లు చూడుము. తప్పు ఒప్పుకొని చెప్పినప్పుడు, నీవు ప్రేమతో, వాత్సల్యముతో బిడ్డకు అర్థమగునట్లు వివరించగలిగినచో, ఆ తప్పు ఎన్నడును తిరిగిచేయడు. కావున, తప్పు చేసినందుకు తిట్టకూడదు. తప్పు ఒప్పుకొనిన వెంటనే క్షమించి విస్మరించవలెను. నీబిడ్డకును, నీకును మధ్య భయోత్పాతమును కల్పించకూడదు. భయముతో నేర్పబడు విద్యచాల వినాశకరమైనది. దాని వలన అబద్ధములాడుట, మోసముచేయుట అలవడును. తెలివితో కూడిన ప్రేమ, మంచితనముతో మిళితమైన పట్టుదల, అవసరమైన విశ్వాసము (భక్తి ప్రపత్తులు) కలుగును. అప్పడు నీవు వారికి బోధచేయగల శక్తిగలవాడవై యుందువు. ఈ పనిని నిర్వహించుటకు నీవు ఎంతో నియమబద్ధమైన ఆత్మసంయమ నమును అలవరచుకొనవలెను. అప్పడు నీవు ఈ ప్రపంచములోనికి ఒక జీవుని తీసుకొనివచ్చిన బాధ్యతను సక్రమముగ నిర్వహించినవాడ వగుదువు.

- శ్రీమాత

అనువాదం : మానాప్రగడ శ్రీరాములు

చతుర్విధ తపస్సులు - చతుర్విధ మోక్షములు

అతిమానస సంసిద్ధికి మార్గదర్శియగు సంపూర్ణ విద్య నభ్యసించుటకు అవసరమైన ముఖ్య విషయములు నాలుగు తపస్సులు, అవి సాధించు నాలుగు మోక్షములు.

తపస్సనగా శరీరమును శోషింపజేయు ప్రక్రియ అని ప్రజలలో సామాన్యమైన ఒక దురభిప్రాయ మేర్పడియున్నది. ఎవరైనను తపస్సును గురించి ప్రసంగించదలచినప్పుడు సన్యాసాశ్రమమును స్వీకరించిన వారవలంబించు కఠోర నియమములని మనము భావింతుము. సన్యాసి, శారీరక, ప్రాణిక, మానసిక జీవితములను ఆధ్యాత్మికములుగ, మార్చుటకు అవసరమైన శ్రమను తప్పించుకొనుటకు గాను, అవి ఆధ్యాత్మిక పరిణామము

నందుట కనువైనవి కావని ప్రకటించును, అవి ఆధ్యాత్మికాభివృద్ధికి అవరోధము లనియు, బంధము లనియు, ఒట్టి మొండివనియు, వ్యర్థములైన భారములనియు భావించి నిర్దాక్షిణ్యముగ త్రోసిపుచ్చును. మరియు ప్రకృతియో, లేదా దైవమో నీపై దయ దలచి నీకు మరణమును ప్రసాదించువరకు నీ వేదోవిధముగా వాటి నానందముతో భరిపంవలె నను అపోహలోనున్నారు. ఈ పృథివిపై జీవనము ఆధ్యాత్మిక సాధనకు రంగస్థలము మాత్రమే నని భావించి అవసరమైనంత వరకు చక్కగ దానిని వినియోగించుకొని, తొందరగ సిద్ధినంది, అటుపిమ్మట ఇది యొక అవాంఛనీయమైన క్లేశముగ దాని నంత మొందించుటయే మంచిదని భావించుచున్నారు.

కాని, మన దృష్టిలో జీవన సమస్య వేరు. ఈ భౌతిక జీవితము ఒక మార్గము; ఒక ఉపకరణము మాత్రమే కాదు, పరిణామము ద్వారా ఇదియొక లక్ష్యము, ఒక సంసిద్ధి కావలయునని తలంచుచున్నాము. కనుక, తపస్స నినప్పడు, శరీరము పట్ల ఒక నిరసన భావముతో గాని, దాని నేదోవిధముగ వదల్చుకొనవలెనను భావముతో గానికాక దానిని వశపరచుకొని, దానిపై స్వామ్యము కలిగియుండుట అవసరమను భావముతో ఆ తపస్సును గురించి చెప్పచున్నాము. సన్యాసి ఆచరించు శారీరక తపస్సుకంటె విలక్షణమైనదియు, సంపూర్ణమైనదియు, మరియొకటి బహుక్లిష్టమైన తపస్సు కలదు. ఆ తపస్సె పరిపూర్ణ పరివర్తనమున కవసరము; ఆదియే చతుర్విధ తపస్సు. అది అతీతమానస సత్త నావిర్భవింపజేయుటకు వ్యక్తిని తయారుచేయును, ఈ విధముగ శారీరక పూర్ణత్వమును సిద్ధింపజేయుటకై వ్యాయామ శిక్షణ కోరు తపస్సు, ఇతర తపస్సు లంత కఠినమైనది కాదని ఎవరైనను ఉదాహరణమునకు చెప్పవచ్చును. ఈ విషయమును గురించి సమయోచితముగ తిరిగి వివరించుకొందము.

ఈ చతుర్విధ తపస్సులను గురించి ప్రసంగించుటకు ముందు, సాధారణముగ అనేకమంది అపార్థము చేసుకొని, మనస్సులో గందరగోళమును సృష్టించు ఒక మౌలికమైన ప్రశ్నను సుస్పష్టముగ వివరించవలసి యున్నది. అది సన్యాసులు, తమ అనుష్ఠానము నందలి ప్రక్రియలను ఆధ్యాత్మిక శిక్షణలుగ భావించుటకు సంబంధించినది. సన్యాసమునందు ఆత్మను శరీరబంధము

నుండి విముక్తము చేయవలెనని చెప్పదురు; కనుక, శరీరమును నీచభావముతో చూచు అభ్యాసముల నాచరింతురు. అవి ఆధ్యాత్మిక శిక్షణలకు విషయవ్యామోహములు సృష్టించు వికారరూపములు. "కష్టపడుటవసర" మనే విపరీతబుద్ధి ప్రభావముచే సన్న్యాసానుష్ఠానమందు దేహమును నిర్లక్ష్యము చేసి బాధించుట, ఆత్మను శోషింపజేయుట ఒక భాగమై పోయినది. సాధువులు, పైకి పొడుచుకొని యున్న మేకులపై పరుండుట, క్రైస్తవుల కొరడాల ప్రయోగము, బొచ్చుచొక్కాల (hair-shirts) వినియోగము ఇవన్నియు ఇంచుమించుగ తెరచాటునుండి బహిరంగముగ ప్రకటింపబడనివియు - ప్రకటించుటకు తగనివియునగు హింసను ప్రేమించు విపరీత ప్రవృత్తులకు (sadistic tendencies) చెందినవే. ఇది యొక విధమైన అనారోగ్య వాంఛ లేదా అధశ్చేతనము ఆరాటము, తీవ్రమైన ఇంద్రియ స్పందన. నిజమునకు ఈ అభ్యాసము లన్నియు ఆధ్యాత్మిక జీవితమునకు సంబంధము లేక చాలా దూరము నున్నవి. ఏలన, ఇవి వికారము, నైచ్యము, అంధకారము, అనారోగ్యములతో నిండి యుండగ, ఆధ్యాత్మిక జీవితము వీటికి వ్యతిరేకమైన వెలుగు, అందము, ఆనందము, సామరస్యములతో నిండియున్నది. ఇవి భౌతిక దేహము పట్ల మనః ప్రాణములకు గల క్రౌర్యముచే కనిపెట్టబడి కొనియాడబడినవి. క్రూరప్రవృత్తి అజ్ఞానలక్షణ మగుటచే, అట్టి క్రౌర్యమును స్వీయశరీరముపై చూపినను అది క్రూరత్వ మనిపించుకొనునే గాని, మరియొకటి కానేరదు. అజ్ఞాన స్వభావము తీవ్రమైన ఆవేశానుభవములను వాంఛించును. తీవ్రత లేని ఆవేశములు, అచేతనాప్రకృతులకు రుచింపవు, మరియు క్రూరత్వ మనునది తీక్షణమైన ఇంద్రియ స్పందనలను కలిగించు ఒక విధమైన మనాసిక రోగమేయగును. ఈ అభ్యాసము వలన కలుగు ప్రయోజన మేమన, ఇంద్రియముల సంక్షోభమును పూర్తిగ అంతరింపజేసి, తాను పరబ్రహ్మసాక్షాత్కారమునకు తీయు పరుగులో (చేయు ప్రయత్నములో) భౌతిక శరీరము అడ్డురాకుండ చేయుట. కాని యిట్టి శిక్షణ యొక్క ఉపలబ్ధి సందేహాస్పదము. ఏ వ్యక్తియైనను తొందరగ, అభివృద్ధి పొందవలెనన, కష్టముల నెదుర్కొనుటకు వెనుదీయరాదను సత్యము సర్వసమ్మతమే. కాని, కష్టమైన పనులను సర్వదా చేయవలెనని కోరుకొనుట వలన, అతని సంకల్ప బలము, శరీరదార్ఢ్యము (నరముల శక్తియును)

పటిష్ఠమగుటకు అవకాశము తానంతట అదే వచ్చును. ఎక్కువ సంతోష దాయకమైన స్వేచ్ఛాజీవితమును, అందువలన కలుగు మౌఢ్యమును అదుపులో నుంచుటకు, తీవ్రమైన వైరాగ్యము నవలంబించి నిరోధించవచ్చును; కాని మితిమీరకుండ, సంతులనాత్మకముగ, తొందరపాటు లేని నిర్మలత్వముతో జీవితమును నడుపగలుగుట అంతకంటె ఎక్కువ కష్టతరమైన పని. భౌతిక కాయమును కాదని, దాని నాశనము సంభవించు వరకు దానిని నిరసించి నిందించుట కంటె, దానిని సామరస్యముతో, శాంతియుతమైన నిరాడంబరమైన వాతావరణముతో క్రమవికాసము నొందునట్లు చేయుట మిక్కిలి కష్టతమమైన పని. శరీరమునకు అవసరమైన పుష్టి, పోషణ, పరిశుద్ధతల నివ్వక దానిని శుష్కింపజేసి నియమబద్ధముగ జీవించుచున్నా మని డంబాచారములు చెప్పకొనుటకంటె కోరికలు లేకుండ ప్రశాంతమైన జీవితమును గడపుట చాల కష్టమైన పని. శారీరక అనారోగ్యమును నిర్లక్ష్యము చేసి, పట్టించుకొనక దాని నిష్టమొచ్చినట్లు శరీరనాశనము చేయుటకు విడిచి పెట్టవచ్చును. కాని, శరీరమునకు రోగము రాకుండునట్లు గాని, వచ్చినచో దానిని బాహ్యాంతర సామరస్యముతో నివారణ చేసి విజయము సాధించుటగాని, బహుకష్టముతో కూడిన పని. శారీరక చేతన స్థాయి దిగజారి ఆసుర ప్రకృతి ప్రభావమునకు లోను కాకుండునట్లు దాని నత్యున్నత స్థాయిలో నిలబెట్టగలుగుట, వీటి యన్నిటికంటె అసాధ్యమైన పని.

ఈ కారణముచేత, మనలో నాలుగు విధములైన స్వేచ్ఛలను స్థాపించు చతుర్విధ ఉపాసన లిచ్చట ఉద్ఘాటింపబడినవి. ఈ చదుర్విధ తపస్సుల ఆచరణ విధానము నీ క్రింది నాలుగు విధములుగ పేర్కొనవచ్చును.

1. ప్రేమ తపస్సు (ప్రేమోపాసన)
2. జ్ఞాన తపస్సు (జ్ఞానోపాసన)
3. శక్తి తపస్సు (శక్త్యుపాసన)
4. సౌందర్య తపస్సు (సౌందర్యోపాసన)

ఈ ఉపాసనలు ఒక క్రమములో పై నుండి క్రిందికి చెప్పబడినవి. దానిని బట్టి వాటిలో మొదటిది గొప్పదని, రెండవది తక్కువదని భావించుటకు వీలులేదు. అదేవిధముగ దీని తర్వాత ఇది ఆచరించవలెనని చెప్పటకు కూడ

అవకాశము లేదు. ఏది ప్రధానమో, దేని తరువాత నేది ఆచరించవలెనో, ఆ వ్యక్తి తన సామర్థ్యము, ఆవశ్యకత ననుసరించి యుండునే గాని, అందుకొక స్థిరమైన సిద్ధాంతము (నియమావళి) లేదు. తన శక్తి సామర్థ్యములను బట్టి ఎవరికి వారు నిర్ణయించుకొనవలెను.

కనుక, ఇక్కడ వీలై నంత పరిపూర్ణముగ ఒక సామూహిక దృక్పథముతో ఏర్పాటు చేయబడిన ఆదర్శప్రాయమైన విధానమే వివరింపబడెను. ఎవరికి వారు తమ కనుకూలమైన, తా మాచరించ గల విధానమును చేపట్టవలెను.

సౌందర్యోపాసన

సౌందర్యోపాసన, శారీరక తపస్సు ద్వారా స్వేచ్ఛగల క్రియా విధానమునకు దారిచూపును. అందమైన రూపము గల శరీరము, సామరస్య సమేతమగు అంగవిన్యాసములు, మృదుత్వము, చురుకుదనము గల కదలికలు, శక్తివంతమైన క్రియాశీలత, చెక్కుచెదరని ఆరోగ్యము, ప్రత్యంగ సంచలనములు గల శరీరమును రూపొందించుట దీని ప్రాథమిక కార్యక్రమము.

వీటిని సాధించుటకు, భౌతిక జీవితమును వ్యవస్థీకరించుట యందు సహాయకారులగు కొన్ని అలవాటుల నేర్పరుచుకొని సాధారణ పద్ధతిలో ఉపయోగించుట మంచిది. ఏలన, నియమబద్ధమైన చట్రములో దేహము పనిచేయుటకు బాధపడదు. కాని, మన అలవాట్లు ఎంత మంచివైనను వాటికి బానిసలము కాకూడదు. అలవాట్లు ఎంత మెత్తనివై యుండవలెనన, అవసరము వచ్చిన వెంటనే తేలికగా మార్చుటకు అవి వీలుగ నుండవలెను.

సమయము వచ్చినప్పుడు, ఓర్చుకొని పనిచేయుటకు, ఉక్కు వంటి నరములను, శక్తివంతమైన కండరములను రూపొందించు కొనవలెను. కాని, దేహము వృద్ధి పొందుట కవసరమైన మేరకే కష్టపెట్టుట తెలిసి, మిక్కిలిగ ఆశించక జాగరూకతతో ప్రవర్తించవలెను. శరీరమును ఎక్కువ అలసట పెట్టి, తుదకు క్షీణించి శిథిలమై పోవునట్లు చేయు శ్రమను వర్జీకరించి విడిచి పెట్టవలెను.

శరీరము ఉత్తమ చైతన్యము యొక్క పనిముట్టుగ తయారు చేయుటకు దాని వ్యాయామప్రణాళిక యందు, కఠోరమైన అలవాట్లను రూపొందించవలెను. నిద్ర, ఆహార, విహారాది కార్యములందు, కాల నియమమును చాలా శ్రద్ధగ పాటించవలెను. శరీరావసరములను ఎవరికి వారు నిర్ధాక్షిణ్యముగ పరిశీలించుకొని - ఏలన మనిషికి అవసరములు వేరువేరుగా నుండును - లోటుపాటులు, వైపరీత్యములు లేకుండ ఒక సామాన్య నియమావళి నేర్పాటు చేసుకొనవలెను. ఒకసారి అట్లు చేసిన తరువాత చాపల్యముచేత గాని, సోమరితనము వలన గాని మార్పుచేయక, పట్టుదలతో, దీక్షతో దాని ననుసరించవలెను. ఆ నియములకు "ఈ ఒక్కసారిలే" అను ఎట్టి స్వల్ప మినహాయింపులు కూడ చేయరాదు; ఒక్కసారి అన్నది చాల సారులగును. ఏలన 'ఒక్కసారి' అను ప్రలోభమునకు లొంగిన, నీ సంకల్ప బలముయొక్క నిగ్రహశక్తి తగ్గి, ప్రతికార్యమునందును, పరాజయమునకు తలుపులు తెరచినవాడ వగుదువు. కనుక అట్టి బలహీనతలను పూర్తిగ విడనాడ వలెను. రాత్రులయందు దుశ్చేష్టలు చేసి అలసి సొలసి వచ్చుట, ఆరోగ్యమును చెడగొట్టి జీర్ణకోశమును పాడుచేయు విందు భోజనములు చేయుట, త్రాగుట పనికిరాదు. వినోదముల కొరకు పరుగులిడుట, అక్కరకు మాలిన పనులు చేయుట, సంతోషముకొరకు దేవులాడుట మానవలెను. వీటివలన అనవసరమైన దేహశ్రమ కలిగి, నిత్యసాధనకు శక్తిలేనివాడ వగుదువు. క్రమబద్ధమైన జీవితమునకు శరీరమును మలచి, తన దృష్టిని దేహ దారుఢ్యముపై కేంద్రీకరించి భౌతిక శరీరము వీలైనంత పరిపుష్టి నందునట్లు చేయవలెను. ఆదర్శప్రాయమైన యీ లక్ష్యము నందుటకు, చిన్న పెద్ద అను వివక్షత లేక సర్వకర్మల యందును, పాపప్రవృత్తియు మితిమీరిన ప్రవృత్తియు, కచ్చితముగా వర్జించవలెను. పొగత్రాగుట, మత్తు పదార్థములను సేవించుట మానుకొనవలెను. అవి నెమ్మదిగ తలకెక్కు విషములు. వాటికి అలవాటుపడిన అవి తప్పనిసరియగు అవసరములై నెత్తికెక్కి, జ్ఞాపకశక్తిని, సంకల్పశక్తిని నెమ్మదిగ నాశనము చేయును. ప్రతి మానవునకును - మేధావులకు కూడ - ఆహార పదార్థములను తయారుచేయు విధానములు, వాటిని సేవించి, అనుభవించు సందర్భములు, అమిత ఆసక్తిదాయకమైన వ్యాపారములు. కాని ఈ వ్యాపారముల స్థానే, శాస్త్రీయమైన రసాయనిక విజ్ఞానముతో, శరీరమునకు

అవసరమైన, యోగ్యమైన విధానముల నాచరించుటలో ఒకానొక తపస్సు నవలంబించవలెను. ఆహార విషయములో ననుసరించవలసిన తపస్సునకు (నియమములకు) నిద్ర విషయంలో నవలంబించవలసిన తపస్సును (నియమములను) జోడించవలెను. ఆ నియమము అసలే నిద్ర లేకుండుట కాదు, ఎట్లు నిద్ర పోవలెనో తెలియుట. నిద్రపోవుట యన, స్పృహ లేక పడియుండుట కాదు. అందువలన శరీరము తేలికగ, ఉత్సాహవంతముగ నుండుటకు బదులు బరువెక్కును. కావలసిన మోతాదులో భోజనము చేసి, అతిని విసర్జించిన యెడల, ఎక్కువ కాలము నిద్రపోవలసిన అవసర ముండదు. నిద్రపోవుటలో కాలపరిమితి కంటె ఎట్లు నిద్రపోవలె ననుఅంశమే ప్రధానము. శరీరాయాసమును తగ్గించు చక్కని నిద్ర పట్టవలెనన, నిద్రపోవుటకు ముందు ఒక కప్పు పాలు గాని, పండ్లరసము గాని, సూప్ (Soup) గాని త్రాగవలెను. తేలికగా భోజనము చేసిన, ప్రశాంతమైన నిద్ర పట్టును. పొట్టనిండ భోజనము చేసిన, కలవరములకు గురై గుండెలపై నేదియో ఎక్కినట్లుండును (Nightmare). లేదా ఒళ్ళంత బరువుగ బద్ధకముగ, కదులుట కిష్టము లేక కొండ చిలువ వలె పడియుండును. ఇందు ముఖ్యమైన విషయము మనస్సును ఉద్రేకము లేక నిర్మలముగ నుంచుట. ఈ ఉద్రేకములకు వెనుక, అనేక వాంఛలు, భావములు, సంచరించుచుండును. నిద్రపోవుటకు ముందు ఎక్కువగ మాట్లాడినను, ఒక తీవ్రమైన వాగ్వాదమును జరిపినను, లేదా మిక్కిలి ఆసక్తిదాయకమైన ఏదైన గ్రంథమును చదివినను, మొదట కొంచెము విశ్రాంతి తీసుకొని, మనస్సును కుదుటపరచుకొని, నిద్ర పోవలెను. ఏలన, శారీరకావయవము లన్నియు నిద్రలో మునిగియుండగ, మెదడు మాత్రము అనేక వికృత భావములను రగుల్కొలుపుచుండును. ధ్యానమునకు అలవాటుపడిన సాధకులు, శాంతిదాయకమగు ఒక ఉన్నత భావముపై మనస్సును లగ్నము చేసి కొన్నిక్షణములు ఉన్నతము, విశాలము నగు చైతన్యము నాకాంక్షించుచు ఏకాగ్రతతో ధ్యానము చేయవలెను. దానివలన నిద్ర జడస్వభావములోనికి దిగజారక, సారవంతము, ఫలవంతము కాగలదు.

రాత్రి సమయములో నిద్రావస్థలో ప్రశాంతతతో నిశ్చలముగ విశ్రమించుటకు పాటించవలసిన తపస్సు తెలిసిన పిమ్మట, వివేచనతో

వ్యవస్థీకరించబడిన పగటివేళ తపస్సు వచ్చును. మన దినచర్యలను ఒక వైపు శారీరక సంస్కారమున కనువైనవిగను, రెండవ వైపు మనము ఏ పని చేయపూనుకొందుమో ఆ పని కనువైనవిగను, పురోగమనశీలము గల రెండు రకములైన అభ్యాసములు (కర్మలు) శారీరక తపస్సు నందలి భాగములు కాగలవు, ఆ విధముగ భాగములు కావలెను కూడ. అభ్యాసముల విషయములో ఎవరికి వారు, తమ శరీరమున కనువైన వ్యాయామ ప్రక్రియల నెన్నుకొనవలెను. సాధ్యమైనచో, ఈ శాస్త్రము నందలి నిపుణుని సంప్రదించి, వాని సలహాలను తీసికొనవలెను. అతడు ఏయే వ్యాయామములను సమకూర్చుకొనిన, ఎక్కువ లాభదాయకమో చెప్పగలడు. ఈ వ్యాయామ ప్రక్రియలను ఎన్నుకొనుటలో గాని, ఆచరించుటలో గాని, మోహము పనికిరాదు. తేలికైనదని గాని, తమాషాగా నున్నదని గాని, ఏదో ఒక దానిని చేయకూడదు. వ్యాయామ శిక్షకుడు అవసరమని యెంచి, శిక్షణ విధానమును మార్చినప్పుడు మాత్రమే దానిని (ఆ కార్యక్రమమును) మార్చవలెను. తన శరీరమును పూర్ణము, బలిష్ఠము నైనదిగ తయారు చేసికొను సమస్యకు పరిష్కారమును, ఏ వ్యక్తి కా వ్యక్తి అన్వేషించి నిర్ణయించుకొనవలెను. ఇందులకు, మిక్కిలి ఓర్పుతో, పట్టుదలతో వ్యాయామమాచరించుట, కాలనియమమును పాటించుట చాలా అవసరము. జన బాహుళ్య మెట్లు భావించినను, మల్లుని జీవితము వినోదము, వేడుకలతో నిండినది కాదు. అది ఒక క్రమనిష్ఠతో, కఠోరమైన అలవాట్లతో కూడిన తపస్సు. లక్ష్యసిద్ధి లేని వ్యర్థ వినోదముల కచ్చట తావు లేదు.

కర్మ నాచరించుటలో కూడ ఒక నిష్ఠ కలదు. ఆ నిష్ఠ ఎట్టిదనిన, తాను చేయు ప్రతి పని యందును పరిపూర్ణమైన శ్రద్ధాసక్తులు కలిగియుండవలెనే గాని, కొన్నిటి యందు మాత్రమే అభిమానము, ఆసక్తి కలిగియుండరాదు. ఆత్మాభివృద్ధి నాశించు వానికి, 'గొప్పపని, కొద్దిపని' అని గాని, ప్రధానమైనది, అప్రధానమైనది అని గాని లేదు. ఆత్మాధిపత్యమును, ఆత్మాభివృద్ధిని సాధించ వలెనను ఆకాంక్ష గలవారు, ప్రతి పనిని సమభావముతో, సమానశ్రద్ధతో చేయవలెను. సాధారణముగ, ఆసక్తిగల పనులనే బాగుగ చేయుదురను లోకోక్తి కలదు. అది నిజమే కాని, అంతకు మించిన సత్యమేమన, తాను చేయు ప్రతి

పనిని శ్రద్ధతో, ఆసక్తితో చేయుట నేర్చుకొనవచ్చును. చివరకు జీనవోపాధికై ఒకరియింట జీతమునకు చేయు పనులను కూడ ఆసక్తితో, శ్రద్ధతో చేయవచ్చును. ఇందలి రహస్య మేమన, స్వశక్తిని పూరించుకొని, పూర్ణత్వమును సాధించుటయే. ఏ వృత్తి నీకు సంప్రాప్తమైనను, ఏ కార్యము నీ పాల పడినను, దానిని ఆత్మాభివృద్ధి కొరకు హృదయ పూర్వకముగ, చిత్తశుద్ధితో చేయవలెను. ప్రతి పనిని శక్తి వంచనలేక చక్కగ చేయుటమాత్రమే గాక, పరిపూర్ణతను సాధించవలె నను ప్రయత్నములో దాని నెక్కువ నేర్పుతో చేయుటకు యత్నించవలెను. ఈ విధముగ పనులు కొనసాగించుటవలన ప్రతి పని-దాసీపని మొదలు కళాత్మకము, బుద్ధియుక్తమునగు పనులన్నియు - ఎట్టి మినహాయింపు లేకుండ శ్రద్ధాసక్తులతో చేయుట యలవడును. అభివృద్ధికి అంతులేదు; ఎంత చిన్న పనినైనను ఈవిధముగ చేయవచ్చును.

ఇది సహజముగ, కర్మాచరణ యందు విమోచనమునకు దోవ తీయును. మన కర్మాచరణ, సాంఘిక సంప్రదాయముల నుండియు, నైతిక పక్షపాతముల నుండియు దూరముగ నుండవలెను. దాని భావము చెడ్డనడత, (దుర్వినియోగము చేయబడు స్వేచ్ఛ) నియమరహిత జీవనము కాదు. కాని ఇందుకు భిన్నముగ, తనకు తానే, సాంఘికమైన అన్ని కట్టుబాట్లకు మించిన కఠోర వ్రతములను నియమించుకొని, వాటికి బద్ధుడై యుండవలెను. ఏలన, స్వయంకృత నియమమునందు మోసము సహింపబడదు. పరిశుద్ధమైన, పరిపూర్ణమైన చిత్తశుద్ధి యుండవలెను కదా! శరీరము నందలి సర్వాంగ ములును, సమతూకములో వృద్ధిపొంది, శరీర సౌష్ఠవమును, బలమును పెంచి, శరీరమున కొక సుందర రూపమును ఆపాదించునట్లు, శారీరక కర్మ లన్నిటిని వ్యవస్థీకరించ వలెను. దానిని సాధించుటకు భోగలాలసత్వమును సంపూర్ణముగ స్త్రీ సంభోగముతో సైతము - దూరముగా నుంచవలెను (విసర్జింపవలెను). ఏలన ఒక్కసారి స్త్రీతో సంభోగించిన, ఒక్క అడుగు మృత్యుముఖమువైపు వేయుటయే యగును. ఈ కారణమువలననే, చిరకాలమునుండియు, మతపరమైన పరమ పవిత్ర శాస్త్రములలోను, గుప్తవిద్యలలోను, అమరత్వమును ఆకాంక్షించు సాధకుల విధానములలోను ఇది పూర్తిగ నిషేధింపబడెను. సంభోగానంతరము మనిషి చైతన్యస్థాయి దిగజారి ఏదో కొంతకాలము అచేతన

స్థితిలో నుండి, దుష్టశక్తుల, దురభ్యాసముల ప్రభావము ప్రవేశించుట కవకాశ మేర్పడును; చైతన్య పతనము సంభవించును. కాని, ఈ అతిమానస ఆధ్యాత్మిక జీవనమును నడుపుట కుత్సుకత కలవారు, సుఖము పేరిట గాని, విరామము, విశ్రాంతి పేరిటగాని, తమ చైతన్యము అధోగతిపాలు కాకుండునట్లు (నీచవృత్తులలో ప్రసరించకుండునట్లు) జాగ్రత్తగా కాపాడుకొనవలెను. చైతన్యము యొక్క శక్తి వెలుగుల బాటలలోనే, విశ్రాంతి స్థితి (relaxation) పొందవలెను గాని, తామసముతో నిండిన బలహీనత, అంధకారములలో కాదు. అభివృద్ధి నాశించు వారందరు శారీరక బ్రహ్మచర్యమును ప్రధాన నియమముగ పాటించవలెను. అతిమానస ఆవిర్భావమునకై యత్నించువారు ఈ నిగ్రహశక్తితో విషయవ్యామోహమును విడనాడవలెను. అంటే జితేంద్రియులు కావలెను. కాని, ఈ ఇంద్రియ నిగ్రహము బలవంతముగా గాని, పట్టుపట్టి అణచిపెట్టుట వలన గాని జరుగరాదు. ఒకానొక రసాయినిక శక్తి వంటి అంతశ్శక్తి తేజశ్శక్తిగ మారి, సమగ్రమైన అభివృద్ధిని, రూపాంతరమును సాధించవలెను. సంపూర్ణమైన ఫలితము నందవలెనన, కామప్రేరణలను, వాంఛలను, మానసిక, ప్రాణిక చైతన్యము నుండి నిర్విశేషముగను సమూలముగను తొలగించవలెను. అదేవిధముగ భౌతిక సంకల్పము నుండి కూడ ఈ వాంఛలను తీసి పారవేయవలెను. స్థిరమైన, సమూలముగ యదార్థమైన రూపాంతరము లోపలి నుండి బయటకు ప్రసరించు చుండును. అనగా బాహ్యముగ గోచరమగు మార్పు ఈ సాధనకృషిలో సహజము, అనివార్యము కావలెను.

మన మిప్పుడు ముఖ్యముగ నిర్ణయించుకొనవలసిన విషయము : ప్రకృతి ప్రయోజనముల ననుసరించి, ప్రకృతి కోరినవిధముగ, శరీరమును, మానవజాతి ప్రస్తుతమున్న స్థితిలోనే శాశ్వతముగ నడుచుకొనుటకు మాత్రమే వినియోగించుటయా ? లేక దానిని, నూతనముగ సృష్టించబడనున్న జాతి ఆవిర్భావమునకు ఒక మెట్టు కాగలుగుటకు తయారు చేయుటలో వినియోగించుటయా ? - అనునదియే నిశ్చయించవలసిన విషయము. ఏలన, పై రెండు పనులును ఏక కాలములో సాధించ నలవికాదు. అనుక్షణము మానవుడు, తాను గతకాలమునకు చెందినవాడుగ నుండవలెనా ? లేక భావికాలపు మానవాతీతుడుగ నుండవలెనా ? - అను విషయము నిర్ణయము చేసుకొను చుండవలెను.

ఆదర్శానుగుణమైన జీవితమును నడుపగోరి, అందు నీవు ఒక ప్రతిభ గల క్రియాశీలమైన పాత్రను వహించవలెనని కోరుచో, ప్రస్తుత జీవిత విధానముల కనుకూలముగ ప్రవర్తించుట గాని, ఇందు విజయమును సాధించుటకై యత్నించుట గాని విడనాడవలెను.

సమగ్రమైన సౌందర్య సామరస్యములు గల సత్త యొక్క ఆనందమున కున్ముఖుడ వగుటకు, నీ భోగలాలసతను (Pleasure) త్రోసిపుచ్చవలెను.

శక్త్యుపాసన

ఇది మనలను సహజముగ ప్రాణ తపస్సు - శక్త్యుపాసన - ఇంద్రియ నిగ్రహమునకు గొనిపోవును. ప్రాణసత్త ప్రబలమైన ఉత్సాహము, శక్తులకు కేంద్రము. ఈ శక్తికేంద్రమైన ప్రాణము నందే ఆలోచన, సంకల్పశక్తిగ పరిణామము చెంది, కార్యవిధానములో క్రియాశీలమగు యంత్రముగ మారును. ఈ ప్రాణ క్షేత్రమే అన్ని కోరికలకును, ఉద్రేకములకును స్థానము. తీవ్రమైన ఆవేశములకును, హింసాపూరితమైన ప్రతిఘటనలకును, నిస్పృహతో కృంగిపోవుటకు కూడ యదార్థముగ నిదియే మూలస్థానము. సాధారణముగ వాటిని నిరోధించుటకు ప్రాణశక్తిని నొక్కిపట్టి కృశింపజేయుటయో, ఇంద్రియవ్యాపారముల నరికట్టి ప్రాణశక్తిని పస్తు పెట్టుటయే చికిత్సగా భావింతురు. ఏలన ఇంద్రియాను భవములే ప్రాణిక శక్తి కాహారము. ఇంద్రియవ్యాపారముల నరికట్టిన, ప్రాణశక్తి నిద్రపోవును; క్రమేణ క్షీణించి మొద్దువారును; తుదకు నిరాహారియై మరణించును.

ప్రాణశక్తికి బలము, జీవనాధారము మూడు క్షేత్రములనుండి చేకూరును. మొదటిది అధోభూమిక, అనగా ఇంద్రియముల ద్వారా భౌతికశక్తుల వలన శ్రమ లేకుండ సులభముగ సంప్రాప్తమగునది.

రెండవ ఆధారము, తనదే యగు ప్రాణభూమిక. ఇక్కడ ప్రాణశక్తి విస్తరించుకొని, గ్రహణశీలియై, విశ్వమయ ప్రాణశక్తులతో స్పర్శనంది వాటి ప్రభావముల కున్ముఖమైనప్పడు కలుగును.

ఇక మూడవది, ఒకానొక అభివృద్ధికై అఱ్ఱులుచాచు ఉత్కృష్టమైన ఆకాంక్ష. ఊర్ధ్వభూమికల నుండి ఆధ్యాత్మిక శక్తులు, ప్రేరణలు దానినావేశించి, ప్రవేశించి పనిచేయునప్పడు ఈ యాకాంక్ష కలుగును.

ఈ మూడు మూలాధారములకు తోడు మరియొక ఆధారమును మానవుడు సర్వదా ఎక్కువగానో, తక్కువగానో కలుపుటకు సమాయత్త పరచును. అదియే వాని యొక్క కష్టములకు, దురదృష్టములకు కారణ మగుచుండును. అది తోటి మానవులతో కలసి పరస్పర సంబంధ మేర్పరచు కొనినప్పుడు సంభవించును. సాధారణముగ ఇరువురు జంటగ చేరి, ప్రేమించు కొనుచున్నా మనుకొందరు. వారి ప్రాణశక్తులు ఒకానొక ఆకర్షణచే పరస్పర ఆదాన ప్రదానలీల (ఇచ్చిపుచ్చుకునే) యందొక సుఖమున్నదని భావించి అట్లు చేయుదురు. వారు ఇదియే ప్రేమయని భ్రమింతురు. కాని అది రెండు ప్రాణశక్తుల మధ్య ఏర్పడిన ఆకర్షణ మాత్రమే.

అందువలన, మన ప్రాణశక్తిని ఆకలితో చంపదలచకపోయిన, ఇంద్రియ వ్యాపారములను నిరోధించుట గాని, సంఖ్యలోను, తీవ్రతలోను తగ్గించుట గాని చేయరాదు. వాటి నుండి వైదొలగరాదు; వాటిని విచక్షణతో, విజ్ఞానముతో వినియోగించుకొనవలెను. విద్యకును, విజ్ఞానమునకును ఇంద్రియములు చక్కని సాధనములు. వాటిని సక్రమ ప్రయోజనములకు వినియోగించుకొనవలెనన, స్వార్థపూరితమైన స్వసుఖమునకు వాటిని వినియోగించరాదు, అజ్ఞానాంధాకారమయ మగు ఆత్మతృప్తి నన్వేషించుట కుపయోగించరాదు.

అసహ్యము, అసుఖము లేకుండ, ఇంద్రియములు సర్వ విషయ ములను సహనముతో భరించగల బలమును కలిగి యుండవలెను. కాని ప్రతి విషయము యొక్క గుణగణములను, మూలములను, అవి కలిగించు సంచలనములను పరిశీలించి అందు ఏవి శరీరమునకు, ప్రాణమునకు ఆరోగ్యకరమై సామరస్యమును, సౌందర్యమును సంపాదించునో, ఏవి హానికరములో, అభివృద్ధి నిరోధకములో గ్రహించు శక్తిని క్రమక్రమముగా సంపాదించి, వృద్ధిచేసుకొనవలెను. ఇంతేగాక, భౌతిక, ప్రాణిక ప్రపంచములను, అందలి క్లిష్ట వ్యూహములను పరిశీలించి తెలిసికొనుటకు పనిముట్లుగ ఇంద్రియము లివ్వబడెనని గుర్తించి, ఆ పనికై వినియోగించవలెను. అప్పడు, ఆ ఇంద్రియములు తమ యథార్థస్థానము నధిష్ఠించి గొప్పదగు పరిణామ ప్రయత్నములో తమ పాత్రను చక్కగ నిర్వహించగలవు.

ఈ విధముగ ప్రాణశక్తులను శుద్ధిచేసి, బలపరచి వెలుగుతో నింపవలెనేగాని, బలహీనమొనర్చరాదు. అప్పడే అవి అభివృద్ధి దాయకము లగును. శరీరమునకు ఆహారము పెట్టక నిరోధించిన, శరీరము కెంత కీడు వాటిల్లునో, అట్లే ప్రాణశక్తి నిరోధమువలన ప్రాణ శక్తి కంత సంకటము సంభవించును. ఆహారమును నిర్ణయించుటలో మనమెంత విజ్ఞానముతో శ్రద్ధగ శరీరపోషకములైన వాటిని ఎంచుకొనుచున్నామో, అటులనే, ప్రాణశక్తికి సంబంధించిన కోరికలు, ఆశలు మొదలుగాగల వాటిని ఎన్నుకొనుటలో శాస్త్రసమ్మతమైన నియమములను పాటించి, ప్రాణశక్తి - గొప్ప క్రియాశీలమైన యంత్రముగ - పెంచి పూర్ణత్వము నిచ్చు విషయములనే ఆచరించవలెను. మానవాభ్యుదయమునకు, అన్ని యితర భాగములవలెనే, దాని వృద్ధి (ఈ ప్రాణశక్తి యొక్క అభివృద్ధి) కూడ చాల ప్రధానమైనది.

ప్రాణశక్తిని విజ్ఞానవంతము చేయుటవలనను, దానిని వెనుకటికంటె పరిశుద్ధమైనదిగను, తీక్ష్ణమైనదిగను, సూక్ష్మమైనదిగను - అనగా, నాజూకైన సంస్కారము (మనోజ్ఞత) కలదిగను - సంసిద్ధము చేయుటవలనను, దానికి సహజమైన పశుత్వము, క్రౌర్యము (ఏవి నిజముగ, అజ్ఞానము, మోటుతనము, అరసజ్జతలకు యథార్థ స్వరూపములో) లను అధిగమించవచ్చును.

యదార్థమును, ఏ విధమైన సత్సంస్కారము గాని, శిక్షణగాని లేనిదై విశృంఖలముగ విడువబడిన ప్రాణశక్తి, అహంకార ప్రేరితమై మూర్ఖత్వముతో అకస్మాత్తుగ సహజ పామరత్వముతో ప్రవర్తించును. కాని, క్రమశిక్షణ కలిగి విజ్ఞానముతో ప్రకాశించు స్వభావముగల ప్రాణశక్తి అంత సహజముగ, అప్రయత్నముగ నిస్స్వార్థత ఉదారత, వీరత్వములు గల స్వభావము కలిగి ప్రవర్తించును. కనుక సుఖాన్వేషణ చేయు ప్రవృత్తిని, అతిమానస సమృద్ధి నాకాంక్షించు ప్రవృత్తిగ మార్చు విధానమును తెలిసికొనుటయే ప్రతివారును చేయవలసిన పని. ప్రాణశక్తి యొక్క శిక్షణ, దీర్ఘముగ, పట్టుదలతోను, నిజాయితీతోను, తగినంత కాలము సాగించగలిగినచో, కొంతకాలమునకు, జీవిత లక్ష్యము యొక్క గొప్పతనమును, సౌందర్యమును గుర్తించి, ఆ దివ్యానందము సిద్ధించగలుగుటకు, అల్పత్వము, అపభ్రమలతో కూడిన ఇంద్రియలోలత్వమును విడనాడు ముహూర్త మాసన్నమగును.

జ్ఞానోపాసన

మానసిక తపస్సనగా, దీర్ఘకాలము ధ్యానముచేసి, చిత్త వృత్తులను నియమించి, అంతశ్శాంతిని నెలకొల్పుటయని స్ఫురించును. యోగ శిక్షణలోని యీ విభాగమును గురించి అందరకు తెలియును గాన, ఎక్కువ వివరించవలసిన అవసరము లేదు. కాని, ఈ శిక్షణకు మరియొక ముఖము కూడ కలదు. దాని యెడల శ్రద్ధ మిక్కిలి తక్కువ. అదివాక్కు నియమము. ఇష్టము వచ్చినట్లు మాట్లాడుటను అరికట్టుటకు ఏ కొన్ని సందర్భములందో తప్ప, సంపూర్ణమౌనము అవలంబింప బడుచున్నది. కాని పూర్తిగ వాక్కును నిరోధించుట కంటె, వాక్కును అదుపులో పెట్టి మాట్లాడుట ఎక్కువ ఫల ప్రదమైన తపస్సు.

సృష్టిలో, మానవుడు, శబ్దమును వినియోగించి మాట్లాడ గలిగిన మొదటి పశువు (జీవి). అందువలన, మానవుడు, తనకు లభించిన యీ శక్తికి గర్వపడును. ఆలోచనగాని, విచక్షణ గాని లేకుండ, విశృంఖలముగా దీని నుపయోగించుచున్నాడు. ప్రపంచమును తన శబ్దఘోషతో నింపి, వృక్ష సామ్రాజ్యమందలి సామరస్యముతో నిండిన శాంతి సంపదను కొన్ని వేళలలో కోల్పోవుచున్నాడు.

అంతేగాక, మానసిక దౌర్బల్యము మాటకారితనమును పెంచుసను విషయము సార్వజనీన సత్యము. విద్యాగంధము లేని ఆదిమజాతి మానవులు మాటలతో తప్ప యోచించలేరు. వారు తమలో తాము గొణుగుకొనుచు మాట్లాడుకొనుట గమనార్హము. దీనికి కారణము వారు పైకి మాట్లాడుచు మాత్రమే తమ ఆలోచనాధారను కొనసాగించగలరు.

ఈ మానసిక దౌర్బల్యము, విద్యావంతులు పెక్కుమంది తాము మాట్లాడిగాని, తమ భావమును నిరూపించుకొనలేనివారు కలరు. ఈ కారణముచేత వారు అతివాగుడుకు అలవాటుపడి, ఎదిరివారిని విసిగింతురు. వారు ఎక్కువ మాట్లాడి తమ భావమును తేటతెల్లము చేసికొందురు. అందువలన వారు విషయమును విశదీకరించుటకు చెప్పినదే చెప్పుచుందురు.

కొందరు వారు చెప్పదలచుకొనిన విషయము, ముందుగ ఆలోచించు కొనకుండ చెప్పలేరు. కొందరు నెమ్మదిగ ఆలోచనకు వ్యవధి కలుగ జేసుకొనుచు, సరియైన పదములను కూర్చుకొని, చెప్పవలసి వచ్చుచుండును.

కొందరు వాక్చాతుర్యముగల ఉపన్యాసకులై యున్నారు. వాక్కు వారి వశములో నుండును. వారు చెప్పదలచుకొనిన విషయమంతయు కరతలామలకమై అందు కవసరమైన చక్కని భాష దానంతట అది స్ఫురించి, సుబోధకముగ వెలువడును.

ఇదంతయు మానసిక తపస్సు దృష్టిలో వ్యర్థ ప్రసంగము క్రింద జమకట్టబడును. ఏలన, విధిగ మాట్లాడ వలసిన పలుకులు తప్ప మిగిలిన మాటలన్నియు వ్యర్థప్రసంగములని నా యభిప్రాయము. విధిగ ఏది ఎంతవరకు మాట్లడవలెనో నిర్ణయించు టెట్లు? అని అడుగవచ్చును. ఈ నిర్ధారణకు ముందు మాట్లాడు మాటలను కొన్ని సామాన్య తరగతుల క్రింద విభజించవలెను.

మొదటిది : భౌతికసీమలో, ప్రాపంచికావసరములకు కావలసిన పదములన్నియు మనకు చేకూరి యున్నవి. అవి అసంఖ్యాకములు : బహుశః సాధారణ జీవితమునకు చాల ప్రయోజనకరములు.

దైనందిన జీవితములో ఎడతెగని మాటల గందరగోళము అనివార్యము, కాని, అతిగ మాట్లాడుటను అదుపులో పెట్టుకొనుటకు ప్రయత్నించినచో, నిశ్శబ్దతలో పనులు తొందరగాను, బాగుగాను జరుగగలవని గ్రహింతుము. ఇది ఆంతరాత్మిక ప్రశాంతికిని, ఏకాగ్రతకును విశేషముగ దోహదము చేయును.

నీవు ఒంటరిగలేక, పదిమందితో కలసి సహజీవనము చేయువాడవైన, ఎక్కువగ మాట్లాడక, మౌనము పాటించుట అలవాటు చేసుకొనవలెను. దీనివలన, ఒకరినొకరు అంతరంగ స్ఫూర్తితో అర్థము చేసికొని, సామరస్యముతో ప్రవర్తించుట నలవరచుకొనగలరని క్రమక్రమముగ గోచరించును. అప్పడు మీరు, మాటలను పరిమితముగ నుపయోగించి, క్రమేణ మాటలు లేని సంభాషణ చేయగలుగుదురు. ఈ బాహ్యమౌనము అంతరంగిక ప్రశాంతతకు లెస్సగ సహకరించును. పిమ్మట, సౌహార్దత, పట్టువిడువని ఆకాంక్ష కలవారై, చక్కని సామరస్యముతో నిండిన, అభివృద్ధి దాయకమగు వాతావరణమును సృష్టించుకొనగలరు.

సామాజిక జీవితములో, ప్రాపంచిక జీవన వ్యాపారముల కవసరమగు మాటలు మాత్రమే గాక, భావస్ఫురణలను, భావా వేశములను ఇంద్రియ స్పందనలను ప్రకటించు మాటలను కూడ తప్పక చేర్చవలెను. ఇచట, బాహ్యామౌనమును పాటించు అలవాటు, విలువైన సహాయకారిగ పనిచేయును. ఏలన, నీవు, ఉప్పెనవలె పొంగు ఉద్రేకములకు గాని, ఇంద్రియ కల్లోలములకు గాని, గురియైన సమయములో, ఈ అలవాటు, ఆలోచించుకొనుటకు వ్యవధిని కలుగజేయును. నీ భావములను, బాధలను మాటలలో వెలిబుచ్చుటకు పూర్వము, తొందరపాటుతనమును నిగ్రహించుకొని, స్వస్థత గలవాడ వగుదువు. ఈ విధముగ అనేకములగు వాదవివాదములు అరికట్టబడగలవు. అనేక పర్యాయములు, ఆవేశముతో పరవశుడవై, నోటికి వచ్చిన దెల్ల వాగుట వలన సంభవించు మానసిక సంక్షోభములను నివారించ గలుగుదువు.

అట్టి తీవ్రస్థితికి పోక నీ మాటలు నీ వశమందుండవలెను. కోపోద్రేకముతో గాని, దురుసుతనము చేత గాని, నోరును అదుపులో నుంచుకొని యిష్టము వచ్చినట్లు మాట్లాడుటను అరికట్టవలెను. ఏమి సంభవించినను నోరు మూసుకొని కూర్చొనుట యని దీని భావము కాదు. దుష్ఫలితముల నిచ్చునది, కేవల మొక తగువులాడుటయే కాదు, నోటికి వచ్చినట్లు మాట్లాడి, వాతావరణములోనికి దుష్టభావ తరంగములను వ్యాపింపజేయుట కూడ దుర్వ్యాపారమే. మాటలు సృష్టించునట్టి శబ్దతరంగముల కంటె, వ్యాపకశీలమైన అంటువ్యాధి వేరొకటి లేదు. ఇట్టి చలనములను సృష్టించుట వలన అవి తమకు తామే, వ్యాపించి నీ యందును, ఇతరుల యందును సుస్థిరమైన ఆవాస మేర్పరుచుకొనును. అవాంఛ నీయమైన వ్యర్థ ప్రసంగములలో ఇతరులను గురించి ఉబుసుపోక చెప్పకొను మాటలను గూడ జేర్చవలెను.

నీవు ఒక సంఘమునకు బాధ్యతగల ప్రతినిధి వైనప్పడు, కొందరు వ్యక్తులకు సంరక్షకుడ వైనప్పడు, ఒక ఉపాధ్యాయుడవైనప్పడు లేదా ఒక వ్యవస్థ కధికారి వైనప్పడు తప్ప, మిగిలిన సందర్భములలో, ఇతరు లేమి చేయుచున్నారు? ఏమి చేయుట లేదు ? అను విషయమును పట్టించుకొన వలసిన అవసరము

లేదు. నీవు ఇతరుల చర్యలను గురించి ఉలకరాదు పలకరాదు. నీవు వారిని గురించి గాని, వారి చేష్టలను గురించిగాని, ఒక అభిప్రాయమును వెల్లడించరాదు, అభిప్రాయ పడరాదు. ఇతరులు వెల్లడించిన భావములను గాని చెప్పిన మాటలను గాని, నీవు తిరిగి ఇతరుల వద్ద ఉచ్చరించుటకూడ తగదు.

ఒకవేళ నీ వృత్తిధర్మముచేత, ఒకానొక సంస్థయందు, లేదా శాఖయందు, ఒక సాముహిక కార్యమునందు ఏమి జరుగుచున్నదో తెలుపవలసిన ధర్మమున్న యెడల, నీవు తెలుపునట్టి విషయము జరిగిన విషయమునకు సంబంధించి యుండ వలసినదేగాని, అది ఇతర విషయములను స్పృశించరాదు. పూర్తియైన బాహ్య విషయ వివరణ మాత్రమే అందుండవలెను. నీ స్వీయ అభిప్రాయముగాని, నీ అభీష్టముగాని, నీ ద్వేషముగాని అందు చోటు చేసుకొనకూడదు. నీకు ఇవ్వబడిన పనియందు, ముఖ్యముగ స్వార్థకలుషితమైన నీ పట్టుదలను, ద్వేషమును చొర నివ్వరాదు.

ఇతరులను గురించి, సాధారణముగ ఎక్కువగ మాట్లాడ కుండుటను - వారిని స్తుతించుటయే యగుగాక - ఒక నియమముగ పెట్టుకొని, అనుసరించుట మంచిది. నీ అంతరంగములో సంభవించు చున్న సంచలనములే నీకు తెలియని పరిస్థితిలో, ఇతరుల మనస్సులో ఏమి ఉన్నదో నీకెట్లు రూఢిగ తెలియ గలదు ? అందువలన నీవు ఇతరులను గురించి, ఎట్టి అభిప్రాయమును కలిగి యుండరాదు. అభిప్రాయపడితివో, అది తప్పక తెలివితక్కువదైనది, లేదా ద్వేషపూరితమైనదై యుండును.

ఒక యోచనను, వాగ్రూపములోనికి తెచ్చిన, ఆ శబ్దస్పందన కొక గణనీయమైన శక్తి యుండును. అది భౌతిక పదార్థమునం దొక పటిష్ఠమైన రూపమును నెలకొల్పును. అందువలన, ఇతరులను గురించి గాని, ఇతర విషయములను గురించి గాని ఎన్నడును చెడు పలుకరాదు. అట్లే ఈ ప్రపంచము ఆధ్యాత్మికాభివృద్ధిని నిరోధించు వాటిని గురించి కూడ మాట్లాడ కూడదు. ఇది సార్వజనీనమైన ముఖ్య సూత్రము. దీనికి కూడ ఒక మినహాయింపు గలదు. నీవు ఎవరియందైనను దోషారోపణ చేయునెడల, నీవు వారిని సరిదిద్ది, నీ శక్తి సంకల్పముతో వారిని సరియైన మార్గములో

పెట్టగలిగిన పక్షమున, నీవు వారియందా దోషమును ఆరోపించి, చూపవచ్చును. అట్టి చైతన్య శక్తికి, క్రియాశీలమైన సంకల్పమునకు భౌతిక పదార్థములోని దుష్టభావస్పందన నెదుర్కొని నిరోధించగల సామర్థ్యము కలదు. ఈ విధముగ దుష్ట తరంగప్రభావము వలన భౌతిక పదార్థముపై నెట్టి ఒత్తిడి రాకుండ నిరోధింపబడును.

ఈ చర్యను ఎట్టి ప్రమాదముగాని, అపాయము గాని లేకుండ నిర్వహించగల వ్యక్తి, అతీంద్రియజ్ఞాన సీమలయందు విహరించుచు, పరమాత్మ జ్యోతితో ప్రకాశించు మానసిక శక్తులు, సత్యసామర్థ్యములు కలవాడై యుండవలెను. ఇట్టి దివ్యకర్మాచరణ పరుడే యిష్టానిష్టములకు దూరముగనుండి విషయాసక్తి లేనివాడై యుండును. అతడు, అహంకారమను అడ్డగోడలను బ్రద్దలుకొట్టి, ప్రపంచములో పరాత్పరుని కర్మచేయుటకై వ్యక్తిరాహిత్యమైన, స్వచ్ఛమైన యంత్రముగ రూపొందును.

చదువుట వలన, ఆలోచించుట వలన, మనకు కలిగిన భావములను, అభిప్రాయములను వెలిబుచ్చుటకు తగిన అనేక శబ్దములు కలవు. ఇక్కడ మనము బౌద్ధిక క్షేత్రములో నున్నాము. సాధారణముగ, మనిషి బుద్ధిస్థాయిలో, ఎక్కువ సంయమనము కలిగి సమంజసముగ నుండుననియు, ఇక్కడ అంత కఠోర తపస్సు అనివార్యము కాదనియు ననుకొందుము. కాని సత్యము దీనికి భిన్నము. ఈ భౌద్ధిక రంగమునందు దాక్షిణ్యము లేని కఠోర నియమములను పాటించుట అత్యావశ్యకము. కాని మానవుడు ఈ బుద్ధిసీమలో కూడ - ఈ భావ ప్రపంచ, జ్ఞానభూమికలోనికి కూడ - తన నిశ్చయములయొక్క తీవ్రతను వర్గీకృత, తన మతాభిప్రాయముల అసహనతను, తను నమ్మిన భావముల యొక్క ఆవేశమును, ప్రవేశపెట్టును. కనుక, ఈ మేధో భూమికలో కూడ మానసిక తపస్సు నవలంబించి, ఇతరులతో భేదాభిప్రాయములకు దోవతీసి, అవసరమైన వివాదములను కల్పించు వైషమ్యములను సృష్టించు చర్చలనుండి జాగ్రత్తగ తప్పకొనవలెను. ఈ చర్చలు, తగవులు, మానసిక సంకుచితత్వము వలన సంభవించునవే. కనుక మానసిక స్థాయిలో ఒక ఉన్నత జ్ఞానము నందుకొనినచో, వీటిని తేలికగ తప్పించవచ్చును.

ఏ భావమైనను, పూర్తిగ సత్యముతో నిండిలేదు. ప్రతి యోచన పాక్షికసత్యమే, సత్యము యొక్క ఒక దృక్పథము మాత్రమే కాగలదు. మాటలలో కూర్పబడిన యాలోచన, వాక్కున కందరాని అతీతస్థితి, విషయము యొక్క ఒకానొక రూపమై యున్నది. ఈ విషయమును గ్రహించని వర్గీకృత భావవాదిగ, ఒక మతవాదిగ నుండుట సంభవము.

విషయముల పరస్పర సంబంధ జ్ఞానము మాట్లాడుట యందు సమతులనము కలిగియుండుటకు, వెనుకముందు లాలోచించి హుందా తనము గల మితభాషిత్వముండుటకు, ఒక బలమైన సహాయకారి. పూర్వకాలము నందొక విజ్ఞానవంతుడైన రహస్యతత్త్వవేత్త యిట్లు నుడివెను.

"సృష్టియందేవస్తువు వస్తుతః చెడ్డది కాదు. కాని, ఏ వస్తువు తన స్థానములో లేదు. ప్రతి వస్తువును దాని యదార్థస్థానము నందుంచినచో ప్రపంచమంతయు సామరస్యముతో విరాజిల్లును."

అయినను, క్రియాత్మక దృష్టితో పరిశీలించిన, భావము యొక్క విలువ దాని యందలి క్రియాశక్తి ననుసరించి యుండును. ఈ క్రియాశక్తి ఎవరియందు పనిచేయునో, ఆ విశిష్ట వ్యక్తుల ననుసరించి మారు చుండునను విషయ మందరకును విశదమే. ఒకానొక భావము ఒక వ్యక్తిని తీవ్రముగ కదలించును. అదే భావము మరియొక వ్యక్తిపై నెట్టి సంచలనమును కలిగించదు. కాని భావశక్తి బహువ్యాపకమైనది. కొన్ని కొన్ని భావములు ప్రపంచమునే రూపాంతరీకరించునట్టివి గలవు. అట్టి భావములనే తప్పక వెల్లడించవలెను. అవియే ఆధ్యాత్మికా కాశమునందు ధృవతారలై విరాజిల్లుచు, ఈ భౌతిక ప్రపంచమును దాని పరమ లక్ష్యము నందుకొనుటకు మార్గదర్శకత్వము వహించును.

తుది అంశము : విద్యను బోధించుటకు మనకెన్నియో మాటలు కలవు. ఇవి చిన్న పిల్లల శిక్షణ మొదలుకొని విశ్వవిద్యాలయ మందలి ఉన్నత శిక్షణల వరకు వ్యాపించినవి. మానవుడు సృష్టించిన కళాత్మక, సాహిత్య సృజనలు (రచనలు) వానిలో చేరునట్టివి ఉన్నవి; అవి మనోరంజకములు, విజ్ఞాన దాయకములునై యుండును. ఈ రంగములో, సృష్టింపబడిన వస్తువుపై నెక్కువగా నాధారపడి యుండును. కాని ఈ విషయము బహు వ్యాపకము

కలదగుటచే నిక్కడ వివరించుటకు సాధ్యము కాదు. ఆధునిక కాలములో విద్య ఎడల ఎక్కువ శ్రద్ధ చూపబడుచున్న దను విషయము క్రొత్తగ కనుగొనబడిన, భౌతికవిజ్ఞానమును, విద్యావిధానములలో చొప్పించుటకు ప్రశంసనీయమైన ప్రయత్నములు చేయబడు చున్నవను విషయము యదార్థమే; ఈ సందర్భములో కూడ, సత్యాన్వేషకునకు ఒక విధమైన తపస్సు అవసరము.

విద్యాభ్యాస కార్యక్రమములో, పిల్లలకు గాని, పెద్దలకు (వయస్సు వచ్చిన వారికి - adults) గాని, దాని భారమును సడలించుటకు, ఆహ్లాదకరములు, వినోదకరములునగు సరళమైన రచనలు, హాస్య కార్యక్రమములు అవసరమని సామాన్యముగ అందరును గుర్తించిన విషయమే. ఒక కోణము నుండి పరిశీలించినచో ఇది నిజమే. కాని, ఈ సదుపాయమును అదనుగ తీసికొని, పశుప్రాయము, నీచమైన మానవ స్వభావమును వికృత మొనర్చు, అధోముఖముగ లాగికొని పోవు కార్యక్రమములు, కోకొల్లలుగ ప్రవేశపెట్టుటను సమర్థించు చున్నది. అతిహేయమైన ప్రేరణలను, పాశవిక అభిరుచులను ప్రకటించి ప్రోత్సహించునట్టియు, మానవ స్వభావము యొక్క సౌమ్యతనే విస్మరించి, మోటుగ ప్రదర్శించు కార్యకలాపములు, ఈ సదుపాయము నొకసాకుగ పెట్టుకొని, తప్పనిసరియైన అవసరముల వలె బలవంతముగ చోటుచేసికొను చున్నవి. కాని, విద్యాభ్యాసంగ శ్రమభారము తగ్గించునవి యీ తెగకు చెందినవెన్నడును కావు. మానవుడు కామలంపటుడు కాకయే విశ్రాంతి పొందవచ్చును. అతడు తన స్వభావమునకు సంబంధించిన స్థూల పదార్థములను పైకి రానీయకయే విశ్రాంతిని పొందవచ్చును. కాని తపోదృష్టి కలవారి విషయములో ఈ అవసరములు కూడ తమ స్వభావమును మార్చుకొనుట తప్పనిసరి యగును. విశ్రాంతి ఆంతరిక ప్రశాంతిగను, బాహ్యవిశ్రాంతి ధ్యానముగను, వినోదము అంతరానందముగను పరిణామము చెంది అనుభవింపబడును.

సర్వసామాన్యముగ అంగీకరించి గుర్తింపబడిన ఈ వినోదము యొక్క ఆవశ్యకత, అనగా ప్రయత్నమును శ్రమ నుండి విరామమును కోరుట, జీవిత లక్ష్యమును దాని ఆస్తిత్వ ప్రయోజనములను, కొంతకాలము, లేక చిరకాలము పూర్తిగ విస్మరించుట జీవితములో స్వాభావిక మని గాని, అనివార్యమని గాని

భావించుట సత్య సమ్మతము కాదు. ఇదియొక బలహీనత. మన ఆకాంక్షయందు తీవ్రత, సంకల్పము నందు స్థిరత్వము సన్నగిలినప్పడు, అజ్ఞానము, తామసములు ఆవరించి, తెలివి లోపించినప్పడును పైన చెప్పిన జీవిత లక్ష్యమునే విస్మరింపజేయు వినోదములు, విశ్రాంతి అవసరమని భావింపబడును. ఈ భావములను సమర్థించక, వీటికి చోటునిచ్చుట నిరాకరించినచో, అవి అనవసరములని తొందరగ గుర్తింపగలవు. అంతేకాదు, అట్టి భావములను హేయములుగ నిరసింతువు. అప్పడే మానవ నిర్మిత ప్రాపంచిక వ్యవహారములు బాహ్యముగ వినోదములుగ తోచినను, నిజమునకు నీచవృత్తి ప్రలోభములగుటచే, వాటియందు ఆసక్తి తగ్గిపోవును; అపుడవి ప్రోత్సాహము లేనివై, నశించిపోవును.

అయినను, వాక్కు యొక్క విలువ సంభాషించు విషయముపై నాధారపడి యుండునని భావించరాదు. సాధారణ సందర్భములలో వలెనే, ఆధ్యాత్మిక విషయములలో కూడ కాలక్షేపమునకై చేయబడు వృథా సంభాషణ లుండవచ్చును. ఇవి చాల ప్రమాదకరమైనవి. ఉదాహరణమునకు, క్రొత్తగ సాధన ప్రారంభించిన సాధకుడు తాను నేర్చిన విషయములను ఇతరులకు చెప్పవలెనని కుతూహల పడుచుండును. కాని, సాధనలో ముందునకు పోవుకొలది, తనకు తెలిసిన విషయము ఎక్కువ కాదనియు, చాల అల్పమనియు, ఇతరులకు బోధించుట కంటె తాను తెలుసుకొనిన దానిని రూఢము చేసికొనుట అవసరమనియు క్రమక్రమముగ, అతనికి అవగతమగును. చివరకు, వివేకవంతుడై కొన్ని క్షణములు సార్థకముగ మాట్లాడవలెనన, దానికి ముందు కొన్ని గంటలు నిశ్చలమైన ఏకాగ్రతతో నుండుట అవసరమని గ్రహించును. అంతేగాక, అంతర్దృష్టి, ఆధ్యాత్మిక సాధనయందు నిష్ఠ కలవానికి వాక్కును, గట్టి అదుపులో పెట్టి నిరోధించుట చాల అవసరము. మాట్లాడుట తప్పనిసరి అయినప్పడే మాట్లాడ వలెను.

నీకు కలిగిన ఆధ్యాత్మికానుభూతులు, నీ అభివృద్ధికై నిర్దేశించబడినవి. వాటిని ఇతరులకు చెప్పరాదు. అట్లు చెప్పట మొదలు పెట్టిన యెడల ఆ యనుభూతుల యందు గర్భితమైన శక్తి క్రమముగ దిగజారి అంతర్థాన మగును. ఈ విషయమందరకును అనుభవవేద్యమే. కాని యీ నియమము గురువు

పట్ల మాత్రము వర్తించదు. ఏలన, నీ అనుభూతి యొక్క అర్థమును, అది సూచించు సత్యమును, అందుండి నీవు నేర్చుకొనవలసిన విషయమును నీవు గురువువద్ద నుండియే తెలుసు కొనవలసి యున్నది. గురువుతో చెప్పటలో ప్రమాదమేమియును లేదు. అనుభూతిలోని మంచి విషయములను నీ పురోభివృద్ధికై మలచి, ఆవిషయములను, అనుభూతులను నూతనమైన ఉన్నత భూమికల నందుకొనుటకు సోపానములుగా చేయగల శక్తి, జ్ఞానములు నీ గురువునందు గలవు.

గురువుకూడ వ్యక్తిగతముగ తనకు సంబంధించిన విషయములలో ఈ సూత్రమును పాటించి, మౌనము వహించుననను విషయము సత్యము, ప్రకృతిలో ప్రతి వస్తువు, కదలి సాగుచునే యుండును. కనుక, ఏది ముందుకు సాగక ఆగిపోవునో, అది నేలకూలవలసినదే, గురువు కూడ శిష్యునివలె వృద్ధి పొందు చుండవలెను. కాని గురువుయొక్క పురోగతి, శిష్యుని అభివృద్ధివంటిది కాదు. వారు వేర్వేరు భూమికల పై అభివృద్ధి పొందు చుందురు. ఆయనకూడ (గురువుకూడ) తన అనుభూతులనుగురించి చెప్పట మంచిదికాదు. అనుభూతిని మాటలలోనికి దించిన అందలి అభివృద్ధిదాయకమగు క్రియాశీల శక్తి క్షీణించిపోవును. కాని మరియొక దృష్టితో చూచిన తన అనుభూతులను శిష్యులకు వివరించి చెప్పటవలన వారి తెలివి పెరిగి అభివృద్ధి చెందుదురు. అందువలన గురువు తన విజ్ఞాన సంపత్తితో ఎంతవరకు శిష్యులకు చెప్పవలెను, ఎక్కడ ఆగవలెను-అనగా, తాను త్యాగమెంత మేరవరకు చేయవలెనను విషయమును నిర్ణయించుకొనవలెను. ప్రగల్భములుగాని, వృథా గొప్పలుగాని ఆయన మాటలలో చోటుచేసికొనిన యెడల, ఆయనయందు గురుస్థానము పోయి, మాయలమారితనము చోటుచేసికొనును.

శిష్యుని విషయములో నేనొక్కటి నొక్కివక్కాణించుచున్నాను:

"నీ గురువెవరైనను, నీవు ఆయన యెడల సర్వదా విశ్వాసము కలిగి యుండుము. నీ వెంతవరకు వెళ్ళగలవో ఆయన అంతవరకు తీసికొని పోవును. నీ అదృష్టము బాగుండి, భగవంతునే నీవు గురురూపమున పొందినచో నీ సిద్ధికి అవధులుండవు."

అయినను ఆ దివ్యతత్త్వమే భూలోకములో అవతరించినను, ఈ ప్రగతి నియములకు అది లోబడియుండును. తా నభివ్యక్త మగుటకు, తాను ధరించిన భౌతికదేహము నిత్య నిరవధిక ప్రగతిశీల మగు స్థితిలో నుండవలెను. దివ్యతత్త్వము యొక్క స్వీయ ఆత్మాభివ్యక్తివిధానము సర్వసామాన్య భౌతికాభివ్యక్తి విధానముతో అనుబంధించి యుండును. ఈ విధముగా, మానవులు, పరిపూర్ణత నర్థముచేసికొని అంగీకరించుటకు సిద్ధముగ లేనంతవరకు, దేహధారియైన భగవంతుడుకూడ, భూలోకములో పరిపూర్ణుడు కాలేడు, మన మిప్పుడు భగవంతుని యెడల కర్తవ్యధర్మమను బుద్ధితో చేయుచున్న కర్మలన్నియు భగవంతుని యెడల దివ్య ప్రేమభావముతో చేసి నప్పుడు ఆ స్థితి కలుగును. అప్పుడు మానవాభ్యుదయము, పరిశ్రమగాక, సంతోష దాయకమగు కార్యక్రమ మగును. కచ్చితముగ నుడువ వలెనన, ఈ అభివృద్ధి సంపూర్ణమైన మానవసత్తతో దైవమును ఆలింగనము చేసుకొనుటతో నేర్పడు అనందముద్వారానే కలుగును. కాని, మిక్కిలి శ్రమతోను, కొన్ని సమయములలో అమిత బాధలతోను నిండిన అహంకార ప్రతిఘటనను, బలవంతముగ అణచిపెట్టుట వలన కలుగును.

పర్యవసానములో (చివరకు) నేను చెప్పన దేమన : నీ మాట సత్యమునే ప్రకటించవలెను, భాగవత శబ్దశక్తి కలిగియుండవలెనని భావించినచో, మాట్లాడదలచిన దానిని ముందుగా ఆలోచించకుము, చెప్పబోవు దాని బాగోగులను గురించి ముందుగనే నిర్ణయించుకొనకుము. నీ పలుకుల యొక్క ఫలితమును, ప్రభావమును భావింపకుము. నిశ్చల మనస్సుతో నుండుము. ఆ విధముగ, యథార్థ స్వభావములో ఆచంచలుడవై నిలువుము, అప్పుడు విశ్వ విజ్ఞానమును విశ్వచైతన్యమును, విశ్వవివేకమునా కాంక్షించు శక్తి నీ ప్రకృతి కలవడును. నీ యాకాంక్ష యదార్థమైనచో, 'పని చక్కగ నెరవేర్చి విజయము నొందవలె నను వాంఛకు' అది యొక ముసుగు కానిచో, అది పరిశుద్ధము-స్వతస్సిద్ధము- సమగ్రమునైనచో, అప్పడు నీవు నిర్మలమైన సహజ స్వభావముతో అనాయాసముగ భాషింతువు. ఎక్కువ తక్కువలు లేని పదములతో సమయోచితముగ మాట్లాడుదువు. అవి చక్కని సృజనాత్మకములై క్రియాశీలములై యుండును.

ప్రేమతపస్సు

తపస్సు లన్నిటిలో చాల కష్టమైన తపస్సు భావమునకు, హృదయ స్పందనలకు సంబంధించినది. ఇదియే ప్రేమ తపస్సు.

నిజమునకు 'విధికృత' మను ఒకానొక భావము, అన్ని యితర రంగములలో కంటె మానవుని భావసీమయందు ఎక్కువగ భాసించును. అది, అతనికి, అనివార్యమై, దుర్భేద్యమై తప్పించుకొనుటకు వీలులేనిదై , తననాక్రమించి వశపరచుకొనినట్లుగ కనిపించును. ప్రేమ (సాధారణముగ మానవులు ప్రేమ అని భావించునది) ప్రధానముగ రాజసముగల ప్రభువు. దాని నిరంకుశ చాపల్యము నెవరును నివారింపలేరు. అది తన యిష్టము ననుసరించి ప్రవ ర్తించుచు, నీకిష్టమున్నను లేకపోయినను నిన్నొక బానిసగచేసి తన యాజ్ఞాపాలనము చేయునట్లు నిన్ను నిర్బంధము చేయును. ప్రేమపేరుతో అనేక దారుణములు చేయబడినవి, ఘోర పాతకము లాచరింపబడినవి.

అయినను, మానవుడు, ఈ ప్రేమవేగము నరికట్టి, సాధువుగ మార్చి, అదుపులో, పెట్టవలెనను ఆశతో అనేకములైన నైతిక, సాంఘిక సూత్రములను, ధర్మములను సృష్టించెను. కాని, ఆ నియమములు అన్నియు భంగింపబడుటకే ఏర్పాటు చేయబడినట్లు అనిపించును. ప్రేమభావముయొక్క స్వేచ్ఛా విహార ములను నిరోధించు అడ్డంకులు అన్నియు దాని ఉజ్జ్వల ఉద్రేకమును వృద్ధిపొందించునవిగనే కనబడుచున్నవి. ఏలన, ప్రేమప్రవాహము నడ్డుకొని క్రమశిక్షణలో పెట్టగల శక్తి, సూత్రములకు గాని, నిబంధనలకు గాని లేదు. విశృంఖల, అధోముఖ ప్రేమోద్వేగములను, దానియొక్క (ప్రేమయొక్క) ఉన్నతమైన, అధిక సత్యసమ్మతమైన ఊర్ధ్వముఖ భావనాశక్తి మాత్రమే అదుపులోనుంచగలదు. ప్రేమయే తన విజ్ఞానము, పరిణామశక్తి, ఉన్నత భావనాపటిమచే, తనను తాను నియమించుకొనగలదు. ఏలన, ఇక్కడకూడ, ఇతర సందర్భములలో కంటె ఈ సందర్భములో ముఖ్యముగ, నియమించుట అనగా, అణచిపెట్టుట గాని, నిర్మూలనము చేయుటగాని కాక, మార్పు చెందించుట యను అర్థమును గ్రహించవలెను. ఇదియొక ఘనమైన రసాయన రహస్యము. ప్రపంచములో పనిచేయు శక్తులన్నిటిలో ప్రేమయే బలవత్తరమైన శక్తి కలదై, అమోఘమై విరాజిల్లుచున్నది. ప్రేమలేని ప్రపంచము అంధకారబంధురమైన అజ్ఞానమయమగు నిశ్చేతనాస్థితిలోనికి దిగజారిపోవును.

ఈ విశ్వమును సృష్టించినది చైతన్యమే: కాని దీనిని రక్షించునది ప్రేమజ్ఞాన సమేతమైన అనుభవమే. ప్రేమయొక్క స్వరూప స్వభావములను, ఉద్దేశ్యములను, విధానములను, దిజ్మాత్రముగ గోచరింపజేయును. ఆ చైతన్యాను భూతిని మాటలలో ప్రకటించిన, అది, సర్వవిధముల అనిర్వచనీయమగు ఒకానొక భావమునకు, మనస్సు కల్పించిన వికృతరూపమే యగును. తత్త్వవేత్తలు, గుప్త విద్యాధురంధరులు (mystics), రహస్య విద్యావేత్తలు (occultists) ప్రేమకు నిర్వచనము చేయపూనుకొని విఫలులైరి. అంతటివారు శక్తిహీనులైన విషయములో నేను విజయము సాధించగలనను దురభిమానము నాకు లేదు. కాని వారి నిర్వచనములలో నిరూపింపదలచిన దాని క్లిష్టతరమైన స్వరూపమును, వీలైనంత తేలిక పదములలో వివరించుటకు ప్రయత్నించెదను. నా మాటలకు లక్ష్యము మిమ్ము ఆ చేతనానుభవ జీవితమున కున్ముఖులుగ జేయుటయే. చిన్న పిల్లలను కూడ సజీవము, జాగృతము నయిన ఆ మార్గములో నడిపించగలనని నా నమ్మకము.

ప్రేమ వస్తుత: ఏకాత్మతానందము. ఐక్యానందమునందే ఆ ప్రేమ చరమాభివ్యక్తిని పొందును. ఈ రెండు లక్ష్యముల మధ్య, విశ్వావిర్భావము యొక్క అన్ని స్థితులు, అంతర్భూతములగును.

ఈ సృష్టియొక్క ఆరంభములో, ప్రేమ, తన ఆవిర్భావముయొక్క పవిత్రతలో రెండు ప్రవాహములుగ ఆవిర్భవించినది. ఈ రెండును విభిన్న కేంద్రములలో బయలుదేరి, ఒకదాని నొకటి పూరించుకొనుచు, ఏకత్వము దిశగా సాగు మార్గములు. ఒకవైపున అది, ఆకర్షణయొక్క పరమశక్తిగను, రెండవవైపున పరమోత్కృష్టమైన ఆత్మార్పణయొక్క అనివార్యమగు ఆవశ్యకతగను ఉన్నది. ఆదిలో సర్వజ్ఞుడైన పరమాత్మనుండి, అజ్ఞానముచే నావరింపబడి జీవుడైన కారణమున సంకుచితమొందినదది. చైతన్యమునం దేర్పడిన అగాధమును అంతరిపజేయు శక్తి ప్రేమకు మించి మరియొక దానికి లేదు.

ఏకత్వతత్త్వము దేశకాలములలో విసిరివేయబడి (Projected) యీ ప్రపంచము సృష్టింపబడినది. అదే తత్త్వము యీ సృష్టిని నాశనము చేయక,

తనలోనికి తీసికొని రావలసి యున్నది. అందు నిమిత్తము ఏకత్వము యొక్క ఏకైక ప్రబల శక్తియైన ప్రేమతత్త్వము పొంగి ప్రవహించినది.

ఆ ప్రేమ తత్త్వము అంధకారము, నిశ్చేతన చుట్టూ తిరుగుతూ ఉన్నది. అది తనను గాఢాంధకార గర్భములో విరజిమ్ముకొనినది. ఖండఖండములుగ చేసికొనినది. అప్పటినుండే మెలకువ ఆరోహణము ఆరంభమైంది, నెమ్మది నెమ్మదిగా జడతత్త్వసృష్టి దాని అనంతవికాసము ఆరంభమైంది. భ్రాంతిపూర్ణముగ, చీకటిగ భౌతిక, ప్రాణిక ప్రకృతియందలి అన్ని ప్రేరణలతో కలిసిపోయి యున్నది ఆ ప్రేమ తత్త్వము కాదా? మరియు, ప్రతి క్రియవైపుకి, ప్రతి సామూహీకరణము వైపుకి ప్రేరేపించునది ఆ ప్రేమతత్త్వము కాదా? వృక్ష ప్రపంచమునందు ఇది స్పష్టముగా కన్పడుతుంది. వృక్ష లతా, గుల్మాదులలో ఎక్కువ వెలుతురు, ఎక్కువ గాలి విశాలమైన ఆవరణము పొందుటకు దీని అవసరము ఎంతైనను గలదు, అటులనే పుష్పములలో ఈ ప్రేమతత్త్వమే సౌందర్యము, పరిమళములతో ప్రస్ఫుటితమవుతుంది.

ఇక జంతువులలో, ఆకలి దప్పుల వెనుకను, వ్యాపించవలెనను బుద్ధి వెనుకను, ప్రతి వస్తువును తనదిగ చేసుకొనవలెనను ప్రవృత్తి వెనకను. స్వజాతీయోత్పత్తివాంఛ (సంతానాభివృద్ధి వాంఛ) వెనుకను ఉన్నది యీ ప్రేమతత్త్వమే. సంగ్రహముగ చెప్పవలెనన, తెలిసిగాని తెలియకగాని ప్రతి కోరిక వెనుక నున్నది ప్రేమతత్త్వమే. ఉన్నత జాతులలో, స్త్రీజాతి తన బిడ్డలకై త్యాగబుద్ధితో చేయు సేవలన్నిటి వెనుక నున్నదికూడ నిదియే. ఇది సహజముగ మనలను మానవజాతి విషయమును గురించిన పరిశీలనకు తీసికొని పోవును. విజయముతో విర్రవీగు మానసిక శక్తుల ఆగమనముతో ఈప్రేమసంసర్గము దాని ఉన్నత శిఖరముల నందుచున్నది. ఏలన, ఇక్కడ అది ఎరుక గలదై తన కార్యములన్నియు బుద్ధిపూర్వకముగ జేయును, నిజమునకు, భౌతికాభివృద్ధికి ఇట్లు అవకాశము దొరకగనే, ప్రకృతి యీ ప్రేమతత్త్వము యొక్క మహోన్నత శక్తిని, ప్రజాభివృద్ధి యను సృష్టికార్యముతో ముడిపెట్టి, దానిని వినియోగించినది. ఈముడి (సంబంధము) అత్యంత సన్నిహితము, తాదాత్మ్యము పొందినది. దీనివలన మానవులలో ఈ సంతానాభివృద్ధి కార్యకలాపము, ప్రేమ వ్యాపారము వేర్వేరు విషయము లను విచక్షణజ్ఞానము లుప్తమైపోయినది, వాటిని ఒకదానితో

రెండవ దానికి సంబంధము లేకుండ అనుభవించవచ్చునను వివేకము గలవారు అతి స్వల్ప సంఖ్యాకులై యున్నారు. ఈ విధముగ ప్రేమతత్వము అధోగతికి దిగజారి, పశుస్వభావముగ దిగజారిపోయినది.

తదాది, ప్రకృతి ప్రక్రియలలో అనేకమైన క్లిష్ట సామూహిక సంఘటనల (సంఘీ కరణముల) ద్వారా, దశలవారిగ క్రమేణ, అది పూర్వస్థితియగు ఏకత్వమునకై సమర్థవంతముగ స్థిరమైన సంకల్పముతో పనిచేయుచున్నట్లు కనబడుచున్నది. ఇరువురు మానవులను కలిపి ఒక జంటగ ఏకము చేయుటకు, ప్రేమభావము నందలి శక్తిని వినియోగించి, మొదటి సాంఘిక వర్గమగు కుటుంబమునకు పునాదులువేసి, వ్యక్తిగతమైన సంకుచితమగు అహంకారమును భేదించినది. ప్రకృతి మొదట ఇరువురను ఏకముచేసి, ఇరువురితో కూడిన వర్గాహంకారమును సృష్టించినది. వారికి సంతానము కలుగగా, వారితోకలిపి క్లిష్టమైన కుటుంబాహంకారమును రూపొందించినది. కొంతకాలమునకు అనేక కుటుంబవర్గము లేర్పాటు కాగా ఆ కుటుంబములలో, రక్తసంబంధము వ్యక్తి సంబంధముల మిశ్రమములతో పెద్దవైన సంఘము లేర్పాటు అయ్యెను. అవి గోత్రములుగ, వంశములుగ, జాతులుగ, కులములుగ, వర్గములుగ, రూపొందుచు, ఒక దేశముగ ఏర్పడినవి. ఇట్టి సంఘ నిర్మాణ కార్యక్రమము ప్రపంచమునందంతట, భిన్నభిన్న స్థానములలో ఏకకాలములో విస్తరించుచు చివరకు వివిధజాతులుగ సంతరించుకొన్నది. ప్రకృతి, మానవైక్యము సమకూర్చుటకు భౌతికముగ సత్యసమ్మతమగు పునాదులను వేయు ప్రయత్నములో, ఈ జాతులను కూడ సమ్మిళితము చేయును.

జనబాహుళ్యము యొక్క దృష్టిలో, ఈ కార్యక్రమ మంతయు, యాదృచ్ఛికముగ కనిపించవచ్చును. వారికి సంపూర్ణమైన విశ్వప్రణాళిక గోచరముకాదు. వారి వారి స్వభావముల ననుసరించి, యీ సంఘటనలు శుభదాయకములని గాని, దుఃఖదాయకములని గాని భావించుచు. కొందరు సంతృప్తి అనుభవించు చుందురు, మరికొందరు అసంతృప్తిని అనుభవించు చుందురు.

సంతృప్తి నందువారిలో ఒకతెగ, ప్రకృతి విధానములకు పూర్తిగ కట్టుబడి యుందురు. వీరే ఆశావాదులు (optimists). వారికి చీకటి

రాత్రులుండుటవలన, పగళ్లు ప్రకాశవంతముగ కనిపించును, ఛాయలుండుట వలన రంగులు విస్పష్టమైన ప్రకాశముతో గనిపించును, దుఃఖముండుటచే సంతోషమునం దొక తీవ్రమైన అప్యాయత గోచరించును, దుఃఖము, ఉండుటవలన సుఖమునందొక రమ్యమైన ఆహ్లాదము ననుభవింతురు. రోగ ముండుటవలన ఆరోగ్యమునకొక విలువ కనబడు చుండును. తమ మిత్రుల మంచితనముయొక్క గణనీయతను గ్రహించుటకు శత్రువులుండుట అవసరమని భావించునట్టి కొందరిని కూడ నే నెరుంగుదును. కాని వీరందరికి విధిగ కావలసినది, అతిమనోహరమైన లైంగిక వ్యాపారము, జీవితములో అనుభవింపతగినది మృష్టాన్న భోజనము అయియున్నవి. పుట్టిరి గనుక చచ్చుట సహజ మనియు, దీర్ఘకాలము బ్రతికిన, భారమగు ననియు, గనుక జీవితయాత్రకు మరణ మొక అంత మనియు భావింతురు.

సంగ్రహముగ చెప్పవలెనన, జరుగుచున్న జీవితముతో వీరు తృప్తి చెందుచు జీవితమున కొక లక్ష్యమున్నదని గాని, ఒక ప్రయోజన మున్నదను విషయమునుగాని తెలియనివారై, ఇతరుల భాధలను పట్టించుకొనక, అభివృద్ధియందు ఆశ లేనివారై బ్రతుకుచుందురు.

ఇట్టివారిని మార్చుటకు ప్రయత్నము చేయరాదు. అదియొక ఘోరమైన తప్పిదము కాగలదు. నీ మాటలు వినునంతటి దురదృష్టము వారికి సంభవించుచో వారు ప్రస్తుత మనుభవించుచున్న సామ రస్యమును, కోల్పోవుటయే గాక, జీవితములో ఎట్టి నూతన సామరస్యము కనుగొనలేక బాధపడుదురు. వారు ఆంతరిక జీవితమునకు సిద్ధముగ లేరు. కాని, వారు ప్రకృతియొక్క ప్రియమైన బిడ్డలు: ప్రకృతితో సన్నిహిత సంబంధములు కలిగి జీవింతురు. ఆ స్థితినుండి వారిని వ్యర్థముగ తొలగింపరాదు.

లోకములో సంతృప్తిగల మానవులలో పై వారికంటె కొంచెము తక్కువ తరగతికి చెందిన, అందరికంటె తక్కువ కాలము స్థిరమైన సంతోషము గల మరియొక వర్గముకలదు. వారి తృప్తి ప్రేమయొక్క మాయామోహ ప్రభావము వలన సంభవించినది. వ్యక్తి తన అహంకారముచే బంధితమైయున్న సంకుచిత పరిధిని నిరంతరము భగ్నము చేయుచుండును., ఆత్మసమర్పణము వలన నతడు స్వేచ్ఛావాయువులలో సంచరించును. తోటి మానవుని కొరకు గాని, తన కుటుంబము కొరకు గాని, దేశము కొరకు గాని, లేదా తాను నమ్మిన

మతము కొరకు గాని, అహంకారముచే బంధింపబడిన సంకుచితత్వమును త్రెంచుకొని తాను చేపట్టిన కార్యమును నిర్వహించిన ప్రతి సమయములో స్వార్థమును విస్మరింపచేయు మహత్తరమైన ప్రేమ తత్త్వముయొక్క ఆనందమును పూర్తిగ చవిచూచుచుండును. ఈ అనుభవమే అతనిని పరమాత్మ స్పర్శనందితిట్లు నూహింపజేయును. కాని, తరచు, ఈ భావము స్థిరమైనది గాక, క్షణికమై యుండును. ఏలన, మానవునిలో ప్రేమ అంకురించినంతనే అహంకారము యొక్క అధఃప్రవృత్తులు దాని నావరించి నీచత్వములోనికి దిగలాగు చుండును. అది, పరిశుద్ధముగ నుండగలిగినను, భగవంతునితో దాని సంస్పర్శ ఎక్కువ కాలము నిలువలేదు. ఏలన, ప్రేమకూడ భగవంతుని దివ్యగుణములలో నొకటి మాత్రమే, మిగిలినవాటివలెనే ఈ ప్రపంచములోనికి దిగివచ్చినంతనే అనేక వికృతులకు లోనగు చున్నది.

సాధారణ మానవునకు, అనగా, ప్రకృతిచే దాని సహజమైన మామూలు పద్ధతిలో, పడుచు లేచుచు, భవిష్యత్తులో ఏకత్వమునకు గొనిపోబడు, మానవునకు, ఈ అనుభూతులన్నియు మేలుచేయునవే, ప్రయోజనకారులే. కాని తొందరగ ముందుకుసాగి ఒక నూతన జాతిని అనగా, అతిమానస చేతనా సత్యమును పృథ్వీతత్త్వములో అభివ్యక్తము చేయగల జాతిని సృష్టించవలెనను ఆకాంక్ష గల వారిని, ఇవి సంతృప్తిపరచలేవు. వారు ఇంతకంటె సూటియైనవియు, చురుకైనవియు నగు నూతన మార్గముల ననుసరించుటకు ఆకాంక్షింతురు. ఆ మార్గము వారిని సాధారణ మానవ ప్రకృతి బంధములనుండియు, దాని అనంత గమనములనుండియు విముక్తి నందించి, ఆధ్యాత్మిక పురోగమనములో పాల్గొనునట్లు చేయును. అతి విరళముగా లభించు ఈ విశిష్టాత్ములు, మానవులమధ్య నెలకొను ప్రేమ తత్త్వము - అది ఎంత పరిశుద్ధము సుందరము నైనను - పూర్తిగ నిరసించవలెను. ఏలన, అది భగవంతునితో ప్రత్యక్ష సంబంధమును త్రెంచివేయును, మానవులతో అది ఒక విధముగా అల్పపరిధి మండలములను సృష్టించును.

దివ్య ప్రేమతత్త్వము నెరిగిన వారికి మిగిలిన ప్రేమస్వరూప ములన్నియు, అహంకారము, అంధకారము, సంకుచితత్వములతో సమ్మిళితములై అస్పష్టముగ మాలిన్యభూయిష్ఠములై గోచరించును; అవి అధికారము కొరకును, స్వామిత్వము కొరకును, నిరంతరము సలుపు పోరాటమువలె, బేరమువలె కనిపించును. మానవులలో, శ్రేష్ఠమైన వారియందు కూడ ఈ ప్రేమ, అపార్థములతో, ఉద్రిక్తతలతో, రాపిళ్లతో, అర్థరాహిత్యముతో నిండియుండును.

అంతేగాక, మనము దేనిని ప్రేమింతుమో తత్సదృశ రూపములోనికే పెరుగుదుమను విషయము అందరకును బాగుగ తెలిసినదే. కనుక నీవు పరమేశ్వరునివలె కావలెనని కోరుచో, ఆ పరమేశ్వరునే ప్రేమించుము. భగవంతునితో సాయుజ్య పారవశ్యమందుటలోని మాధుర్యమును, ఆనందమును, రుచిని మరిగినవారికి, మిగిలిన విషయములతో పోల్చి చూచినపుడు, అవి మిక్కిలి నిర్జీవములు, రసహీనములు, అల్పములుగ తోచును. ఈ పారవశ్యము నందుటకు చాల సునిశితమైన శిక్షణ కావలెను. దీనిని పొందుటకు, ఎన్ని కష్టములుగాని, ఎంతటి శ్రమగాని, ఎంత కాలముగాని గొప్పవి కానేరవు. ఏలన, ఈ ప్రేమానంత పారవశ్యము అభివ్యక్తులన్నింటికంటె అనిర్వచనీయమైన స్థితి.

ఈ అద్భుత స్థితినే మనము భూమిపై చరితార్థము చేయ వాంఛించు చున్నాము. ఇదియే, భౌతిక ప్రపంచమును పరివర్తన మొనరించి దానిని భాగవత సత్తస్థిరమైన అవాసయోగ్య భూమిగ చేయగలదు. అప్పడే పవిత్రమైన సత్యమైన ప్రేమ, ఈ శరీరమునం దవతరించును. అంతట యీ శరీరము దానికి వేషముగగాని, ముసుగుగాగాని ఉండనేరదు. మానవుని సాధనను అతి సరళము చేయుటకు స్పష్టముగ ననుభవించదగు ఘనిష్ఠతను కలిగించుటకు పరమేశ్వరుడు తన పరమోత్కృష్టమైన ప్రేమ స్వరూపస్థితిలో మానవ స్వరూపముతో సమానమైన భౌతిక శరీరమును సృష్టించుకొన నాకాంక్షించెను. కాని, సదా జడ పదార్థము యొక్క స్థూలస్వరూపములలో బంధింప బడుటవలన, ఆయన ఒక వికృత రూపమునే ప్రకటించుకొన

గలిగెను. మానవుడు తన చైతన్యములో, శరీరములో ఒక అనివార్యమైన అభివృద్ధి సాధించినవుడే భగవంతుడు తనయొక్క సంపూర్ణ సమృద్ధ రూపములో తనను అభివ్యక్తము చేసికొన గలడు. ఏలన, మానవుని అల్పత్వముతో నిండిన దంభము, మూర్ఖత్వముతో నిండిన అహంకారము, మానవ రూపములోనికి దిగివచ్చిన, ఆ దివ్య ప్రేమను ఒక అశ క్తతకును, పరాధీనతకు, ఆవశ్యకతకు ప్రతీకగ భావించి అపార్థముచేసికొనును.

అయినను, మానవునకు ఆదిలో అస్పష్టముగ తెలిసినను, క్రమక్రమముగ తాను పరిపూర్ణత దిశగా పురోగమించుచున్న కొలది, ప్రేమతత్వ మొక్కటే, సర్వసంసార దుఃఖనివారక మను జ్ఞానము అతనికి విస్పష్టమగును. అనిర్వచనీయమైన ఆనంద స్వరూపమగు ప్రేమతత్త్వ మొక్కటియే, ఈ విశ్వమును దహించుచున్న వియోగ బాధను తుడిచివేయ గలదు. ఏలన, పరమోత్కృష్టమైన తాదాత్మ్యానందపరవశత లోనే ఈ సృష్టి, తన, పరమ లక్ష్యమును, సంసిద్ధిని గుర్తించగలదు.

అందువలన, దివ్యత త్త్వము, పదార్థమునందు రూపుదాల్చినచో, దానిని మరుగుపరచ జాలని విధముగ భౌతిక పదార్థమును, ప్రకాశమానము, పరిశుద్ధము పరిపూర్ణముగ పరివ ర్తన మొనరింపవలెను; దానికై చేయు, నెంతటి ప్రయత్నమైనను కష్టతరము కాదు, ఎంతటి తపస్సును కఠోరముకాదు. అప్పడు ఆ అద్భుత ప్రేమ తనను ఈ విశ్వములో అభవ్యక్తము చేసికొనగలదు. జీవితమును మధుర ఆనంద స్వర్గముగ పరివర్తింపజేయగల సామర్థ్యము ఈ దివ్య ప్రేమకే గలదు.

ఇదియే పరమావధి, పరమ లక్ష్యము, ప్రయత్నము సాధించవలసిన మకుటాయ మానమగు తుది విజయము అని మీ రనవచ్చును. కాని, దీనిని సాధించుట కేమిజేయవలెను? ఏ మార్గము ననుసరించవలెను? ఆ మార్గములో మొదటి అడుగు ఎట్లు వేయవలెను?

మనము, భగవంతునితో వ్యక్తిగత సంబంధము నేర్పరచుకొనుటకు, అద్భుత ప్రతిభగల ప్రేమ, కలిగియుండవలెనని నిర్ణయించితిమి. కనుక, మనము

ఇతరులతో పెట్టుకొను సంబంధములో ప్రేమకు బదులు, అహంకార రహితమైన దయ, సుహృద్భావము, ప్రతిఫలము గాని, కృతజ్ఞతగాని, గుర్తింపుగాని అపేక్షించని సద్భావము కలిగి యుండవలెను. అది స్థిరము, అచంచలము, సంపూర్ణము అయి యుండవలెను. ఇతరులు ఏ విధముగ నీయెడల ప్రవర్తించినను, నీవు ఎన్నడును ఉద్రేకమునకుగాని, ఉద్వేగములకు గాని లోను కారాదు. అట్టితరి పరమేశ్వరుని యందు నీకు పరిశుద్ధము, పవిత్రమైన ప్రేమ కలదు గనుక, అతడే విధముగ నిన్ను సమర్థించి ఇతరులకు నీ యెడల కలిగిన అపోహలను, దుర్భావములను తొలగించి రక్షించవలెనో, ఆ పరమేశ్వరుని నిర్ణయమునకే వదలివేయుము.

నీవు నీ సంతోషము, ఆనందములకై భగవంతుని మీదనే ఆధారపడి యుండుము, అతడే నీకు రక్షకుడని భావించి సేవింపుము, అతడు నిన్ను సర్వదుఃఖములందు నాదుకొనును, మార్గదర్శకుడై తోవచూపును; ఎదురుదెబ్బలు తగిలి పడిపోయిన లేవనెత్తును. నీవు అలసి నిరాశచెందిన, నిన్ను తన బలమైన ప్రేమమయ బాహువులలోనికి తీసికొని తన మధురమైన దివ్యప్రేమతో ముంచి, అనునయించును.

ఈ సందర్భములో, సాధారణముగ కలుగు అపార్థమును తొలగించుటకై ఒక మాట చెప్పవలసియున్నది. నేను వ్రాయుచున్న భాషయందలి యిబ్బందులు కారణముగ, దైవము గురించి చెప్పినప్పుడు, పుంలింగరూపమునే వాడియుంటిని. కాని నిజమునకు, నేను వివరించిన యథార్థ ప్రేమతత్త్వము, స్త్రీ పుం భేదముల కతీతమైనది. మరియు, అది మానవ శరీరములోనికి అవతరించినప్పుడు, స్త్రీ పురుష భేదములేక, జరుగవలసిన కర్తవ్యము ననుసరించి యుండును.

సంగ్రహముగ, 'భావతపస్సు' అనగా భావావేశ పూరితములైన రాగబంధము లన్నిటిని, వాటి స్వభావమెట్టిదైనను, అనగా వ్యక్తిగతమైనవిగాని, కుటుంబ సంబంధమైనవిగాని, దేశసంబంధమైనవిగాని, లేదా మరెట్టి సంబంధము గలవైనను, పూర్తిగ విడనాడవలెను. ఏలన, పరాత్పర దివ్యతత్త్వము

పట్ల నీ అనుబంధమును గొనిపోయి, పృథ్విపై అతీత మానవ సాక్షాత్కారమునకు సాధన మగును.

ఈ సిద్ధియొక్క స్థిరమైన రూపములగు చతుర్విధ మోక్షములకు, మనలను నెమ్మదిగ, సహజముగ నిది నడిపించుకొని పోవును. భావావేశమోక్ష మన, అతీత మానవ ఐక్యసిద్ధిఫలితముగ దుఃఖవిమోచనము కూడయుననని చెప్పవలెను.

మానసిక విమోచనమనగా, అజ్ఞానమునుండి ముక్తి, అది జ్యోతిర్మయ మనస్సు నుద్దీపింపజేసి, మన సత్తలో అతిమానసిక చేతనను స్థాపించును. ఇదియే విజ్ఞానమయ చైతన్యము. దీని ప్రభావమే సృజనాత్మకమైన వాక్కు.


ప్రాణిక ముక్తియనగా, కోరికలను తొలగించి, వ్యక్తిగత ఇచ్ఛాశక్తి దివ్య సంకల్పశక్తితో, బుద్ధిపూర్వకముగను, సమగ్రముగను ఐక్యము నొందుట. ఇందు వలన నిరంతర ప్రశాంతత, నిర్మలత నెలకొనుటయేగాక శక్తికూడ నావిర్భవించును.

చివరకు, వీటన్నిటికి మకుటాయమానమగు భౌతికముక్తి (Physical liberation) అనగా, పదార్థ లక్షణమైన కార్యకారణ ధర్మము (సంబంధము) నుండి మోక్షము నందుట. పూర్తిగా నీవు నీకే అధిపతివి. ప్రకృతి నియమములకు దాసుడవు కావు. కాని, నీవు అవచేతన, అర్ధచేతనల ప్రేరణల ద్వారా సంచాలితుడ వగుటవలన నీవు సాధారణ జీవిత ప్రపంచమునకు వశుడ వగుచున్నావు. ఈ విమోచనము కారణముగ నీవు పరిపూర్ణ జ్ఞానసంపన్నుడవై, నీవు అవలంబించవలసిన మార్గమును నీవే నిర్ణయించుకొనగలవు. అంధకార బంధురమైన విధివశత నుండి స్వేచ్ఛనంది, నీవు సాధింపవలసిన లక్ష్యమును ఎన్నుకొన గలుగుదువు. నీ జీవిత యాత్రలో పరమోత్కృష్టమైన దివ్యసంకల్పమునకును, సత్యసమ్మతమైన జ్ఞానమునకును, అతిమానస చైతన్యమునకును ఎట్టి అవరోధములను రాకుండ నివారించుకొనగలవు.

- శ్రీమాత

అనువాదం : మానాప్రగడ శ్రీరాములు

Rs. 15



ఆలీపూర్ జైలులో శ్రీఅరవిందుల ఆధ్యాత్మిక అనుభవాలు

అఖిల

అఖిల భారత పత్రిక

మే 2009

విషయసూచిక

ఆలీపూర్ జైలులో శ్రీఅరవిందుల ఆధ్యాత్మిక అనుభవాలు

100 సంవత్సరాలనాటి (మే 1909) ఉత్తర్పరా ప్రసంగం

పుటలు 2-18

(ఆలీపూరు కుట్ర కేసు నుండి నిర్దోషిగా బయటపడిన కొద్ది రోజుల కే, బెంగాలులోని ఉత్తర్పరాలో ధర్మరక్షిణి సభ, 1909 మే నెల 30 న నిర్వహించిన సమావేశంలో శ్రీఅరవిందుల ప్రసంగపాఠమిది.

ఈ ప్రసంగ పాఠం వెనుక వారి నాలుగు సంసిద్ధులు, వారి మహాకార్యమూ అనే విషయం ప్రచురించబడింది.)

పరమావిష్కారం

శ్రీమాత పాండిచ్చేరి ఆగమనానికి పూర్వపు రచన

పుటలు 19-27

(1912 ఏప్రిల్ 19 న శ్రీమాత పారిస్‌లో ఒక భక్తబృందంతో ఇలా అన్నారు. "టిబెట్, చైనా, ఈజిప్టు, ఇండియా, చాల్డియా, కపాడోసియా దేశాలలోని, ఇతర దేశాలలోని తత్వోపదేశ కేంద్రాలలో నిర్దేశించిన తాత్విక పరిణామ సిద్ధాంత విధానాలను అధ్యయనం చేసినవారు అనేక రూపాలు దాల్చిన ఆ సిద్ధాంతాలలోని సారం ఒక్కటేనని గుర్తించగలరు. ఆ సిద్ధాంత ప్రాతిపదికలన్నింటినీ ఒక ఉదాత్త ప్రబోధంగా సంక్షిప్తం చేయవచ్చు. అదే ప్రబోధాన్ని పైథాగరస్ తన శిష్యులకు అందచేశాడు. ఆయన ప్రబోధం: "వ్యక్తి ఆత్మ, విశ్వాత్మ ఒక్కటే. మనలోనే భగవంతుడు ఉన్నాడు."

ఏప్రిల్ 28, 1912 న ఆమె పారిస్‌లో చేసిన ప్రసంగపాఠం ఇక్కడ ప్రచురించబడింది.)

కాంతి కిరణాలు (పుస్తక అనుబంధం)

పుటలు. 28-30

ఉత్తర్పరా ఉపన్యాసము

(పూర్వరంగం: శ్రీఅరవిందులు కలకత్తాలో 1872 ఆగస్టు 15 న జన్మించారు. 1879 లో, ఏడు సంవత్సరాల వయస్సులో, ఇద్దరు అన్నగార్లతోపాటు విద్యా భ్యాసం నిమిత్తం ఇంగ్లాడు వెళ్లి అచట 14 సంవత్సరాలు ఉన్నారు. 1892 లో బరోడా గెయక్వార్ లండనులో ఉండడం తటస్థించింది. వారిని శ్రీఅరవిందులు కలుసుకొన్నారు. బరోడా సంస్థానంలో ఉద్యోగిగా నియమితులై ఇంగ్లాడును విడచి 1893 జనవరిలో భారతదేశానికి తిరిగొచ్చారు.

శ్రీఅరవిందులు బరోడా సంస్థానంలో 1893 నుండి 1906 వరకు, 13 సంవత్సరాలున్నారు. చివరి కాలంలో ఎక్కువగా సెలవుపై ఉండి నిశ్శబ్ద రాజ కీయ కార్యక్రమం నిర్వహించారు. అప్పటివరకూ భారత జాతీయ కాంగ్రెసుకు ప్రధాన సిద్ధాంతమైన మితవాదం కన్న మరింత ముందుకు తీసుకుపోయే ప్రత్యక్ష రాజకీయ ఉద్యమ నిర్వహణకు 1906 లో బరోడా నుండి కలకత్తా వెళ్లిపోయారు. వీరు, మహారాష్ట్రలో పేరు గడించిన తిలక్ కృషివల్ల నేషనలిస్ట్ పార్టీ ఉద్భవిం చింది. ఎప్పటికోగాని వాస్తవరూపం ధరించలేని, మితవాదుల ఆకాంక్ష అయిన, స్వపరిపాలనగల సామంతరాజ్య హోదాకు వ్యతిరేకంగా, నూతనంగా ఉద్భవిం చిన నేషనలిస్ట్ పార్టీ స్వరాజ్యం తన లక్ష్యంగా ముందుకు తెచ్చింది. శ్రీఅరవిం దులను 1907 లో రాజద్రోహ నేరారోపణతో అరెస్టు చేసారు. కాని నిర్దోషిగా విడుదలైనారు. శ్రీవారి సోదరుడైన బరీంద్ర నాయకత్వం క్రిందనున్న విప్లవకారుల కార్యకలాపాల్లో భాగస్వామనే నేరారోపణతో ఆలీపూరు కుట్రకేసులో ఇరికించి 1908 మే నెలలో అరెస్టు చేసారు. కావి వారికి వ్యతిరేకంగా ఏవిధమైన ఋజువులను ధృవపరచలేనందువల్ల, ఈ కేసులో సైతం వారు నిర్దోషి అని తేలింది. విచార ణలో ఉన్న ఖైదీగా ఆలీపూరు జైల్లో ఒక సంవత్సరంపాటు నిర్బంధించబడిన పిమ్మట నిర్దోషిగా 1909 మే నెలలో శ్రీఅరవిందులు విడుదలైనారు. జైలులో ఉన్న ఈ సంవత్సర కాలంలో జీవితమంటె వారికున్న దృక్పథంలో సమూలమైన మార్పు వచ్చింది. ఇపుడు వారి ఆంతరిక ఆధ్యాత్మిక జీవితం, సంసిద్ధి, నిరంతరం పరిణా మంలోనూ, విశ్వజనీనతలోనూ బాగా అభివృద్ధిచెందాయి. అంతేగాక అవి వారి జీవితంలో ప్రముఖస్థానాన్నేగాక, వారినే పూర్తిగా ఆక్రమించివేసాయి. వారి కార్యా

చరణ అంతా అందులోని భాగంగా, ఆ జీవిత ఫలితంగా తయారైంది. వారి కార్యప్రభావం ప్రపంచమంతా విస్తరించింది, మానవజాతి భవిష్యత్తు మొత్తానికి సంబంధించిన మహాకార్యమైంది, అదే దాని లక్ష్య మైంది. బెంగాలులో ఉత్తర్పరాలో వారు 1909 మే నెల 30 వ తేదీన చేసిన ప్రసంగం ఈ పుటలలో ప్రచురించబడి నవి. ఈ ప్రసంగ పాఠం వెనుక వారి నాలుగు సంసిద్ధులు, వారి మహాకార్యమూ అనే విషయం ప్రచురించబడింది.

ఆలీపూరు కుట్ర కేసు నుండి నిర్దోషిగా బయటపడిన కొద్ది రోజులకే, బెంగాలులోని ఉత్తర్పరాలో ధర్మరక్షిణి సభ, 1909 మే నెల 30 న నిర్వహించిన సమావేశంలో శ్రీఅరవిందుల ప్రసంగపాఠమిది.)

ఈ రోజున మీ సభ వార్షిక సమావేశంలో హిందూమతాన్ని గురించి మాట్లాడవలసిందిగా నన్ను కోరారు. ఆ విషయం మీదే సంక్షిప్తంగా ప్రసంగిద్దామని భావించాను. ఆ ఉద్దేశాన్ని ఎంతవరకు నెరవేరుస్తానో నాకే తెలియడం లేదు. ఎందుకనంటే, నేనిచట కూర్చుని ఉన్నప్పుడు మీకు చెప్పవలసిన మాట, నా మదిలో ప్రవేశించింది. అది మీకే కాదు, మొత్తం భారతజాతి నుద్దేశించి పలుకవలసిన మాట. ఆ మాట నాకు జైలులో, నా అంతరంగంలో విన్పించింది. దానిని నా ప్రజలకు విన్పించడానికే నేను జైలునుంచి విడుదలైనాను,.


నేను చివరిగా ఇచటికొచ్చి సంవత్సరం దాటింది. నేనపుడు వంటరిగా లేను. ఒక గొప్ప శక్తివంతుడైన జాతీయతా ప్రవక్త నా చెంతనే ఉన్నాడు. తాను చెప్పవలసివున్న మాటను నిశ్శబ్దంలో, ఏకాంతంగా వినడానికి భగవంతుడు విధించిన ఏకాంతవాసం నుండి అప్పుడే బయటికొచ్చిన వ్యక్తి అతడు. మీరంతా వందల కొలదీ వచ్చి స్వాగతం పలికిన వ్యక్తి అతడు. కాని ఇపుడాతడు చాలా దూరంగా, మన నుండి వేరుచేయబడి వేల మైళ్ల దూరంలో ఉన్నాడు. నేను చూచుట కల వాటుపడిన నా సహకార్యకర్త లిపుడిచట లేరు. దేశంపై విరుచుకుపడిన పెనుతుఫాను తాకిడికి వాళ్లంతా చెల్లాచెదురై దూరమైపోయారు. ఇపుడు నేను సంవత్సరంపాటు ఏకాంతజీవితం గడిపి బయటికొచ్చి చూసేసరికి అంతా మారిపోయి కన్పిస్తోంది. ఎప్పుడూ నా ప్రక్కనే ఉంటూ, నా కార్యంలో సహకరించిన వ్యక్తి ఇపుడు బర్మాలో ఖైదీగా ఉన్నాడు. మరొకరు ఉత్తరభారతంలో నిర్బంధించ

బడి కుమిలిపోతున్నాడు. నేను బయటికొచ్చి చుట్టూ చూసాను, నన్నదివరకు ఊరడించి, ప్రేరణనిచ్చినవారి కోసం, చుట్టూ చూసాను. నాకు వాళ్లు కన్పించ లేదు. అంతేకాదు ఇంకేదో, అంతకు మించే జరిగింది. నేను బైటకు వెళ్లే సమ యంలో వందేమాతరం నినాదాల ప్రతిధ్వనులతో దేశం మొత్తం సజీవంగా ఉంది. దేశం మొత్తం ఒకే జాతి అనే ఆశతో సజీవంగా ఉంది. దైన్యస్థితినుండి నూతనోత్తే జంతో, ఉద్దీపితమైన కోట్లాది మానవుల ప్రగాఢ ఆకాంక్షతో సజీవంగా ఉంది. నేను జైలు నుండి బయటికొచ్చిన తర్వాత ఆ ఆక్రందన వినిపిస్తుందేమోనని చూసాను. కాని దానికి బదులు ఒక నిశ్చలనీరవత యెదురైంది. దేశాన్ని నిశ్శబ్దం ఆవరిం చింది, మనుష్యులు దిగ్భ్రమకు లోనై కన్పించారు. ఎందుచేతనంటే, అంతకు పూర్వం మన ముందున్న తేజోవిలసిత స్వర్గంలాంటి భవిష్యత్తును గురించిన దృక్పథానికి బదులు, మన శిరసులపై మానవ ఉరుములు, మెరుపులు, వర్షిస్తున్న భారమైన ఆకాశం పరచుకొని కన్పించింది. ఎటువైపు నడక సాగించాలో ఎవరికీ తెలిసినట్లు లేదు. "తరువాత ఏం చేయాలి? మనమేం చేయగలమింకా?" అనే ప్రశ్న అన్ని వైపుల నుంచీ ఎదురైంది. ఎటు నడవాలో, ఏం చేయాలో నాకూ తెలి యలేదు. కాని ఒక్క విషయం మాత్రం నాకు తెలుసు. ఆ ఆక్రందనను, ఆ ఆశను రేకెత్తించింది భగవంతుని అజేయశక్తి. ఈ నిశ్చల నీరవతను ఆవరింపజేసింది కూడా ఆ మహాశక్తే అని నాకు తెలుసు. ఎవరైతే ఎలుగెత్తి పలికినవాటిల్లోనూ, ప్రబల ఉద్య మాల్లోనూ వున్నారో అతడే ఈ నిశ్శబ్దంలోనూ, స్తబ్దతలోనూ ఉన్నాడు. ఈ జాతి క్షణకాలంపాటు తనలోనికి తాను ఉపసంహరించుకొని భగవంతుని సంకల్పాన్ని తెలుసుకొనేందుకు, ఈ విరామస్థితిని కూడా ఆయనే పంపించారు. దీనిని చూసి నేను నిస్పృహ చెందలేదు. ఎందుచేతనంటే జైలులో నాకు ఈ నిశ్చల నీరవతా స్థితి బాగా అలవాటైపోయింది. అంతేగాదు, నిష్క్రియంగా, నిశ్శబ్దంగా సంవత్స రకాలం పాటు సుదీర్ఘంగా సాగిన నిర్బంధంలో ఈ గుణపాఠం నేర్చుకొన్నాను. బిపిన్ చంద్రపాల్ జైలునుంచి విడుదలైనపుడు ఆతడొక సందేశంతో, ఉత్తేజకరమైన సందేశం స్వీకరించి వచ్చాడు. ఆతడిచట వెలువరించిన ప్రసంగాన్ని విన్నాను. ఆ ప్రసంగంలో గర్భితమైన భావం, ఆ ప్రసంగంయొక్క ఉద్దేశ్యం మతపరమైనం తగా రాజకీయమైనది గాదు. మనందరిలో నున్న భగవంతుని గురించి, జాతి యందుగల ఈశ్వరుని వాస్తవ దర్శనాన్ని గురించి అతడు మాట్లాడాడు. ఆతని

తరువాత ఆ ప్రసంగాల్లో కూడా, ఈ ఉద్యమంలోని సాధారణశక్తిని గురించిగాక, అందులోగల గొప్ప అసాధారణ శక్తిని గురించి, ఆ ఉద్యమం ముందున్న సాధారణ కార్యాన్ని మించి వున్న గొప్ప అసాధారణ కార్యాన్ని గురించి మాట్లాడాడు. ఇపుడు నేనూ మిమ్మల్ని తిరిగి కలుసుకుంటున్నాను. నేనూ జైలు నుంచి బయటి కొచ్చాను, ఉత్తర్పరావాసులైన మీరే మళ్లీ నన్ను ప్రప్రథమంగా రాజకీయ సభకు కాకుండా, మన మతాన్ని రక్షించడాని కేర్పడిన సంఘంయొక్క సమావేశంలో మాట్లాడడానికి ఆహ్వానించారు. బక్సర్ జైల్లో బిపిన్ చంద్రపాల్ స్వీకరించిన సందేశాన్ని భగవంతుడు నాకు ఆలీపూరు జైల్లో ప్రసాదించాడు. నా పన్నెండు నెలల కారాగారవాసంలో ప్రతి రోజూ భగవంతుడు అందించిన జ్ఞానాన్ని మీకు అందించాలని భగవంతుడు నన్ను ఆదేశించినందువల్ల ఇపుడు నేను బయటికొచ్చాను..

నాకు తెలుసు నేను విడుదలౌతానని. సంవత్సరకాల నిర్బంధం, కేవలం ఒక సంవత్సరకాలం ఏకాంతవాసం కోసం, శిక్షణ నిచ్చే నిమిత్తం ఉద్దేశించబడింది. భగవంతుని కార్యాని కవసరమైన ఒక్క సంవత్సరం కంటె ఎక్కువ కాలం నన్నెవరైనా జైల్లో ఎలా ఉంచగలరు? నేను పలుకవలసిన ఒక మాటను, నేను చేయవలసిన ఒక కార్యాన్ని ఆతడు నాకిచ్చాడు. ఆ మాట పలికేంతవరకూ, ఏ మానుషశక్తీ నా నోరు మూయలేదు. ఆ కార్యం నిర్వహించబడేంతవరకూ ఏ మానవశక్తీ, ఆ భగవంతుని ఉపకరణాన్ని, అదెంత బలహీనమైనదైనప్పటికీ లేదా ఏ విధంగా అల్పమైనదైనా అడ్డుకోలేదు. నేనిపుడు బయటికొచ్చి నా ఇక్కడున్న కొద్ది నిముషాల్లోనే, నేను మాట్లాడాలని భావించిన మాటను నేను పలకాలని సూచించబడింది. నా మనస్సులో ఉన్న విషయాన్నతను బయటపెట్టాడు. ఇపుడు నేను పలికేది, నిరోధించలేని ఒక ఆకస్మిక ప్రేరణకు లోనై పలుకుతున్నాను.

నన్ను అరెస్టు చేసి లాల్‌బజారు హజత్ కు తరలించినపుడు నేను అతని ఉద్దేశ్యపు ఆంతర్యాన్ని గ్రహించలేకపోయాను. అందుచేత ఒకింత తబ్బిబ్బయ్యాను. అందుచేత ఓ ఘడియసేపు పొరపడి నా హృదయం అతనికై ఆక్రందించింది. "ఏమిటిది? నాకేమిటిలా జరిగింది? నా దేశప్రజల కోసం నేను నిర్వహించవలసిన మహత్కార్యం నాకొకటి ఉన్నదని నమ్మాను. ఆ కార్యం పూర్తయ్యేదాగా నాకు నీ రక్షణ ఉంటుందని భావించాను. అయినపుడు ఎందుకు ఇటువంటి నేరం మోపబడి నేనిక్కడున్నాను?" ఒక రోజు గడిచిపోయింది, రెండో రోజు, మూడో రోజూ కూడా



శ్రీఅరవిందులను బంధించిన కిటికీ కూడా లేని జైలు గది

గడిచిపోయాక నాలోనే అంతర్వాణి విన్పించింది. "వేచి చూడు". అపుడు నేను శాంతించి వేచి చూసాను. తర్వాత నన్ను లాల్‌బజారు నుంచి, ఆలీపూర్ జైలుకు మార్చి మనుష్యుల నుండి వేరుచేసి, ఏకాంతంగా ఉండే చిన్న గదిలో ఒక నెల పాటు ఉంచారు. అచట రేబవళ్లు, నాలోని దివ్యవాణి విన్పిస్తుందేమోనని, నాకేం చెప్పాలని ఆయన సంకల్పించారో తెలుసుకుందామని, నేనేం చేయాలో ఆయన నుండి నేర్చుకుందామని వేచి చూసాను. ఈ ఏకాంతంలో మున్ముందుగా ఒక సాక్షాత్కారం, మొట్టమొదటి పాఠం నాకు లభించింది. అప్పుడు నాకు జ్ఞాపకం వచ్చింది. నన్ను నిర్బంధించడానికి ఒక నెల రోజుల ముందు, సమస్త కార్యకలాపాలన్నీ ప్రక్కనపెట్టి ఆయనతో మరింత సన్నిహితంగా వ్యవహరించగలిగేటట్లు ఏకాంతానికి వెళ్లి నాలోనికి నేను దృష్టి మళ్ళించాలని ఒక పిలుపు వచ్చింది. అపుడు నేను బలహీనుణ్ణి. ఆ పిలుపు కనుగుణంగా వ్యవహరించలేకపోయాను. నా పని నాకు అత్యంత ప్రియంగా కన్పించింది. నేను లేకపోతే, పని కిబ్బంది కలుగుతుంది, అది విఫలమై ఆగిపోవచ్చు కాబట్టి నేను చేస్తున్న పనిని విడిచిపెట్టగూడదని, ఒకింత గర్వంతో భావించాను. ఆతడు మళ్ళీ మాట్లాడినట్లు, నాకిలా చెప్పాడని అన్పించింది. "నీ అంతట నీవు ఛేధించడానికి శక్తి చాలని శృంఖలాలను నీ కోసమై నేను త్రెంచివేసాను. ఎందుకంటే నీవిదే కార్యంలో కొనసాగాలనేది నా సంకల్పం కాదు. నా ఉద్దేశ్యం ఎప్పుడూ కాదు. నీవు చేయవలసి వున్నది నీ కోసం వేరే ఉన్నది. దాని కోసం నిన్నిచటికి తీసుకొచ్చాను. నీ అంతట నీవు నేర్చుకోలేని దాన్ని బోధించడానికి, నా కార్యం నిర్వర్తించడానికి నీకు శిక్షణ నిచ్చేందుకు నిన్నిచటకు తీసుకొచ్చాను." అపుడు ఆయన గీతను నా చేతుల్లో పెట్టాడు. ఆతని బలం నాలో ప్రవేశించింది. గీతా సాధన చేయగలిగాను. మేధోపరంగా అర్థంచేసుకోవడమే గాదు, అర్జునుని నుండి శ్రీకృష్ణుడు ఏది కావాలని పట్టుబట్టాడో, ఆతని కార్యం చేయాలని ఆకాంక్షిఏచే వారందరి నుండి ఏం కావాలని పట్టుబడ్తాడో, — రాగద్వేషాల నుండి స్వేచ్ఛ, ఫలితాన్నాశించకుండా ఆయన కార్యం చేయడం, , స్వీయసంకల్పాన్ననుసరించిగాక ఆతని హస్తాల్లో ఒదిగిపోయి, విశ్వసనీయంగా సహించే ఉపకరణం గావడం, ఉత్థాన పతనాల యెడల, జయాపజయాల యెడల సమభావం కలిగివుంటూ ఆతని కార్యాన్ని చిన్నచూపు చూడకుండా నెరవేర్చడం సాధించాను. హిందూమతం అంటే యేమిటో అప్పుడే నేను గ్రహించాను. మనం

తరచుగా హిందూమతాన్ని గురించి సనాతనధర్మాన్ని గురించి మాట్లాడుతుంటాం. కాని మనలో కొద్దిమందికే ఆ మతం అంటే యేమిటో తెలుసు. ఇతర మతాలు ప్రధానంగా విశ్వాసం, ప్రకటనలకు సంబంధించిన మతాలు. కాని సనాతనధర్మమంటే జీవితమే. దాని నమ్మడం కంటె అంతకు మించి జీవించవలసిన ధర్మం. అనాదికాలం నుండి ఈ ద్వీపకల్పం మీద ఏకాంతంలో మానవజాతి విమోచన కోసం పదిలంగా పరిరక్షించుకొనబడిన ధర్మం. ఈ మతాన్నందించడం కోసమే భారతదేశ పునరుత్థానం జరుగుతోంది. ఇతర దేశాలలాగా తన కోసం, లేదా బలవత్తరమైనపుడు బలహీనమైనవాటిని అణచివేయడానికి కాదు అది తిరిగి ఉన్నతస్థితి నందుకోవడం. తన కప్పగించబడిన శాశ్వత వెలుగును ప్రపంచంపై ప్రసరింపజేయడానికి ఆమె పునరుత్థానమవుతోంది. భారతదేశం యెప్పుడూ తన కోసంగాక, మానవాళి కోసమే మనుగడ సాగించింది. ఇపుడామె తిరిగి గొప్పగా యెదగడం మానవాళికోసమేగాని ఆమె కోసం కానేకాదు.

అందుచేతనే భగవంతుడు నాకు యెత్తిచూపిన తదుపరి విషయం — హిందూమతంయెక్క ప్రధాన సత్యం. దానిని సాక్షాత్కరింపజేసుకొనేట్లు నన్ను ఆతడు తయారుచేసాడు. జైలు అధికారుల హృదయాల్లో నాపై సౌమ్యభావాన్ని నింపాడు. వాళ్లు తమ పైనున్న ఆంగ్లేయ అధికారితో నా గురించి "ఏకాంతంగా చిన్న గదికి పరిమితం చేయడంవల్ల అతను బాధపడుతున్నాడు. ఉదయసాయంకాలాల్లో కనీసం ఒక అరగంట జైలు ఆవరణలో పచార్లు చేయడాని కనుమతిద్దాం" అని చెప్పారు. ఆ యేర్పాటు జరిగింది. అలా నడుస్తున్న సమయంలో భగవంతుని బలం తిరిగి నాలో ప్రవేశించింది. నన్ను మనుష్యుల నుండి వేరుచేసిన జైలుగది వైపు చూశాను. నన్ను బంధించేది ఇక నెంతమాత్రం దాని ఎత్తైన గోడలు కాదు, వాసుదేవుడే నా చుట్టూ ఉన్నాడు. నా జైలుగది బయట వున్న చెట్టు క్రింద నడిచాను. కాని చెట్టు కాదు, వాసుదేవుడే, శ్రీకృష్ణుడే అచట నిలబడి నాకు తన నీడనిస్తున్నాడు. నా జైలు గది కటకటాల వంక చూసాను. తలుపుగా వున్న ఆ కటకటాల ఇనుపచట్రం వాసుదేవునిగా నాకు దర్శనమిచ్చింది. నారాయణుడే నాకు కాపలా వుండి రక్షిస్తున్నాడు. లేదా నాకిచ్చిన ముతక దుప్పటిపై పడుకున్నపుడు, శ్రీకృష్ణుని, నా సఖుని, నా ప్రియుని బాహుబంధాలలో ఉన్న అనుభూతిచెందాను. ఆతడు నాకు ప్రసాదించిన లోతైన అంతర్దృష్టి వల్ల కలిగిన ప్రయోజనమిది.

దొంగలు, హంతకులు, మోసగాళ్లు అయిన, కారాగారంలోని ఇతర ఖైదీలను చూసాను. వాళ్లనలా చూస్తున్నపుడు వాసుదేవుడే కన్పించాడు. మసకబార్చబడిన అంతరాత్మలు, దుర్వినియోగం చేయబడిన దేహాలుగల వీళ్లలో నారాయణుడే కన్పించాడు. ఈ దొంగలు, దోపిడీదొంగల మధ్యలో చాలామంది తమలోని సాను భూతి, దయతో నేను తలదించుకొనేలా చేసారు. అటువంటి విరుద్ధ పరిస్థితులను గూడా జయించి మానవత నిలబడింది. వాళ్లలో ప్రత్యేకించి ఒకరు వ్రాయడం, చదవడం తెలియని వ్యక్తి, నా జాతికి సంబంధించిన కర్షకుడు. దోపిడీదొంగగా చిత్రించబడి, పది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించబడిన వ్యక్తి. ఉన్నత వర్గాలవారమనే గర్వంతో మనము తక్కువజాతి వాళ్లని ఈసడించే జాతికి చెందిన ఆ మనిషి, నాకు ఒక మహాత్ముడుగా కన్పించాడు. మరొక్కసారి భగవంతుడు నాతో ఇలా అన్నాడు. "నాకు సంబంధించిన ఒక మహాకార్యంలో నీవంతుగా కొంచెం చేయడానికి ఏ జనం మధ్యకు నిన్ను పంపించానో చూడు. ఇటువంటి జాతిని నేను ఉద్ధరిస్తున్నాను, ఉద్ధరించడానికిగల కారణం కూడా ఇదే."

క్రింది కోర్టులో మా కేసు విచారణ ప్రారంభ సందర్భంలో మేజిస్ట్రేటు దగ్గ రకు మమ్మల్ని తీసుకొచ్చినపుడు ఇదే అంతర్దృష్టి నాలో నన్ను అనుసరించి ఉంది. భగవంతుడు "నిన్ను జైల్లో పెట్టినపుడు నీ హృదయం భగ్నం కాలేదా, నీ రక్షణ ఎక్కడ అని నీవు నన్నుద్దేశించి ఆక్రందించలేదా? ఇపుడు మేజిస్ట్రేటు వంక చూడు, ప్రాసిక్యూషనువారి వంక చూడు" అన్నాడు. నేను చూసాను, నాకు కని పించినది మేజిస్ట్రేటు కాదు, వాసుదేవుడు, నారాయణుడు, న్యాయపీఠంపై కూర్చుని ఉన్నాడు. ప్రాసిక్యూషను వంక చూసాను. అచట కన్పించింది ప్రభుత్వ న్యాయ వాది కాదు, అచట కూర్చుని ఉన్నది శ్రీకృష్ణుడు, నా సఖుడు, నా ప్రియుడు అచట కూర్చుని చిరునవ్వు చిందిస్తూ "ఇంకా భయపడుతున్నావా?" అని ప్రశ్నిం చి, "నేను మానవులందరిలో ఉన్నాను, వారి మాటలను చేష్టలను ప్రక్కకు నెట్టి నియంత్రిస్తాను. నా రక్షణ నీకింకా వుంది, భయపడకు. నీకు వ్యతిరేకంగా మోపబ డిన నేరారోపణను నాకొదిలెయ్యి, అది నీ కోసం ఆరోపించబడలేదు. నిన్నిక్కడకు తీసుకొచ్చింది మరో పనికి గాని నేరవిచారణకుగాదు. ఈ నేరారోపణ గూడా నా కార్యనిర్వహణావిధానంలో భాగం మాత్రమే. అంతకు మించి మరేం కాదు."

క్రింది కోర్టులో విచారణ ప్రారంభమైనపుడు నాకు వ్యతిరేకంగా వున్న సాక్ష్యంలో



శ్రీ చిత్తరంజన్ దాస్

అసత్యమేమిటో, ఏయే విషయాల మీద ప్రతికూల సాక్షులను విచారించవచ్చో తెలియజేస్తూ నా వకీలుకు అనేక సూచనలు వ్రాయడం మొదలుపెట్టాను. అపుడు నేను ఏమాత్రం ఊహించని ఒక సంఘటన సంభవించింది. నన్ను నిర్దోషిగా నిరూపించడానికి జరిగిన యేర్పాట్లు హఠాత్తుగా మారిపోయాయి. నా తరఫున వాదించడానికి మరొక వకీలు ముందుకొచ్చారు. అతని రంగప్రవేశం హఠాత్తుగా జరిగింది. అతను నా స్నేహితుడే, కాని అతను వస్తున్నట్లు నాకు తెలియదు. సమస్త ఆలోచనలు ప్రక్కను నెట్టివేసి, తన ఆర్జననంతా వదలివేసి, దినదినమూ అర్ధరాత్రిదాకా నెలల తరబడి శ్రమించి, నన్ను కాపాడడానికి తన ఆరోగ్యాన్ని కూడా పాడుచేసుకొన్న వ్యక్తి శ్రీయుత చిత్తరంజన్ దాస్ పేరు మీరంతా వినే వున్నారు. అతనిని చూడగానే సంతృప్తి కలిగింది, అయినా సూచన నివ్వడం అవసరం అని భావించాను. అదంతా కూడా నాలో నుండి నెట్టివేయబడింది. ఆంతరంగం నుండి సందేశం విన్పించింది. "ఈ వ్యక్తి నీ కాళ్ల చుట్టూ తగుల్కొన్న ఉచ్చుల నుండి నిన్ను రక్షించగల మనిషి. ఆ కాగితాలన్నింటినీ ప్రక్కన పెట్టు. అతనికి తెలియజేయవలసింది నేనుగాని, నువ్వు కాదు. అతనికి నేను సూచిస్తాను." అప్పటి నుంచి నా కేసును గురించి నా వకీలుతో నేనుగా ఒక్క మాట కూడా మాట్లాడలేదు లేదా ఒక్క సూచన కూడా చేయలేదు. ఎపుడైనా ఒక ప్రశ్న అడిగితే నా సమాధానం నా కేసుకుపయోగపడేది కాదని తెలిసిపోయేది. నేను అంతా అతనికే వదలివేసాను. అతను కేసు మొత్తాన్ని తన చేతుల్లోకి తీసుకొన్నాడు. ఫలితం మీ అందరకూ తెలిసిందే. భగవంతుడు నా నుండి యేమి ఆశిస్తున్నాడో అంతా నాకు తెలుసు. ఎందుకనంటే, పదే పదే నేను దాన్ని విన్నాను, ఎప్పుడూ నాలో ఒక వాణిని వింటూనే వున్నాను. "నేను దారి చూపుతున్నాను కనుక భయపడకు. ఏ కార్యం కోసం నిన్ను జైలుకు తీసుకొచ్చానో, నీవు విడుదలైన తర్వాత, ఆ నీ కార్యాన్ని నిర్వహించచపూనుకో. గుర్తుంచుకో, భయపడకు, సంశయించకు. ఇదంతా చేస్తున్నది నేనని, నువ్వుగాని, మరెవ్వరుగాని కాదని గుర్తుంచుకో. కాబట్టి ఏ మబ్బులు క్రమ్మినా, ఎన్ని ప్రమాదాలూ, బాధలూ, ఏ యిక్కట్లూ, అసాధ్యాలూ ఎదురైనా, ఏదీ అసాధ్యం కాదు, ఏదీ కష్టం కాదు. నేను జాతిలో ఉన్నాను, దాని పునరుత్థానంలో వున్నాను, నేను వాసుదేవుడిని, నేను నారాయణుడిని, నేనేమని సంకల్పిస్తే


అదే జరుగుతుంది. ఇతరులు సంకల్పించింది కాదు. నేనేది సాధించాలని నిర్ణయి స్తానో, దాన్నే మానవశక్తీ ఆపలేదు."

ఇదిలా వుండగా భగవంతుడు నన్ను ఏకాంతం నుండి బయటపడవేసి నాతో పాటు నిందారోపణచేయబడ్డ వాళ్ల మధ్య వుంచాడు. నా ఆత్మత్యాగాన్ని గురించి, దేశం యెడల నాకుగల అంకితభావాన్ని గురించి మీరీ రోజు చాలా గొప్పగా మాట్లాడారు. నేను జైలునుండి విడుదలైనప్పటి నుండీ ఇటువంటి ప్రసంగాలను వింటూనే వున్నాను, కాని మొమాటపడ్తూ, ఒకింత బాధతోనే వింటున్నాను. ఎందుకనంటే నా బలహీనత నాకు తెలుసు. స్వీయతప్పిదాలకు, వెనుకంజలకు గురికాబడినవాడిని. ఇతఃపూర్వం అవి నాకు తెలియకపోలేదు. ఏకాంతంలో అవన్నీ ఒక్కసారిగా నాపై తిరగబడినపుడు వాటి ప్రాబల్యత నాకు పూర్తిగా అవగతమైంది. ఇటువంటి మనిషినైన నేను బలహీనతల పుట్టననీ, అపసవ్య మరియు అపరిపూర్ణ ఉపకరణాన్ననీ ఒక ఉన్నతశక్తి నాలో ప్రవేశించినపుడే నేను శక్తివంతుణ్ణి కాగలుగుతున్నాననీ నాకు తెలుసు. అటువంటి స్థితిలో నేను ఈ యువకుల మధ్యకొచ్చాను. వాళ్లలో చాలామందిలో ఎంతో ధైర్యం, నిరహంకారప్రవృత్తి కల్గినవారని గ్రహించాను. ఈ విషయంలో వాళ్లతో పోల్చుకుంటే, నేను ఎందుకూ కొరగాను. శక్తిలోనూ, నడతలోనూ మాత్రమే గాకుండా ఒకరిద్దరు — ఒకరిద్దరే కాదు అలాంటివారు చాలామందే వున్నారు — నేను గర్వపడే మేథోసామర్థ్యంలో గూడా నాకంటె ఉన్నతమైనవారిని చూసాను. "నా ఆదేశానుసారం పైకి లేస్తున్న యువత ఇది, నూతన మరియు బలీయమైన జాతి ఇది. వాళ్లు నీకంటె గొప్పవాళ్లు. దేనికి భయడాలి? నీవు ప్రక్కకు తప్పుకొన్నా, నిదురించినా, నా కార్యం జరిగితీరుతుంది. నీవు రేపు ఒక ప్రక్కకు నెట్టివేయబడితే, నా కార్యాన్ని స్వీకరించి, నీ విదివరకెన్నడూ చేయలేనంత శక్తివంతంగా చేయడానికీ యువకులున్నారు. ఈ జాతిని ఉద్ధరించే ఒక మాట విన్పించడానికి నానుండి నీవు కొద్ది శక్తిని పొందావు." ఇది, నాకు అతను చెప్పిన తదుపరి విషయం.

ఆ తరువాత హఠాత్తుగా ఏదో జరిగింది. వెంటనే నన్ను తిరిగి ఒక్కరే ఉండే జైలుగదిలో ఏకాంతంలోనికి పంపించారు. ఆ కాలంలో నాకు జరిగిందాన్ని చెప్పాలనిపించడం లేదు. కాని రోజు రోజుకు, భగవంతుడు నాకు తన అద్భుతాలు చూపించాడు, హిందూమతంయొక్క అసలు సత్యాన్ని నేను గ్రహించేట్లు

చేసాడు. నాకది వరకు చాలా సంశయాలుండేవి. విదేశభావాల ప్రభావాల మధ్య పూర్తిగా విదేశీయమైన వాతావరణంలో నేను ఇంగ్లాండులో పెరిగి పెద్దవాడిన య్యాను. హిందూమతంలోని చాలా విషయాలు ఊహలని, స్వాప్నికవిషయాలు, భ్రమలనీ అనుకొనేవాడిని. కాని ఇపుడు ప్రతిరోజూ, మనస్సులో, హృదయంలో, దేహంలో కూడా హిందూమతంలోని సత్యాలను సాక్షాత్కరింపజేసుకొన్నాను. నాకవి సజీవ అనుభవాలు. పదార్థవిజ్ఞానశాస్త్రం వివరించలేని విషయాలు నాకు తేటతెల్ల మైనాయి. పూర్తిగా భక్తిభావంతోగాని, పూర్తిగా జిజ్ఞాసతోగాని నేను ప్రారంభంలో భగవంతుని వైపు చూడలేదు. స్వదేశీ ఉద్యమం ప్రారంభానికి కొన్ని సంవత్స రాలకు ముందు నేను బరోడాలో ఉన్నపుడు భగవంతుని వైపు నడిచాను. తరువాత ప్రజల్లోకి ఆకర్షింపబడ్డాను.

భగవంతుని వైపు తిరిగిన అప్పట్లో, ఆతనిపట్ల నాలో సజీవమైన విశ్వాసం అంతగా లేదు. నాలో అజ్ఞేయవాది ఉన్నాడు, నాస్తికుడున్నాడు, సంశయాత్ముడు న్నాడు. అసలు భగవంతుడున్నాడనే విషయం కూడా నాకు ఖచ్చితంగా తెలి యదు. ఆతని తాలూకు సంవేదన నా కెన్నడూ కలుగలేదు. అయినా ఏదో నన్ను వేదాలవైపు, గీతాసత్యంవైపు, హిందూమతసత్యంవైపు ఆకర్షించింది. ఈ యోగంలో ఎక్కడో ఒక బలీయమైన సత్యమే వుంది, వేదాంతం మీద ఆధారపడిన ఈ మతంలో ఒక శక్తివంతమైన సత్యమే వుంది అని అన్పించింది. యోగంవైపు తిరిగి, దానిని అనుష్ఠించాలని, నా భావన యదార్థమో కాదో తెలుసుకోవాలని నిర్ణయించుకొన్న పుడు, ఈ భావంతో, ఈ ప్రార్థనతో ఆయన వైపు తిరిగాను. “నీవు కనుక ఉన్న ట్లైతే, నీ కపుడు నా హృదయం తెలిసే వుంటుంది. ముక్తి కావాలని అడగనని, ఇత రులు అర్థించేదాన్ని దేన్నీ నేనర్థించననీ నీకు తెలుసు. ఈ జాతి నుద్ధరించు బలం కావాలని మాత్రమే అర్థిస్తున్నానని నీకు తెలుసు. నేను ప్రేమించే ఈ ప్రజల కోసం బ్రతకాలని, వారి కోసం పనిచేయనీయమనీ అర్థిస్తున్నానని నీకు తెలుసు”. యోగ సాక్షాత్కారం పొందాలని చాలా కాలం పెనగులాడాను, చివరికది కొంతవరకు సాకారమైంది. కాని నేను అత్యధికంగా ఏం కావాలని అభిలషించానో ఆ విష యంలో సంతృప్తి లభించలేదు. అటువంటి సమయంలో జైలుగది ఏకాంతంలో దాని కోసం మళ్లీ అడిగాను. “నీ ఆదేశం ఏమిటే చెప్పు, ఏం చేయాలో, ఎలా చేయాలో నాకు తెలియడం లేదు. సందేశం పంపించు.” యోగంలో వుండగా



Sri Aurobindo in Alipore Jail Records

రెండు సందేశాలు అందాయి. ఈ జాతి నుద్ధరించడం అనే కార్యాన్ని నీ కప్పగించాను. త్వరలోనే నీవు జైలునుండి విడుదలయ్యే సమయం వస్తుంది. ఎందుకనంటే ఇపుడు నీకు శిక్షపడడంగాని, లేదా ఇతరులు చేయవలసి వున్నట్లుగా దేశం కోసం బాధపడ్తూ నీవు కాలం వెళ్లబుచ్చడంగాని నా సంకల్పం కాదు. నా కార్యనిర్వహణకు నిన్ను పిలిచాను, నీ వడిగినందునకు నేనిచ్చే ఆదేశం ఇదే." రెండో సందేశం ఇలా అందింది. "ఈ సంవత్సరకాల ఏకాంతవాసంలో నీకు కొంత అనుభవాన్నిచ్చాను. నీకు దేన్ని గురించైతే సంశయాలున్నాయో, దాన్ని గురించి కొంత తెలియచేసాను, అదే హిందూమతంలోని సత్యం. దీన్నే, ఈ మతాన్నే నేను ఉద్ధరించి ప్రపంచం ముందు పెడ్తున్నాను. ఈ మతధర్మాన్నే ఋషులు, యోగులు, భగవదవతారాల ద్వారా పరిపూర్ణం చేసి, అభివృద్ధి చేసాను. అదిప్పుడు జాతుల మధ్య నా పని చేయడానికి ముందుకెళ్తోంది. ఇదే సనాతన ధర్మం. నీకిదివరకు నిజంగా తెలియని దేనిని నీకిపుడు తెలిసేట్లు చేసానో ఆ శాశ్వతమతం ఇది. నీలోని అజ్ఞేయవాదికి, సంశయాత్మునికి సమాధానం ఇచ్చాను. ఎందుకనంటే నీకు వెలుపల, నీ అంతరంగంలోనూ, భౌతికమైనవి, అంతర్గతమైనవి, నీకు సంతృప్తి కలిగించిన ఋజువులు చూపాను. సనాతనధర్మం కోసం, వాళ్లు గొప్పవాళ్లు కావాలి, ప్రపంచం కోసమేగాని వాళ్లకోసం కాదు వాళ్లు గొప్పవాళ్లయేది అనే పలుకునే నీవు బయటకు వెళ్లిన పిదప వాళ్ల కెపుడూ విన్పించు. ప్రపంచసేవ చేయడానికే నేను వాళ్లను స్వతంత్రులను చేస్తున్నాను, వాళ్లకు స్వేచ్ఛనిస్తున్నాను. కనుక భారతదేశం పునరుత్థానం కావాలని చెప్పినప్పుడు, ఉత్థానమయ్యేది సనాతనధర్మం. భారతదేశం గొప్పది గావాలన్నపుడు, గొప్పదయ్యేది సనాతనధర్మం. భారతదేశం తనను తాను విశాలం చేసుకోవాలి, విస్తరించాలి అని చెప్పినప్పుడు ప్రపంచంపై విశాలంగా విస్తరించేది సనాతనధర్మం. ధర్మం కోసం, ధర్మం వల్ల భారతదేశం నిలుస్తుంది. మతాన్ని గొప్పగా చూపడమంటే, దేశాన్ని గొప్పగా చూపడం, సర్వే సర్వత్రా, మానవులందరిలోనూ, వస్తువు లన్నింటియందూ నేనున్నానని చూపించాను. ఈ ఉద్యమంలోనూ, దేశంకోసం శ్రమించేవాళ్లలోనూ మాత్రమే గాదు, వారిని వ్యతిరేకించేవాళ్లలో వారి దారి కడ్డుగా నిలిచేవాళ్లలో గూడా నేనే పనిచేస్తున్నాను. నేను ప్రతిదేహంలోనూ పనిచేస్తున్నాను. మనుష్యులు ఏమి ఆలోచిస్తున్నా, ఏ కర్మ చేస్తున్నా నా కార్యానికి సాయపడడం కంటె వేరే ఏదీ చేయలేరు. వాళ్లు కూడా నా

కార్యమే నిర్వహిస్తున్నారు, వాళ్లు నాకు శత్రువులు కాదు. నా ఉపకరణాలు. ఎటు పోతున్నావో తెలియకపోయినా నీ చర్య లన్నింటి ద్వారా ముందుకే పోతు న్నావు. నీ వొకటి చేయాలనుకొంటావు మరొకటి చేస్తావు. ఒక ఫలితానికి లక్ష్యంగా పనిచేస్తావు. దానిని భిన్న మైన లేదా వ్యతిరేకమైన ఫలితాలకే నీ చర్యలు దారి తీస్తాయి. ప్రజల్లోకి పోయి పనిచేస్తున్నది దైవశక్తే. చాలా కాలం నుండి ఈ పునరు త్థానానికి జాతిని సన్నద్ధం చేస్తున్నాను. ఇపుడా సమయం ఆసన్న మైంది. అది నెరవేరేట్లు దాన్ని నడిపేది నేను."

ఇదే నేనిపుడు మీకు చెప్పవలసి వున్నది. మీ సభ పేరు "మతసంరక్షణ సభ". బాగుంది. మతసంరక్షణ అంటే మతాన్ని రక్షించడం, పునరుత్థానమైన హిందూమతాన్ని ప్రపంచం ముందు నిలబెట్టడం. అదీ, మన ముందున్న కార్యం. కాని హిందూమతమంటే ఏమిటి? హిందూజాతి దానిని నిలబెట్టుకొని వుంచుకొన్నది గనుక అది హిందూమతమైంది. ఈ ద్వీపకల్పంలో, సముద్రాల, హిమాలయాల ఏకాంతంలో అది పెంచి పోషించబడింది గనుక అది హిందూమతమైంది. ఈ పవిత్ర పురాతన గడ్డపై దానిని కాపాడవలసిన బాధ్యత యుగాల నుండి ఆర్యజాతి కప్పగించబడింది గనుక అది హిందూమతమైంది. కాని అది ఒక దేశ ఎల్లల మధ్య గిరిగీసి బంధించబడి లేదు. ప్రపంచంలో కొన్ని హద్దులకు పరిమితమైన ఒక భాగా నికి ప్రత్యేకమైనది కాదు. హిందూమతం అని మనం చెప్పుకొనేది నిజానికి శాశ్వత మైన మతం. ఎందుకనంటే అది ఇతర మతాలన్నింటినీ ఆలింగనం చేసుకొన్న విశ్వజనీన మతం. ఒక మతం విశ్వజనీనం కాకపోయినట్లైతే అది శాశ్వతం కాలే దు. ఒక సంకుచిత మతం, ఒక తెగకు పరిమితమైన మతం, కొద్దికాలం మాత్రమే, పరిమిత కార్యం కోసమే మనగలుగుతుంది. విజ్ఞానశాస్త్రి ఆవిష్కారాలను, వేదాంత విషయవిచారణలను ముందుగానే గ్రహించి వాటిని తనలోనికి స్వీకరించడం ద్వారా, వాటి నధిగమించి చూడగల మతం ఇదొక్కటే. భగవంతునికి మనకుగల సన్నిహి తత్వంతో మానవాళిని ప్రభావితం చేసి మనిషి భగవంతుని సమీపించడానికి గల సాధ్యమైన సమస్త ఉపాయాలను తన విశాల పరిధిలోనికి ఇముడ్చుకోగల మతం ఇదొక్కటే. భగవంతుడు మానవులందరిలోనూ వస్తువు లన్నింటి యందూ ఉన్నా డు, అతనిలోనే మనం చరిస్తున్నాం. అతనిలోనే మన అస్తిత్వం ఉంది అని సర్వమ తాలు అంగీకరించిన సత్యాన్ని ప్రతిక్షణం ఒత్తిచెప్పే మతం ఇదొక్కటే. ఈ సత్యాన్ని

గ్రహించి, నమ్మగలిగేట్లు మనల్ని తయారుచేయగల, మన అస్తిత్వపు ప్రతి అంశం ఆ సత్యాన్ని నిజం చేసుకొనేట్లు చేయగల మతం ఇదొక్కటే. ప్రపంచమంటే వాసుదేవునికిలీల అని ప్రపంచానికి చూపగల మతం ఇదొక్కటే. ఆ లీలలో మనకు సంబంధించిన భాగంలో సూక్ష్మాతిసూక్ష్మ నిబంధనలను, ఉదాత్తమైన నియమాలను ఎంత బాగా ఆచరించగలమో చూపగల మతం ఇదొక్కటే. ఏ విధమైన అత్యల్ప విషయంలో గూడా మతం నుండి జీవితాన్ని వేరుచేయని మతం ఇదొక్కటే. అమృతత్వమంటే ఏమిటో తెలిసిన, మృత్యువు, నిజం అన్న భావనను, మన నుండి పూర్తిగా తొలగించివేసిన మతం ఇదొక్కటే.

ఈ రోజు మీకు విన్పించడానికి, నా నోట పలికిన మాట ఇదే. నేను మాట్లాడుదామనుకొన్నది నాకు దూరమైంది. నా కిచ్చిన దానిని మించి నేను పలుకవలసిందేమీ లేదు. నాలో ప్రవేశపెట్టబడిందీ పలుకే, దాన్నే నేను మీకు చెప్పగలిగాను. మీకు చెప్పవలసిన వున్న ఆ పలుకును విన్పించడం పూర్తైంది. నాలోని ఈ శక్తితో ఇంతకు ముందొకసారి మీతో మాట్లాడాను. ఇది రాజకీయ ఉద్యమం కాదని, జాతీయత అనేది రాజకీయాలు కాదని, అదొక మతమని, ఒక సిద్ధాంతసారమనీ, విశ్వాసమనీ అప్పుడు చెప్పాను. అదే విషయాన్ని మళ్ళీ ఇపుడు చెప్తున్నాను. కాని మరో విధంగా చెప్తున్నాను. జాతీయత అంటే కొన్ని సూక్తులపై ఒక నమ్మకం కాదు, ఒక మతం కాదు, ఒక విశ్వాసం ఇంకెంత మాత్రం కాదు. సనాతనధర్మమే మన జాతీయత. ఈ హిందూజాతి సనాతనధర్మంతో పుట్టింది. సనాతనధర్మంతో జీవిస్తుంది, సనాతనధర్మంతోనే అభివృద్ధి చెందుతుంది. సనాతనధర్మం క్షీణించినపుడు దానితోపాటే క్షీణిస్తుంది. సనాతనధర్మం నశించగలిగినదైతే, సనాతనధర్మంతోనే హిందూజాతి నశిస్తుంది. జాతీయత అంటే సనాతన ధర్మమే.

మీకీ రోజు విన్పించవలసి వున్న సందేశమిదే.

అనువాదం: కె. వి. రావు

(*SABCL* Vol. 2, pp. 1-10; also *CWSA* Vol. 8, pp. 3-12)

జాతీయత అంటే కొన్ని సూక్తులపై ఒక నమ్మకం కాదు, ఒక మతం కాదు, ఒక విశ్వాసం ఇంకెంత మాత్రం కాదు. సనాతన ధర్మమే మన జాతీయత.

శ్రీఅరవిందుల నాలుగు సంసిద్ధులు, మహాకార్యం

శ్రీఅరవిందుల యోగమూ, ఆధ్యాత్మిక సిద్ధాంతమూ నాలుగు గొప్ప సంసిద్ధుల మీద స్థాపితమైనాయి. 1910 వ సంవత్సరంలో పాండిచేరి రాకముందే వీటిలో రెండింటి ఉపలబ్ధి కలిగింది. మొదటిది: నిశ్చలనీరవత, స్థలకాలరహిత బ్రహ్మం యొక్క ఉపలబ్ధి. దీనిని వారు 1908 లో లేలేగారితో కలిసి ధ్యానించే సమయంలో సాధించారు. ఇందువల్ల మొదట్లో కలిగిన ప్రపంచం పూర్తిగా మిథ్య అనే అవగాహన రెండవ సంసిద్ధి తరువాత తుడిచిపెట్టుకుపోయింది. ఈ రెండవ సంసిద్ధి 1908-09 మధ్యకాలంలో ఆలీపూరు జైల్లో ప్రాప్తించింది. విశ్వచేతన, సమస్త జీవులూ, అస్తిత్వం కలిగిన సమస్తమూ దైవంగా దర్శించారు. జైలులో ధ్యానం శ్రీఅరవిందులు ఇతర రెండు సంసిద్ధులను సిద్ధింపజేసుకొనే మార్గంలోనే వుండి వున్నారు. ఒకటి నిష్క్రియ, సక్రియ బ్రహ్మంను తన రెండు పార్శ్వములుగా కలిగిన మహోన్నత సత్యదర్శనం, రెండు అతిమనస్సుకు దారితీసే ఉన్నతచేతనాస్తరాల దర్శనం.

"శాశ్వత సంసిద్ధి మరియు పరబ్రహ్మంలో ఆవాసం" సంసిద్ధిని శ్రీఅరవిందులు 1912 నాటికల్లా పొందారు. ఉన్నతచేతన లోనికి ఆరోహణ, భౌతికచేతన లోనికి ఆయా స్తరాల శక్తిని తీసుకురావడం అనే ప్రక్రియ కొనసాగింది. మనస్సు, అతిమనస్సుల మధ్యగల స్తరాలలో అత్యున్నత స్తరమైన "అధిమానస దైవం" భౌతికంలోనికి 1926 వ సంవత్సరం నవంబరు నెల 24 వ తేదీన అవతరించడం ద్వారా వీరి కృషికి కిరీటం పెట్టినట్లైంది. ఇది అతిమనస్సు స్వీయ అవతరణకు సన్నాహక అవతరణగా రూపుదాల్చింది. "మానవాళిలోని మహోన్నతులంతా కలగన్న పరిపూర్ణత ప్రాప్తింపజేయు" సన్నాహక అవతరణగా ఇది రూపుదాల్చింది.

1926 వ సంవత్సరం నుండి శ్రీఅరవిందులు అతిమానస అవతరణను సాధించడానికి ఆధ్యాత్మికంగా కృషిచేస్తూ దాని ఆగమనాన్ని వేగవంతం చేయడానికి 1950 లో భౌతికదేహాన్ని విడిచిపుచ్చారు.

అనువాదం: కె. వి. రావు

పరమావిష్కారము
(The Supreme Discovery)

మనం సర్వసమగ్రంగా పురోగతి సాధించాలంటే, మన అంతరంగ చైతన్యంలో బలిష్టమైన, పవిత్రమైన ఒక మానసిక సమన్వయం నిర్మించుకోవాలి. మనం బయటి ప్రపంచం నుండి ఇంద్రియచాపల్యాలను ఎదుర్కొనే రక్షణవలయంగా అది పనిచే స్తుంది. అంతేకాదు మనం తప్పుదారి తొక్కకుండా నిరోధించే లక్ష్మణరేఖలాగ అది ఉపయోగపడుతుంది. జీవనసాగరయానంలో మనకు దారిచూపే దీపకాం తిగా అది సహాయపడుతుంది.

ప్రతివ్యక్తి తన ఆకాంక్షలకు, సంబంధాలకు, మేధోపరమైన ధోరణులకు తగి నట్లు ఈ మానసిక సమన్వయాన్ని నిర్మించుకోవాలి. అది సజీవంగా తేజోమయంగా వుండాలంటే, మన అంతరంగ కేంద్రాలలోని పరమాత్మ దీప్తికి సంకేతంగా మేధో పరంగా ప్రాతినిధ్యం వహించే భావనపై అది ఆధారపడాలి. ఆ పరమాత్మే మనకు జీవం, మనకు కాంతి. అన్ని యుగాలలో, అన్ని దేశాలలో మహనీయమైన గురు వులు వివిధ రూపాలలో మహోదాత్త భావజాలంతో ఈ సమన్వయాన్ని ప్రబో ధించారు.

ప్రతివ్యక్తిలోని ఆత్మ, విశ్వపరివ్యాప్తమైన ఆత్మ ఒక్కటే. ఇప్పుడున్న సర్వస్వం అనంతకాలం నుండి సూత్రరీత్యా, సారభూతంగా ఉన్నది. అటువంటప్పుడు, ఆత్మకు ఆత్మయొక్క ఆవిర్భావమూలానికి తేడా ఎందుకు చూడాలి? మనకు మొదట్లో మనం నిక్షిప్తం చేసినదానికి తేడా ఎక్కడ? "మన మూలం మన దైవము, మనం ఒక్కటే" అన్నది నిరంతర సత్యం. మన ప్రాచీన సాంప్రదాయాలు, భువన మాన వాళికి అందించిన అద్భుత ప్రబోధం అది. భగవంతునికి మనకు మధ్య సన్నిహిత, ప్రగాఢబంధం కాదది. అది నిజమైన సాయుజ్యం. (ఏకత్వం)

దైవాన్ని అన్వేషించే వ్యక్తి అందని శిఖరాగ్రానికి నెమ్మదిగా తిరిగి ఆరోహించ డానికి యత్నించినప్పుడు ఈ అజ్ఞేయ అనంతంలో తన జ్ఞానం, తన అంతః స్ఫూర్తి ఒక్క అడుగు ముందుకు తీసుకొని వెళ్ళలేవు., అది అతను విస్మరిస్తాడు. తాను సాధించతలచుకొన్నది, తనకు చాలా దూరంగా ఉన్నదని తాను అనుకొ న్నది తనలోనే మెరుస్తున్నదని అతను తెలుసుకోలేడు. మనిషికి తనలోని తన

ఆవిర్భావమూలాన్ని గూర్చి ఎరుకలేనప్పుడు, ఆ మూలాన్ని ఎలా తెలుసుకోగ లడు?

తనకు తాను అర్థం చేసుకొని, తనకు తాను తెలుసుకొన్నప్పుడే ఈ పరమా విష్కారాన్ని (The Supreme Discovery) దర్శించగలడు. బైబిల్‌లోని పురాతన ప్రధాన గురువులాగ — "భగవంతుని దివ్యధామం ఇక్కడే ఉంది. నేను తెలుసుకోలేకపోయాను." అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తాడు.

అందుచేత ఈ ఉదాత్త, సముజ్వల భావాన్ని వ్యక్తం చేయాలి. ఈ భౌతికప్రపంచాల సృష్టికర్త్రిణి అదే అదే. భూస్వర్గాలకు ఆక్రమించే వాక్కును ప్రపంచమానవాళికి ఆవిష్కరించాలి. ఆ వాక్కేమిటో తెలుసా — "నేను ఈ సృష్టి సర్వత్రా అందరిలోనూ భాసిస్తున్నాను."

అందరికీ (ఈ పరమ రహస్యం) తెలిసినప్పుడు వాగ్దానం చేయబడిన మహాపరివర్తనల మహత్తరమైన సమయం మనకు అందివస్తుంది. ప్రతి అణువులోను అంతర్నిక్షిప్తమైన భగవత్ భావసూచికాచలనాన్ని గుర్తించినప్పుడు, ప్రతిజీవిలోనూ భగవత్ సాన్నిధ్య విద్యుల్లతను వీక్షించగల్గినప్పుడు, తన సోదరునిలోను దైవాన్ని చూడగల్గినప్పుడు, ప్రకృతిని కృంగదీస్తున్న చీకటి, అసత్యం, అజ్ఞానం, బాధలను తుడిచిపెడ్తూ ఉషోదయమవుతుంది. ప్రకృతి, దైవపుత్రుల సాక్షాత్కారం కోసం, శోకిస్తూ నిరీక్షిస్తోంది.

సూర్యుడు మన జీవితాన్ని ప్రదీప్తం చేస్తున్నట్లు ఈ ఆలోచన మన స్మృతిపథంలో వెలుగులు వెలార్చుతూ ఉండాలి. మిగిలిన సమస్త ఆలోచనల సారసంగ్రహమే అది.

ఆ ఆలోచననే నేనివ్వాళ గుర్తుచేస్తున్నాను. ఆ ఆలోచనను మనం అరుదైన అమూల్యాభరణంగా మన గుండెల్లో దాచుకొని మన జీవనమార్గంలో ప్రయాణించాలి. అంతకన్నా మించిన నిధి లేదు. మనలోని చైతన్యాన్ని ఆ ఆలోచన కాంతివంతం చెయ్యాలి. రూపాంతరం చెందించాలి.

అప్పుడు ఆ ఆలోచన జీవులందరిలోనూ, సర్వవస్తురాశిలోనూ భాసిస్తున్నదని తెలుసుకొంటాము. ఈ మహాప్రపంచంలోని పరమాద్భుత ఏకత్వాన్ని అనుభవించగల్గుతాం.

మన అల్పసంతోషాల నిరర్థకత్వాన్ని, మన బుద్ధిహీన పోట్లాటలను, మన సంకు

చిత కాంక్షలను, మన గుడ్డి కోపావేశాలను అప్పుడు అర్థం చేసుకోగల్గుతాం. మన తప్పులు మన కన్ను లెదుటే కరిగిపోవనడం, మన పరిమిత వ్యక్తిత్వం కట్టుకున్న చిట్టచివరి రక్షక కందకాలు కుప్పకూలిపోవడం, మన జడమయమైన అహంకారం నశించిపోవడం మనం గమనిస్తాము. నిజమైన ఆధ్యాత్మిక మహోదాత్త స్రవంతిలో మనం కొట్టుకుపోతాం. మనల్ని సంకుచిత సరిహద్దురేఖల నుండి విముక్తి కల్గించేది అదే.

వ్యష్టి ఆత్మ, విశ్వ ఆత్మ ఒక్కటే. ప్రతి ప్రపంచంలో, ప్రతి జీవిలో, ప్రతి వస్తువులో, ప్రతి అణువులో భగవత్ సాన్నిధ్యం ఉంది. దాన్ని అభివ్యక్తం చేయడమే మానవకర్తవ్యం.

దానిని సాధించాలంటే తనలోని దైవసాన్నిధ్యాన్ని తెలుసుకొనే చైతన్యవంతులు కావాలి. దీనిని సాధించడానికి కొందరు నిజమైన శిక్షణ పొందాలి. క్రమశిక్షణతో మెలగాలి. అహంకారంతో కూడిన జీవితం కఠినాతికఠినమైనది. ఈ అహంకారసత్వం సమస్తాన్ని మింగివేస్తుంటుంది. ఈ అహంకారంపై పోరాటం సుదీర్ఘమైనది. బహుబాధాకరం. అది మార్పుకు లొంగదు. దీనికి విరుద్ధంగా మరి కొందరు మరింత ఆధ్యాత్మికంగా పురోగమించినందువల్ల, వారి మనస్సు నవనీతంలాంటిదై, ఏ మార్పునకైనా లొంగుతారు. తమ వ్యక్తిత్వం సంగతి మరచిపోయి మరింత విశాలంగా ఆలోచిస్తారు. తమలోని అంతులేని దివ్యత్వంవైపు సులభంగా ఆకర్షితులవుతారు. అయితే వారు కూడా ప్రతి రోజూ క్రమపద్ధతిలో, పరివర్తనకు ప్రయత్నించాలి. అప్పుడు వారిలోని పవిత్రకాంతి మసకబారదు.

అయితే అంతర్గత ప్రగాఢచైతన్యం సిద్ధించినట్లయితే మన జీవనదృక్కోణం ఎంతగా మారిపోతుందో! ఎంత విస్తృతావగాహన కలుగుతుందో! కారుణ్యమెంతగా పెరుగుతుందో!

ఈ విషయమై ఒక ఋషి ఏమన్నాడో చూడండి — నీచాతినీచమైన వ్యక్తిలో సహితం నివసించే దైవాన్ని చూడగల స్థితికి మనలో ప్రతి ఒక్కరు చేరుకోవాలి. అతనిని నిరసించకుండా ''ఓ తేజోమయదైవస్వరూపమా! లే! నీవెప్పుడూ నిర్మల జ్యోతిర్మయుడివే. నీకు జననమరణాలు లేవు. నువ్వు అఖిల శక్తిస్వరూపుడైన దైవానివే. నీ నైజాన్ని అభివ్యక్తం చెయ్యి" అని అతనితో చెప్పాలి.



శ్రీమాత

ఈ మనోహర ప్రవచనాన్ని ఆచరణలో పెడదాం. ఒక అద్భుతం జరిగినట్లు మన చుట్టూ ఉన్న ప్రపంచం రూపాంతరం చెందుతుంది.

నిజమైన, చైతన్య ప్రదీప్తమైన, వివేచనాత్మకమైన ప్రేమ అంటే అదే. ఈ సృష్టి బాహ్యరూపం వెనుక ఏముందో ఆ ప్రేమ చూడగలదు. మాటలతో పనిచేయకుండా సర్వాన్ని అర్థం చేసుకోగలదు. ఎన్ని అవరోధాలు ఎదురైనా అంతరాంతరాలలో ఎప్పుడూ సంభాషిస్తూనే ఉంటుంది.

మన చైతన్యపు టగాథాలనుండి మన వైపుకు వంగిన ఈ మహనీయ, సముదాత్త, దివ్యప్రేమ ముందు మన ఉద్వేగాలు, కోరికలు, వేదనలు, హింసాదౌర్జన్యాలు, మన కన్నీళ్లు, మన పోరాటాలు, మన లోపలి ఉత్తుంగ కల్లోల తరంగాలు — ఏ పాటివి. ఏదో చేతకాని ఊహల కుంచెతో వాటికి మనం ఏవో నాటకీయమైన రంగులు పులుముతుంటాం. ఈ ప్రేమ మన బలహీనతలపట్ల సహనం చూపుతుంది. మన తప్పుల్ని దిద్దుతుంది, మన గాయాలకు అమృతస్పర్శ అందిస్తుంది. పునరుజ్జీవన స్రవంతులలో అది మన చైతన్యాన్ని మంత్రజలాభిషేకం చేయిస్తుంది.

ఈ లోపలి దైవం మన ఇష్టానికి వ్యతిరేకంగా మనపై తనను తాను విధించుకోదు. అది బెదిరించదు. అది మనల్నుండి ఏమీ కోరదు. అది మనకు వరాలు ఇస్తుంది. అది తనకు తాను అర్పించుకొంటుంది. — అందరిలోనూ, అన్ని వస్తువులలోనూ దాగి ఉంటుంది. తనను తాను మరచిపోతుంది. అది ఎప్పుడూ నేరారోపణ చేయదు. ఏనాడు తీర్పు నివ్వదు, శపించదు, ఖండించదు. ఎటువంటి ఆంక్షలు లేకుండా నిరంతరంగా పరిపూర్ణత్వం సాధించిపెడుతుంది. దూషించకుండా సరిదిద్దుతుంది. అసహనం ప్రదర్శించకుండా ప్రోత్సహిస్తుంది. ప్రతి వ్యక్తి అందుకోగల సర్వసంపదలతో సుసంపన్నం చేస్తుంది. ఆమె తల్లి లాంటిది. ఆ ప్రేమ ఫలాన్నిస్తుంది; పోషిస్తుంది; కాపాడుతుంది; కాపాలా ఉంటుంది; సలహా యిస్తుంది; ఓదార్చుతుంది. దానికి అన్నీ అర్థం అవుతాయి కాబట్టి ప్రతిదానినీ సహిస్తుంది, క్షమిస్తుంది. దేనికైనా ఆశ కల్పించి సన్నద్ధం చేస్తుంది. సమస్తాన్ని తనలో ఇముడ్చుకుంటుంది. అందరికీ చెందని దానిని తన సొంతం చేసుకోదు. అందరిని పరిపాలిస్తుంది. అందరికీ సేవకురాలు. ఆమెతో రారాజులు కాగోరేవారు, ఆమెలో

దేవతలుగా విరాజిల్లేవారు అల్పులైనా, అధికులైనా, నియంతలు కాకుండా ఆమె లాగే తన సోదరులందరికీ సేవకులు అవుతారు.

మానవాళి సేవకులుగా వినమ్రపాత్ర వహించడం ఎంత సుమనోజ్ఞం! అందరి లోను వుండే భగవంతుని, సృష్టి సమస్తంలో దీపించే దైవప్రేమను మానవాళికి అందించే కాంతిదూతలు, క్రాంత దార్శనిక సమావిష్కర్తలుగా పాత్ర నిర్వహిం చడం ఎంతటి రమణీయ అదృష్టం!

వారి అడుగుజాడలలో, వారి ఆదర్శపుకాంతి వెల్లువలో మనం నడిచేవరకు, వారిలాగ నిజమైన సేవకులుగా, మారేవరకు మనం ఆ దివ్యప్రేమలో పునీతులమ వుదాం. పునరుజ్జీవం పొందుదాం. పూర్ణపరివర్తనం చెందుదాం. ఆ దివ్యప్రేమ మన నరనరాలలో పరివ్యాప్తమవడానికి అవకాశం ఇద్దాం. ఈ అద్భుత ఉపకర ణాన్ని, ఈ భౌతికదేహాన్ని భగవానునికి అర్పిద్దాం. ఏమాత్రం సంకోచించకుండా, ఏమీ దాచుకోకుండా ఆత్మార్పణ చేసుకొందాం. అప్పుడు జీవితరంగంలో ప్రతి భూమికలో ఈ శరీరం తనలోని యుక్తుల్ని మానవాళికి ధారపోసేందుకు దైవం సన్నిద్ధం చేస్తుంది.

దివ్యప్రయోజనానికి ఆత్మను అంకితం చేసుకొనే ఈ మహత్కార్యానికి ఏ ఉపకరణాలైనా మంచివే. ఏ పద్ధతులైనా విలువైనవే. లక్ష్యాన్ని సాధించాలన్న మన సంకల్పం నెరవేరడంలో మనం సహనంతో ఉండాలి. ఏ విషయాన్ని అధ్యయనం చేసినా, ఏ పనిచేసినా, ఏ వ్యక్తిని కలుసుకున్నా అవన్నీ కూడా మనకు మన ఈ మార్గంలో ఒక సూచనను, ఒక సహాయాన్ని, ఒక మార్గదర్శక కాంతిరేఖను అందచే స్తాయి.

ముగించే ముందు, కొద్దిగా మరికొన్ని పేజీలు జతపరుస్తాను. అవి — నిరర్థ కమైన ప్రయత్నాలు చేసినవారి కోసం, మార్గమధ్యంలో గోతులలో పడినవారి కోసం, తమ బలహీనతలను చూసినవారి కోసం, తమ ఆత్మవిశ్వాసం, ధైర్యం కోల్పోయే వారి కోసం అగ్నిపరీక్ష లెన్నెన్నో, మనుష్యులను ప్రక్షాళణం చేసే ఎన్నో అగ్ని జ్వాలలు చుట్టుముట్టిన ఒక సాధకుడు వ్రాసిన పేజీలు మీకు చదివి వినిపిస్తాను. బాధలుపడేవారి హృదయాలలో ఆశారేఖను అవి పునః ప్రజ్వరిల్లచేస్తాయి.

జీవితంలో నిరాశలో కృంగిపోయి, బాధాసర్పదష్టులైనవారు, పతనమైన వారు, మేము ఓడిపోయాం అనుకునేవారు ఒక స్నేహితుని మాటలు వినండి. మీ

బాధలు అతనికి తెలుసు. వాటిలో తనూ పాలుపంచుకున్నాడు. ఈ లోకం, విధిపెట్టే బాధల్ని అతనూ పొందాడు. నీలాగే ప్రతిరోజూ ఎంతో భారంతో అనేక (కోరికల) ఎడారులు దాటాడు. అతనికి ఆకలి, దాహం, ఏకాంతం, సమాజంచేత పరిత్యజించబడడం — అన్నీ తెలుసు. అన్నింటికన్న బహుక్రూరమైనది — హృదయం ఏకాంతంగా, దిక్కులేక విలవిల్లాడడం అతనికి తెలుసు. అయ్యో! సందేహాలు, తప్పులు, పొరపాట్లు, వైఫల్యాలు, బలహీనతలు అన్నీ తెలుసు.

మరి అతను అంటాడు — ధైర్యం! ప్రతి ఉదయం తూర్పున ప్రభవించే సూర్యుని తొలి ప్రభాతకిరణాలు అందించే పాఠం విను. అది ఆశాపాఠం. ఓదార్పు సందేశం. ఆవేదనలో తరిగి అశ్రువులు రాలుస్తూ, వణకిపోయే నీవు, నీ రుగ్మతలకు అంతేలేదని కుమిలిపోయే నీవు — నీ బాధల్నుండి నిష్కృతి ఇదిగో! చూడు! ఉదయంలేని రాత్రి లేదు. చీకటి దట్టంగా అలుముకున్నవేళ ఉషోదయమవుతుంది. సూర్యరశ్మి కరిగించలేని మంచుతెర లుండవు. సూర్యుడు బంగారుపూత పూయని నల్లమబ్బు ఉండదు. ఏదో ఒక రోజు ఇంకని నీ కన్నీరుండదు. మెరిసే విజయ (ఇంద్ర) ధనుస్సు అనుసరించని తుఫాను లేదు. కరగని హిమసమూహాలు లేవు. తేజోమయవసంతంగా మార్చలేని శీతల ఋతువు ఉండదు.

నీకు వైభవంగా మారని నైరాశ్యం లేదు. ఆనందంగా మారని దుఃఖం లేదు. విజయంగా మారలేని అపజయం లేదు. ఉన్నత ఆరోహణగా మారని పతనం లేదు. జీవన తేజోకేంద్రంగా మారని ఏకాంతం లేదు. సుమధుర సామరస్యస్వరాలుగా మారని అపశ్రుతులు లేవు. ఒక్కొక్కసారి ఇరువురి మనుష్యుల మధ్య ఆపోహ, పరస్పరం సంభాషించుకోవటానికి రెండు హృదయాలపై వత్తిడి తేవచ్చు. శక్తిగా మారని అనంత బలహీనత లేదు. మహోత్కృష్ట శక్తిహీనతలోనే సర్వశక్తిస్వరూపం తనకు తాను సమావిష్కృతమవుతుంది.

విను బిడ్డా! నిరాశలో క్రుగ్గి, కుమిలిపోతూ సర్వాస్వాన్ని కోల్పోయిన నువ్వు ఇంతకు ముందు ఎప్పుడూ కానంత గొప్పవాడివి. లోలోతులలో మేలుకొంటున్న నువ్వు శిఖరాలకు ఎంత చేరువుగా వున్నావో నీకు తెలుసా! అగాధం ఎంత లోతైతే ఔన్నత్యాలు అంతగా ఆవిష్కరించబడుతాయి.

అనంతాలలోని ఉదాత్త మహనీయశక్తులు భౌతికపదార్థంలోని దట్టమైన యవనికలలోనే ఇమిడిపోతాయని నీకు తెలియదా! ఓహో! మసకబారిన కమనీయతలలో

ఏమీ, ఆ సార్వభౌమ ఉదాత్త ప్రేమరాగబంధ వికసనం, సార్వభౌమదీప్తి నీడలో దర్శనీయమయ్యే పరితాపం!

ఏ పొరపాటైనా, ఏ అగ్నిపరీక్షయినా నిన్ను శృంగదీస్తే, ఆవేదనల అగాధంలో నువ్వు కూరుకొనిపోతే అక్కడే, అక్కడే దివ్యప్రేమ, దివ్యాశీస్సులు నిన్ను చేరుకుంటాయి. దుఃఖపడకు. నిన్ను ప్రక్షాళితం చేసే బాధాగ్నిశిఖల నుండి నువ్వు తప్పుకున్నావు. మహోజ్వల అధిరోహణలు నీవే! నీవే!

నువ్వు నిరామయమైన లోయలలో ఉన్నావు. నిశ్శబ్దం చెప్పే రహస్యాలు విను. నిన్ను లోగడ పొగిడే మాటలన్నీ చెవులకు సంతోషం కలిగించి వుంటాయి. కాని నిశ్శబ్దం పలికే దివ్యవాక్కులు నీ ఆత్మకు ఆనందం కల్గిస్తాయి లోలోతులలో ప్రతిధ్వనిని నిదుర లేపుతాయి. దివ్య సరళీస్వరాల మంత్రధ్వానం అది.

గాఢాంధకారపు టగాధాలలో నువ్వు నడుస్తున్నావు. చీకటిలో దాగి ఉన్న అమూల్య నిధుల్ని పోగుచేసుకో. సూర్యకాంతిలో నీ బుద్ధిని వికసింపచేసే మార్గాలు ప్రకాశమానమవుతాయి. కాని చీకటిరాత్రిలోని శ్వేతజ్యోతిస్సీమలలో పరిపూర్ణ మార్గాలు నిక్షిప్తమై ఉన్నాయి. ఆధ్యాత్మిక సంపదలు రహస్యంగా దాగి ఉన్నాయి.

నీవన్ని కోల్పోతావు. అదే, అదే పూర్ణత్వప్రాభవానికి దీప్తిపథం. నీ వద్ద ఏమీ లేనపుడే, నీకు సర్వస్వం ఇవ్వబడుతుంది. చిత్తశుద్ధిగల సత్యవ్రతులకు చెడు పోయి మంచి లభిస్తుంది.

భూమిలో నాటే ప్రతి ఒక్క బీజం నుండి వేలకొలది మొలకలెత్తుతాయి. బాధాగ్ని విహంగం రెక్కల చప్పుడు దివ్యరోచిస్సు విలయవిహారం సుమా!

శత్రుమూక మనిషిని తరిమికొట్టి, అతనిని నశింపచేయడానికి చేసే ప్రతి రక్కసిచర్య అతనిని మహోన్నతునిగా తీర్చిదిద్దుతుంది.

ప్రపంచాల ఆవిర్భావగాథను విను! అటు చూడు. మహావిరోధి గెలిచేటట్లు కనిపిస్తున్నది. తేజోరూపాలను చీకటిలోకి విసిరేశాడు. రాత్రి అంతా నక్షత్రాలతో నిండి పోయింది. ప్రపంచ సామ్రాజ్య పూర్ణవైభవాన్ని దెబ్బతీశాడు. ప్రపంచ సామరస్యాన్ని చిన్నాభిన్నం చేశాడు. విభజించి, విభజించి, ఆ శకలాలను అనంతం నాలుగు దిశల వైపు విసిరేశాడు. ఓహో! ఆ ధూళికణాలన్నీ బంగారు బీజాలుగా మారాయి. అనంతం అంతా పసిడిపంటగా మారింది. అసంఖ్యాక లోకాలతో అది నిండిపోయింది. విశ్వాంతరాళం విశాల కక్ష్యలోని చిరంతన కేంద్రబిందువు చుట్టూ అవి తిరగ

నారంభించాయి. విభజన సైతం మరింత సుసంపన్నమైన, ప్రగాఢమైన ఐక్యతను సృష్టించింది. భౌతిక విశ్వం ఉపరితలాలను పెంచుకుంటూపోవడం వల్ల, దానిని నాశనం చేయడానికి బదులు ఆ విశ్వసామ్రాజ్యాన్ని మరింత విస్తరింపచేయడం జరిగింది.

అనంతత్వపు బడిలో ఈ పురాతన గోళం ఆలపించే దివ్యగానం మధురాతి మధురం. నక్షత్ర సమూహాల విశ్వసంగీతం మరెంత విజయమాధుర్య సంభరితమో! విశ్వాంతరగోళాల లయసమ్మేళనం ఎంత మనోహరమో! అనంత రసధుని ఒక సనాతన విజయసంకీర్తనంగా స్వర్గాలన్నీ ముంచెత్తి పరవశింపచేయడం లేదా!

మళ్ళీ విను — భూమిపై నివసించే మనిషి తన దివ్యమూలం నుండి విడివున్న దానికి మించిన ఉపద్రవం లేదు. అతనికి అతీతంగా దూరాక్రమణ చేసిన శత్రుసామ్రాజ్య సరిహద్దురేఖలు విస్తరించి ఉన్నాయి. అతని దిఙ్మండల కారాగార ద్వారాల చెంత అగ్నిఖడ్గాలతో చీకటిశక్తులు కాపలా కాస్తున్నాయి. జీవన ఆవిర్భావ మూలం లోకి మనిషి ఆరోహించలేడు. కనుక అదే అతనిలో పల్లవించింది. ఉన్నత శిఖరాల నుండి వెలుగుల్ని అతను అందుకోలేడు. కనుక ఆ వెలుగులేవో అతనిలోనే, అంతరాలలోని చైతన్యబిందువు నుండి ప్రభవించాయి. విశ్వాతీత ప్రేమ స్పర్శను అతను పొందలేడు కనుక ఆ ప్రేమ ఆత్మాహుతి చెంది ప్రతి జీవిని, ప్రతి ఆత్మను తన మంత్రధామంగా, తన దేవాలయంగా మార్చుకొంది.

నీచమైనదిగా తృణీకరించబడిన, సారమయమైన ఈ భౌతిక పదార్థం సఫలమైనది. భగవదుద్దీపన పొందినది — ప్రతి అణువులో ఒక దివ్య ఆలోచనా దీప్తి ప్రకాశిస్తోంది. ప్రతి జీవిలో దైవం ఉన్నది. ఈ విశ్వంలో మనిషి అంత బలహీనజీవి మరొకటి లేదు. అంతటి దివ్యమైన జీవీ మరొకటి లేదు!

ఔను, నిజం. వినమ్రతలోనే వినిర్మల ప్రాభవజ్యోతి ఊగాడుతున్నది!

28 ఏప్రిల్ 1912

మూలం శ్రీమాత

అనువాదం: కె. యజ్ఞన్న

(*CWM* Vol. 2, pp. 38-44)

కాంతి కిరణాలు

(పుస్తక అనుబంధం)

నీ సత్త్వములో ఎక్కడైనా ఏ భాగంలోనైనా ఇంకా మానవప్రేమానుభూతి పొందవలసిన ఆవశ్యకత ఏర్పడినప్పుడు దానిని జీవితానుభవంలో పొందటం శ్రేయస్కరం. ఇది యోగానికి (అనుకూలమైన) అత్యుత్తమ సంసిద్ధత.

*

ప్రేమానురాగాలకోసం తృష్ణ (thirst) మనిషికి అవసరం. కాని ఆ దాహం తీరేది అది దైవం వైపుగా మరల్చబడినపుడే. ఎంతసేపూ దానిని మనుష్యుల ద్వారా సంతృప్తిపర్చుకోదలచుకుంటే మాత్రం చివరికి మిగిలేది నిరాశ, నిస్పృహలే!

*

ప్రేమయొక్క హక్కుల గురించే అంతా ఎప్పుడూ మాట్లాడతారు. ప్రేమకి ఆత్మార్పణ ఒక్కటే హక్కు.

*

ఆత్మార్పణ లేక ప్రేమ లేదు. మానవప్రేమలో ఆత్మార్పణ చాలా అరుదు. అది ఎంతసేపూ కోర్కెల స్వార్థపరాయణత్వమే.

ఆగస్టు 15, 1955

*

అహం ఉన్నచోట ప్రేమ అసాధ్యం. ప్రేమ మాత్రమే ప్రేమించగలదు. ప్రేమ మాత్రమే అహాన్ని గెలువకలదు. స్వార్థప్రేమ గొప్ప అవరోధం. దివ్యప్రేమ గొప్ప పరిష్కారం.

*

నీ ఏకాంత అనుభవంలో ప్రేమ అవసరాన్ని గుర్తిస్తావు. నిరపేక్షంగా ప్రేమించటం నేర్చుకో. ప్రేమించడంలోని ఆనందం కోసమే ప్రేమించు. ప్రపంచంలో అత్యద్భుత ఆనందం అది. నీకికి ఎప్పుడూ ఏకాంతమే ఉండదు.

ఏప్రిలు 11, 1966

*

ప్రేమకి సోపానాలు:
ముందు తాను ప్రేమించిబడినాక తను ప్రేమిస్తాడు.

తర్వాత, తనకు తానుగా ప్రేమించడం. కాని అందుకు ప్రతిఫలంగా తను కూడా ప్రేమించబడాలి. చివరిది స్వచ్ఛ, సరళప్రేమ. ప్రేమ ప్రేమ కోసమే.

ఏప్రిల్ 15, 1966

*

ఒక రకమైన ప్రేమలో, మానసికోద్వేగం శీఘ్రగ్రహణశక్తితో వృద్ధిపొందుతూ ఏకీకరణభావాన్ని పెంచుకుంటూ దైవం దిశగా మరల్చబడుతుంది. దైవం నుంచి తాను పొందినదానిని ఏ ప్రతిఫలాపేక్ష లేకుండానే ఇతరులపై కుమ్మరిస్తుంది. ఇది నీకు వశం కావాలి కాని, అయితే మాత్రం నిజంగా ఇది సర్వోన్నతమైన, ఎంతో సంతృప్తిదాయకమైన ప్రేమ.

*

ఒక్కమారు దివ్యప్రేమ లభ్యమైనపుడు, బూటకములైన ఇతర ప్రేమలన్నీ తమ వైకల్యాలను పోగొట్టుకొనగలుగుతాయి. స్వచ్ఛతను సంతరించుకుంటాయి. ఇక అపుడు ప్రేమించేది అంతటా అందరిలోనూ ఉన్న దైవాన్నే.

మే 6, 1967

*

నిజమైన ప్రేమ, దివ్యప్రేమ తన సంతృప్తిని, ఆనందాన్ని తనలోనే పొందుతుంది. మరొకరు స్వీకరించి, పాలుపంచుకుని, ప్రశంసించే అవసరం తనకుండదు. ప్రేమకోసమే ప్రేమిస్తుంది — పూచిన పువ్వులా.

నీలో ఈ రకమైన ప్రేమానుభూతి, చెక్కుచెదరని ఆనందాన్ని నీకు స్వంతం చేస్తుంది.

జూన్ 21, 1971

*

ప్రేమ — లైంగికవాంఛ:
సంభోగం ప్రేమకాదు. ప్రాణిక ఆకర్షణ, పరస్పరం ఇచ్చిపుచ్చుకోవటం ప్రేమ కాదు. అనురక్తి కోసం ఎదలో మెదిలే ఆర్తి ప్రేమ కాదు. ఏకైకుని నుంచి నేరుగా పొందే శక్తివంతమైన పరివేదన ప్రేమ. ఎంతో దృఢమైనవారు, పరిశుద్ధులు మాత్రమే

దానిని స్వీకరించుకోగలిగి అభివ్యక్తీకరించుకోగలరు. సర్వోన్నతుని ప్రభావానికి ఉన్మీలనమై ఉండటమే పరిశుద్ధత, మరి ఇతరమైనదేదీ కాదు.

*

బాగా తిండి తినటంవల్ల లైంగికవాంఛలు రావు. కాక, దురాలోచనవల్ల, అదే ధ్యాసలో ఉంటే వస్తాయి. దానిని గురించి నీ వెంత తక్కువ ఆలోచిస్తే, అంత శ్రేయస్కరం. నీవేమి కాదలచుకోలేదో దానిపై ధ్యాస లేకుండా నీవేమి అవదలచుకున్నావో దాన్ని గురించే ఆలోచించు.

జూన్ 7, 1964

*

లైంగిక సంబంధాలు గతానిని — మానవుడు దైవానికి కాక, పశువునకు సన్నిహితంగా ఉన్నప్పటి నాటివి. జీవితాన్నుంచి నీవేమి ఊహిస్తావో అంతా దానిపైనే ఆధారపడి ఉంటుంది. నీవు చిత్తశుద్ధితో యోగాచేయతలుచుకున్నప్పుడు, నీవు తప్పనిసరిగా లైంగిక కార్యకలాపాలకి దూరంగా ఉండాలి.

మార్చి 23, 1968

*

దైవం కోసం ప్రేమ:

మానవప్రేమ ద్వారా దైవాన్ని ప్రేమించటం నేర్చుకోలేవు. ఎందుకంటే ఈ ప్రేమ స్వభావం పూర్తిగా విశిష్టమైనది. ముందు నిన్ను నీవు దైవానికి సమర్పణ కావించుకోవటం నేర్చుకో. ఆ తర్వాత ప్రేమించటంలో ఆనందం తెలియవస్తుంది. చిత్తశుద్ధితో కూడిన ఆత్మార్పణవల్ల కష్టాలన్నీ వైదొలగుతాయి.

డిశంబరు 28, 1955

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

(సశేషం)

సమాచారపత్రం

సావిత్రి అధ్యయన శిబిరం, సొసైటీ బీచి ఆఫీసు ప్రాంగంణంలో ఫిబ్రవరి 22 నుంచి 28 (2009) వరకు, డా. అలోక్ పాండేగారిచే నిర్వహింపబడింది. ముగింపు సమావేశం మార్చి 1 న, ఆరోవిల్, సావిత్రి భవనంలో జరిగింది.

నోయిడా (ఉత్తరప్రదేష్) శ్రీఅరవిందభవనంలో జనవరి 10, 2009 న ఆచార్య రాజేంద్ర భరత్వాసి (మీరట్టు) గారు ప్రసంగించారు. ఫిబ్రవరి 14 న Sri Hans Dholakia గారు మాట్లాడారు.

బాలియా (ఉత్తరప్రదేష్) కేంద్రంవారు ఫిబ్రవరి 8 న, శ్రీఅరవిందులవారి బోధనలపై Bothia లో ఒక గోష్టి నిర్వహించారు.

గ్వాలియరు (మధ్యప్రదేష్) డా. సురేష్‌చంద్ర శర్మగారు, Jiwaji University, Agriculture University మరియు శ్రీ శారదాసంఘలలో జనవరి 12, 16, 17 తేదీలలో శ్రీమాత బోధనలు ఆధారంగా ప్రసంగించారు.

పాట్నా (బీహార్) కేంద్రంవారు రాష్ట్రస్థాయి కమీటీ సమావేశాన్ని, జనవరి 25 న నిర్వహించారు. తర్వాత సమావేశం Khandwa లో జూలై నెలలో నిర్వహించబడుతుంది అని తెలియచేసారు.

అహ్మదాబాద్ (గుజరాత్) శ్రీఅరవింద సాధనా కేంద్రంలో శ్రీ కైవల్య స్మార్ట్ గారు జనవరి 25, 26 తేదీలలో ప్రసంగించారు.

గమనిక: ఏప్రిల్ 1, 2009 నుంచి వార్షిక సభ్యత్వ రుసుము రు 150/- లకు సవరించబడింది (మేగజైనుతో). ఇంగ్లీషు, హిందీ, గుజరాతీ, మరాఠీ, బెంగాలీ, తమిళం, తెలుగు, కన్నడ భాషలలో — కావాల్సిన భాషలో పత్రిక పొందగలరు.

అఖిల

అఖిల భారత పత్రిక

జూన్ 2009



లక్ష్యము

విషయసూచిక

సత్యము అంతటా నిశ్శబ్దం. ఆ నిశ్శబ్ద హృదయ కుహరంలో వెలుగుతోంది ఆరనిజ్వాల. సమగ్ర దివ్యజ్ఞాన జీవనానికి అది జ్వలిత జ్వాల.

— శ్రీమాత

ఓ జీవాత్మా! హర్షోల్లాసాల కప్పుడే ఇది సమయం కాదు

ఎవరైనా ఆత్మతో ఏకం కావాలని, అది తన జీవితాన్ని శాసించాలని ఆశించి, అవసరమైన అంతరంగ యత్నంతో తన ఆత్మను కనుగొనాలనుకోవటం ఒక అద్భుతమైన అతీత స్థితిని పొందే అనుభవం. కాని దాని ఫలితంగా తరచుగా జరిగేదేమిటంటే, దానిని అందుకున్న తరుణంలో ప్రథమంగా అంతరంగవాణిగా తమకు తాము, "ఇప్పుడు ఇక నాకు కావల్సినది పొందాను, అనంతమైన ఆనందం అందుకున్నాను!" అని చెప్పుకుంటూ, ఏ విధంగానూ ఇక దేనితోనూ సంబంధం లేకుండా ఉండిపోతారు.

వాస్తవానికి ఈ అద్భుతాన్ని కనుగొన్నవారందరిలో చాలామందికి ఇదే జరిగింది. అందులో కొంతమంది ఆ అనుభవాన్ని సూత్రీకరించి, సాక్షాత్కారం పొందే సిద్ధాంతంగా తయారుచేసి ఈ విధంగా చెప్పారు, "అది నీవు అందుకోగలిగిన నాడు, అంతా పూర్తి అయినట్లే, ఇంక చేయవలసినదేమీ లేదు, నీ లక్ష్యాన్ని చేరుకున్నావు, అదే నీకు ఆఖరి మజిలీ."

చెప్పాలంటే, మరింత పురోగమనానికి చాలా ధైర్యం కావాలి; ఆతడు కనుగొన్న ఈ ఆత్మ తప్పకుండా శౌర్యప్రతాపవంతమైన యోధాత్మ. అది తన అంతరంగ ఆనందంతో ఏమాత్రం సంతృప్తి చెందదు, పరితప్త హృదయంతో ఉన్న ఇతరులు కూడా తాను చేసినట్లుగా అదే విధంగా ప్రయత్నించితే ముందూ వెనుకగా ప్రతివారూ ఆ స్థితికి చేరుకుంటారనే భావనతో సమాధానపడి ఉండదు, లేదా, ఇంకాస్త ఉన్నతంగా, ఈ స్థితిలోని అంతరంగ వివేకంతో 'చాలా ఉపకారబుద్ధి'తో, 'అత్యంత జాలిగుండె' తో ఇతరులు దానిని చేరుకునేందుకు సహాయం చేయవచ్చు. అలా ప్రతివారూ దానిని అందుకున్నప్పుడు, బహుశా, అదే ప్రపంచానికి ముగింపు అవుతుంది, బాధలనేవి వద్దు అని అనుకునేవారికి అది చాలా హాయి కలిగించే విషయమే కదా!

అయితే ఇక్కడ ఒక మెలిక ఉంది. పరమేశ్వరుడు తనను తాను సృజించుకున్నప్పుడు, ఆయన ధ్యేయం, ఆయన కోరుకున్నది కచ్చితంగా అదేనని నీవు అనుకుంటున్నావా?

(నిశ్శబ్దం)

దాని పర్యవసానం అదే అయినట్లయితే, ఈ సమస్త సృష్టి, ఈ బ్రహ్మాండమైన విశాల విశ్వం ఒక విధమైన వెగటు పుట్టించే హాస్యప్రక్రియగా కనపడుతుందే కాని మరొకటి కాదు. తప్పించుకుపోవటానికే అయితే అసలు మొదలుపెట్టడం ఎందుకు? ఇంత సంఘర్షణ చేసిన దాని ఉపయోగం ఏమిటి? ఒక విధంగా, కొంతమటుకు బాహ్యంలో దుఃఖదాయకంగానూ, నాటకీయంగానూ కనపడేటటువంటి దానిని సృష్టించింది నీకు కేవలం బయటపడే పాఠం చెప్పడానికే అయితే, అసలు మొదలు పెట్టకపోవడమే మంచిది కదా!

కాని, ఎవరైనా విషయాల లోతులకు పోగలిగితే, తమ అహంకారబుద్ధినే కాక, అహాన్నే తీసిపారవేసినట్లయితే, ఏమాత్రం దాపరికం లేకుండా, వారు తమను తాము, సమస్తాన్ని ఏమీ ఆశించని రీతిలో పూర్తిగా అర్పణ చేసుకోగలిగితే, అప్పుడే వారు ప్రభువు ప్రణాళికను అర్థం చేసుకోగలుగుతారు. అప్పుడు వారికిది వెగటుపుట్టించే హాస్యప్రక్రియ కాదని, పైకి పోయినకొద్దీ కొంతమటుకు ఏటవాలయిపోయే మళ్ళీ మళ్ళీ చుట్టి చుట్టి తిరిగి మొదటికే చేరే వంకరటింకర మార్గం కాదని తెలుస్తుంది. దానికి విరుద్ధంగా, అస్తిత్వంలో ఉండే ఆనందాన్ని, సౌందర్యాన్ని, ఉన్నతిని, దివ్యజీవనంలోని వైభవాన్ని, ఆ ఆనందం, ఆ సౌందర్యం, ఆ ఔన్నత్యపు శాశ్వతమైన వృద్ధిని, శాశ్వతమైన పురోగతిని ఈ సమస్త సృష్టికి తెలియచెప్పడానికేనని తెలుస్తుంది. అప్పుడు ప్రతిదీ ఒక పరమార్థాన్నీ సంతరించుకుంటుంది. అప్పుడు ఇంత సంఘర్షణకు లోనయినదానికి, ఇంత కష్టపడినదానికి ఎవరూ చింతించరు. వారికి లక్ష్యాన్ని సాక్షాత్కరింపచేసుకోవాలనే అత్యుత్సాహం మాత్రం ఉంటుంది. ధ్యేయాన్ని సాక్షాత్కరింపచేసుకోవాలనే, జయం పొందడం తథ్యమనే ధృఢవిశ్వాసంతో వారు అందులో అమాంతం, మరే ఆలోచనే లేకుండా దూకుతారు.

కాని దానిని తెలుసుకోవాలంటే, తప్పనిసరిగా అహంభావం లేకుండా ఉండాలి, తప్పనిసరిగా తనలో తాను వేరే అస్తిత్వమైపోకుండా, పరమోత్తమమైన మూలంతో తెగత్రెంపులు చేసుకోకుండా ఉండాలి. అదే తప్పనిసరిగా చేయవలసినది. తన అహంకారాన్ని వదలుకోవాలి, అప్పుడు వారు సరైన లక్ష్యాన్ని తెలుసుకోగలుగుతారు, ఇది మాత్రమే సరైన పద్ధతి.

పనికిరాని వస్త్రాన్ని వదిలించుకున్నట్లుగా, అహంకారవిసర్జన జరగాలి. ఆ ఫలితం కోసం, ఎన్నో కష్టనష్టాలను తప్పనిసరిగా ప్రయత్నపూర్వకంగా చేసి భరిం

చవచ్చు. అలా చేస్తే, అతడు మార్గంలో ఒంటరి బాటసారి కాడు. విశ్వాసం ఉంటే వారు సహాయం పొందుతారు.

మూలం: శ్రీమాత

అనువాదం: డా. టి. ప్రసన్నకృష్ణ

మన తక్షణ గమ్యం

మానవజీవి యొక్క సాధారణ జీవనం కొంతవరకు అస్థిమితము. కొంత చపలత్వముతో కూడిన అదుపుతప్పిన ఆలోచనలు, అవగాహనలు, అనుభూతులు, భావోద్రేకాలు, కోరికలు, భోగాలు మరియు చాలావరకు సంప్రదాయబద్ధంగా, చర్వితచర్వణంగా కొనసాగే కర్మల సమహారంగా వుంటుంది. వాటి శక్తిగాని, స్వయం అభివృద్ధిని సాధించే సత్తాగాని పాక్షికం మాత్రమే. వీటికంతా వట్టి బూటకపు అహం భావమే కేంద్రంగా ఉంటుంది. ఈ కార్యకలాపాల ఉమ్మడి ఫలితంగా అంతరంగంలో ఒక అభివృద్ధి ఉదయిస్తుంది. అది ఆ జీవితంలో పాక్షికంగా మాత్రమే వ్యక్తమై క్రియారూపం దాల్చి, మరికొంత భాగం భావిజీవితాలలో పురోభివృద్ధికి బీజంగా పరిణమిస్తుంది. ఈ విధంగా జరిగే చైత్యపురుషుడి యెదుగుదల, విస్తరణ, వికసిత మయ్యే ఆత్మవర్చస్సు, మరింత సమతుల్యమైన అంగాంగ అభివృద్ధి అనునవే మానవుని ఉనికిలోగల పరమార్థం మరియు సమగ్ర సారాంశం. అందులకే చింతన, సంకల్పము, భావన, ఆకాంక్ష, కర్మ, అనుభవాలతో ఒక అర్థవంతమైన చైతన్యాభివృద్ధిని పొంది, చివరకు ఒక మహోన్నతమగు దైవికమైన ఆత్మాన్వేషణకు దారితీయుట కొరకే మానసికజీవియగు మానవుడు ఈ భౌతికకాయంలోకి ప్రవేశిస్తాడు. మిగిలినదంతా కేవలం దోహదకారకము, అప్రధానము లేక అనూహ్యము, నిరర్థకమైనవే. మానవప్రకృతి యొక్క పరిణామాన్ని, అభివృద్ధిని లేక అతని అస్తిత్వాన్ని, ఆత్మను అంచెలంచెలుగా ఆవిష్కరించి, వికసింపజేసి దర్శింపజేయుటకు సహాయపడి పరిరక్షించుటయే అవసరమైన అంశము.

మన యోగానికి నిర్దేశింపబడిన లక్ష్యం: మానవుని ఉనికికి ప్రధానమైన ఈ సర్వోన్నత గమ్యాన్ని వేగవంతం చేయుటయే. ప్రకృతి సాధారణ పరిణామ క్రమంలో మందకొడిగా, అస్పష్టంగా జరిగే అభివృద్ధిని ఈ ప్రక్రియ అతిక్రమిస్తుంది. కార

ణం, సాధారణ పరిణామం యొక్క చెప్పుగోదగిన ఫలితం, అసందిగ్ధంగా తెర చాటు అభివృద్ధిగానే ఉంటుంది. ఇందుకు కారణం కొంతమేరకు వాతావరణ ఒత్తిడి, మరికొంత మేరకు మిడిమిడి జ్ఞానం. దీనికి తోడు, ప్రయత్నం ధృఢసంకల్పంతో కూడినదైనా ప్రకాశవంతమైనది కాకపోవుట, ఉన్న అవకాశాలు పూర్తిగా వెలుగులోకి రాకపోవుటయే కాక వాటి వినియోగం కూడ అరకొరగా సాగి పొరపాట్లు, తప్పిదాలు పునరావృతమగుటయే. ఇందులో చాలా భాగం ఆకస్మిక ఘటనల కారణంగానో, పరిస్థితుల ప్రభావం వల్లనో, మార్పులు చేర్పుల వల్లనో జరిగినట్లుగా పైకి కనిపించినా, తెరమరుగున వున్న ఒక నిగూఢ దైవిక జోక్యం ఉంటుంది. యోగంలో ఇట్టి అస్పష్ట వక్రగతిన సాగే పీత నడకకు బదులు, మనలను నిర్ణీత గమ్యానికి ఎంత మేరకైనా తిన్నగా కొనిపోగల శీఘ్రతరమైన, చైతన్యవంతమైన, స్వయంచోదిత పరిణామ ప్రక్రియను అమలుపరుస్తాం.

ఒక విధంగా ఆలోచిస్తే అవధులు లేని అనంతమే అంతిమ గమ్యమేమో నన్నట్లుగా నిరంతర పురోగమనం చెందుతుండే లక్ష్యం గురించిన ప్రస్తావన పొరపాటు గావచ్చు. అయినప్పటికీ, మనం ప్రస్తుతానికి సాధించిన దానికన్నా మిన్నయైన దానిని మరియు మనిషిలోని ఆత్మ ఆకాంక్షించదగిన ఒక విభిన్న లక్ష్యాన్ని మన తక్షణ గమ్యంగా భావించవచ్చు. మనకి లక్ష్యంగా నిర్దేశించుకోవలసినది — a growth into a divine consciousness — దివ్యచేతనలోనికి వికసనం. ఒక ఉన్నతమైన విశాలమైన అస్తిత్వస్థితిలోకి ఆరోహించి, శరీరభాగాలను పరివర్తన చెందించుటకు తిరిగి అవరోహించే అవకాశం యేర్పడుతుంది. ఒక విముక్తి నొందిన ఆత్మగానూ, ఒక పరిపూర్ణత చెందిన శక్తిగాను రూపొందించగల విస్తారమైన ప్రదీప్తచైతన్యం సాధ్యమౌతుంది. ఇది వ్యక్తిని అధిగమించి మరింతగ వ్యాపించగలిగితే, ఒక దివ్య మానవకోటినో, లేదా ఒక వినూత్న ఒక అతిమానసస్థాయి కెదిగిన మహోన్నత మానవజాతిని కూడ యేర్పరచగలదు. ఇలాంటి క్రొత్త జన్మనే మన లక్ష్యం చేసుకోవాలి. ఒక దివ్యచైతన్యం లోకి యెదుగుట, ఆత్మతోపాటు సమగ్రంగా, మన ప్రకృతిలోని అన్ని విభాగాలు దివ్యత్వంగా మారుటయే ఈ యోగలక్ష్యం.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

గమ్యము

సృష్టి అంటే ఏమిటి?

ఏ శక్తి ఒక ఉనికిగా (Existence) ఏర్పడి నడిపిస్తూ, సృష్టిస్తూ పనిచేస్తూందో దాని చైత్యపురుషుని నిర్మలానందం వల్లనే మనం ఏర్పడుతున్నాము. అదే మన చేతలకు, మనోభావాలకు, చిత్తవృత్తులకు ఆధారభూతము; మన చర్యలకు, మన అనురూపతకు, మన సృజనాత్మకతకు కారణము, అర్థము, గమ్యము.

ఒక కవి, చిత్రకారుడు, గాయకుడు సృజనాత్మకంగా పనిచేస్తున్నారంటే అక్కడ కొత్తగా తయారుచేస్తున్నది ఏమీ లేదు, తమలో అవ్యక్తంగా దాగి ఉన్న శక్యతకు వికాసం కల్పించి ఒక వ్యక్తరూపాన్ని ఇస్తున్నారన్నమాట. అదే విధంగా ఒక తాత్త్వికుడు, రాజనీతిజ్ఞుడు, యంత్రకారుడు (mechanic) తమలో దాగి ఉన్న సమర్థతకే ఒక ఆకృతినిస్తారు. ఈ విధంగా వారిలో ఉన్నది బహిర్గతమై ఆకృతి పొందినప్పటికీ వారు మాత్రం వారుగనే ఉంటారు. ఈ ప్రపంచమూ, దానికి ఆధారమైన శాశ్వత మూలతత్వమూ (the Eternal) కూడా ఇంతే.

సృష్టి, లేదా ఉత్పన్నత కూడా ఈ ప్రకారంగా ఏర్పడిన స్వయం అభివ్యక్తతే, బీజములో నుంచి అందులో అంతకు పూర్వం ఉన్నదే ఉత్పన్నమవుతుంది; అందులో ఉంటూ, ఆకృతి కావాలని సంకల్పించుకొని సంభవనీయతలోని ఆనందం కోసం ఏర్పాటు చేసుకుంది.

మూల బీజద్రవ్యంలో తన నుంచి ఉత్పన్నమయే జీవికి సంబంధించిందంతా ఉంచుకుంటుంది. ఆ విధంగా భారంతో, స్వీయజ్ఞానం కలిగిన రహస్యశక్తి తన ఆకృతిని ఆవిష్కరించడం కోసం ఓపలోని తపనతో కష్టపడి ఆ బాధ్యత నిర్వర్తిస్తుంది.

మానవుడు మాత్రం తనలోని దాన్ని బాహ్యంగా సృజించినప్పుడు తనకూ, తనలో పనిచేసే శక్తికీ, తను పనిచేసే పదార్థానికీ భేదం ఆపాదిస్తాడు. వాస్తవానికి ఆ శక్తీ తనే, ఆ శక్తి వాడిన వ్యక్తిగతమైన చైతన్యమూ తనే, అది వాడిన పదార్థమూ తనే, ఆ పర్యవసానరూపమూ తనే.

ఇంకో రకంగా చెప్పాలంటే ఒకే అస్తిత్వము, ఒకే శక్తి, ఒకే ఆనందం అనేక అంశాలపై కేంద్రీకృతం అయి ఉంటూ "ఇదే నేను" అనుకుంటూ వివిధమైన స్వీయ

ఆకృతుల కోసం అనేక రకాలుగా పనిచేస్తుంది.

అది ఏమి కావాలని కోరుతుంది?

అది తయారు చేస్తున్నది తననే, తనను తప్ప దేనినీ కాదు. అదొక రూపక ముగా, ఒక లయగా తన అస్తిత్వం కోసం సాగుతుంది. అదే చైతన్యశక్తి, అస్తి త్వంలో ఆనందము.

ఈ విధంగా ప్రపంచంలోకి వచ్చిన ప్రతిదీ కోరేది ఇదే. ఒక ఉనికి, అనుకున్న ఆకృతి పొందటం, అందులోనే అభివృద్ధి కావడం, వికాసం పొందడం, పాదుకొలు పుకోవడం, పెంపొందడం, చైతన్యాన్ని నిరవధికంగా సాధించి దానిలోని శక్తిని స్వాధీనం చేసుకోవడం, అక్కడ స్థావరం ఏర్పరుచుకోవడంలోని ఆనందం పొందడం, అను కున్న ఆకృతిలో ఆనందం, చైతన్యపు లయలోని ఆనందం; ఇంకా శక్తిచాలనలో ఆనందం, ఆ పరచైత్యశక్తి, పరతత్వం, తన అంతరాంతరాల్లోని పరమానందం ఏ అభిప్రాయంతో సూచించినా, అది ఏ దిశలోనైనా, ఏ విధంగానైనా దాన్ని అతిశ యింపచేసి ఛిత్ శక్తి ఆనందాలను పరిపూర్ణం చేయడమే అది కోరుతుంది.

గమ్యం ఏమిటి?

ఒక లక్ష్యమనేది ఉంటే దాన్ని పరిపూర్తి చేయడానికుండే అవకాశాలను బట్టి దాన్ని నెరవేర్చడమే గమ్యము, — ఒక వ్యక్తిలో అయితే ఆ వ్యక్తి మొత్తం అతని భాగాలన్నిటిలో పరిపూర్ణత — తన స్వయంభువత్వం, తన శక్తీ, చైతన్యమూ, తన ఆత్మానందమూ.

అయితే తన వ్యక్తిగత పరిధిలో అతని చైతన్యం కేంద్రీకృతంగా ఉన్నంతవ రకూ ఈ పరిపూర్ణత్వం సాధ్యం కాదు. పరిమితత్వంలో అప్రమేయ పరిపూర్ణత సాధ్యం కాదు. దానిక్కారణం పరిచ్ఛిన్నతలోని స్వకీయభావనకి అప్రమేయ మనేది తెలియనిదే అవుతుంది.

కాబట్టి ఒక వ్యక్తికి చేరవలసిన గమ్యం ఏదైనా ఉంటే అది నిరవధిక చైతన్యం తనలో వెలువరించుకొనుటయే. ఆత్మవిజ్ఞానం, ఆత్మసాక్షాత్కారం ద్వారా సత్య స్వరూపాన్ని తనలో దర్శించుకున్నప్పుడు అపరిచ్ఛిన్న చైతన్యాన్ని తెలుసుకో గలడు.

ఇంకా జీవంగా, చైతన్యంగా, ఆనందంగా ఉండే ఆ పరమాత్మేననీ, పరిమితం అనేది ఒక ముసుగు అని, ఆ పరమసత్యం వివిధ రకాల వ్యక్తీకరణ కోసం వాడే సాధనం మాత్రమేనని తెలుస్తుంది.

విశ్వప్రహేళిక

ఈ విధంగా ఆనంత రోదసిలోనూ, అనంతకాలంలోనూ విస్తరించి ఉన్న ఆ సచ్చిదానందుని కేళీవిలాసాన్ని బట్టి చూస్తే పదార్థసాంద్రతలోనూ, దాని అసంఖ్యాక విభజనలోనూ చైతన్యం దిగి విలీనమైనట్లు తెలుస్తుంది. లేనట్లయితే ఇంతటి నిరవధిక వైవిధ్యం కనిపించదు. తరువాత స్వీయబంధితమై ఉన్న ఒక శక్తి సజీవ ఆకృతిగా, ఒక ఆలోచనా జీవిగా ఆవిర్భవించడం, చివరికి ఆ జీవి విముక్తి పొంది తనను తాను తెలుసుకోవడం: తాను విశ్వకేళిలో ఉన్న ఆ అప్రమేయవరదుని స్వరూపమనీ విడుదలైన తాను తిరిగి అవధుల్లేని ఆ సచ్చిదానందస్థితిని చేరుకోవడమేననీ. అది గోప్యంగా, వాస్తవంగా, శాశ్వతంగా ఉండే స్థితి. ఇదే త్రిగతిత్రయము (the triple movement) ప్రపంచమనే చిక్కుముడికి పరిష్కారం.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: ఎ. ప్రభావతి: ఎ. వెంకటరామ శాస్త్రి)

మనం చేరాలనుకున్న లక్ష్యానికి సూత్రం

దివ్యమైన శరీరంతో దివ్యజీవనము.

శ్రీఅరవిందులు

అంతిమ గమ్యం అనే భావన ఎండమావియే

(శ్రీఅరవిందుల 'ఈశ' ఉపనిషత్తు – విశ్లేషణ నుండి)

1) బ్రహ్మముయే గమ్యం. అదియే ఆరంభము, అంత్యము, ఇంకా సర్వచలితచాలనాలకు ఫలితాలకు అదే కార్యకారణసంబంధం కాబట్టి.

2) అయితే ప్రకృతి చలనంలో అంతిమ గమ్యమనే భావన, ఒక భ్రమ మాత్రమే. ఎందుకంటే బ్రహ్మము అనంతము, నిరపేక్షము. దైవము, దేవతలు..., సర్వభూతములు దాని చేరుకునేందుకు శ్రమపడి సాధించిన ప్రతిగమ్యంలోను – ఆ బ్రహ్మము ఇంకా ముందుకు సాగిపోతూన్నట్లు సుదూరంలో ఇంకా, సాధింపబడవలసినదిగానే ఉన్నట్లు, కనుగొన్నారు. ఈ విశ్వంలో మన సాపేక్ష చైతన్యానికి కనిపించేదేదీ కూడా, 'తత్', పరిపూర్ణం కాలేదు. అదంతా, ఆ తెలియబడని దానికి (పరబ్రహ్మానికి) సంకేతం మాత్రమే.

3) సర్వమూ, పరబ్రహ్మము చేత ముందుగా సాధింపబడే ఉన్నాయి. ఇతరులలో... సర్వభూతములలో కలిగే చలితచాలనాలన్నీ, దివ్యప్రకృతి కారణంగా, దేశకాలాలలో కార్యకారణ సంబంధంచేత బ్రహ్మము యొక్క స్వాయత్తములోనే ఉంటూ ప్రవర్తింపబడుతూన్నవే.

4) తన "విశ్వసత్త" లో, "బ్రహ్మము" దివ్యచలనమును అధిగమిస్తుంది. కాలాన్నీ అధిగమిస్తూ, భూత, భవిష్యద్వర్తమానాలను, ఏకకాలంలో, తనలోనే నిక్షిప్తం కావించుకుని ఉంటుంది. మన మనుకునే కాలాన్ని అది అధిగమించిపోదు. జీవి, జీవించి ఉండే – దేశకాలాలను అధిగమిస్తుంది. రూపము లన్నిటినీ తనలోనే ఇముడ్చుకుని ఉంటుంది – కాకతాళీయంగా, కార్యకారణసంబంధ లేకుండానే. అది (బ్రహ్మము) మనం ఊహించే అఖండ వ్యాప్తంగా ఉన్న స్థలాన్ని దాటిపోదు. అదే విధంగా ఈ బ్రహ్మము, కార్యకారణ సంబంధాని కతీతంగా, అన్ని సంఘటనల కారణాలను, స్థితిని, అంతర్నిహితశక్తులను, సంభావ్యతలను, స్వేచ్ఛగా తనయందే నిక్షిప్తం చేసుకుని ఉంటుంది. కార్యకారణబంధాలచే బంధింపబడదు. ఆ బంధాలన్నీ ఈ విశ్వంలోనే. జగత్తులో వేర్వేరుగా ఉండే వ్యక్తుల, వ్యక్తిత్వాలవల్ల సాధింపబడక పూర్వమే, సర్వభూతభవోద్భవుడైన బ్రహ్మమందు సాధింపబడే ఉంటాయి.

5) అయితే ఈ కదలికలలో 'దాని' (బ్రహ్మము) యొక్క ఉద్దేశమేమై ఉంటుంది?

విశ్వజీవితంలో ఆ బ్రహ్మమే — చైతన్య సత్వమూర్తులుగా రూపొంది, వీటి ద్వారా ఒక లయ, సామరస్యము సిద్ధింపచేస్తుంది. ఇది అవ్యక్తుడైనవానికి, సంకేతంగా వ్యక్తీకరించే సూత్రం. అవ్యక్తుడు, శతసహస్ర మూర్తులుగా వ్యక్తమయే సూత్రం ఇది. అంతరంగ దివ్య అస్తిత్వము, క్రమేపీ తనకు తాను పెంపొందుతూండటానికే, ప్రపంచ పురోగమనదిశగా స్వయం వికసనమే భావన, ప్రయోజనము ఉత్పన్నం కాబడింది. అనేకత్వం నుంచి వాస్తవికమైన ఏకత్వము ఆవిష్కృతమవుతుంది. మన చేతనలో అనేకత్వపు విలువలు పూర్తిగా మారిపోతవి. ఇదంతా ఒక దివ్యచైతన్యక్రీడ.

6) ఈ స్వయం వికసనం విశ్వకార్యకలాపాలు నడిపే సంక్లిష్ట చైతన్యం యొక్క షరతులకు లోబడి ఉంటుంది.

7) ఎందుచేతనంటే చైతన్యం, సరళము లేదా సమజాతీయము కాదు. బహుముఖమైనది. ఇది ఏడు రూపాలు, ఏడు చైతన్యస్థాయిలుగా, దివ్యసత్వము నుండి భౌతికసత్వము వరకు వ్యవస్థీకృతమైనది. వీటి అన్యోన్య క్రీడాకలాపాలే ప్రపంచాలను సృష్టిస్తుంది. సర్వచలిత చాలనాలను నిర్ణయిస్తుంది. రూపుదిద్దుకోవలసినవన్నీ ఈ క్రీడాకలాపాల రూపకల్పనలే.

అధస్సూచి: 1. 'దేవతలు' — బ్రహ్మమునకు ప్రతినిధులుగా, వైశ్వానిక వ్యక్తిత్వాలలో వ్యక్తమయే ఒకే దైవము — దివ్యప్రకృతి నిబంధనలకు లోబడిన క్రీడల్లో వ్యక్తము కాబడేవారు.

2) 'ఇతరులు' అంటే, 'సర్వానిభూతాని', వేరే శ్లోకంలో పేర్కొనబడినవారు. బ్రహ్మము తనకు తాను వేర్వేరు చైతన్యాలలో, వేర్వేరుగా తెలియపర్చుకున్న అనేకులు.

3) వైష్ణవులు తాము వ్యక్తిరూపంలో కొలిచే దైవలీలలకు ప్రతిరూపం ఈ 'ఈ క్రీడ' కాని ఇది క్రియాశీల, రూపరహిత బ్రహ్మనికి కూడా సమానంగా వర్తిస్తుంది.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: యస్. వై. సోమయాజులు

ఇహలోక అస్తిత్వమునకు మూల ప్రేరణ

"పదార్థంలో స్వయంమూర్తిమత్వం యొక్క స్థిరమైన పురోగతిలో అంతరజీవాత్మ వెల్లడి అయేవరకు వొక ఆధ్యాత్మిక వికాసం, వొక చైతన్యవికాసం ప్రధాన అంశంగా వుంటుంది. భౌతిక అస్థిత్వానికిది ప్రధాన ప్రేరణ. ఆ రూపం వెల్లడి చేయగలిగే వరకు యీ ప్రక్రియ యిలా జరుగుతూనే వుంటుంది. ఈ ఇహలోక అస్తిత్వం యొక్క ప్రాధాన్యత ముందు అంతరాత్మ ముకుళనంలో గుప్తంగా ఉంటుంది. ఇదే దివ్య అస్తిత్వం, (the Divine Reality). అది దట్టమైన భౌతికమాయ, అజ్ఞానపు ముసుగులో దాగి వుంటుంది. అయినప్పటికీ విశ్వచైతన్యశక్తి (చిత్ శక్తి) దానిలో ప్రవర్తిస్తూనే వుంటుంది. అందుచేతనే భౌతిక ప్రపంచంలో ఆ విశ్వచైతన్యశక్తి తీవ్రత యేదైతే వుందో, అదే ఆ ప్రప్రథమ రూపమైన దివ్యశక్తితీవ్రత సృష్టి బాధ్యత వహిస్తుంది. భౌతిక ప్రపంచంలో యిది తనకు తానే ఆత్మనిగ్రహంలేని లాలసత్వ స్వభావంతో కనిపిస్తుంది. కాని మహత్తరమైన గుప్తప్రజ్ఞతో పనిచేస్తూ వుంటుంది.

— శ్రీఅరవిందులు (*The Life Divine*, p. 824)

మొట్టమొదట అర్థం చేసుకోవలసినది క్లుప్తంగా యీ మొదటి వాక్యం ప్రవచిస్తున్న వాస్తవం, అస్తిత్వానికి హేతువు — అదే సార్వత్రిక అస్తిత్వం యొక్క మూలసూత్రం. ఇంకా ఆయన 'మూలప్రేరణ' అన్నారు. అదేమిటంటే యిహలోక అస్తిత్వం యొక్క ప్రయోజనం. ఆ ప్రయోజనం ఏమంటే పదార్థకేంద్రంలో దాగివున్న జీవాత్మ యొక్క సంపూర్ణ అభివ్యక్తిని చివరికి వ్యక్తపరచడం. దాని కోసం పదార్థాన్ని తనలో తాను బాహ్యంగా, అంతరంగ అభివృద్ధి వైపు పని చేయిస్తూ జీవాత్మ విముక్తి సాధన....

కాబట్టి నీ కంటికి కనిపించేవి బాహ్యదృశ్యాలు. మొట్టమొదట రాళ్ళూరప్పలతో నిండిన ధాతుప్రపంచం. భూమి, ఖనిజాలు యివన్నీ బాహ్యంగా మనకి నిశ్చైతన్య జడపదార్థాలుగా గోచరిస్తాయి. కాని యీ నిశ్చైతన్య జడపదార్థం వెనుక జీవాత్మ యొక్క జీవం వుంది. చైతన్యం పూర్తిగా గాఢనిద్రలో వున్నట్లు గుప్తంగా వుంటుంది. అయితే అది కేవలం బాహ్యరూపం మాత్రమే. ఈ పదార్థ పరిణామం కోసం లోలోపల అది అన్ని వైపుల నించీ క్రమక్రమంగా నిర్విరామంగా పనిచేస్తూ

వుంటుంది. కాని పైకి చూడ్డానికి అచేతనంగా కనిపిస్తుంది. దాని వలన ఆ వ్యవస్థ చైతన్య అభివ్యక్తికి అధికాధికంగా తన వంతు కృషి తను చేస్తున్నదని తెలుస్తున్న ది. ప్రప్రథమంలో యీ లోలోపల పనిచేస్తున్న పదార్థపు ముసుగు అంతా వొక్క లాగే కనిపించేటట్టు వుంటుంది. అజ్ఞానపు స్థూలదృష్టికి అది యేదో జీవమూ, చైతన్యమూ లేనిదిగా తోస్తుంది. ఒక రాయిని తీసుకొని సాధారణ చైతన్యదృష్టితో చూశావను కో. దానికి జీవమూ లేదు, చైతన్యమూ లేదని తేలిగ్గా చెప్పేస్తావు. కాని యే వస్తు వూకైనా బాహ్యంగా కనబడే స్థితికాక దానికి యింకా వెనక యేముందో లోతుగా పరిశీలించగలిగినవారికి పదార్థకేంద్రంలో దాగివున్న జీవాత్మ సర్వోన్నత దివ్య వాస్తవం దర్శనమిస్తుంది. పదార్థంలో గల ప్రతి అణువు కేంద్రంలోను ప్రవర్తిస్తూ ఈ ఆత్మ వుంటుంది అని శ్రీఅరవిందులు చెప్పారు. అంతరంగపు అంతరాంతరపు లోతుల్లో దాగి పనిచేస్తున్న సర్వోన్నత దివ్య సత్యం అదే. అక్కడే దాగి వుంటుం ది. క్రమక్రమంగా సర్వసమృద్ధి ద్వారా యీ అనిర్వచనీయ అంతశ్చైతన్య పదార్థం యేదో అది మన భావాని కందడానికి వీలైనంతగా లోపలి జీవాత్మని బహిర్గతం చేయగలుగుతుంది. ఈ జీవచరిత్ర పురోగతి జడపదార్థంలో అంతర్నిహిత జీవాత్మ ఆవిష్కృతమయే పరిణామక్రియగా, సహస్రాబ్దికాలాలుగా కొనసాగుతుంది. రాయి నుంచి మొదలై అక్కడ హఠాత్తుగా దర్శనమిచ్చిన అసంపూర్ణజీవస్థితి, దాని తరు వాత వరుసగా జాతుల వర్గీకరణ ద్వారా వచ్చిన ఒక రకపు వ్యవస్థ, తరువాత జీవం వెలువడిన సజీవపదార్థం వస్తాయి. కాని, ధాతు, వృక్ష ప్రపంచాల మధ్య సంధి మూలకాలు వున్నాయి. అవి ధాతువుకుగాని, వృక్షాలకుగాని చెందినవని స్పష్టంగా చెప్పలేనివి. ఇవి యెవరైనా వివరంగా పరిశీలించినట్టయితే కొన్ని నూతన వర్గాలని అవి పూర్తిగా దీనికిగాని, పూర్తిగా దానికిగాని చెందినవని స్పష్టంగా చెప్ప లేనివి. అదిగో అప్పుడు వచ్చింది వృక్షప్రపంచం. అందులో జీవం స్పష్టంగా బయటకు కానవచ్చింది. పెరుగుదల, పరిణామం సృష్టిలోకి వచ్చింది. ఒక మొక్క విత్తనం నుంచి మొలకెత్తుతుంది, అభివృద్ధి చెందుతుంది, పెరుగుతుంది. సృష్టి లో మొదటి అద్భుతం జీవంలో వచ్చింది. అదే సమయంలో పదార్థం విధ్వంసం, శిథిలం కావడం, కుళ్ళడం అనే అద్భుతం కూడా పుట్టింది. సాపేక్షంగా చూస్తే ఇది రాతిలో కంటె వేగంగా జరుగుతున్నది. రాతిని దాని చుట్టూ వున్న వాతావర ణశక్తుల ప్రభావం నించి కాపాడితే నిరవధికంగా యథాస్థితిలో వుంటుంది. అదే

మొక్కయితే దాని కనుగుణమైన పరిస్థితుల్లోనైనా, పరిమితుల్లోనే జీవిస్తుంది. మొల కెత్తడం, యెదగడం, క్షీణించడం, నశించడం, కుళ్ళడం లాంటి దశలు వుంటాయి. కాని యిదంతా అత్యంత పరిమిత చైతన్యంతో జరుగుతుంది. వృక్షజాతిని గూర్చి వివరంగా పరిశోధించినవారికి వాటిలో వుండే చైతన్యం గురించి మంచి అవగాహన వుంటుంది. ఉదాహరణకి మొక్కలు జీవించాలంటే సూర్యరశ్మి కావాలి. సౌర శక్తి ప్రభావంతోనే మొక్కలు యెదుగుతాయి. అందుకే సూర్యరశ్మి సోకని చోట ఒక మొక్క వుంచావనుకో. సూర్యకాంతి అందేవరకు అది అలా పై పైకి యెదుగుతూ పోతుంది. ఉదాహరణకి మనిషి ప్రవేశించలేని వొక చిట్టడవిలో యీ రకమైన జీవనపోరాటం అన్ని మొక్కల మధ్య వుంటుంది. అవి దట్టంగా వుండడం వలన కొంత యెదిగేవరకు సూర్యరశ్మి సోకదు. అందుచేత అవి సూర్యకాంతి అందేవరకు తిన్నగా పైకి యెదుగుతాయి. రకరకాల ప్రయత్నాలు చేస్తాయి. ఇది చాలా ఆసక్తికరంగా వుంటుంది. చుట్టూ గోడలుండి సూర్యరశ్మి చొరబడని స్థలంలో వొక మొక్క కుండీ వుంచేవనుకో. అది సాధారణంగా యింత యెత్తు (చేతితో చూపిస్తూ) వున్నదయితే వెలుతురు కోసం ప్రయత్నిస్తూ ఆ కాంతి లభించేవరకు యెంత పొడవు యెదగాలో అంతగా యెదిగి పొడవుగా అయిపోతుంది. అంటే అక్కడ చైతన్యం వుంది. బ్రతకాలనే యిచ్ఛ బలంగా వ్యక్తమయింది. కొద్ది కొద్దిగా వర్గీకరణలతో అవన్నీ చాలా చాలా అభివృద్ధి చెందాయి. అప్పుడు మళ్ళీ మరొక మధ్యంతర వ్యవస్థ. అది పూర్తిగా వృక్షసంబంధమైనదీ కాదు, అప్పటికింకా పుట్టని జంతుసంబంధమైనదీ కాని జీవసంతతి. అలాంటి జాతులు చాలా వున్నాయి. అవి కూడా చాలా ఆసక్తికరమయినవి. మాంసాహార మొక్కలు, నోరు తెరచుకొని వుండి ఆ నోటి దగ్గరకి యేదైనా కీటకం వచ్చి అందులోకి ప్రవేశించగానే టక్కున నోరు మూసుకొని ఆ కీటకాన్ని భక్షించే మొక్కలు. అది యే విధంగాను మొక్క కాదు. అలాగని జంతువు కూడా కాదు. అలాంటి జాతులు చాలా వున్నాయి.

తరువాత జంతుప్రపంచం ఆవిర్భవించింది. మొట్టమొదటి జంతుసంతతిని మొక్కలకంటె భిన్నంగా గుర్తించడానికి చాలా కష్టమయింది. వాటిలో చాలావరకు చైతన్యం వుండేది కాదు. కాని జంతుజాతు లన్నిటినీ పరిశీలించి చూస్తే ఇంకా ఉన్నతతరమైన జంతువులలో నిజంగా గొప్ప చైతన్యం గుర్తించగలవు. వాటిది సంపూర్ణ స్వేచ్ఛా స్వభావం. యథేచ్ఛగా సంచరిస్తాయి. ఏనుగులాగ అద్భుత

మైన తెలివితేటలు కలిగివుంటాయి. ఏనుగుల తెలివితేటల గురించిన కథలన్నీ మీకు తెలిసేవుంటాయి. ఇవన్నీ మేథస్సు అభివృద్ధిని చాలా స్పష్టంగా తెలియజే స్తున్నాయి. ఈ రకమైన అభివృద్ధి, పురోగతి ద్వారా హఠాత్తుగా మనకి మరొక జాతి జాడలు తారసపడ్డాయి. ఆ జాతి ప్రస్తుతం లేదు. అవి కాలాంతరంలో కనుమరుగయిపోయి వుండొచ్చు. అది కోతిలాగే వుంటుంది, కాని కోతి కాదు. అది రెండు కాళ్ళ మీద నిలబడి నడుస్తుంది. అక్కడ నించే మానవజాతి ఆవి ర్భావం జరిగింది. బహుశా ఆ కోతి లాంటి ప్రాణి జంతువుకి మనిషికి మధ్యస్థజీవి కావచ్చు. మానవ వికాసానికి అదే మొత్తం ప్రారంభం అని చెప్పలేము. ఎందు కంటే మేథోవికాసం అంతకు ముందే అంటే అప్పటికే వున్నది. మనిషి మాత్రమే అద్భుత ప్రజ్ఞావంతుడు అని చెప్పలేము. పర్యావరణానికి ప్రకృతిశక్తులకు లోబడ కుండా స్వతంత్రంగా ఆలోచించి ప్రతిక్రియ జరపడానికి ఆరంభం అదే. అందుచేత మనిషిలో మొదటి నించీ వచ్చిన విధానమంతా యిమిడి వుంది. ఆధ్యాత్మిక జీవి తానికి సామర్థ్యం పొందిన వున్నతజీవిగా రూపొందడం వరకు వుంటుంది.

ఈ పేజీలో శ్రీఅరవిందులు చెప్పినదాని సారాంశమంతా అదే. ఇప్పుడు మీరేదైనా ప్రశ్న అడగాలనుకుంటున్నారా?

ప్రశ్న: ప్రియమాతా! ఇక్కడ ఆయనంటారు ఈ చైతన్యం, ప్రజ్ఞ యొక్క పరాకా ష్ఠకి చేరుకున్నది. మనిషిలో అది యింకా అపరిమిత స్థాయి అందుకున్నది కదా!

అవును. అదే నేనిప్పుడు మీకు చెప్పింది. మనిషిలో తన అత్యున్నత దశని ప్రకృతి నించి పూర్తిగా స్వతంత్రుడు కావడం మొదలవుతుంది. 'పూర్తిగా' అన్నది అతిశయోక్తి. అతడు మొత్తం మీద స్వతంత్రుడు కాగలడు. వ్యక్తి తనలోగల ఆధ్యా త్మిక చైతన్యాన్ని గుర్తించాడు. నేరుగా మూలశక్తి అయిన దివ్యత్వంతో సంబంధం పెట్టుకున్నాడు. అది యదార్థంగా ప్రకృతిశక్తుల నించి స్వతంత్రుడు కావడం. (ఇంతలో వర్షం వచ్చింది.) ఓహో! ఇది మన బుర్రలు చల్లబడడానికి వచ్చింది. (నవ్వు).

దానినే తనను తాను అధిగమించడం అని ఆయన అంటారు. అదే అంత ర్యంలో వుండే అంతరంగ జీవి లేదా అంతరంగ దివ్యచైతన్యం, సర్వోన్నత ఆధ్యా త్మిక సత్యం తనలో అభివృద్ధికి చేసే యత్నం. చైతన్యమంటే అర్థం తనని తాను ఆవిష్కరించుకొనే సమర్థతని సాధించడం. మొత్తం పద్ధతంతా అనుసరించడం

ద్వారా లేక సులభంగా నేరుగా దైవంతో సంబంధం పెట్టుకోవడం.

మూలం: శ్రీమాత

భావానువాదం: నడిమింటి విజయలక్ష్మి

అనంతకాలంలో ఏం జరుగుతున్నది!

ఓ ప్రభూ!

నీ శాశనంలోని శోభాప్రభలను అద్భుతమైన మీ మహిమను గురించి, వర్ణిం చేందుకు మాటలు చాలవు. పరిపూర్ణమైన మీ చేతన గురించి, అనంతమైన మీ ప్రేమానందముల గురించి, వర్ణించేందుకు ఏ మాటలు సరిపోతాయి!

అనిర్వచనీయమైన నీ శాంతిని ఏ మాటలతో గానం చేయగలం. శక్తిశాలి యైన నీ మహాసత్యం గురించి అంతకన్నా శక్తిసమన్వితమైన నీ మహాప్రశాంతి గురించి, ఏ మాటలలో కీర్తించగలం! నీ నుండి ఆవిష్కృతమైన నీ మహావిశ్వం, నీ శోభనూ అద్భుతమైన ఈ అనంతకాలం మీ మహిమను, అంతకంతకు మరింత బాగా చెప్పేందుకు, అనంతంగా ప్రయత్నిస్తూనే ఉన్నాయి.

*

ప్రశ్న: సృష్టికి ఒక నిర్దిష్టమైన లక్ష్యం అంటూ ఏదైనా ఉందా? ఈ ప్రస్థానానికి ఏదైనా చరమాంకం అంటూ ఉందా?

లేదు. ఈ విశ్వానికి తనదైన ప్రస్థానం అనేది అనంతంగా వికసించడమనేదే. అంతే తప్ప, నీవు ఇదే లక్ష్యమని నిర్ధారణ చేయలేవు. అయితే, ఈ ప్రయాణంలో ఇదొక దశ అనవచ్చు అంతే. అదొక నిరంతర అనంతమైన ప్రవాహం. అంతేకాని దీని లక్ష్యం ఇది అనిగాని చెప్పలేము. మనకంటూ, ఒక లక్ష్యమనేది కావాలి. గను క, ఏదో ఒకదానికి నిర్ణయించుకుంటాం. ఒక చిత్రం రచించడం కోసం, మనకు ఒక ప్రణాళిక, ఒక ఊహ, ఒక రంగు ఉండాలి కదా! అందుకు ఒక పరిమితి కూడా పెట్టు కుంటాం. ఒక స్థిరమైన చట్రం కూడా ఉంటుంది. అయితే ఆ పరిమితి అనేది ఒక ఊహ. ఆ చట్రం అనేది ఒక హద్దు. ఆ చిత్రం, మనం పెట్టుకున్న చట్రం, రంగు ఇవన్నీ ఊహాతీతమైన నిరంతరం మారుతూ ఉండే, ఒక కొనసాగింపు. అదే పరిస్థి

తులలో ఈ చిత్రాలను తుదిలేని చక్రాల వరుసక్రమానికి ఒక ప్రవాహం. ముందుగా మనం పెట్టుకున్న లక్ష్యం. ఇది లేక అది అని చెప్పిన, అది కేవలం ఒక ప్రారంభం మాత్రమేనని, అది మరొక లక్ష్యం దిశగా కొనసాగుతూనే ఉంటుందని, దానికి అంతం అనేది ఉండదనీ మనకు తెలుసు.

*

ఈ ప్రపంచం అనేది ఎడతెగకుండా నిరంతరం మారుతూనే ఉంటుంది. అది ఒక క్షణకాలం కూడా ఆగదు. అయితే ఈ మార్పులో ఒక సామరస్యం ఉంటుంది. అది తనను తాను నిరంతరం పరిపూర్ణంగా ప్రకటించుకుంటూనే ఉంటుంది. అందుకే ఏదీ ఉన్నది ఉన్నట్లుగా ఉండదు. పైకి కనిపించేదానిలో వ్యతిరేకత అంటూ కనిపించినా 'పరిపూర్ణం' (whole) అది నిరంతరం మారుతూనే ఉంటుంది. సత్యమనేది అంతకంతకూ తన పరిపూర్ణతకు, భంగం లేకుండా, తనను తాను ఆవిష్కరించుకుంటూనే ఉంటుంది. అది తెలుసుకోవాలంటే, ఎవరైనా అంతటినీ కలిపి చూడగలిగి ఉండాలి. One must see the whole. కానీ మానవుడు — మానవతా పరిధినుంచి కూడా కాకుండా — తన వ్యక్తిగత దృక్కోణం నుండే, ఎంతో అల్పాతి అల్పంగా, మాత్రమే చూడగలడు. కనుక — అతనికి ఏదీ అవగాహన కాదు.

ఇది జతగా పరస్పరపూరకంగా జరిగే క్రియ. దివ్య అభివ్యక్తీకరణ సచేతనమయే కొలదీ, దాని వ్యక్తీకరణ పరిపూర్ణంగా ఉంటుంది. అంతకంతకు వాస్తవమవుతుంది. రెండు సంచలనాలూ కలిసి సాగుతాయి.

*

ఈ జరుగుతున్నదంతా సృష్టి పరమార్థం కోసం పరిపూర్ణం చేయడం కోసం, అవసరమైన వికాసమే. దానిని ఇలా చెప్పుకోవచ్చు. సృష్టియొక్క పరమార్థం ఏమనగా ఈ సకల సృష్టి, సృష్టికర్తను గురించిన ఎరుక గలిగి ఉండాలనే. The creature must become conscious like the Creator. అదీ అసలు సంగతి. అదొక నానుడి లాంటిది. కాని అది ఆ దిశగానే జరిగిపోతున్నది. ఈ సృష్టియొక్క గమ్యం ఆ అనంతుని, ఆ కేవలుని — ఆ సర్వశక్తివంతుని అనంతత్వమును, నిత్యత్వమును, సర్వశక్తిమత్వమును చేరుకోవాలనే. (మన మతాలన్నీ 'దైవం' అని చెప్పే దానిని; మనకు మన జీవితాలకు సంబంధించి 'దివ్యతత్వము') — నిత్యుడు, అనంతుడు, ఈశ్వరుడు — కాలాతీతుని, ప్రతివ్యక్తి ఈ చేతనలో ఒక భాగమే, ఆ

చేతనాంశము కలిగిన ఒక భాగమే.

భిన్నత్వమే ఈ ప్రపంచాన్ని సృష్టించింది. ఈ భిన్నత్వమే ఆ అనంతుని తన ద్వారా ప్రకటిస్తుంది. మన భాష (లేక మన చేతన) దానిని సరిగ్గా వెల్లడించేందుకు సరిపోదు.

*

సకల సృష్టి తప్పనిసరిగా అపేక్షించవలసినది దైవమే తప్ప, మరేది కాదు. ఆ దైవాన్ని ఆవిష్కరించడం తప్ప, మరేది కాదు. అది చేసేదంతా — పొరపాట్లు అనేవన్నీ కూడా — దానిని అనివార్యం చేయడం కోసమే, ఈ సకల సృష్టియొక్క ఆవిష్కారం. అంతే తప్ప 'దైవం' అనే దానిని గురించి మానవుడు ఊహించే విధంగా 'దైవం అంటే ఇది — కాదు — అది' అని గీతలు గీసుకున్నట్లుగా ఉండదు. మహాద్భుతమైన శక్తి తేజస్సుల పరిపూర్ణ కలయిక అది. దానికి అదే ప్రపంచంలో ఒక మహాశక్తి. అత్యంత శక్తివంతమైన ఈ దివ్య సర్వ శక్తిని ఆవిష్కరింపచేయడం కోసం; మరో విధంగా చెప్పాలనుకుంటే అందుకోసం దిగివచ్చిన సర్వ దివ్యశక్తి అది — this Divine All-Power.

అంతకు మించిన మంచిమాట మరొకటి లేదు గనుక 'సూప్రమెంటల్' అతీత మానసం అనడం. అది ఊర్ధ్వశక్తికి, సృష్టిని స్పందింపచేయగల శక్తిగా ఉద్దీపనం చేస్తోంది. అది నాకు కనిపించింది, అనిపించింది. అలా దానిని నేను చూశాను. దానిని అందుకే 'దైవం' అని అనాలి. ఎందుకంటే దాని ద్వారానే మనం దైవానికి సన్నిహితం కాగలుగుతాం. (మదర్ అవరోహణాక్రమం యొక్క ఒత్తిడిని అభినయిస్తూ) పదార్థమును మరింతగా ఉద్దీపనం కావించాలి. అనుభూతిపూర్వకంగా ప్రతిస్పందింప చేయాలి. (must make Matter more sensitive and responsive to the Force.)

*

ఈ సృష్టి, ఆ లక్ష్యం వైపుగానే సాగిపోతున్నదనడానికి దానికదే సాక్ష్యం. అదొక సక్రియానందం. అది కూడా నీవే అనే స్పందన. (that wonderful delight – of feeling itself to be Thou.

మూలం: శ్రీమాత

అనువాదం: కొంగర భాస్కరరావు

సూక్తులు

లక్ష్యం

మనం తెలుసుకోవలసిన దానినంతటిని అధిగమించినపుడు దివ్యజ్ఞానాన్ని పొందగలుగుతాం. హేతువు, అపుడు తోడు. ఇప్పుడు అదే ఆటంకం.

ఇచ్ఛాశక్తులన్నిటినీ అధిగమించినపుడు దివ్యశక్తి మనకు లభ్యమవుతుంది. కృషి అపుడు సహకరించింది. ఇపుడు కృషియే ఆటంకం.

ఆనందాలన్నిటినీ అధిగమించినపుడు దివ్యానందప్రాప్తి లభ్యమవుతుంది. కామన అపుడు తోడై యున్నది. ఇపుడది ఆటంకం.

సాధారణ వ్యక్తీకరణ దశ అధిగమించినపుడు నీవు దివ్య వ్యక్తిత్వాన్ని సంతరించుకుంటావు. అహం అపుడు సహకారిగానే ఉంది. ఇప్పుడది ఆటంకం

మానవత్వాన్ని అధిగమించాకనే దివ్యమానవులు కాగలుగుతాము. పశుత్వం అపుడు సహకారియే. ఇపుడది ఆటంకం.

హేతువును క్రమబద్ధీకరింపబడిన అంతర్దృష్టిగా రూపాంతరీకరించు. మొత్తం నీవే అంతా వెలుగువై ఉండు. ఇదే నీ లక్ష్యం.


నిదానంగా పొంగి ప్రవహించే సర్వోత్కృష్ట ఆత్మబలంగా నీ కృషిని రూపాంతరీకరించు. నీవే అంతా చైతన్యశక్తివి అయి ఉండు. ఇదే నీకు లక్ష్యం.

నిశ్చేతననుంచి బహిర్గతమవుతున్న దివ్యచేతన →
(ప్రక్క పుటలోని వర్ణచిత్రం శ్రీమాతచే చిత్రించబడినది.
పై శీర్షిక కూడా ఆమెయే ఇచ్చినారు.)









ఆనందమును సరళంగా, నిరపేక్ష పారవశ్యంగా రూపాంతరీకరించు. ఆకృతి దాల్చిన దివ్యానందమై ఉండు. ఇదీ, నీకు లక్ష్యం.

భిన్న వ్యక్తిత్వాన్ని విశ్వవ్యక్తిత్వముగా మలుచు. ఆకృతి దాల్చిన దైవమే అయి ఉండు. ఇదే నీ లక్ష్యం.

పశువును గోపాలకుడిగా రూపాంతరీకరించు. నీవే కృష్ణుడివై ఉండు. ఇదే నీ లక్ష్యం.

*

నేనిపుడు చేయలేకపోవటమనేది, నేను (తర్వాత) చేయబోయేదానికి సంకేతం. అసాధ్యం అనుకునే సంవేదన, అన్ని సంభావ్యతలకి నాంది. ఎందుకంటావా, ఈ ఐహిక విశ్వం ఒక అసత్యాభాస (was a paradox), ఒక అసంభావ్యత (an impossibility). కనుకనే అనంతుడు తన దివ్యసత్త్వము నుంచి దీనిని ఆవిష్కరించాడు.

అసాధ్యత — అనేది సాధింపబడని, ఇంకా మరింత ఉన్నత సాధ్యాల సమాహారం మాత్రమే. పురోగమనస్థాయిలో ఇంకా దరిచేరని, గమ్యాన్ని అది కప్పి ఉంచుతుంది.

మానవాళి పురోగమించాలని నీవు అభిలషించినవాడవే అయితే, ముందుగానే ఊహించుకున్న ఊహలన్నిటినీ తరిమికొట్టి పారవేయి. అలా మథింపబడిన చింతన మేల్కొంటుంది. సృజనాత్మక మవుతుంది. అలా కాకపోతే యాంత్రికమై చర్విత చర్వణంగానే మిగిలి ఉంటుంది. అదే సక్రమ కార్యకలాపమని పొరబడుతుంది.

తన చుట్టూ తాను పరిభ్రమిస్తూండటమే జీవాత్మ ఏకైక కార్యకలాపం కాదు. అనంత మహాతేజోమార్తాండుని చుట్టూ తిరగటం అనేది కూడా ఉంది.

ముందు నీలో నీవు చైతన్యవంతుడవై ఉండు. ఆ తర్వాతే ఆలోచించు, ప్రవర్తించు. సజీవమైన సర్వ ఆలోచనాశక్తీ ఒక క్రొత్త లోకాన్ని సంసిద్ధపరిచేదిగా ఉంటుంది. ప్రతి వాస్తవికచర్యా స్వయంవ్యక్తం కాబడిన ఆలోచనయే. ఒక దివ్యభావన

← ప్రక్క పుటలోని వర్ణచిత్రం ప్రీతి ఘోష్‌చే చిత్రించబడినది.

ఆత్మచేతనలో క్రీడాకలాపం ప్రారంభించింది. అందుచేతనే భౌతిక ప్రపంచం అస్తిత్వం లోకి వచ్చింది.

అస్తిత్వానికి, దానికి కారణంగా, ఆలోచన అత్యావశ్యకం కాదు, కాని అలా తటస్థించటానికి మాత్రమది ఉపకరణం. నాలో నేను ఏమి దర్శించుకుంటానో అదే నేను అవుతాను. ఆలోచన నాకు సూచించినదాని నంతటినీ నేను చేయగలుగుతాను. నాలో నా ఆలోచన, నాకు ఏమి దర్శింపచేస్తుందో, అది నేనవుతాను. ఇదే మనిషికి తనలో సుదృఢమైన ఆత్మసంకల్పమై ఉండాలి. ఎందుకంటే మరి భగవంతుడే కదా తనలో ఆవాసమై ఉన్నవాడు!

చేసిన పనే అలా చేస్తూ ఉండటం కాదు. నవ్యసాధనలు, ఊహించని ఆధిపత్యాలు సంతరించుకోవటం మనం చేయవలసిన పని. కాలము, అంతరాత్మ, లోకము కార్య క్షేత్రంగా మనకు సమకూర్చబడినవి. దార్శనికత (vision), ఆశ, కాల్పనిక భావనాశక్తి మనకు ప్రేరకులుగా నిలుస్తాయి. ఇచ్ఛాశక్తి, ఆలోచన, కృషి — ఇవన్నీ సార్థకమైన సానుకూల ఉపకరణాలు.

అయితే, మరి, మనం కొత్తగా సాధించవల్సినదేమిటి? ప్రేమ. ఆత్మోత్కర్ష, ద్వేషం, నీవిప్పటికే సాధించావు. ఆలోచన, అవగాహన, పొరపాట్లు ఇప్పటికివి మాత్రమే సాధించావు, మరి దివ్యజ్ఞానమో! మోదం, ఖేదం, అశ్రద్ధ — ఇప్పటివరకూ సాధించనవి. మరి దివ్యానందం సంగతేమిటి? బలహీనత, కృషి, జయంలో అపజయం — ఇంతవరకు సాధించావు. సాధించవలసినది దివ్యశక్తి. పుట్టడం, పెరగడం, చావటం — ఇవేనా సాధించవలసినది? కాదు. దివ్యజీవనం. కలుస్తూండటం, విడిపోవటమేనా సాధించవలసినది. కాదు దివ్యసమైక్యత.

ఒక్క మాటలో — దివ్యత్వం, దైవానికి ప్రతిరూపంగా రూపుదాల్చటం.

*

ప్రయోజనం

మనిషి దైవముతో సహాగమం అంటే — మనిషిలో దైవం ప్రవేశించి చొచ్చుకొనిపోవటం. మరియు, భగవంతుడిగా మనిషి స్వీయ ఆవిష్కారం.

అయితే ఆ పునరావిష్కరణ ప్రకృతిసహజమైన నిర్మూలనం అయిపోవటం కాదు. ఈ అన్వేషణ, గాఢావేశం, వేదన, ఆనందపారవశ్యత — దీనికంతటికీ ప్రయో

జనం నాశనం కాదు. అదే అయితే అసలీ ప్రహేళిక ఆరంభమయ్యేదే కాదు.

అసలు రహస్యం ఆనందం. స్వచ్ఛానందం. దీనిని తెలుసుకో; భగవంతుడిని తెలుసుకుంటావు.

అసలీ విషయాని కంతటికీ ఆరంభం ఏమిటి? అస్తిత్వం; కేవలం ఆనందప్రాప్తి కోసం అస్తిత్వం — తనను తాను ఎన్నో రెట్లు పెంపుచేసుకుంటూ అస్తిత్వం. తనను తాను అసంఖ్యాకంగా దర్శించుకోవటం కోసమే అసంఖ్యాక రూపాలలో అస్తిత్వ ప్రవేశం.

మధ్యలో ఏమైంది? భిన్నత్వం వచ్చింది. అనేకత్వంలో ఏకత్వం కోసం పెనుగులాట. భిన్నకాంతుల వెల్లువ దిశగా అజ్ఞానపు ప్రసవవేదన. ఊహాతీతమైన ఆనందపారవశ్య స్పర్శను పొందటానికి శ్రమించే వేదన. ఎందుకంటే ఇవన్నీ కాంతిహీనమైన ఆకృతులు, వక్రీకృత స్పందనలు.

దీనికంతటికి ఏమిటి ప్రయోజనం? మధువు తన మాధుర్యాన్ని తాను రుచి చూడగలుగుతే, తమ సమస్త సముదాయాన్నీ, దాని బిందువులన్నీ, వేటికది, తాము ఒక్కొక్కటిగా రుచి చూజడగలుగుతే ఒక్కొక్క బిందువు మొత్తం, తేనెతుట్టనే ఆస్వాదించగల్గటమే అయితే అదే ప్రయోజనం భగవంతునితో — వ్యక్తి జీవాత్మకి , విశ్వానికీ కూడా.

దివ్యప్రేమ, రాగం. దివ్యానందం, తానం. దివ్యశక్తి పల్లవి. దివ్యజ్ఞానం కళాకారుడు. సర్వానంతుడు వాగ్గేయకారుడు. మరియు, శ్రోతా, ఆయనే. ప్రారంభంలో మాత్రం అపశ్రుతులు వినిపిస్తాయి. అవి ఎంత తీవ్రంగా ఉన్నా పోను పోను అంత శ్రావ్యంగానూ ఉంటాయి. ఏది ఏమయినాకానీ తప్పనిసరిగా మనం దివ్యానంద వరప్రసాదలబ్ధి కోసం కాబోయే సంకీర్తనా గాయకులం.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

ఆత్మస్వాతంత్ర్యం ఒక ప్రకాశమానయానం;

ఇక్కడ స్వయం పరిపూర్ణతే దైవేచ్ఛ.

శ్రీఅరవిందులు

మానవునికి పరిపూర్ణ దివ్యత్వము

పరిపూర్ణతకు ఒక ఆదర్శసూత్రం

మన ఆశయం మానవునిలో పరిపూర్ణ దివ్యత్వము. ముందు మనం తెలుసుకోవలసినది మనిషిని సంపూర్ణ పరిపూర్ణుడుగా రూపొందించే అత్యావశ్యకమైన మూలకాలు. మానవుడుని, పరిపూర్ణ మానవత్వం నుంచి దివ్యత్వానికి వర్గీకరించటం అంటే మన అభిప్రాయం ఏమిటి? ఇది రెండవ విషయము. తన బుద్ధి చేత సూత్రబద్ధం కాబడిన ఒక ఆదర్శవంతమైన లక్ష్యాన్ని తన ముందుంచుకొని, దాని నాధారం చేసుకొని, అదే ధ్యేయంగా అన్వేషిస్తూ ముందుకు సాగటానికి స్వయం వికాసం చెందటానికి మనిషి సమర్థుడు. యోచనాపరులైన మానవులందరికీ ఇదే సాధారణ ప్రాతిపదికగా ఉంటుంది. అయితే బహు కొద్దిమంది మాత్రమే దీనిని తమ ఏకైక లక్ష్యంగా సంభావించుకుని ఉంటారు. కొంతమంది ఐహికజీవనంలో మార్పును, మరికొంతమంది మతపరమైన పరివర్తనను ఆదర్శంగా సూత్రీకరించుకుని ఉంటారు.

ఆదర్శవంతమైన ఐహికజీవన ఆధారసూత్రం

ఐహికజీవనంలో పరిపూర్ణత బాహ్య సాంఘిక జీవన కార్యాచరణకి నిబద్ధమై సూత్రీకరింపబడి ఉంటుంది. హేతుబద్ధమైన సాంఘికజీవనం, మరింత సమర్థవంతమైన, ఉన్నతమైన, సుసంపన్నమైన, దయాపూరము, ఆహ్లాదకరము అయిన జీవనవిధానంతో కూడిన పౌరజీవనం, అందుకు తగిన బాధ్యతా నిర్వహణ, అందుబాటులో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకుని అనుభవిస్తూ, మరింత యుక్తమైన సామరస్యపూర్వక జీవనం — ఇదీ ఐహికజీవన ఆధారసూత్రం. ఇంకా కొంతమంది అయితే, వైయక్తికంగా, అంతరంగ ఆదర్శాన్ని పెంపొందించుకుంటారు. వివేకము, హేతువు, ఇచ్ఛాశక్తులను ఉదాత్తంగా మలచుకుంటూ, స్పష్టమైన అవగాహన కలిగి ఉంటారు. శక్తిసామర్థ్యాలను విస్తరించుకుంటూ, ప్రాణిక, శారీరక సత్వాలను మరింత ఆరోగ్యవంతంగా, మరింత ఆమోదయోగ్యంగా క్రమబద్ధీకరించుకుంటారు. ఉదాత్తమైన నైతికవిలువలు, ఉత్తమ అభిరుచులు, మేలైన మానసిక ఉద్వేగంతో కూడిన స్వభావంతో ఉంటారు. ఒక్కొక్కప్పుడు ఒకే మౌలిక

అంశానికి ప్రాధాన్యత నిస్తారు. మిగిలినవాటిని మినహాయిస్తారు. ఇంకొకపుడు విశాల సమున్నత సమచిత్తం కలిగినవాళ్లు సామరస్యపూర్వక జీవనాన్నే పరిపూర్ణజీవనంగా పరిగణిస్తారు. ఇందుకు తగిన విద్యావిధానం, సాంఘికవ్యవస్థలో మార్పు బాహ్య సాధనాలుగా స్వీకరింపబడుతవి. అంతరంగ పురోగతి, క్రమశిక్షణ, స్వీకారయో గ్యమైన వాస్తవమైన సాధనోపకరణాలు. అంతరంగ వ్యక్తిత్వ పరిపూర్ణత మరియు పరిపూర్ణ బాహ్యజీవనం — ఈ రెండు లక్ష్యాలు సమైక్యం కాబడాలి.

ఆదర్శవంతమైన మతసూత్రము

ప్రాపంచిక జీవన లక్ష్యంగా వర్తమాన జీవనము, దానికి సంబంధిత అవకా శాలు — వీటినే కార్య క్షేత్రంగా స్వీకరిస్తుంది. అందుకు భిన్నంగా, మతాభిమాన పూరితమైన జీవనలక్ష్యం — మృత్యువు తర్వాత జీవత ఆస్తిత్వం కోసం, తన సంసిద్ధతను స్థిరపరుచుకుంటుంది. ఇక్కడ దీనికి ఆదర్శం సాధారణంగా, ఏదో రక మైన, పవిత్ర పురుషసాధన (pure sainthood). అపరిపూర్ణ పాపభూయిష్ట మాన వుడు దైవానుగ్రహం వల్ల లేక మతప్రవక్తల బోధనలకు విధేయంగా నడవడికను క్రమబద్ధీకరించుకోవటం అన్న మాట. సంఘసంస్కరణ కూడా మతానికి ఆదర్శంగా స్వీకరించవచ్చు. అప్పుడు సాధారణ మతాదర్శం అంగీకరింపబడుతుంది. పవిత్ర జీవనవిధానం అలవడుతుంది. మతాచార్యుల సౌభ్రాతృత్వంతో కూడిన దైవసా మ్రాజ్యం భూమి మీద ప్రభవిల్లుతుంది.

పూర్ణమానవత్వానికి కీలకం

సంయోజనకరమైన సమగ్రయోగానికి ప్రయోజనకరంగా, (దివ్య) సత్యము స్వాయత్తం కావటం తప్పనిసరి. అది సాధారణ మతపరమైన, లౌకికమైన సూత్ర ముల కంటే కూడా ఇది విస్తృతంగాను, సమున్నతంగాను ఉండాలి. జీవితమంతా నిగూఢయోగమే. దివ్యప్రకృతియొక్క అదృశ్యపురోగమనమిది. అందు రహశ్యంగా దాగివున్న దివ్యతత్వ ఆవిష్కరణయే సాఫల్యత. అది క్రమేపీ, దృశ్యమానమవు తుంది. సఫలత సిద్ధిస్తుంది. వ్యక్తియొక్క జ్ఞాన, ఇచ్ఛ, క్రియ — ఉపకరణాల ఉన్మీ లనంతో అది (దివ్యత్వం) ఆత్మ చైతన్యంతో, మరింత ఆత్మవిశ్వాసాన్ని సంతరించుకుని, అంతరంగ జీవాత్మకి, బాహిర విశ్వాత్మకి తేజోమయంగా తెరు

చుకొని ఉంటుంది. ఈ (ఆధ్యాత్మిక) పురోగతికి మనసు, ప్రాణికము, దేహము, ఇతర మన స్వభావ రూపాలన్నీ దోహదం కలిగించేవే. అయితే ఇవి తమ పరిపూర్ణ తను తుదిగా సంతరించుకునేది, వాటికి అతీతంగా ఉన్నదానికి ఉన్మీలనమై ఉండటం ద్వారా మాత్రమే. ఎందుకంటే, మనో, ప్రాణ, దేహాలే మనిషికి సర్వస్వం కావు. ఇది మొదటి విషయం. ఇక రెండో విషయం ఏమంటే, వీటికి అతీతంగా ఉన్న తానే (జీవాత్మ), తన పరిపూర్ణతకు కీలకం. ఆ 'తనే' తనను తేజోమయం చేసేది, తన సత్వము యొక్క పూర్ణ, ఉన్నత, విశాల సత్వాన్ని తనకు ఆవిష్కరించేదీ కూడా.

ఆత్మశిక్షణకు సంసిద్ధత

పరమమైన విజ్ఞానంచేత బుద్ధి సాఫల్యత చెందుతుంది. ఆ విజ్ఞానంయొక్క పాక్షికకాంతి మాత్రమే తనలో కలిగి ఉంటుంది. ప్రాణికం, తనయొక్క ప్రత్యేక భావార్థస్ఫురణని సమున్నతమైన ఇచ్ఛాశక్తులలో కనుగొంటుంది. దానికిది (life) అదృశ్య బాహ్య జీవన క్రియాత్మకస్థితి. శరీరానికి పరమ ప్రయోజనం, సత్వాశక్త్యుప కరణంగా పనిచేయడంలోనే. సత్వశక్తికి శరీరం భౌతిక ఆధారం. ప్రారంభస్థానం. ఇవన్నీ (మనసు, శరీరం, ప్రాణికము) ముందు తమకు తాముగా అభివృద్ధి కాబడి తమ సాధారణ సంభావ్యత లన్నిటినీ కనుగొనాలి. మన సాధారణ జీవనమంతా ఆత్మశిక్షణను సమకూర్చే, అందులకు సంసిద్ధపర్చే తాత్కాలిక ప్రయత్నమే. సత్వ ముయొక్క సముజ్వల, అస్తిత్వానికి ఉన్మీలనమై, జీవనం ఉండనంతవరకూ, అది తన పరిపూర్ణ సాఫల్యతను సిద్ధింపచేసుకోలేనట్లే. ఈ పురోగతి సుసంపన్నంగా శక్తి వంతమై సునిశిత ప్రయోజన సాధ్యంగా, సమర్థవంతమై ఉండాలి. క్రియాక్షేత్రం చక్కగా సంసిద్ధం కాబడాలి.

వాస్తవమైన పరిపూర్ణతకు షరతు

బుద్ధివికాసంతో కూడి సంకల్పశక్తి కలిగి, నైతికంగా ఉత్తమ అభిరుచితో కూడి యున్న క్రమశిక్షణ, ఇంకా శారీరక క్రమశిక్షణ, అభివృద్ధి — ఇదంతా ఎంతో మేలైనదే. అయితే చివరికది అంతా, నిరంతరంగా సాగే చక్రభ్రమణమే అవుతుంది — ఆధ్యాత్మిక వికసనంతో కూడిన లక్ష్యం, విముక్తి లేకపోతే. అంతరాత్మ సాక్షాత్కా రానికి, శక్తికి ఉన్మీలనత పొంది, తాము దానిని తమలో ప్రవర్తింపచేసుకోగలిగే

వరకు ఇది అలాగే ఉంటుంది. ఈ చర్య భిన్నగా జరిగితే మాత్రం ఇది సత్వమంత టిలోను పరివర్తన సాధిస్తుంది. వాస్తవమైన పరిపూర్ణకిది అత్యావశ్యకమైన షరతు. ఆత్మశక్తి, సత్యము, ఆలంబనంగా పెంపొందుతూ, దాని శక్తులే వ్యక్తీకరణకి వాహి కలుగా, ఋజుమార్గంలో కార్యాచరణగా సాగించటం — ఇదే సమగ్రయోగసాధ నలో ఆత్మపరిపూర్ణతకు సంపూర్ణ ప్రయోజనకారియైన సూత్రం.

ఆధ్యాత్మిక పరిపూర్ణతకు మొదటి దశ

ఈ పరిణామానికి సంబంధించిన ప్రక్రియలకు, కృషికి అనుగుణంగా ఆవశ్యక మైన రెండు దశలు తప్పనిసరి. మొదటిది మనిషియొక్క వ్యక్తిగత కృషి. జీవా త్మ, బుద్ధి, హృదయముల దివ్యసంభావ్యతలకు చైతన్యవంతమై, వెంటనే అదే వాస్తవమైన జీవితధ్యేయంగా కృషి అంతా అటు మరలుతుంది. అందుకు సంసిద్ధం కావటానికి తనలోని నిమ్నజీవన కార్యకలాపా లన్నిటినీ, ఆధ్యాత్మిక సత్యము, దాని శక్తులకు ఆటంకమై నిలిచి ఉండేవాటితో సహా — వైదొలగించుకుని, తన ఆధ్యాత్మిక సత్వమును వశం కావించుకొనేదిగా, తన స్వాభావిక చలితచాలనా లన్నటినీ, ఆత్మవ్యక్తీకరణకు స్వేచ్ఛామార్గాలుగా మరలించేందుకు కృషి ఉంటుం ది. ఆధ్యాత్మిక జీవనం కిది ఒక మలుపు. తద్వారా ఆత్మచైతన్య యోగం (the Self-conscious Yoga) తన లక్ష్యాన్ని యెరుకపర్చుకోవటం ప్రారంభిస్తుంది. ఒక నూతన మేల్కొలుపునకు, ఒక ఉన్నత పరిణామ దిశగా జీవనంలో ప్రేరణ కలు గుతుంది. ఆత్మశిక్షణ, మానసిక నైతిక పరిధులు దాటకుండా, మనసు, ప్రాణము, దేహమునకు, వర్తమాన సాధారణ జీవనప్రయోజనాలకు పరిమితమై ఉన్నంతవర కు, మనం ఇంకా ఆధ్యాత్మిక వికసనం లేని అస్పష్టయోగ స్వభావానికే సిద్ధమైన వాళ్లంగా ఉంటాము. సాధారణ మానవ పరిపూర్ణత కోసమే అన్వేషించే వాళ్లంగా మిగిలిపోయి ఉంటాం. ఆధ్యాత్మిక పరిణామానికి సార్థక సంకేతం — దైవముపట్ల, దివ్యపరిపూర్ణత యెడల, గాఢమైన ఆత్మపరివేదన; దైవముతో సత్వములతో సమై క్యత, స్వభావమంతటా ఆధ్యాత్మిక పరిపూర్ణత. మన సత్వముయొక్క, జీవనము యొక్క ఉన్నత సమగ్ర పరివర్తనానికి ఇదే ప్రాథమికమైన శక్తి.

వ్యక్తిగతకృషి వల్ల ప్రాథమికమైన మార్పు వచ్చి, పరిచయాత్మకమైన పరివర్తన సాధింపబడుతుంది. ప్రాణిక, భౌతిక జీవనంలో నిశ్చలత, ఆధిపత్యం, పరిణామశీలమైన కార్యాచరణకు తగిన మానసిక ప్రేరణలు, వ్యక్తిత్వ వికాసం — వీటన్నిటి ఆధ్యాత్మీకరణ — ఇదంతా వ్యక్తిగత కృషివల్ల సాధింపబడేదే. దైవంతో సంసర్గ సమైక్యతలు మనిషి మనస్తత్వంలో పాక్షికంగానైనా ప్రతిఫలించటానికి పరివర్తన కాబడిన వ్యక్తిత్వం ఆధారభూతమవుతుంది. ఇది వ్యక్తి తన యొక్క తోడ్పాటుతో, సహకారంతో, తనకు తానుగా పురోగమించటానికి జరిపే కృషి. ఎందుకంటే ఇది మానసికమైన కృషి. మనసు తనను తానధిగమించి శాశ్వతంగా ఉన్నతంగా ఆరోహించ లేదు. ఆధ్యాత్మికరింపబడిన ఆదర్శమనస్తత్వం అందుకునే వరకు మనసుకు యెదుగుదల ఉంటుంది. అంతకు మించి ముందుకు దూసుకుపోతే తన పట్టు తప్పుతుంది. జీవితంపై పట్టు కూడా కోల్పోతుంది. అపుడు నిష్క్రియాత్మకుగాని, లేదా పారవశ్య విలీనంకిగాని (a trance of absorption), చేరుకుంటుంది. ఒక సమున్నత శక్తి, సత్వం లోనికి ప్రవేశించి, సత్వముయొక్క మొత్తం కార్యకలాపాలన్నీ, స్వాయత్తం కావించుకోవడం ద్వారా మాత్రమే, ఉన్నతతర పరిపూర్ణత చోటు చేసుకుంటుంది. స్వభావం, తన యావత్కార్యక్రమాన్ని, ఈ సమున్నత దివ్యశక్తి హస్తాలకి శాశ్వతంగా వప్పగించటం వ్యక్తిగత కృషికి ప్రత్యామ్నాయం. ఆకాంక్షించే దైవం యోగాధిపతి అయి, సత్వము యొక్క పూర్తి ఆధ్యాత్మిక ఆదర్శ పరివర్తన నిర్వహించటం ఈ యోగానికి రెండవదశ.

సమగ్ర దివ్యపరిపూర్ణత

రెండు ప్రత్యేక లక్ష్య లక్షణసమన్వితమైన మన ఈ యోగం, ఆదర్శవంతమైన ప్రాపంచిక జీవన పరిపూర్ణతకు మించి, అతీతంగా దానిని ఉద్ధరిస్తుంది. అంతే కాక, అదే సమయంలో, సంకుచిత మతసిద్ధాంతానికి అతీతంగా, సమున్నతంగా, ప్రగాఢంగా ముందుకు తీసుకునిపోతుంది. ఈ సమగ్ర పరిపూర్ణయోగం, మనిషిని మనో, ప్రాణ, దేహాలతో కూడిన దివ్య ఆధ్యాత్మికసత్వముగా, పరిగణిస్తుంది. కాబట్టి దీని లక్ష్యం మనిషియొక్క దివ్యస్వభావ పరిపూర్ణత విముక్తి. ఆధ్యాత్మిక సత్వము

సర్వాంతర్యామి స్థితి కలది — అనే భావన ఆధారంగా ఈ పూర్ణయోగం ప్రతిష్ఠితమై యున్నది. ఇతర లోకాలకు మరలిపోవటం వల్లగాని, లేదా వైశ్వానికంగా ఆత్మవినాశనం పొందటంవల్లగాని సారభూతంగా అది తన పరిపూర్ణతను సంతరించుకోదు. ఇంద్రియగ్రాహ్యంగా ఇపుడు మనం ఏ స్థితిలో ఉన్నామో అలాగే సర్వాంతర్యామిత్వ వాస్తవ చైతన్యం లోనికి యెదుగుదల ద్వారా సత్వము తన పరిపూర్ణతను సంతరించుకుంటుంది. వాస్తవానికి మనమెప్పుడూ అంతస్తత్వంలో, ఆ సర్వాంతర్యామిత్వ వాస్తవచైతన్యంయొక్క సత్వమే. సర్వోన్నత దివ్యత్వంలో సమైక్యత, విశ్వాత్మలో సమైక్యత, అతీతమూలాధారం నుంచి మరియు విశ్వజనీనత ద్వారా అతిమానస జీవనసరళి — ఈ మూడు మూలకాలు సారభూతంగా మానవునిలో సమగ్ర దివ్యపరిపూర్ణతను రూపొందిస్తాయి. కాకపోతే, వ్యక్తి తన జీవాత్మకు వాహికగా అందుకు తగిన ఉపకరణమయి నిలుస్తాడు, అయితే సారభూతంగా ఈ దివ్యాత్మ పరిపూర్ణత, మూలాధార దివ్యప్రకృతితో సాదృశ్యత, ఏకత్వము, దైవానికి ప్రతిరూపంగా ఆకృతి నివ్వటము, ఆ దివ్యరూపురేఖలు స్థూలదృష్టికి కనిపించేటట్లు చేయటం — దీనినే సాధారణంగా, 'సాదృశ్యముక్తి' అంటారు. మానవదాస్యం నుంచి దైవత్వం లోనికిది విముక్తి. లేదా 'గీత' అభివ్యక్తీకరించినట్లు, 'సాధర్మ్యగతి', విశ్వజనీనంగా, అంతరంగ ప్రతిష్ఠితమైన ఉన్న సర్వోన్నత దైవంతో ధర్మబద్ధంగా ఏకం కావటం (one in law of being with the supreme, universal and indwelling Divine). భౌతికపదార్థమునకు చెందిన ఆలోచనతో ముడిపడి చిక్కుకొని ఉన్న అమృతత్వాన్ని (the Immortal) ఎలా విడదీయటం, ఆలోచనాపూరితుడైన ప్రాణికజంతువుగా ఉన్న మనిషిలో మునిగి ఉన్న దైవీసంభూత బ్రహ్మానంద సంకేతాలను ఎలా వెలికితీయడం — ఇదే అసలు సమస్య మానవునికి, మానవజీవనానికి. దివ్యజీవనానికి ప్రతిబంధకంగా ఉండే చిక్కుముడిని విడదీయటానికే — ఈ యోగం.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

మనం సంపూర్ణంగా జీవించటం ప్రకృతి ఆశయం
(సంపూర్ణంగా అంటే)

మనం మనముగానే తయారుగావడం అనేది జరగాల్సిన విషయం. కాని మన లోలోపల ఉన్న మనము ఏదో అదే సత్యమైన మనం. మనమైన ఆత్మను పొందా లంటే మనం శరీరాన్ని అధిగమించాలి. మనస్సును అధిగమించాలి. ప్రాణికాన్ని అధిగామించాలి. అంతర్గత జీవన వికసనం వల్ల మాత్రమే మనం ఆత్మను కనుగొ నగలం. ఈ ప్రక్రియ ఒక్కసారి జరిగితే అక్కడ నుండే మనం ఆధ్యాత్మిక లేక దివ్యమానసాన్ని, దివ్యజీవనాన్ని, దివ్యదేహాన్ని రూపొందించుకోగలం. ఈ సాధన సమకూర్పు ద్వారా నిజమైన దివ్యజీవనానికి అనుగుణమైన ప్రపంచ పరిసరాల్ని సృష్టించుకోగలం. దివ్యప్రకృతి శక్తి మన ముందుంచిన తన చివరి ఆశయం ఇదే. ప్రతి వ్యక్తి తనలోని దివ్యసత్యాత్మను కనుగొని, ఆ దివ్యసత్వాన్ని నిజజీవితంలో సమగ్రంగా ప్రకటించాలి. ఇదే సాధకమైన అవసరం మనిషికి.

మన సంపూర్ణ అంతర్గత జీవనం ప్రకృతి ధ్యేయం. అలాంటి జీవనానికి మనం మన సత్తాను గూర్చి పూర్తి ఎరుక కలిగి వుండాలి. అచేతనగా, అర్థచేతనగా లేదా అసంపూర్ణ చేతనగా వుండడం ఒక స్థితి కావచ్చు. కాని అది పరిపూర్ణజీవనస్థితి కానేరదు. వ్యక్తి తన్ను గూర్చి, తన సత్తాయొక్క సత్యాన్ని గూర్చి సమగ్రంగా ఎరుక కలిగి వుండాలి. అప్పుడే అతడు వాస్తవంగా తన జీవితాన్ని తన స్వాధీ నంలో వుంచుకోగలుగుతాడు. ఈ ఆత్మజాగృతే ఆధ్యాత్మికజ్ఞానం. ఆధ్యాత్మిక జ్ఞానసారం అంటే అంతర్గతంగా స్వతస్సిద్ధమై ఉన్న ఆత్మజ్ఞానచైతన్యం. ఈ జ్ఞానప్రక్రియ అంతా ఆత్మ తన్ను తాను రూపొందించుకోవటం కోసమే. ఆత్మ జ్ఞానం తప్ప తక్కిన జ్ఞానమంతా చేతన వాస్తవమైన, తన్ను తాను విస్మరించి, మరల తన స్వస్థితికి చేరుకొనే పెనుగులాటే. అదంతా జీవి, తాను తన ఆత్మ అజ్ఞానం నుండి ఆత్మజ్ఞానంగా పరిణామం చెందుటకై చేసే పరిశ్రమయే.

చేతన స్థితి శక్తిని కలిగి వుంది. అది సమగ్ర క్రియాశక్తిగా రూపొందాలంటే పరి పూర్ణంగా ఆత్మస్వాధీనమై ఆత్మోపకరణంగా వుండాలి. అలాగాక అసంపూర్ణంగా స్వాధీనమైతే, అది అసమగ్రస్థితియే అవుతుంది. ఆత్మశక్తి కూడ దివ్యత్వమే. శక్తి హీనమైన ఆత్మ ఆత్మే కాదు. ఆధ్యాత్మిక చేతన స్వయంభువు. అది సహజమై,

క్రియాత్మకమై, స్వయంభువువై, కృతార్థమై వుంటుంది. అది ఉపయోగించే ఉపకరణం (శరీరం) దానియొక్క భాగమై వుండాలి. ఉపకరణం భౌతికమైనదే అయినా, అది ఆధ్యాత్మిక శక్తి ప్రకటనమునకు అర్హమైనదిగ రూపొందింపబడి వుండాలి. ఆత్మసంకల్పం యేదైనా అది సాఫల్యం చెందడానికి ఉపకరణాలు సామరస్యంగా కలసిపోవాలి. ఆత్మశక్తి — ఉపకరణంపై సార్వభౌమత్వం కలిగి వుండకపోతే, దానిని స్వాయత్తం చేసుకుని, దానికి యజమానిగా ఆధిపత్యం వహించకపోతే, దీని చర్య అసంపూర్ణమే అవుతుంది.

చివరిగా సంపూర్ణ జీవనానికి ఆనందం కావాలి. ఆయానందం పరిపూర్ణమై, బాహ్యవస్తుజాలం మీద ఆధారపడనిదై వుండాలి. అలాంటి ఆనందం వల్ల విశ్వజనీనత సంప్రాప్తిస్తుంది. విషాదము, బాధ, వేదన అసమగ్ర చిహ్నాలు. అవి అసంపూర్ణ చేతన వల్ల వస్తాయి. పరిపూర్ణజీవిగా, పరిపూర్ణ చేతనగా, పరిపూర్ణశక్తిగా వుంటూ పరిపూర్ణ జీవనం సాగించడం దివ్యజీవనం అవుతుంది. వ్యక్తి పూర్ణత, విశ్వజనీనతతోపాటు, అతీతంగా కూడ వుండాలి. దేశకాలాతీతంగా వుండక, జీవి, శరీరంపై, జీవంపై, భౌతిక ప్రపంచంపై ఆధారపడి వుంటే, అది పరిపూర్ణ, సమగ్ర ఆధ్యాత్మిక జీవనం కాదు.

వ్యక్తి పరిపూర్ణుడుగ వుండాలంటే విశ్వాత్మగ వుండాలి. అలాగాక అల్పమైన అహంకార పరిమితులతో వుండడం అసంపూర్ణ అస్తిత్వం అవుతుంది. స్వభావరీత్యా అహంకారం అసమగ్రమైంది. అది అసంపూర్ణ చేతనలో, అసంపూర్ణ శక్తిలో, అసంపూర్ణ ఆనందంలో జీవిస్తుంది. అది అజ్ఞానానికి, బలహీనతకు, బాధలకు, బానిసవుతుంది. ఒకవేళ దైవప్రకృతి స్పర్శచే ఆ బలహీనతలు తొలగినా, అది పరిమిత అస్తిత్వం, పరిమిత చేతనాశక్తి, పరిమిత ఆనందంలోనే జీవిస్తుంది. అస్తిత్వం అంతా ఒక్కటే. పరిపూర్ణ జీవితం అంటే ఏకమైన సత్యంలో (ఏకం సత్) వుండడం. సర్వులలో తనను, తనలో సర్వులను, అనుభూతి చెందడం; సర్వుల చేతనను ఎరుక కలిగి వుండడం, విశ్వశక్తిలో తన శక్తిని ఏకం చేయడం, సకలాత్మలను తన ఆత్మగా అనుభూతి చెందడం, సర్వుల ఆనందాన్ని తన ఆనందంగా భావించగలగడం, సంపూర్ణ జీవితానికిది అవసరమైన నిబంధన. ఒక్క మాటలో చెప్పాలంటే భిన్నత్వంలో ఏకత్వ దర్శనం అవుతుంది.

కాని అలా పరిపూర్ణ విశ్వాత్మగా వుండాలంటే, వ్యక్తి పరాత్పర పురుషుడు

గా, లోకాతీత పురుషుడుగ తయారై వుండాలి. (one must be also transcendentally). మానవుని ఆధ్యాత్మిక పరిపూర్ణత శాశ్వతమైనది, సనాతనమైన ది. మానవుని దేశకాలాతీత శాశ్వత పరాత్పర చేతనను కలిగి వుండక, దేహ, ప్రాణిక, మానసాలపై ఆధారపడి వుంటే, ప్రపంచంపై ఆధారపడి వుంటే, అలాంటి అతని జీవనం సంపూర్ణ ఆధ్యాత్మిక జీవనం కానేరదు. కాని వ్యక్తి తన వ్యక్తిగత సూత్రాన్ని (the individual formula) మాత్రమే అధిగమించిన చాలదు, విశ్వప్ర కృతి సూత్రాన్ని కూడా అధిగమించవలసి ఉంటుంది. ఎందుకంటే అపుడు మాత్రమే వ్యక్తిచేతన, విశ్వచేతన తమ తమ యదార్థస్థితిని కనుగొని సమన్వయపూర్వక సామరస్యంతో మెలగగలుగుతాయి. ఆ రెండు చేతనలు బాహ్యజీవితాలలో ఆధ్యా త్మికంగా అసమగ్రంగా వుంటాయి. కాని అంతర్గతంగా అవి ఆధ్యాత్మికసారాన్ని కలిగి వుంటాయి. అది తమ అంతర్గత ఆధ్యాత్మిక సారాన్ని గుర్తించగలిగినపుడు ఆధ్యాత్మికంగా స్వయంసమృద్ధమై, విముక్తిని పొందుతాయి. లేనిచో వ్యక్తి చేత న, విశ్వప్రకృతి చలితచాలనాలకు బానిసయై, తన ఆధ్యాత్మిక స్వాతంత్ర్యాన్ని కోల్పోతుంది. వ్యక్తిచేతన పరమాత్మలో ప్రవేశించి, సాయుజ్యం పొంది, అందు జీవించి, దాని స్వీయసృష్టిగా వుండిపోవాలి. అతని మనోప్రాణదేహాలు పరాత్పర తత్వంగా (పరమం పరం) మార్పు చెందాలి. (must be converted into terms of Supernature) అతని భావాలు, అనుభూతులు, దానిచే నడుపబడాలి. అంతేగాదు తాను అదే కావాలి. దాని స్వీయసృష్టిగా వుండిపోవాలి.

మన గమ్యం

భౌతిక ప్రకృతిలో పరిణామ మనేది వుంటే ఆ పరిణామం, చేతనతో, ప్రాణముతో కూడిన వ్యక్తిగతమై వుంటే, సమగ్ర సత్తా, సమగ్ర చేతన, సమగ్ర జీవితం, మన జీవితగమ్యమయి వుండాలి. అవి మన భవితవ్యంలో ముందుగనో, ఆలస్యంగానో ఆవిర్భావం చెందుతాయి. అచేతన నుండి బయల్వెడలు ఆత్మ, ఆ జడప్రాణభూ మికల్లో పరిణామం చెందుతుంది. అది తన స్వస్థానానికి తిరిగి చేరుతుంది. లేదా ఆ పరిణామదశలో వ్యక్తిదశ అంతమైనపుడు పరమాత్మలో లీనమైపోవచ్చు. ఆప రమం పదంలో చేరిన చేతన తిరిగి రావచ్చు. ఆ తిరుగు ప్రయాణం నిరాశని స్పృహలతో కూడినదిగ వుండదు. అది జీవితంలో సమగ్ర ఆధ్యాత్మిక పరిణతితో

కూడి వుంటుంది. సుఖదుఃఖాలతో కూడి, తన సత్యాన్ని, ప్రపంచసత్యాన్ని కనుగొనుటలో జయాపజయాలు పొందుచు, అసంపూర్ణంగా సాగిపోయే మన పరిణామం, తొలి దశ అవుతుంది. ప్రకృతిలో ఆధ్యాత్మిక పరిణామం యీ దశ నుండి మున్ముందుకు, దివ్య జ్ఞానసంసిద్ధికి, ఆత్మవికసనానికి, దివ్యదర్శనానికి సాగిపోవాలి. అంతవరకు అది మనకు, still a Suprenature.

మూలం: శ్రీఅరవిందులు

భావనువాదం: బి. నరసింహయ్య

పుస్తక అనుబంధం:

కాంతి కిరణాలు

ఉన్మీలనం అంటే శక్తి ప్రభావాలను, పురోగతి కోసం అందుకొని వినియోగించుకోవాలనే సంకల్పం. దివ్యచేతనతో సంసర్గం కలిగి ఉండాలనే నిరంతర ఆకాంక్ష. శక్తి, చైతన్యాలు నీతోనే, నీ చుట్టూనే, నీ లోనే ఎప్పుడూ ఉన్నాయని, మరియూ ఇంకా వాటిని అందుకోవటం కోసం నీలో నీవు ఎంతమాత్రం అవరోధం రానీయవనే విశ్వాసం.

*

ప్రేమకి మరియు కాంతికి ఉన్మీలనం — సరిగ్గా ఇదే నా సమాధానం నీ గత ఉత్తరానికి. చేతనలో మరింత ఉన్నతంగా యెదుగు. మరింత విశాలంగా ప్రేమించు. కాంతికి తెరుచుకుని ఉండు. దారి తప్పడాలనేవి ఉండవు. విశ్వమంత విశాలంగాను, సర్వతోముఖ గ్రహణశక్తితోను ఉండాలి నీవు, యోగాన్ని అధిష్ఠించటానికి.

ఆగస్టు 2, 1962

*

విస్తృతి: విశ్వవిశాల పరిధిని దాటి, మించి ఇంకా నీవు విస్తృతమవు.
పురోగతికి కావల్సిన అవసరా లన్నటికీ నీవు బాధ్యత వహించు. వాటిని దైవసమైక్యతా పారవశ్యంలో పరిష్కరించు. అపుడు నీవు దివ్యత్వాన్ని పొందుతావు.

నవంబరు 13, 1957

శక్తిని అవరోహింపజేసి సంకుచిత అల్పమానవత్వంలోనికి బలవంతంగా చొప్పిం చేందుకు చేసే ప్రయత్నం కంటే వీలైనంత విశాలంగా విస్తృతి పొంది ఉన్మీల నమై ఉండటం మరెంతో సమర్థవంతమైనది.

డిశంబరు 7, 1964

*

గ్రహణశక్తి: దైవకార్యవిధానాలను ఆకళింపు చేసుకొని నిలుపుకోగలిగే సామర్థ్యమే, గ్రహణశక్తి అంటే.

*

చైతన్య విస్తృతి, ఏకోన్ముఖ ఆకాంక్ష — లతో గ్రహణశక్తి పెంపొసగుతుంది.

డిశంబరు 22, 1934

*

గ్రహణశక్తి నీలో లోపించింది. అది అభివృద్ధి కాబడాలి. ఇందుకు నీవు (open) ఉన్మీలనం కాబడి వుండాలి. ఉన్మీలనం కాబడాలంటే నిన్ను నీవు అర్పణ కావించు కోవాలి. నిశ్చయంగా నీవు చేస్తూన్నదేమంటే, ఇంచుమించు సచైతన్యంగానే దివ్య ప్రేమను, శక్తులను నీ వైపు ఆకర్షింపచేసుకునే ప్రయత్నం. ఈ ప్రయత్నం మంచిది కాదు. ప్రతిఫలాపేక్ష లేకుండా, లెక్కలు కట్టకుండా, అర్పణ కావించుకో. అప్పుడు నీవు స్వీకరించటానికి యోగ్యంగా ఉంటావు.

*

నీకు వున్నది, నీవు చేసినది, నీవు అయినది — నీ సర్వస్వమూ ఆనందంగా సమ ర్పణ కావించుకునే ప్రేరణ కలిగి ఉండటం — ఇదే గ్రహణశక్తి కలిగి ఉండటం అంటే.

*

స్వచ్ఛత: దైవప్రాబల్యాన్ని తప్ప మరేయితర ప్రాబల్యాన్ని అంగీకరించకపోవటం — ఇదే స్వచ్ఛత అంటే.

*

దివ్యంగా ఆలోచించటం, దివ్యంగా భావించటం, దివ్యేచ్ఛ కలిగి ఉండటం — ఇదే ఈ భూమి మీద నిజమైన స్వచ్ఛత.

సెప్టెంబరు 24, 1945

నిరాడంబరత: నిరాడంబరత సామరస్యాన్ని వ్యక్తీకరించటానికి సర్వశ్రేష్ఠమైనది.

*

నిరాడంబరతలో గొప్ప సౌందర్యము ఉంది.

*

నిజమైన ఆధ్యాత్మికత చాలా నిరాడంబరంగానే ఉంటుంది.

మార్చి 6, 1971

*

ఆధ్యాత్మికత అంటేనే, సర్వోత్తమ నిరాడంబరత.

మార్చి 6, 1971

*

నమ్రత — వినయం: ఉన్నతమైనవాళ్ళెప్పుడూ వినయంగా నిరాడంబరంగానే ఉంటారు.

*

దివ్యమార్గంలో ముందుకు కొనసాగే కొలదీ మనం మరింత వినయంగా ఉంటాం. ఇంకా చేయవలసినదానితో పోల్చినపుడు మనం చేసినదేమీ కాదని తెలుసుకుంటాం.

జూన్ 4, 1956

*

అధికుడనని, అల్పుడనని, ప్రముఖుడనని, లేదా చాలా సాధారణుడనని, ఎప్పుడూ నీవు అనుకోకు. నిజానికి మనమేమీ కానే కాము. దైవము ఎలా ఉండాలని ఇచ్ఛగిస్తే మనమలా ఉండవల్సిన వాళ్లమే.

*

మనమేమీ కాము అనే వాస్తవమైన అవగాహనతో, మనమేమీ చేయలేమని — తెలిసినవాడు, చేసేవాడు, ఉన్నవాడు కేవలం సర్వేశ్వరుడు మాత్రమేననే జ్ఞానంతో వివేకవంతులమవుతున్నాం.

*

ఉన్నది సర్వేశ్వర చైతన్యం, ఈశ్వరేచ్ఛ, మాత్రమే. ఈ 'నేను' నేను కాదు. ఈ అవగాహనలో ఉండటమే నిజమైన నమ్రత.

నిజంగా నిష్కపటమైన నమ్రత మనకు రక్షణ కవచం. అనివార్యంగా అహాన్ని నిర్మూలించటానికి ఇది అత్యంత నమ్మకమైన మార్గం.

*

నీ వ్యక్తిగత విలువ లేదా నీ వ్యక్తిగత సాధన ఎంతటిదైనా కానీ, యోగానికి ముందుగా కావల్సిన మొట్టమొదటి శ్రేష్ఠగుణం — నమ్రత.

(సశేషం)

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

సమాచార పత్రం

ప్రకటనలు:

1) సొసైటీ బీచి ఆఫీసు ప్రాంగణంలో 2009 ఆగస్టు 13, 14 తేదీలలో శ్రీఅరవిందుల యోగంకి సంబంధించిన అధ్యయన, సాధన తరగతులు నిర్వహింపబడుతాయి. శ్రీఅరవిందులవారి జన్మదిన వేడుకలు, ఆగస్టు 15 న, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరుగుతవి.

2) ఆగస్టు 2009, 16 నుంచి 22 వరకు 'సావిత్రి' అధ్యయన శిబిరం, డా. అలోక్ పాండేగారిచే నిర్వహింపబడుతుంది.

కేంద్ర బ్రాంచీల గురించిన వార్తలు:

వడోద్రా (గుజరాతు) బ్రాంచివారు: మహిళా సమ్మేళనాన్ని ఫిబ్రవరి 7,8 తేదీలలో నిర్వహించారు. శ్రీమాతారవిందుల నిర్దేశిత సూత్రాల కనుగుణంగా విద్యావిధానం గురించిన ప్రసంగాలు, చర్చలు జరిగాయి. యం.యస్. విశ్వవిద్యాలయం, వడోద్రా ఛాన్సలరు శ్రీమతి మృణాళినీ దేవి పువార్ గారు ముఖ్య అతిధిగా విచ్చేశారు. చెన్నై (తమిళనాడు) బ్రాంచివారు 2009 ఫిబ్రవరి 1, 8, 15 మరియు 22 తేదీ

లలో ప్రముఖ వక్తలచే ప్రసంగాలు నిర్వహించారు.
అల్లాబాద్ (ఉ.ప్ర) కేంద్రంవారు, 'భారతీయ సంస్కృతి — శాస్త్రవిజ్ఞానం' అంశంగా ఫిబ్రవరి 15 న గోష్ఠి నిర్వహించారు. ఆచార్య పి.యమ్. భండారి, డా. యం. యం. వర్మగారలు ప్రసంగించారు.
బాదల్పూరు (ఉ.ప్ర) కేంద్రంవారు 'శ్రీఅరవిందులు — సంస్కృతి' అంశంగా గోష్ఠి నిర్వహించారు.
గుంటూరు (ఆంధ్రప్రదేష్) బ్రాంచివారు ఫిబ్రవరి 15 న యువజనశిబిరాన్ని నిర్వహించారు. శ్రీ పి. సి. స్వరూప్‌గారు నిర్వాహకులుగా వ్యవహరించారు. సుమారు 75 మంది యువకులు పాల్గొన్నారు. శ్రీఅరవిందుల దివ్యసందేశాన్ని వారికి పరిచయం చేశారు.
ధరమ్ పేట్ (మహరాష్ట్ర) కేంద్రం వారు యువకులకు అధ్యయన శిబిరాన్ని, డిశంబరు 10 నుంచి 15 వ తేదీ వరకు నిర్వహించారు. అంశం 'చైతన్యము'.
నైరోబి (కెన్యా) కేంద్రం వారు 3600 పుస్తకాలు, నైరోబీలోని మహిళా వైద్యాలయానికి బహుకరించారు. నైరోబీ కేంద్ర కార్యదర్శిగారు శ్రీమాత బోధనలున్న పుస్తకాలు కేంద్రంలో గోష్ఠికి హాజరైనవారికి పంచిపెట్టారు. ఫిబ్రవరి 19, 2009 న గోష్ఠి నిర్వహించారు.


తన సంపూర్ణ సాఫల్యతయొక్క ప్రతిస్పందనలో
మన జీవితం కనుగొంటుంది:
మీద అవధులులేని, అలజడిలేని ప్రశాంతభరిత దివ్యానందాలు,
కింద అత్యద్భుత దివ్యాలింగనానుభూతి.

— శ్రీఅరవిందులు

(సావిత్రి, పుట 315)

Rs. 15

భక్తి వికాసం



అఖిల

అఖిల భారత పత్రిక

జూలై 2009

భక్తివికాసం

విషయసూచిక

భక్తి అంటే

దైవము

భక్తి వికసనం

అనుబంధం

సంపూర్ణ ఆత్మసమర్పణమే భక్తి

పరమేశ్వరుని యెడల ప్రేమే, భక్తి. అది ఆరాధన. తన సర్వస్వాన్ని దైవానికి సమర్పించటం.

*

భక్తి కర్థం సంపూర్ణ శరణాగతి. ధ్యానము, తపస్సు, ప్రార్థన మంత్రపఠనాదు లన్నిటికీ తప్పనిసరిగా ఇదే లక్ష్యము కావాలి.

*

భగవంతునికి స్వాత్మార్పణమే యథార్థ ప్రేమ. దానికి కోర్కెలు విఘ్నాలు. సంపూర్ణశరణాగతి, పరిపూర్ణహృదయంతో, వినమ్రతతో భక్తిని సమర్పించటం. అందులో షరతులు, నియమనిబంధన లుండవు. అది వ్యాపారం కాదు. అదిస్తే ఇదిస్తాననటం కాదు. కోపతాపాదులు, అసూయాద్వేషాల కందులో తావు లేదు. గర్వాహంకారాలు లేశమాత్రంగానైనా తోపనీని నీ పరిపూర్ణహృదయ సమర్పణం.

*

దీనికి సమాధానంగా జగన్మాత నీకే మిస్తుంది? స్వేచ్ఛగా, నిరాటంకంగా తనకై తాను నిన్ను సమీపిస్తుంది. తన పాదసన్నిధిని నీ కనుగ్రహిస్తుంది. ఇదంతా ఆత్మలోకంలో జరిగే పని. నీ త్రివిధ శరీరాల్లో — భౌతిక, ప్రాణ, మనోమయకోశాల్లో జరుగుతుంది. నీలో ఆధ్యాత్మికశక్తిని నింపుతుంది. నీలోని భౌతికతను క్షుద్రస్వభావాలను ప్రక్షాళించి నీ ప్రకృతిని పూర్ణత వైపు పూర్ణకామన వైపునకు మళ్ళిస్తుంది. నిన్ను ఊర్ధ్వభూమికకు పరిణమింప జేస్తుంది. ఆమె తన ప్రణయ ప్రేమవస్త్రంలో నిన్నాచ్ఛాదిస్తుంది. తన అంకంలోకి ఆకర్షిస్తుంది. నిన్ను దైవోన్ముఖుని చేస్తుంది. నీ చేతు లందుకుని ఆమె నిన్ను భగవంతుని దరికి తీసుకువెడుతుంది.

*

నీవు కోరవలసిందిది. నీ శరీరంలోని ప్రత్యణువు దీనితో నిండిపోవాలి. ఈ భక్తితో స్పందించాలి. దీనికి కాలపరిమితి లేదు – ఎల్లలు లేవు – ఎప్పుడైతే నీలో ఈ భావన జనిస్తుందో అప్పుడు నీకు కాంక్షలు తీరలేదన్న అసంతృప్తి – నిరాశా లేవు. నీవే కనక నిజంగా ఈ భావ స్పందనలో లీనమైపోతే – నీలో అపవిత్రతత, అపరిశుద్ధ





తలకు తావే లేదు. నీ స్వభావమంతా పున్నమి వెన్నెలగా వెలిగిపోతుంది.

నీ ప్రేమలో స్వార్థం — కోరికలు లేకుండా జాగ్రత్త పడు. రావలసిన బహుమానమైన శ్రీమాతృప్రేమ ఫలం లభిస్తుంది. తల్లికి అనుంగుబిడ్డవు కాగలవు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: తుమ్మపూడి కోటేశ్వరరావు

హృదయాత్మల స్థితే భక్తి

భక్తి అనుభూతే కాదు. హృదయమూ, ఆత్మా పొందే స్థితి. ఒక తాదాత్మ్యావస్థ. చైత్యసత్త (Psychic) జాగరూకమై ఉన్మీలనమందితేనే ఇది ప్రవృద్ధమవుతుంది.

*

యదార్థ ప్రతిపత్తిలో గోపికలు అసాధారణ రూపాలు. వారు తీవ్ర ఆధ్యాత్మికావేశసంభరిత స్వరూపాలు. వారి స్థితి అసాధారణ ఉద్వేగంతో జనించిన ప్రేమగా, స్వయంభక్తిజనితమై, ఏ అరమరికలు లేని, నిష్కపట సమర్పణగా పరిణమించినది. అది పొందినవారు తారతమ్యాల నధిగమించి ఇతరాన్వేషణలైన జ్ఞానం, ప్రతిపాద్య సమర్థత, పాండితీప్రకర్ష, బాహ్యశుచి మొదలైన వాటికి అతీతంగా సులభంగా కృష్ణుని వెన్నంటి చేరుకోగలరు. నాకు తెలిసిన గోపిక సంకేతార్థ మిదే. ఇంకా చాలా సార్థక సూచనలున్నా, ఇదే అనేకంలో ఏకైకమైనది. దానికదే సాటి.

— శ్రీఅరవిందులు

*

రాధ వినతి

ఓ ప్రభూ, మొదటి చూపులోనే నిన్నే నా ప్రభువుగా, ప్రధాన దైవంగా గుర్తించాను. నా సమర్పణ నంగీకరింపుమోయీ!

*

నా భావాలూ, చింతనలూ, ఆవేశకావేశాలూ, జీవనచేష్టలూ, హృదయప్రవృత్తులూ, ఉద్వేగాలూ, కదలికలూ, ఆ పై శరీరంలోని ప్రతి అణువూ ప్రతి రక్తబిందువూ

అన్నీ నీవే అయి ఉన్నావు.

ఏ కొంచెం దాపరికమూ లేక, నేను పూర్ణంగా నాలోని అంతటా నీవై నిండి, నీదేమైనది. నాది అంతా నీదే. నీ సంకల్పమే నా ఉనికి. జీవించినా మరణించినా, సుఖమైనా దుఃఖమైనా, సంతోషం గలిగినా బాధ కలిగినా ఏది నీవు తలచి నా కను గ్రహిస్తే అదే నాకు సర్వస్వం.

నీ విచ్చే ప్రతి కానుకా నాకు దివ్యమైన పరాత్పర వితరణగా సత్కారమై సంపన్నమౌతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: టి.యస్. రామచంద్రరావు

భక్తి, హృదయము, జీవాత్మకు సంబంధించినది

హృదయం, జీవాత్మలకు సంబంధిత స్థితి, భక్తి. అనుభూతిపూర్వకమైనది కాదు. మేల్కొన్న చైత్యపురుషసత్త ప్రస్ఫుటమైనపుడు ఈ పరిస్థితి వస్తుంది.

*

భక్తిమార్గంలో దేవతార్చన మొట్టమొదటి మెట్టు మాత్రమే. బాహ్య అర్చన, అంత రంగ ఆరాధనగా మారినపుడు వాస్తవమైన భక్తి ఆరంభమవుతుంది. తీవ్ర దివ్య ప్రేమగా అది ప్రగాఢమవుతుంది. దివ్యానురాగానుబంధానికది తీసుకుపోతుంది. సన్నిహితానందం, దివ్యబ్రహ్మానంద సమైక్యత లోనికి సాగిపోతుంది.

*

సరియైన అర్థంలో చెప్పాలంటే గోపికలు, అసాధారణ వ్యక్తులు. ఆధ్యాత్మిక గాఢా వేశానికి వారు నిర్దిష్టరూపాలు. ప్రేమానురక్తిలోను, భక్తిలోను పరిపూర్ణ ఆత్మా ర్పణలోను వాళ్ల వ్యక్తిత్వం అసాధారణం. ఇలాటివారు మిగిలిన విషయాలలో — శక్తిసామర్థ్యాలలో, పాండితీప్రకర్షలలో, బాహ్య ఆచారవ్యవహారాలలో వారి స్థాయి ఎంత నిరాడంబరమైనది, తక్కువది అయినా, వారు కృష్ణునికి అనుచరులుగా ఆయనకు సన్నిహితులుగా ఉంటారు. నా అభిప్రాయంలో గోపికలు అందుకు ప్రతీ కలు. ఇంకా యితరమైన వెన్నో ప్రాధాన్యతలు ఉన్నాయనుకోండి! వాటన్నింటిలో

ఇది ఒకటి.

ప్రధానంగా, నిజమైన దివ్యప్రేమ, స్వాభావికంగా, ఆధ్యాత్మికము, చైత్యపురుష సంబంధితము. ఆత్మార్పణకు, ప్రేమకు, ఆరాధనకు సమైక్యతకు సత్వంయొక్క అంతరంతరాలలో మూలకంగా కావల్సినది చైత్యపురుష (మెలకువ). దీనిని సంతృప్తిపర్చేది దైవము మాత్రమే. దివ్యానంత సర్వోన్నత సత్వంతో సమైక్యతకు, సంసర్గానికి — వీటన్నిటి ఉనికికి మౌలికంగా ఆవశ్యకమైనది ఆధ్యాత్మిక తత్వం. మౌలికమైన ఆధ్యాత్మికతత్వము, దివ్యానందము నాణేనికి బొమ్మ బొరుసు. మనోప్రాణిక దేహాలు ఈ ప్రేమకు ఆధారాలు. ప్రేమను స్వీకరించేవీ అవే. అవి తమ పరిపూర్ణతనెప్పుడు సిద్ధింపచేసుకుంటాయంటే, సత్వంయొక్క ఆధ్యాత్మిక, చైత్యపురుష మూలకాలతో సామరస్యం కలిగి, తిరిగి అవి పునరాకృతి దాల్చినపుడే (రూపాంతరీకరణ చెందినపుడే). అపుడిక నిమ్న అహంయొక్క అవసరాలకి ప్రాధాన్యత ఉండదు.

*

ఇక్కడ అపార్థాలకు తావివ్వకుండా ఒకటి రెండు విషయాలు ముచ్చటించాలి. మొదటిది — నేను మాట్లాడే దివ్యప్రేమ చైత్యపురుషప్రేమ మాత్రమే కాదు. ప్రాణికము, ప్రాణికభౌతికములతో కూడిన సత్వాని కంతటికి సంబంధించిన ప్రేమ. ఇవన్నీ ఆత్మార్పణకు సమర్థమైనవే. ప్రాణికప్రేమ — అంటే — అది తన కామనను సంతృప్తిపరచమని బలవంతపెట్టేదని అనుకోవటం పొరపాటు. అలాగే, (రెండో విషయం) తాను ప్రేమించేదాని నుంచి దూరంగా వైదొలగిపోవటము కూడా కాదు. అనుబంధాన్ని వదల్చుకుని పోవటమూ కాదు. స్వభావంలో మిగిలిన ఇతర భాగాలవలెనే ప్రాణికము కూడ ఏ నిర్బంధం లేకుండా ఆత్మార్పణ కావించుకోగలిగేదిగా ఉండాలి. శరీరము, ప్రాణికము — రెండూ — సక్రమమార్గంలో, నిరహంకారంగా వాస్తవమైన ప్రేమమార్గంలో తమకు తాముగా సమర్పణ కావించుకోవలసినవే.

*

దివ్య శక్తి, ఆవేశాలతో కూడిన ఆత్మానందము ప్రేమ. ప్రేమ లేకుండా అనంతత్వపు తన్మయత్వంతో కూడిన ప్రశాంతత, దివ్యానందంతో సంలీనమైన నిశ్శబ్దం పొందవచ్చు. కాని సమృద్ధమైన పరిపూర్ణతతో కూడిన, దానియొక్క సమగ్ర ప్రగాఢతయొక్క అనుభూతి అందదు. విభజన, వేర్పాటుధోరణి వల్ల పొందే క్లేశం నుంచి పరిపూర్ణ సమైక్యతానందంలోకి ప్రేమ తీసుకుపోతుంది. సమైక్యతలో పొందే ఆనం

దాన్ని కోల్పోకుండా ఉండటమే జీవాత్మకు పరమోన్నత ఆవిష్కారం. విశ్వజీవనం ఆ లక్ష్యసాధన కోసమే. ఇది ఒక సుదీర్ఘ మైన సన్నాహం.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

కృతజ్ఞత వినా భక్తి అసంపూర్ణం

భక్తి ననుసరిస్తూ సర్వదా మరొక మానసిక ప్రేరణ కూడా తప్పక ఉండాలి. అటు వంటి కృతజ్ఞతా జ్ఞానమే దైవ అస్తిత్వాన్ని తెలుపుతుంది. అద్భుతమైన కృతజ్ఞతా భావన నిజంగా నిన్ను మహోన్నతమైన పరమ ఆనందముతో నింపుతుంది. నిజానికి అదే దైవ అస్తిత్వము. విశ్వములో 'ఇదీ' అని తెలియనిది ఏదో ఉంది. అది దైవం. అది మనము చూపే రాక్షసత్వము కాదు. అచట దైవం ఉన్నాడు. అదే దైవం యొక్క ఉనికి. అనుక్షణం చాలా అల్ప మైన దానితో కూడా నిన్ను ప్రత్యక్షంగానో, పరోక్షంగానో దైవం యొక్క మహోన్నతమైన భావంతో కలుపుతుంది. వ్యక్తి హృదయం చాలా తీవ్రమైన ఒక అద్భుతమైన పరమానందముతో నిండిపోతుంది. సర్వములో అటువంటి కృతజ్ఞతా భావాన్ని చవిచూచుట ఆహ్లాదమే.

కృతజ్ఞత కలిగించే ఆనందానికి మించిన ఆనందము మరొకటి లేదు. ఒక పక్షి గానం వినడంలోను, ఒక అందమైన పుష్పాన్ని చూచుటలోనూ, చంటిబిడ్డను చూచు టలోనూ, ఔదార్యముకల ఒక చిన్న చర్యను గమనించుటలోనూ, మధురవాక్యాలను చదువుటలోనూ, సూర్యాస్తమయాన్ని వీక్షించుటలోనూ, ఇటువంటి వాటిలో వేటిలో నైనా అనూహ్యముగా ఈ పరమానంద పారవశ్యం నిన్ను కమ్ముకుంటుంది. ఇటు వంటి భావోద్రేకము నిజానికి చాలా లోతైనదై, తీవ్రమైనదై ఈ ప్రపంచంలో దైవాన్ని వ్యక్తం చేస్తుంది. ఈ ప్రపంచం వెనుక తెలియని శక్తి ఏదో ఉంది. అదే దైవం.

కావున కృతజ్ఞతలేని భక్తి పూర్తిగా అసంపూర్ణమైనదిగా నేను కనుగొన్నాను. కృతజ్ఞత భక్తితో కూడి ఉండాలి.

*

సర్వ అహంకార అంధకారాలన్నీ అంతరింపచేయుట మన హృదయములో కృత

జ్ఞతాభరితమైన స్వచ్ఛమైన జ్వాల వెచ్చగా మధురంగా కాంతివంతముగా సర్వదా తప్పక జ్వలించాలి. సాధకుని అతని లక్ష్యం దిశగా నడిపించే పరమాత్ముని కృపకై ఈ కృతజ్ఞతోద్వేగాలు తీవ్రమైన కొలది దైవకృప కార్యక్రమాన్ని గమనించి దానికి కృతజ్ఞతాభావనతో ఉండిన ఎడల యోగమార్గ దూరము తగ్గిపోతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: త్రివేణి సిద్దులగారి

ఎవరోహో...!

సమస్త విశ్వాన్ని, సకల విశ్వచైతన్యాన్నీ వాసుదేవ చైతన్యంగా, జగద్గురువైన శ్రీకృష్ణుని ఆవాసంగా అనువదించుకొని అనుభూతి స్రవంతులలో ఓలలాడారు శ్రీఅరవిందులు ఆలిపూరు జైలులో. ఆ పద్మనయనముల దొర కనిపించి, వెన్నుద ట్టి గీతాసారాన్ని విశదీకరించి విశ్వవేదనలు దీర్చు ప్రణాళిక రేఖాచిత్రాన్ని అందిం చగా పులకాంకితులైన శ్రీఅరవిందులు తొమ్మిదడుగుల పొడవు, ఐదు లేక ఆరడుగుల వెడల్పుగల కిటికీలు లేని ఇరుకైన జైలుగదిలో, వైదగ్ధ్య, వైవిధ్య, వైచిత్ర్య విశ్వవిలా సాన్ని సాంతంగా వీక్షించారు. ఆ విశ్వాంతరంగ నైర్మల్యానికీ, సౌందర్యానికీ, సౌజన్యానికీ అచ్చెరువందారు. ఆ విశ్వశిల్పి ఉలిడెందాన్ని ఆపోసన పట్టారు. ఆ విశ్వ చిత్రకారుని కుంచె పోహళింపుల నాకళింపు చేసుకొన్నారు. ఎవరోహో! నీవని ఆ విశ్వప్రణాళికా ద్రష్టను వీక్షించడానికి యోగీశ్వరేశ్వరుని తేజోరూపాన్ని "Who" అన్న కవితలో నిబద్ధించారు.

ఎవరోహో! మేఘరహిత నింగినీలిమలో, అడవి ఆకు పచ్చదనంలో
అరుణారుణిమ తేజో ఓజస్సులలదిన చిత్రకారుడు!
శూన్య గగన గర్భంలో నిశ్చలంగా నిదురిస్తున్న మారుతతరంగాలను
మేల్కొలిపి ఉసురు సురని విసరమన్న దెవ్వరు!

దివ్యప్రకృతిహృదయ కుహరంలో తన గుండెను చేజార్చుకున్నాడు.
అతడు మెదడుకు మూలధారం, తలపులకు పునాది తత్వానికి అనాది;
వికసిత పూల్మెల్బంతి హృదయంలో పడుగు పేకలలా అల్లుకుపోయాడు
తళతళ లాడే ఉజ్వల తారల వలలో పట్టుబడిపోయాడు.

మగవాని మేటి మగటిమిలో మగువ మనోజ్ఞతలో
నూనూగు మీసాల హాసంలో, సిగ్గరి చిన్నారి బుగ్గలో
జీవుడిని దేవుడి కక్ష్యలో పల్టీలు కొట్టించిన చేయి,
కురులను సరిచేయ వెచ్చిస్తున్నది తన టక్కరితనాన్నంతా.

ఇవి అన్నియూ ఆయన కార్యములు, ఆయన ముసుగుతెరలు, ఆయన నీడలు;
సరే. అలాగయితే ఆయ నెక్కడున్నాడు? ఏ పేరుతో పిలువబడుతున్నాడు?
ఆయన విధాతయా? విష్ణువా? నరుడా? నారియా?
దేహియా? విదేహియా? జతగాడా? ఒంటరివాడా?

అత్యుజ్వలమైన నీలిమేఘశ్యామ బాలకునిపై మక్కువ మాకు
ఆచ్ఛాదనలేని ఓ ఉగ్ర భయంకర స్త్రీ కొలువు మాకు
హిమ వన్నగ సానువులపై కొలువుదీరిన ఆరోచనా యోచనునిగా చూసాం,
ఆయన గోళాలలో కార్యనిమగ్నుడై ఉండటం గమనించాం.

సమస్త విశ్వానికీ ఆయన కేళీవిలాస లాలసలను చాటుదాం మనం,
చిత్రహింసల పెనుబాధల, ఇంద్రియోద్వేగాల పారవశ్యత పొందాడు,
మన క్షేదాలకు, మోదమొంది, దుఃఖపెడతాడు మనలను
తదుపరి తన దివ్యానంద సౌందర్యాలలో మరలా ప్రలోభపెట్టి బుజ్జగిస్తాడు.

సంగీతమంతా ఆయన ప్రమోదహాస ఝురుల రవళి,
సౌందర్యమంతా ఆయన భావావేశపూర్ణ పరమానందం;

మన బ్రతుకులు ఆయన యెదసవ్వడులు, మంగళానంద పారవశ్యం మనకు
రాధాకృష్ణుల పరిణయం, మన జీవితం వారి అధరాల మధుర సంగమం.

కొమ్ము బాకాల బృందసంగీతధ్వనుల బిగువతడు, బలమతడు
రథంలో తిరుగుతాడు, ఈటెలతో ఆడుతాడు:
కష్టం లేకుండా కడతేరుస్తాడు కడుదయామయు డతడు.
అతడీ విశ్వం కొరకు యుగాంతం వరకూ అవిశ్రాంతంగా పోరాడుతాడు.

అనంత లోకాల సర్వవ్యాప్తిలో, కాలకడలి అలల సుడులలో
మాటల కందక, మహిమాన్వితంగా గంభీరంగా, విశుద్ధంగా
తత్వవిదు లందుకొన్న దివ్యజ్ఞానానంత శిఖరాల కావల
తన నాశరహిత క్షేత్రాలలో కొలువై వున్నాడు గద్దెపై.

మానవుని నియంత్రించేవాడూ అనంతంగా ప్రేమించేవాడూ, ఒకడే
అతడు మనలోనే ఉన్నాడు, కను విప్పగలిగితే కనిపిస్తాడు
లౌకికసుఖాడంబరంలో, అహంకారంలో అంధులమయ్యాం మనం.
మనల్ని మనం ప్రేమించుకొనే భావనలో బందీలయ్యాం మనం.

అవినాశుడూ సనాతనుడూనైన రవితేజమతడు
నడిరేయిలోని కతని నీడ విసరివేయబడుతుంది
అజ్ఞానావృత అంధకారం, చీకటిలో కూరుకుపోయిన వేళ
అచటత డుంటాడు, బ్రహ్మాండంగా ఏకైకుడిగా ఆశీనుడై

ఆంగ్లమూలం: శ్రీఅరవిందులు
అనువాదం: అన్నవరం ఆదిశేషయ్య

పైకి అగుపించేవాటి వెనుక ఉన్న వాస్తవం

ఈ విశ్వమంతటా బాహ్యంగా అగుపించేవాటి వెనుక శాశ్వతము ఒక్కటే సత్యము (ఏకం సత్) అయిన దివ్యచేతన, దివ్యసత్వము, దివ్యాత్మ ఉన్నది. ఈ దివ్యవాస్తవము యొక్క ఉనికి నాధారం చేసుకునే, సనాతన భారతీయ మహర్షుల చింతనా స్రవంతి సాగింది. శ్రీఅరవిందుల తత్వచింతన కూడా ఇక్కడినుంచే ఆరంభమవుతుంది. సర్వప్రాణులు ఆ ఒక్కటే అయిన దివ్య పరమాత్మలో సమైక్యం కాబడి ఉన్నాయి. అయినప్పటికీ, ఒక రకమైన వేర్పాటు చైతన్యధోరణిలో, మనో, ప్రాణిక, దేహాలలోని దివ్యాత్మ, దివ్య అస్తిత్వముల యొక్క ఉనికి నెరుగక, సమైక్యతను గుర్తించక, విడివిడిగా, వేర్పాటు చేతనలోనే జీవులుంటున్నారు.

...

దైవం అనేది, సిద్ధాంతపరమైన, ఆచరణకు అందని ఒక ఆదర్శం కాదు — లేదా — కాలాతీత అపార స్వచ్ఛ సాపేక్ష ప్రాధాన్యతా సిద్ధాంతమూ కాదు. విశ్వము యొక్క అస్తిత్వాని కంతటికీ మౌలికమైనది దైవము. అయితే, ఈ అస్తిత్వము సచ్చైతన్యమైనది, ఆనందమయమైనది. ఇవి లేకుండా అస్తిత్వము లేదు. పైగా, ఆ అస్తిత్వము స్వీయచైతన్య, ఆనందాల యెరుక గలిగి ఉన్నది. దానినే మనం a divine infinite Person — పురుష అని పిలుస్తాం. ఇంతకు మించి, చైతన్యమంతా ఆ దివ్యశక్తినే సూచిస్తుంది. all consciousness implies power, Shakti దివ్యచేతనాసత్వము ఉన్నచోట అనంతదివ్యశక్తి ఉంటుంది. విశ్వములో, సర్వ ప్రాణుల మనుగడకూ ఆధారం ఆ దివ్యశక్తియే. సర్వజీవులూ నివసించేది దివ్యసత్వము వల్లనే. సర్వజీవులయొక్క రూపురేఖావిలాసాలు సర్వజీవనివాసియైన వాసుదేవుని యొక్క ముఖారవింద విన్యాసాలే. All things are the faces of God. బుద్ధి, క్రియ, భావన, ప్రేమ — ఆయన నుంచే వెలువడి ముందుకు సాగుతాయి. ఆయన లోనికే తిరికి నిష్క్రమిస్తాయి. వాటి ఉనికికి, ఫలితాలన్నిటికీ, ఆధారము, నిగూఢ లక్ష్యము ఆయనయే. ఈ దివ్యత్వము కోసం, దివ్యపురుషుని కోసం, సమగ్రయోగంలో దివ్యభక్తి పొంగింపబడి ఉద్ధరింపబడుతుంది. పరిపూర్ణ సమైక్యతా పారవశ్యంలో అతీతుడైన సర్వేశ్వరుని అన్వేషిస్తుంది. ఇది వైశ్వానికం universal. సర్వజీవుల లోను, ప్రతి సందర్శనంలోను విశ్వజనీనమైన ప్రేమానందాలతో అనంతగుణ సంప

న్నదైన సర్వేశ్వరుని అన్వేషణ కొనసాగుతుంది. వ్యక్తికి, వ్యక్తికి మధ్య ప్రేమ ఉత్పన్నమవుతుంది. మానవానుబంధాలు వ్యక్తిగతంగా, సమిష్టిగా సుసంపన్నమవుతాయి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

దైవానికి చెందిన మూడు అంశాలు

దైవంలో మనకు మూడు అంశాలు కన్పిస్తాయి:

1. సకల జీవులకు, సకల భూత అంతర్నివాసిగా ఉండి, అంతటినీ, తన నుండి వెలువరించే విశ్వాత్మ మరియు విశ్వపురుషుడు. అయితే ఇప్పటికిపుడు మాత్రం అంతా అజ్ఞానపరమైన ఆవిష్కరణగానే వున్నది.
2. ఆ దైవమే మన ఆత్మ, మన ప్రభువు. ఎప్పటికపుడు అతని సంకల్పాలను గ్రహిస్తూ, ఆ సేవలోనే మన ప్రతి కదలికనూ వ్యక్తం జేస్తూ, అందుకనుగుణంగా జీవించాలి మనం. అపుడే మనం అజ్ఞానం నుండి బయటపడి ఆ వెలుగుదిశగా పురోగమించగలం.
3. ఆ దైవమే సకలానికీ అతీతం, ఆధారం; ఆనందం మరియు ప్రకాశం; దివ్య జ్ఞానం మరియు శక్తి. ఆ మహోన్నత ఉనికి వేపుగా, ఆ మహర్జ్యోతి దిశగా, అనుక్షణం ఎదుగుతూ ఆ నిజతత్వాన్ని కిందికి మన భౌతికజీవితాలలోకి, చేతనలోకి క్రమక్రమంగా తీసుకురావాలి.

మన సాధారణ స్వభావంలో, అజ్ఞానంతోనే ఉంటూ మనం దైవాన్ని కనుగొనలేము. ఈ మన స్వాభావిక, సాధారణ శక్తులన్నీ అదివ్యమైనవే (undivine). ఏలన ఆ దైవాన్ని మన కోరికలు, అహంకారం ఒక ముసుగులాగా కప్పివుండడం చేత, మనకు ఆ దైవం తెరల మాటునే తెలియకుండా వుండిపోయింది. దైవంతో కూడిన ప్రగాఢమైన చేతనలో ఉండాలనుకుంటే మనలో దివ్యశక్తి క్రియాశీలంగా వుంటూ, మన చేతనను దివ్యప్రకృతిగా మార్చాలనుకుంటే మనం ఈ నిమ్నప్రకృతి నుండి బయటపడక తప్పదు.

దైవం పట్ల ఈ భావంతో మన జీవనగమనం ప్రారంభమైనపుడు, మన చేతన ఇందుకు ఉన్మీలనమై ఉండి ఉన్నప్పుడు, మనం వాంఛించే నిజమైన సిద్ధి లభిస్తుంది.

మూలం: శ్రీఅరవిందులు
స్వేచ్ఛానువాదం: కొంగర భాస్కరరావు

దైవం గురించిన సమగ్రభావన

దైవంయొక్క సమగ్ర స్వరూపభావనతోనే సమగ్రయోగాన్ని సాధన చేసే ప్రయత్నం చేయాలి. పరిధులు లేని ఆ దైవాన్ని తెలుసుకుందుకు చేసే మొట్టమొదటి ప్రయత్నం, సంకుచిత పరిమితులు లేని, సాధనాయోగ్యమైన హృదయంలో, ఒక గొప్ప విస్తృత ఆకాంక్షను కలిగి ఉండడం. అది మొదటి మెట్టు. మతపరమైన విభజనతో పాటు, తత్త్వపరమైన ఏకపక్ష సిద్ధాంతాలని కూడా మనం వదలివేయాలి. అవ్యక్తుడు, అనిర్వచనీయుడైన సర్వేశ్వరుని ఒకే మానసిక ఆధారసూత్రంలో బిగించి పరిమితం చేయకూడదు. సృష్టి సర్వాన్ని తన కౌగిలిలో ఇముడ్చుకునే ఆ సహజవ్యాప్తస్థితిని తెలుసుకుంటూ, అన్నింటిని అధిగమించే ఆ ఎల్లలు లేని అనంతానికి జాగృతమై ఉండడమే ఈ యోగాన్ని నడిపించే చైతన్యవంతమై, గమనశీలమైన భావన, ప్రేరణ కలిగించే సంవేదన ... దీనితోనే మన యోగం ప్రారంభింపడగలగాలి. స్వేచ్ఛాయుతము, సర్వశక్తిమంతము, పరిపూర్ణము, దివ్యానందకరము అయిన ఆ ఏకైకునితో దివ్య ఏకత్వ దిశగానే మన దృష్టి సారించాలి. సర్వవ్యాప్త సృష్టికి మూలమై, సర్వజీవుల ఉనికికి అనుకూలమై, అందరిలో తానుగా, తన్ను అందరి లో నిలుపుకున్న ఆ ఏకైక సత్యం, ఆ ఏకమే — అనేకమైన ఆ శాశ్వతత్వం మీదే ఉండాలి. ఆ ఏకైకునిలోనే అన్ని సత్యములు సంచలితమై ఉండి, మనుగడ సాగిస్తాయి. ఆ ఏకైకుని ద్వారానే అందరు సమైక్యం కాగలిగి ఒకరై ఉంటారు. అందరికి జీవనాధారమై, సర్వజీవులకు ఆధారభూతమై, సర్వ ప్రపంచాన్ని పాలించె, ఆ ఏకైక సర్వవ్యాప్త సత్యాన్ని... ఒక్కటిగా గుర్తించి, ఆ సమగ్రరూపాన్ని భావించి, విశ్వంలోని అణువణువులోను, ఆ ఏకత్వంతో, విభజనలేని ఐక్యతను సాధించడమే ఈ యోగ

లక్ష్యం. ఈ అనంతుడు ఏకకాలంలోనే రూపరహితమైన సర్వవ్యాప్త ఆత్మగానూ, వ్యక్తరూపంలో ఆత్మను స్పర్శించే ఓ అద్భుతశక్తిగానూ ప్రకటితమయయే అనంతసత్యంగాను తెలియబడతాడు. అపరిచ్ఛిన్నమైన అనంతంయొక్క విచ్ఛిన్న రూపాలే ఈ అనంతకోటి జీవరాసులు. పగిలిన అద్దంలోని ప్రతిబింబాలవలె, సర్వత్రా అతని రూపాలే వ్యాపించి ఉన్నాయి. అదే ఏకము — అనేకంగా ప్రకటించబడటం. ఈ సృష్టిలోని దివ్యమైనవి, దివ్యము కానివి రెండూ ఆ ఒకే ఒక సత్యానికి సంబంధించినవే. నామరూపరహితుడు ఎందుకంటె ఆతడు మనకు అనంత అస్తిత్వంగా, చైతన్యంగా, ఆనందంగా తెలుసుకోబడతాడు. అతడే అంతటికి మూలమై, సర్వ సృష్టికి ఆధారభూతమై ప్రాణదాతగా... మన ఈ భౌతికతత్వంలోని ఈ సత్తాలో, మనసులో, ప్రాణంలో, శరీరంలో... అతడే ఆత్మగా, పదార్థంగానూ ఉన్న ఏకైక సత్యం. అలాంటి సర్వవ్యాపక సర్వసమన్విత ఏకైక శక్తిని సమగ్రరూపంలో తెలుసుకోవడమంటె, ఏ పార్శ్వాన్ని వదలని సమగ్ర సత్యదర్శనాన్ని ఈ దృశ్యప్రపంచంలోనే, అనుభవాల ద్వారానే సాధ్యమౌతుంది. ఏకాగ్రతతో మనం అతడిని యోచన చేసినపుడు అతని ఉనికిని ఒక మేధాపరమైన విషయంగా తీసుకునే ప్రమాదం ఉంది. లేదా అతడిని అమూర్తత్వంగానూ భావించకూడదు. అందుకే తార్కికమైన ఆవశ్యకత ఏమిటంటె: లోచూపున్న ఆలోచన కావాలి; ఆ సచ్చిదానంద స్వరూపాన్ని మనం చూసే ప్రతి జీవిలో కొలువైన ఉనికిగా, మనలోని అంతరాత్మగా, అతడిని వీక్షిస్తూ, మన సర్వ కదలికల్ని అతనికి సంపూర్ణంగా సమర్పించాలి. ఆ సచ్చిదానంద స్వరూపుడే ఈ విశ్వస్థితులకు ఆధారం ఈ సర్వజీవులకు అతడే మూలం, అతడే ఈ జగదానందకారకుడు. ఆ ఆనందమే ఈ సృష్టిలోని సమస్త విషయాలను నడిపిస్తూ, వాటిని అధిగమించిన ఆ సత్యస్వరూపం. అతడే ఒక అనంత చైతన్యశక్తిగా, సర్వచైతన్యాలను, అనన్యరూపాలను, వాటి కదలికలను నడిపిస్తాడు. సర్వజీవుల్లో సజీవంగా, సత్వంగా, ఆనందంగా విలసిల్లే ఏకైక పరమాత్మ స్వరూపం. ఆద్యంతాలు లేని ఆతని అస్తిత్వం, ఈ సకల జీవుల క్రియాకలాపాలను భరించే విశ్వరూపం. ఆతని సంకల్పం పరిణామం వైపు మనల్ని నడిపిస్తూ, ఇంకా వ్యక్తం కాని, ఖచ్చితమైన అనంత సంభావ్యతలను నిజం చేస్తుంది. అతని కోసం మన సర్వశక్తుల్ని ప్రోదిచేసుకుని మన హృదయంలో అతడినే మన ప్రియతముడిగా, మన సార్వభౌమునిగా ప్రతిష్ఠించుకోవాలి. అతని కోసమే మన హృదయం స్పందిం

చాలి. ఆతని విశ్వప్రేమలోని మాధుర్యంలో సంచరించి, ఆ ఆనంద సముద్రంలో నడయాడాలి. ఎందుకంటె ఆత్మకు సహకరించినపుడు అతడు లోలోపలే ఆనందప డూతూ ఉంటాడు. అతడే మన అహం చేసే తప్పులు సహించి, అనుభవాలకు సహకరించి, జీవనయానంలో ఎన్నడూ చేయి విడువక, మన కష్టాలు, కన్నీళ్ళు, విచారం, అంతమయ్యేవరకు ఈ బ్రతుక్కి ఆధారంగా ఉంటాడు. అతని ప్రేమ అనంతమైనది. అది అనంత విశ్వప్రేమికుని దివ్యానంద ప్రేమసముద్రం. అంతు లేని వైభవం. ఆ ప్రేమ అన్ని విషయాలను, వారి వారి మార్గాలను, తన వైపు తిప్పుకుని, మన లక్ష్యాన్ని మెరుగుపరచి, నడిపించి, చివరకు ఆ దివ్యచైతన్య మహాసాగరంలో సంగమింపచేస్తుంది. అదే ఏకైక శక్తియొక్క లక్ష్యం. అదే సచ్చి దానందస్వరూపం యొక్క నిజతత్వం. ఆ అదృశ్యశక్తి ఏదైతే నడిపించి, మనల్ని పరిపూర్ణం చేస్తుందో, ఆ శాశ్వత సత్యం పైనే మన చెదరని సంకల్పాన్ని నిలుపు కోవాలి. రూపరహితంగా ఉన్నప్పుడు ఆ చోదకశక్తి స్వయంప్రకాశమైన జ్ఞానంగా సర్వఫలితాలను తనలోనే నింపుకొని, ప్రశాంతంగా తన కార్యం సాధించేవరకు పనిచేస్తుంది. రూపధారణలో వ్యక్తమైనపుడు అతడే సర్వశక్తిమంతుడైన యోగాచా ర్యునిగా తన లక్ష్యాన్ని సాధించేటప్పుడు అతడిని ఏ శక్తీ అడ్డుకోలేదు. వ్యక్త-అ వ్యక్త తత్త్వాలలో ఆ సచ్చిదానందస్వరూపాన్ని అర్థంచేసుకొని, ఆ మార్గంపై విశ్వాసంతో సాధకుడు తన అన్వేషణని, సాధనని ప్రారంభించాలి. ఎందుకంటె ఆ దైవాన్ని చేరే మార్గంలో, ఆ సాధనలో మనసుచేత నడిపించబడే మనిషి తప్పనిస రిగా విశ్వాసాన్నే ఆధారంగా చేసుకుని ముందుకు నడవాలి. ఆ సత్యాన్ని తెలుసు కున్నపుడు ఆ విశ్వాసం దివ్యత్వాన్ని ప్రతిఫలింపచేసే, పూర్ణమైన ధృడత్వంగా, శాశ్వతమైన జ్ఞానప్రకాశంగా పరివర్తన చెందుతుంది.

మూలం: శ్రీఅరవిందులు

భావానువాదం: డి. సత్యవాణి

విశ్వాసం పట్ల మనం సరైన దృక్పథంతో ఉన్నామా, — బాహ్యదృక్పథమైనా కూడా ఏమిటో తెలుసుకోవడం చాలా ముఖ్యం. విశ్వాసం అత్యంత మహత్తర మైన విషయమని, విశ్వాసమే ఒక అద్భుతమని, అద్భుతాలను సృష్టించగల అధ్భు తమని మనుష్యులకు తెలియదు.

శ్రీమాత

భక్తి వికాసము

ప్రశ్న: స్వచ్ఛమైన, మరియు సంపూర్ణభక్తి పొందుట ఎట్లు?
మొదట నిలకడ పొందు; తర్వాత, ఆ నిలకడ నుండి — ఆకాంక్షించు. నిన్ను నీవు తెరుచుకో, శ్రీమాత వైపు — నిలకడగా, మనస్ఫూర్తిగా.

మానసికాందోళన నిన్ను భయభ్రాంతుని చేయనీయకు. నిరీక్షించు — శ్రీమాత శక్తి నీలో పనిచేసేవరకు; అది నీ హృదయకమలాన్ని తెరిచేవరకు. పైనుండి వెలుగులో 'భక్తి' నీలో వికసిస్తుంది.

*

భగవంతుని సేవకుడు కావడం కొంతవరకు మంచిది. భగవంతునికి పూర్తిగా లొంగి ఉండి, ఆయనకు బానిసైపోవడం, ఇంకా ఉత్తమం.

*

ప్రేమ చిగురిస్తుంది మనలో, అనేక మార్గాల్లో —
1. ప్రేమికుని లేదా ప్రేయసి అందానికి మేల్కొవడం ద్వారా;
2. ప్రేమికునిలో ఒక ఆదర్శ ముఖం లేదా దాని ప్రతిబింబం మన దృష్టికి రావడం ద్వారా;
3. ప్రపంచంలో అనేకవేల ముఖాల మధ్య, ప్రేమికుడు తనను గురించి మనకు అందించే మార్మిక సూచనల ద్వారా;
4. హఠాత్తుగానో లేదా నెమ్మదిగానో — హృదయానికి ఏర్పడే అవసరం వల్ల;
5. లీలగా ఆత్మలో ఏర్పడే ప్రేమదాహం వల్ల;
6. ఎవ్వరో మన దగ్గరుండి, మన వెంటబడుతున్నట్లుండే అనుభూతి వల్ల;
7. లేదా అందమైన, ఆనందకరమైన వారెవరో — మన మన్వేషించి తెల్సుకోవల్సినవారెవరో — మన వెంటబడ్తున్న లేదా తమ వైపు లాగుకొనుచున్న — అనుభూతివల్ల — ప్రేమ చిగురిస్తుంది, మనలో.

మనం చూడని ప్రేమికుని కూడ — మనం ప్రేమలో, అనురాగంలో అన్వేషించవచ్చు. అదే విధంగా, ఆ ప్రేమికుడు కూడ — మనం ఎప్పుడూ ఆలోచనైనా చేయని ప్రేమికుడు కూడ — మనల నదే విధంగా అన్వేషించవచ్చు; అతడీ ప్రపంచం మధ్యలో, హఠాత్తుగా, మన వద్దకు రావచ్చు. మొదట్లో, మన

కిష్టమున్నా లేకపోయినా — అతడు తన ప్రేమకోసం, మనలను నిర్బంధించవచ్చు. ఒక్కొక్కప్పుడు — మొదట్లో — అతడొక శత్రువుగా, తీవ్రకోపంతో, మన వద్దకు రావచ్చు. మన సంబంధాలు — అతనితో — ఘర్షణ, యుద్ధంతో ప్రారంభం కావచ్చు. ఎక్కడైతే ప్రేమ, ఆకర్షణ ఉంటుందో — అక్కడ దైవానికి, జీవాత్మకి మధ్య సంబంధాలు — సుదీర్ఘంగా ఉంటాయి; అవి వేరు వేరు నమూనాల్లో, వేరు వేరు స్థాయిలలో, వేరు వేరుగా ఉంటాయి — ఎప్పుడూ ఒకే విధంగా ఉండవు. అవి — అపార్థాలతో, నేరాలతో, అసూయ, కోపతాపాలు, ప్రేమకలహాలతో, ఆశనిరాశలు, ఎడబాటు, విరహబాధలతో — కూడి ఉంటాయి. హృదయావేశాలన్నిటినీ — అతనిపై (ప్రేమికునిపై) విసురుతాము. అవన్నీ — ఏకత్వం యొక్క — ఆనందం, పారవశ్యం, ఉత్కంఠగా — పరిశుద్ధమయేవరకు —-అలా చేస్తూనే ఉంటాము. కాని ఇది కూడ విసుగనిపిస్తుంది. పరిపూర్ణ ఏకత్వం — దివ్యప్రేమ ఆనందంలో వైరుధ్యాలను చెప్పడానికి — మన సత్తాలో ఉన్నత నిమ్న శరీరాభాగాలు రెండింటిపై ఈ ఆనందపు వెల్లువ ఉంటుంది. ఈ విషయంలో — బుద్ధి, జీవములు — మన జీవాత్మ క్షేమాత్రం తీసిపోవు. మన భౌతికశరీరం కూడ తన వంతు ఆనందాన్ని పొందుతుంది; దాని స్పర్శను అనుభూతి చెందుతుంది. ఈ ఆనందం — అన్ని అంగాల్లోను, నరాలు, రక్తనాళాల్లో కూడ — నింపబడ్తుంది. ఆనందపారవశ్యం, ఉత్కంఠ — అనబడే అమృతం — వీటన్నిట్లో ప్రవహిస్తుంది. దివ్యప్రేమానందాలు సత్యానికి పరమపదం. అంతిమ రహస్యం. మర్మాలలో కెల్ల మర్మం

భగవంతుడు — సర్వజీవులకు దివ్యస్నేహితుడు (సనాతన మిత్రుడు). ఆ జీవులు — అత్యున్నత స్వర్గానికి సంసిద్ధులయే వరకు — అతడు — శత్రువనే ముసుగులో, తన స్నేహాన్ని మరుగుపరుస్తాడు. తర్వాత, 'కురుక్షేత్రం' లో వలె — సంగ్రామము, వినాశనము, బాధలకు 'ప్రభు' వైన తన భయంకరరూపాన్ని ఉపసంహరిస్తాడు. తన తీయని ముఖాన్ని, సుకుమార శరీరాన్ని — భక్తులచే తరచు ఆలింగనం చేసుకోబడే తన శరీరాన్ని — శ్రీకృష్ణ శరీరాన్ని — దివ్యకాంతులతో, సనాతన మిత్రుడుగా, చెలికాడుగా, కకావికలమైన హృదయంలో పరిశుద్ధ నేత్రాల ఎదుట సాక్షాత్కరింపచేస్తాడు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: యస్. వై. సోమయాజులు

ప్రారంభం నుండే హృదయం ఆకాంక్షించే పరిపూర్ణతను అంతటినీ చేజిక్కించుకొనడం సాధ్యం కాకపోవచ్చు. నిజానికి మన మేధస్సు, మన సహజస్వభావము, మన భావమయ మనస్సు మన గత జీవితానుభవాల ద్వారా గొప్పగా ఉన్నతంగా అభివృద్ధి చెందివుంటే అది సాధ్యం కావచ్చు. అందువల్ల మన సాధారణ జీవితం, మానసికంగా, సాంస్కృతికంగా, రసాత్మకంగా, భావాత్మకంగా విస్తృతం కాబడి, వాటి అనుభవాన్ని పొంది వుండాలి. ఇలాంటి స్వానుభవం సామాన్య మానవుని సంస్కరిస్తుంది. అప్పుడతడు ఆ పరాత్పరుని సత్యగ్రహణకు సులభంగా ఉన్మీలితుడవుతాడు. అంతట ఆ పరాత్పరుడు తన అభివ్యక్తీకరణకి తగిన దేవాలయంగా అతన్ని మలచుకొంటాడు. సాధారణంగా మనిషి తన స్వీయ సత్వభూమికలన్నింటిలో పరిమితుడు. తొలుదొల్తగా అతడు తన స్వభావంతోను, తోటి మానవులతో తన గత సంగమాల వల్లను, అభివృద్ధితో కూడిన పరిణామశీలమైన అనుభవాన్ని పొందగలుగుతాడు. అందువల్లనే, భగవంతుడు కూడ తొలుత తన దివ్యస్వభావగుణాలను, పరిమిత ప్రమాణాలతోనే మనకు సాక్షాత్కరిస్తాడు. దైవం, తన పరాత్పరత్వాన్ని సాధకుడు గ్రహించే రీతిలో, అతని హృదయస్పందనలకనుగుణంగా తన్ను తాను నామరూపాలతో ప్రదర్శించుకొంటాడు. దీనినే యోగంలో మనం ఆరాధించుకొనే మన యిష్టదేవత అంటారు. ఈ విధంగా మానవుడు తన ఇష్టదేవతామూర్తిని తన కిష్టమైన స్తోత్రాలతో ప్రస్తుతిస్తూ కౌగలించుకొని ఆరాధిస్తాడు. ఆ ఆరాధకునికి, ఆ మూర్తి ప్రత్యక్ష సజీవ దైవంగా గోచరిస్తాడు. అలాంటి దైవరూపాలే విష్ణువు, శివుడు, కృష్ణుడు, కాళీమాత, దుర్గాదేవి, ఏసుప్రభువు, బుద్ధుడు మొదలైనవారు. ఆ దేవతామూర్తుల రూపాలనే ఆరాధకుని మనస్సు ఆరాధనకు ఏకాగ్రతతో పట్టుకొనగలుగుతుంది. నిరాకార దైవాన్ని రూపరహితంగా ఆరాధించే భక్తునికి కూడ దైవం మానసికరూపాన్నో, గుణాన్నో, ప్రకృతిరూపాన్నో అనుగ్రహిస్తాడు. వాటి ద్వారా అతడు దైవాన్ని కలుస్తాడు. కాని భక్తుడు దైవాన్ని ప్రత్యక్షంగానో, మనోరూపంగానో దర్శించగలిగితే అతడు భగవంతునితో మరింత సన్నిహితత్వాన్ని, మాధుర్యాన్ని చూడగలుగుతాడు.

సమగ్ర భక్తి యోగమార్గంలో సాధకుడు దైవభావనను విశ్వాత్మకం చేయాలి.

సర్వభూతనివాసిగా భావించి, సర్వభూతాలతో మైత్రి కలిగి వుండాలి. విశ్వంతో, వ్యక్తులతో ఆంతరంగిక సాన్నిహిత్యాన్ని ఏర్పరచుకొని వుండాలి. దైవానికి అహంకారరహిత సంపూర్ణ ఆత్మసమర్పణం గావించుకొన్నవాడై వుండాలి. అప్పుడే, దైవం మనకు దగ్గరగా, మనలో వుంటాడు. మనం కూడా ఆయనతోనే ఆయనలోనే వుంటాం.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదము: బి. నరిసింహయ్య

పై వెలుగు మననుంచి ఆశించేదేమిటి?

ఇంకా మనకు తెలియనిదాని మీద ఏకాగ్రత నెలా సాధించగలం? అయినప్పటికీ, ఆయన మీద, మనం, మన సత్వంలో ఏకాగ్రత సాధించకుండా దైవాన్ని తెలుసుకోలేం. ఆ ఏకాగ్రతగల మనలోను, అదే విధంగా మనకు ఎరుక కాబడిన సర్వే సర్వత్రా ఏకైకునియొక్క నిరంతర దివ్యసాక్షాత్కారానుభూతి కలగాలి. అదే మా ఉద్దేశంలో, జ్ఞానయోగం కోసం మనం చేసే కృషికి పరాకాష్ఠ. మనం పూర్తిగా సమయాన్నంతా శాస్త్రాలు చదవటానికి వినియోగించినా, లేదా మానసికంగా దైవాన్ని తత్వశాస్త్ర పాండిత్యప్రకర్షతో అర్థం చేసుకోవటానికి పూనుకున్నా సరిపోదు. ఎందువల్లనంటే, మన సుదీర్ఘ మానసిక పరిశ్రమ చివరకి శాశ్వతుని గురించి చెప్పబడినదంతా మనం తెలుసుకోగలిగినా, అనంతుని గురించిన మానసికావగాహన పొందవలసినదంతా పొందినప్పటికీ మనకు ఆయన గురించి, ఏమాత్రం తెలియదనే విషయం అవగతమౌతుంది. శక్తివంతమైన యోగంలో ఈ విధంగా మేధోపరంగా తెలుసుకోవలసినది తెలుసుకోవటం ఒకరకంగా మొదటి దశ కాగలదు, కానీ అనుల్లంఘనీయం కాదు; అదే పద్ధతి అందరికీ అవసరమూ కాదు, లేదా అదే విధంగా ఆచరించమనీ అనలేము. మేధాసంపత్తికి సంబంధించిన జ్ఞానం, సహేతుకంగా తర్కించి, చింతించి, హేతుబద్ధంగా పొందేదే అయి ఉండి, అదే ఆవశ్యకమై, నిబంధనగా లేదా, సంసిద్ధతకు బద్ధుణ్ణి చేసేదిగా ఉంటే, అలాంటి జ్ఞానంవల్ల యోగమనేది అసాధ్యమే అవుతుంది. కొంతమంది విషయంలో మినహాయించి, అసలు మన నుంచి పైనుండే దివ్యతేజస్సు అభిల షించేది, తన పనిని మొదలుపెట్టటాని

కి, జీవాత్మ నుంచి పిలుపు, అందుకు మానసికంగా అవసరానికి తగినంతగా ప్రోత్సాహం, సంసిద్ధత. గట్టి పట్టుదలతో, ఆలోచన దానికి అనుగుణంగా గతిశీల ప్రధానమైన భాగాలలో అంతటా ఇచ్ఛాశక్తిని, ఆకాంక్షను, విశ్వాసాన్ని — వీటితో హృదయంలో దైవేచ్ఛాభావన యొక్క ఆవశ్యకతను నింపుకొని, తద్వారా ఈ ప్రోత్సాహాన్ని పొందవచ్చును. అవన్నీ సమశ్రుతిలో, సమానమైన లయలోను ఉన్ముఖం కాలేకపోవచ్చును. అటువంటి సందర్భాలలో వీటిలో ఏదో ఒకటి నాయకత్వం వహించవచ్చు లేదా ప్రబలంగా ఉండవచ్చు. ఈ దైవీచింతన మొదట్లో ఉండవలసిన స్థాయిలో ఉండకపోవచ్చు, ఉండదు కూడా; ఆకాంక్ష సంకుచితంగాను, అసంపూర్ణంగాను ఉండవచ్చు; విశ్వాసం చాలినంత ప్రకాశమానంగా ఉండకపోవచ్చు లేదా సాయంసంధ్యను పోలి ఉండవచ్చు, భద్రమైన జ్ఞానం అనే పునాది మీద సురక్షితంగా ఆధారపడి ఉండకపోవచ్చు, సంశయాత్మకమై, అనిశ్చితమై తేలికగా తరిగిపోయేది కావచ్చు; అనేక పర్యాయాలు అది ఆరిపోయిన దీపం కావచ్చు. కొండల మధ్య ఇరుకుదారులలో తీవ్రమైన గాలి మధ్య అతికష్టం మీద వెలిగించే కాగడా మాదిరిగా తిరిగి వెలిగించవలసినదిగా ఉండవచ్చు. కాని, ఒకసారిగ గనుక ధృఢ సంకల్పంతో అంతరాంతరాలలో నుంచి ఆత్మ ఏకాగ్రత నొంది, లోపిలుపుకు జాగృతమయితే, ఇవన్నీ తగుమాత్రంగా ఉన్నా కూడా, దైవకార్యానికి కావలసినంత సాధన సంపత్తి సమకూర్చ గలిగేవి కాగలవు. ఆ కారణంగానే విజ్ఞులు దైవం దిశగా మనిషి వెళ్ళే మార్గాలకు హద్దులను ఏర్పరచడానికి ఎప్పుడూ ఇష్టపడరు; ఎంత ఇరుకైన ప్రవేశద్వారామైనా, అతిచిన్నదై అత్యంత అంధకారంతో కూడినదైనా, ప్రక్కదారియైనా, ప్రవేశద్వారం అత్యంత నిరాడంబరమై, అల్పమైనదిగా ఉన్నా, ప్రవేశాన్ని వారు అడ్డగించరు. ఏ పేరైనా, ఏ రూపైనా, ఏ ప్రతీకైనా, ఏది సమర్పించినా, అక్కడ దానితోపాటు భగవదర్పణాభావం ఉంటే అది అర్థమైనదే అవుతుంది. ఎందువల్లనంటే, దైవం తనను తాను తెరుచుకుని, ఆ నివేదనను, స్వీకరించేందుకు, కొలువై ఉంటాడు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా. టి. ప్రసన్నకృష్ణ

భగవంతునితో నిరంతర సంయోగం

(బాహ్యము మరియు ఆంతరంగికము)

ఈ భక్తిమార్గానికి అత్యావశ్యకమైనది మననము, దర్శనము. అన్నింటియందు ఆయన (సర్వాంతర్యామి) గురించిన నిరంతర ధ్యాస, మరియు సర్వదా సర్వత్రా ఆయననే దర్శించుట. దివ్యభౌతికసృష్టిలో విషయాలను దర్శించినపుడు, వాటిలో దివ్యప్రేమైకమూర్తినే మనం దర్శించాలి. మనుష్యులను, యితర జీవకోటిని చూచినప్పుడు, వారిలో అతని దివ్యరూపాన్నే చూడగలగాలి. వాటితో మనకు ఉండే సంబంధబాంధవ్యాలూ, దివ్యంగానే ఉండాలి. మనకు తెలిసిన భౌతికాతీత ప్రపంచపు పరిధులను ఛేదించుకొని అధిగమింపబూని, వాటి కావలి భూమికలలో నున్న జీవులతో, సంబంధాలు యేర్పరచుకున్నప్పుడు కూడ అటువంటి దివ్య ఆలోచన, దివ్య దృక్పథాలే మన మనసులో నిజంగా మెదలాలి. మామూలు అలవాటు ప్రకారం మన మనసులు, బాహ్యమైన, భౌతికరూపాలను దర్శించేటపుడు వాటి సాధారణ అవకతవకల సంబంధాలను గ్రహించగలవుగాని, ఒక నిగూఢ అంతరంగ దైవత్వాన్ని గ్రహించలేవు. ఈ అలవాటుకు బదులు, ఒక లోతైన, విస్తారమైన మహత్తర సంబంధం నెలకొల్పబడిన నిరంతర సర్వపరివ్యాప్త ప్రేమానందాలతో కూడిన అవగాహన చోటు చేసుకోవాలి. దేవతలందరిలో యే ఏకైక దైవాన్నైతే మనం హృదయపూర్వకంగా నిలువెల్లా నిండిన ఆర్తితో పూజిస్తామో, అతడినే అందరిలోను చూడగలగాలి. వారందరూ కూడ ఆ ఏకైకుని దివ్యత్వపు ప్రతిరూపాలే. మన ఆధ్యాత్మిక ఆలింగనా పరిధిని, ఆ విధంగా విస్తృతపరుస్తూ పోతే, సర్వం, సర్వభూతనివాసి ఆయనే అనే స్థితికి చేరుకుంటాము. అట్టి చైతన్యం వలన సమకూరే మనోజ్ఞత నిరంతరాయంగా ప్రపంచాన్ని దర్శించే మన సాధారణ రీతి అవుతుంది.అది మనకు బాహ్యంగా ప్రస్ఫుటమయ్యే దానికంతటికీ సర్వాంతర్యామిత్వ సంయోగాన్ని చేకూరుస్తుంది.

అంతర్గతంగా మనలో అధివసించియున్న మన ఇష్టదైవము యొక్క ప్రతిరూపాన్ని తన స్వమందిరంలో నివసిస్తూన్నట్లే మనలో నివసిస్తున్నట్లు, మన అంతర నేత్రానికి గోచరించాలి. మన హృదయాలకు అతని సాన్నిధ్య మధురానుభూతిని అందించాలి. మన అస్తిత్వపు శిఖరాగ్రమునందు ఉపవిష్టుడై ఒక స్నేహితునిగా,

ఒక ప్రభువుగా, ఒక ప్రియుడిగా మన జీవితపు మానసిక మరియు ప్రాణిక కార్యకలాపాలన్నింటి పైన ఆధిపత్యము వహిస్తూ మనలను విశ్వవిలీనుడైన తనతో సంయోగపరచాలి. ఒక నిరంతర అంతరంగ సంయోగ ఆనందానుభూతి మనకు చేరువ కావాలి. అది మనకు శాశ్వతమై, అజేయమై నిలవాలి. ఈ సంయోగం మనం మన లౌకిక వ్యవహార నిర్వహణనుండి విడివడి పూర్తిగా అంతర్ముఖులమైనప్పుడు కలిగే ఒక ప్రత్యేకమైన సన్నిహిత సామీప్యానుభూతికి, ఆరాధనకే పరిమితం కారాదు. మానవులుగ మనం నెరవేర్చవలసిన కార్యకలాపాలను ఆపివేసి అట్టి అనుభవప్రాప్తి కోసం వెంపరలాడకూడదు. మన ఆలోచనలు, ప్రేరణలు, భావనలు, కర్మల నన్నింటిని అతని అనుమతికో లేక నిరాకరణకో నివేదించాలి. ఈ స్థితికి మన మింకా చేరుకోలేకపోతే, అతను మన అంతరంగం లోనికి మరింత యెక్కువగా అవతరించి వాటన్నింటిలోను తన ఉనికిని చాటి, తన పూర్ణ సంకల్పబలాన్ని, శక్తిని, వెలుగును, వికాసాన్ని, ప్రేమను, ఆనందాన్ని వాటిలో వ్యాపింపజేయుటకు వీలుగ, మన ఆకాంక్షను ఒక ఆహుతిగ అతనికి అర్పించాలి. చివరకు మన ఆలోచనలు, భావనలు, ప్రేరణలు, కర్మలు సర్వము అతని నుండి దివ్యబీజాలుగా జాలువారి, వాటి ఆకృతులుగా రూపొందుతాయి. మన అంతరంగ జీవనమంతటిలో మనము అతనిలో ఒక భాగమే అనే చైతన్యస్ఫూర్తి మనలో కలిగి, మన మారాధించే భగవంతుని ఉనికికి మన జీవితాలకు మధ్య యెలాంటి భేదం వుండనంత వరకు అది ఫరిఢవిల్లాలి. అదే విధంగా అన్ని సంఘటనలు ఆ దివ్యప్రేమికుడు మనతో సలిపే వ్యవహారాలుగ గ్రహించాలి. వాటిలో ఎలాంటి ఆనందాన్ని పొందాలంటే, దుఃఖము, విచారము, శారీరకమైన బాధ కూడ అతనిచ్చే బహుమతులై, ఆ దివ్యసంపర్క భావనతో సమూలంగా నిర్మూలించబడి, సంతోషదాయకాలుగ మారి తుదకు ఆనందాంబుధిలో లయమైపోవాలి. ఎందుకంటే ఇదంతా ఆయన స్పర్శవల్ల రూపాంతరీకరణ కావింపబడిన అత్యద్భుత పరిణామకారక రసాయన ప్రక్రియ.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదము: అందుగులపాటి కైలాసపతి, జానకి

మానవజీవితంలో ఏడు పరమానందాలు

చింతనలు సూక్తులు

గురువుగా దైవానికి శిష్యత్వము, తండ్రిగా భగవంతునికి పుత్రత్వము, మాతృమూర్తి వాత్సల్యము, సఖునిగా దైవ కరస్పర్శ, చెలికాడుగా, సహవాసిగా కేళీవినోదాలు, యజమానిగా దైవానికి చేసే సేవాసుఖము, ప్రియునిగా భగవంతుని కిచ్చే అనురాగ పారవశ్యము, ఈ ఏడూ కూడా మానవశరీరంతో జీవితంలో అనుభవించే పరమానంద స్థితులు. నీవు వీటిన్నటినీ కలిపి ఒక సప్తవర్ణాల హరివిల్లుగా అనుసంధానం కావించగలవా? ఇక అప్పుడు, నీకు వేరే స్వర్గ మెందులకు! అద్వైతానంద దాస్యవిముక్తి నధిగమిస్తావు.

*

పురాతన సెమెటిక్ తెగలవారు భగవంతుని ఒక రకమైన హోదాతో కూడిన కఠినమైన పరిపాలకునిగా, గంభీరమైన న్యాయనిర్ణేతగా, ప్రమోదరహితునిగా చిత్రించి మానవులను దుఃఖభాగుల్ని చేశారు. కానీ కృష్ణుని చూసిన మనకి మాత్రం అతను ఆడేపాడే బాలునిగా, నవ్వులు చిందించే అల్లరిశిశువుగా కనిపిస్తాడు.

*

బలహీనమైన ఓ మూర్ఖుడా! నీ భయభ్రాంతులు భగవంతుని కాపాదించి, ఆయనను దర్శించకు. ఆయన ముందు దీనుడవై ఉండకు. సరిగా చూడు! ఆయన నీకు గంభీరుడైన పాలకుడుగా, న్యాయాధీశుడుగా నీకు కనిపించడు. సరికదా, ఒక దివ్య ప్రేమైకమూర్తి యొక్క ముఖారవింద దరహాసాలే నీకు దర్శనీయ మవుతవి.

*

మాయావాది వ్యక్తిత్వానికి అతీతంగా, ఇదమిద్ధమని చెప్పలేని దివ్య అస్తిత్వాన్ని చూస్తాడు. నేనూ అతన్ని అనుసరించి చూశాను. ఆ అనిశ్చిత అస్తిత్వానికి మించి అతీతంగా నా కృష్ణుని గమనించాను.

*

జగన్మిథ్య అంటూ ఈ ప్రపంచాన్ని నిరసించే వేదాంతులు తెలివితేటలూ, నియమనిష్టలూ కలవారే. కానీ ఒక్కొక్కసారి వాళ్ళు కొంచెం తెలివితక్కువవాళ్ళని అను

కోవలసి వస్తుంది. ఎందువల్లనంటే వాళ్ళు తేలికగా భగవంతునిచే వంచింపబడు తూంటారు.

*

భగవంతుడనే సర్వోన్నత ఉత్కృష్ట దివ్యభావానికి క్రీనీడ లాంటిది నాస్తికవాదము. భగవంతుని గురించి మనం సూత్రీకరించుకొన్న ప్రతి దివ్యభావన ఒక ప్రతీకగా నిజమే అయినప్పటికీ, అదే సమగ్రమైనది అని అనుకుంటున్నప్పుడు అది అవాస్త వంగా లేదా పొరపాటుగా పరిణమిస్తోంది. దీనిని మనకు గుర్తు చేయటానికే నాస్తి కులు, నిరీశ్వరవాదులు వస్తూంటారు.

*

నా ప్రేమికుడు పాపమనే తొడుగుని వైదొలగించినపుడు నేను సంతోషంగా దాన్ని జారవిడిచేశాను. ఆ తర్వాత అతను సుగుణాలనే వస్త్రాన్ని తొలిగిస్తుంటే సిగ్గని పించి కలవరపడి వారించాను. అతను దాన్ని బలవంతాన లాగిపారేసినప్పుడు గానీ, నా జీవాత్మ నా నుంచి ఎలా దాక్కొని ఉందే నాకు తెలియరాలేదు.

*

జీవితం, జీవితం, జీవితం అంటూ గాఢావేశాల ఘోష విన్నాను. అందుకు జీవాత్మ సమాధానం దైవం, దైవం, దైవం అని. నీవు జీవితాన్నే దైవమని ప్రేమించినప్పు డు, నీ జీవితమే కచ్చితమైన, నిజమైన ఆనందం కాగలుగుతుంది.

*

క్షుద్ర కీటకాలను, దుష్ట నేరస్థులను ప్రేమించలేని వాడివి, నీవు నీలో ఉన్న భగవం తుని అంగీకరించి, ఎలా నమ్మగలవు?

*

నడక నేర్చుకునే పిల్లలు ఆలంబన లేకుండా నిఠారుగా నిలబడి తల్లి తమను పట్టు కోవాలని ఏ విధంగా తహతహలాడుతారో ఆ విధంగా మనం అజ్ఞానావస్థలో మన విజయాలకు గర్విస్తాము. మేల్కొని తెలిసొచ్చిన తర్వాత, వెనక్కి తిరిగి చూసు కుంటే ఎల్లప్పుడూ భగవంతుడే మనని నిలబెట్టి నడిపిస్తున్నట్లు గమనిస్తాము.

*

నేను దివ్యభక్తుడనూ కాను, జ్ఞానినీ కాను. భగవంతునికి భృత్యుడనూ కాను. మరి నేను ఎవరిని? దివ్య యజమాని చేతిలో ఉపకరణాన్ని. గోపబాలకుడు ఊదే మురళి

ని. ప్రభుని ఊపిరితో కదలాడే ఆకును, అంతే.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అమరవాది ప్రభావతి, అమరవాది వెంకటరామశాస్త్రి)

భక్తుని దైవీ స్వభావం

దైవీ స్వభావం అంటే యేమై ఉంటుంది? ఈ మార్గాన్ని (భక్తి) అనుసరించి, నిత్యు డైనవానిని ఆరాధించుటకు పూనుకొనిన భక్తుని చేతన, అస్తిత్వం యొక్క మహనీయస్థితి యెలా వుంటుంది? సమత, నిష్కామస్థితి, ఆత్మ స్వేచ్ఛలపై నొక్కి వక్కాణిస్తూ, జరుగవలసిన పరివర్తనల గురించి గీత అనేక శ్లోకాల్లో చెవులు చిల్లులు పడేట్లు చెప్పింది. ఇదే సదా మన ఆధారపీఠంగా ఉండాలి. అందుచేతే ప్రారంభం లోనే ఆ విషయాన్ని గురించి అంత ఒత్తి చెప్పటం. స్థిరమైన సమతను విశాల పునాదిగాగల మహోన్నతమైన, మహోత్కృష్టమైన పరిపూర్ణత వైపుగా సాగే శక్తి, ఉత్సాహాలను, పురుషోత్తముని యెడల ప్రేమ, ఆరాధనలు, పెంచి పోషించాలి. ప్రాథమికమైన ఈ సమచేతనకు సంబంధించిన అనేక సూత్రాలు ఇక్కడ వివరించ బడ్డాయి. మొట్టమొదట నిరహంకారస్థితి ఉండాలి, నేను, నాది అనే స్థితి లేకుండా పోవాలి, నిర్మమోనిరహంకారః. అహంకారం యొక్క సంకుచిత గోడలను కూల్చి వేసే విశ్వజనీన మనస్సు, కారుణ్యము కలిగిన వాడు పురుషోత్తముని భక్తుడు. ఒక విశ్వజనీన ప్రేమ, ఆతని హృదయంలో నివాసమేర్పరచుకొని వుంటుంది. దాని నుండి సర్వాన్నీ ముంచివేసే మహాసాగరంలా, ఒక విశ్వజనీన కరుణ పొంగి ప్రవ హిస్తుంటుంది. సర్వజీవులతోనూ మిత్రత్వాన్ని నెరపుతూ వాటి యందు కరుణ కలిగి వుంటూ, ఏ జీవినీ ద్వేషించకుండా వుంటాడు. ఎందుచేతనంటే, అతడు యెంతో ఓర్పుగలవాడు, ఎంతటి బాధనైనా, ఎంతకాలమైన భరించువాడు, దేన్నైనా సహించి నిలచువాడు, క్షమాసముద్రుడు. నిష్కామము, బాధ, ఆనందాల యెడల, కష్టసుఖాల యెడల, ప్రశాంత, సమతాదృష్టి గలవాడు, సడలని ఆత్మనియంత్రణ గలవాడు, యోగి కుండవలసిన స్థిర, అచంచల సంకల్పం, నిశ్చయాత్మకత గలవాడు, మనస్సును తార్కికబుద్ధిని సంపూర్ణంగా చేతన, జ్ఞానాల ప్రభువైన సర్వేశ్వరునకు సమర్పణ గావించు భక్తిప్రేమలు కలిగినవాడు పురుషోత్తముని భక్తుడు.

లేదా అతడు వ్యాకులత, అలజడి నిండిన నిమ్నప్రకృతి నుండి, ఆ ప్రకృతియొక్క సంతసం, భయం, ఆరాటం, ద్వేషం, కామనల అలల నుండి విముక్తుడై వుండు వాడు పురుషోత్తముని భక్తుడు. ఎవనిచే ప్రపంచం నొవ్వకుండా, లేదా యిబ్బంది పడకుండా వుంటుందో, ఆ ప్రపంచంతో తాను నొప్పించబడకుండా, యిబ్బందికి గురికాకుండా వుంటాడో, అట్టి ప్రశాంతచిత్తం గలవాడు పురుషోత్తముని భక్తుడు.అ తడొక శాంతమూర్తి. అతనిలో సమస్తమూ శాంతయుతంగా ఉండగల, ప్రశాంత చిత్తుడాతడు.

లేదా తన అస్తిత్వ ప్రభువునకు, తన సమస్త కోరికలను, కర్మలను సమర్పణ గావించిన విశుద్ధుడు. ఏమి జరిగినా, ఫలితమేదైనా, ఏమి సంభవించినా చలించని వాడు పురుషోత్తముని భక్తుడు. సమస్త వ్యక్తిగత, మానసిక, ఆంతర లేక బాహ్యక ర్మను అహంకారయుతంగా, ఆరంభించుటకు అతడు పూనుకొనడు. తన నిర్ణయాలు, యిష్టాలు, కోరికలచే వక్రీకరింపబడకుండా, తన ద్వారా దివ్యసంకల్పాన్ని, దివ్య జ్ఞానాన్ని ప్రసరింపచేస్తాడు. ఎందుచేతనంటే మహోన్నత దైవసంకల్పంతో, లోపర హితంగా, ఏకత్వాన్ని సాధించడం దైవానికి విశుద్ధ ఉపకరణంగా తయారుగావడం, అత్యున్నత కర్మకౌశలానికి ఆవశ్యకస్థితి. ఆనందం కలిగించే వాటి స్పర్శతో ఆనం దించడు. అసుఖాన్ని కలిగించేదానిని అసహ్యించుకోడు, దాని భారం వల్ల విచారిం చడు. శుభాశుభ సంఘటనల మధ్య తారతమ్య దృక్పథం ఎవనిలో రద్దైపోయి వుంటుందో అతడు భక్తుడు. ఎందుచేతనంటే అతని భక్తి సమస్తమూ, తన దివ్యప్రి యుని, దివ్యగురువుయొక్క కరకమలాలచే ప్రసాదించబడుతున్న పవిత్ర ప్రసా దంగా స్వీకరిస్తుంది.

భగవంతునికి ప్రియుడైన భగవత్ప్రేరికుడు ఒక విశాల సమత మూర్తీభవించి నవాడు. అతడు మిత్రుని, శత్రువును సమంగా భావిస్తాడు. పూజ్యావమానాలు, ఖేదమోదాలు, పొగడ్త తెగడ్తలు సుఖదుఃఖాలు, శీతోష్ణాలు అతనిని యిబ్బంది పెట్టే సమస్తం యెడల వాటికి భిన్నమై ప్రేమాదరాల్తో, సహజ స్వభావంతో సమదృష్టి కలిగి వుంటాడు. అతనికి యెవరియందూ లేదా దేనియందూ, స్థల లేక ఆవాస మందూ రాగముండదు. పరిసరా లెటువంటివైనా, ఇతరులు తనతో ఏ విధంగా ప్రవర్తించినా, ఎటువంటి ఉచ్ఛ, నీచ స్థితులలో వున్నా, అతడు సంతుష్టుడై చాలా సంతృప్తి కలిగి వుంటాడు. అతడు దృఢచిత్తుడు. ఎందుచేతనంటే ఆతని మనస్సు

యెల్లవేళల, ఉత్తమస్థాయిలో నిలిచి, తన ప్రేమ, ఆరాధనల యొక్క ఏకైక దివ్య లక్ష్యం మీదే సదా స్థిరంగా వుంటుంది. సమత, నిష్కామస్థితి, అహంకారిక అధోప్ర కృతి నుండి, దాని వత్తిడుల నుండి స్వేచ్ఛ, మహోన్నత ముక్తి కవసరమైన ఏకైక పరిపూర్ణ పునాది యని గీత నొక్కి చెప్పింది. సర్వమునందూ యేకాత్మను దర్శించు స్థితప్రజ్ఞునిగా తయారుకావడం, కర్మాధికారియైన సర్వేశ్వరునకు, ఆ సమతాస్థితి లో, ఆ జ్ఞానఫలితమైన ప్రశాంత నిరహంకారిక నిష్కామకర్మను సమర్పించడం గురించి గీత చివరివరకూ తిరిగి తిరిగి ఒత్తి చెప్తూనే వుంది. మహాబలీయమైన అంతర్యామి హస్తాల్లో మానవుని సమస్త ప్రకృతిని సమర్పించడం అనే ప్రప్రథమ ప్రాథమిక బోధన గురించి, ప్రప్రథమ ఆవశ్యకత గురించి చివరివరకూ గీత తిరిగి తిరిగి ఒత్తి చెప్తూనే వుంది. కర్తృత్వం లేకుండా చేసే కర్మఫలితంగా సాఫల్యం చెందిన జ్ఞానంపై ప్రతిష్ఠితమై, సర్వ వస్తువులు, జీవులపై విస్తరించుకొన్న ప్రేమ. జగత్తును సృజించిన, జగన్నాథుడైన దివ్యాత్మ కొరకై సమస్తాన్నీ ముంచివేసే, సమస్తాన్నీ భరించే ప్రేమ. సుహృదమ్ సర్వభూతానామ్ సర్వ-లోక మహేశ్వ రమ్ — ఇది, ఈ సమతకు మకుటాయమాన స్థితి.

మహోన్నత ఆధ్యాత్మిక పరిపూర్ణతను సాధించుటకు ఇదీ పునాది, ఇదీ నియ మం. ఏ మార్గం ద్వారానైనా సరే దీనిని సాధించినవారంతా నాకు ప్రియులు అని దైవం ప్రకటిస్తోంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె.వి. రావు

త్రివిధ యోగమార్గాలలో పరస్పర దురవగాహన

భక్తిమార్గమేమైనా అంత తక్కువదా?

పరిపూర్ణతకు, మన మూలాధారమై ఉన్నది — ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, భక్త్యా వేశం — ఈ మూడు శక్తిమార్గాల సమైక్యతలోనే. అందుచేత ఆత్మసాధనలో దైవత్వ సాఫల్యత కోసం అన్వేషించే సాధకుడు, సాధారణంగా ఈ త్రివిధ మార్గానుసర ణలో పరస్పర దురవగాహనలు ఉంటే, వాటిని తప్పక విసర్జించాలి. ఈ మార్గానుస రణలో ఒకరినొకరు కించపర్చుకోవట మనేది తగదు. జ్ఞానమార్గాంపై శ్రద్ధ చూపేవారు,

భక్తిమార్గాన్ని పూర్తిగా నిరసించకపోయినా, చిన్నచూపు చూడటం కద్దు. తామేదో కళ్లు తిరిగే దివ్యసత్య ఉన్నత శిఖరాగ్రాలపై ఉన్నామనుకుంటూ, భక్తిమార్గాను యాయులు తక్కువ స్థాయిలో, ఇంకా అజ్ఞానదశలోనే ఉన్నారు కాబట్టి ఇందుకు (జ్ఞానమార్గం) ఇంకా తగరని, అపుడే వారికిది సరిపడదనీ చిన్న చూపు. అయితే ఇందులో ఒక వాస్తవం లేకపోలేదు. జ్ఞానరహితమైన భక్తి సాధారణంగా మొరటుగా ను, అపరిపక్వంగాను, అవివేకంగాను ఉంటూ ఒక్కొక్కప్పుడు ప్రమాదభరితంగా కూడా పరిణమిస్తుంది. దాని ఫలితమే మతసంబంధమైన కల్లోలాలు, నేరాలు, తెలి వితక్కువతనాలు. ఇది ఎందుకు జరుగుతుందంటే తమ భక్తికి, వారు వాస్తవమైన మూలసూత్రం, ఆధారం తెలుసుకోలేకపోవటం వల్ల. ఇంకా వారు తమకు అను వైన సక్రమ మార్గాన్ని కనుగొనలేక, మార్గాన్వేషణలో తడబాటు, పక్కదారి పట్టడం వల్ల కూడా. ఇదే స్థాయిలో, భక్తి ఎంత అపరిపూర్ణంగా ఉంటుందో జ్ఞానం కూడా అదే పరిస్థితిలో ఉంటుంది. అదే, మూర్ఖపు పట్టుదల, పిడివాదం, వేర్పాటుధోరణి, అసహనం, తమదే అసలు సిసలైన ఆదర్శ,సూత్రమనే భావన, బలవంతాన పట్టుపట్టి ముందుకు తోసుకునిపోవలసిన ఇరుకు దారి. భక్తుడు తన నుద్ధరించి ఉన్నతుని చేసే భక్తికి నిజంగా కట్టుబడి ఉన్నపుడు, ఫలితంగా, అది తనను జ్ఞానమార్గంలోనే, సమర్థవంతంగా ప్రక్షాళన చేస్తుంది. విశాలపరుస్తుంది. లక్ష్యాన్ని చేరుకునే దారులు వేరైనా, ఈ రెండూ (భక్తి, జ్ఞాన) సమానశక్తులే. భక్తుని గాఢావేశాన్ని చిన్నచూపు చూసే వేదాంతియొక్క గర్వాతిశయం, తన స్వభావంలో ఎక్కడో ఏదో ఒక లోపంవల్ల ఉత్పన్నమయేదే. ఏ రకమైన గర్వానికైనా, సర్వసాధారాణరంగా, కారణం ఇదే అవుతుంది. మరి వేరే దేనితోను సంబంధం లేకుండా, exclusive గా, అభి వృద్ధిపొందే బుద్ధి, హృదయంకంటే ఏ రకంగాను ఉన్నతమైనది కాదు. బుద్ధి తత్త రపాటు పడే సందర్భాలలో హృదయానికి మార్గం సుగమమం కావచ్చు. మనసుకు అందని సత్యము హృదయానికి దగ్గరయి, సులువుగా పట్టుబడుతుంది. ఆధ్యా త్మిక అనుభవంలో, మనసు పండి, అలవోకగా స్వర్గశిఖరాలు, విస్తృత వినీలాకా శాలు అందుకున్నా కూడా, బ్రహ్మాండమైన దివ్యసత్యపు గాఢ సముద్రపుటగాధాలు, దివ్యానందము, హృదయ సహకారం లేకుండా అందదు.

2) భక్తిమార్గం తప్పనిసరిగా తక్కువదిగా భావింపబడుతుంది. ఎందుకంటే, ఇది ఆరాధనతో.— by worship — ముందుకు సాగుతుంది. దీనికి సంబంధం

చిన ఆధ్యాత్మిక అనుభవస్థాయిలలో తేడా ఉంది. జీవాత్మ, దైవాల సంయోగం అసమగ్రంగా ఉంటుంది. ఎందుకంటే ఇక్కడ మౌలికసూత్రం ప్రేమ. ప్రేమ అంటే — ఇద్దరు; ప్రేమికుడు, ప్రేమించబడేవాడు. కాబట్టి ఇది ద్వైతం (dualism) అద్వైతం — oneness ఏకత్వము — సర్వోన్నత ఆధ్యాత్మికానుభవము కాగా — భక్తి, సాకారదైవాన్ని అన్వేషిస్తుంది. (It seeks after personal God). అయితే, నిరాకార పరబ్రహ్మం — the impersonal — సర్వోన్నత శాశ్వతసత్యం — if not even the sole reality — ఏకైక దివ్యవాస్తవం కాకపోయినా. అలాటప్పుడు, భక్తిమార్గంలో, ఆరాధన మొదటి మెట్టు అవుతుంది. బాహ్య అర్చన అంతరంగ ఆరాధనగా పరిణమించినప్పుడు వాస్తవమైన దివ్యభక్తి ఆరంభమవుతుంది. ఆ భక్తి (ప్రేమ) దైవంతో సన్నిహిత అనుబంధ, ఆనందాలకి దగ్గరవుతుంది. సన్నిహిత ఆనందం, దివ్యానంద సంయోగంగా పరిఢవిల్లుతుంది (the bliss of union). ప్రేమ (భక్తి) కూడా, జ్ఞానంవలె సర్వోన్నత ఐక్యతను మనకు చేకూరుస్తుంది. ఆ ఐక్యతకి వీలైనంత విశిష్టమైన గాఢత, తీవ్రతలనూ ఇస్తుంది. అభేదత్వంతో కూడినదే అయినా, ప్రేమ (భక్తి) భేదత్వంలో హర్షోల్లాసాలను పొందుతుంది. ఆ విధంగా అభేదత్వం (ఏకత్వం) మరింత సుసంపన్నమై, మాధుర్యాన్ని సంతరించుకుంటుంది. అయితే, ఇక్కడ ఓ మాట చెప్పాలి. బుద్ధికంటె — కనీసం, దైవం యొక్క విరుద్ధభావాలపై స్థిరీకరించే బుద్ధికంటె — హృదయం మరింత వివేచన కలది. వైరుధ్యాలు పరస్పరపూరకాలు. సర్వోత్కృష్ట సాఫల్యతకు సాధనాలు. మనసు ఎల్లప్పుడూ దాని ఆలోచనలకే పరిమితమై ఉంటుంది. తాను దర్శించే — Divine Reality — దివ్య అస్తిత్వము యొక్క దశలకి, పరస్పరం ఒకదానితో వేరొకటి పోటీపడే విరుద్ధభావాలను, ఆమోదించదగిన, తిరస్కరించదగిన భావాలను పరస్పరం ఎదురెదురుగా ఉంచి, దర్శిస్తుంది. ఇది మనసుయొక్క బలహీనత.

3) దైవానికి సన్నిహితంకావించే ఆధ్యాత్మిక ప్రవృత్తి మానసిక విచారణ, ఉన్నతము, సుదూరము అయిన నిర్గుణ పరబ్రహ్మతత్వమునకు సన్నిహితము, మూర్తిమంతము అయిన సగుణోపాసనకంటె — అధికతర ప్రాధాన్యత నిస్తుంది, సహకరిస్తుంది. మానసిక విచారణ ఏకైకునిలోని ఆనందంలోనే ఉన్నతతర సత్యమును కనుగొంటుంది. అనేక మూర్తులలో ఏకైకుని దర్శించే ఆనందం — ఏకైకునిలో అనేక మూర్తులను దర్శించే ఆనందం — ఇది అల్పతర సత్యము లేదా

అసత్యము — అని భావిస్తుంది. అవ్యక్తుడు, నిర్గుణుడు — అయినవానిలో కనుగొనే ఆనందం ఉన్నతతరము, సత్యము అని, సగుణుడు, వ్యక్తుడు అయినవానికి సంబంధించిన ఆనందం అల్పము లేక అసత్యము అని భావిస్తుంది. అయితే నిజం చెప్పాలంటే, మన వైరుధ్యభావాలకు, ఆయనను దర్శించేందుకు మనం పడే పాట్లు — తార్కిక ఖండన, మండన ధోరణులు — వీటన్నిటికీ దైవము, అతీతుడు. ఆయన మనం భావించినట్లు కేవలం ఏకైకుడుగా ఏకత్వభావనకే పరిమితుడై, బంధింపబడినవాడుగా ఉండడు. ఆయన ఏకత్వం, అపరిమితమైన అనేకత్వాలలో (వైవిధ్యాలలో) వాస్తవరూపంగా దృశ్యమానమవుతూంటుంది. దానికి సంబంధిత ప్రేమ, ఆనందాలలోనే అసలైన కీలకం అంతా ఉంది. అలాగని, అనేకత్వభావనలో, ఏకత్వభావనానందాన్ని కోల్పోనక్కర్లేదు. సర్వోన్నతునియొక్క ఆత్మసంలీన ఆనందం his self-absorbed delight ఆయన ఏకత్వము, అనేక మూర్తులలోనూ, ఆయనయొక్క వైవిధ్య బాంధవ్యాలు, సర్వోన్నత జ్ఞానము అందించే సమున్నత ఆధ్యాత్మిక అనుభూతికి అందుతుంది. బుద్ధికి, అమూర్తిమాన్ the impersonal సువిశాలము, సమున్నతము అయి దివ్యసత్యముగా, మూర్తిమంతునికి the personal సంకుచిత సత్యముగా, ఆనందానుభూతిపరంగా ఉన్నా, ఆత్మానుభవంలో ఈ రెండు దృక్పథాలు, ఏకైక దివ్య అస్తిత్వం యొక్క దృక్పథంగానే అనుభావ్యమవుతాయి. దివ్య అస్తిత్వ జ్ఞానం పొందటానికి, బుద్ధి, అనంత అమూర్తిమాన్ (the infinite Impersonality) యొక్క అస్తిత్వాన్ని నొక్కి వక్కాణిస్తుంది. మరొక జ్ఞానం కూడా ఉంది. అది ప్రేమ (భక్తి) ద్వారా అనంత మహామూర్తిమంతుని the infinite Personality చేరుకునేది. ఏ ఒక్క ఆధ్యాత్మిక అనుభవమైనప్పటికి, కొనసాగిస్తే తీసుకుపోయేది ఒకే పరమ సత్యానికే! (the same ultimate Truth). గీత చెప్పినట్లుగా భక్తిమార్గమైనా, జ్ఞానమార్గమైనా, మనలను తీసుకుపోయేది పురుషోత్తమునితో సమైక్యానికే! సర్వోన్నతుడు — 'అమూర్తిమాన్' మరియు, 'అనేక మూర్తిః' 'ఏకం' ఇంకా, 'అనేకం' — కూడా. నిర్గుణుడు, గుణాతీతుడు, అనంతగుణసంపన్నుడు. సత్, చిత్, ఆనందస్వరూపుడు. ఇదంతా ఆ సర్వేశ్వరుని అనంత కేళీవిలాసానుబంధ సమాహారమే.

భక్తి (ప్రేమ) వినా, జ్ఞానం అసంపూర్ణం

భక్తుడు, ఆర్ద్రితలేని కేవలం జ్ఞానాన్ని నిస్సారమని నిరసిస్తాడు నిజమే. ఆధ్యాత్మిక అనుభూతియొక్క ఆనందపారవశ్యతలేని తత్వజ్ఞానం రంపపొట్టులా నిస్సారమైనది. అది మనకు అపారమైన ఆధ్యాత్మిక అనుభవాన్ని, సంతృప్తిని ఇవ్వలేదు. బుద్ధినే అంటిపెట్టుకుని వెళ్లాడే ఆధ్యాత్మికానుభవం, మానసాతీతంగా దూసుకుపోవాలి. అలా పోలేక పోయినపుడది నిరర్థకం, నిస్సారం. abstract ఆనందంగానే ఉంటుంది. గాఢావేశ హృదయసీమల కది చేరుకోలేదు. పరిమిత శిఖరాగ్రాలపైనే ఉంటుంది. అలాగే, అందుకు విరుద్ధంగా జ్ఞానంలేని కేవల భక్తి, అపరిపూర్ణం. స్పష్టంగా చెప్పాలంటే — "I do not understand, I love" — అనే మాట ప్రేమకి అంతిమ వ్యక్తీకరణ అవదు. ఆరంభం మాత్రమే అవుతుంది. సర్వోన్నత గాఢ తీవ్రావేశం దానికి తోడు కావాలి. వాస్తవంగా, దివ్యజ్ఞానం పెంపొసగుతూన్న కొలదీ, దానితో పాటు, దివ్యానంద ప్రేమ కూడా పెరగాలి. జ్ఞానపునాది లేకుండా, కేవలం ఆనంద పారవశ్యానికీ, రక్షణ ఉండదు. మనం ప్రేమించినదానిలో మనము ఉంటాము. అది మనకు రక్షణ నిస్తుంది. అంటే చైతన్యంలో ఏకత్వాన్ని పొందటం అన్న మాట. చైతన్యంలో ఏకత్వసాధన జ్ఞానానికి పరిపూర్ణమైన షరతు. దివ్యజ్ఞానం దివ్యప్రేమకి స్థిరమైన భద్రత నిస్తుంది. తనయొక్క విస్తృత ఆనందానుభూతికి ఉన్మీలనం కావిస్తుంది. సర్వోన్నత దృశ్యమాన శిఖరాలకి ఉద్ధరిస్తుంది.

కర్మలు కేవలం బాహ్యమైనవేనా?

భక్తి, జ్ఞాన మార్గాల పరస్పర దురవగాహన ఒక అజ్ఞానం అయితే, ఈ రెండూ తమ సమున్నత ఆధ్యాత్మిక సాధనా శిఖరాల నుంచి కర్మమార్గాన్ని చిన్నచూపు చూడటం కూడా ఏమంత తక్కువ అజ్ఞానం కాదు. భక్తిలో తీవ్రత ఉంటుంది. జ్ఞానంలోను తీవ్రత ఉంటుంది. కర్మలు కేవలం బాహ్యమైనవీ, తీవ్రతను మళ్లించేవిగా ఉంటాయి. కర్మలు ఈ విధంగా బాహ్యంగా తీవ్రతను మరల్చేవిగా ఎప్పుడుంటాయంటే సచైతన్యంగా సర్వోన్నతునితో సమైక్యం పొందాలనే ఇచ్ఛాశక్తి కొరవడినపుడు. సమైక్యత ఉన్నపుడు కర్మలు జ్ఞానశక్తిగా పరిఢవిల్లి, భక్తిని పొంగిపొరలింపచేస్తాయి. పరమాత్ముని ఏకత్వస్థితిలో జ్ఞానము కుదురుకొని ఉండి, ప్రేమ,

దివ్యానందస్థితిని పొందినపుడు, క్రాంతిమాధుర్యాలకి కర్మలు సజీవశక్త్యుపకరణాల వుతాయి. ప్రేమికుని, ప్రేమింపబడేవానిని వేరుచేసేది మానవప్రేమ. ఆ ప్రేమ యొక్క ఆకాంక్ష వారియొక్క exclusive ఆనంద, ఐక్యతలలో వారిని ప్రపంచానికి, ఇతరులకి విడిగా వేరుచేసి ఉంచుతుంది. కాని వారు వైవాహిక హృదయకుహ రంలో ఒక్కరుగానే ఉంటారు. ఈ మార్గంలో ఇది తప్పనిసరి. అయినప్పటికీ విశ్వవి శాలప్రేమ జ్ఞానంలో సాఫల్యం పొందినపుడు అది, ప్రపంచాన్ని వేరుగా చూడదు. ఈ ఆనందానికి ప్రతికూలంగా ఉండదు. తాను దివ్యప్రేమైక జీవుడుగా సకల జీవు లను తన సత్వములోనే సంభావిస్తాడు. ఆ దార్శినకతలో దివ్యకర్మలు తమ ఆనందాన్ని, ఔచిత్యాన్ని, పరమార్థాన్ని పొందుతాయి.

మూలం: శ్రీఅరవిందులు

భావానువాదం: కర్రా వెంకటేశ్వర్లు

(*Synthesis of Yoga* Vol. 21, pp. 523-27)

సమగ్ర భగవత్ప్రేమ — త్రివిధ మార్గము

(*"మానవరూపంలో ఉన్న దైవం, అవతారపురుషుడు దివ్యగురువుయొక్క సందేశం ఆ విధంగా సాగింది'"* అని *శ్రీఅరవిందులు* 'గీతావ్యాసములు' అను గ్రంథంలోని చివరి అధ్యాయంలో వివరించారు. అందులో నుండి కొంత భాగాన్ని ఇచట పున ర్ముద్రిస్తున్నాం. — సంపాదకుడు)

"జ్ఞానానుసంధాయకమైన మనస్సు, కర్మకి అనుబంధమైన సంకల్పం మాత్రమే సమస్తమూ గాదు. ఆనందాన్ని ప్రగాఢంగా కోరుకొనే హృదయ మొకటి కూడా నీలో వుంది. ఇచట కూడా అంటే హృదయంయొక్క శక్తి, వెలుగులో కూడా, దాని ఆనందాపేక్షలో గూడా అంతరాత్మ తృప్తికోసం దైవంతో సమమైన సచేతనానం దానుభవం పొందడానికి నీ స్వభావం మారాలి. అది రూపాంతరం చెందించబడి ఉద్ధరించబడాలి. నిర్వ్యక్తిక ఆత్మజ్ఞానం, తనకే స్వంతమైన ఆనందాన్ని కొనితె స్తుంది. నిర్వ్యక్తికతకు కూడా ఒక ఆనందం వుంది. విశుద్ధ ఆత్మయొక్క నిరపేక్షా నందమది. కాని సమగ్రజ్ఞానం మరింత మహనీయమైన త్రివిధ ఆనందాన్ని కొనితెస్తుంది. అది విశ్వాతీతుని దివ్య ఆనందానికి ద్వారాలను తెరుస్తుంది. అది విశ్వజనీన విర్వ్య

క్తికత యొక్క అపరిమిత ఆనందంలోనికి విముక్తం గావిస్తుంది. ఈ నానావిధ అభివ్యక్తి సమస్తం యొక్క ఆనందాన్ని ఆ సమగ్రజ్ఞానం ఆవిష్కరిస్తుంది. ఎందుచేతనంటే నిత్యుని ఆనందం విశ్వప్రకృతిలో గూడా వుంది. ఈ అభివ్యక్త ప్రపంచంలో దైవాంశ అయిన జీవునిలోగల పరమానందం తన మూలమైన దైవంలో, తన పరమోన్నత ఆత్మలో తన అస్తిత్వ ప్రభువులో ప్రతిష్ఠితమై వున్న మహదానందరూపంగా మారుతుంది. భగవంతుని యెడలగల ప్రేమ, ఆరాధన మొత్తం ప్రపంచం పైన, ఆ ప్రపంచంలోని రూపాలు, శక్తులు జీవుల యెడల ప్రేమగా విస్తృతమౌతుంది. సమస్తములో దైవసాక్షాత్కార మవుతుంది, దైవం ప్రతిష్ఠితమై వున్నట్లు తెలుస్తుంది. ఆ దైవాన్ని ఆరాధిస్తావు, సేవిస్తావు. ఆ దైవంతో ఐక్యత అనుభవిస్తావు. అందుచేత ఈ ప్రేమను నీలో ప్రవేశింపచేసుకో. ఈ ఆరాధనను తెలుసుకో. దీనిని కర్మజ్ఞానాలతో ఏకం చేసుకో. ఇదే పూర్ణమైన పరిపూర్ణతా శిఖరాగ్రం.

ఈ ప్రేమ (భక్తి) యోగము, ఆధ్యాత్మిక వైశాల్యతకు, ఆధ్యాత్మిక ఏకత్వానికి, ఆధ్యాత్మిక స్వేచ్ఛకు ఒక గొప్ప మహోన్నత అంతర్నిహితశక్తి నిస్తుంది. కాని అది దివ్యజ్ఞానంతో మమేకమైన ప్రేమ అయివుండాలి. సంకటసమయంలో స్వాంతన కోసం, ఓదార్పు కోసం, దాని నుండి బయటపడడం కోసం భగవంతుని కాంక్షించే భక్తి కూడా వుంది. వరాల కోసం, దైవసహాయం కోసం, రక్షణ కోసం, కోరికలను తీర్చుకొనేందుకు భగవంతుని కాంక్షించే భక్తి కూడా ఉంది. ఇంకా, అజ్ఞానంలో వుండి, వెలుగు కోసం, జ్ఞానం కోసం భగవంతుని వైపు తిరిగే భక్తి కూడా వుంది. ఇటువంటి భక్తి రూపాలకు పరిమితమై వున్నంతకాలం, భగవంతుని వైపు, అత్యున్నతమైన మహోదారమైన మలుపు తిరిగినా అతనిలో త్రిగుణాల కార్యకలాపం వుంటుంది. కాని భగవత్ప్రేమికుడు, భగవత్ జ్ఞాని కూడా అయినపుడు, తన దివ్య ప్రియునితో తానేకాత్మకుడౌతాడు. ఎందుచేతనంటే ఆతడు పరాత్పరునిచే వరింపబడినవాడు, పరమాత్మ కిష్టులైనవారిలో శ్రేష్ఠుడు. భగవంతునిలో లీనమైన ప్రేమను అభివృద్ధి చేసుకోవాలి. తన నిమ్నప్రకృతి పరిమితుల నుండి విడివడి ఉద్ధరింపబడిన ఆధ్యాత్మిక హృదయం, భగవంతుని అగణనీయ అస్తిత్వపు రహస్యాలను చాలా ఆంతరంగికంగా నీకు వ్యక్తం చేస్తుంది. భగవంతుని దివ్యశక్తి యొక్క సమస్త సంస్పర్శను, ప్రవాహాన్ని, వైభవాన్ని నీ లోనికి కొనితెస్తుంది. శాశ్వత పరమానంద

మార్మికతలను నీకు తేటతెల్లం చేస్తుంది. పరిపూర్ణ ప్రేమ పరిపూర్ణ జ్ఞానానికి కీలక సూత్రం.

"నీలోనూ, సమస్త జీవులలోనూ వున్న దైవం కోసం సమగ్ర ప్రేమ, సమగ్ర కర్మను ఆపేక్షిస్తుంది. పాపం, లేక పుణ్యానికి సంబంధించిన ఏదో ఒక కామన నను సరించో, ఉత్తమ లేక నిమ్న ప్రాణిక ప్రేరేపణతోనో, సామాన్య లేక అసమాన్యమైన మానసిక అభిలాషతోనో లేదా ప్రాణిక, మానసిక మిశ్రమమైన ఏదో ఒక ఉద్దేశ్యాని కనుగుణంగానో సాధారణ మానవుడు కర్మ చేస్తాడు. కాని నీవు చేసే కర్మ, స్వేచ్ఛ గా, నిష్కామ కర్మయై వుండాలి. నిష్కామ కర్మ ప్రతిచర్యను ప్రేరేపించదు, బంధం విధించదు. పరిపూర్ణ సమతతో, అచంచల స్థిరశాంతితో ఏ విధమైన దివ్య ఆవేశం లేకుండా చేసిన కర్మ మొదట్లో ఒక సున్నితమైన, ఆధ్యాత్మికంగా తప్పక చేయవలసిన కర్తవ్యం కర్మగా అనిపిస్తుంది. తరువాత అది నిన్ను ఉద్ధరించు దివ్య యజ్ఞమవుతుంది. దాని పతాకస్థాయిలో భగవంతునితో సక్రియాత్మక ఏకత్వంలో ప్రశాంత, ఆనంద సమ్మతిని ప్రకటించేదిగా మారుతుంది. కాని ప్రేమలో సమైక్య కత ఇంతకంటె ఎక్కువ సాధిస్తుంది. అది మొదట్లో నెలకొన్న నిర్వికార ప్రశాంతత స్థానంలో దీనిని ఒక బలీయము ప్రగాఢము అయిన ప్రహర్షంగా నిలుపుతుంది. క్షుద్ర అహంకారిక కామం యొక్క ఆవేశంగాక అనంతానంద మహాసాగరమే అవు తుంది. నీ కర్మల లోనికి, నీ దివ్యప్రియుని సన్నిధి నిన్ను కదలిస్తున్నదనే భావాన్ని, ఆ సన్నిధియొక్క విశుద్ధ దివ్య ఆవేశాన్ని కొనితెస్తుంది. నీలోని,, సమస్త జీవులలోని భగవంతుని కొరకై ఆనందంతో శ్రమించాలనే తపనతో గూడిన ఆనందం నీలో సదా నిలిచి వుంటుంది. కర్మకు మకుటం, జ్ఞానానికి మకుటం, దివ్యప్రేమ.

జ్ఞానరూపమైన ఈ ప్రేమ, నీ కర్మలకి గంభీర హృదయ ఆవాసంగా అవు తుంది. ఎట్టి మినహాయింపు లేని నీ నివేదనకు, సంపూర్ణ పరిపూర్ణతకు చాలా ప్రభా వవంతమైన శక్తి అవుతుంది ఈ భగవత్ప్రేమ. పరిపూర్ణ ఆధ్యాత్మిక జీవితానికి, వ్యక్తి అస్తిత్వం దైవ అస్తిత్వంతో సమగ్రంగా యేకం గావడం తప్పని షరతు. అయినపుడు జ్ఞానం ద్వారా, ప్రేమ ద్వారా, కర్మ ద్వారా నీ సమస్త ప్రకృతిని దైవోన్ముఖుం చెయ్యి. నీ మవస్సును, నీ హృదయాన్ని, నీ సంకల్పాన్ని, నీ సమస్త చేతనను, నీవైన నీ ఇంద్రియాలను, చివరికి నీ దేహాన్ని కూడా ఎట్టి మినహా యింపులు లేకుండా, ఏ విధమైన సంకోచం లేకుండా ఆతని వైపు మరల్చి, ఆయ

నకే వప్పగించు. దివ్యచేతన యొక్క దోషరహితమైన రూపంగా ఆతనిచే, నీ చేతన శ్రేష్టంగా తీర్చదిద్దబడు గాక. నీ హృదయం ఒక అలజడిలేని లేదా ప్రజ్వలిస్తున్న దైవ హృదయమగు గాక. నీ సంకల్పం, ఆతని సంకల్పం యొక్క దోషరహిత కర్మ యగు గాక. నీ ఇంద్రియాలు, దేహం కూడా దైవదేహం యొక్క ప్రహర్షపూరిత సంవేదన యగు గాక. నీదైన సమస్త సత్వంతో ఆతని నారాధించు, నీ సమస్తాన్నీ ఆతనికై యజ్ఞంగా అర్పించు. ప్రతి ఆలోచన లోనూ, అనుభూతిలోనూ, ప్రతి ప్రేరణలోనూ, ప్రతి కర్మలోనూ ఆయన స్మృతి కలిగి యుండు. ఈ సమస్త విషయాలూ, సంపూర్ణంగా ఆయనవే అయ్యేంతవరకూ దీక్ష విరమించకు. సర్వసామాన్య, బాహ్య విషయాలను గూడా ఆతడు తనవిగా స్వీకరించుకొనునంతవరకూ నీ దీక్షను విరమించకు. నీ ఆత్మ యొక్క పవిత్ర గర్భాలయంలో ప్రతిష్ఠితుడై వున్న విధంగా, సర్వసామాన్య బాహ్యవిషయాల్లో గూడా, సదా రూపాంతరీకరణం కావించే ఆతని సన్నిధి ప్రతిష్ఠించబడేంతవరకూ నీ దీక్షను విరమించకు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె.వి. రావు

(*SABCL* Vol. 13, pp. 569-71)

సమాచారపత్రం

ప్రకటనలు: 1) శ్రీఅరవిందులవారి పూర్ణయోగం యొక్క బోధనలు, ఆచరణ — గురించి ఆగస్టు 13, 14 తేదీలలో ప్రసంగాలు బీచి ఆఫీసులో నిర్వహింపబడుతవి. శ్రీఅరవిందులవారి జన్మదిన వేడుకలు, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు, ఆగస్టు 15 న నిర్వహింపబడుతాయి. 2) 'సావిత్రి' అధ్యయన శిబిరం, బీచి ఆఫీసులోనే ఆగస్టు 16 నుంచి 22 వరకు డా. అలోక్ పాండేగారిచే నిర్వహింపబడుతుంది. దీనికి అందరు ఆహ్వానితులే.

బ్రాంచీలు, కేంద్రాల నుంచి విశేషాలు: లక్నో (ఉ.ప్ర) బ్రాంచిలో శ్రీ పి. తివారీ గారు శ్రీఅరవిందుల పూర్ణయోగం, శ్రీమాత జీవితము కార్యదీక్ష — గురించి ప్రసంగించారు. 16.3.2009 తేదీన, U.G.C వారి సౌజన్యంతో లక్నో విశ్వవిద్యాలయం విద్యాశాఖవారు దీనిని నిర్వహించారు.

17/08/09.

Rs. 15

అఖిల

అఖిల భారత పత్రిక



ఆగస్టు 2009

విషయసూచిక

వెలుగుబాట

దివ్యకారుణ్యం

యువత కోసం

దైవానికి చేర్చే సరళమైన మార్గం

శ్రీఅరవిందుల కృప

సరళమైన మార్గంలో దైవం దగ్గరకు వెళ్ళ వెందుకని? సరళమార్గంమంటే ప్రగాఢ విశ్వాసం. నీవు ప్రార్థిస్తే ఆతడు వింటాడని ప్రగాఢంగా విశ్వసించాలి. సమాధానం రావడానికి ఆలస్యమైతే, అతనికి తెలుసు. అతడు ప్రేమస్వరూపుడు, ఎప్పుడు సమాధానమివ్వాలో ఆయనకే బాగా తెలుసు అని ప్రగాఢంగా విశ్వసించాలి. ఆయన వచ్చేటపుడు ఎదురుదెబ్బ తగిలి తడబడిపోకుండా ఆయన వచ్చి పనిచేయవలసిన క్షేత్రాన్ని ఈ మధ్యకాలంలో శుభ్రం చెయ్యి. ఇది నా సూచన, నేను దేన్ని గురించి చెప్తున్నానో నాకు బాగా తెలుసు. నీవేం చెప్పినా సరే, మానవుల కుండే యిబ్బందులు, సంఘర్షణలు, అన్నీ నాకు తెలుసు. వాటికి చికిత్స కూడా నాకు తెలుసు. అందుచేత ఆ యిబ్బందులనూ, సంఘర్షణలనూ కనీసస్థాయికి తగ్గించే విషయాల మీద నేను వత్తి చెప్పడం. అంటే (నీ జీవనసరళి) — చైత్యసంబంధమైన మలుపు దిరగాలి. విశ్వాసం, పరిపూర్ణ, సరళమైన నమ్మకం ఉండాలి, దాని మీదే ఆధారపడడం జరగాలి.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: కె.వి. రావు

సర్వత్రా దైవానుభూతి

ప్రశ్న: నాకు తరుచుగా ఆశ్చర్యం కలిగించే విషయం ఒకటుంది. తనకేదో సంకటం కలిగిందని భగవంతుని కర్థమయ్యేట్లు చెయ్యాలని, ఆయన్ను ప్రార్థించాలంటే, చాలా చాలా దూరంగా వున్నదేన్నో పిలుస్తున్నట్లు, చాలా తీక్షణమైన ఏకాగ్రతను సాధించాల్సి వుంటుందని నాకెపుడూ అన్పిస్తూ వుంటుంది. ఇది సరైన అభిప్రాయమేనా లేక నిజంగా...

అమ్మ: అది మన మీద ఆధారపడి వుంటుంది!

నేనిపుడు దైవాన్ని ప్రతి చోటా అనుభూతి చెందుతున్నాను. ఎప్పుడూ అన్ని

వేళలా... భౌతికస్పర్శను సైతం – సూక్ష్మభౌతికమైనా, అది భౌతికానుభూతే – వస్తువులలో, వీచే గాలిలో, చుట్టూ ఉన్న జనంలో ఈ విధంగా (అమ్మ చేతుల్ని మోముకు అద్దుకుని చూపిస్తారు) అనుభూతి చెందుతున్నాను. అందుకు ఎంతో దూరం పోవడం లేదు. నేను చేయవలసిందల్లా ఇదే, (అమ్మ తమ చేతుల్ని కొద్దిగా తమ వైపుకు లోపలికి త్రిప్పి చూపిస్తారు) క్షణమాత్ర ఏకాగ్రత – దైవం అడుగో అక్కడున్నాడు, ప్రతిచోటా వున్నాడు! ఆతడు దూరంగా వున్నాడని మనం అను కొన్నప్పుడు మాత్రమే ఆతడు దూరంగా వుంటాడు.

అన్ని (ఆధ్యాత్మిక) – స్థాయిలను గురించి మనం ఆలోచించడం మొదలు పెట్టినప్పుడు, విశ్వచేతనకు సంబంధించిన సమస్త స్తరాలను గురించి ఆలోచిం చడం మొదలుపెట్టినపుడు, అప్పుడు, ఆ చివరిది, ఆ చిట్టచివరిది, సరిగ్గా ఆ చిట్ట చివరిది, చాలా దూరంగా, చాలా, చాలా దూరంగా వున్నట్లనిపిస్తుంది! (అమ్మ నవ్వులు). కాని ఆతడు ప్రతిచోటా వున్నాడని మనం అనుకొన్నపుడు, ప్రతిదీ ఆతడే అనుకొన్నపుడు, మన భావముద్రయే ఆతడు కన్పించకుండా, ఆతనిని అనుభూతి చెందకుండా మనకు అడ్డుపడుతోంది. అప్పుడు మనం ఇలా చేస్తే చాలు (అమ్మ తమ చేతుల్ని తమ వైపుకు, లోపలికి త్రిప్పి చూపిస్తారు). ఇలా, అలా చూడటమే (అమ్మ తమ చేతుల్ని లోపలి వైపుకు, తమ నుండి బయటవై పుకు త్రిప్పి చూపిస్తారు). అప్పుడు అది, ఆ అనుభూతి చాలా పటిష్ఠంగా తయా రవుతుంది. ఇలా చేస్తే (అమ్మ చేతులు బయటి వైపుకు త్రిప్పి చూపిస్తారు). ప్రతిదీ అసహజంగా, కఠినంగా, ఆర్ద్రత లేనిదిగా, అసత్యంగా, అయదార్థంగా, కృత్రిమంగా తయారవుతుంది. ఇలా చేస్తే, (అమ్మ చేతులు లోపలికి త్రిప్పి చూపిస్తారు) ప్రతిదీ విస్తృతమైనట్లు, ప్రశాంతంగా, ప్రకాశవంతంగా, శాంతియు తంగా, చాలా విశాలంగా, ఆనందకరంగా తయారవుతుంది. కేవలం ఇలా, అలా అంతే (అమ్మ తమ చేతుల్ని లోపలి వైపుకు, బయటి వైపుకు మార్చి మార్చి త్రిప్పి చూపిస్తారు) ఎలా? ఎక్కడ? అనేది వివరించలేం, అది చేతనకు సంబంధిం చిన ఒక కదలిక, కేవలం ఒక కదలిక, అంతకు మించి మరేం కాదు. చేతనకు సంబం ధించిన ఇట్టి కదలికవల్ల, సత్యచేతనకు, అసత్యచేతనకు మధ్య నుండే భేదం మరింతగా ఖచ్చితమైన రూపం తీసుకొంటుంది. అదే సమయంలో సన్నని... దానిలో నుండి బయటపడడానికి "గొప్ప పనులు" ఏవీ చేయవలసిన అగత్యం లేదు. అంతకు

ముందు దేనిలోనో, లోపల నివసిస్తున్నాను, అందులోంచి బయటపడడానికి బాగా అంతర్ముఖులం కావాలి, ఏకాగ్రత సాధించాలి, మనలోనికి మనం మునిగిపోవాలి అనే అభిప్రాయం ఉంటుంది. కాని ఇప్పుడు (అమ్మ తమ మోముకు, తెరలా చేయి అడ్డుపెట్టి చూపిస్తారు), ఏదో సన్నని, పలుచని పొర — చాలా గట్టి పొరైన ప్పటికీ తొలగించివేయగల, చాలా చాలా పొడిగా (అంటే అంటుకుపోయి వుండ కుండా) – చాలా పలుచని, బాగా పలుచని, ఒక ముసుగు కప్పినట్లున్న, పొర వున్నదని భావించి దాన్నిలా తీసివేస్తే (అమ్మ పలుచని పొరను తొలగిస్తున్నట్లు చేసి చూపిస్తారు) అది అంతర్ధానమౌతుంది.

ఆ పొర బాగా పలుచబడిపోయి, దాని ద్వారా చూడగల, సంవేదించగల, కార్యం నిర్వహించగల విధంగా అది పలుచబడిపోయి, అది వున్నదనే స్పృహ గాని, మళ్ళీ ముసుగుగా దానిని వేసుకోవలసిన అవసరంగాని లేకుండాపోయే స్థితిని ముందుగా తెలుసుకోగలుగుతాం.

ఇపుడే అది ప్రారంభమైంది.

(అంటే సత్యాసత్యాల భావాల పొరల ద్వారా గాకుండా సరాసరి భగవంతుని సంవేదించగల, భౌతికంగా కూడా స్పర్శించగల మహర్దశ ఇపుడే ప్రారంభమైంది) — కాని సమస్తంలోని ఈ దివ్యసన్నిధి... అదొక ప్రకంపనం, సమస్తాన్నీ తనలో భరించివున్న ప్రకంపనం — ఒక విధమైన అనంతశక్తిని, అనంతానందాన్ని, అనంత శాంతిని, కలిగివున్న ఒక ప్రకంపనం అది. విశాలం, విశాలం, అత్యంత విశాలమైన ది, పరిమితులు లేవు. కాని అదొక ప్రకంపనం మాత్రమే, కాదు... ఓ భగవాన్! అది అచింత్యం, కనుక అనిర్వాచ్యం. నీవు ఆలోచిస్తే, నీవు ఆలోచించిన వెంటనే మొత్తం గందరగోళమంతా తిరిగి ప్రారంభమౌతుంది. అందుచేత అది అనిర్వాచ్యం.

లేదు. ఆతడు చాలా దూరంగా వున్నాడని నీవు భావిస్తున్నావు గనుకే అతడు చాలా దూరంగా వున్నాడు. ఆతడు ఇక్కడే వున్నాడని నీవు అనుకొన్నపుడు గూడా, ఇలా (తమ మోముకు దగ్గరగా అన్నట్లు చూపిస్తారు) నిన్ను స్పర్శిస్తూన్నట్లు... నీవు అనుభూతి చెందగలిగితే — ఎవరో వ్యక్తి స్పర్శగాదది, అలాంటిది గాదు. నీకు తెలియనిదేదో లాంటిది, నీకు బాహ్యమైనది, బయటినుంచి కలిగిన స్పర్శ వంటిది గాదు. అలాంటిది గాదు... అది ప్రతి చోటా వుంది.

ప్రతిచోటా, ప్రతిచోటా, ప్రతిచోటా — దానిని నీవు సంవేదిస్తావు... లోపలా,

బయటా, ప్రతిచోటా, ప్రతిచోటా — ఆతనినే, ఆతనినే, ఆతనినే, మరేదీ కాదు, ఆతని ప్రకంపనాన్నే... నీవు సంవేదిస్తావు.

లేదు. నీవు దానిని (మస్తిష్కాన్ని) ఆపెయ్యి. దాని నాపేంతవరకు, పరమ సత్యవస్తువును నీవు చూడలేవు — దానిని దేనితో పోల్చాలా అని చూస్తావు, చూసి "అది ఇలా వుంది, అలా వుంది" అంటావు. ఓహ్!

(మౌనం)

అంతేగాదు, ఎంత తరచుగా, ఎంత తరచుగా, ఆ భావం... రూపం లేదు — ఒక రూపం వుంది, రూపమంటూ లేదు, దానిని మాటల్లో పెట్టలేం. చూస్తున్న దనే భావం కనులు లేవు — కనులు లేవుగాని చూపు వుంది — ఒక చూపు ఒక దర హాసం వున్నాయి, నోరు లేదు, మోము లేదు! అయినా ఒక చిరుహాసం వుంది, ఒక చూపు వుంది (అమ్మ నవ్వుతారు) "ఓ భగవాన్ నేను మందబుద్ధిని" అని తనను గురించి తాననుకోకుండా వుండలేరెవ్వరూ! కాని ఆతడు హసిస్తాడు, హసిస్తాడు, సంతోషంతో హాయిగా వుంటాడు.

చెప్పలేం! దానిని వర్ణించలేం, దాన్ని మాటల్లో చెప్పలేం, దానిని గురించేమీ చెప్పలేం. ఎవరైనా ఏమైనా చెప్పినా, ఏమీ చెప్పనట్లే, అందులో (సత్యం) ఏమీ వుండదు.

మూలం: శ్రీమాత

అనువాదం: కె.వి. రావు

దివ్యమాత సన్నిధి సదా వుంది. కాని నీ భావాన్ననుసరించి, విషయాలపై నీకుగల అవగాహనను అనుసరించి, వాటియెడల నీకుగల సంకల్పం, వాంఛల ననుసరించి వ్యవహరించాలని, నీ అంతట నీవు నిర్ణయించుకొంటే, ఆమె సన్నిధి తెరమరుగు అవుతుంది. నీ నుండి ఉపసంహరించుకొనేది ఆమె కాదు, నీవే ఆమె నుండి వెనక్కు పోతున్నావు. ఇది నీవు గ్రహించాలి.

శ్రీఅరవిందులు

ప్రార్థనయొక్క సాఫల్యశక్తి

మానవజీవితం ఎన్నో లోపాలతో, అవసరాలతో నిండి ఉంది. అది కోరికల పుట్ట. అంతులేనన్ని అవసరాలు. శారీరక అవసరాలు, ప్రాణిక అవసరాలు, మానసిక అవసరాలు, ఆధ్యాత్మిక అవసరాలు.

ఈ ప్రపంచాన్ని ఏదో ఒక మహత్తరమైన శక్తి పాలిస్తున్నదని మానవుడు భావిస్తాడు. తర్వాత తన అవసరాల సిద్ధి కోసం దుఃఖభూయిష్టమైన సంసారసాగరయానంలో సహాయాన్ని అర్థిస్తాడు. జీవితపోరాటంలో రక్షణ సహకారాల కొరకు తనకు తెలియని ఆ మహత్తరశక్తిని ప్రార్థనతో వేడుకుంటాడు. ప్రార్థనల పద్ధతులు, భగవంతుని ఆరాధనలు — వీటిలో అనేక సంప్రదాయాలు, మతపద్ధతులు — కొన్ని మొరటుగా ఉంటాయి. అనాగరికంగా ఉంటాయి. వారి వారి సంస్కారాలకి, మనస్తత్వానికి అనుగుణంగా ఉంటాయి. భగవంతుని ఆరాధనలో కూడా అహంభావం, లంచంతో వశపర్చుకునే ప్రయత్నం, పొగడ్తలతో తన పక్షమునకు త్రిప్పుకోటానికి ప్రయత్నించటం గొప్పతనాన్ని కీర్తించి బ్రతిమలాడటం, దానములివ్వటం — ఇలాటి ప్రవృత్తులు. మనం భగవంతుని ఏ దృష్టితో, ఏ బుద్ధితో దగ్గరకు చేరుకుంటున్నాము — అనే విషయం కూడా తరుచు విస్మరిస్తూ ఉంటాము.

సాధారణంగా ప్రార్థన యొక్క శక్తి సందేహాస్పదము. ప్రార్థన ఒక అసంబద్ధ విషయముగ, ప్రభావంలేని అనవసరమైన అంశంగా భావింపబడుతోంది. అసలు విశ్వసంకల్పము — అనేది ఒకటి ఉన్నది. అది దాని లక్ష్యాన్ని సర్వదా సాధించుటకు ప్రయత్నిస్తూనే ఉంటుంది. అహంకారపూరిత వాంఛతో, వేడుకోలుతో దానిని పెడత్రోవ పట్టించడం సాధ్యం కాదనేది కూడా నిజమే. పరాత్పరతత్వ మనేది విశ్వసృష్టిలో ఒక వ్యవస్థగా ప్రకటితమవుతున్నది. అది సర్వజ్ఞత్వము కలిగినది. దాని విశాల విజ్ఞానము, ప్రపంచరీతికి అనుగుణంగా తాను నిర్వర్తించవలసిన పనిని అది చేసుకుంటూపోతుంది. దాని గతిలో వ్యక్తిగత అభిలాషలకు తావుండదు. విశ్వధర్మము అనేది ఒకటి ఉంది. దాని ప్రకారము విశ్వగతి సాగుతూనే ఉంటుంది. ఇది వాస్తవమే. కాని విశ్వధర్మము, విశ్వశాసనములు, వీటి నిర్ధారణలు, విశ్వసంకల్ప వికల్పాలు బొత్తిగా యాంత్రిక శాసనాలు కావు. సమర్థవంతమైన మానవసంకల్పాలు, ఆకాంక్షలు, విశ్వాసాలు, ప్రార్థనలు — ఇవి కూడా తక్కువ ప్రాధాన్యముగల

శక్తులు కావు. ఈ సంకల్ప, ఆకాంక్ష, విశ్వాసాలకు ప్రార్థన ఒక రూపముగా ఆవిష్కృతమవుతుంది. ఆ శక్తి, దాని సంవేదన, మానవసంకల్పముతో కూడిన ఆకాంక్ష, విశ్వాసము, దివ్యసంకల్పముతో అనుసంధానం చేస్తాయి. పరాత్పర తత్వముతో, పరాత్పర సంకల్పముతో కలిసి, మానవ ఉత్కృష్ఠ సంకల్పాలు, ఆకాంక్షలు పని చేస్తాయి. వాటికి ప్రతిస్పందన ఉంటుంది. ప్రత్యుత్తరముగా కోరబడిన సహకారము, మార్గదర్శకత్వము, రక్షణ సిద్ధులు, ఒక్క మాటలో, యోగక్షేమాలు యెరుకతో తీసుకొని రావచ్చు.

ఈ ప్రార్థనలు అహంకారయుతంగా నిమ్నస్థాయిలో, ఆత్మవంచనతో కూడి కూడా ఉంటాయి. ఇవి హానికరంగా ఉంటాయి — వ్యక్తికి, సమాజానికి, ప్రపంచానికి కూడా. వీటిని ఆధ్యాత్మికత వైపుగా మరల్చకపోతే వినాశనానికి దారి తీస్తాయి.

నిజానికి ప్రార్థన యొక్క రూపము ప్రధానము కాదు. దాని యందు నిక్షిప్తమై ఉన్న విశ్వాసము, సంకల్పశక్తి, ఆకాంక్షలు ముఖ్యము. ప్రార్థన యొక్క పరమోన్నత లక్ష్యము నిరపేక్ష భక్తి. కోర్కెలతో నిమిత్తం లేని దివ్యప్రేమస్థితి.

మానవాత్మ, భగవంతుని రక్షణ, మార్గదర్శకత్వములను కోరుకుంటుంది. భగవంతుని అండ చేరుకోవాలనుకుంటుంది. భాధల నుంచి, దుఃఖం నుంచి విముక్తి కోసం భగవంతుని ఆశ్రయిస్తుంది. తల్లియైన పరాశక్తిని (విశ్వాత్మ) చేరి అర్థిస్తుంది. విశ్వమాత కూడా మానవాత్మ తనను చేరుకోవాలని వేడుకోవాలని ఆశిస్తుంది. తల్లికి బిడ్డపై ఉండే వాత్సల్యం ఉంటుంది విశ్వమాతకు. తన హార్దిక దివ్యప్రేమని బిడ్డపై వర్షింపచేయాలని కోరుకుంటుంది.

దివ్యమాత ప్రేమ సర్వతోముఖమైనది. పరిపూర్ణమైనది. ఆమెయే మనకు ఆవాసము యెప్పటికైనా. శాంతి పొందవలసినది దివ్యమాత హృదయంలోనే.

మూలం: శ్రీఅరవిందులు

భావానువాదం: డా. ప్రసన్న కృష్ణ

వేదాంతి వేడుకోలు

హృదయ నిశ్శబ్దాంతర ధ్యానగమ్యమై
పరామాత్మ వెలుగు నర్తనలపై
దృష్టి సారించిన శాశ్వత తేజమా,

ఉన్నది నీ వాక్కటే!
అహో! అయితే మరేల నేనీ చీకటి ముసుగులో
నా స్వయంప్రకాశతేజో స్పర్శకు దూరమై ఉన్నాను?

కమ్ముకున్న కారుమేఘాల కౌగిళ్లలో చిక్కుకొని
ఏకాగ్రత కొరవడి కోర్కెల సుడిగుండంలో పడి
కూరూపి నవుతున్నాను?

శక్త్యావేశ, తీవ్రోద్వేగ అగ్ని జ్వాలలో పడి, కనలి కనలి
నీ సచ్చిదానంద ప్రశాంత సంధాయక
ఆశ్రయానికి దూరమై సుడిగుండం లోనికి
విసరివేయబడినా నేమిటి?

ప్రతి కోపావేశానికి చిత్తు చిత్తయిపోయి, మోహావేశంలో
దిగ్భ్రమతో శోకసంవిగ్నమానసుడనై ఏల
లొంగిపోతున్నాను?

రక్తముతో కదుముగట్టిన నా
విషాదభరిత గతము నీ సర్వోత్కృష్ట
అనుకంపమునకు ఆటంకము కాకుండు గాక,
వేగవంతమగు గాక.

ఓ ఏకైక సత్యమా!
పైకి మంచిగా అగుపించే క్షుద్రదేవతలు
నిన్ను అనుకరించి యౌవనంలో నన్ను
ప్రలోభపెట్టకుందురు గాక!

ఈ కోలాహలాలను నిశ్శబ్దీకరించు;
శాశ్వత దివ్యనాదాన్ని ఆలకిస్తాను.
దైవేచ్ఛను తెలుసుకుంటాను.

శాశ్వతత్వ ముఖద్వారానికి అడ్డుగా ఉండే
ఈ పటాటోప ప్రదర్శనను చెదరగొట్టు.
అనుగ్రహించు.

మసకలేని చూపు,
కాంతిమంతంగా పెంపొసగిన యువహృదయం
అనుగ్రహించు. ఆశల ఆరాటాన్ని
అదలించుమో, ప్రభూ.

శతాబ్దాలుగా (అవ్యుత్పన్నుల) పొలికేకలతో కళంకితం కాబడిన
గతాన్ని వైదొలగించు.
స్వచ్ఛతను పునరుద్ధరించు.

ఓ, అదృశ్య దివ్యజ్ఞాన కవాటమా తెరుచుకో!
బలప్రమాణమా, సిద్ధింపచేయుమా!
ప్రేమా, వర్షించు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అన్నవరపు ఆదిశేషయ్య

వ్యక్తిగత ముక్తి

మనకు వ్యక్తిగతంగా మోక్షంతో అవసరముండదు. ఎందుకంటే మన ఆత్మ నిత్య ముక్తమైనది. ఇక బంధమనునది మాయ లేక భ్రమ. మనం బంధంలో వున్నట్లు క్రీడిస్తున్నాం. అంతేకాని నిజంగా మనం బంధితులం కాము.

*

ఈ ప్రపంచాన్ని రాక్షససృష్టిగనో లేక మాయాసృష్టిగనో మనం పరిగణించం. ఈ ప్రపంచం క్రమంగా పరిణతి చెందుచున్న పరిణామ ఆవిర్భావమే అయినా దీన్ని మనం దైవావిర్భావంగానే గుర్తిస్తాం. కనుక జీవితత్యాగం జీవితగమ్యం కాదు; లేదా ప్రపంచాన్ని తృణీకరించడం అన్నది కూడ ప్రపంచసృష్టికి ధ్యేయం కాదు.

*

మోక్షం యొక్క ప్రత్యేక ఆశయం అస్థిరమైన ప్రపంచం నుండి మనిషికి పునర్జన్మరహిత శాశ్వత బ్రహ్మలోకనివాసప్రాప్తి అన్న భావన వ్యాప్తిలో వుంది. ఇలాంటి ముక్తికి ఒక్క పర్యాయం అభయప్రదానం చేస్తే, ఆ జీవికి యీ జీవితంలో కాని వేరెక్కడైనా కాని మరింక పని వుండదు. కాని ఆ జీవికి మిగిలి ఉన్న దేహావసరాలు, అనుభవించక శేషించిన ప్రారబ్ధకర్మ వుంటాయి. ఇవి కూడ ఆ జీవి శరీరం విడిచేలోగా యోగాగ్నిలో దగ్ధమైపోతాయి. అలా జన్మరాహిత్యం పొందడమనేది, జీవి యొక్క అత్యున్నత ఆశయంగా భారతీయుల మనోభావనగా వుంటున్నది. ఆ తర్వాత జీవి స్వర్గసుఖాలు అనుభవిస్తుందన్న ఆకర్షణాభావం చాల మతాలు కలిగి వుంటున్నవి. వేదమంత్రాల బాహ్యావివరణ సిద్ధాంతంగా వుండిన తర్వాతకాలంలో భారతీయ మతం కూడ యీ వాదనను ఆమోదించింది. ద్వైతులు కూడ యీ భావనను ఉన్నత ఆధ్యాత్మిక ధ్యేయంగా వుంచుకొన్నారు. భౌతికసుఖాల కన్న మానసికసుఖాల కన్న, శారీరమానసిక పరిధుల నుండి విడివడి ఆత్మ యొక్క శాశ్వత శాంతి, విశ్రాంతి, నిశ్చల నీరవతానుభూతి నందగల్గడం నిస్సందేహంగా ఉన్నతమైన స్థితియే. కాని యిది కూడ ఒక విధమైన ఆకర్షణయే. ఇది జీవి మానసిక అలసతను, జననమరణాల సాహసం నుండి క్రుంగిపోవు భావనను, బలహీనతను తెల్పునేకాని – పరమమైన ధ్యేయం కానేరదు. వ్యక్తిగత ముక్తి, అన్న కోరిక — అదెంత ఉన్నతమైనదైనా సరే, అది అహంకారం నుండి ఉద్భవించినదే. ఈ కోరిక మన వ్యక్తిగతమైన మంచి

తనం మీద, మన బాగు మీద, భౌతిక బాధల నుండి, దుఃఖం నుండి విముక్తి మీద ఆధారపడి వుంటుంది. అహంకార మూలాన్ని పూర్తిగా తిరస్కరించడానికి వ్యక్తిగత ముక్తి అన్న కోరికను అధిగమించాలి. మనం దైవాన్ని ఆకాంక్షిస్తున్నామంటే, అది కేవలం దైవం కోసమే కాని, మరే ఇతరమైనదాని కోసం కాకూడదు. ఎందు కంటే అదే మనకు విశిష్టమైన పిలుపు. మన ఆత్మ యొక్క లోతైన సత్యం. ముక్తి కోసం అత్యున్నత ఆత్మ సాక్షాత్కారం కోసం, దైవసాయుజ్యం కోసం చేసే నిరంతర ప్రయత్నం సమర్థించబడింది. ఎందుకంటే అది మన స్వభావం యొక్క అత్యున్నత నియమం; మనలోని అత్యున్నతమైన దైవసంకల్పం కొరకైన ఆకర్షణ. అదే దానికి తగిన సమర్థన. అదే దాని సత్య హేతువు.

పునర్జన్మల నుండి విముక్తి అంటే భౌతికజీవితాన్ని తృణీకరించడం కాదు, లేదా ఆధ్యాత్మికంగా స్వీయత్యాగం ద్వారా భౌతికజగత్తు నుండి తప్పించుకొని పారిపోవడమూ కాదు. నిజమైన త్యాగం అంటే కూడ కుటుంబాన్ని, సమాజాన్ని వదలిపోవడము కాదు. నిజమైన త్యాగం అంటే భూతభవిష్యత్ పరిధులు లేని శాశ్వత ఆత్మసంభూతమైన మనలోని దైవంతో తాదాత్మ్యం చెందడం. అంతర్ముక్తుడైన జీవన్ముక్తుడు కర్మలు చేసినా చేయనివాడే అవుతాడు, అని గీత చెపుతుంది. ఎందుకంటే అతనిలో పనిచేసేది సర్వేశ్వరుని వశంలోని దివ్యప్రకృతియే. అలాంటి వ్యక్తి వందసార్లు దేహం ధరించినా, అతడు జననమరణ సంకెళ్ళ నుండి, యాంత్రిక మనుగడ నుండి నిత్యముక్తుడే. ఎందుకంటే జీవన్ముక్తుడు జననమరణరహిత ఆత్మ జీవనం జీవిస్తాడు కాని, దైహికజీవనం జీవించడు.

*

మనం మనలోని మనకన్న ఉన్నతమైన దానిని గుర్తించినపుడు, దానిచే, శక్తివంతంగా ఆకర్షించబడినపుడు దానిలో వుండిపోవాలి. ఆ సచ్చిదానందమయునిచే తీవ్రంగా ఆకర్షింపబడినపుడు, యీ నిమ్నప్రకృతిని మాయగా భావించి త్యజించి నిర్వాణస్థితిని ఆకాంక్షిస్తాం. నిజమైన నిర్వాణం మనల్ని బంధిస్తున్న నిమ్నప్రకృతి నుండి విముక్తి పొంది ఉన్నతమైన సత్యచేతనా స్థాయిని చేరుకోవడం. సర్వమునకు ఉన్నత సత్యం కారణం మాత్రమే కాదు, అది సర్వమును ఆలింగనం చేసికొని సర్వత్రా వుంటుండడం మాత్రమే కాదు, దాన్ని మనం మరింతగా మరింతగా పొందినపుడు సర్వము మన ఆత్మానుభూతిలో ఉన్నత విలువలతో

రూపాంతరం చెంది, ఆ దివ్యసత్య ప్రకటనకు విలువైన సాధనంగా రూపొందుతుందని, మనకు అనంతత్వంతో బహుముఖంగా సంబంధం కలుగుతుందని, పరమాత్మ సన్నిధికి అధికాధికంగా ఆరోహించగల్గుతామని, చివరగా మనం కనుగొనగలము. పర్యవసానంగా మనం ఆ పూర్ణత్వానికి, దాని విశిష్ట విలువలకు సన్నిహితుల మవుతాము. మనల్ని ప్రేరేపిస్తూ, ప్రోత్సహిస్తున్న ముముక్షుత్వాపేక్ష నుంచి విముక్తులం కాగల్గుతాం.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: బి. నరసింహయ్య

దివ్యకారుణ్యం

ఆ ఊర్ధ్వలోకాల నించి క్రిందికి వచ్చే ఓ దివ్యకారుణ్యం ఉంది. అది కరుణతో, ప్రేమపూరిత వీక్షణాలతో, వివేకంతో, నిశ్చలశక్తితో, ... మన జీవనపోరాటాన్ని, సంఘర్షణని పరిశీలిస్తూ ఉంటుంది. మనిషిలోని, శక్తిని,. బలహీనతని, అతని పుణ్యాన్ని, పాపాన్ని, అతని ఆనందాన్ని, ఆవేదనని, అతని జ్ఞానాన్ని, అజ్ఞానాన్ని, అతడి వివేకాన్ని, బుద్ధిహీనతని, అతని ఆకాంక్షలని, అతని వైఫల్యాన్ని... అంటె అన్ని ద్వంద్వరీతుల్ని కనిపెడుతూ, అతనికి సహాయపడుతూ ఉపశమనం కల్గిస్తూ ఉంటుంది. ఎవరిలో ఏ గుణం ప్రస్ఫుటంగా ఉంటుందో వారిలో పుష్కలంగా ఆ అంశ యొక్క అభివ్యక్తి నిచ్చేది ఆ దివ్యకరుణే. ఆ దివ్యకారుణ్యం ఈ పృథ్విపై అనేక రకాల అభివ్యక్తిని పొందుతూ... కొందరిలో ఆ దివ్యగుణ ప్రభావాన్ని సమృద్ధిగా నింపుతుంది. ఆ విధంగా కొందరు తపోనిష్టుల్లో, దానశీలుల్లో... గొప్ప దయాగుణాన్నిచ్చి వాళ్ళని ప్రేమమూర్తులుగా, గొప్ప ఔదార్యం కలవారిగా తయారుచేస్తుంది. మరి కొందర్ని ఆలోచనాపరులుగా, గొప్ప ధీరులుగా తయారుచేసి విస్తృత పరిజ్ఞానాన్ని అందిస్తుంది. వారిని ధీరులుగా, వివేకవంతులుగా, శక్తివంతులుగా అందరికీ సహాయపడేటట్లు తీర్చిదిద్దుతుంది. ఆర్యవీరుల ప్రతాపాన్ని, ఆత్మశౌర్యాన్ని ప్రతిఫలింపచేసినది అదే కారుణ్యం. అదే కారుణ్యం అతడు, క్షతగాత్రులకు సేవచేసి రక్షించడానికి ప్రేరేపిస్తుంది. ఆ కారుణ్యం అనేక రీతులలో గొప్ప అభివ్యక్తిని పొంది గొప్ప గుణవంతులను, సాహసవంతులను తయారుచేస్తుంది.

ఆ శక్తిమంతుడైన నిరంకుశ పాలకుడిని దండించినది కూడా అదే కారుణ్యం.... ఎందుకంటె దివ్యకరుణ అంతటా ఒకేలా ప్రసరిస్తుంది. దుష్టులను శిక్షించినపుడు కూడా వారిపట్ల కోపం, ద్వేషం ఉండనిదే దివ్యకారుణ్యం. అదే దైవం యొక్క అపార కరుణ. ఎందుకంటె కోపం, ద్వేషం అన్నవి దివ్యగుణాలు కావు. దయామయుడైన దైవం ఈ గుణాల్ని ప్రదర్శించడు. అవి దివ్యలక్షణాలు కావు. దుష్టశిక్షణ చేసినా, శిష్టరక్షణ చేసినా దాని వెనుక ఉన్న దివ్యకారుణ్యం ఏ తారతమ్యాలు లేక ఒకే తీరుగా ఉంటుంది. ఎందుకంటే దైవానికి భేదభావం ఉండదు. పాపులను శిక్షిస్తాడని, దైవం యొక్క కారుణ్యంలో తరతమ బేధాలు ఉన్నట్లు చెప్పిన కథల్లో ఏ మాత్రం సత్యం లేదు. అది కొందరు మిడిమిడి జ్ఞానంతో చేసిన మూఢకల్పనలు మాత్రమే. సర్వత్రా సమభావాన్ని కల్గిన దివ్యకారుణ్యంలో తేడా ఉండదు. దైవం యొక్క కపటత్వం, ద్వేషం గురించిన చెప్పినవన్నీ పరిపక్వత లేనివారు అల్లిన బూటకపు కథలు. వాళ్ళే నరకాన్ని, నరకంలోని చిత్రహింసల్ని సృష్టించారు. ఒక్క భారతదేశంలోని సనాతన ఆధ్యాత్మికత మాత్రం దైవం యొక్క నిష్పక్షపాతమైన, సర్వజీవుల్ని ఒకే దయతో, కారుణ్యంతో, చూసే ఆ దివ్యప్రేమని, కారుణ్యాన్ని స్పష్టంగా దర్శించింది. అందుకే హతమార్చే రాక్షసుడిని సంహరించినపుడు, అలాగే శరణార్థులను ఆ హింసనుంచి, అన్యాయంనుండి కాపాడుతున్నపుడు దివ్యకరుణ సమభావనతో పనిచేస్తుంది. ఒకే ప్రేమతో, దయతో కర్తవ్యనిర్వహణ చేస్తుంది.

మూలం: శ్రీఅరవిందులు
అనువాదం: డి. సత్యవాణి

దివ్యకారుణ్యం — దైవకృప

దైవకృపను గురించి ఒక విషయం చెప్పాలి. ఎందుకనగా, ఇది దాదాపు మానవ మేధస్సు పనిచేసే తీరుకు దీటైన వ్యవహారశైలిగల దివ్యజ్ఞానమని మీరు భావిస్తున్నట్లుంది. కాని యిది అలాంటిది కాదు. తన ప్రాపు కోరేవారి ప్రార్థన లన్నింటిని మన్నించి, అందరిని నిష్పాక్షికంగా అనుగ్రహించే విశ్వవ్యాప్త దైవానుకంపం కూడా కాదు. పుణ్యాత్ముడిని ఆదరించి పాపాత్ముడిని నిరాకరించడు. దైవకృప టార్సస్‌కు

చెందిన సాల్ (Saul Tarsus) అనబడే హింసాత్మకుడికి సహాయ మందించింది. దుష్ప్రవృత్తి కలిగిన సెయింట్ అగస్టీస్‌కు తోడుగ నిలిచింది. జగాయి, మగాయి అను అత్యంత అపఖ్యాతి పాలైనవారికి అండ నిచ్చింది. బిల్వమంగళుడు లాంటి మరెందరో పరివర్తన మానవ నైతిక వివేక పవిత్రతకు అపవాదును ఆపాదించినప్పటికి, వారికి కూడ తోడ్పడింది. అయినా, అది ధర్మవర్తనులకు కూడ తోడ్పడగలదు. నీతిమంతులమనే వారి దర్పాన్ని ఉపశమించ జేసి యిట్టి విషయాలకు అతీతమైన ఒక పవిత్ర చైతన్యస్థితికి దారితీయగలదు. నియమాలన్నిటి కన్నా, విశ్వధర్మాని కన్నా కూడ, మిన్న అయినది. ఎందుకనగా, ఆధ్యాత్మిక జ్ఞానద్రష్ట లందరు ధర్మానికి, దైవకృపకు మధ్య తారతమ్యము చూపారు. కాని, అది వివేచనా శూన్యమైనది కాదు, కేవలం తన స్వంత వివేచనా జ్ఞానాన్ని కలిగి వుంటుంది. ఈ జ్ఞానంతో అది విషయాలను, మనుష్యులను, యుక్తాయుక్త సమయాలను, వాతావరణ పరిస్థితులను బుద్ధితోనో లేక మరో సహజ శక్తితోనో దర్శించుటకు బదులు వేరొక దృక్కోణంలో దర్శించగలుగుతుంది. వ్యక్తిలో మనసు కంతు పట్టని విధంగా దట్టమైన పరదాల మరుగున దైవకృపాస్థితి ఒకటి యేర్పడుతుంది. అట్టి స్థితి సుసంపన్నము కాగానే, దైవకృప స్వచ్ఛందంగా పనిచేస్తుంది. ఇక్కడ మూడు శక్తులుంటాయి. (1) వైశ్వానిక ధర్మము, కర్మ లేదా మరి అలాంటిదేదో (2) ధర్మమనే చక్రము నుండి యెందరిపై ప్రభావము చూపగలదో అందరిపై చూపి, వారి అవకాశాన్ని వారికి అందించగలిగిన దివ్యకారుణ్యము (3) మిగతావాటికన్న లెక్కింప శక్యము గానిదేకాక తిరుగులేని విధంగా పనిచేసే దైవకృప. ఇక్కడ ఒక ప్రశ్న ఉదయిస్తుంది. జీవితంలో యెదురయ్యే విపరీత పరిస్థితులన్నింటి వెనుక, పిలుపునకు ప్రతిస్పందించి దైవకృప యొక్క వెలుగు కోసం యెంతటి కష్టాన్నైనా ఓర్చుకొని తనకు తాను స్వయంగా తెరుచుకోగలదేదైనా వున్నదా? అని. "అది" మానసికమైన, ప్రాణికమైన కదలిక కాకూడదు. ఎంతో కొంత అంతర్చక్షువునకు గోచరించే అంతశ్చలనము అయివుండాలి. అది ప్రసన్నమై ముందుగా కార్యాచరణకు ఉపక్రమించినపుడు, సమగ్ర చర్య చేపట్టనెంచి ఒక కీలకనిర్ణయం కోసమో లేక మార్పు కోసమో దైవకృప వేచియున్నా కూడా. దైవానుకంపం పనిచేయగలదు. ఎందుకనగా దైవకృప యొక్క చర్య భవిష్యత్కాలానికి వాయిదాపడే అవకాశమున్నది, కారణం, జీవిలోని యేదో ఒక్క భాగమో లేక స్వాభావిక స్థితియో, స్వీకరించుటకు సంసిద్ధంగా

లేని దేదైనా, ఆటంకం కావచ్చు.

మూలం: శ్రీఅరవిందులు

(*SABCL* Vol. 23, pp. 609-10)

ప్రశ్న: మధురమాతా! శ్రీఅరవిందులు దైవ అనుకంపము మరియు దైవకృప యొక్క ప్రభావము గురించి మాట్లాడారు. కాని ఈ రెండింటి మధ్య వ్యత్యాస మేమి?

సమా: అనుకంపం అందరి బాధలను, వారు అర్హులైనా కాకపోయినా, ఉపశమింపజే యుటకు ప్రయత్నిస్తుంది. దైవకృప బాధించే హక్కు ఉనికిని ఒప్పుకొనదు. దానిని రద్దుపరుస్తుంది.

(*CWM* Vol. 16, p. 346)

ప్రశ్న: "అనుకంపం" అనగా అర్థమేమి?

సమా: అనుకంపం "Misericordi" అను ఫ్రెంచి పదానికి సమానమైనది. అది శక్తి మరియు దయతో పూర్తిగా నిండియున్న కరుణ. అన్ని అపరాధాలను ఉపేక్షించి, ప్రతి ఒక్కరికి యెల్లవేళల వారికి ఉత్తమోత్తమమైనదేదో దానినే అభిలషిస్తుంది.

(*CWM* Vol. 17, p. 10)

మూలం: శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

ప్రశ్న: మీ అనుకంపముకు చిహ్నమైన పుష్పము యెందు కంత సుకుమారమై, అంత త్వరగా వాడిపోతుంది?

సమా: లేదు. అనుకంపం — దాని చిహ్నముతోపాటు వాడి పోదు — స్వయం శాశ్వతత్వాన్ని కలిగి ఉండే వాటియొక్క లిప్తమాత్ర ప్రతినిధులే పుష్పములు.

అరవిందులు

ప్రార్థనలు — ధ్యానములు

ఓ ప్రభూ, నీ సమక్షంలో నా గర్వం మొత్తం సడలిపోయింది. నీ యెదుట యెవ రైనా తనను తాను అధగమించి గొప్పగా భావించుకోడం యెంత పనికిమాలిన విషయమో నా కర్థమయింది. ఏ నిర్బంధం లేకుండా విపరీతంగా హాయిగా యేడ్చి, యేడ్చి విడిచిన ఆ మధురాతిమధురమైన నా జీవితపు కన్నీళ్ళు, ఓ నా, మహ నీయ ప్రేమమూర్తీ! పసిపాప మాదిరిగా ఆనందమయమయ్యాయి. ఒకేసారి నవ్వు, యేడుపు కలగలిపిన చిరునవ్వుతో నీ ముందు నిలుచున్నాను. అబ్బ! ఎంత విశ్రాం తి! ఎంత ప్రశాంతత! ఎంత మధురంగా వున్నాయి. ఏ సిగ్గూ, సంకోచం లేకుండా నీ యెదుట విడిచిన ఆ కన్నీళ్ళు! తండ్రి చేతులలో వున్న పసిపాపవలె కాదా? కాని, ఎలాంటి తండ్రి! ఎంత మహనీయత! ఎంత దివ్యత్వం! ఎంత అవ గాహన! బదులు పల్కరింపులో యెంతటి ఆధిక్యత, యెంతటి పరిపూర్ణత! నా కన్నీళ్ళు పవిత్ర హిమబిందువులు సుమా! నే నేడ్చింది నా స్వంత గోడు కోసం కాదు. అలా అని అనుకుంటున్నావా! కన్నీళ్ళు మధురమైనవి, ప్రయోజనకరమైన వి. కన్నీళ్ళు యే నిర్బందాలు లేకుండా నా హృదయాన్ని నీ ముందు తెరిచి ఉంచుతాయి. ఒకానొక అద్భుత క్షణంలో కరిగిస్తాయి. మిగిలినవన్నీ ఆటంకా లయి నన్ను నీ నుంచి వేరుచేస్తాయి.

కొన్ని రోజుల క్రిందట నేనిది విన్నాను., తెలుసుకున్నాను. "నువ్వు నా యెదుట యే రకమైన నిగ్రహం, దాపరికం లేకుండా దుఃఖించడం సంభవిస్తే చాలా విషయాలు మారిపోతాయి. ఒక గొప్ప విజయం జయించబడుతుంది." అందుకే హృదయం లోంచి బయలుదేరిన కన్నీళ్ళు కళ్ళ వరకూ వస్తాయి. నేను వస్తాను. నీ ముందు కూర్చుంటాను. భక్తితో నీకు నివేదనగా ఆ కన్నీళ్ళు ప్రవహిస్తాయి. ఆ నివేదన యెంత హాయిగా, యెంత మధురంగా వుంటుందో!

ఇప్పుడు అసలు యేడవనప్పటికీ, నీకు నేను యెంతో యెంతో దగ్గరగా వున్న అనుభూతితో నిలువెల్లా పులకించి కంపించిపోతాను.

తడబడే మాటలతో నా భక్తిని వెల్లడించుకోనీ:

పసివాడిలా ఆనందంతో గట్టిగా యేడుస్తాను కూడా, "ఓ పరమాత్మా! ఓ ఏకైక విశ్వసనీయా! మేమేం చెప్పబోతున్నదీ మా కంటె నీకే తెలుసు. ఎందుకంటే

నువ్వే దానికి మూలం కనుక."

"ఓ పరమాత్మా! ఓ ఏకైక మిత్రమా! నువ్వు అంగీకరిస్తావు. నువ్వే ప్రేమిస్తావు, నువ్వే అర్థం చేసుకుంటావు, ఎలా వున్నవాళ్ళని, అలా మమ్మల్ని. ఎందుకంటె ఆ రకంగా మమ్మల్ని తయారుచేసినవాడివి నువ్వే కనుక".

"ఎవరైతే వింటున్నాడో, అర్థం చేసుకుంటున్నాడో, మార్గదర్శి అవుతున్నాడో వాడికోసం నీలోకాక మరెక్కడో వెతకడం శుద్ధ మూర్ఖత్వం. మా పిలుపుకు యెప్పుడూ అందుబాటులో వుంటావు. ఎన్నడూ మమ్మల్ని నిరాశపరచలేదు."

"ఏ విధమైన మినహాయింపులు, భేషజాలు లేకుండా ఏ ప్రయత్నం, నిర్బంధం లేకుండా సమగ్ర విశ్వాసంతో కూడిన పరమానందం, వొక స్పష్టమైన ప్రశాంతత, సమర్పణలో పరిపూర్ణతతో నేను పరమాత్మని తెలుసుకోగలిగేటట్లు నువ్వే నన్ను తయారుచేసేవు.'

"ఓ నా ప్రేమైకమూర్తీ! పసివాని ఆనందంతో కూడిన ఆనందంతో నీ ముందు, ఏకకాలంలో, చిరునవ్వు నవ్వాను, ఏడ్చాను".

మూలం: శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

గొప్ప విశ్వజనీన కారుణ్యం

ఒకరికి దుఃఖం కలిగిన ప్రతిసారి, దైవం (విశ్వాత్మ) యొక్క మొత్తం దుఃఖానికి మరొక దుఃఖం కలుస్తుంది.

ఇట్టి ప్రగాఢ కారుణ్యస్థితి నుండి దైవం భౌతికంలో పనిచేస్తాడు. ఈ ప్రగాఢ కారుణ్యమే భౌతికంలో చైత్యపురుష ఖేదంగా అనువదించబడ్తుంది.[1] అది తలక్రిందులైనట్లు ఉంటుంది ఈ విధంగా (శ్రీమాత తన రెండు చేతులు కలిపి, వెనుకకు

[1]*ప్రశ్న: ఈ రోజుల్లో నేననుభూతి చెందుతున్నాను, ఒక ప్రగాఢమైన దుఃఖాన్ని: అది తెస్తుంది నా కళ్ళల్లో ఒక కన్నీటి ప్రవాహాన్ని. దానిలో అనిశ్చితిగాని, కల్లోలంగాని లేవు. ఇంకా చెప్పాలంటే, అక్కడ ఉన్నది ఒక అనుభూతి, ప్రశాంతత, స్వచ్ఛత — గాఢంగా బరువెక్కిన హృదయంతో కూడినది. 'చైత్యపురుష దుఃఖం' అని పిలవబడే దిదేనా?*

జ: అవును. ఆ తరహా చైత్యపురుష దుఃఖం ఉన్నది. కాని చైత్యపురుష కన్నీరు (psychic tears) దుఃఖంతో కూడి ఉండనవసరం లేదు. ఆనందం, ఉద్వేగంతో కూడిన కన్నీరు కూడ ఉన్నది.

తిప్పి, ఏదో సమర్పిస్తున్నట్లు తెరుస్తారు).

దైవం యొక్క ఈ కారుణ్యస్థితి, చైత్యపురుష చైతన్యంలో దుఃఖంగా మార్చబడుతుంది. ఈ దుఃఖం, వ్యక్తిగతం కాదు. ఇది ... విశ్వ (ఆత్మ) దుఃఖంతో మమేకం కావటం. 'ప్రార్థనలు — ధ్యానములు' లో ఈ విషయం చెప్పా. (చివరి వాటిల్లో, ఒక దానిలో) నేను నా అనుభవాన్ని వర్ణించా, సుదీర్ఘంగా. 'నేను ఏడ్చా — నా జీవితంలో అత్యంత మధురమైన కన్నీటిని'[2] అని చెప్పా దాంట్లో. ఎందుకంటే, నేను నా కోసం ఏడ్వలేదు — అదీ సంగతి. మీకు తెలుసా — మానవులెప్పుడూ దుఃఖిస్తారు, వ్యక్తిగత కారణాల వల్ల. ఉదాహరణకు వారు ఒకరిని పోగొట్టుకుంటారు — వారు ప్రేమించినవారిని. బాధపడ్తారు, ఏడుస్తారు: కాని అది ఆ వ్యక్తి స్థితిని గురించి కాదు, వారు ఎక్కువ కాలం ఏడ్చేది. నూటికి తొంభైమందికి ఆ వ్యక్తి స్థితి తెలియదు: ఆ వ్యక్తి సుఖంగా ఉన్నాడో, దుఃఖంగా ఉన్నాడో తెలియదు: ఆ వ్యక్తి ప్రశాంతంగా ఉన్నాడో, బాధపడ్తున్నాడో తెలియదు. ఆ వ్యక్తి నుండి తాము వేరు పడి ఉన్నామనే అనుభూతి పైనే, వారి దుఃఖమంతా. ఎందుకంటే, వారు ప్రేమిస్తారు. ఆ వ్యక్తి తమ దగ్గర ఉండడాన్ని — కాని, అతడు పోయాడు. అందుచేత మానవ దుఃఖానికి మూలం ఎల్లప్పుడూ — చైత్యపురుష ఖేదం తన వైపుకు వెనుదిరగడంగా ఉంటుంది. ఎక్కువ లేదా తక్కువ ఎరుకతో; ఇది ఎప్పుడూ ఉంటుంది. ఒకరు ఇంకొకరి దుఃఖానికి ఏడ్చినపుడు కూడ అది మిశ్రమంగా ఉంటుంది. ప్రాణికం దుఃఖంలో చైత్యపురుషఖేదం మిళితమైనపుడు, అదే వెనుదిరిగిన కారుణ్యపు అంశ. అది సత్వములో ప్రవేశిస్తుంది. దీనిని వ్యక్తిగత సానుభూతి నుండి వేరుచేసి చూడగల్గినప్పుడు — తన వ్యక్తిగత అహంకారం నుండి బయటపడి దృష్టి కేంద్రీకరించగల్గితే, దానితో మమేకం కాగల్గితే — అప్పుడు, దీని ద్వారా విశ్వజనీన కారుణ్యంతో సంబంధం ఏర్పర్చుకోవచ్చు. ఈ విశ్వజనీన కారుణ్యం అత్యంత ఉన్నతమైనది. విశాలమైనది. ప్రశాంతమైనది. శక్తివంతమైనది, లోతైనది. పరిపూర్ణ ప్రశాంతితో కూడినది. అనంతమైన మాధుర్యం కలది. 'నీవు దుఃఖాన్ని గాఢంగా తెలుసుకుని లోతుగా పోవడం తెల్సుకో' — అని నేనన్నపుడు నేను ప్రస్తావించేది ఈ విషయమే. నీకు కనీసం, దుఃఖం లోతుకు

[2] 'ప్రార్థనలు — ధ్యానములు' — 12 జూలై 1918

పోవడం మాత్రం తెల్సుంటే — తిన్నగా దాని హృదయంలోకి (మూలంలోకి) వెళ్లు. నీ వ్యక్తిగత, అహంకారపూరిత భాగాలను దాటుకుని లోతుగా వెళ్ళు. అప్పుడొక గొప్ప, ఆశ్చర్యకరమైన, ఆనందకరమైన, జ్ఞానంతో కూడిన దృశ్యానికి తలుపు తెరుచుకుంటుంది. దీని అర్థం — దుఃఖం కోసం దుఃఖాన్ని అన్వేషించ మని కాదు.

కాని, అది అక్కడ ఉన్నప్పుడు, అది నీపై పడినపుడు — నీవు నీ వ్యక్తిగత అహంకారపు దుఃఖం నుండి లేచి నిలబడగల్గినపుడు — ఎల్లపుడు, మొదట — దాని లో వ్యక్తిగత భాగాన్ని చూడాలి; నిన్ను ఏది బాధిస్తుందో దానిని చూడాలి; నీ బాధకు ఏది వ్యక్తిగత కారణమో దానిని చూడాలి. దాని నుండి పైకి లేచి, అతీ తంగా — ఏదైతే విశ్వజనీనమో, ఏదైతే మూలసత్యమో, దాని వైపు పోవాలి. అప్పుడే నీవు ప్రవేశిస్తావు ఒక అనంత కారుణ్యం లోకి. అప్పుడే అక్కడ నిజంగా తెరుచుకుంటుంది నీకు చైత్యపురుష వాకిలి.

అందుచే ఏ ఒకరైనా కన్నీరు కారుస్తుండగా నీవు చూస్తే ఆ సమయంలో ఎవ రైనా దానితో మమేకం కావాలని ప్రయత్నిస్తే — ఆ కన్నీటిలో ప్రవేశించి కరిగిపో వాలని ప్రయత్నిస్తే — అది చైత్యపురుష చేతనకి తలుపును తెరువగలదు. మీకు అర్థమయిందా? తాను తలుపు తెరువగలదు; సంపూర్ణ అనుభవం పొందగలదు — చాల అపురూపమైన అనుభవం — అది అతని చైతన్యంలో లోతైన ముద్ర వేయగలదు. సాధారణంగా అది ఎప్పటికీ చెరగదు. కాని ఆ తలుపు మళ్ళీ మూసు కుంటే, నీవు మళ్ళీ ఇప్పుడున్నట్లు సాధారణ కదలికలలో కనక ఉంటే, ఆ విశ్వజనీన కారుణ్యం ఇంకా ఎక్కడో నీ వెనుకనే ఉంటుంది. తీవ్రంగా దృష్టి కేంద్రీకరించిన క్షణాల్లోనే, దాని వద్దకు నీవు తిరిగి చేరుకోగలవు; దాని అనుభూతి పొందగలవు — అదెంత ఉత్కృష్టత! ఎంత మాధుర్యం! ఎంత గొప్ప ప్రశాంతత! అది అర్థం చేసుకుంటుంది (బుద్ధితో కాకుండా); దాని కన్ని వస్తువులపై అనుకంపముంటుంది. అన్నిటినీ పెనవేసుకుంటుంది.అన్నిటికి ఉపశమనం కల్గిస్తుంది.

(*CWM* Vol. pp. 144-46)

మూలం: శ్రీమాత

భావానువాదం: యస్.వై. సోమయాజులు





కారుణ్యం, కృతజ్ఞతలు చైత్యపురుష సుగుణాలు

కారుణ్యం, కృతజ్ఞతలు సారభూతంగా చైత్యపురుష చేతనకి సంబంధించిన సుగుణాలు. వ్యక్తి దైనందిన జీవితంలో చైత్యపురుషుడు బలంగా వ్యవహరించినపుడు ఆ వ్యక్తి చైతన్యములో ఇవి వెల్లడవుతాయి.

బలముతో కూడిన శక్తికల ప్రాణిక, భౌతికాలు వీటిని తమ బలహీనతలుగా అనుభూతి చెందుతాయి. వాటి శక్తిసామర్థ్యాలు ఆధారంగా ఆవిష్కరిస్తాయి. వాటి స్వేచ్ఛాప్రేరణలను నిరోధిస్తాయి.

సాధారణంగా బుద్ధి తగినంతగా వికాసం చెందనపుడు తన భాగస్వామియైన ప్రాణికము భౌతిక ప్రకృతికి బానిసయై, అసంపూర్ణ చైతన్యంతో నున్న యాంత్రికత్వముతో సంపూర్ణ అవగాహనతో ఉండదు. చైత్యపురుషుని తొలి స్పందనలకు బుద్ధి మేల్కొనినపుడు, అది తన అజ్ఞానముతో కారుణ్యాన్ని ఔదార్యాంగాను, కృతజ్ఞతను ఉపకారానికి ప్రత్యుపకారం చేయటంగా మారుస్తుంది. తర్వాత నెమ్మదిగా చైత్యపురుష చలితచాలనాలను గుర్తించినపుడు హర్షాతిరేకంతో మెచ్చుకోగలిగే శక్తిని సంతరించుకుంటుంది.

చైత్యపురుషుని చైతన్యము వ్యక్తిలో సర్వశక్తివంతముగా ఉన్నప్పుడు మాత్రమే ఏ భూమికలోనైనా అవసరమైనపుడు అందరిపట్ల కారుణ్యము పొంగుతుంది. ఏ రూపంలో దివ్యానుగ్రహం వ్యక్తమయినా దాని పట్ల కృతజ్ఞతాభావం కలుగుతుంది. ఇవి వాటి మౌలికమైన ప్రకాశం స్వచ్ఛతలతో వ్యక్తమవుతాయి. కారుణ్యం ఏమాత్రం దిగజారదు. కృతజ్ఞతలతో ఆత్మన్యూనతాభావం మిళితమవదు. వీటి జాడా ఏమాత్రం వాటిలో కనపడదు.

మూలం: శ్రీమాత

అనువాదం: సిద్ధులగారి త్రివేణి

విశ్వచైతన్యంలో జీవనం

ప్రశ్న: విశ్వచేతనలో మనుగడ సాగించేవారి జీవితాలు, లేదా, అలా జీవించటానికి ప్రయత్నించేవారి జీవితాల దృష్టాంతాలు నా జీవితంలో నాకెన్నో తారసపడ్డాయి. ఇతరుల బాధలకు అంతగా సానుభూతి చూపించే, దయార్ద్ర హృదయులుగా వాళ్లు నాకు అనిపించ లేదు. స్వీయ వేదనలకు సంబంధించినంతవరకు సచైతన్యంగా మనం ఉండనవసరం లేకపోవచ్చు. అలా లేకపోయినా ఇతరుల బాధల విషయంలో సానుభూతి చూపవలసిన అవసరము ఉంటుందనుకుంటాను. వ్యక్తిగతంగా సచేతనులమై ఉన్నప్పుడే సాటి సోదరుల కష్టాలకు తీవ్రంగా స్పందిస్తామనుకుంటాను. ఈ విషయంలో నా అభిప్రాయం పొరపాటు కావచ్చు. మీరు విశదీకరించగలరు.

సమాధానం: అలాటి వాళ్ళు నిస్సంశయంగా విశ్వచేతనతో కూడిన జీవనం జీవిస్తున్నారా? లేదా అలా ఉంటే వారు అంత దయార్ద్రహృదయులుగా ఉండకపోవటం వాస్తవమా? వాళ్ళు బాహ్యంగా ప్రస్ఫుటమయేలా సానుభూతి, ఆర్ద్రతలు ప్రకటించకపోవచ్చు. ఆచరణలో కనపర్చకపోయినా, మానవత్వాన్ని చూపటం లేదా?

లోకంలో ఇతరుల అనుభవాలపట్ల ఉదాసీనత వహించే వ్యక్తి తాను పరిపూర్ణంగా విశ్వచైతన్యంలో నివసించనివాడే అయి ఉంటాడు. వ్యక్తిగతంగా ఆత్మసంతృప్తి కలిగినవాడై ఉంటాడు. లేదా ఏదో రకమైన నిరాకార సార్వత్రిక తత్వ సంసర్గం కలిగి ఉండి, అందులో సంలీనమై ఉంటాడు. దానికి సంబంధిత ఏ కార్యక్రమంతోను సంబంధం లేకుండా, ప్రాపంచికానుభవాలకు అతీతంగా అంతర్ముఖుడై ఉండి ఉంటాడు. ఆత్మానుభవపరంగా పురోగతికి ఈ పరిస్థితులన్నీ ఉపయుక్తమైనవే. కాకపోతే అవే విశ్వచైతన్యంగా పరిగణింపబడవు.

మనిషి విశ్వాత్మచేతనలో జీవించి ఉన్నపుడు, ప్రాపంచిక జీవనంతో కూడా అవశ్యంగా సంలీనమై ఉంటాడు. ఆతని దృక్పథం అహంకారస్థితి నుంచి ఉన్నత భూమికలకు, కారుణ్యం, ప్రేమ, పరోపకారం వైపునకు, ఊర్ధ్వగమనంలో పెనుగులాడుతూ ఉంటుంది. అనంత నిరహంకారస్థితిలోనే అనంత కారుణ్యాసాగరంలో మునక వేయటం జరుగుతుంది. ఇదే బౌద్ధుల అభిప్రాయం. సర్వభూత కారుణ్యం

కలిగి అందరికి మేలు చేకూర్చటమే వ్యాపకంగా కలవాడు విముక్తుడైన సన్యాసి అని గీత, ఇతర హైందవ గ్రంథాలు అభివర్ణించాయి. ఈ విశ్వవిశాల ఔదార్య ప్రవృత్తి, బాహ్యంగా ఉద్వేగభరిత అనుకంపరూపాలుగా, క్రియాశీల దాతృత్వాలుగా ఆచరణలో ప్రకటితం కానవసరం లేదు. మనిషి దివ్యచేతనన యొక్క సర్వావస్థలు, స్వభావాలు, ఉపయుక్తమైన ఒకే ఒక సహాయ కార్యక్రమానికి కట్టుబడి ఉండనవసరం లేదు. అదెంతో మేలుచేసేది, అత్యంత ఆకర్షణీయమైనది, అత్యంత సౌందర్యోపేతమైనది కావచ్చు. సానుకంప స్వభావం మరింత ఉన్నతతరంగా ఉండవచ్చు. ప్రత్యేక బాధలతో కూడి ఉన్నవారికి స్పష్టమైన ప్రయోజనాన్ని సమకూర్చే దానికంటే కూడా మరెంతో మేలు కలిగించేది ఒకటి ఉంటుంది.

అహంకారపూరిత చైతన్యం ఎన్నో భావావేశస్థాయిలలో ముందుకు సాగుతుంది. తొలుత దానికది కట్టుబడి ఉంటుంది. కనుక అది ఇతరుల అనుభవాలకు ప్రతిస్పందించక బండబారిపోయి ఉంటుంది. తర్వాత తనతో తాదాత్మ్యతాభావం ఏర్పర్చుకున్నవారి పట్ల సానుభూతి చూపుతుంది. తటస్థంగా ఉన్నవారితో తటస్థంగానే ఉంటుంది. ప్రతికూలంగా ఉన్నవారితో ద్వేషభావం కలిగి ఉంటుంది. ఈ రకమైన సంబంధాన్ని అధిగమించినపుడు పరిహితత్వ సూత్రాన్ని స్వాగతీకరించేందుకు సంసిద్ధమై ఉంటుంది.

అయితే, ఔదార్యానికి, పరహితత్వానికి ప్రేరణ సాధారణంగా ముందు స్వార్థమే అవుతుంది. ఎదుటివాళ్ళ బాధ చూడగానే కలిగే ఇబ్బంది, అసౌకర్యం, నీ దయాళుస్వభావానికీ లభించే ప్రశంసలు, నీ ఉపకారస్వభావానికి, నీవు పొందే స్వోత్కర్ష, ఇతరుల పట్ల నీవు చూపే సానుభూతివల్ల సంతృప్తి పొందాలనే తపన — ఇవి ప్రేరణ కలిగిస్తాయి. కొంతమంది పరులకు ఉపకారం చేయాలనే తపన కలిగి ఉంటారు. తమ వితరణకి అవకాశం కల్పించే పేదవాళ్ళు వాళ్లకు ఎప్పుడూ అందుబాటులో ఉండాలి. అందుకో కార్యరంగం కావాలి వాళ్లకి.

విశ్వచైతన్యం గురించిన ప్రస్తావన వచ్చినపుడు, వ్యక్తిగత ప్రేరణలు, అవసరాలు — వీటన్నిటితోపాటు — ఇతరుల జీవితాలతో మన జీవితం కూడా సమైక్యం కావటం, వాళ్ల ఆనందం మన ఆనందంగా, వాళ్ళ బాధ మన బాధగా మనం అనుభవించటం, వాస్తవం. అయితే ఒక్క విషయం. ఇదే విశ్వచేతనకు అత్యున్నత షరతు అని పొరబడకూడదు. కొంతకాలానికి ఏమవుతుందంటే, మన బాధలకు,

ఇతరుల బాధలకు మన నుంచి ఇక ప్రతిఘటన అంటూ ఉండదు. అవి అలా మన లను స్పృశిస్తాయి. మనలను సహకరించేలా ప్రతిస్పందింప చేస్తాయి. అయితే ఇక్కడ మరో పరిస్థితి ఉంది. ఈ స్థితిలో బాధకు బానిస కావటమనేది అసలుండదు. ఎందుకంటే మనం దివ్యానంద సంప్రాప్తి లభించినవాళ్లంగా బ్రతుకుతాం కాబట్టి. అయితే ఇది మన ప్రేమను, పరోపకారపరాయణత్వాన్ని నిరుత్సాహపర్చదు. తల్లి, పిల్లల నిరుత్సాహ, నిర్వేదాలకు తానూ నిరుత్సాహపడుతుందా? పడదు. సరి కదా వారిని మరింత ప్రేమవాత్సల్యాలతో ఆదుకుంటుంది.

మనుష్యులకు మనం చూపే సానుభూతి వాళ్ల పరితాపాలను ఉపశమింపచేయటంలో సహాయం అందించటం మాత్రమే కాదు. బాధ అనే చెట్టుకొమ్మలను నరికిపారవేయటం, సరే, మంచిదే. కాని అవి మళ్లీ పెరుగుతవి. సమూలంగా కోరిక అనే విషవృక్షాన్ని పెకలించివేయటంలో సహకరించటమనేది ఇంకా ఎంతో దివ్యమైన సహాయం. ప్రశాంతత, దివ్యానందవరం — ఇవెంతో మరింత యెన్నదగిన వరాలు — వ్యక్తిగతంగా సానుభూతి, ఔదార్యాలు కుమ్మరించటం కంటే కూడా. వైశ్వానిక చేతనతో సమైక్యత అత్యున్నతమైన పర్యవసానం.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

దైవము — క్షమ

ఒక సాధకుని లేఖకు శ్రీమాత సమాధానము (1939 లో)

ప్రశ్న: నా ప్రాణానికి ప్రాణమా! నా ప్రియాతిప్రియమైన మాతా! నా ప్రేమను స్వీకరించు. ఇంత కాలంగా చేస్తున్నట్లుగానే నా తప్పులను క్షమించు. నాలో వస్తూ పోతు ఉండే నా మానసికస్థితులను నేను ముందే ఊహిస్తాను. అయినా నాలో కదిలే ఈ మేఘాల మాటున నీ సుందర మందహాస వదనారవిందము అదృశ్యము గాకుండు గాక!

నా ప్రియమైన బిడ్డా,

నీ ఆపద లన్నిటినీ నీవు తొందరలోనే నిజంగా అధిగమిస్తావని నేను ఆశిస్తున్నాను. ఉన్నత చేతనకు ఒకే ఒక్క గంతు. అక్కడ నీ సమస్యలన్నీ పరిష్కరింపబడు

తాయి. నీ కష్టాలు తీరుతాయి. నిన్ను నేను క్షమిస్తున్నానని అనుకోను. ప్రేమ క్షమించదు. అవగాహన చేసుకుని స్వస్థత చేకూరుస్తుంది.

సదా ప్రేమపూర్వక ఆశీస్సులతో –

"ఉన్నత చైతన్యానికి ఎలా పైకి యెదగాలి, గంతువేయాలి', అని సాధకుడు అడిగిన దానికి శ్రీమాత వివరణ.

అందుకు ఉత్తమోత్తమ పద్ధతి – మానసిక ఆందోళన లేకుండా చూసుకోవటం అలాగే ప్రాణికకామనలు, సంక్షోభాలను నిరాకరించటం మనోహృదయాలను నిరంతరం దైవానికి అనుసంధానం కావించుకుంటూ ఉండటం. ఇందుకు దైవప్రేమ అత్యంత బలీయమైన శక్తిగా పనిచేస్తుంది.

*

శ్రీఅరవిందులవారి సూక్తులకు శ్రీమాత వివరణ (1960 లో)

క్షమాగుణాన్ని క్రైస్తవులు, వైష్ణవులు శ్లాఘిస్తారు. నేనైతే ఒక్కటి అడుగుతాను. "నేను దేనిని క్షమించాలి, యెవరిని క్షమించాలి?"

దైవాన్ని క్షమించమని కోరినపుడు ఆయన మనలను యెల్లవేళలా క్షమిస్తాడా?

శ్రీఅరవిందులు దీనికి దివ్యమైన సమాధానం ఇచ్చారు. "క్షమించే దెవరిని, దేనిని?" తనే సర్వస్వమని, కాబట్టి, సర్వకర్మలు తనవేనని, తానే సర్వవిషయములు అని, ప్రభువుకు తెలుసు. క్షమించటానికి – క్షమింపబడే వారెవరు? క్షమించబడేది ఏది? క్షమించేవాడు, క్షమించేది తానుగాక మరెవరో, మరేదో అయి ఉండాలి.

వాస్తవము ఏమంటే – క్షమాపణ కోరేవాడు తాను చేసిన తప్పువల్ల ఉత్పన్నమయే విపరీత పరిణామాలు పూర్తిగా తుడిచిపెట్టుకుపోతాయని ఆశిస్తాడు. కాని నీవు చేసిన పొరపాటుకుగల కారణాలు లేకుండాపోయినపుడు మాత్రమే ఇది సాధ్యమవుతుంది. అజ్ఞానంవల్ల నీవొక తప్పు చేశావనుకో. ఆ అజ్ఞానం వైదొలగిపోవాలి. దుర్మార్గపుటాలోచనతో తప్పు చేసినపుడు, దుర్మార్గం లేకుండాపోవాలి. అక్కడ సన్మార్గం చోటు చేసుకోవాలి. విచారం వ్యక్తం చేసినంత మాత్రాన సరిపోదు. మరో అడుగు ముందుకు వేయాలి.

నిరంతరంగా విశ్వం పరిణామం చెందుతోంది. ఏదీ నిశ్చలంగా ఉండదు.

ప్రతీదీ నిత్యమూ మారుతూనే ఉంటుంది. ముందుకో, వెనక్కో కదులుతూనే ఉంటుంది. వెనక్కి మళ్లించే విషయాలు, కర్మలు మనకు చెడ్డగా అనిపిస్తాయి. అవి గందరగోళాన్ని సృష్టిస్తాయి. అందుకు ప్రతిక్రియగా ముందడుగు, ప్రగతిమార్గంలో పురోగమనమే కావాలి. ఈ రకమైన స్పష్టమైన ఒక నూతన అవగాహన — ఇదే తిరోగమన పరిణామాలను నిర్మూలించగలిగేది.

అందుచేత మనం దైవాన్ని అర్థించవలసినది అస్పష్టమైన, ఆచరణయోగ్యం గాని క్షమాభిక్షగాక, పురోగమనశీలమైన శక్తిని అర్థించాలి. కావల్సినది అంతరంగ రూపాంతర పరిణామం. చేసినదానికి అనుభవించవలసిన ఫలితాలను తుడిచివేసేది ఇది మాత్రమే.

22. దైవం మానవహస్తంతో నన్ను దెబ్బ కొట్టేడు. అపుడు, నేను, ''ఓ దేవా, నీ తృణీకారభావాన్ని క్షమిస్తాను" అని చెప్పాలా?

23. భగవంతుడు ఒక దెబ్బతో మంచి చేశాడు. అపుడు నేను "ఓ దేవా! నిన్ను క్షమిస్తున్నాను, నీవు నన్ను పెట్టిన బాధకి. ఇక మరెప్పుడూ అది చేయకూ?"
ఏమిటి దీని అర్థం "దేముడు మానవహస్తంతో దెబ్బ కొట్టేడు" అన్న దానికి?

అందరిలోను, సర్వత్రా దైవం కొలువై ఉన్నదనడాన్ని నొక్కి చెప్పటానికి ఈ రెండు సూక్తులు ఉదాహరణలు. అంతే కాదు. ముందు చెప్పినట్లు క్షమించడానికి ఎవరూ లేరు, ఏదీ లేదు. ఎందుకంటే సర్వమునకూ మూలము జగన్నాథుడే కాబట్టి — అనే భావాన్ని బలపరుస్తాయి.

"భగవంతుడు నన్ను మానవహస్తంతో కొట్టేడు" — దీనిని ఈ విధంగా అధ్యయనం చేసి, అర్థం చేసుకోవాలి. బాహ్యంగా దర్శించినపుడు అది ఓ మనిషి మరొకరిని కొట్టడం అవుతుంది. దివ్యసత్యాన్ని ఆలోకించి, అవగాహన చేసుకున్నపపుడు, అది, మానవహస్తంతో జగన్నాథుడు కొట్టిన దెబ్బ. ఆ దెబ్బ తిన్నవాళ్లకి అవశ్యంగా మంచే జరుగుతుంది. అంటే, అది అతని చైతన్యపు రోగతికి దోహదపడుతుంది. దివ్యచేతన లోనికి మేల్కొనడమే కదా సృష్టి పరమార్థము!

ఇదొక్కటి నీవు అర్థం చేసుకున్నపుడు, మిగిలిన రెండు సూక్తులు సులువుగానే బోధపడతాయి.

భగవంతుడు మనకు చేసిన ఉపకారానికి, ఆయనను, మరింకెప్పుడు చేయ

వద్దని చెప్పి, క్షమిస్తామా? ఇదెంతటి తెలివితక్కువ సూత్రమో, స్వవచన వ్యాఘాతమో తెలుస్తూన్నది కదూ!

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

ఆదర్శవంతమైన క్షమాగుణం

కథానిక

మేఘాల మాటు నుంచి చందమామ దోబూచులాడుతోంది. కింది అల్లంత దూరాన ఉసురుసురనే గాలులు గుసగుసలతో గలగలా వయారంగా పారే యేరు. మసక వెన్నెల్లో నేలంతా అత్యద్భుతంగా సౌందర్యాన్ని పరుచుకొని ఉంది. దివ్యనందన వనాన్ని తలదన్నేలా వృక్షాలతో, గుల్మాలతో, పుష్పాలతో అద్భుత అందాలు చిందుస్తూ ఉన్నాయి, చుట్టూ ఋషివాటికలు. అలాటి ఆనందపారవశ్యత కలిగించే ఆ రాత్రి, బ్రహ్మర్షి వశిష్ఠుడు తన సతీమణి అరుంధతీదేవితో "దేవీ, ఋషి విశ్వామిత్రుని దరిగి వెళ్ళి కొంచెం ఉప్పు అడిగి తీసుకురా" అన్నాడు. ఈ కోర్కెకి అరుంధతీ దేవి బిత్తరపోయింది. అడిగింది, "ఇదేమిటి, స్వామీ, మీరు నన్ను ఏమి చేయమంటున్నారు? నాకేమీ అర్థం కావటం లేదు. నా నూర్గురు సంతానాన్ని కొల్లగొట్టిన వానిని..." ఈ మాటలు అంటూంటే దుఃఖాతిశయభారంతో ఆమె గొంతు గద్గదమైయింది. మదిలో గత స్మృతులు మెదిలాయి. ప్రశాంతతకు ఆలవాలమైన అద్భుత హృదయ మామెది. ఆ గుండెలో వ్యధ నెలకొనగా, అంది ఆమే, "ఇలాటి వెన్నెల రాత్రులలో, నా నూర్గురు సుతులు వేదాధ్యయనం చేసేవారు కదా!' వారంతా వేదాధ్యయన సంపన్నులు కదా! బ్రహ్మజ్ఞానపరాయణులు కూడా. అలాంటి నా నూర్గురు పుత్రులను ఆయన మట్టుపెట్టాడు. మీరేమో అలాంటి ఆయన ఆశ్రమానికి పోయి ఉప్పు కోసం బిచ్చ మెత్తమంటున్నారా? నేనేమి చేయాలి? తెలియని అయోమయస్థితి నాదిపుడు". నెమనెమ్మదిగా దివ్యకాంతులు ముంచెత్తిన మోముతో ఋషి అంతరంగ లోతుల్లో నుంచి వెలువడ్డాయి, మాటలు, "దేవీ! ఆయనంటే నాకు ప్రేమ". అరుంధతి మరింత ఆశ్చర్యచకితురాలయింది. "మీకు ఆయనపై ప్రేమ ఉంటే", ఆమె అన్నది, " మీరు ఆయనను బ్రహ్మర్షీ అని

పిలిచేవారు కదా! నా నూర్గురు కొడుకులు నాకు దక్కేవారు". ఋషి మోము అపురూప సుందురవదనారవిందమే అయింది. " ఆయనంటే నాకు ప్రేమ కాబట్టే నేను ఆయనను బ్రహ్మర్షీ అని పిలువ లేదు", అన్నారాయన. "నేనలా ఆయనను యెందుకు పిలువ లేదంటే బ్రహ్మర్షిగా మారే అవకాశం ఆయనకు ఇంకా ముందు ఉంది".

ఆ రోజు కోపంతో విశ్వామిత్రుడు వివశుడయాడు. మనసు తపస్సుపైన నిల కడగా ఉండటం లేదు. వశిష్ఠుడు బ్రహ్మర్షిగా తనను గుర్తించనందుకు ఆ రోజు ఆయనను మట్టుపెట్టాలని నిర్ణయించుకున్నాడు. ఓ కత్తి చేబూనాడు. నెమ్మదిగా వెళ్లి వశిష్ఠులవారి కుటీరం చేరుకున్నాడు. నిలపడ్డాడు అక్కడ. వశిష్ఠదేవుని మాట లన్నీ విన్నాడు. చేతిలో కరవాలం పట్టు తప్పింది. అనుకున్నాడు, "అయ్యో! ఏమిటి నేను చేసిన పని! ఎంత తెలివితక్కువ పని చేశాను! ఎంత పొరపాటు! ఎవరి నిశ్చల హృదయాన్ని గాయపర్చాను? నూరు తేళ్లు మీద పాకి కుట్టి హృద యాన్ని గాయపర్చినంతగా బాధపడ్డాడు". పశ్చాత్తప్త అగ్నితో దగ్ధుడయాడు. ఒక్క ఊపున లోనికి ప్రవేశించి వశిష్ఠుని పాదాలపై పడ్డాడు. కాస్సేపటి వరకు నోట మాట లేదు. తర్వాత అన్నాడు, "దయతో నన్ను క్షమించండి. నేను క్షమార్హుడను కాను". గర్వాతిశయంతో మరేమీ మాట్లాడలేకపోయాడు. మరి వశిష్టుడు ఏం చేశాడు? రెండు చేతులూ చాచి విశ్వామిత్రుని కౌగలించుకొని అన్నాడు, "లేవ య్యా, బ్రహ్మర్షీ, లే." మరింత కలవరపాటుతో అన్నాడు విశ్వామిత్రుడు, "ఎందుకు నన్ను పరిహసిస్తారు?" "నేను అబద్ధమాడలేదయ్యా", వశిష్ఠుల వారి సమాధానం. "నీవీ నాడు బ్రహ్మర్షివైనావు. నీలోని గర్వం వైదొలగింది. ఈ రోజు నీవు బ్రహ్మర్షి అర్హత పొందావు". "మరి నాకు బ్రహ్మజ్ఞానాన్ని అనుగ్రహించండి", బ్రతిమాలాడు విశ్వామిత్రుడు. "అనంతదేవుని దగ్గరికి వెళ్లు", వశిష్ఠులవారి సమాధానం. "ఆయన నీకు దివ్యజ్ఞానాన్ని అనుగ్రహిస్తారు"

భూభారాన్ని తలపై మోస్తున్న అనంతదేవుని దరికి విశ్వామిత్రుడు వెళ్లి నిలబ డ్డాడు. "భూమిని నీ తలపై నిడుకొని మోయగలుగుతే నీకు బ్రహ్మజ్ఞానం బోధించ గలను". తన తపోబల సంపన్నతకు గర్వపడుతూ, విశ్వామిత్రుడు గట్టిగా అరిచాడు, "భూమిని వదిలిపెట్టు. తల కెత్తుకుంటాను". "అయితే ఇదిగో, పట్టుకో, వదులు తున్నాను". భూమి క్రిందికి మరింత క్రిందికి, ఆకాశంలో పరిభ్రమించటం మొద

లుపెట్టింది. "నా తపోఫలాన్నంతా ధారపోస్తున్నాను, భూమి నిలకడగా ఉండు గాక" అని కేకపెట్టాడు విశ్వామిత్రుడు. అయినా భూమి నిలకడగా ఉండకుండా ఉంది. అనంతదేవుడు బిగ్గరగా అన్నాడు, " విశ్వామిత్రా! భూమిని నిలకడగా పట్టి ఉంచగలిగేటంతటి తపశ్శక్తి నీ కింకా లేదయ్యా. మహనీయులతో సత్సాంగత్యం నీ కెన్నడైనా లభించిందా? అయితే ఆ సత్ఫలితాన్ని సమర్పించు'. "వశిష్ఠులవారితో కొంతసేపు ఉన్నాను", అన్నాడు విశ్వామిత్రుడు. "అయితే ఆ యోగ్యతా ఫలితాన్ని అర్పించు", అన్నాడు అనంతదేవుడు. "ఆ ఫలితాన్ని సమర్పించుకుంటున్నాను", అని సమాధానం చెప్పాడు విశ్వామిత్రుడు. నెమ్మదిగా భూమి కదలకుండా నిశ్చలంగా ఉంది. "దివ్యజ్ఞానం బోధించు ఇప్పుడు నాకు", అన్నాడు విశ్వామిత్రుడు. "ఓయీ! మూర్ఖుడా!", అనంతదేవుడు అరిచాడు. "ఏ మహనీయుని క్షణిక సాంగత్యం వల్ల, ఈ భూమి నిశ్చలమై నిలిచి ఉందో, అది తెలుసుకోవటానికి బదులు, బ్రహ్మజ్ఞానాన్ని కోరుతున్నావా?". విశ్వామిత్రుడు కోపావేశపరుడయాడు. వశిష్ఠుడు తనను మోసగించాడనుకున్నాడు. వెనుతిరిగి తొందరగా వశిష్ఠుని దగ్గరకి పరుగెత్తాడు. "నన్నెందుకు తప్పుదారి పట్టించారు", అని అడిగాడు. నిశ్చల గంభీరస్వరంతో వశిష్ఠుడు సమాధానం చెప్పాడు, "నీకు, అప్పుడే బ్రహ్మజ్ఞానాన్ని బోధించి ఉంటే నీకు నాపై విశ్వాసం కలిగి ఉండేది కాదు. ఇప్పుడు నీకది కలిగింది". బ్రహ్మజ్ఞానోపదేశాన్ని అప్పుడు విశ్వామిత్రుడు వశిష్ఠులవారి నుంచి పొందాడు.

అలాంటి ద్రష్టలు, దివ్యపురుషులు అలనాడు భారతదేశంలో ఉండేవారు. వారి ఆదర్శవంతమైన క్షమాగుణం అలాటిది. ఆకాశంలో భూమిని నిలపెట్టి ఉంచగలిగేటంతటి తపశ్శక్తి సంపన్నత సంపాదించవచ్చు. ప్రాచీన మహర్షుల తేజస్సుకు మించిన తేజస్సుతో మహర్షులు ఈ దేశంలో జన్మిస్తారు. ఇంతకు ముందు యెరుగని వైభవాన్ని వారు నెలకొల్పుతారు.

బెంగాలీ మూలం: శ్రీఅరవిందులు

ఆంగ్లానువాదం: శ్రీ అరిందం బాసు

తెలుగు అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

మన భారతావని

ప్రాచీన భారతదేశం కాలగర్భంలో కలిసిపోలేదు. ఆమె చెప్పాల్సిన సృజనశీల తుది సందేశం ఇంకా పూర్తి కాలేదు. ఆమె తనకే కాక యావత్తు మానవాళికి చేయవలసింది ఇంకా అలాగే మిగిలివుంది. (అందుకే ఆమె సజీవంగా నిలిచి వుంది).

*

భారతదేశం ప్రపంచానికే గురువు. మానవాత్మను పట్టి పీడిస్తున్న అనేకానేక తీవ్రమైన రుగ్మతలకు ఆమె మాత్రమే తగిన చికిత్స చేయగలదు. ప్రపంచానికి కావలసిన నూతన జీవనసరళిని ప్రసాదించి, మానవాత్మకు కావలసిన శాంతిని చేకూర్చడం అనేది ఆమె మాత్రమే చేయగలిగిన దైవదత్తమైన కార్యం.

*

ఇపుడు విముక్తి లభించింది. మేలుకొలుపు ప్రారంభమైంది. భారతదేశం తనదైన మహనీయ ఆత్మను కాపాడుకుంటూనే,. భౌతికస్థాయిలో ఒక గొప్ప మార్పును గొని రావలసి వుంది. ఒక నూతన ఆధ్యాత్మిక దృక్పథంతో, సాహిత్యం, కళాత్మక, సాంస్కృతిక, రాజకీయ, సామాజిక స్థాయిలకు తనదైన నిత్యనూతన రూపాలను సంతరించిపెడుతూ, భారతీయ పునరుద్ధరణ దిశగా సాగిపోతూ, జీవన సత్యాలకు విఘాతం కలగకుండా ఇంతవరకూ, కొనసాగుతూ వచ్చిన లోపాలను సరి చేసుకుంటూ, పరిపూర్ణమైన తన జవసత్వాలను అందించగలదు.

*

తెలతెలవారుతోంది. దిక్చక్రం మీద ఉషోదయం అయింది. భారత భానుడు తన గమ్యం దిశగా పయనిస్తూ తన జ్యోతిప్రభలతో ఇండియాను ముంచెత్తుతూ అంతటితో ఆగక, ఆసియాను, సకల ప్రపంచాన్ని గూడా ఆవరించగలడు. ప్రతి క్షణం, ప్రతి సమయం దైవం నిర్దేశించిన విధంగా, ఈ జ్యోతిః ప్రసారములు సాగగలవు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కొంగర భాస్కరరావు

ప్రశ్న: మాంసం తింటే మనిషికి యేమవుతుంది?

శ్రీమాత: నేనొక కథ చెప్తాను వినండి. సాధకురాలైన స్వీడన్ దేశపు యువతి నొకామెను నేనెరుగుదును. ఆమె శాకాహారి. ఆమె స్వచ్ఛందంగానే శాకాహారం యెన్నుకుంది. అలవాటు చేసుకుంది. మాంసాహారం తీసుకోకూడదనే నియమమేమీ లేదామెకు. ఒక రోజు ఆమె స్నేహితులింటికి విందుకు వెళ్లింది. అక్కడ ఆమెకి కోడిమాంసం వడ్డించారు. అందరిలో హంగామా చెయ్యడమెందుకులే అని మాట్లాడకుండా ఆమె అది తిన్నది. కాని ఆ రాత్రి ఆమె నిద్రపోతున్న సమయంలో హఠాత్తుగా తను వొక తీగలతో అల్లిన బుట్టలో వుండి వాటి అల్లికలో తన తల వుండిపోయి శరీరమంతా అటూ యిటూ కదిలిపోతున్నట్టు విపరీతమైన బాధతో వున్న అనుభూతి పొందింది. తరవాత కాళ్ళు రెండూ తీగల మధ్య వుండిపోయి తలక్రిందులుగా శరీరం గాలిలో అటూ యిటూ వూగుతూ వున్నట్లు అనిపించి యింకా బాధ కలిగింది. తరువాత తన శరీరభాగా లన్నిటినీ వొక్కొక్కటి ఎవరో వలిచి వేరుచేస్తున్నట్లు చెప్పలేని బాధ కలిగి చివరికి ఎవరో తన తల కత్తితో తరిగివేసినట్టు అనిపించి మెలకువ వచ్చేసింది. ఆమె యిదంతా నాకు చెప్పింది. ఆమె కెప్పుడూ యింత భయంకరమైన పీడకల రాలేదట. నిద్ర పోయే ముందు ఆమె దీని గురించేమీ ఆలోచించ లేదట. కాని దీనమైన ఆ కోడిపిల్ల చైతన్యం ఆమెలో ప్రవేశించింది. అందుచే ఆ కోడిపిల్ల కోపంతో కూడిన బాధ అంటే దాన్ని, మార్కెట్లో అమ్మి, తన వెంట్రుకలన్నీ పీకి, పీక కోసినప్పుడు అనుభవించిన బాధంతా ఆమె కలలో అనుభవించింది.

అదీ జరిగింది. మాంసం తింటే దానితోపాటు నువ్వు యే జీవి తాలూకు మాంసం తింటావో దాని చైతన్యం కొద్దో గొప్పో నీలో ప్రవేశిస్తుంది. ఇది చెప్పడానికే యీ కథ చెప్పాను. అది పెద్దగా పట్టించుకో నక్కరలేదు. కాని యిది యెప్పుడూ ఆనందించవలసిన విషయం కూడా కాదు. అది మనిషిని మనిషిగా గుర్తించడానికి దోహదం చెయ్యదు. సరి కదా పశుత్వానికి దగ్గర చేస్తుంది. దైవత్వం కంటె జంతువులకి దగ్గరగా వుంటారు మాంసాహారులు అనడానికి నిదర్శనం ఆదిమానవులు. వారు పచ్చిమాంసం తినేవారు. పచ్చిమాంసం వండిన మాంసం కంటె బలాన్ని యిస్తుంది. వారు జంతువుని చంపి చీల్చి అలాగే కొరుక్కుని తినేవారు. చాలా

బలంగా వుండేవారు. అంతే కాదు అందుకు తగ్గట్టు పచ్చిమాంసం అరగడానికి వారి చిన్న ప్రేవులలో వుండే అపెండిక్స్ (appendix) ఆ రోజులలో చాలా పెద్దదిగా వుండేది. తరువాత మనుషులు వంట నేర్చుకుని వండిన మాంసం తింటూ అనేక రుచులకు అలవాటు పడ్డారు. క్రమంగా అపెండిక్స్ వుపయోగం పెద్దగా లేనందు వల్ల చాలా చిన్నదైపోయింది. ఇప్పుడదొక అదనపు భారంగా తయారయి దానివల్ల వొక్కొక్కసారి అనారోగ్యానికి గురవుతున్నారు.

ఇదెందుకు చెప్పానంటే యిప్పుడు మనిషి తన ఆహారపు అలవాట్లను మార్చుకోవలసిన సమయం వచ్చింది. మృగస్వభావాన్ని బాగా తగ్గించగలిగే ఆహారం తీసుకునేలా ఆహారపు అలవాట్లను సవరించుకోవాలి. అది పూర్తిగా మనిషి చైతన్యాన్ననుసరించి వుంటుంది. ఒక సాధారణ జీవితం గడుపుతున్న మనిషి, సామాన్యమైన పనులు చేసుకుంటున్నవాడు, తను, తన కుటుంబం అవసరాలకి తగిన సంపాదన తప్ప యితర ఆలోచనలు లేనివాడు మాంసాహారికాని, శాకాహారికాని కావచ్చు. తన కిష్టమైన మంచిదనుకున్న ఆహారం తను తీసుకోవచ్చు.

కాని యీ సామాన్య జీవితం నించి యింకా వున్నత జీవితం కోరుకునేవాడుంటాడు. వాడితోనే సమస్య మొదలవుతుంది. అది అత్యంత ఆసక్తికరంగా వుంటుంది. వున్నత జీవితం పొందిన తరువాత మనిషి రూపాంతరీకరణానికి తప్పనిసరిగా ప్రయత్నిస్తాడు. అప్పుడదెంతో ప్రధానమౌతుంది. అప్పుడు తీసుకునే ఆహారాన్ని బట్టి శరీరం సూక్ష్మబుద్ధి కలిగేలా నాజూకుగా తయారవుతుంది. అటువంటి ఆహారపదార్థాలు కాక యితరమైనవి తీసుకుంటే అది పశుప్రాయంగా అదే స్థితిలో వుండిపోతుంది. కాని యిది వొక ప్రత్యేక సమయంలో జరగడం చాలా ముఖ్యం, ముందుగా కాదు. ఆ స్థితికి చేరడానికి ముందు యితర కర్తవ్యాలు చాలా వున్నాయి. శరీరాన్ని పరిశుద్ధం చేయడానికి ముందు ప్రాణికాన్ని, మనస్సును తప్పనిసరిగా పరిశుద్ధం చేయాలి. ఏది నీ శరీరాన్ని కృశింపచేస్తుందో అది తప్ప యితర పదార్థాలు తీసుకోకుండా నువ్వు అన్ని విధాల యెన్ని జాగ్రత్తలు తీసుకోవాలో అన్నీ భౌతికంగా తీసుకోవచ్చు. కాని నీ మనస్సు, ప్రాణికం, కోరికలు, చైతన్యరాహిత్యంగా తమస్సు, లాలస మొదలైనవాటితో నిండిన స్థితిలోనే వుంటే ఏమీ ప్రయోజనం వుండదు. నీ శరీరం నీరసించిపోవడం మాత్రమే మిగులుతుంది. అంతరంగ జీవితం నించి స్థానభ్రంశం పొంది యేదో వొకనాడు రోగగ్రస్త

మవుతుంది.

సాధకుని సాధన అంతరంగంలో నుంచే మొదలు కావాలి. నేనిదివరకే వొక సారి యీ విషయం చెప్పాను. పై స్థాయి నుంచే మొదలు పెట్టాలి. ఉన్నత స్థాయి నుంచి దిగువస్థాయికి పరిశుద్ధం కావాలి. అలాగని శారీరకమైన విషయాల్ని చులకన చెయ్యకూడదు. నేచెప్పేది అది కాదు. కోరికల్ని అదుపు చేసినంత మాత్రంలో అంతా చేసినట్టు కాదు. ప్రాణికం, మనస్సుల లోకి కాస్తైనా దివ్యత్వం రాకపోతే శరీరంలో దివ్యత్వం తెచ్చుకోవడం వల్ల ప్రయోజనం లేదు. సరి కదా నిన్ను మామూలు స్థితి నుంచి వేరొక మార్గం లోకి తప్పించడం జరుగుతుంది. అందుచేత మీ కిదివరకు చెప్పినట్టు సమతుల్యత పాటించాలి. సమతుల్యత పాటించినట్టయితే అన్ని వైపులా వొకే సమయంలో అభివృద్ధి జరుగుతుంది. నీలో వొక భాగాన్ని యెల్లప్పుడూ చీకటిలో వుంచి, వేరొకటి వెలుతురులో వుంచకూడదు. ఏ చిన్న మూలలో కూడా చీకటి వుండకూడదు. అదే నీ కర్తవ్యం.

ప్రశ్న: ప్రియమాతా! కోడిపిల్ల మరణవేదన మన మీద దాడి చేసినట్లు బీట్రూట్, కేరట్‌లు కూడా చెయ్యగలవా?

శ్రీమాత: బీట్రూట్ కంటె కోడిపిల్ల యెక్కువ చైతన్యం కలిగినది నా నమ్మకం. నా స్వానుభవం మీకు తప్పకుండా చెప్పాలి. ఇది సాధారణ విషయంగా నేననుకోవడం లేదు.

టోక్యోలో నాకొక తోట వుండేది. ఆ తోటలో నేనే స్వయంగా కూరగాయలు పండించేదాన్ని. నా తోట చాలా చక్కగా పెద్దగా వుండి, అందులో అనేక కూరగాయ మొక్కలు వుండేవి. వాటికి నీళ్ళు పోసి, మిగిలిన సంరక్షణ చేసి ప్రతి రోజూ వుదయం వాహ్యాళికి వెళ్ళడం అలవాటు. వాటి చుట్టూ తిరుగుతూ తినడానికి యేవి బాగుంటాయో ఆ కూరగాయలు తీసుకొనేదాన్ని. అది సరే. మీరొక్కసారి వూహించండి. అక్కడ కొన్ని నాతో "వద్దు. వద్దు. వద్దు" అంటూ వుంటే మరికొన్ని దూరం నించే నన్ను చూసి "నన్ను తీసుకో, నన్ను తీసుకో, నన్ను తీసుకో" అనేవి. తీసుకోమన్న వాటిలో నాకు కావలసినవి తీసుకుని, వద్దు అన్నవాటి జోలికి పోయేదాన్ని కాదు. ఆలోచిస్తే నాకిది కొంచెం అసాధారణంగా అనిపించింది. నేను నా మొక్కల్ని చాలా ప్రేమిస్తాను. వాటిని జాగ్రత్తగా చూసుకొంటాను. నీళ్ళు పోసేటప్పుడు వాటిని బాగా చైతన్యవంతం చేశాను. వాటిని చక్కగా పరి

శుభ్రంగా చేస్తాను. అందుచేత అవి వొక ప్రత్యేక సామర్థ్యాన్ని తప్పక కలిగి వుంటాయి.

కాని ఫ్రాన్సులో కూడా యిలాగే జరిగింది. ఫ్రాన్సు దక్షిమ ప్రాంతంలో కూడా నాకొక తోట వుండేది. దానిలో బఠాణీ, ముల్లంగి, కేరెట్లు పండించేదాన్ని. అందులో కొన్ని చాలా హాయిగా వుండేవి. "నన్ను తీసుకో తిను. నన్ను తీసుకో తిను" అంటూ అడిగేవి. మరికొన్ని "వద్దు. వద్దు. వద్దు. నన్ను తాకవద్దు" అనేవి. (నవ్వు)

ప్రశ్న: అవి యెందుకలా అనేవి? మాతా!

శ్రీమాత: సరిగ్గా ఇందుకే దాని మీద పరిశోధన చేసేను. ఫలితం యెప్పుడూ వొకేలా లేదు. వొక్కొక్కసారి ఆ మొక్కలు తినడానికి పనికివచ్చేవి కావు. మంచివి కావు. కొన్ని గట్టిగా, చేదుగా వుండి తినడానికి బాగా లేనివి. మిగిలిన సమయాల్లో కొన్ని యింకా పక్వానికి రానివి, తినడానికి సిద్ధంగా లేనివి. ఒకటి రెండు రోజులు ఆగితే తరువాత అవి కూడా "నన్ను తీసుకో, నన్ను తీసుకో" అనేవి. (నవ్వు)

మూలం: శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

•

కాంతి కిరణాలు

ఏ కోరికా లేకుండా అన్యథా శరణం నాస్తి అన్నట్లుగా ఆత్మార్పణం కావించుకోవటమే వాస్తవమైన దైవప్రేమ. అది షరతు విధించదు. నిర్బంధించదు. బేరమాడదు. కోపం, ఈసు, అసూయలతో హింసకు పాల్పడదు. దాని తత్వంలో అసలివేమీ లేవు.

*

నిజంగా దైవాన్ని ప్రేమించటానికి, బంధాలన్నటికీ అతీతంగా యెదగాలి.

అందరికీ ప్రేమ ఉంటుంది:

అందరికీ ప్రేమ ఉంది. ప్రతి ఒక్కరి పురోగతికి అది సమానంగానే పనిచేస్తుంది. కాకపోతే, దానిపై శ్రద్ధ చూపినవారికి అది విజయవంతమవుతుంది.

*

Rs. 15

అఖిల

అఖిల భారత పత్రిక

సెప్టెంబర్ 2009



శ్రీఅరవింద సొసైటీ స్వర్ణోత్సవ సంచిక

సెప్టెంబరు 2009 - 2010

19.9.2009 — 19.9.2010

శ్రీఅరవింద సొసైటీ స్వర్ణోత్సవ సంవత్సరం

శ్రీమాత 1960 లో శ్రీఅరవింద సొసైటీని స్థాపించారు. 19.9.1960 న సొసైటీ తాలూకు the Memorandum of Association పై సంతకం పెట్టారు. సొసైటీ 50 వ స్వర్ణోత్సవ సంవత్సరాన్ని వినమ్రతతో కృతజ్ఞతాపురస్సరంగా పాటిస్తున్నాం. శ్రీమాతకు, ఆమె దివ్యకార్య దీక్షకు పునరంకితమవుతున్నాం. అందుకోసమే కదా ఈ దివ్యసమాజం సంస్థాపించబడినది!

కవరు పైన ఉన్న పుష్పం:

దైవం కొరకు ప్రేమలో నమ్రత

(లవండరు పువ్వు రంగులో గులాబీకి ఈ గుర్తింపు నిచ్చారు, శ్రీమాత)

SPONSORED BY

N SETHIA FOUNDATION

LONDON

AN OFFERING TO THE MOTHER


విషయసూచిక

దైవము — వినమ్రత

సహజసిద్ధమైన కృతజ్ఞతా భావం

కర్మ అనివార్యం

అనుబంధం



పూజ — అణకువ — వీటి తీరు

అమ్మ: ఇదేమిటి?

సాధకులు: అమ్మా అదొక ఫొటో. మీదే.

అమ్మ: ఆహా! అది నా ఫొటేయే కదూ! దానిపై సంతకం చేయనా?

సాధకులు: తప్పక అలాగే కానీయండమ్మా. దానిలో ఎందుకమ్మా మీరు ప్రణమిల్లుతున్నారు? ఎవరి నుద్దేశించి?

అమ్మ: అదే. అందులో నేను సత్యాన్ని అభినందించిన తీరు గోచరించలేదా? కావాల్సిన అనివార్యస్థితి అదే. ఆరాధన, వినయం, వీటి తీరు అంతే. అదే. మనకు సత్యం మాత్రమే దారి చూపే రోజు కోసం నేను ఓపికగా ఎదురుచూస్తాను. ఈ చూపే ఇదొక్కటే చాలా ముఖ్యమైన దృక్పథం. దివ్యసత్యం ఇచట సమగ్రంగా సుస్థిరస్థాపన కావాలని భూదేవి కోరిక. ఈ వైఖరినే గ్రహించాలి. ఇదే ధరణికి ఏకైక రక్షణ. ఈ దృష్టినే ఊర్ధ్వాని కెగయించి అదే ఆకాంక్షతోనే నిరీక్షించాలి. ఇదే పూజనం. ఇదే విధేయత. ఇదే తాను నేర్చి దానికింకా విరివిగా ప్రాతినిధ్యం వహిస్తే. తద్వారా ఒక గంభీర విశాలత, ఉదాత్తమూ గలిగినట్లే.

(సాధకులు మోనా సర్కార్ తో సంభాషణలు ఆధారంగా)

అనువాదం: టి.యస్. రామచంద్రరావు

నిజమైన నమ్రత

నాకు తెలియదు, అసలేమీ తెలియదు నాకు అనే గుర్తింపుయే నమ్రత. ఎంతో వాస్తవమైనది, ఉదాత్తమైనది, అనాసక్తమయినదిగా మనకు కనిపించేదానికి అతీతంగా, మరొకటేదో ఉండవచ్చు. నీకు నీవే నిరంతరాయంగా ప్రభువును ఆశ్రయించి, సమస్తమూ ఆయనకు నివేదించడములోనే నిజమైన నమ్రత ఉంటుంది.

(*The Spiritual Significance of Flowers*, p. 119)

*

దైవము లేనిదే తామేమీ కానే కాదు, తన కేమీ తెలియనే తెలియదు, ఏమీ చేయనేలేము — అన్న సంగతి బుద్ధి, ప్రాణిక, శరీరాలు ఎన్నడూ మరువకుండా ఉండ

టమే వినమ్రంగా ఉండటం అంటే. దైవం వినా, తాము అజ్ఞానం, నిస్సహాయత, గందరగోళము — అంతే. దైవము అంటే — దివ్యసత్యము, దివ్యజీవనము,దివ్యశక్తి, దివ్య్రపేమ, దివ్యానందము.

అందుచేత, తనయొక్క అంతస్తత్వంలో మాత్రమేగాక, తన క్రియాకలాపాల వ్యక్తీకరణలలో దైవాన్ని అర్థం చేసుకొని, విమర్శించగలిగేందుకు పూర్తిగా అశక్తులము అనే సంగతి బుద్ధి, ప్రాణికము, శరీరము తప్పక తెలుసుకోవాలి.

ఇదే నిజమైన వినమ్రత. దీనితోనే నీకు శాంతి, నిశ్చలత్వము కలుగుతుంది.

ఏ ప్రతికూలదాడి నుండి అయినా కూడా నీకు రక్షణకవచంగా ఉండేది కూడా ఇదే. నిజానికి ఎప్పుడూ కూడా మనిషియొక్క అహంకారపు తలుపు తట్టి సైతానుకు ప్రవేశాన్నిచ్చేది ఆ వాకిలియే.

(*CWM*, Vol. 14, p. 160)

*

ఉన్నదల్లా సర్వోన్నత చైతన్యమే, సర్వోన్నత చిత్ శక్తి మాత్రమే. 'నేను' అన్నదే మాత్రమూ కాదు. ఈ యెరుకయే నిజమైన వినమ్రత.

*

గర్వం, సిగ్గుమాలినతనం పరిహాసాస్పదమైనవి. తెలివితక్కువతనంగా మూర్ఖులు ఉంటారు. సర్వవ్యాప్తమైన విశ్వరహస్యం యొక్క సంసర్గం ఏ కాస్తంత అయినా కలిగి ఉన్నవాడు వెంటనే తప్పనిసరిగా వినమ్రుడవుతాడు. కష్టపడి పనిచేసే శాస్త్రివేత్తను కలిసినపుడు నీతో ఏమంటాడో తెలుసా, "నా కేమీ తెలియదు. భవిష్యత్తులో తెలుసుకోవలసినదాని ముందు, ఇపుడు నాకు తెలిసినదేపాటి? ఈ సంవత్సరం క్రొత్తగా కనుగొన్నది మరుసటి సంవత్సరానికి పాతదే అవుతుంది." నిజమైన శాస్త్రివేత్త, తనకు తెలిసినదానితో పోలిస్తే, తను తెలుసుకోవలసినదే ఇంకా యెంతో ఎక్కువ అని అంటాడు. మానవ కార్యకలాపా లన్నిటికీ ఈ సత్యం సమానంగా వర్తిస్తుంది. పేరుపడిన ఏ శాస్త్రివేత్తా, గర్విష్ఠిగా నేనెరుగను. కాస్తో కూస్తో తెలిసినవాడెవ్వడూ కూడా, నా కంతా తెలుసని చెప్పడు. అలాటి వాడెవడూ నా కింతవరకూ తారసపడలేదు. ఇంతవరకూ నేను చూసినవాళ్లంతా, "చివరికి నాకేమీ తెలియదు", అనే బాహాటంగా చెప్పారు. తాను చేసినది, తాను సాధించినదీ అంతా చెప్పాక అతను, "నాకు తెలిసినదేమీ లేదు", అని నిశ్చలంగా అంటాడు.

ప్రశ్న: నమ్రత — అంటే అందరిపట్ల వినమ్రంగా ఉండటమేనా?
కానే కాదు. భగవంతుని పట్ల నీవు తప్పనిసరిగా వినమ్రుడవై ఉండాలి. అది పరిపూర్ణమైన సమగ్ర వినమ్రత.

*

నిన్ను నీవే పొగడుకోవటం, తెగనాడుకోవటం — ఏదీ అంతశ్రేష్ఠతరం కాదు. నీ గురించి నీవే చెప్పుకోవడం సరి కాదు. నీ విలువను దైవం నిర్ణయించనీ. అదీ వాస్తవమైన వినమ్రత.

*

నమ్రత — ఒక దివ్యచాలనం.

మూలం: శ్రీమాత
అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

దైవానుగ్రహ ప్రాప్తికి తొలి నిబంధన

ప్రశ్న: కృతజ్ఞతాభావ పురస్సరంగా దైవనుగ్రహాన్ని స్వీకరించు మార్గమేమిటి?
అహో! ప్రప్రథమముగా దైవానుగ్రహావశ్యకతా భావన మీలో కదలాడాలి తీవ్రంగా.

అదే ప్రముఖమైన అంశం. మీ అణువణువునా అంతరాంతరాళాలలో ఓ సాధుత్వ భావన కదలాడి కుదురుకోవాలి. ఆ భావన మీలో నిశ్చయంగా, విశ్వసనీయంగా దైవానుగ్రహం వినా నేను అసంపూర్ణుడను, అశక్తుడను అన్న అభద్రతాభావం పాట మరించి పాదుకొనాలి.

ప్రతివారికీ ఈ రకమైన అనుభవం కలుగుతుంది. అనుభవంలో, ఏ విషయం పైనా ఇసుమంత ఎరుక గూడా లేనివారు సైతం సంపూర్ణంగా సంక్లిష్టమైన పరిస్థితుల వలయంలో చిక్కి, కొట్టు మిట్టాడటం గమనిస్తాం. తప్పకుండా పరిష్కరించుకోవలసిన సమస్య నెదుర్కోటం కనుగొంటాం. నేను మీతో సరిగ్గా ముచ్చటించినట్లు తప్పకుండా అధిగమించవలసిన మానసికప్రేరణకు గురికావటమో లేదా ఏదో ఒక విషయం వారిని కలవరపెట్టడం దృశ్యమవుతుంది. అట్టి సందర్భాలలో వారు తాము దిక్కుమాలిన పరిస్థితులలో ఉన్నామని, ఏమి చెయ్యాలో పాలుపోవటం లేదని సవివరంగా గ్రహిస్తారు. ఆ సమయంలో వారు సమస్యల వలయంలో కూరుకపోయా

మని, గట్టెక్కే మార్గం కనిపించటం లేదని వాపోతారు. వారి బుద్ధి కుశలతగాని, మనస్సుగాని, సంకల్పంగాని, బాహ్యేంద్రియజ్ఞానంగాని పిసరంతయినా తోడ్ప డవు; ఆ అగమ్య గోచర పరిస్థితులలో వారి ఆంతర్యంలో ఓ విధమైన కదలిక, ఓ పిలుపు ధ్వనిస్తాయి. ఆ నిశ్శబ్ద శబ్దం, ఆ అంతరాంతరాళంలోనికి అప్యాయపూర్ణంగా కేక వినిపింపచేస్తుంది.

ఇది తొలి పరిస్థితి. తరువాత దానిని చేయగలిగింది అనుగ్రహమే దైవానుగ్ర హమే నన్న ఎరుక మీలో నిశ్చయమైతే — అప్పటి నుండీ దైవానుగ్రహమే, నీ వున్న సంక్లిష్ట పరిస్థితుల నుండి నిన్ను దరిజేర్చగలదు. ఆ పరిస్థితుల నుండి గట్టె క్కడానికి సరియైన పరిష్కారమార్గాన్ని ఎరుకపరచి, తగిన శక్తిని ప్రసాదించి విముక్తి గూర్చగలదు. ఈ భావన నీలో దృఢపడితే, అత్యంత సహజంగా ఓ తీవ్రమైన అభి లాష జాగృతమవుతుంది నీలో. నీవు పిలిచినా, అభిలషించినా, ఓ సమాధానం కోసం ఎదురుచూస్తున్నా నీవు అత్యంత సహజంగా పరిపూర్ణ దైవానుగ్రహానికి ఉన్మీలునుడవు అవుతావు.

అటు పిమ్మట ఈ విషయంపై అత్యంత శ్రద్ధాసక్తులు నెరపాలి. (శ్రీమాత తన పెదవులపై తన వ్రేలుంచుతుంది.) నీ ప్రశ్నలకు దైవానుగ్రహమే బదులు పలుకుతుంది; ఆ అనుగ్రహమే కష్టాల కడలి నుండి ఒడ్డున చేరుస్తుంది; నీ సమస్య లకు సజావైన పరిష్కారం ప్రసాదిస్తుంది. లేదా నీ సంక్లిష్ట పరిస్థితుల నుండి విము క్తుడను చేస్తుంది. ఒక్కసారి నీ సమస్యల నుండి బయల్పడలి, కష్టాల కడలి నుండి తీరం చేరాక ఇదంతా భగవదనుగ్రహం వల్లనేనన్న విషయం మరచిపోకు. ఏరు దాటి తెప్ప తగలెయ్యకు. అది నీ ప్రతిభాపాటవాలవల్ల నన్న అపోహకు లోను గాకు. ఈ సందర్భంలో, ఈ విషయంలో ఇది ఓ ముఖ్యమైన అంశం. మరపు తెర లలో మర్చిపోకుండా జాగ్రతపడవలసిన విషయం. గుర్తుంచుకోవలసినంత గురు తర బాధ్యతాయుతమైనదిది.

అక్కడే నీ అసలు స్వరూపం దాగుంది. ఇప్పుడు నీవు తలుపులు మూసివేసి గడియ బిగిస్తావు. గుర్తుంచుకో, ఇంకెంత మాత్రము నీ కింకెప్పుడునూ ఏమియూ అందదు. ఇటువంటి అంతర్గత మూర్ఖత్వం వలన భగవదనుగ్రహప్రాప్తికి అవకాశం లేకుండా తలుపులు మూసినందువలన నీ తెలివితక్కువతనం వైదొలగాలంటే మళ్లీ భయంకరమైన విపత్తుకు నీవు లోను కావాలి. తద్వారా మరల మరొక్కసారి నేనేమీ

చేయలేని అశక్తుడనని గుర్తుంచవలసిన అవసరం రావచ్చు. ఎందుకంటే, నీవు నేను అశక్తుడనని గుర్తించి మసలుకొన్నప్పుడు మాత్రమే నీవు సరిగా దైవానుగ్రప్రాప్తికి అర్హుడవవుతావు. నీలో మృదుత్వం కలుగుతుంది. నీ ప్రజ్ఞ పైన ప్రతిభాపాటవాల పైనా, స్వశక్తి పైనే నీ శక్తియుక్తులపైనే స్వయంగా అన్నీ సాధించగలనన్న విశ్వా సంతో మసలి నన్నాళ్లు తలుపులన్నీ ఒక్కమారే నీకు మూసుకుపోతాయి. ఏదీ ప్రవేశించలేని ఓ దుర్గంలో ఒంటరిగా మిగులుతావు నిస్సహాయాంగా. మరి ఇదే గొప్ప అవరోధం. తొందరగా మనం మర్చిపోతాం — మనకున్న శక్తిసామర్థ్యా లతో తృప్తిపడి.

ప్రశ్న: శ్రీమాతా! ప్రతి ఒక్కరూ వారు శక్తిహీనులమని ఆలోచించటానికి అంగీకృతులై ప్రయత్నించిననూ, వారు బలవంతులమని విశ్వసించే అంశం వారిలో ఏదో ఒకింత ఉంటుంది. ఏల?

అహో! అవును. అవునవును! చిత్తశుద్ధితో ఉండటం బహుకష్టం. అందుచేతనే దెబ్బలు ద్విగుణీకృతమవుతుంటాయి. మరియు కొన్ని పట్ల భీకరాతి భీకరంగా ఉంటవి. ఎందుకంటే, ఇదే నీ మూర్ఖత్వాన్ని చిందరవందర చేసి భంగపరచేది. కష్ట నష్టాల సంభావ్యతకు ఇదే ప్రబలమైన ప్రామాణిక నిరూపణ. దెబ్బ తగిలితేనే దేముడు గుర్తుకొస్తాడు. నీవు తీవ్రమైన కష్టాల వలయంలో పడి కొట్టుమిట్టాడుతున్నప్పుడు ఇంకా చెప్పాలంటే ఎనలేని కష్టాలు నీ దరిజేరుతున్నాయని అవగతమయ్యే ముందు మాత్రమే నీ స్వయంశక్తి పైన నమ్మకం సడలి, నీ మౌఢ్యం మెల్లమెల్లగా దిగజారు తుంది. అలా అహం కరిగిపోతూన్నపడు కూడ కొంత అంతరంగంలో మిగిలే ఉంటుం ది. అది పరిపూర్ణంగా కరిగిపోవటానికి — అహంభావం నిశ్శేషంగా కనుమరుగవటానికి సుదీర్ఘకాలమే పడుతుంది.

నిస్సందేహంగా, సమూలంగా ఒకడు ఏమీ కాడనీ, ఒంటరిగా ఏమీ చేయలేడ నీ, ఒకడు ఒకడుగా లేనే లేడనీ, ఒకనికి దైవచైతన్య అనుగ్రహసంపర్కం లేకుండా అస్తిత్వమే లేదని ఎరుకపడటానికి ఒకనికి జీవనగమనంలో ఎన్ని దెబ్బలు, ఎన్ని వొడిదుడుకులు అవసరమో ఎరుకపడాలి. అలా ఎరుకపడగనే ముగింపు — ముగింపే. మరుక్షణమే కష్టాలన్నీ కనుమరుగవుతాయి. సమగ్రంగా అవి ఎరుకపడిన ప్పుడు అడ్డుకునేందుకు ఏమీ ఉండదు. అయితే ఆ క్షణం వరకు... అది చాలా కాలం పడుతుంది.

అనుగ్రహం నిత్యసత్యం. సదా ఉంటుంది. నిరంతర క్రియాశీలంగా ఉంటుంది. అయితే శ్రీఅరవిందులు అంటారు, మనం దానిని అందుకునేందుకు అనుకూలమైన స్థితిలో ఉండటం, అందుకొని నిలుపుకొని, అది ప్రసాదించే ప్రయోజనాలను అనుభవైకవేద్యం చేసుకొనటం చాలా చాలా కఠినమైనదని.

అది అమరులైన దేవతల అమృతపాత్ర నుండి అమృతం పొంది సేవించటం కంటే కూడా కష్టతరం అంటారు శ్రీఅరవిందులు.

దైవానుగ్రహప్రాప్తికి కేవల అభిలాష మాత్రమే కలిగి ఉంటే చాలదు. దానికి తోడుగా నిష్కపటమైన నమ్రత, పరిపూర్ణమైన విశ్వసనీయత వెల్లివిరియాలి.

మూలం: శ్రీమాత

అనువాదం: అన్నవరం ఆదిశేషయ్య

వినయానికి సరియైన, సరికాని పద్ధతి

ప్రశ్న: కొందరు ధ్యానం చేస్తున్నప్పుడు, వారు చక్కగా ఆనందమైన స్థితిలో ఉన్నట్టు భావిస్తారు. ఆ స్థితి ఏమిటి?

అది ఏ స్థితి అయినా, నిజానికి ఆనందం కలిగించేది, చెప్పుకోదగినదే. అయితే వారికి తామెంతో గొప్పవాళ్ళమనే భావం ఉంటుంది. వాళ్ళని వాళ్ళు చాలా ప్రత్యేకమైన వ్యక్తులుగా భావిస్తారు. కొంచెం సేపు మౌనంగా కూర్చోగలిగినందుకు, ఆలోచన లేకుండా ఉన్నందుకు, అదేదో గొప్పగా చెప్పుకోతగ్గ విషయంగా భావిస్తారు. అయితే ఇది సాధారణంగా, మానసిక గందరగోళం — ఒక చిత్రదర్శిని మాదిరిగా చిత్రవిచిత్రంగా మారుతూ ఉంటుంది. ఒక్క క్షణం నిలకడ లేకుండా సాగుతూ ఉంటుంది. అది వారు తెలుసుకోరు. పైకి నిశ్శబ్దంగా ఉండడం, తమ గురించి తమకు గొప్ప అభిప్రాయం కలిగించే భావన కలిగిస్తుంది.

అయితే నేను నిజంగా భయపడేది... ఇలాంటి వాళ్ళ గురించే. ఎందుకంటే వాళ్ళు మేం నిజంగా ధ్యానం చేస్తున్నాం, అంచేత మేం చాలా ప్రత్యేక వ్యక్తులం అనుకుంటారు. ఇదే వాళ్ళ 'అహాన్ని' పెంచే గొప్ప అపాయకరమైన విషయం. ఎందుకంటె వాళ్ళు తాము సాధించినదానితో, ఆత్మసంతృప్తితో వారికి వారే అభి

వృద్ధికి, అన్ని ద్వారాలు మూసుకుంటారు. అహంకారంతో కూడిన ఆ గర్వమే మనిషికి అపకారం చేసేది, అభివృద్ధిని నిరోధించేది. అనాదికాలం నుంచి ఎందరో చెప్పిన ఒక విషయం ఉంది. దాన్ని సాధారణంగా అపార్థం చేసుకుంటారు. అదే వినయం యొక్క ఆవశ్యకత. వినయం తప్పనిసరిగా ఉండవలసిన భూషణం అని. అయితె ఈ 'వినయాన్ని' పొరపాటుగా అర్థం చేసుకుని, పొరపాటుగా ఉపయోగిస్తారు. వినయంతో ఉండడమంటె, దానిని అపార్థం చేసుకుని, సక్రమంగా వినియోగించకపోతే, అది నిన్ను ఎక్కడికీ తీసుకెళ్ళదు. సరికదా, నీ అభివృద్ధి కుంటుపడుతుంది. ముందుకు సాగదు. అయితే నీ లోంచి ఈ గర్వం అన్న కలుపుమొక్కని ఏరిపడేస్తే, నిజానికి నీవు కొంత సాధించినట్లు భావించవచ్చు. అయితే ఆ గర్వం అన్న కలుపుమొక్కని నిర్మూలించడం ఎంత కష్టమో మనం గ్రహించలేం. అదెంత కష్టమో తెలుసా! ఎందుకంటె మనం ఓ చిన్న మంచిపని చేసినా, ఓ మంచి ఆలోచన చేసినా, ఓ మంచి అభిప్రాయం కల్గినా, కొంచెం ప్రగతి సాధించినా, (మనకు తెలియకుండానే) మనం గర్వంతో ఉబ్బిపోయి పొంగిపోతాం. అంతా నేనే చేశానని గొప్పగా చెప్పుకుంటాం. ఏదో సాధించినట్టు తృప్తిపడి గొప్పగా భావిస్తాం. ఇది మనకు తెలియకుండానే మన్ని పరాజితుల్ని చేస్తుంది. చివరికి ఇది కాదని ఆ భావాన్ని తరిమికొట్టడానికి, ఆ అహాన్ని పగులగొట్టినా... ఇంకా ఎక్కడో ఆ భావాలు లోపల పొదుకునే ఉంటాయి. ఆ చిన్న మొదళ్ళు మళ్ళీ అంకురిస్తాయి. అందుకే ఇది అత్యంత కష్టసాధ్యమైన పని. నిజానికి ఒక జీవితకాలం కష్టపడినా, దాని మూలాలు సమూలంగా నిర్మూలించలేం. కలుపు మళ్ళీ, మళ్ళీ తీయాలి పంటచేనులో వలె. అది లోపల, కపటంగా, దాక్కుని ఉంటుంది. దాన్ని గమనించడం కష్టం. అహంతో నేనిప్పుడు లేను అనుకున్న సమయాల్లో కూడా, అంటే అణకువతో అంతా ఆ దైవం వల్లే జరిగింది, నేను నిమిత్తమాత్రుడిని, అని భావించినప్పుడు కూడా... నీవు పడే సంతృప్తిలో, ఆ దైవం వల్లే అంతా జరిగిందని నీవు భావించినప్పుడు కూడా ఆ ఆత్మసంతృప్తితో ఉన్నందుకు గర్వపడతావు

ప్రశ్న: 'వినయం' గా ఉండాలంటే ఏది సరియైన పద్ధతి; ఏది సరైనది కానిది?

'వినయంగా ఉండు' అంటె వాళ్ళు వెంటనే మన చుట్టూ ఉన్న వారి ముందు వినమ్రంగా ఉండడం అనుకుంటారు. ఇది సరైనది కాదు. నిజమైన నమ్రత దైవం పట్ల విధేయంగా ఉండడం. అది కూడా ఎలాంటి వినయమై ఉండాలి అంటె... దైవం

లేని నాడు నీవు ఏమీ కావని, దేన్నీ గ్రహించలేవన్న సత్యాన్ని అంతర్గతంగా గుర్తించగలిగి ఉండడం. అత్యంత మేధావులు, ఎంతో సమర్థులు కూడా నిజానికి దివ్యచైతన్యం ముందు అల్పులు. అప్పుడే మనం నిజమైన దృక్పథంతో ఆ సత్యాన్ని తెలుసుకోగలుగుతాం, అదే వినయంతో నటన అనేది లేక ఆ దివ్యభావాలను గ్రహించగలుగుతాం. స్వంత వైముఖ్యాన్ని వదిలి, దైవానికి అనుకూలంగా పనిచేస్తాం. దైవం ముందు విధేయులమై, స్వచ్ఛమైన పనిముట్టుగా తయారవుతాం.

*

కొందరు ప్రార్థనని ఇష్టపడరు. అయితే వాళ్ళు వాళ్ళ హృదయపు లోతుల్లోకి వెళ్ళి చూస్తే అహమే కాదు. అంతకన్న అధమమైన విషయం 'గర్వం' నిండి ఉంటుంది. ఇంకొందరు ఆకాంక్షించలేరు. ఎంత ప్రయత్నించినా ఆకాంక్ష నిలుపుకోలేరు. దీనికి కారణం వారిలో సంకల్పం జ్వలించదు. సంకల్పం లేకపోవడానికి కారణం వారిలో 'వినయం' అనే జ్యోతి ప్రకాశించకపోవటమే.

మూలం: శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

నిస్వార్థమైన ప్రశంస వినమ్రతకు ఒక లక్షణం

నమ్రత అనేది ఒక చైతన్యస్థితి. ఆ స్థితిలో ఎటువంటి సాక్షాత్కారం పొందినా, ఇంకా నీ ఎదుట ఉన్నది అనంతమనే సంగతి నీకు తెలుస్తుంది. ఇంతకు మునుపు నేను ప్రస్తావించినటువంటి ఎంతో అరుదుగా కనిపించే స్వార్థరహిత ప్రశంస నిజమైన వినయశీలతకు మరొక దృక్పథం; ఎందువల్లనంటే, ప్రశంసను నిరాకరించేది కేవలం అహంభావమే. ఎల్లప్పుడూ అన్నింటినీ అధిగమిస్తూ ముందుంటుందనే సంగతిని విస్మరిస్తూ తన అల్పవిజయాలతో సంతృప్తిపడిపోతూ అహం ప్రశంసను వ్యతిరేకిస్తుంది. ఏమైనప్పటికి, నీలో నిజంగా చెప్పుకోతగ్గది ఏమీ లేకపోయినా కూడా లేదా దైవపరంగా దివ్యత్వ మనేదేదీ లేకపోయినా, నీవు ఒదిగి ఉండవలసినదే. నీవు పరివర్తనమార్గంలో ఉన్నా కూడా ఇది నీకు వర్తిస్తుంది. ఒక రకంగా చూస్తే అసంబ

ద్ధంగా అనిపిస్తుంది, కాని, పూర్తిగా పరిపూర్ణుడైన దైవం అలాగే పూర్తిగా వినమ్రుడు. మరేదీ కూడా అంత వినమ్రంగా ఎప్పుడూ ఉండగలుగదు. భగవంతుడు తనను తాను ప్రశంసించుకునే పనిలో నిమగ్నమై ఉండడు. సమస్తం తానే అయినా, ఆయన ఎప్పుడూ తానుకానిదానిలో తనను తెలుసుకునే ప్రయత్నం చేస్తుంటాడు. అందువల్లనే అసలు పూర్తిగా తాను కాననిపించే బ్రహ్మాండమైన ఈ దృశ్యమాన ప్రపంచాన్ని తన అస్తిత్వం నుంచి ఆయన సృష్టి చేశాడు. తన శాశ్వత చైతన్యంలో సంపూర్ణంగా కలిగి ఉన్న, అనంతమైన విషయాలను నిరంతరాయంగా కనుగొనాలని, ఆయన రూపం పొందాడు.

అనిర్వచనీయమైన వినయగుణ సంపన్నుడైన పరమాత్మ విజయపరంపరలలో ఒకటి, చూడటానికి ఏమాత్రం దివ్యం కానట్లుగా కనిపించే పదార్థ పరివర్తన.

*

ఎక్కడైనాగాని సత్యమైనదానికి, అందమైనదానికి, ఉదాత్తమైనదానికి సహజమైన ప్రశంస లభించినట్లయితే, అక్కడ ఎంతో కొంత దైవం ప్రస్ఫుటమయినట్లు. అది చైత్యపురుషుడని నీవు నిర్ద్వంద్వంగా తెలుసుకోవాలి. ఎందువల్లనంటే నీవు ఏదైనా దైవసంబంధమైన అనుభూతిని పొంది నీ హృదయం ఆరాధించడానికి ఎగసిపడినా, ప్రశంసించినా నీ చైత్యాత్మ భౌతికచైతన్యం ద్వారా దాని సంపర్కంలోకి వస్తుంది.

చిన్నపిల్లలుగాని, పసిపిల్లలుకాని దైవపరంగా అందమైనది, నిరాడంబరమైనది ఏది చేసినా నేను చలించిపోయి నా కనుల నుండి అశ్రువులు కారిన కొన్ని సందర్భాలు నాకు గుర్తున్నాయి. ఆ ఆనందాన్ని అనుభవించు, దాని ఫలితంగా నీవు నీ దగ్గర నీ మధ్యలోనే దైవం ఉనికి అందించే లబ్ధిని పొందగలవు.

మూలం: శ్రీమాత

అనువాదం: డా. టి. ప్రసన్నకృష్ణ

కేవలం నమ్రత మాత్రమే సరిపోదు

ఆధ్యాత్మికజీవితంలో దైవంముందు నమ్రత తప్పనిసరి నిబంధన లేక అర్హత కాగా ఆధ్యాత్మిక గర్వం, అహంభావం లేదా ఆడంబరం, స్వశక్తి మీద నమ్మకంతో కూడిన పొగరుబోతుదనం ఎప్పుడూ కిందకు దిగజారుస్తాయి. కాని దైవం మీద నమ్మకం, తన ఆధ్యాత్మిక భవితవ్యం మీద నమ్మకం (నా హృదయం, ఆత్మ దైవాన్ని కోరు కుంటున్నది కనుక నేను ఆయనను చేరుకోవటంలో అపజయం పొందను) అనేవి దివ్యమార్గానుసరణలో ఎదురయే కష్టాలనుబట్టి చాలా అవసరం అవుతాయి.

*

అంతరంగంలో ఆధ్యాత్మిక వినమ్రత చాలా అవసరం, కాని బాహ్యంలో నమ్ర తను సిఫార్సు చేయవలసిన అవసరం ఉందని నేను అనుకోను (గర్వం, అహం భావం లేదా ఆడంబరం అనేవి లేకుండా ఉండటం ఇతరులతో బాహ్యవ్యవహారశైలికి తప్పనిసరి), అది తరచు గర్వాన్ని కలిగిస్తుంది, లాంచనప్రాయం అవుతుంది, లేదా కొంతకాలం తరువాత పనికిరాకుండా పోతుంది. చాలామంది తమ గర్వాన్ని రూపుమాపడానికి ఆ తీరుగా ప్రవర్తించడాన్ని నేను చూసాను; కాని దాని వలన శాశ్వత ఫలితం పొందడం మాత్రం నేను చూడలేదు.

*

సాధకుడు చేయవలసిన పని దైవానికి పూర్తిగా ఉన్ముఖుడై ఉండటం. తన చైత న్యంలో చైత్యపరమైన మార్పు, ఆధ్యాత్మికమార్పులకు కృషి. ఆ చైతన్యంలో జరగవలసిన మార్పులో స్వార్థరాహిత్యం, కోరికలు లేకపోవడం, వినమ్రత, భక్తి, సమర్పణ, ప్రశాంతత, సమత్వం, శాంతి, నిశ్చలమైన చిత్తశుద్ధి అనేవి తప్పనిస రియైన విషయాలు.

*

నీ అహంకారాన్ని పెంచ ప్రయత్నించే ఏ సూచన నుంచైనా నీవు అప్రమత్తంగా ఉండాలి. అహంకారం సాధనకు గొడ్డలి పెట్టు, అది ఆధ్యాత్మికంగా ఎప్పటికీ అంగీ కారయోగ్యం కాదు. గొప్పతనమంతా భగవంతునిది. మరి దేనికీ చెందదు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా. టి. ప్రసన్న కృష్ణ

సుగుణాలవారు

(పిన్నలు, పెద్దల కోసం ఓ కథానిక)

ఎప్పుడో ఒకానొకప్పుడు ఓ వైభవోపేతమైన రాజప్రాసాదముండేది. ఆ సౌధం అంతర్భాగంలో ఓ రహస్య పూజామందిరం. అందులోనికి, దాని ముందు వసారా లోకి, కూడా సాధారణ మనుష్యులకు ప్రవేశం లేదు. ఎందుకని? ఆ సౌధం ఎక్కడ ఉందో తెలుసా? ఎక్కడో అల్లంత ఎత్తైన మేఘాలయాల్లో. ఏ కొద్దిమందికో తప్ప అందులోకి యెవ్వరికీ ప్రవేశం లేదు.

అదే 'సత్య సౌధం'. (the palace of TRUTH)

ఓ రోజు అందులో పండగ జరుగుతోంది. అది మనుష్యులు చేసుకునే సంబరం కాదు. వేరేవాళ్లు జరుపుకొనేది. దేవతల పండుగ అది. చిన్న, పెద్ద దేముళ్ళు. భూమి మీద వాళ్లందరినీ సుగుణాలవారు, (virtues) అని పిలుస్తారు.

ఆ భవంతికో ముఖమండపం ఉంది. అదొక పెద్ద వసారా. దాని నేల, గోడలు ధగద్ధగాయమానంగా మెరిసిపోతున్నాయి. దేదీప్యమానంగా ఉన్నాయి.

దాని పేరు, 'ప్రతిభా ప్రాంగణం', దాని నేల అంతా ఎంతో నున్నగా ఉంది. చక్కని చిక్కని నీలమణికాంతులతో మెరసిపోతోంది. క్రమేపీ పైకి సరంబీ చేరే కొలదీ అంతా పారదర్శకంగా ఉంది. అక్కడనుంచి వ్రేలాడే చాందినీల్లా, చక్రంలా గుండ్రంగా తిరుగుతూ వజ్రకాంతులు కళ్ళు మిరుమిట్లుకొలిపేలా ప్రసరిస్తున్నా యి. ఒక్కొక్కరే సుగుణాలవారు వచ్చారు, స్నేహసౌహార్ద్రాలు వొలకపోసుకుం టూ. అంతా సందడే సందడి. ఇంతకాలానికి కలుసుకుంటున్నారు కదా, మరి! అదీ సంగతి. ఇదొక అరుదైన సంఘటన. వాళ్లంతా సాధారణంగా చెరొక్కరుగా చెల్లాచెదరై అక్కడా, అక్కడా, ఒక్కరే అయి ఏకాంతంగా ఉంటారు.

ఆ రోజు ఉత్సవానికి 'సరళ' sincerity గారు నాయకత్వం వహించారు. నిర్మలోదకాలులాటి స్వచ్ఛసుందరమైన దుస్తుల్లో నిష్కపటానికి ప్రతిరూపమై ఉన్నా రామె. ఆమె చేతిలో ఓ పరిశుద్ధమైన స్ఫటికం ఉంది. చతురస్రాలైన ముఖాలతో ఘనాకారంలో ఉంది. సాధారణ వ్యక్తికి వస్తువులు తేడాగా కనిపిస్తాయి. దానితో వస్తువుల వాస్తవరూపాలను దర్శించవచ్చు.

దగ్గరగా ఆమెకి విధేయంగా రక్షకభటుల్లా ప్రక్కనే ఇద్దరు నిలపడి ఉన్నారు.

ఒకరు 'నమ్రత' Humility. హుందాగా, అభిమానాతిశయంతో, గౌరవించదగిన వారుగా ఉన్నారు. మరొకామె, 'సాహసం' Courage . ఎత్తైన కనుబొమలు, తేట యిన కళ్లు. చెదరని మందహాసం. నిశ్చల గంభీర రూపం.

సాహసానికి ప్రక్కన చేరువగానే, చేతిలో చేయి కలిసి ఒక అతివ నిలబడి ఉంది. రూపం ప్రస్ఫుటంగా కనపడనీయకుండా ముసుగు ధరించి ఉందామె. అన్వేషించే ఆమె కమనీయ కళ్లకాంతులు మాత్రం ముసుగు దాటి ప్రసరిస్తున్నా యి. ఆమె పేరు, 'వివేకి' Prudence.

వాళ్లందరిలో మరొకామె ఉంది. మంచి చలాకీగా ఉంది. అందరి దగ్గరికీ బలే హడావిడిగా తిరుగుతోంది. కలుపుగోలుగా అందర్నీ పలకరిస్తోంది. చలాకీగా ఉన్నా, విలక్షణంగా వివేకవంతంగా ఉంది. ఆమె పేరు 'ధర్మావతి' Charity. ఎక్కడికి వెడితే అక్కడ తనతో కూడా ఉన్న వెలుగులు విరజిమ్ముకుంటూ పోతోంది ఆమె. ఆమె కెప్పుడూ వీడని తోడుగా, 'న్యాయావతి' Justice ఉంటుంది. వీళ్లిద్దరు కవ లపిల్లల్లాటి వారు. 'ధర్మావతి' లో ఉన్న సున్నితమైన కాంతితరంగాలకి కారణం, ఆమెకి ప్రియాతిప్రియమైన స్నేహితురాలు, 'న్యాయావతి'.

అయితే, 'ధర్మావతి' కి తోడుగా ఆమె చుట్టూ చేరి ఇంకా కొంతమంది పరి వారం ఉన్నారు. వాళ్లు 'దయావతి' Kindness 'శాంత' Patience 'సౌమ్య' Gentleness 'ఉత్సుకత' Solicitude వగైరా ఎందరో.

అందరూ అక్కడ ఉన్నారు. లేదా — ఉన్నట్లు భావించుకుంటున్నారు.

ఇంతలో అకస్మాత్తుగా, ఆ బంగారు వాకిట ఓ కొత్త మోము కనిపించింది.

అక్కడ ద్వారపాలకులు అయిష్టంగానె ఆమెని లోనికి వెళ్లనిచ్చారు. ఇంతకు ముందెన్నడూ వారు ఆమెను చూడలేదు. ఆమెలో ప్రత్యేకంగా చెప్పుకోతగ్గ లక్ష ణాలేమీ కనబడటం లేదు.

ఆమె సన్నగా, నాజూగ్గా ఉంది. కట్టుకున్న బట్టలు తెల్లగా ఉన్నాయి. సాదా సీదాగా ఉన్నాయి. పేదరికం ఉట్టిపడుతోంది. మోమాటంగానే నాల్గు అడుగులు ముందుకు వేసింది. ఇంకా ముందుకు వెళ్లటానికి సంకోచం. అక్కడ చూస్తే, ఉన్న వాళ్లంతా, మిలమిలా మెరిసిపోతున్నారు. ఆగింది. ఎలా వెళ్లటం వాళ్ల దరికి? ఎవర్ని పల్కరించాలి? తటపటాయిస్తోంది.

ఇంతలో, 'వివేకము' Prudence తన సహచరులతో సంప్రదించాక, వారు

కోరిన మీదట, ముందుకు వెళ్ళి ఆ అజ్ఞాత ఆగంతుకురాలిని సమీపించింది. కంఠం సవరించుకొని కొంచెం బిడియపడుతూనే, అంది, ఆమె నుద్దేశించి.

"ఇక్కడున్న వాళ్లం మేమందరమూ ఒకరి కొకరం తెలిసినవాళ్లమే. మా పేర్లు, మా గుణగణాలు మా కందరికీ పరస్పరం తెలుసు. ఇది వరకు మిమ్మల్ని యెక్కడా ఎప్పుడూ చూసినట్లు లేదు. మాకు మీరు కొత్తవారుగా ఉన్నారు. మీ రాక మాకు విస్మయం కలిగిస్తోంది. దయచేసి మీరెవరో మాకు చెప్పరా?"

కొత్తగా వచ్చినామె, పాపం, నిట్టూర్పుతో అంది: "అయ్యో! ఇక్కడ ఈ భవనంలో నేను మీకు అపరిచితురాలు కావటం నాకేమీ ఆశ్చర్యం కల్గించటం లేదు. నన్నెవ్వరు ఎక్కడికీ పిలువరు కదా!" నా పేరు, 'కృతజ్ఞత' 'Gratitude'.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

అన్ని స్వాభావిక చలనాలలో కెల్లా అహంతో కళంకితం కాని, స్వచ్ఛమైన అమితానందాన్నిచ్చేది, సహజ సుందరమైన కృతజ్ఞతాభావం. ఇదెంతో విశిష్టమైనది. ఇది ప్రేమ కాదు, ఆత్మార్పణ కాదు. పరిపూర్ణమైనది మరింత పరిపూర్ణమైనది.

ఇదెంతో ప్రత్యేకమైన స్పందన. దానికదే సాటి. ఇది నిన్ను విస్తృతపరుస్తుంది. నీలో పరిపూర్ణత నింపుతుంది. ఎంతో శక్తివంతమైనది. మానవ చేతనకి అందుబాటులో ఉండే సర్వచలిత చాలనాలన్నిటిలోకీ, కచ్చితంగా, ఇదే నిన్ను నీ అహం నుంచి బయటకు లాగేది. దాని స్వచ్ఛతలో నీవీ స్పందనకు లోనైనపుడు, ఇది దివ్యప్రేమావేశానికి, సమానమై ఉంటుంది. వెంటనే ఈ విషయం గ్రహిస్తావు. దీనికొకక నిర్దేశమంటూ ఏదీ లేదు.

చిట్టచివరికి, దివ్యప్రేమానుభూతియే, కొంచెం తేడాతో, కృతజ్ఞత అంటే.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

మనల్ని అత్యున్నతంగా చేసే రెండు శక్తులు

ప్రశ్న: "మన నిగూఢ స్వభావంలో మనకు తెలిసికానీ, తెలీకకాని దైవాన్ని ఆకాంక్షించేది ఒకటుంది. మన ఏకైక ధ్యేయం ఆ దైవమే కావాలి.", అని యిచట వ్రాయబడి ఉంది. మధుమయి మాతా! అలా ఆకాంక్షించే ఆ ఒకటి యేది?

మన లోపల ఒక భాగం ఉంది. అది యెల్లప్పుడు అందరిలో ఒకే విధంగా వుండదు. అది సహజంగానే చైత్యాత్మ ప్రభావానికి ఉన్మీలితమవుతుంది.

మనలో నిరంతరం ఒక భాగం ఉంది. కొన్ని సమయాల్లో అది మన ఎరుకలేకనే మూతబడి వుంటుంది. అది చైత్యాత్మ వైపు తిరిగి వుంటుంది. చైత్యాత్మ ప్రభావాన్ని గ్రహిస్తూ వుంటుంది. ఇదే చైత్యపురుష చేతనకు, బాహ్యచేతనకు మధ్యవర్తిగా వుంటున్నది.

అది అందరిలోను ఒకే విధంగా వుండదు. ఒక్కొక్కరిలో ఒకో రకంగా వుంటుంది. అది వ్యక్తి స్వభావంలో లేదా గుణంలో ఒక అంశగా వుంటుంది. దాని ద్వారా ఆ వ్యక్తి చైత్యాత్మను స్పృశించగలుగుతాడు. అక్కడే అతడు చైత్యపురుష ప్రభావాన్ని గ్రహిస్తాడు. అది ఆయా వ్యక్తులపై ఆధారపడి వుంటుంది. ఎందుకంటే అది ఒక్కొక్కరిలో ఒకో రకంగా వుంటుంది. ప్రతి ఒక్కరు అలాంటి అంశను కలిగి వుంటారు.

నీలో హఠాత్తుగా యేవో శక్తులు నిన్ను ముందుకు త్రోసినట్లు, పైకి లేవనెత్తినట్లు, ఒక గొప్ప స్థితికి నీ కొరకై ద్వారం తెరచినట్లు నీవు అనుభూతి నందవచ్చు. అది అనేక విధాలుగా వుండగలుగుతుంది. అది ఆయా వ్యక్తుల స్వభావాన్ని బట్టి వుంటుంది. ఇది సత్వములోని భాగమే; అదే ప్రోత్సహిస్తుంది. అలా ప్రోత్సహించగల సామర్థ్యంకల భాగమే, అది.

రెండు ప్రధానశక్తు లున్నవి. జడత్వం నుండి లేక మాంద్యం నుండి మనిషి బైట పడడానికి అవసరమైన ఉత్సాహాన్నిచ్చే శక్తి ఒకటి. తద్వారా అతడు తనను ఏ స్థితికి పురికొల్పుతుందో ఆ స్థాయికి చేరుతాడు. ఉదాహరణకు కళాతపస్వి తన కళ కొరకు, శాస్త్రివేత్త తన విజ్ఞానం కొరకు ఉత్తేజితుడవుతాడు. సాధారణంగా సృజనాత్మకశక్తి గలవారు తమలో ఉత్సాహాన్ని కలిగించే ప్రత్యేక శక్తి యొక్క ఉన్మీలనాన్ని, ఉత్సాహాన్ని కలిగించే అవకాశాన్ని కలిగి వుంటారు. ఈ శక్తి క్రియా

త్మకమై, చురుకుగ వున్నప్పుడు మనిషిలో యేదో శక్తి మేల్కొంచి, కార్యసిద్ధికై అతడు ఆ కార్యంలో సంపూర్ణంగా పాల్గొనేట్లు చేస్తుంది.

మరొకటి. సహజంగా కృతజ్ఞతాభావం కలవారు కొందరున్నారు. జీవితం వెనక అతి చిన్న సంఘటనలలోను శ్రేష్ఠమైన సౌందర్యానికి లేదా అనంత అనుగ్రహానికి ప్రేమతో, భక్తితో, ఆనందంతో స్పందించేవారున్నారు.

అవిద్యావంతులు, అజ్ఞానులుగా నున్న సాధారణ మానవులను కొందరిని నేనెరుగుదును. వారు ప్రేమపూర్వక కృతజ్ఞతాభావం కలిగి అభినందనీయులుగ వుంటున్నారు. వారు తరచుగా చైత్యపురుష సంబంధం కలిగి వుండినవారు. వారు దైవానుగ్రహం వల్ల సహాయాన్ని పొంది, ఉద్దీప్తులవుతున్నారు.

ఈ రెండు గుణాలు ప్రజలను ఉన్నతులుగ చేస్తున్నాయి. వారు యిలాంటి సుగుణాలలో యేదో ఒకదానితో జన్మిస్తారు. వారు శ్రమ తీసికొంటే అభివృద్ధి నందగలుగుతారు. బాధాకరమైన, నీచమైన అహంకారం నుండి మిమ్మల్ని బైట పడవేసే ఉత్సాహం, కృతజ్ఞతలు చైత్యపురుషంలో దైవంతో సంబంధాన్ని కల్గి వుండుటకు తోడ్పడే శక్తివంతములైన సాధనములు. ఈ సంబంధం చైత్యపురుషునితో కలిపేందుక కీలకమైనదిగా, కచ్చితమైనదిగా పనిచేస్తుంది.

*

భక్తి వెంట నిరంతరం సాగవలసిన మరో ప్రక్రియ వుంది. అది యీ విశ్వంలో వున్నది దైవమేననీ, రాక్షసుడు కాదని గుర్తించి, ఆ భగవంతుని పట్ల కృతజ్ఞత కలిగి వుండడం. అలా ప్రతి చిన్న పని నిన్ను ఆ ఉత్కృష్ట సత్యం వద్దకు చేర్చితే నీ హృదయం కృతజ్ఞతాపూర్వక ఆనందభరితమై సర్వత్రా అద్భుత ప్రమోదం వెల్లివిరుస్తుంది. మీకు కృతజ్ఞత వల్ల కలిగే సంతోషానికి సమానమైన సంతోషాన్ని యివ్వగలిగేదేదీ లేదు. మీరు పక్షుల గానం ఆలకించండి. అందమైన పుష్పాలను దర్శించండి. అమాయక శిశువును తిలకించండి. ఔదార్యాన్ని గమనించండి. రసాత్మక వాక్యాన్ని చదవండి. అస్తమించే రవిని దర్శించండి. అపుడు ప్రపంచం భగవంతుని ఆవిర్భావమేనని, ప్రపంచం వెనక భగవంతుడున్నాడనే ఉత్కృష్ట అనుభూతి మీలో ఉద్దీపితమవుతుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: బి. నరసింహయ్య

శ్రీమాత జవాబులు

ప్రశ్న: చీకటి, చీకటి, అంతరించిపో! అమ్మా! మీరిక్కడ లేరా?

జవాబు: నే నిక్కడే ఉన్నాను. ఏ చీకటైనా కరిగిపోవుటకు అవసరమైన కాంతిని నీ మీద ప్రసరిస్తున్నాను. దానిని స్వీకరించుట నీ ఇష్టం.

ప్రశ్న: నేను ఏ మార్గాన్ని ఎంచుకోవాలి? అందుకు చేయవలసిన కృషికి ఏది సక్రమ సత్యవంతమైన మార్గము?

జవాబు: నిన్నటి రోజున నేను వివరించినదాన్ని చేయి — ఒక ఏర్పాటుతో క్రమపద్ధతిలో అధ్యయనం చేస్తూ నీ బుద్ధిని వినియోగించు. నీ అధ్యయనం ఆపినపుడు, మనసు విశ్రాంతి తీసుకుంటూ, నీ హృదయపు లోతులలో కేంద్రీకరించుటకు దానికి సాధ్యమవుతుంది. అపుడు చైత్యపురుషుని మూలాన్ని నీవు కనుగొంటావు. అంతట నిజమైన సంతోషము, కృతజ్ఞతలకు చైతన్యవంతమవుతావు.

నీలో ఇంకా కృతజ్ఞతాభావం మేల్కొన లేదు. అందుకే చీకటిని నేను పారద్రోలినా, అది నీ దగ్గరకు మళ్లీ తిరిగి వస్తున్నది. అది ఇప్పుడు తెలిసింది.

ప్రశ్న: నాలోని ఏదో ఒక మౌలిక అంశము దైవకృపను విశ్వసించటం లేదు. అదే కృతజ్ఞతాభావాన్ని నిరోధిస్తున్నదని అనుకుంటాను.

జవాబు: స్పష్టంగా అంతే!

ప్రశ్న: మొదట్లో మీరంటే ఎంతో ప్రేమగా ఉండేదాన్ని. కాని ఇప్పుడు అది స్వార్థ పూరితమైంది.

జవాబు: అవును. అంతే. నీ సమర్పణను బేరసారాలతో ప్రారంభించావు. అది మూలాన్నే ఎండగట్టింది. ఏది ఏమైనా నీ సమర్పణకు బదులుగా ఏ ప్రతిఫలాన్ని ఆశించని యెడల అనతికాలములోనే, సాటిలేని ప్రేమానందాన్ని నీవు తిరిగి పొందుతావు.

ప్రశ్న: స్వార్థపూరితమైన ప్రేమతో మీకు దగ్గరగా ఉండుట సాధ్యమా?

జవాబు: నీ స్వభావం పూర్తిగా పరిణామం చెందనంతవరకు అది మంచిచెడులతో మిశ్రమంగానే ఉంటుంది. కావున పరివర్తన సాధించేవరకు నా వద్దకు వచ్చువారంతా అహంకారంతో మిళితమైనవారుగానే ఉంటారు.

ప్రశ్న: నేను చేసే చెడ్డపనులు నాకు తెలుసు. కాని దురదృష్టకరం నేను వాటిని

నివారించలేకున్నాను. అది నన్ను బాధిస్తూ ఉంది.

జవాబు: కలత చెందకు. దైవాన్ని విశ్వసించు. విశ్వాసరాహిత్యమే చైతన్యాన్ని మరుగుపరుస్తోంది.

ప్రశ్న: అమ్మా! నా ప్రేమ స్వచ్ఛ చైత్యపురుష ప్రేమగా ఎలా ఉండాలో బోధించు.

జవాబు: నీ గురించి ఆలోచించకు.

ప్రశ్న: ఏకాంతములో ఉంటూ, నిశ్శబ్దాన్ని పాటించేలా నన్ను అనుమతించు, తల్లీ.

జవాబు: నీ మనస్సును నిశ్శబ్దీకరించు. ఏకాంతంలో నీ చైత్యపురుషుని దరి చేరు. అక్కడ నన్ను నీవు చూస్తావు.

ప్రశ్న: నిశ్శబ్దాన్ని పాటించి ఏకాంతంలో చైత్యపురుష సన్నిధిలో ఉండడం ఎలాగో తెలుపు. నీవు మాత్రమే ఆ స్థితిలో నన్ను ఉంచగలవు.

జవాబు: ఇది అంతా పూర్తిగా తామసికమైన ప్రశ్న. నా చైతన్యము సదా పని చేస్తూనే ఉంది. కాని నీ వైపు నుంచి నీ ఇచ్ఛాశక్తిని శ్రమింపచేసి తగిన కృషి చేయి.

ప్రశ్న: తల్లీ నిన్ను ఎలా కనుగొనాలో, అందుకెలా కృషి చేయాలో తెలుపవా!

జవాబు: నీ ఇచ్ఛాశక్తిని శ్రమింపచేయాలి.

మూలం: శ్రీమాత

అనువాదం: సిద్దులగారి త్రివేణి

(*CWM* Vol. 17, pp. 98-101)

కృతజ్ఞత వ్యక్తపరచే ఉత్తమోత్తమమైన మార్గము

ప్రశ్న: ప్రియమైన మాతా! మానవుని పట్ల మరియు దైవము పట్ల కృతజ్ఞతను వ్యక్త పరచుటకు ఉత్తమమైన మార్గమేది?

జవాబు: మానవుడిని, దైవాన్ని, ఎందుకు జోడిస్తారు? మానవుడు అంతస్స త్వంలో దైవం. కాని ప్రస్తుతానికి కొన్ని అరుదైన మినహాయింపులు తప్పించి, మానవుడు తన అంతరంగంలో ఆరూఢుడై వున్న దైవాన్ని గూర్చిన యిసుమంతైనా ఎరుక కలిగి వుండడు. కేవలం యీ ఎరుక లేకపోవుటయే తన యొక్క భౌతిక ప్రపంచపు కృత్రిమ ప్రవృత్తికి ఆలంబనమౌతోంది.

మన కృతజ్ఞత భగవదర్పితంగా వుండాలని నేనిదివరలోనే మీకు వ్రాసాను. ఇక మానవుని విషయంలో, కావలసిన దేమిటంటే, సద్భావనతో కూడిన సదవగాహన మరియు పరస్పర సహకార వైఖరి.

దైవం పట్ల ఒక గాఢమైన, తీవ్రమైన యెడతెగని సంపూర్ణ కృతజ్ఞతాభావన కలిగి వుండుట సంతోషంగా, ప్రశాంతంగా నుండుటకు అత్యుత్తమమైన మార్గం.

దైవం పట్ల కృతజ్ఞతను వ్యక్తపరచుటకు గల ఒకే ఒక సత్యమైన మార్గము, ఆతనితో మమేకం చెందటమే.

*

మన కృతజ్ఞతను వ్యక్తపరచుటకు చేయవలసిన ఉత్తమ కార్యమేమనగా, మనలో నున్న అహంకారాన్ని రూపాంతరీకరించాలి. ఇందుకు నిరంతర కృషి కావాలి. ఇతరులలో పరివర్తన లేదనే మిషతో మానవుని అహంకారం అతనిని విసర్జించుటకు నిరాకరిస్తుంది. అది దుస్సంకల్పానికి పట్టుకొమ్మ అవుతుంది. అందుకే పరులు చేసేదేమిటంటే విషయం పట్టించుకోకుండా, తనను తాను పరివర్తన గావించుకొనుట ప్రతి ఒక్కరి కర్తవ్యం.

ఈ పరివర్తన, ఈ అహంకార నివృత్తి, నిరంతర శాంతిసౌభాగ్యాలను అనుభవించే ఏకైక మార్గమని మనుషులకు అవగాహన మేర్పడితే, అందుకు అవసరమైన కృషి సల్పుటకు వారు సమ్మతిస్తారు. అందుకే వారిలో యిట్టి ధృఢనమ్మకం మేల్కొనాలి.

ప్రతి ఒక్కరికి పదే పదే చెప్పవలసింది ఏమంటే: నీ అహంకారాన్ని అంత

మొందించు. అప్పుడే నీలో శాంతి ఆధిపత్యం వహిస్తుంది.

ఒక అవ్యాజమైన ఆకాంక్షకు దైవసహాయం యెల్లవేళలా ప్రతిస్పందిస్తుంది.

*

ప్రభూ, పరమోన్నత సత్యమా,

మిమ్ము తెలుసుకోవాలని, సేవించాలనే మా ఆకాంక్ష.

మీగు తగిన బిడ్డల మగుటకు మాకు సహాయపడుము.

ఇందుకొరకు కృతజ్ఞత మా హృదయాలలో నిండి, మా జీవితాలను శాశించు నట్లు, మీ దీవెనలు మాకు సదా వుంటాయనే చైతన్యం మాకు కలిగించు.

*

అహంకారయుతంగా మనిషి కృతజ్ఞత కలిగి వుండలేడు — కారణం, తాను కోరినది తనకు దక్కినప్పుడు అది తన ప్రయోజకత్వమే అనుకుంటాడు. తనకు అక్కరలేనిది లభిస్తే, దానిని తీవ్రంగా నిరసించి, అందుకు ఎవరు బాధ్యులని తాను అనుకుంటాడో వారిపై ఆ నిందను మోపుతాడు — వారు దైవముకాని, మానవుడుకాని లేక దివ్యప్రకృతిగాని.

*

కృతజ్ఞత

దైవం నుండి అందే దివ్యకృపకు ప్రేమపూర్వకమైన గుర్తింపు.

దైవం నీకు చేసిన దానికి మరియు చేస్తున్నదానికంతా, నమ్రతతో కూడిన గుర్తింపు.

దైవం నీకు ఏమి చేస్తున్నాడో దానిని అనుభవించే యోగ్యత కుంటువడకుండా, నీ శక్తి మేరకు నీవు చేయగలిగినంత బాగుగా చేయగలందులకు నీకు దైవం పట్ల కలిగే సహజసిద్ధమైన హృదయపూర్వక విధేయతా భావన.

*

కృతజ్ఞత: మూసివున్న ద్వారాలను తెరచి, రక్షణ నొసగే దైవకృపను అంతరాల్లోకి లోతుగా చొప్పించగలిగేదానివి, నీవే.

మూలం: శ్రీమాత

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

పని ఆవశ్యకత

నువ్వేపనీ చేయకపోయినట్టయితే, ఎటువంటి అనుభవాన్ని పొందలేవు. జీవితం మొత్తం వొక అనుభవక్షేత్రం. నువ్వు వేసే ప్రతి అడుగు నీకు కలిగే ప్రతి ఆలోచన, చేసే ప్రతి పని వొక అనుభవం కాగలదు. అయితీరుతుంది. అందుచేత సహజంగా పని వొక విశిష్ట అనుభవరంగం. అక్కడ వ్యక్తి యొక్క అన్ని ప్రగతి సాధనాలు, అంతరంగంలో సాధించే కృషికి ఆచరణీయాలు కావాలి.

కర్మ చేయకుండా నువ్వు ధ్యానం లేదా చింతనలో వుండిపోయినట్టయితే నీ సాధన యే దశలో వున్నదీ తెలుసుకోలేవు. నువ్వొక భ్రాంతిలో జీవిస్తావు. అదే నీ సాధన ప్రగతికి సంబంధించిన భ్రమ. నువ్వు పని చేయడం మొదలుపెడితే యితరులతో యేర్పడిన సంబంధాలు, పదార్థ సంబంధిత వృత్తి మొదలైనవన్నీ మొత్తం వొక అనుభవక్షేత్రం. తను సాధించిన ప్రగతిని గూర్చిన స్పృహ మాత్రమే కాకుండా సాధించవలసిన ప్రగతి కూడా యెంత వుందో తెలియజేస్తుంది. నువ్వు నీ లోనే మూసుకుపోయి నిష్క్రియాపరత్వంతో వుంటే, వూహాజనిత భ్రాంతిలోనే జీవిస్తావు పూర్తిగా. ఏ క్షణంలో, నువ్వు నీ క్రియాకార్యకలాపాలను బహిరంగపరుస్తావో, యితరులతో, యితర పరిస్థితులతో, జీవిత సత్యాలతో యేర్పడే సంబంధంలో అడుగు పెడ్తావో అప్పుడే నువ్వు అసలైన వాస్తవిక వ్యక్తాతీత (నిరహంకార) దృక్పథాన్ని యేర్పరుచుకుంటావు. నువ్వు ప్రగతి సాధించావో లేదో తెలుసుకోగలుగుతావు. నువ్వు పూర్వం కంటె, ప్రశాంతంగా, చైతన్యవంతంగా, దృఢంగా, నిస్వార్థంగా వున్నావో లేదో తెలుసుకోగలుగుతావు. నిష్కామంగా, నిష్పాక్షికంగా యే బలహీనత, యే అవిధేయత లేకుండా నీ వన్నిటినీ గమనించి జాగ్రత్తపడడం పనిచెయ్యడం వల్లనే సాధ్యపడుతుంది. కాని కేవలం ధ్యానంలోనే వుండిపోయినట్టయితే పూర్తిగా ఏకాకివై సంపూర్ణ భ్రాంతిలో చిక్కుకుని యెన్నటికీ బయటపడలేవు. అలా వుండి అసాధరణ విషయాన్ని నువ్వు గ్రహించావని అనుకున్నట్టయితే అది నీ భావన మాత్రమే. ఆ నీ వ్యక్తిగత భ్రాంతి నువ్వలా భావించేలా చేస్తుంది.

ప్రార్థనలు — ధ్యానములు

నవంబరు 28, 1912

మన బాహ్యాజీవనం నిత్యమూ ప్రతి క్షణం చేసే కార్యకలాపం — ఇది ధ్యానచింతనాల కొరతను తప్పనిసరిగా తీర్చదా? వీటిలో ఒక్కొక్కదానికీ, కేటాయించే సమయం, సాఫల్యం కోసం చేసే ప్రయత్నం కోసం కేటాయించిన సమయంతో సరి కాదా? ధ్యానం, చింతనలతో యివన్నీ (జీవన కార్యకలాపాలన్నీ) కలిపినప్పుడే ఫలితం దొరుకుతుంది. అంటె సమైక్యత సిద్ధిస్తుంది. పువ్వు వికసిస్తుంది. దైనందిన చర్యలు స్వర్ణకారుని దాగలిపై సుత్తి దెబ్బలు తినే మూలకపదార్థాలు. అవి అలా శుద్ధి, పరిశుద్ధి అయి మృదువుగా, ప్రకాశవంతం అయేంతవరకు మళ్ళీ మళ్ళీ ప్రక్రియ అలా సాగిపోతూనే వుంటుంది. సంపూర్ణ ప్రగతి సాధింపబడి బాహ్య కార్య కలాపాలు అవసరం లేదనే స్థితికి వచ్చే ముందు, ఈ పదార్థాలన్నీ, ఒకదాని తరువాత ఒకటి కఠిన పరీక్ష ద్వారా అలా సాగిపోతూనే వుండాలి. అప్పుడే యీ వ్యవహారం నీ అభివ్యక్తిలోకి మలుపు తిరుగుతుంది. ఆ విధంగా కష్టపడి క్రమంగా ముందుకి పోవడం, ధ్యానం వాటికందించే ప్రకాశంతో రెండు పనులు యేకకాలంలో జరిగి, యితర చైతన్య కేంద్రాలన్నీ జాగృతం కావాలి. అందుచేత గర్వం, సాధించినదానికి సంతృప్తిచెందడం, అనేవి వ్యక్తికి యెదురయే ఆటంకాలన్నింటిలోకి అత్యంత నికృష్టమైన ఆటంకం. అత్యంత నమ్రతతో భగవత్ప్రసాదమయిన ప్రతి చిన్న అవకాశాన్ని తప్పకుండా తీసుకుని, అసంఖ్యాకమయిన అంశాలన్నింటినీ మధించి పరిశుద్ధి చేసుకోడానికి వాటిని మృదువుగా, నిరహంకారంగా తయారుచేయాలి. ప్రక్షాళనలో 'నేను' అన్నది మరిచిపోయేటట్టు భక్తి, కరుణ, సాధుత్వం సంతరించుకోవాలి. ఈ లక్షణాలన్నీ మనిషికి స్వాభావికం కావాలి. అప్పుడు వాళ్ళు చింతనలో పాలుపంచుకోడానికి తయారుగా వుంటారు. అత్యున్నత యేకాగ్రతతో, ఓ స్వామీ! నీతో వారి అభేదత్వాన్ని గ్రహిస్తారు. అందుచేతనే సుదీర్ఘము, ఆలస్యము అయినప్పటికీ కర్మ అత్యావశ్యకమని నా కనిపిస్తుంది. హడావిడిగా, హఠాత్తుగా జరిగే పరివర్తనలు సంపూర్ణమైనవి కావు. అవి మనిషి యదార్థస్థితిని మార్చేస్తాయి. అవి బేషరతుగా రాజమార్గంలో అడుగుపెట్టొచ్చు. కాని నిజం చెప్పాలంటే, లక్ష్యాన్ని సాధించాలంటే ప్రతి విషయం, ప్రతి సంఘటనతో అనేక

అనుభవాల అవసరం నించి యెవరూ తప్పించుకోలేరు.

మూలం: శ్రీమాత

ఆత్మ పరిశీలన, ఆత్మ విజయం, ఆత్మజ్ఞానం కొరకు కర్మ చేయాలి. కర్మ దాని స్వంత బాహ్య ప్రత్యక్షఫలాల కోసమో, లేదా, భవిష్యత్తు కోసమో, మాత్రమే కాదు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

సరియైన పద్ధతిలో పని

నీవు పనిచేస్తున్నపుడు — అదేదైనాగానీ, ఏమైనాగానీ — అది చేస్తున్నపుడు దైవాన్ని మరచిపోకుండా జాగ్రత్తగా చేయాలి. నీవు చేస్తున్న దానిని సమర్పణగా చేయాలి. నిన్ను నీవు గూడా సమర్పించుకోవాలి. అపుడు ఆయన నీ ప్రతిక్రియ లన్నిటినీ మారుస్తాడు. నీవు మారేందుకు ఇది అవసరం. అంటే వాటిని స్వార్థంగా, మూర్ఖంగా, అజ్ఞానంగా, చిల్లరమల్లరగా గాకుండా, అత్యంత ఉదారంగా, ప్రసన్నంగా, నిస్వార్థంగా మారుస్తాడు. ఆ విధంగానే నీవు అభివృద్ధి చెందగలవు. నీవు ప్రగతిని సాధించడమే గాదు, సామూహిక ప్రగతికి కూడా సాయపడగల్గుతావు. ధ్యానం చేసేందుకు కూర్చొని ప్రతీ ఆలోచనను దాని త్రోవన దానిని పోనిచ్చే వారిలో ఏ విధమైన అభివృద్ధిని నేనింతవరకూ గమనించలేదు. (ఎందుకంటే అక్కడ ధ్యానమనేది అసలు లేనే లేదు. అంతా శూన్యమే) అలాంటి వారిలో ధ్యానం అనే దానికి అర్థమే లేదుగనక వారిలో అభివృద్ధి కూడా శూన్యమే. అలాగే యోగం అనేది ఒక నటనగా గాకుండా, బాహ్యంలో రూపాంతరం కోరుతూ, ప్రపంచంలో దైవావిష్కరణ జరగాలన్న అభిప్రాయంతో ఎంతో కొంత నిస్వార్థంగా ఏమాత్రం కోరికలుగాని, ముక్తినిగానీ కోరకుండా హృదయపూర్వకంగా ప్రయత్నం చేసినవారిలో — ఎంతో ప్రగతిని ఒక విధంగా అద్భుతమైన ప్రగతి అనవచ్చు — గమనించాను.

*

నీ అంతర్ముఖ ఏకాగ్రతలోనే కాక, బాహ్య క్రియాకలాపాలలో కూడా నీవు సక్రమ దృక్పథం కలిగి ఉండాలి. అలా ఉంటూ, సర్వమూ శ్రీమాత మార్గనిర్దేశకత్వ

ములో ఉంచినపుడు, నీ కష్టాలు వైదొలగుతాయి. లేదా వాటిని సులువుగా అధిగమిస్తావు. విషయాలు నిలకడగా సాగుతాయి.

*

నీ ధ్యానంలోను, క్రియాకలాపాలలోను నీవు ఒకే మాదిరిగా ఉండు. శ్రీమాతకి ఉన్మీలనం చెంది ఉండు. ఆమె మార్గనిర్దేశకత్వానికే అంతా వదిలిపెట్టు. నిన్ను ఆదుకునే రక్షక దివ్యశక్తిని ప్రశాంతంగా వాంఛించు. నీ పని కది సహకరిస్తుంది. భ్రష్టు పట్టించే తప్పుడు మార్గంలో నడిపించే దుష్ప్రభావాలను నిరాకరించు.

*

ఈ సూత్రాన్ని పాటించు. నీ సత్వమంతా కూడా, ప్రశాంతంగా, దివ్యశక్తికాంతుల రక్షణలో మమేకమై ఒక్కటిగా ఉంటుంది.

*

నీవు యెల్లప్పుడూ సక్రమ దృక్పథంలో ఆధ్యాత్మిక వాతావరణంలో, చైత్యపురుష జాగృతిలో శ్రీమాత శక్తికి తెరుచుకుని ఉండటంలో — ఈ పరిస్థితులలోనే, నీ గెలుపు ఓటములు ఆధారపడి ఉంటాయనే సంగతి నీవు గ్రహించాలి.

*

నీ ఉత్తరాలు ద్వారా నాకు తెలిసింది నీవు నీ అభిప్రాయాలను, ప్రణాళికలను, మాటలను, చేతలను గాఢంగా పట్టుకొని వాటికే ప్రాధాన్యత నిస్తూ, వాటినే బలంగా నమ్ముకొన్నావని... నిజమే. నీ వైపు నుండి ఏ ప్రయత్నం లేకుండానే ఆ దివ్యశక్తి చాలా ప్రగాఢంగా పనిచేస్తుంది. నీ సత్తా పనిచేసేందుకు కావలసినది అంగీకారం. కృషి కాదు. నీ ప్రయత్నం కాదు.

*

సరే, అయితే, యోగంలోని భావన ఏమంటే — మానవుడు తన పరిమితత్వమును, విశ్వాసంతో తన కంటె ఉన్నతతరమైనదానికి ఉన్మీలనం గావించగలిగినపుడు, నీ కృషి అందుకు ఉపకరిస్తుంది. మామూలు సాధారణ జీవితంలో గూడా విశ్వజనీనమైన శక్తి చేతిలో వ్యక్తి అనేవాడు నిమిత్తమాత్రుడే. అయితే అతడు అహంకారంతో అంతా తానే చేస్తున్నానన్న భ్రమలో వుంటాడు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కొంగర భాస్కరరావు

శ్రీఅరబింద సొసైటీ — దాని లక్ష్యాలు

శ్రీమాత తే 19-9-1960 దీ న సంతకం పెట్టిన శ్రీఅరబిందో సొసైటీ యొక్క Memorandum of Association లో పొందుపర్చబడిన వాటిలో భాగాలు:

భారతదేశంలోను, బయట ఇతర దేశాలలోను ఈ క్రింద పేర్కొనబడిన లక్ష్యాలు అమలుపర్చవలెనని శ్రీఅరవింద సొసైటీ స్థాపించబడింది.

1. శ్రీమాతారవిందుల ఆదర్శాలు, లక్ష్యాలు, వారి సమగ్ర యోగం, సొసైటీ సభ్యులకు, సాధారణ ప్రజానీకానికి తెలియచేయటానికి వాటిని సాధన చేసి సిద్ధింపచేయటానికి, శ్రీఅరవిందులు ఊహించిన ఆధ్యాత్మిక సమాజ సాధనకు.
2. సమగ్ర విద్యావిధానంలో — ఆధ్యాత్మిక, చైత్యపురుష, మానసిక, ప్రాణిక, శారీరక విద్య — విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ప్రపంచవ్యాప్తంగా శిక్షణ నందించటానికి.
3. శ్రీఅరవింద అంతర్జాతీయ విద్యాకేంద్రవికాసానికి, అలాటి ఇతర విద్యాకేంద్రాలకు — ధన, వస్తు రూపేణ విరాళాలు, బహుమానాలు, ధనసహాయం, ఇంకా వివిధ ఇతర మార్గాలలో సహకరించటానికి.
4. శ్రీమాతారవిందుల సమగ్రయోగ విధాన అధ్యయనానికి, ఆచరణకు, — అధ్యయన శిబిరాలు, గ్రంథాలయాలు, ఆశ్రమాలు మరి ఇతర సంస్థల నేర్పాటు చేయటానికి, ఉన్నవాటిని ప్రోత్సహించి బలోపేతం చేయటానికి.
5. శారీరక వికాసం కోసం, క్రీడల కోసం ఆత్మసంకల్పంతో కూడిన క్రమశిక్షణ నందించటం కోసం, వాటిని ప్రోత్సహించి, నేర్పటం కోసం, ఇంకా, ఇతరులకు సేవాసహకారాలు అందించేందుకు, మరియు, ఆరోగ్యము, శారీరక పరిపూర్ణత ప్రోత్సహించే — కార్యక్రమాల కోసం, కేంద్రాలు స్థాపించటానికి,
6. విజ్ఞానశాస్త్రం, సాహిత్యం, లలితకళలు — వీటి అధ్యయనం, వీటిలో పరిశోధన కొనసాగించేందుకు ప్రోత్సహించి తోడ్పాటు నందించి, అందుకు సహకరించేలా వ్యవస్థీకరించటం,
7. సొసైటీతో సమాన లక్ష్యాలుకల మరి యే ఇతర సొసైటీ, ట్రస్టు లేదా సంస్థ, చట్టబద్ధం కాబడినదైనా, కాకపోయినా దానిని పూర్తిగాకాని, పాక్షికంగాకాని

స్వాధీనం చేసుకోవటం లేదా సంలీనం చేసుకోవటం, లేదా సహకారం అందించి పోషించటం.

8. సొసైటీ లక్ష్యాలను ప్రోత్సహించేందుకు, బలపర్చేందుకు పుస్తకాలు, పత్రికలు, ప్రకటనలు, ఇతర రచనలు అచ్చువేయించి ప్రచురించటం, అమ్మటం. నలుగురికీ ఉచితంగా లేక ఖరీదుకి పంచటం, చలనచిత్రాలు నిర్మించి ప్రదర్శించటం, వాటి ద్వారా వ్యాప్తి కావించటం;...

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

శ్రీఅరవిందులు ఊహించిన ఆధ్యాత్మిక సమాజం

సక్రమమైన ఆధ్యాత్మికత: వ్యక్తిగత సమగ్రతకి, సామాజిక సమగ్రతకి మనకు ఉన్న ఒకే ఒక తుది ఆశ ఆధ్యాత్మికతయే. అలాగని ఇహలోక సంబంధమైన లౌకిక వ్యవహారాలను చిన్నచూపు చూడటం కాదు. వాటిని స్వీకరించి సాధిస్తూనే, వాటి నధిగమించి, ఉన్నత ఆత్మసాధనలో ఆధ్యాత్మికత నిమగ్నమవుతుంది. మనిషియొక్క హేతువాదం, సౌందర్యాభిరుచి, నైతిక విలువలు, ప్రాణికతత్వము, భౌతికతత్వము, భౌతిక విజ్ఞాన పిపాస, అందమైనవాటి పట్ల ఆకర్షణ, ప్రేమ, దాని ఆవశ్యకత, అధికారం కోసం ప్రాకులాట, సుసంపన్న జీవితము — వీటన్నిటినీ, ఆధ్యాత్మికత తనలోకి తీసుకుంటుంది. వాటికి చెందవలసిన వాటిలో ఉన్న వాటి యొక్క దివ్య సంవేదన, దైవీభావము — వీటన్నిటినీ ఆధ్యాత్మికత ఆవిష్కరిస్తుంది. ఇంకా, వాటిని పరస్పరం సమన్వయపరుస్తుంది. అవి నడిచే వక్రమార్గాల నుంచి, చీకటి దారుల నుంచి తప్పించి కాంతివంతమైన మార్గంలో నడిపిస్తుంది. స్వయం సమృద్ధమైన మానవ మేధస్సును, సర్వోత్కృష్టమైన, పరమ శ్రేష్ఠమైన, అపారమైన తన వెలుగుకు మూల ఉత్పత్తి స్థానంగా ఏనాటికీ ఆధ్యాత్మిక శక్తి అంగీకరిస్తుంది. ఆధ్యాత్మిక వికసనమే, సహేతుకమైన, పరమమైన ప్రక్రియగా, సాధనకు అంతిమ లక్ష్యంగా ఆవిష్కారమవుతుంది. మానవుడు వ్యక్తిగతంగాను, సామూహికంగాను ప్రయత్నించి సాధించవలసినది ఇదే.

ఆధ్యాత్మిక సమాజం: అస్తిత్వానికి అత్యావశ్యకమైన మూడు సత్యసాధనల సిద్ధి కోసం ప్రయత్నించేదిగా ఆధ్యాత్మిక సమాజం ఆరంభమవుతుంది. అవి దైవము,

స్వేచ్ఛ, సమైక్యత. వీటిని వీటి వైరుధ్యాలలో సమస్త ప్రకృతి మరుగుపర్చి ఉంచ టానికి ప్రయత్నిస్తున్నట్లు ఉంటుంది. జనబాహుళ్యాని కివి కేవలం స్వప్నాలుగా, మాటలుగానే ఉంటాయి. ఈ మూడు అంశాలూ ఒక్కటే. దైవాన్ని సిద్ధింపచేసుకో కుండా స్వేచ్ఛాసమైక్యతలు సమకూడవు. అప్పుడే నీ సర్వోన్నత జీవాత్మను, సర్వభూతనివాసియైన పరమాత్మను వశం చేసుకోగలుగుతావు. మనం సాధార ణంగా పిలుచుకునే స్వేచ్ఛా, సమైక్యతలు వేర్పాటు ధోరణిలో పరాధీనంగా బ్రతికే ప్రయత్నాలు. తమకు తామే కేంద్రస్థానమై ఉంటూ తమ చుట్టూ గుడిగుడి గుండంగా తిరుగుతూ, వేసే పిల్లిమొగ్గలు. భగవంతుని సాక్షాత్కరింపచేసుకుని ఆయన వశంలో ఉన్నపుడే మనిషికి వాస్తవమైన స్వేచ్ఛ. నిజమైన సమైక్యత అంటే ఏమిటో అపుడే తెలుసుకుంటాడు. మరే విధంగానూ ఎప్పటికీ కాదు. తాను తెలుసుకోవల సిన దైవం వేచి ఉన్నాడు. అయితే మనిషి ఆయన కోసం అంతటా వెతుకుతాడు. భగవంతుని ప్రతిమలను సృష్టిస్తాడు. కాని నిజానికి తాను అన్వేషించేది, కనుగొనే ది, నిలుపుకున్నది, ఆరాధించేది కేవలం తన అహాన్ని, అహంకారయుతమైన జీవ నాన్ని మాత్రమే. అహం కీలకమైనది. దీన్న వదులుకోవాలి. అప్పుడే అహంకారం తన వేటకు స్వస్తి వాక్యం పలుకుతుంది. బాహ్యాంతర జీవనంలో, మనిషికి ఆధ్యా త్మికత ప్రప్రథమంగా సాధించగలిగే అవకాశం అప్పుడే లభిస్తుంది. ఇంకా ఇది సరి పోదు. ఇది కేవలం ఒక ఆరంభమే అవుతుంది. ఆధ్యాత్మికత లోనికి గుడ్డిగా ప్రవేశించటం కాకుండా అందుకు నిజమైన ద్వారం తెరుచుకుంటుంది.

ఆధ్యాత్మికంగా ఉదాత్తమైన సమాజం, ఆధ్యాత్మీకరింపబడిన వ్యక్తులు లానే, అంతరంగ జీవనంలో ఉంటుంది. అహంకారంలో జీవించదు. ఆ సమాజానికి అహం సామాన్య గుణం అవదు. ఆత్మజీవనం సామాన్య గుణంగా ఉంటుంది. అహం కారం నుంచి విముక్తి వాళ్లల్లో ప్రస్ఫుటమైన గుణంగా ఉంటుంది. అహంకార నిర్మూలనం కూడా, బలవంతంగానో, నచ్చచెప్పి ఒప్పించడం ద్వారానో జరుగ దు. అలాగైతే, వ్యక్తి తాను కష్టపడి సంపాదించుకున్న అతివిలువైన వ్యక్తిగత ఇచ్ఛా శక్తిని, ఆకాంక్షలను, సామూహిక ఇచ్ఛాశక్తులకు, లక్ష్యాలను సాంఘికపరమైన అహంకారానికి ఆహుతి కావించడం అవుతుంది. అలాగైతే బ్రహ్మాండమైన నిరా కార పూజాపీఠం దరికి బలిపశువును బలి ఇవ్వటానికి బలవంతంగా లాక్కొని వెళ్ళి నట్లు అవుతుంది. అది చిన్న (వ్యక్తిగత) అహాన్ని, పెద్ద (సామూహిక) అహానికి

ఇచ్చే బలి అవుతుంది. సామూహిక అహం అంటే వ్యక్తులందరి యొక్క అహంకారాలు ఒక్కటైన అహం మాత్రమే కదా. అది రాసిలో పెద్దది. వాసిలో అల్పమైనది. విశాలమైనది కాదు. ఉన్నతమైనది కాదు. పూజించటానికి అనర్హ మైనది. కళంకిత మైనది. వికారమైనది. అదొక మూఢనమ్మకం. వ్యక్తిగత అహం కంటె కూడా హీన మైనది. అహంకార రాహిత్యం ద్వారా ఆధ్యాత్మిక తత్వం కలిగిన వ్యక్తి అంతరాత్మను అన్వేషిస్తాడు. అదే అందరిలోను ఉన్నది. పరిపూర్ణత, సమగ్రత సమకూర్చేది. అందులో మనుగడ సాగించడమంటే పరిపూర్ణతకి ప్రతిరూపంగా యెదిగి ఉండటమే అవుతుంది. వ్యక్తిగతంగానే అయినా అంతటిని ఆలింగనం చేసుకునే సార్వత్రిక స్వభావంలో కలిగిన విశ్వవిశాల పరిధిలో చైతన్యవంతంగా ఉండటం. భారతీయ ప్రాచీన రచనల ప్రకారం, త్రేతాయుగం (the second age) దివ్యశక్తి పాలనలో ఉన్న యుగం (the age of Power). పరిపాలకుడు విష్ణువు అంశ కలిగి ఉన్నవాడు. ద్వాపరయుగం (the third), the age of balance. పాలకుడు శాసనకర్త, లేక సూత్రబద్ధం చేసినవాడు. సత్యయుగంలో దైవం యజ్ఞసంభూతుడు, అంటే, కర్మాధిష్ఠాన దైవముగా, అందరి హృదయాలలో అభివ్యక్తుడు. ఈ దైవీసామ్రాజ్యం అందరి హృదయాల్లోను ఉంది. దైవం ఎక్కడో స్వర్గలోకంలో కనుగొనబడవలసిన వాడు కాడు. హృదయాధిష్ఠాన దైవంగా గుర్తించాలి. అపుడే ఆ యుగం సత్యయుగంగా పరిణమిస్తుంది. ఫలితంగా సత్యము బాహ్యంగా రూపుదాల్చి ఉంటుంది.

అందుచేత తొలిసారిగా ఆధ్యాత్మికత సంతరించుకున్న సమాజానికి కూడా మనిషిలో అంతరంగ ప్రేరణ వల్ల దివ్యాత్మ వెల్లడి కావటం మొట్టమొదటి లక్ష్యమవుతుంది. ఆ సమాజపు సర్వచలిత చాలనాలకు — విద్య, శాస్త్రవిజ్ఞానము, నైతిక సూత్రాలు, కళలు, ఆర్థిక రాజకీయ ఆధారిత రూపాలు, కట్టుబాట్లు, వీటన్నిటికీ కూడా — అదే లక్ష్యము. ప్రాచీన వేదకాలంలో ఉన్నతశ్రేణి వర్గాలకు ఇదియే సాంస్కృతిక క్రమశిక్షణ అయింది. అలాగే మొత్తం విద్యావిధానమంతటికీ ఇదే ప్రాతిపదికగా, లక్ష్యమవుతుంది. మొత్తం విజ్ఞానం అంతటినీ తన పరిధిలోనికి స్వీకరిస్తుంది. నిర్దిష్ట మార్గము, లక్ష్యము ఇదే అవుతుంది. ప్రాపంచిక విషయసామర్థ్యానికే కాక, ఆత్మోన్నతి, ఆత్మాన్వేషణలకీ ఇదే పరివ్యాప్త జీవలక్షణం అవుతుంది. భౌతిక మానసిక విజ్ఞానశాస్త్రాల అధ్యయనం చేసేది కేవలం లోకజ్ఞానం కోసం, మానవుని భౌతిక అవసరాలు తీర్చుకోవటంలో ప్రకృతి ప్రక్రియలు తెలుసుకోవటం

కోసమే కాక, వీటన్నిటి ద్వారా, వీటన్నిటిలోను, వీటన్నిటికీ మించి, వీటికి వెనుక గుప్తంగా ఉన్న దైవాన్ని, జీవాత్మను కనుగొనటం కోసమే అవుతుంది. ఈ సమాజంలో నీతినిబంధనలకు లక్ష్యం కార్యాచరణ నియమనిబంధనల విధానాలను సుస్థిరపరిచేదిగా కాక మానవరూపంలో పశువుగా ప్రవర్తించే మానవమంద యొక్క వికృత, అజ్ఞాన సాంఘిక సూత్రాలకు అనుబంధంగా ఉండేవాటిని కొంతవరకు సరిదిద్దేదిగా ఉంటూ, మానవుని లోని దివ్యస్వభావాన్ని పెంపొందిస్తుంది. కళ తనకు నిర్దేశిత లక్ష్యంగా, ఆత్మాశ్రయము, మరియు, బాహ్య వాస్తవ ప్రపంచ ప్రతిరూప చిత్రణం మాత్రమే కాక, గుర్తించదగిన, గమనార్హమైన కల్పనాశక్తితో కూడిన దృష్టితో ఆంతరంలోకి కూడా వెళ్లి దివ్యసత్యసుందరరూపాలను ఆవిష్కరిస్తుంది. మనకు బాహ్యంగా అగుపించే రూపాలు, అంతర్గతంగా గమనించతగిన ఆకృతులకు ముసుగులు.

తన సామాజిక వ్యవస్థలో ఆధ్యాత్మిక సమాజం, సాధుపుంగవుడు నుంచి నేరస్థుడు వరకూ ఉండే వ్యక్తులను సాంఘికసమస్య దృక్పథంతో పరిగణించదు. నేర్పుతో కల్పించబడే యంత్రాంగం ద్వారా పరిశోధించి విచారణ చేయవలసినవారుగానూ వాళ్లను చూడదు. వాళ్లందరూ ఒకే మూసలో పోతపోసి అందరు ఒకేలా ఉండవలసినవాళ్లు లేదా, అలా లేకపోతే అణగద్రొక్కి పారవేయవలసినవాళ్లు అనుకోదు. అలాకాక వారిని ఒక వలలో చిక్కుకుని బాధపడుతూన్న విముక్తి కాబడవలసిన జీవాత్మలుగా పరిగణిస్తుంది. ఇంకా వీళ్లు, ఆత్మవికాసానికి ప్రోత్సహింపబడవలసిన వాళ్లు అని భావిస్తుంది. ఆత్మవికసనం పొందినవాళ్లు అయితే, దిగువస్థాయిలో ఉన్న ఇంకా యెదగని జీవాత్మలకి శక్తిసహకారాలు అందించవలసినవాళ్లుగా పరిగణిస్తుంది. ఆధ్యాత్మిక సమాజం, ఇక్కడ, తన ఆర్థికవిధానంలో పోటీ పద్ధతి లేక సహకారపద్ధతిలో అపరిమితమైన వస్తూత్పత్తి యంత్రాంగాన్ని సృష్టించదు. కొందరికే పరిమితంకాని, అందరికీ, ప్రతివ్యక్తికీ, తనకు అవకాశం ఉన్నంతలో ఉన్నత శ్రేణిలో, స్వస్వభావానుగుణంగా, ఆనందంగా పనిచేసే అవకాశం, అంతరంగ వికాసానికి తగినంత తీరికసమయం కల్పిస్తుంది. దానితో పాటు, అందరికీ సుసంపన్నము, సుందరము అయిన జీవనాన్ని కల్పిస్తుంది. తనయొక్క రాజకీయ విధానంలో దేశాలను, రాజ్యాలను అపరిమితమైన రాజ్యాంగ యంత్రాంగంగా పరిగణించదు. దానిని క్రమబద్ధీకరించే రక్షకుడు అనేవాడు ఉండడు. ఆ యంత్రాం

గాన్ని తన దైవంగాను, విస్తృత విశాల అహంగా భావించడు. అదొక పూజాపీఠం గాను, దానికి ప్రజలను బలిచేయడం, తనకు తాను బలి అవడం — ఆ రకంగా ఆ రాజకీయ యంత్రాంగాన్ని సుస్థిరంగాను, శక్తివంతంగాను, మరింత విస్తృతంగాను, సంకీర్ణంగాను, గందరగోళంగాను, యాంత్రికంగా మరింత సమర్థవంతం పరిపూర్ణం కావించాలనుకోవటం ఉండదు. ఈ రాజ్యాంగాలు, దేశాలు పరస్పరం సత్సంబంధాలు నెలకొల్పుకొని తృప్తిగా ప్రశాంతంగా ఉండనూ ఉండవు. ఎందుకంటే ఇవి అనారోగ్యకరమైన, నష్టదాయకమైన యంత్రాంగాలు. ప్రశాంతంగా ఉండవు. పరస్పరం విషవాయువులు ప్రసరింపచేసుకుంటూ ఉంటాయి. ఘర్షణసమయాలలో సాయుధబలగాలను మోహరించి పరస్పరం దాడులు చేసుకుంటాయి. ఇవి ఆధునిక మారణాయుధాలు ఉపయోగించుకుంటూ పరస్పరం హతమార్చుకోవటం, అమాయక ప్రజలను బలిచేయటం ఉంటుంది. ఆధ్యాత్మీకరింపబడిన సమాజం, ప్రజలను, సామూహిక జీవాత్మలుగా పరిగణిస్తుంది. దైవం మరుగై గుప్తంగా ఉంటుంది. తమలో ఉన్న దైవాన్ని స్వయంగా ఆవిష్కరించుకోవాలి. తమ స్వభావానుగుణంగా వ్యక్తులు ఆత్మవికాసం పొందుతారు. ఒకే మానవతా కార్యక్రమంలో మొత్తం జాతి పరస్పరం ఇందుకు సహకరించుకుంటుంది. వ్యక్తిగతంగాను, సామూహికంగాను దివ్యాత్మను కనుగొనటం కార్యక్రమంగా ఉంటుంది. మానసికంగా, ప్రాణికంగా, భౌతికంగా విస్తృతస్థాయిలో ఉన్నతంగా, సంపన్నంగా, అంతరంగ జీవనంలోను, బాహ్యజీవనంలోను పురోగమనానికి సాధించవలసిన సంభావ్యత లన్నిటినీ సాధిస్తారు.

ఎందుకంటే మరి ప్రతి వ్యక్తి, సమాజము, దేశము అంతర్నిహితమైన దైవత్వంలోనికి యెదగాలి. ఇది బాహ్యంగా పైనుంచి విధింపబడే నియమమూ కాదు, భావమూ కాదు. ఆధ్యాత్మిక యుగంలో మానవజాతి అత్యధికంగా గౌరవించవలసిన నిబంధన అంతరంగ స్వేచ్ఛావికసనం. బాహ్యంగా అనుల్లంఘనీయమైన అనివార్యమైన శాసనాల నుంచి తప్పించుకోవాలంటే మనిషి ఆత్మజ్ఞానానికి అవసరమైనంత దగ్గరగా చేరాలి. అందుకు ఉన్ముఖం కావాలి. తప్పదు. ఆత్మజ్ఞానం లేకపోతే తాను ఎంత కృషి చేసినా అదంతా విఫలమే. అంతవరకు తను తన కుటుంబానికి, కులానికి, తెగకి, మతానికి, సంఘానికి, దేశానికి కట్టుబానిసగా ఉండవలసినవాడే. అలా కాక మరోలా ఉండలేడు. వాళ్లు కూడా వాళ్ల యొక్క అనాగరిక యాంత్రిక

నిర్బంధాలకు ఇతనిని గురిచేయకుండా ఉండలేరు. ఎందుచేతనంటే, మరి, తానూ, వాళ్ళూ కూడా తమ తమ అహంభావాలకి, నిమ్నస్వభావాలకీ దాసులే కదా! మనం చేయవల్సినదల్లా, మన అంతరంగ జీవాత్మకి లోబడి ఆత్మసంవేదనలో ఉండి తీరాల్సిందే. అలా కాకపోతే ఇతర బాహ్య నిర్బంధాల నుంచి తప్పించు కునే హక్కు నీ అంతరంగానికి ఉండదు. నీ నిమ్న స్వభావం తనంతటత తాను జీవాత్మకి లొంగిపోవాలి. నీ అంతరంగ ధర్మాన్ని నీవు ఉద్ధరించుకోవాలంటే ఇది నీకు తప్పదు. బాహ్య ఒత్తిడిలు నుంచి తప్పించుకోవాలన్నా ఇది నీకు తప్పదు. నీవు చైతన్యవంతమైన, ప్రకాశవంతమైన ఉపకరణం కావాలి. నీ లోపలి దివ్యసత్త్వానికి ఒదిగి ఉండి దానితో భాగస్వామ్యం వహించి, తోడుగా ఉండాలి. నీ విముక్తికి షరతు అంతరంగానికి లోబడి ఉండటమే. దివ్యసత్యమునకు లోబడి ఉండటంలోనే ఆధ్యాత్మిక స్వేచ్ఛ, విముక్తి. అంతేకాని మానసిక, ప్రాణికస్థాయిలలో వేర్పాటు ధోరణితో, అహంయొక్క హక్కును స్థిరపర్చుకోవటం కాదు. అయితే ఇక్కడ ఒక విషయం. భగవంతుడు మన సత్త్వంలో సహజాతంగా ఉండే అన్ని దేహభాగాలను గౌరవిస్తాడు. వాటి వాటి స్వభావానుగుణంగా అవి అభివృద్ధి చెందే అవకాశమిస్తాడు. వాటి స్వకీయమైన పెరుగుదలలోనే అవి తమలో దైవాన్ని కనుగొనగలుగుతాయి. అంతే కాని తమ స్వీయవినాశనంలో కాదు. అంతిమంగా తాము అంగీకరించే విధేయత పరిపూర్ణమై ఉండాలి. ఇష్టపూర్వకంగా ఉండాలి. తమ అంతశ్శక్తికి, ఆకాంక్షలకు, సర్వోన్నత సత్త్వానికి, అంతరంగంలో ఉన్న వెలుగుకు, మూలాధారశక్తికి, విధేయత, ఇష్టపూర్వకంగా ఉండాలి. అందుచేత అలాటపుడు నూతనము, ఉన్నతము అయిన ఆధ్యాత్మిక తత్త్వము సమకూర్చుకోబడని పరిస్థితిలోకూడా, ఎంతో ఆరోగ్యవంతమైన, సజీవమైన, స్వేచ్ఛా వికసనాన్ని పొందగలుగుతాం. క్రియాకలాపాలన్నీ అత్యంత స్వేచ్ఛాయుతంగా కొనసాగుతాయి. మితమీరిన నిర్బంధం, నీరసమైన నియమంగా ఉంటుంది. లేకపోతే, భిన్నరూపంలో, నిరంకుశత్వంగా మారుతుంది. లేదా అణచివేయబడిన కల్లోలంగా ఉంటుంది. ఆధ్యాత్మికసత్త్వానికి జాగృతమైన వెంటనే మానవుడు బాహ్య విధానాల నుంచి తప్పించుకొని, స్వేచ్ఛాయుత ధర్మమార్గంలో ప్రవేశిస్తాడు.

ఆధ్యాత్మికయుగమానవాళి ఈ సత్యాన్ని అవగాహన చేకుకుంటుంది. మనిషిని యాంత్రికంగా పరిపూర్ణుని చేయ నిచ్చగించదు. నిటారుగా బలవంతాన నిల

బెట్టి ముక్కుకు సూటిగా ముందుకు నడిపించదు. ఉన్నత సత్వాన్ని సంతరించు కున్న వ్యక్తిని సమాజంలో రక్షకభటుడిగా నిలపెట్టదు. ఒక అధికారిగాచూపదు. ఒక పవిత్ర వస్తువుగా ప్రదర్శించదు. సామ్యవాద సిద్ధాంతాన్ని అమలుపరిచే అధికారి గానో, లేదా సోవియట్ రష్యాలో ఎన్నుకున్న కార్మికసభ్యుడిగానో చూపించదు. వీలైనంత తొందరగా, వీలైనంత వరకు మానవజీవితంలో బాహ్యంగా ఒత్తిడి కలి గించే అంశాన్ని తగ్గించటం దాని లక్ష్యం. మానవునిలోని అంతరంగ జీవాత్మకు, తనను, జాగృతం చేయటం ద్వారా ఇది సాధింపబడుతుంది. ప్రాథమికంగా అది వినియోగించే పద్ధతులన్నీ ఆ లక్ష్యసాధన దిశగానే వినియోగింపబడతాయి. తుది గా, ఆధ్యాత్మికయుగం, ఆధ్యాత్మిక నిర్బంధాన్ని (the spiritual compulsion) వినియోగిస్తుంది. కేవలం ఒక్క దీనిని మాత్రమే వినియోగించదు. ఇక్కడ ఎన్నో నిరాకరణలు, ఒత్తిళ్లు ఉంటాయి. మానవుని స్వస్వభావం ద్వారా, దివ్యత్వంలోకి యెదగాలనే కోరిక, శక్తి — వీటికి అంతరంగం జాగృతం కాబడాలి. ఆధ్యాత్మీక రణం చెందిన వ్యక్తి తన చుట్టూ ఉన్నవాళ్ళని ఆధ్యాత్మికంగా ప్రభావితం చేయ గలడు. అలాటపుడు ఆధ్యాత్మీకరణ చెందిన సమాజం, ఇంకా మరి ఎంతగా ప్రభావితం చేస్తుందో ఊహించుకోవచ్చు. పరిపూర్ణంగా ఆధ్యాత్మీకరణం చెందిన సమాజంలో వ్యక్తి తీవ్రమైన స్వేచ్ఛ కలిగి ఉంటాడు. ఆ స్వేచ్ఛ ఎలా కనిపిస్తుందంటే ఏ కట్టు బాట్లని పట్టించుకోని ఆధ్యాత్మిక విశృంఖలత్వంగా ఉంటుంది. అక్కడ ప్రాథమిక మైన షరతు, ప్రగాఢమైన స్వేచ్ఛ. అందుకే అలా కనిపిస్తుంది. ఆ పరిస్థితిలో ప్రతి ఒక్కడు తనకు తానే శాసనకర్త కాడు. అలాగాక తాను మూర్తీభవించిన దివ్యశాస నంగా ఉంటాడు. ఎందుకంటే తాను దైవంలో జీవాత్మగా నివసిస్తున్నాడు కాబట్టి; ప్రత్యేక అహంకారయుతుడు కాడు కాబట్టి. ఆతని జీవనం దివ్యస్వభావ నియమా నికి అనుగుణంగా అహం నుంచి విముక్తమై ముందుకు ప్రచోదింపబడుతుంది.

అంటే దాని అర్థం మానవసమాజం అంతా వేర్వేరు వ్యక్తులుగా ఎవరికి వారే యమునా తీరేగా ప్రవర్తించటం కాదు. ఇక్కడ (ఆధ్యాత్మికతకు సంబంధించి) మూడవ విషయం కూడా మరొకటి ఉంది. అదే సమైక్యత. ఆధ్యాత్మిక సమాజం వికసిత పరిమళ కుసుమ కదంబం. ఎన్నో విశిష్టతలతో కూడిన విచ్చిన పుష్పాల సమాహారం. సజీవమైన, సచేతనమైన, భిన్నత్వంతో కూడిన ఏకత్వం. ప్రతి వ్యక్తి తన వ్యక్తిగత సత్వము ద్వారా తన అంతరంగంలోని దివ్యత్వానికి వికసిత మవు

తాడు. అందుకు తగిన పరిమాణంలో స్వేచ్ఛ ఉంటుంది. పురోగమనానికి అది జీవునికి అవసరం. పరిపూర్ణ జీవనానికి అపరిమితమైన స్వేచ్ఛ ఒక షరతు. గుర్తు. కాగా, తనలో దైవాన్ని దర్శించగలిగేవాడు, సమానంగా అందరిలోని దైవాన్ని దర్శిస్తాడు. దివ్యాత్మ అందరిలోను సమానమై ఉన్నది ఒక్కటే కదా! కాబట్టి తన యొక్క వ్యక్తిగత పరిపూర్ణత, లేక విముక్తికై అన్వేషణే కాక, ఇతరులలో కూడా దానిని అన్వేషించడం, ఆధ్యాత్మిక సత్యానికి పరిపూర్ణమైన నియమం. తనలో నున్న దైవత్వము, ప్రత్యేకంగా, తన ప్రత్యేక దైవముగా, కేవలం తన కోసమే అయితే అది పటాటోపంతో కూడిన అహంకారమే అవుతుంది. నీషే ఊహించిన ఆసురిక అహం అవుతుంది. లేదా గోతే యొక్క దర్జా, ఠీవి కలిగిన అహం అవుతుంది. ఒంటరి వేదాంతమవుతుంది. ఎక్కడో తిష్ఠ వేసుకుని ఉండి, ఎవ్వరికి అందుబాటులో ఉండని సన్యాసమవుతుంది. స్తంభం పైకి ఎక్కి కూర్చున్న మధ్య యుగపు తాపసి యొక్క తపస్సు అవుతుంది. కాని, అందరిలోను భగవంతుని దర్శించేవాడు ప్రేమపూర్వకమైన సేవతో అందరిలో ఉన్న భగవంతుని సేవిస్తాడు. కేవలం తన స్వీయ విముక్తి కోసమే కాక అందరి విముక్తి కోసం తాపత్రయపడతాడు. తన పరిపూర్ణత కోసమే కాక సర్వుల పరిపూర్ణత కోసం, ప్రత్యేకంగా ప్రయత్నిస్తాడు. విశ్వవిశాల సార్వత్రిక పరిపూర్ణతలోనే తప్ప, వ్యక్తిగత స్వీకీయమైన పరిపూర్ణ తను పరిపూర్ణతగా భావించడు. తన కోసం, రాజ్యం కోసం, సమాజం కోసం, వ్యక్తిగత అహం, సామూహిక అహం కోసం మనుగడ సాగించడు, సరి కదా, అంత కన్న ఉన్నతమైన, తనలోని దైవం కోసం, సర్వులలో ఉన్న లోకేశ్వరుని కోసం బ్రతుకుతాడు.

ఆధ్యాత్మిక యుగం ఆరంభమవటానికి సంసిద్ధంగా ఉంది. ఈ సత్యాలకు సాధారణ మానవ మేధస్సు సచేతనం కావాలి. అది తన స్తబ్ధత నుంచి ఈ మూడు భాగాలు (దైవము, స్వేచ్ఛ, సమైక్యత) తో కూడిన పరమాత్మ చేత, మేల్కొల్పబడాలి.

మూలం: శ్రీఅరవిందులు

భావానువాదం: క్రరా వెంకటేశ్వర్లు

సమచార పత్రం

ప్రకటనలు: సెప్టెంబరు 19 నుంచి సొసైటీ స్వర్ణోత్సవ సంవత్సరం ఆరంభమవుతుంది. సొసైటీ కేంద్రాలలోను, బ్రాంచీలలోను, పాండిచ్చేరి బీచి ఆఫీసు ప్రాంగణంలోను శ్రీమాతారవిందులకు కృతజ్ఞతాపురస్సరంగాను, శ్రీమాతారవిందుల కార్యక్రమాలకు పునరంకితం కాగలందులకు ధ్యానసమావేశాలు నిర్వహింపబడుతవి.

బెంగుళూరులో యువజన శిబిరము: శ్రీఅరవింద సొసైటీ బెంగుళూరు బ్రాంచి వారు 2009 అక్టోబరు తే 9, 10 లలో, శ్రీఅరవింద భవనం, 110, గంగాధర చెట్టి రోడ్డు, బెంగుళూరు - 560 042 వేదికగా యువశిబిరాన్ని నిర్వహిస్తున్నారు. వివరములకు 080-25559885 లేదా 25298684 నంబర్లకు ఫోను చేసి సంప్రదించగలరు.

పోస్టాఫీసులు ద్వారా ఎలక్ట్రానిక్ మనియార్డర్లు పంపవద్దని ఇందు మూలంగా వ్యక్తులకు, బ్రాంచీలకు, కేంద్రములకు తెలియచేయడమైనది. కారణం? ఆ సొమ్ము ఎందుకు పంపిస్తున్నారు అనే సందేశం అక్కడ అందటం లేదు. ఈ సౌకర్యం EMOS లో ఉండదు. కాబట్టి సొసైటీకి పంపించే సొమ్ము చెక్కులు ద్వారా పంపవచ్చు. బ్యాంకు చార్జీలు ఉండవు. అయితే పంపించే సొమ్ము ఎందుకోసమో తెలియచేస్తూ, ఒక ఉత్తరం జతపర్చాలి. ఇది అందరూ గమనించాలి.

కళాకారులకు, చిత్రకారులకు, ఫొటోగ్రాఫర్లకు ఆహ్వానం: శ్రీఅరవింద సొసైటీ ప్రచురించే పుస్తకాలు, పత్రికలు, వీటికి సంబంధించి, ఇంకా దృశ్యశ్రవణ రూపకాలు, CD Roms చలనచిత్రాలు, Website మొదలైనవాటిని రూపొందించుటకు సంబంధించిన కొత్త పథకాలు, కార్యక్రమాలు సొసైటీ చేబడుతోంది. ఈ విషయంలో కళాకారులు, చిత్రకారులు, ఫోటోగ్రాఫర్ల సహకారాన్ని సొసైటీ ఆహ్వానిస్తోంది. అందుకుగాను E.mail ద్వారా Vijay@sriaurobindosocietyorg.in, లేదా Vijay, Sri Aurobindo Society, Vinayak Koil Street, Pondicherry - 605 002 వారిని సంప్రదించగలరు.

శ్రీఅరవిందో సొసైటీ బ్రాంచి, తిరుపతి: శ్రీమతి ప్రేమానందకుమార్ గారు 22.6.2009 సాయంత్రం దర్శించారు. సత్సంఘ్‌లో పాల్గొని ప్రసంగించారు.



అఖిల

అఖిల భారత పత్రిక

అక్టోబర్ 2009

4.4.2009 — 4.4.2010

శ్రీఅరవిందులు పాండిచ్చేరి చేరుకుని నూరు వసంతాలు నిండిన సంవత్సరము.

19.9.2009 — 19.9.2010

శ్రీఅరవింద సొసైటీ స్వర్ణోత్సవ సంవత్సరం.


కవరు పైన ఉన్న పుష్పం:

దివినుంచి భువికి దిగివచ్చే సామరస్య దివ్యకాంతి తరంగాల వెల్లువ

విషయసూచిక

వెలుగు

విషయాలు తప్పుదారి పడుతూన్నప్పుడు — అదే ఉన్నతోన్నత అవకాశం — పరస్పర అవగాహన, సహకారం, సహృదయత (good-will) చూపించటానికి.



దివ్యజ్యోతి అంటే

వెలుగు ప్రాథమికంగా భౌతికసృష్టికి సంబంధించినది గాదు, అనేది మన సాధారణ అవగాహనకు విరుద్ధమైన విషయం. ఆంతరిక ప్రకాశాన్ని అనుసరించి కలిగే అవబోధం లేక అంతర్దర్శనంగాని మన స్వకీయ ఆంతరికదృష్టికి కన్పించిన ప్రతిబింబంగాని కాదు లేదా సంకేతాత్మకమైన ఒక ప్రక్రియగాని కాదు. ప్రాథమికంగా, ప్రకాశమయంచేసే, సృజనశీలియైన దివ్యసత్యం యొక్క ఒక ఆధ్యాత్మిక అభివ్యక్తి దివ్యజ్యోతి. భౌతికపదార్థం లోనికి పదార్థశక్తి యొక్క ఒక కార్యం నిమిత్తం, ఆ దివ్యసత్యం, తదుపరి, ప్రత్యామ్నాయంగా తయారైన లేదా మార్పుచెందిన రూపమే భౌతికవెలుగు.

*

తనకుగల అశక్తతవల్ల మన ఇంద్రియవ్యవస్థ అంధకారాన్ని కనిపెట్టింది. యదార్థానికి పరంజ్యోతి తప్ప మరేం లేదు. మన మానవతాదృష్టి యొక్క పరిమిత పరిధికి పైన లేదా దిగువన వున్నదే చీకటి.

ఎందుచేతనంటే విశ్వంలోని సూర్యుల వల్ల వెలుగు సృజించబడిందని ఊహించగూడదు. విశ్వంలోని సూర్యులు దివ్యప్రకాశం యొక్క భౌతికకేంద్రీకరణలే. ఏ వైభవాన్నవి మన కోసం, కేంద్రీకరించి చూపుతున్నాయో అది స్వయంభువు, అది సర్వే సర్వత్రా వుంది.

భగవంతుడు సర్వే సర్వత్రా వున్నాడు. భగవంతుడెక్కడెక్కడ వుంటే అక్కడల్లా పరంజ్యోతి వుంది. జ్ఞానం చైతన్యం జ్యోతిర్ బ్రహ్మ.

*

పరంజ్యోతి అభివ్యక్తమై వుంది. ఉపనిషత్తులు జ్యోతిర్బ్రహ్మను గురించి చెప్తాయి. బ్రహ్మమే జ్యోతి. చాలా తరచుగా, తనపైన తన చుట్టూ వెలుగు ప్రసరించడాన్ని, సాధకుడు సంవేదిస్తాడు. లేదా తన కేంద్రాలను ఆక్రమిస్తున్నట్లు లేదా అతని అస్తిత్వమంతా, దేహమంతా, ప్రతి జీవకణంలోనికీ చొచ్చుకుపోతూ, ప్రకాశింపజేస్తూ, వెలుగు ప్రవహించడాన్ని సంవేదిస్తాడు. ఆ వెలుగులో, ఆధ్యాత్మిక చేతనాభివృద్ధిని అనుభూతి చెందుతాడు. ఆ వెలుగుయొక్క నానా కార్యకలాపాలకు, ఉపలబ్ధులకు, తాను సంసిద్ధమై తెరచుకొన్న ట్లనుభూతి చెందుతాడు.

దివ్యక్రియాశక్తి యొక్క అభివ్యక్తి వెలుగు. ఆ శక్తి స్వభావాన్ని దివ్యప్రకాశం యొక్క రంగు సూచిస్తుంది.

*

పరంజ్యోతి పరమ సత్యం, దివ్యజ్ఞానం యొక్క సంకేతమెలాగో, అలాగే మానవులు నివసించే అజ్ఞానం లేక అవిద్యకు సంకేతం నిశీధి.

*

దానిని వర్ణించవలసిన అవసరమూ లేదు, సాధ్యమూ కాదు. నీవు చూస్తున్న వెలుగు లాంటిదే దివ్యవెలుగు. కాకపోతే అది మరింత సూక్ష్మం — అది చేతనను నిర్మలం చేస్తుంది, ఒక శక్తిగా పని చేస్తుంది, జ్ఞానం లభ్యమయ్యేట్లు చేస్తుంది.

*

పరంజ్యోతికి ప్రత్యేక వ్యావృత్తి అంటూ లేదు — అది దివ్యచేతన యొక్క జ్యోతి. అంతే. వ్యక్తి స్వభావాన్ని, ప్రకృతిని, సత్యచేతనకు, దివ్యజ్ఞానం వగైరాలకు, అర్హమైనదానిగా చేయడం, అంధకారాన్ని, అజ్ఞానాన్ని తొలగించడం, దానిని ప్రకాశింపజేయడం, ఆ పరంజ్యోతి వల్ల కలిగే ప్రయోజనంగా భావిస్తాం.

*

వెలుగు అనేది సర్వసాధారణంగా వాడే పదం. వెలుగు అంటే జ్ఞానం కాదు, పైనుంచి వచ్చే ప్రకాశం. అజ్ఞానాంధకారాల నుంచి అది జీవిని విముక్తం చేస్తుంది. శ్రీమాత యొక్క ధవళకాంతిలా, శ్రీఅరవిందులయొక్క తేలికపాటి శ్యామల వర్ణంగా, దివ్యసత్యం యొక్క బంగరు తేజంలా, (గులాబి, పాటలవర్ణ) వగైరా, చైత్య వెలుగుగా, అది వివిధ రూపాలుగా ప్రవర్తిస్తుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె.వి.రావు

రకరకాల వెలుగులు

అతిమానసం, మానసం, ప్రాణికం, శారీరకం, దివ్యం, రాక్షసం అని రకరకాల వెలుగులు ఉన్నాయి. వీటిని అనుభవపూర్వకంగా తెలుసుకోవాలి. వీటి తారతమ్యాన్ని గమనించటం నేర్చుకోవాలి. వీటి స్వచ్ఛత, సౌందర్యాలలో వాస్తవమైన కాంతిని గుర్తించట అంత కష్టమేమీ కాదు.

*

యోగంలో కాంతి ఎప్పుడూ లోచూపుకి దర్శనీయమవుతుంది. అయితే అన్ని వెలుగులూ సర్వోన్నత దివ్యకాంతి నుంచి ఉద్భవమైనవిగా ఉండవు.

*

విషయాలను, వస్తువులను బాహ్యంగా దర్శించడం వేరు. వాటికి నీవు తెరచుకుని వాటి పట్ల అనుకంపన చెందటం వేరు. చూడటం, గమనించటం, లోతుగా చైతన్య భూమిక లోనికి తీసుకొనివెళ్లటం, అదసలేమిటో తెలుసుకోవటం — ఇందుకు ఎన్నో విషయాల గురించిన అనుభవాలు కావాలి. వాటిని నీలో ఎందుకు ప్రవేశింపచేయాలి? భద్రపరచుకోవాలి? వీటికి సహేతుకమైన కారణమేమీ లేదు. దివ్యమైనది, దైవం నుంచి వచ్చినది అయితే మాత్రము దీనికి నీలోకి ప్రవేశము కల్పించవచ్చు.

నీరు స్వచ్ఛంగా, పారదర్శకంగా కనిపించినంతమాత్రాన అది మంచినీరు అవదు. అలాగే ప్రతి వెలుగు యోగ్యమైనది కాదు. వాస్తవమైనది అవదు. కాంతి స్వభావాన్ని గమనించాలి. అది నిజమైన దివ్యకాంతి అవునో కాదో తెలుసుకోవాలి. దాని స్వభావమేమిటో, అందులో ఏమున్నదో తెలుసుకోవాలి. నిన్ను దారి మళ్లించే నిగనిగ లుంటాయి. అవి భ్రాంతి కల్గించే వెలుగులు. నిమ్నస్థాయికి చెందిన వెలుగులవి. వాటి విషయంలో జాగ్రత్త వహించాలి. వ్యత్యాసం తెలుసుకోవాలి. స్వచ్ఛమైన మనసు, అనుభవం, వికసిత చైత్యపురుష చేతనావస్థ కనుక నీకు ఉంటే నిజమైన విచక్షణా జ్ఞానం కలుగుతుంది.

కాంతి అంతా ఆత్మజ్యోతి కాదు. అతిమానస కాంతి అసలే కాదు. మానసికము, ప్రాణికము, భౌతికము — వీటికి వాటి తాలూకు కాంతు లుంటాయి. ప్రేరణ కలిగించేవిగా, ఉజ్వలంగా, ఉపదేశపూర్వకంగా, శక్తివంతమైన కార్యనిర్వాహక అధికారం కలిగి ఉంటాయి. అయితే గోప్యంగా ఉంటాయి. విశ్వచేతనలోకి ప్రజ్వలిం

చినపుడు అవి అపారమైన చైతన్యవిస్తరణ, శక్తులను ప్రవేశపెట్టేవిగా కూడా ఉండగలవు. అంతర్బుద్ధి, ఆంతరిక ప్రాణికము, ఆంతరిక భౌతికము, అంతస్థలీయ సర్వ చేతనా విస్తరణ — వీటిలోకి ఉన్మీలనము చెందినపుడు అవి, అసాధారణ విజ్ఞానశక్తుల కార్యాచరణ, అనుభవాలను విడుదల చేస్తాయి. అయితే వాటిని ఆధ్యాత్మిక జ్ఞానోదయాలుగా, దివ్యావేశాలుగా, అంతఃప్రవృత్తులుగా అనుకుని సులువుగా పొరపాటు పడే అవకాశం ఉంది. ఊర్ధ్వంగా సమున్నత మానసిక సత్వంలోనికి ఉన్మీలనం మరింత తేజస్సు, ఓజస్సులను క్రిందికి తీసుకురాగల్గుతుంది. అది అంతఃకరణ ప్రవృత్తి విషయిక మానసాన్ని, జీవశక్తిని, ఉద్దీపనం చేస్తుంది. ఈ శ్రేణులలోనికి ఆరోహణ అసంపూర్ణమే అయినా, వాస్తవకాంతిని కొనివస్తుంది. దాని మూలంలో అది ఆధ్యాత్మికకాంతియే అయినా, నిమ్నప్రకృతిలోకి జారినపుడది కలుషితమై ఆధ్యాత్మిక విశిష్టతను నిలుపుకోలేకపోతుంది. అయితే ఒకటి. ఇవేవీ అతిమానస కాంతి, శక్తులు కావు.

ఒకే సర్వేశ్వరత్వానికి అవచేతన, అతిచేతన — రెండూ రెండు విధాలుగా సూత్రబద్ధం కాబడి ఉంటాయి. అవచేతనకి శ్రేష్ఠవాచకం (the master word) దివ్యజీవనం. అతిచేతనకి శ్రేష్ఠవాచకం దివ్యకాంతి. అవచేతనలో, జ్ఞానం లేక చైతన్యం, క్రియారూపంలో గోప్యంగా అజ్ఞాతమై ఉంటుంది — ఎందుకంటే దివ్యజీవనానికి సారభూతమైనది కార్యాచరణ విధానమే కాబట్టి. అతిచేతనలో కార్యాచరణ విధానం దివ్యకాంతిలో ప్రవేశించి వెలుగొందుతూంటుంది. జ్ఞానం అజ్ఞానంలో మరుగుపడి ఉండదు. సర్వోన్నత చేతనలో తొణికిసలాడుతూంటుంది. ఈ రెండింటికి అంతఃస్ఫురణ విజ్ఞానం సామాన్యవిషయమై ఉంటుంది. అంతఃస్ఫురణ విజ్ఞానానికి (intutional knowledge) పూనాది (జ్ఞాతము, జ్ఞేయము) తెలుసుకున్నది, తెలుసుకోబడినది — that which knows and that which is known — వీటి మధ్య ఉండే సార్థకతతో కూడిన, సచేతనమైన గుర్తింపు. తెలుసుకున్నవాడు, తెలుసుకోబడినది, సామాన్య స్వీయ అస్తిత్వజ్ఞానంలో రెండూ ఒకటే. అయితే అవచేతనలో అంతఃప్రవృత్తి (intution) దానంతటదే కార్యరూపంగా వ్యక్తమవుతుంది. దానియొక్క జ్ఞానం, సచేతనమైన గుర్తింపు, చేసే పనిలో అజ్ఞాతంగా మిళితమై ఉంటుంది. దీనికి భిన్నంగా అతిచేతనలో అంతఃప్రవృత్తి, దాని వాస్తవస్వభావంలో సచేతనగా గుర్తింపబడేదిగా ఆవిష్కృతమవుతుంది. ఎందుకంటే ఇక్కడ దివ్య

జ్ఞానం లేక దివ్యకాంతి అనుశాశిత నియమం, ప్రధాన సూత్రం. దీని ననుసరించే ఆవశ్యకమైన కార్యసాధకత్వముంటుంది. కార్యసాధకత్వ పరిజ్ఞానం అజ్ఞాతంగా మరుగునపడి ఉండదు.

*

స్వచ్ఛమైన భౌతికసత్యానికి, దానికి సంబంధిత నిమ్నకాంతి ఆనందాలకి ఆవల, ఒక సుదీర్ఘం, సమున్నత మూలస్థానం, దివ్యానందదీప్తి, స్వేచ్ఛాంతరంగంలో విముక్తమై ఉన్నది — ఆ శక్తి — చేసేదేమిటి? అంతర్లీనానికి, సమసంయోగ యోగ్యతకి, సక్రమ జ్ఞానానికి, న్యాయబద్ధమైన కార్యాచరణకి, సక్రమమైన అనుభవానికి కారణమవుతుంది. అది అపరిమితమైనది. పరిమితులకి, నియమాలకి, షరతులకు లోబడనిది. స్వీయ అస్తిత్వం కలది. మార్పుకు లోబడనిది మానవస్వభావ అపశ్రుతుల మధ్య, అలా ఇలా వచ్చే సామరస్యం కాదది. అసలైన మౌలికమైన సామరస్యమది. సర్వ సమరసభావనలకు మూలం అదే. అదే దేదీప్యమానమైన ఆధ్యాత్మిక దీప్తి. దాని అంతర చలితచాలనంలో, అది అతిమానస విజ్ఞానశక్తి. జ్యోతిః. అంతే తప్ప అది మన సాధారణంగా, మార్పుచెందే, మౌలికం కాని, భౌతిక బుద్ధి ప్రకాశనం కాదు. అది విశ్వవిశాల, స్వతస్సిద్ధ, ఆత్మజ్ఞానజ్యోతి. స్వాభావికమైనది, సన్నిహితమైనది. లోతైన ఆత్మపరివర్తనవల్ల సఫలమయేది. ఏదో బయటనుంచి సంపాదించుకుని, తనలో జీర్ణించుకుని, కష్టపడి సాధించుకొన్న సంయోగం, సర్దుబాటు చేసుకోవటం లాంటిది కాదు అది. అది పూర్తిగా ఆధ్యాత్మిక ఇచ్ఛాశక్తి సమన్వితమైనది. దానియొక్క విజ్ఞానానికి, క్రియాకలాపానికి మధ్య అగాధమనేది లేదు. వెలవెలపోయే మానసిక ఆనందం, సుఖం కాదది. కాగా, అదొక లోతైన, ప్రగాఢ, తీవ్ర, ఆత్మజీవనంతో కూడిన దివ్యానందం. స్థిరమైన దివ్యానందపారవశ్యం. విముక్తమైన అంతరాత్మ ఈ దివ్యానంద దీప్తిలో మరింత ప్రగాఢంగా పాల్గొంటుంది. మరింత ఇతోధికంగా వికాసం పొందుతుంది. మరింత పరిపూర్ణతను సంతరించుకుంటుంది. మరింత సమగ్రంగా దైవంతో సమైక్యమవుతుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

కాంతి వర్ణాలు

రంగు, కాంతి (ప్రకాశం) — పరస్పరమూ చాలా సన్నిహితమైనవి. రంగు ఎక్కువగా, సూచ్యార్థకమైనది. కాంతి చాలా మటుకు గతిశీలమై ఉంటుంది. రంగు జ్వలించినపుడు, అది కాంతివంతమవుతుంది.

*

పైనుంచి వచ్చే దివ్యకాంతి వివిధ రంగులతో ఉంటుంది. తెలుపు దివ్యశక్తి పవిత్రత. నీలం ఆధ్యాత్మిక చైతన్య వెలుగు, బంగారం వన్నె అతిమానసజ్ఞానకాంతి లేదా మధ్యస్థ లోకాల నుంచి వచ్చే జ్ఞానకాంతి.

*

రంగులు దేనికి కచ్చితమైన ప్రతీకలనే విషయం గురించి చెప్పవలసివస్తే, సరిగా నిర్ధారించి చెప్పడం ఎప్పుడూ అంత తేలిక కాదు. ఎందువల్లనంటే అవి కొన్ని నియమాలకు ఖచ్చితంగా లోబడి, నిక్కచ్చిగా ఉండవు. సంకీర్ణమైనవిగా ఉంటాయి. వాటి అర్థం క్షేత్రాన్ని బట్టి రంగుల కలయికలని బట్టి, లక్షణాలను బట్టి, గాఢతను బట్టి, శక్తుల ఖేలనాన్ని బట్టి మారుతూ ఉంటాయి. ఉదాహరణకు, ఒక రకమైన పసుపురంగు, చాలామంది తాంత్రికులు అనుకునేదానిని బట్టి బుద్ధిని (intellect) సూచిస్తుంది. తరచూ ఆ అర్థమే సరిపోతుంది. కాని అది కనుక ప్రాణికశక్తుల మధ్య ఖేలనంలో ఉద్భవించినపుడు దానికి ఎప్పుడూ అదే విధమైన వివరణ నివ్వలేము. అలా చేస్తే దానికి గిరి గీసి పరిమితం చేసినట్లవుతుంది.

*

లోకాల అనుభవాలను స్పష్టంగాను, కచ్చితంగాను వర్ణించితే ఆ పద్యం (Poem --- Thought the Paraclete) చాలా పెద్దదయిపోయేది. కనుకనే కొన్ని పెద్ద పంక్తులను మాత్రం ఇవ్వడం జరిగింది. కాని వర్ణన సరి అయినదే. విశేషణాలు వాస్తవికతకు అద్దం పట్టేవే. పద్యంలో పేర్కొన్న రంగులు 'బంగారు — ఎరుపు పాదాలు', 'ముదురు ఎరుపు — తెలుపును ప్రతిఫలించే సముద్రాలు' ('crimson white mooned oceans') సైతం అనుభవాలను సంపూర్తిగా బలపరచేవే. ఏదయినా ప్రాధాన్యతాపరమైన ఒక రంగు, ప్రతీకగా ఊహించబడుతూ మేధోపరంగా విమర్శనాత్మకమైనదైనా, దానిని మించినదేదో మార్మికులకు తరుచు దృశ్య

మానమయే విషయం ఒకటి ఉంటుంది.

*

వాస్తవానికి, రూపం అంతా ఏదైనప్పటికీ చైతన్యం తనను తాను పరిపుష్టం చేసుకుంటూ, చేసే స్వీయక్రియాకలాపాల ఖేలన మాత్రమే. మనం రంగును దర్శిస్తాం. మనకది అలా ఎందుకు కనిపిస్తుంది? అంటే, అది చైతన్య స్వీయక్రియాకలాపాలలో తనకు తానుగా ప్రదర్శించుకునే ప్రదర్శనయే. పోతే, రంగు కాంతిరూపంలో పనిచేసే దివ్యశక్తి ప్రక్రియ మాత్రమే. అలాగే కాంతి ఒక గమనం అనగా ఒక దివ్య శక్తి యొక్క ఆచరణ విధానం.

*

ఏకాగ్రతలో దర్శించే కాంతులు, రకరకాల భౌతికశక్తుల లేదా దైవీశక్తులకు సంబంధించినవి. తరచుగా ఆ కాంతులు ఊర్ధ్వచైతన్య భూమికల నుంచి దిగివచ్చేవి.

*

ఊదా (violet) కాంతి దివ్యకారుణ్యానిది (దివ్య అనుగ్రహం), ధవళకాంతి శ్రీమాత ప్రకాశం (దివ్య చైతన్యం). దానిలో ఇతర వర్ణాలు కూడా ఉంటాయి. అవి అక్కడ నుంచే సృష్టిలో అభివ్యక్తం కాబడతాయి.

*

నీలారుణ (purple) కాంతి ప్రాణికశక్తిది. ఎరుపురంగు అది ఎటువంటి ఎరుపు అనే దానిని బట్టి ఉంటుంది. ఎందువల్లనంటే ఎరుపురంగులు చాలానే ఉన్నాయి. అవి భౌతికచైతన్యానికి సంబంధించినవి కావచ్చు.

*

మనస్సుకు సంబంధించి, ఒక విలక్షణమైన రంగు ఉంది. అది పసుపు; చైత్యపురుషకి సంబంధించినది లేత ఎరుపు లేదా లేత గులాబి; నీలారుణం (purple) ప్రాణికానికి చెందినది. రంగులన్నీ ప్రముఖంగా మానసిక, చైత్యపురుష, ప్రాణికాలకి చెందినవేకాని, జీవులకు (beings) చెందినవి కావు.

*

కాంతి, వర్ణాలు, పూలు అనేవెప్పుడూ సాధనలో ఒకానొక దశలో కార్యోన్ముఖశక్తుల చలితచాలనాలలో దర్శనీయమవుతవి. సహజంగానే, కాంతి చైత్యన్య ప్రకాశాన్ని సూచిస్తే, వర్ణము మనస్సు (పసుపు), భౌతికం, ప్రాణికశక్తుల క్రీడాకలాపాలను

సూచిస్తుంది. అంటే అస్తిత్వంలోని ఈ భాగాల విముక్తికై జ్ఞానప్రకాశంతో శక్తులు చేసే పని. పూలు చాలామటుకు చైత్యపురుష సంబంధిత కదలికల సంకేతం.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: డా. టి. ప్రసన్నకృష్ణ

శ్రీమాత కాంతి

కాంతులన్నీ శ్రీమాత శక్తులే; అవి అనేకం –
ధవళకాంతి — ఆమెకే సొంతమైన ప్రత్యేక శక్తి. దాని సారాంశం — దివ్యచైతన్యమే.

*

శ్రీమాతకు చెందినదే ధవళకాంతి; ఉన్నతస్థాయిల నుండి కింద్కి అవతరించే దివ్యచైతన్యపు వెలుగే అది.

*

తెలుపు కాంతి శ్రీమాతదే; ఎక్కడ అవతరించినా లేదా ప్రవేశించినా, అది తెస్తుంది — శాంతి, స్వచ్ఛత, నిశ్శబ్దము, మరియు (సత్తా) ఊర్ధ్వశక్తులకు ఉన్మీలనం. బొడ్డు దిగువకు అది వస్తే — దానర్థం — అది నిమ్నప్రాణికంలో పనిచేస్తోందని.

*

వజ్రం — శ్రీమాత కాంతికి, శక్తికి సంకేతం.
వజ్రకాంతి — తీవ్రంగా ఉన్న శ్రీమాత చైతన్యానికి సంకేంతం.

*

1) వజ్రకాంతి అంటే — శ్రీమాతయొక్క ప్రముఖ శక్తే.
2) వజ్రకాంతి — దివ్యచైతన్యపు హృదయం నుండి వెలువడ్తుంది; ఎక్కడికి వెళ్లినా అక్కడ దివ్యచైతన్యపు వికాసానికి అది తెరుచుకుంటుంది.
3) శ్రీమాత వజ్రకాంతి పరిపూర్ణ స్వచ్ఛత, శక్తి గలది.
4) దైవం యొక్క మూలచైతన్యము, మూలశక్తే వజ్రకాంతి.

*

శ్రీమాత కాంతి తెలుపు — ముఖ్యంగా వజ్రపు తెలుపు. మహాకాళీ రూపం, సాధారణంగా బంగారువన్నె గలది — కాంతివంతమైన, గాఢమైన బంగారువన్నె.

*

సాధారణ బుద్ధికి ఊర్ధ్వంగా ఉండే స్థరములకు చెందిన దివ్యసత్యం యొక్క వెలుగే బంగారుకాంతి. మౌలికంగా అతిమానస కాంతి అది; బుద్ధికి ఊర్ధ్వంగాగల మహాకాళి కాంతి కూడ అదే. ఈ బంగారుకాంతి — తెల్లనికాంతి వలె — శ్రీమాత నుండి వెలువడడం — తరచుగా కనిపిస్తుంది.

*

మనం శ్రీమాత కాంతి అని చెప్పినపుడు — లేదా, ఒక ప్రత్యేక భావంతో 'నా కాంతి' అని చెప్పినపుడు — ఒక ప్రత్యేక నిగూఢ చర్యమానసం గురించి మనం చెబుతూ ఉంటాం. ఇంకా చెప్పాలంటే — 'అతిమానసం' నుండి వెలువడే కొన్ని ప్రత్యేక వెలుగులు గురించి మనం చెబుతూ ఉంటాం. ఈ చర్యలో శ్రీమాతది 'ధవళకాంతి'. అది పరిశుద్ధ పరుస్తుంది, ప్రకాశింపజేస్తుంది. మొత్తం సత్యసారాన్ని, శక్తిని, దిగువకు తెస్తుంది. పరివర్తనను సాధ్యం చేస్తుందది. కాని నిజం చెప్పాలంటే — ఎగువ నుండి వచ్చే కాంతి అంతా — అత్యున్నత దివ్యసత్యం నుండి వెలువడే కాంతి అంతా — శ్రీమాతదే.

శ్రీమాత వెలుగు, శ్రీమాత శక్తే, — అదే సత్యంయొక్క వెలుగు, శక్తి అని తెలుసుకో. శ్రీమాత కాంతితో, శక్తితో, ఎల్లపుడు అంటిపెట్టుకుని ఉండు. అప్పుడు మాత్రమే దివ్యసత్యంలోకి నీ యెదుగుదల.

*

ప్రశ్న: శ్రీమాత చుట్టూ కాంతివలయం మొదలైనవాటిని కొందరు దర్శిస్తారు. మరి నాకైతే కనపడదు. నాలోని ఆటంకం ఏమిటి?

అది ఆటంకం కాదు. అది కేవలం — అంతరింద్రియ ఎదుగుదలకు సంబంధించిన ప్రశ్న. ఆధ్యాత్మిక ప్రగతికి తప్పనిసరిగా ముడిపడి ఉండే సంబంధమే దానికి లేదు. కొందరీ మార్గంలో, ఎంతో ప్రగతి సాధించి, చాల దూరం పోతారు. కాని, ఈ తరహా దర్శనం, వారికేమీ లేదు; ఒకవేళ ఉన్నా, అది అతి స్వల్పం. అలా కాకుండా, ఒక్కొక్కప్పుడు ఆధ్యాత్మికంగా ఇంకా చాల ప్రాథమికస్థాయిలో

ఉన్నవారిలో — ఈ ఎదుగుదల (ఆంతరింద్రియ ఎదుగుదల) — విపరీతంగా ఉంటుంది.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: యస్. వై. సోమయాజులు

శ్రీఅరవిందుల వెలుగు — శ్రీకృష్ణుని వెలుగు

వెలుగుల నుండి వెలువడే కాంతి కొన్ని నిర్దుష్టశక్తుల ఆచరణను సూచిస్తుంది. సాధారణంగా వెలుగుయొక్క రంగు ఇందుకు సంకేతం. తెలుపుతో మిళితమైన నీలము శ్రీఅరవిందుల వెలుగుగానో లేక కొండొకచో శ్రీకృష్ణుల వెలుగుగానో విదితమౌతుంది.

*

నీలకాంతి స్ఫురింపజేసే భావము దాని రంగు, ఛాయ మరియు స్వభావములపై ఆధారపడి ఉంటుంది. వెన్నెల వెలుగుల విరజిమ్మే తెలుపుతో మిళితమైన నీలము శ్రీకృష్ణుని వెలుగుగానో లేక శ్రీఅరవిందుల వెలుగుగానో తెలియబడుతుంది. లేతనీలము తరచుగ ప్రదీప్తమానసానికి చెందినదై ఉంటుంది — ఇంకొక ముదురు నీలము ఊర్ధ్వమానసానికి చెందినది; వేరొక ఎరుపు నీలముల మిశ్రమానికి దగ్గరైన రంగు ప్రాణికశక్తియొక్క వెలుగు.

*

లేత నీలవర్ణపు కాంతి "శ్రీఅరవిందుల వెలుగు" — అది శ్రీమాతకు చెందిన శ్వేతకాంతితో కొంతవరకు పరిణామము పొందిన కాంతి.

*

లేత నీలకాంతి నాది. శ్వేతకాంతి శ్రీమాతకి. శిరస్సునకు ఊర్ధ్వముగ నీవు చూచిన స్థానము మానవమేధ కన్నా అత్యున్నతతర చేతనకు సమానమైన ప్రదీప్తమానస స్థరము. అదే దివ్యతేజము మరియు దివ్యశక్తి మానవచేతనతో కూడుటకుగాను అవరోహించేది. అక్కడి నుండి అవి మానవచేతనను మరియు భౌతిక ప్రవృత్తిని పరివర్తన గావించే ప్రక్రియకు సంసిద్ధంచేస్తాయి.

నీలవర్ణకాంతులు వేర్వేరు ఛాయలు కలిగినవైతే, అవి ఊర్ధ్వమానసిక భూమికల కు, అధిమానసానికి, అంతర్బుద్ధికి, ప్రదీప్తమానసానికి, ఊర్ధ్వమానసానికి చెందిన విగ భావించవచ్చు.

*

శ్రీకృష్ణుని వెలుగులు వివిధ రకములు — లేత వజ్రనీలము లావెండర్ నీలము, ముదురు నీలము వగైరా. అది ఏ స్థరములో అభివ్యక్తమౌతుందో దానిపై ఆధార పడి ఉంటుంది.

నీలవర్ణాలు అనేకములు. ఇవి ఏమేమిటో చెప్పుట చాల కష్టము. సాధార ణంగా ముదురు నీలము ఊర్ధ్వమానసము, లేతనీలము ప్రదీప్తమానసము — తెలుపుతో మిళితమైన నీలము శ్రీకృష్ణుల వెలుగు (శ్రీఅరవిందుల వెలుగుగా కూడ తెలియబడుతుంది.).

*

ఊదారంగు దైవానుకంపకాంతి యొక్క వర్ణము. అదే శ్రీకృష్ణుల కృపయొక్క వర్ణము కూడ. శ్రీకృష్ణ రక్షణ ప్రసరించే కాంతి కూడ అదే. నీలము అతనికి ప్రత్యేకము మరియు ఆతని తత్వానికి సూచిక కూడ. అతను సాకారంగా ప్రకటిత మైనప్పుడు ఆతని కాంతి వలయపు రంగు కూడ అదే – అందుకే అతడు నీలాకృ ష్ణుడుగా పిలువబడినాడు. ఈ విశేషణము యొక్క భావము అతని భౌతిక శరీరపు ఛాయ నీలమో లేక నలుపో అని కాదు.

*

ఇక్కడ మనము శ్రీకృష్ణుని వెలుగుని గూర్చి కూడ ప్రస్తావించాలి — మానసము లోని శ్రీకృష్ణుని వెలుగు, ప్రాణికంలోని శ్రీకృష్ణుని వెలుగు వగైరా. కాని ఇదొక ప్రత్యేకమైన వెలుగు — మనసులో ఇది స్పష్టతను చేకూరుస్తుంది. అస్పష్టతనుండి మానసికభ్రమనుండి, వక్రబుద్ధినుండి విముక్తిని కలిగిస్తుంది; ప్రాణికంలోని హానికర మైన వాటినన్నింటిని తుడిచివేస్తుంది. అది ఎక్కడ ఉంటే అక్కడ ఒక స్వచ్ఛమైన, దివ్యమైన ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తాయి.

*

ప్రశ్న: ఏ విధంగా నా మానసంలో శ్రీఅరవిందుల వెలుగును పొందగలను?

నీవు ఓర్పుతో ఆకాంక్షిస్తే అది సర్వదా సంభవమే. కాని ఒక ముఖ్య షరతు.

ఆ వెలుగు కావాలని నీవు కోరితే ఇతరమైన మానసిక ప్రేరణల నన్నింటిని వర్జిం చాలి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి

కాంతి కలయికల అంతర్దృష్టి

మీరు కాంతిని వీక్షించినప్పుడు అది దృష్టి. కాంతి మీలో ప్రవేశిస్తున్నదని మీరు భావించినప్పుడు అది అనుభవం. కాంతి మీలో స్థిరముగ కుదురుకొని, కాంతిని విరాజిల్లజేసి ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించినట్లైతే, అది సాక్షాత్కారం. సామాన్య వ్యవహారంలో చూపులను, అనుభవాలని కూడ వ్యవహరిస్తారు.

*

ఒకని కాంతిపైని చూపూ, మరియూ జగన్నాథస్వరూప పరమాత్మ పైని చూపూ — రెండున్నూ అతడు యోగగ్రహణశక్తియుతుడై ఆచరించగల సామర్థ్యము కలిగియున్నాడనటానికీ మరియు అతని అంతరంగంలో ఓ దైవికప్రేరణ కదలి, కదిలించి పెనునిద్దర వదిలించటానికి సమాయత్తమై ఉన్నదని భావించటానికీ, విశ్వసనీయమైన సూచికలు. అయితే సామర్థ్య మొక్కటే చాలదు. దైవసాక్షాత్కారాన్ని నిశ్చయంగా సాధించాలన్న దృఢసంకల్పం మరియు ఆ మార్గంలో నిరంతరంగా, వెనుకంజ వేయకుండా పురోగమించగల ధైర్యసాహసాలు, మరియు విడుపులేని పట్టుదల పుష్కలంగా ఉండాలి. ప్రప్రథమంగా భయాన్ని పరిపూర్ణంగా నీ నుండి దూరం చెయ్యాలి. రెండవది నీ అంతరాత్మలో కదలాడిన దైవప్రేరణకు వెంటనే సమాధాన మివ్వకుండా అడ్డుదగిలే నీ బాహ్యప్రకృతియొక్క జడత్వం.

*

కాంతి దివ్యచైతన్యపు తేజస్సు. ఈ యోగంయొక్క లక్ష్యం తొలుతగ ఈ చైతన్యపు వెలుగులో జీవిక సాగిస్తూ, వెలుగును నీ సర్వ స్వభావాన్నీ రూపాంతరీకరణ చెందటానికి అంగీకరించి అనుమతి తెలియచెయ్యటం. తద్వారా ప్రాణులు దైవంతో కలిసి జీవించటానికి అనుకూలత సిద్ధిస్తుంది. స్వభావం దివ్యజ్ఞానానికి దివ్యశక్తికి,

దివ్యానందానికీ కార్యక్షేత్రం అవుతుంది.

*

అతడు దానిని తన జీవితపరమార్థంగా స్వీకరించి తదితరముల నన్నింటినీ, ఆ ఒక్క పరమ లక్ష్యానికీ ఒదిగి ఉండటానికి సన్నద్ధమైనప్పుడు మాత్రమే ఆ సఫలత సాధించగలడు. ఈ విషయంలో సఫలీకృత మనోరథుడు కాగలడు. అలా కాకపోతే ఆధ్యాత్మిక పరిణామానికి కొంతమేరైనా తొలి సంసర్గం, ఈ జీవితంలో పొందగ ల్గేలా సన్నద్ధం కావటమే చేయగలిగేది.

*

వెలుగులు, దర్శనాలు భ్రమలు కావు. నుదుటి భృకుటి ప్రదేశాన్ని కేంద్రంగా చేసుకొన్న అంతర్దృష్టి ఉన్మీలనానికి అవి సంకేతాలు. తరచుగా వెలుగులు ప్రప్ర థమంగా దర్శనీయాలు అవుతాయి. సత్వముయొక్క వివిధ భూమికలకు చెందిన సూక్ష్మశక్తుల చలితచాలనాలను సూచించేవి కాంతులు. కాంతి రంగు దాని సూక్ష్మ భేదాన్ని బట్టి శక్తిస్వభావము ఉంటుంది.

*

బాహ్యకాంతి అంటే కాంతి సూచించే శక్తియొక్క స్పర్థ లేదా ప్రభావం అని అర్థం. (బంగారు రంగు దివ్యసత్వకాంతి, నీలిరంగు ఏదో ఒక ఉన్నతభూమికలోని ఆధ్యా త్మిక శక్తి.) అలాగే అంతరంగంలోని కాంతి అంటే అది ప్రకృతిలోనికి చొచ్చుకుపో యిందనో, స్థిరపడిందనో లేదా తరచుగా కార్యకారిగ ఉంటున్నదనో అర్థం. ఊర్ధ్వభాగంలో కాంతి అంటే, మనసు పైకి అవరోహితమవుతున్నదని అర్థం. చుట్టూరా కాంతి క్రమ్ముకొన్నదంటే సామాన్యంగా పూర్తిగా అది ఆవహించే ప్రభావం కలదని అర్థం.

*

యోగంలో దివ్యకాంతి దేనిపైన పడితే, దానిని ప్రకాశింపజేసే శక్తి. పర్యవసానంగా అంతరదృష్టి, జ్ఞాపకం, జ్ఞానం, సజావైన సంకల్పం, మానసిక ప్రేరణ వగైరా ఏద యినా కావచ్చు.

*

దివ్యకాంతియొక్క ప్రత్యేక శక్తులున్నాయి. మరియు అవసరాల ననుసరించి వాటి క్రీడాకలాపమూ ఉంది. అయితే దివ్యకాంతిలో మనుగడ సాగించవచ్చు, దివ్యా

నంద ప్రశాంతతలో జీవించినట్లుగా.

*

దివ్యశాంతి, ఆనందాలు మొత్తం (శారీరక) వ్యవస్థపై జాలువారినట్లు, శరీరము, మొత్తం సత్వమంతా అందులోనే ఉన్నట్లు, తుదిగా అవి స్థిరపడగలవు. అదే దివ్య కాంతి వల్ల కాగలిగేది. అది శరీరమంతా అణువణువులో చొచ్చుకొనిపోయి కాంతి మయం చేసి, స్థిరపడి, నలుదిశలా జాజ్వల్యమానంగా ప్రకాశించవచ్చు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అన్నవరం ఆదిశేషయ్య

వెలుగు

కాంతి, నిరవధిక కాంతి! చీకటికిక్కడ ఇక చోటేది!
జీవిత అజ్ఞానపు టగాధాలు వాటి మార్మికతను వదిలేస్తాయి;
అంతుపట్టని బ్రహ్మాండమైన వాటి అవచేతనపు టగాధాలు
ఉంటాయి మినుకుమినుకుమంటూ అస్పష్టంగా ఎంతో నిరీక్షణతో.

మారని మాయని విశిష్ట నిరంతర కాంతీ!
తెరు, బిగిసిన రహస్య ద్వారాలను.
అనంతుని దృఢసంకల్పచిత్తంలో వెలుగొందుతున్న దివ్యకాంతి
వాడని రోజాపుష్పం పుష్పించిన నా యెదలో కదలాడుతోంది.

నరనరాల హర్షాతిరేకంతో పొంగులెత్తుతున్న కాంతి!
దట్టమైన దివ్యకాంతి! ప్రతి పరితప్త జీవకణం భావావేశంలో
పెల్లుబికి నిశ్శబ్ద పారవశ్యంలో, భద్రంగా
పదిలపర్చింది, ఒక సజీవ అమృతత్వ భావనని.

అత్యద్భుత దివ్యకాంతిమహోదధిలో నా అగాధాలను సంగమింపజేసి
ఆయనయొక్క నిత్యానంత సమున్నత ఔన్నత్యానికి కదిలిపోతాను.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

అంతర్జ్యోతి

ప్రశ్న: మధుమయి మాతా! నైతిక ప్రవర్తన మన చేతన అభివృద్ధికి తోడ్పడుతుంది కదా?

అది ఆయా శక్తులను బట్టి ఉంటుంది. దానివల్ల సాయం పొందినవారున్నారు. ఏమాత్రం సాయం పొందనివారూ వున్నారు.

నైతిక ప్రవర్తన పూర్తిగా కృత్రిమమైనది. నిరంకుశమైనది. నైతిక ప్రవర్తనగల చాలమంది ఉత్తములు కూడ తాము సరైన బాటలో నడుస్తున్నామని, తాము సంస్కారవంతులమని, తమ కర్తవ్యాన్ని చక్కగా నిర్వర్తిస్తున్నామని, జీవిత నైతిక అవసరా లన్నింటిని నెరవేరుస్తున్నామని భావిస్తుంటారు. అందువల్ల ఆ భావన వారి ఆధ్యాత్మిక ప్రయత్నానికి ఆటంకంగా పరిణమిస్తుంది. అపుడు వారు ఆత్మసంతృప్తులై ఆధ్యాత్మికంగా ముందుకు సాగిపోరు.

"నీతిమంతుడు దివ్యపథంలో ప్రవేశించడం సుదుర్లభం" అని తరచు చెప్పబడుతూ వుంటుంది. ఇది సమగ్ర సత్యం. ఎందుకంటే అతడు అత్యంత ఆత్మసంతృప్తిచెందిన వాడుగా వుంటాడు. తాను తెలిసికొనవలసినదంతా తెలిసికొన్నానని అతడు భావిస్తాడు. అభివృద్ధికి అవసరమైన ఆకాంక్ష కాని, లేదా ప్రాథమిక వినయం కాని అతడు కలిగి వుండడు. సాత్వికుడు అనబడే వ్యక్తి తన నైతిక ప్రవర్తనాచట్రంలో సుఖంగా స్థిరపడి వుంటాడు. దాని నుండి బైటపడాలని యోచించడు. కనుక ఆ స్థితి మిమ్మల్ని దైవసాక్షాత్కారానికి లక్షల క్రోసుల దూరంలో వుంచుతుంది.

వ్యక్తి తన అంతర్జ్యోతిని కనుగొనే వరకు, ఒక విధమైన నియమనిబంధనలను తయారు చేసుకోవాలి. నిజమే. కాని అవి మూర్ఖమైన, కఠినమైన, స్థిరమైనవిగా వుండరాదు. అయినా అవి అతడు సత్పథం నుండి తప్పిపోకుండాను, నివారింప



వీలుగాని దోషాలనుండి, మరియు జీవితాంతం దుష్ఫలితాలకు లోనుచేసే దోషాలనుండి అతన్ని ఆపగలిగేవిగాను వుండాలి.

అలా చేయడానికి నియమబద్ధమైన నిబంధనలను ప్రతి ఒక్కరు తమ తమ స్వభావానుగుణంగా తామే స్వయంగా తయారు చేసుకోవాలి. నీవు సాంఘిక, సామూహిక శాసనాన్ని అనుసరిస్తే నిన్ను నీవు ఆ సాంఘిక కట్టుబాట్లకు బానిసగా తయారుచేసికొన్న వాడవవుతావు. అదీ నీ పరివర్తన కవసరమైన నీ ప్రయత్నాన్ని తీవ్రంగా ఆటంకపరుస్తుంది.

ప్రశ్న: మధుమయి మాతా! "వ్యక్తి తన అంతర్జ్యోతిని కనుగొని, ఆ పిమ్మట దివ్య శక్తికి ఆత్మసమర్పణం కావించుకోవాలి" అని శ్రీఅరవిందు లన్నారు. ఇపుడు అతి మానసం అవతరించింది కనుక ఈ పని సులభసాధ్యమవుతుందా?

ఇపుడదే నీ అంతర్జ్యోతి. ఏమి కష్టము? అందుకు ఆక్షేపణ లేదా, వైరుధ్యమే ముంది?

ప్రశ్న: అది సులభసాధ్యమైందని మేమెలా గ్రహించగలగాలి? ఈ అవతరణ ఫలిత మేది?

అది నీలో సంభవించేవరకు వేచి వుండు. ఆ తర్వాత నీకే తెలుస్తుంది. సరే. ఒక చీకటి గదిలో నీవొక ఆముద దీపం వెలిగించావనుకో? యాభై సంవత్సరాలకు పూర్వం మనం అలా చేస్తుండేవాళ్ళం. ఇపుడు లాంతర్లున్నాయి. ఇవి కొంచెం వెలుగు నిస్తాయి. హఠాత్తుగా యెవరైనా విద్యుద్దీపాన్ని వెలిగించారనుకోండి. ఇది పదింతలెక్కువ వెలుగు ప్రసాదిస్తుంది.

నీ కష్టమేమి? నీ సమస్య ఏమిటి?

నీ లోపలి గదిని వెలిగించడానికి నీలో నిరంతరం వెలుగుంది. కాని అది నీ నూనె దీపం బదులు విద్యుద్దీపంగా తయారైంది. అంతే. అర్థం కాలేదా? దీన్ని అర్థం చేసుకోవడం చాల కష్టమే. నీ ఆంతర్యంలోని గదిని వెలుగుతో నింపటానికి, నీ కెప్పుడూ ఉంది దీపం. నూనె దీపం బదులుగా అది విద్యుద్దీపం అయింది. అంతే.

నీవు ఆ వెలుగును చూడాలనుకొన్నావా? ఆ గదిలో ప్రవేశించు. చూస్తావు.

(నిశ్శబ్దం)

అంతేనా?

(వెలుగు చూడాలనుకొన్న బాలుని చూచి) మరో ప్రశ్న వుందా?

ప్రశ్న: గదిలో ప్రవేశించడం ఎలా?

ఒక తాళంచెవి తీసుకో. ద్వారం తెరు. నీవు ఆ తాళంచెవిని కనుగొనాలి. లేదా అదే అరేబియన్ నైట్స్ కథలో లాగ ద్వారం తెరిచేందుకు మంత్రాన్నో, భావనన్నో, లేదా శక్తినో కనుగొనే వరకు ఆ గది ముందే కూర్చో.

ఈ మాట పరిహాసాస్పదమైంది కాదు. తీవ్రంగా పరిగణించదగిందే. నీవు తాళంచెవినో, మంత్రాన్నో, లేదా ద్వారాన్ని తెరిచే శక్తినో కనుగొనేదాక గది యెదురుగా కూర్చునే వుండాలి.

నీ వలా ప్రయత్నించకుంటే ఆ ద్వారం వేల సంవత్సరాలైనా తెరువబడదు. కాని నీకది వెంటనే తెరువబడాలి కదా! కనుక, నీవు ఆ పద్ధతిని కనుగొనేంత వరకు మొండిపట్టుదలతో ద్వారం వద్దనే కూర్చోవాలి. అది తాళంచెవి కావచ్చు. మంత్రం కావచ్చు. ఒక శక్తి కావచ్చు. మరేదైనా కావచ్చు. ఆ ద్వారం తెరవబడేంతవరకు అలానే వుండిపోవాలి. ద్వారం ఒక్క దాన్ని గురించే చింతించాలి.

ప్రశ్న: వెలుగు తప్పించుకొని బైటపడడానికి ఆ తాళంచెవి పెట్టే రంధ్రం లేదా?

తాళానికి రంధ్రమా? బహుశా వెలుగు తప్పించుకొని బైటపడుతూనే వుండొచ్చు. కాని దాన్నెవరూ చూడరు. అది మరో సమస్య. నీవు దీన్ని చూడడానికి నీవు నీ కళ్ళు తెరుచుకొని ఉంచటం నేర్చుకోవాలి.

చిన్న శిశువులు చూళ్ళేరు. చిన్న జంతువులు చూళ్ళేవు. పిల్లికూనలు చూళ్ళేవు. చూడ్డానికి వాటికి చాల గంటలు, చాల దినాలు పడుతుంది.

అలా చూడ్డాన్ని నీవు నేర్చుకోవాలి.

*

ఇదంతా మీకెందుకు చెబుతున్నానంటే, మీ లోపలి ద్వారం తెరచి చూడడానికి నేను మీ లోపల, చాల జాగ్రత్త తీసికుంటాను. మీరు కొద్దిపాటి ఏకాగ్రత వహిస్తే చాలు, ఆ తెరువబడని ద్వారం వద్ద, తాళంచెవి లేని ఆ ద్వారం వద్ద, తెరిచే ఉపాయం తెలియని ఆ ద్వారం వద్ద మీరు యెక్కువ కాలం గడుపనవసర ముండదు. ఒక్కొక్కప్పుడు,, ఒక్కొక్కరు గంటల తరబడి, దినాల తరబడి, నెలల తరబడి, సంవత్సరాల తరబడి ఆ ద్వారానికి అతుక్కొనే వుండాల్సి వస్తుంది.

కాని నా బిడ్డలైన మీకా అవసరం వుండదు. ఆ అంతర్ ద్వారం తెరువబడే

వుంది. మీరూరక దానివైపు చూడాలి. దాన్నుండి వెనుతిరిగి పోరాదు.

*

జీవనం, చీకటి రేయిలలో పయనం. అంతరంగ వెలుగుకు జాగృతమవు.

మూలం: శ్రీమాత

అనువాదం: బి. నరసింహయ్య

కొన్ని శ్రీమాత సమాధానాలు

ప్రశ్న: నిన్న అత్యంత ప్రశాంతంగా వున్నట్టు వ్రాసుకున్నాను. కాని యీ రోజు విపరీతమైన ఆందోళన! ఏమిటిది?

ప్రాణిలో ఒక భాగమంతా కాంతివంతంగా, అత్యంతానందంగా ఉంటుంది. అదే సమయంలో మరొక భాగం అవ్యక్తము, అర్థరహితము అయిన అశాంతితో అలమటిస్తుంది. నువ్వు అశాంతి వైపు ధ్యాసపెడితే అదే అనుభవిస్తావు. కాంతి వైపు ధ్యాస మళ్ళిస్తే ఆ వెలుగులో ఆనందంగా జీవిస్తావు.

*

నా ప్రియమైన బిడ్డా!

నీకు ఊర్ధ్వంగా శాంతి నెలకొని ఉన్నది. దానిని నీ లోనికి రానివ్వు. ఆ ప్రశాంతిలో కాంతిని దర్శిస్తావు. ఆ కాంతే నీకు జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది.

అత్యంత ప్రేమతో

అమ్మ

*

బాహ్యచైతన్యంలోగల అంధకారాన్ని తొలగిస్తూ పైనున్న దివ్యకాంతిని, చైతన్యాన్ని నీలోకి ఆహ్వానిస్తూ నీ హృదయకవాటాన్ని తెరచి వుంచు. అదే అన్నిటికంటె ఉత్తమమైన సూటియైన దారి.

*

నువ్వు స్థిరంగా నిరంతరం అంతర్గత పరిణామాన్ని ఆకాంక్షించాలి. అస్పష్టంగా వున్న నీ భౌతికమనస్సులోకి ఆ కాంతిని యిచ్ఛాపూర్వకంగా ఆహ్వానించాలి. ఈ ఆకాంక్ష, సంకల్పాల ఫలితం కోసం ప్రశాంతంగా వేచి వుండాలి.

నీ మనస్సును ప్రశాంతంగా, నిశ్చలంగా వుంచుకోవాలన్నది మొదటి నిబంధన. ఆ ప్రశాంతత లోనికే దివ్యశాంతి దిగిరాగలదు.

*

నీడ నిశ్చైతన్యానికి చిహ్నం. పగలంతా తాము చేసిన కృషి ఫలితంగా, రాత్రి ఇక్కడ మనుషులు విశ్రాంతి తీసుకుంటారు చైతన్యవంతం కావటానికి. ఎప్పు డైతే చైతన్యం అన్ని విధాల శక్తిమంతమవుతుందో అప్పుడింక నీడ అవసరం కనప డకుండా పోతుంది.

*

శాశ్వతత్వ సాధ్యాసాధ్యాల గురించి ఒక చిత్రకారుడితో జరిగిన సంభాషణ నాకు గుర్తు కొస్తున్నది. అతడు నన్నడిగాడు. "కొత్త ప్రపంచం యెలా వుంటుందో కాస్త సెలవిస్తారా?" అని. నేనతనికి చెప్పాను, 'ఉదాహరణకి, వస్తువులు స్వయంప్రకా శక్తి సంతరించుకుంటాయి." అప్పుడీ వస్తువులకు యీ కాంతి పరావర్తిత ఆవశ్య కత వుండదు. ఆ కాంతి పరావర్తనం భూమి మీద సూర్యకిరణ ప్రసారం వల్ల జరుగుతుంది. దాని అవసరం వుండదు. అలా అంటున్నపు డతడి మొహం చూసే ను. అతని మొహం జేవురించి అంతకంతకు నిస్తేజమైపోయింది. చివరికి అతడ న్నాడు. "నీడ లేకుండా చిత్రలేఖనం యెలా సాధ్యమవుతుంది? అదే కదా వస్తువులో వుండే కాంతిని బహిర్గతం చేసేది" అని. "సమస్యకి సరిగ్గా సరియైన పరిష్కారం నువ్వే చెప్పావు", అన్నాను.

*

ప్రశ్న: ప్రియమాతా! క్రిష్టమస్ పండగ మనం ఎందుకు చేసుకుంటున్నాం. ఇలా చెయ్యడంలో ప్రత్యేకత యేమైన వున్నదా?

క్రీస్తు జన్మదినంగా కైస్తవమతం, డిసెంబరు 25 వ తేదీని పరిగణించడానికి చాలా కాలం ముందే, దివ్యకాంతి; సూర్యుని పునరాగమన వుత్సవంగా ఆ రోజున పండుగ జరుపుకొనే ఆచారముంది. అది దివ్యకాంతి పునరుద్భవ దినంగా మనం జరుపుకుంటాం. ఇది చాల ప్రాచీనమైన ఆచారం. డిశంబరు 25, దివ్యకాంతి ఉత్సవదివసంగా, జీసస్ క్రీస్తుకి చాలా కాలం ముందు నుంచే, వున్నది. కైస్తవ మతానికి యెంతో ముందే యీ వుత్సవం వున్నది. దీనికి మూలం ఈజిప్టు దేశం. బహుశా అదే రోజున దివ్యకాంతి పునరాగమనం రోజుననే కైస్తు జన్మదినంగా,

నిర్ణయింపబడి ఉండవచ్చు.

ప్రశ్న: ప్రియమాతా! ఈ వుదయం మీరు నాకొక పుష్పం యిచ్చారు. అది దివ్య చైతన్యాన్ని అధిమానస దివ్యకాంతి వైపు మలుపు తిప్పేది. దాని అర్థం యేమిటి? నాకు అర్థం కాలేదు.

'అధిమానసానికి' బదులు నువ్వు దానిని 'దివ్యత్వం' అని మార్చినట్టయితే యింకా బాగా అర్థం చేసుకుంటావు కదా? దానర్థం, చైతన్యం, సాధారణ జీవిత ప్రభావం చేత, నిత్య కార్యకలాపాల వల్ల భర్తీ కాబడేది కాదు. కాగా, తీవ్ర జ్ఞానానంద దివ్యకాంతుల ఏకాగ్రతలో నిండిపోవాలి.

ఇప్పుడు నీ కర్థమయిందా?

(పైన శ్రీమాత చెప్పిన పువ్వు పసుపు, నారింజ పండు రంగులో వున్న సూర్య కాంతి పువ్వు.)

*

ఎక్కడా సంపూర్ణ నిశ్చైతన్యం వుండదు. సంపూర్ణ అజ్ఞానం వుండదు. సంపూర్ణమైన చీకటి వుండదు. మొత్తం నిశ్చైతన్యం వెనుక, చీకటి వెనుక ఎల్లప్పుడూ అత్యున్నత దివ్యకాంతి ఉంటుంది. అది ప్రతి చోటా ఉంటుంది. అనుబంధం యేర్పరుచుకోవటానికి ఏ అత్యల్ప విషయమైనా సరిపోతుంది.

*

ఒక్క కాంతి బిందువు నీలో పడినా చాలు — ప్రపంచంలో కాంతి అంటే యేమిటో చెప్పే అత్యంత సుందర ప్రసంగాల కంటె కూడా, సమర్థవంతంగా ఆ కాంతిబిందువు చీకటిని కరిగించి వేస్తుంది.

మూలం: శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

కాంతి కిరణాలు

విశ్వసనీయత:
భగవంతునిచే ప్రేరేపింపబడి మార్గనిర్దేశం కావించబడే చలితచాలనాలకు — మరియే ఇతర సంచలనాలకు కాక — ప్రవేశం కల్పించి, వ్యక్తీకరించటం — ఇదే విశ్వసనీయత

*

ప్రస్తుత ప్రపంచపరిస్థితిలో తప్పనిసరిగా కావల్సినది దైవం పట్ల పరిపూర్ణ విశ్వాసం.

*

శాంతికి, రక్షణకి విశ్వసనీయత ఒక షరతు.

ఆగస్టు 5, 1955

*

భగవంతుని విశ్వసించు; నిరంతర ప్రశాంతతను అనుభవిస్తావు.

*

ఇచ్ఛ:
సార్థకత దిశగా మరలిన శక్తివంతమైన చైతన్యస్ఫూర్తి — ఇచ్ఛ.

*

తన స్వభావంలో లేనిదానిని గడించటం, ఇంతవరకు తెలియనిదానిని తెలుసుకోవటం, ఇంతవరకు చేయనిదానిని చేయగల్గటం, — ఇందుకు స్థిరమైన ఇచ్ఛాశక్తి కావాలి.

స్వార్థపరత్వం లేకపోవటం వల్ల పొందే శాంతి, క్రాంతిలలో తాను నిరంతరంగా పురోగమించాలి.

*

ఎంత రమ్యమైన ఆలోచనలనైనా కూడా సమున్నత భావజాలంగా, నిర్దుష్టమైన సంవేదనలుగా, ఉత్కృష్ట కర్మలుగా వ్యక్తీకరించాలనే నిరంతర సంకల్పం మనకు

లేకపోతే అవి మనలను పురోగమింపజేయలేవు.

నవంబరు 18, 1951

*

స్థిరసంకల్పం:
ఎంతగానో ఆశించిన ప్రణాళికలు విఫలమవటం సాధారణమైన విషయం. నెమ్మదిగా స్థిరంగా ముందుకు సాగటం మేలు.

*

స్థిరసంకల్పంతో కూడిన నిశ్చలకృషి ఉన్నప్పుడు లక్ష్యసాధన తప్పనిసరి.

అక్టోబరు 26, 1954

*

విషయం అసాధ్యంగా ఉందని విడిచిపెట్టకూడదు. అందుకు భిన్నంగా, ఎంత కష్టంగా ఉంటే విజయసాధన కోసం నీ సంకల్పశక్తి కూడా, అంత బలం పుంజుకునేట్లు చూడాలి.

జూలై 1, 1955

*

వ్యక్తిగత కృషి అత్యంత ఆవశ్యకం. ఇది లేకుండా ఏమీ జరగదు. నీ కృషి చిత్తశుద్ధితో కూడుకున్నదై ఉన్నపుడు అక్కడ (దైవ) సహకారం ఎప్పుడూ ఉంటుంది.

అక్టోబరు 15, 1972

*

పురోగతికి, చెడు అలవాట్లను వదుల్చుకోవటానికి చిత్తశుద్ధితో చేసే కృషిని బలపరుస్తూ దైవకృప సహాయంగా ఉంటుంది. అయితే మరి, స్థిరమైన కృషి, చిత్తశుద్ధితో కూడిన ఆకాంక్ష తప్పనిసరిగా ఉండాలి.

*

పట్టుదల: లక్ష్యసాధన కోసం తుదివరకు కొనసాగటం.

*

క్రియాశీలమైన ఓరిమియే పట్టుదల అంటే.

*

పట్టుదలతోనే కష్టాల నధిగమించేది. అంతేకాని వాటిని తప్పించుకుని పారిపోవటం

వలన కాదు. కార్యదీక్ష ఉంటే విజయం తప్పనిసరి. సహనం కలవారే దిగ్విజయులు. నీవు చేయవలసినదంతా శక్తివంచన లేకుండా చెయ్యి, ఫలితం భగవంతుడు చూసుకుంటాడు.

1961

*

సహనశక్తి:

కృంగిపోకుండా భరించగలిగే సామర్థ్యమే సహనశక్తి.

*

ఎలా ఉండాలో, ఎలా సహించాలో తెలిసి ఉంటే అంతా సవ్యంగానే ఉంటుంది. ఉల్లాసంగానే ఉండు.

*

ఇవాళ సాధించలేనిది రేపు సాధించగలుగుతావు. కావల్సినది సహనం.

ఆగస్టు 20, 1954

*

ఓరిమి:

దివ్యసాధన కొరకు దృఢంగా వేచి ఉండగలిగే సామర్థ్యమే, ఓరిమి.

*

చిత్తశుద్ధితో, పురోగతి కోసం కృషి చెయ్యి. ఓరిమితో ఫలితం కోసం నిరీక్షించు.

అక్టోబరు 21, 1951

*

కాలం నీకు కలిసి రావాలనుకుంటే, ఎలా వేచి ఉండాలో తెలుసుకో.

*

యోగసాధనకు సమయం పడుతుంది. తొందరగా తెమిలే వ్యవహారం కాదు. తొందరపడితే మాత్రం నీకు యోగసాధన ఉద్దేశ్యం లేనట్లవుతుంది. అంతే కదా మరి?

ఓటమి, అవమానాలు స్వాతిశయంతో కూడిన అహానికేగాని, ఆత్మకు కావు.

నవంబరు 10, 1961

*

తొందరపడకుండా ఉన్నప్పుడే మరింత వేగంగా ముందుకు సాగిపోతావు. వాస్త

వంగా ముందుకు సాగటానికి, అనంతం నీ ముందు పరుచుకుని ఉన్నదని భావించాలి.

జూలై 4, 1962

*

అన్ని సందర్భాలలోను, అన్ని పరిస్థితులలోను మనసు ప్రశాంతంగా ఉంటే ఓరిమి చాలా సులభంగా పెరుగుతుంది.

*

వీరోచిత వర్తనం:

అన్ని పరిస్థితులలోను దివ్యసత్యము కోసమే నిలిచి ఉండగల్గటం, ప్రతిఘటనల మధ్య దానిని ప్రకటించగల్గటం, అవసరమైతే దాని కోసం పోరాటగల్గటం — ఇంకా — ఎప్పుడూ అత్యున్నత చేతనాస్థాయి నుంచి ప్రవర్తించగల్గటం — (ఇదీ) వీరోచిత వర్తనం అంటే.

*

వీరోచిత వర్తనం: 1) ఎప్పుడూ అత్యంత రమణీయము, అత్యంత ఉన్నతము అయినదే చేయటం.

2) ఎప్పుడూ ఉన్నత చైతన్య శిఖరాగ్రం నుంచే ప్రవర్తించటం.

*

మేము ఆకాంక్షించి కావాలని కోరుకొనే పోరాటయోధులుగా మమ్ములను తీర్చిదిద్దు. స్థిరంగా, తలొగ్గి యుండాలనే గతానికి వ్యతిరేకంగా, నూతనాంశాలు అభివ్యక్తమవాలని, వాటిని స్వీకరించేందుకు సంసిద్ధులమై ఉండాలని, అందుకు జరిపే గొప్పదైన భవిష్యయుద్ధంలో, విజయవంతంగా పోరాడెదము గాక.

ఫిబ్రవరి 20, 1952

*

సాహసం:

ఆత్మోన్నత్యానికి చిహ్నం సాహసం.

అయితే సాహసం ప్రశాంతంగా ఉండాలి. స్వాధిపత్యంలో ఉండాలి. ఉదారంగా, దయపూరంగా ఉండాలి.

*

నిజమైన సాహసంలో అసహనం, దుడుకుతనం ఉండవు.

*

తన తప్పులు తాను తెలుసుకోవటం సర్వోదాత్తమైన సాహసం.

*

ఎల్లప్పుడూ సత్యశీలత కలిగి ఉండటంకంటె గొప్పదైన సాహసం లేదు.

జూలై 31, 1954

*

ఉదాత్తత — లాలిత్యం:

అల్పత్వంతో కూడిన భావావేశాలు, కర్మలు — ఇవి నీ వల్ల కాకపోవటం, ఉదాత్తశీలం.

*

హైన్యం, అల్పత్వం తెలియక, చేతకాక, హుందాగా, సాధికారికంగా వ్యవహరించగలగటం సర్వశ్రేష్ఠత.

*

హుందాతనం తన విలువను స్థిరంగా ప్రకటిస్తుందే కాని ప్రతిఫలమేమీ కోరదు.

*

క్రమేపీ మోటుతనాన్ని సత్వం నుంచి వైదొలగిస్తుంది సౌకుమార్యం.

*

సౌకుమార్యంవల్ల సత్వం పొందే ఫలితాలలో ఒకటి ఏమంటే అతిసున్నితమైన సంవేదన (sensitivity)

*

ఎప్పుడూ ఆనందంగా ఇతరులకు సంతోషం కలిగించే కోరికయే సభ్యత (gentleness).

*

ఆర్భాటం లేకుండా జీవితానికి ఆనందస్పర్శ కలిగించేది మాధుర్యం (sweetness).

*

సూర్యరశ్మి మేఘాలను చెదరకొడుతుంది; మందహాసం కష్టాలను చెదరకొడుతుంది.

*

ఎప్పుడూ ఎంతో చిరునవ్వు చిందిస్తూ, ఎవ్వరైనా ఉంటారని అనుకోను. ఎట్టి పరిస్థితులలోను చెదరని మందహాసంతో ఉండటం తెలిసినవాడు అంతరాత్మకి దగ్గరవాడు.

సెప్టెంబరు 22, 1934

*

సాధారణంగా చెప్పాలంటే, మనిషి తన స్వార్థాన్ని గురించి భయంకరంగా పట్టించుకునే పశువు. తనను గురించి తాను నవ్వుకోవటం, తన దుఃఖాలు, భ్రాంతులు, కోరికలు, బాధలు, నైచ్యము, తిరుగుబాటుతనమూ — వీటిని గురించి నీకు నువ్వే నవ్వుకో గలగటం నీకు తెలియటం — నిన్ను నీవు జయించగలగటానికి, నీకది, యెంతటి శక్తివంతమైన ఆయుధమో!

నవంబరు 7, 1946

*

జీవితం పట్ల నీ వెప్పుడూ హర్షాతిరేకంగా ఉన్నప్పుడు, జీవితం కూడా నీ పట్ల యెప్పుడూ హర్షాతిరేకంగానే ఉంటుంది.

అక్టోబరు 6, 1960

*

శత్రువును నిరాయుధుణ్ణి చేయటాని కాతనిపై ఓ చిరునవ్వు, రువ్వు.

*

ఆనందం:

నిశ్చలానందంలో ఉన్నప్పుడు నీవు మరెంతగానో సహాయకారివిగా ఉంటావు; అంతేకాని నటనలో కాదు అనేది ఎప్పుడూ మర్చిపోకు.

అక్టోబరు 5, 1932

*

విచారం వలెనే ఆనందం కూడా ఇతరులకు సంక్రమిస్తుంది. నిజమైన గాఢ ఆనం

దాన్ని సంక్రమింపచేయడం కంటె ఉపయోగకరమైనది మరేదీ ఉండదు.

అక్టోబరు 25, 1934

*

హర్షోల్లాసంగా ఉండేలా ప్రయత్నించు. వెంటనే నీవు దివ్యకాంతికి దగ్గరవుతావు.

జూలై 11, 1935

*

దైవాన్ని ప్రేమించేవాడు నిజంగా ఉల్లాసంగా ఉంటాడు, ఎందుచేతనంటే దైవం ఎప్పుడూ తనతోనే ఉంటుంది కాబట్టి.

మార్చి 7, 1937

*

ఎప్పుడూ మంచిగా ఉండు; ఎప్పుడూ ఆనందంగా ఉంటావు.

అక్టోబరు 13, 1951

*

నీవందించే ఆనందం పై నీవు పొందే సంతోషం ఆధారపడి ఉంటుందనే విషయం ఎప్పుడూ గుర్తుంచుకో.

జూన్ 2, 1963

*

సమతూకం:

నిగ్రహశక్తి ఎప్పుడూ ఎవ్వరికీ హానికరం కాదు.

*

డబ్బు పోతే అంత ఇబ్బంది లేదుగాని, సమచిత్తత (equipoise) పోగొట్టుకుంటే మాత్రం చాలా ఇబ్బందిదాయకమే.

ఆగస్టు 20, 1935

*

నిగ్రహశక్తి కోల్పోతే మోసపోతాం, కాబట్టి మన మెట్టి పరిస్థితులలోను నిగ్రహశక్తి కోల్పోకుండా ఉందాం.

ఆగస్టు 10, 1954

*

సామరస్యం: ఇదే మన సాధన, లక్ష్యము కాగలిగే రోజు రాగలదని, అందుకు మనం కృషి చేదాం.

*

తప్పనిసరిగా మనము కోరుకునేది శాంతి, సామరస్యాలనే. అందుకు శక్తివంచన లేకుండా పని చేయాలి. అందుకు అవసరమైన, యోగ్యమైన కర్మ క్షేత్రం ఎప్పుడూ మనలోనే ఉంది.

*

అపశృతికి (disharmony) కారణాలు బాహ్యంలో కాక అంతరంగంలోనే ఎక్కువగా వెతుకు. బాహ్యాన్ని నిర్దేశించేది అంతరంగమే.

జూలై 4, 1966

*

అందరూ ఏకాభిప్రాయానికి రావటానికి ప్రతి ఒక్కరూ చైతన్యశిఖరాన్ని అధిరోహించాలి. సామరస్యం ఉన్నత శిఖరాలపైనే సృష్టింపబడుతుంది.

ఏప్రిల్ 1970

*

పరిమితులకు (వ్యక్తిగత) అభిరుచులకు అతీతంగా పరస్పర అవగాహనకు ఒక భూమిక (a ground) ఉన్నది. అక్కడే అన్నీ సమన్వయం కాగలిగి, సామరస్యాన్ని కనుగొంటాయి. అదే దివ్యచైతన్యం కొరకు ఆకాంక్ష.

నవంబరు 24, 1972

*

పరస్పర సహకారం (collaboration): సహకరించటం అంటే ప్రతి వ్యక్తి యొక్క ఇష్టాయిష్టాలకు అనుగుణంగా ప్రవర్తించటం కాదు. దైవేచ్ఛని అందరి వ్యక్తిగత కృషితో సమైక్యపర్చి వ్యక్తీకరించి సిద్ధింప చేసుకోవటమే నిజమైన పరస్పర సహకారం.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

(సశేషం)

Who am I?

The Divine under many disguises.

The Mother

(*CWM,* Vol. 14, p. 18)

With the best compliments of

Annapurna Mechatronics and Services Private Limited

1-59/A, Moosapet, Sanathnagar (IEPO)
Hyderabad – 500 018

email: aesl@annapurnaelectronics.com

Phones: 040-23712950, 23718614 Fax: 040-23700827, 23718617

తే 21.8.1957 ది శ్రీమాత ప్రసంగంలో భాగం

సాముహికమైన వాస్తవం, దాని ఆవశ్యకత ఒకటి ఈ మధ్యనే బహిర్గతమవుతోంది. అది తప్పనిసరిగా ఆశ్రమానికి పరిమితం కాలేదు. కాగా, శ్రీఅరవిందుల బోధనల కనుగుణంగా — భౌతికంగానే కాక, సచేతనంగా జీవనం సాగించేందుకు ప్రయత్నించేవారమని ప్రకటించుకొనే వారందరినీ — తనలో ఇముడ్చుకున్నది. వాస్తవమైన సామూహిక జీవనంయొక్క ఆవశ్యకత వారందరిలో జాగృతమైంది. అతిమానస, దివ్యచేతన, శక్తులు అభివ్యక్తీకరణ కాబడినప్పటి నుంచి, ఇది మరింత బలపడింది. ఇది కేవలం భౌతిక జీవనపరిస్థితులపై ఆధారపడి ఉండేది మాత్రమే కాక, మరింతగా అంతరంగ సత్యమునకు ప్రాతినిధ్యం వహించేదిగా ఉంటూ, శ్రీఅరవిందులు పేర్కొన్న అతిమానస లేక అతీంద్రియ జ్ఞానసంపన్నమైన సాంఘిక వ్యవస్థకు శుభారంభమవుతోంది.

సెప్టెంబరు 19, 1960 న

శ్రీమాతారవిందుల ఆదర్శాలు, లక్ష్యాలు, వారి సమగ్ర యోగసిద్ధాంతం, సభ్యులకు, జనసామాన్యానికి తెలియచేయటానికి, దాని ఆచరణకు, శ్రీఅరవిందులు ఊహించిన ఆధ్యాత్మికసమాజ సంస్థాపన శతవిధాల సంభావ్యం కావించి, సిద్ధింపచేయటం కోసం, శ్రీమాత, తమ ఆధ్యక్షంలో శ్రీఅరవింద సొసైటీని స్థాపించారు.

10/10/2009 Rs. 15



దైవసాక్షాత్కారము

అఖిల

అఖిల భారత పత్రిక

నవంబరు 2009

విషయసూచిక

దైవసాక్షాత్కారము

సిద్ధి ఒక్కటే సత్త్వాన్ని పూర్తిగా మార్చలేదు. అది ప్రకృతి భాగాల్లో తీవ్ర మార్పులు లేకుండానే దివ్య పురుషభాగంలో కొంత సిద్ధి (సాక్షాత్కారం) పొందేందుకు కేవలం చేతన ద్వారాలను తెరవడమో, ఎక్కువ చేయడమో లేదా విస్తృతపరచడమో మాత్రమే చేయవచ్చు. చేతన యొక్క ఆధ్యాత్మిక శిఖరంపై సిద్ధి వెలుగురేఖలు ప్రసరించవచ్చు కాని అధోభాగాలు మార్పులేకుండా అదే విధంగా ఉండవచ్చు.

శ్రీఅరవిందులు

సాక్షాత్కారము — మా భావన

ఒక లోతైన ఆధ్యాత్మికభావనలో, స్థిరమైన సాక్షాత్కారమనగా, ఒక భౌతికమైన వస్తువు మన చైతన్యానికి యెంత స్పష్టంగా గోచరించగలదో, సాక్షాత్కారమందిన అంశము కూడ అంతకన్నా అధికమైన వాస్తవికతను, క్రియాశీలతను సంతరించుకుని మరింత సన్నిహితంగా ప్రకటితమయ్యేది అని చెప్పవచ్చు.

*

అది కేవలము ఒక మేధోకల్పిత భావన కాదు, లేక వివిధ అంశాల సునిశిత విశ్లేషణ ద్వారా వెలువడిన సత్యమూ కాదు. మన అస్తిత్వంలో ప్రచలితమైన విధానాల వల్ల కలిగే మానసికానుభూతి వికాసము కూడా కాదు. అది ఒక సాక్షాత్కారము — భావస్ఫోరకమైన పదము యొక్క పరిపూర్ణ అర్థంలో అతీతుడు, విశ్వాశ్రయుడు అగు దైవాన్ని, ఆత్మను, మనకు మనముగా వాస్తవమని ధృవీకరించుకొనుటయే గాక మన అంతరంగంలో కూడ ధృవీకరించుకొనుట. అటుపిమ్మట మన అస్తిత్వ దశలను,ఆ ఆత్మ వెలుగులో, వాటి నిజతత్వములోను మరియు మన ప్రపంచ మనుగడలో కలిగే మానసిక, భౌతిక పరిస్థితుల అస్తిత్వములుగానే తప్ప వేరొక విధముగ గమనింప లేకుండుట.

*

దైవసాక్షాత్కారాలు మన చైతన్యములో సంభావించి సుస్థిరపర్చుకున్న పరమమైన ప్రామాణిక సత్యాలు. అవి ఒక ఉన్నతస్థాయికి, దివ్యప్రకృతికి, విశ్వచైతన్యానికి దాని శక్తుల విన్యాసాలకు, వ్యక్తి స్వకీయ ఆత్మకు, అతని నిజస్వభావానికి, అంతర్గత స్వభావాలకు, వీటన్నిటి యొక్క సమీకృత సమాహార శక్తి — అతని అంతరంగ జీవనంలోను, ఉనికిలోను ఒక భాగమయ్యేటంతటి వికసనం. ఇవి యెప్పుడైతే ఒక మెరుపులా, హఠాత్తుగా, అరుదుగ సంభవించేవిగ వుంటాయో, అప్పుడు అనుభవాలనబడతాయి. అతి స్పష్టంగా, తరచుగా, నిరంతరంగా లేక సహజంగా సంభవించినప్పుడు అవి పరిపూర్ణ సాక్షాత్కారాలుగ పరిగణించబడతాయి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: అందుగులపాటి కైలాసపతి, జానకి



The Mother

aspiration

ప్రార్థనలు — ధ్యానములు

ఫిబ్రవరి 10, 1913

నా సత్త్వము, కృతజ్ఞతార్పణలో, నీకై ఎగసిపడుతున్నది. నీవు అభివ్యక్తమయేందుకు ఈ అపరిపక్వ నీరస శరీరాన్ని నిన్ను నీవు అభివ్యక్తం చేసుకోవటానికి వినియోగిస్తావనే గాక — నిన్ను నీవు రూఢిగా అవతరింపచేసుకున్నందులకు — అదే మరి — వైభవాలలో కెల్ల దివ్యవైభవం. ఆనందాలలో కెల్లా దివ్యానందం. అద్భుతాలలో కెల్లా పరమాద్భుతం. గాఢావేశంలో నిన్నన్వేషించే వారంతా తప్పక తెలుసుకోవాలి — ఏ సమయంలో నీ అవసరముంటుందో అప్పుడు నీ వక్కడే ఉంటావని. నీకై అన్వేషణ మాని, నీ కోసమే నిరీక్షించేటంతటి మహత్తర విశ్వాసమే కలిగి, నీ సేవకై పరిపూర్ణంగా ప్రతిక్షణం తమకు తాము నియోగించగలిగినట్లైతే, నీ అవసరం ఎప్పుడు ఉన్నప్పుడు ఎప్పుడూ నీ వక్కడే ఉంటావు. నీ అభివ్యక్తీకరణ రూపాలు తరుచు అనూహ్యంగాను, ఎంతో వైవిధ్యంగాను ఉన్నప్పటికీ నీతో మాకెపుడూ అవసరమే కదా!

నీ దివ్యతేజస్సు ప్రకటింపబడి జీవనము పునీతమగుగాక. అది మానవహృదయాలను రూపాంతరీకరించు గాక. నీ దివ్యశాంతి భువిపై రాజ్యమేలు గాక.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

◀ ఆకాంక్ష



trust

నవంబరు 19, 1912

ప్రభూ, ఎంతో చిత్తశుద్ధితో నిన్నే ఆకాంక్షతో కోరే ఆంగ్ల యువకునితో నిన్న నాకు నీ వొసగిన ప్రత్యక్ష దర్శనానుభవాన్ని వివరించి చెప్పాను. నీ తోటి ఐక్యత నాకు నిరంతరము ఉన్నదని చెప్పాను. నాకు యెరుక ఉన్నంతవరకు నేనా స్థితి కలిగి ఉన్నాను. నా తలపులన్నీ నీ వైపే. నా చేతలన్నీ నీకే సమర్పణ. నీ సన్నిధే నా కొక పూర్ణతతో శాశ్వత సంసిద్ధి. అది సుస్థిర సత్యమై, నీ శాంతి నిశ్చలంగా, సదా నా హృదయంలో స్థావరమై భాసిస్తున్నది. ఈ ఐక్యత చాలా అల్పమని అస్థిరమని నాకు తెలుసు. ఇది రేపు పరిణమించే ఐక్యతతో పోలిస్తే తక్కువే. ఇంతవరకు నన్ను నేను "నేను" అనియే చెప్పుకుంటున్నాను. "నేను" అనే భావన పూర్తిగా వైదొలగి 'నీ' తో ఐక్యము పొందే స్థితికి నిజంగా నేనింకా యెంతో దూరంలోనే ఉన్నాను. కాకపోతే 'నేను' అనే మాట ఎప్పుడూ ఉపయోగించటం తప్పనిసరి అవుతోంది. నా భావము వ్యక్తీకరించటాని కది సరిపడదు. అదొక ప్రతిబంధకమై ఉంటోంది. ఈ పదము నేను మానవులు పరస్పరం ఒకరి నొకరు తెలుపుడు చేసు కొనేందుకు తప్పనిసరిగా అవసర మవుతోంది. అయినా ఈ "నేను" అనేది దేనిని వ్యక్తం చేస్తోందో దానిపైనే అంతా ఆధారపడి ఉంటుంది. నేనా పదమును ఎన్ని సార్లు పలికినా 'నీవే' నాతో పలుకుతూ ఉంటావు. ఎందుకంటే నాలో "నేను" వేరు "నీవు" వేరు అనే ప్రత్యేక భావము తొలగిపోయినది.

అదింకా గర్భస్థ పిండమువలె ప్రారంభదశలో వుండి పరిపూర్ణత దిశగా యెదు గబోవుచున్నది. నీ యందు నాకున్న అచంచల విశ్వాసములో నా కెంతటి ధైర్యము లభ్యమై యున్నదయా ఈశ్వరా!

నీవే సమస్తమై అంతటా అన్నిటా నిండి వున్నావు. నీ దేహపు కదలికే ఈ దేహ కదలిక. ఈ దృశ్యమాన విశ్వంలో గోచరించేదంతా నీవే. నీవే అయి, నీదే అయిన ఈ వస్తువు యొక్క ఉచ్ఛ్వాసనిశ్వాసములు నీవియే. ఆలోచన నీదే. ప్రేమ నీదే. కాబట్టి ఈ మూలద్రవ్యము నీవే (నీదే) యగుట వల్ల నీకే అది విధేయముగ ఉండు టకు ఆకాంక్షించుచున్నది.

మూలం: శ్రీమాత

◀ నమ్మకము

అనువాదం: టి.యస్. రామచంద్రరావు



certitude

నిశ్శబ్ద ప్రశాంతతలో శాశ్వతత్వం అభివ్యక్తమవుతుంది. నీవు ఏ చికాకును దరిచేరనీయకు. అపుడు శాశ్వతత్వం వ్యక్తమవుతుంది. అంతటా సంపూర్ణ సమతను పాటించు. శాశ్వతత్వం అచట నిలిచి ఉంటుంది.... అవును. మనం దైవాన్వేషణకై తీవ్ర కృషిని చేయకూడదు. ఆ కృషి, తీవ్రత ఒక తెరవలె దైవాన్ని మరుగుపరుస్తుంది. దైవాన్ని చూడాలని ఉవ్విళ్ళూరకూడదు. అది ఒక మానసిక ఉద్రేకము. ఆ స్థితి శాశ్వతుని ఉనికిని అస్పష్టపరుస్తుంది. అత్యంత సంపూర్ణమైన ప్రశాంత, పరిశుద్ధ, సమతలన్నీ దైవమే. ఆ దైవానివే అవి అన్నీను. ఈ సంపూర్ణ, పవిత్ర, నిశ్చల వాతావరణములో ఏ చిన్న కదలిక అయినా దైవాభివ్యక్తాన్ని ఆటంకపరుస్తుంది. ఆ దైవం, దైవం మాత్రమే ఉండాలి. వ్యాకులత, వేగిరపాటు, ఒత్తిడి వద్దు. ఏ విశ్లేషణ చేయక, పదార్థవాదన లేక, సందేహాలకు తావివ్వనిచో, అంతటా ఆధ్యాత్మిక ప్రశాంతత, పునీతమైన నిశ్శబ్దము ఆవరిస్తుంది.

ప్రపంచములోని అన్ని ధ్యానముల కంటే ఉత్తమమైనది అదే.

మూలం: శ్రీమాత

అనువాదం: త్రివేణి సిద్ధులగారి

దృఢవిశ్వాసము



perception

జూలై 23, 1913

ఓ ప్రభూ, అనిర్వచనీయ అద్భుత ఉజ్వలోపేతా! ఈ నీ మహనీయ సౌందర్యం పృథ్వీ అంతా పరుచుకోనీ, నీ దివ్యప్రేమ ప్రతీ హృదయంలో ప్రజ్వలించనీ. నీ ఈ దివ్యప్రశాంతి సర్వలోకాన్నీ పరిపాలించనీ!

ప్రగాఢమూ, పవిత్రమూ, అతి సునిశితమూ, ఆనందదాయకమూ, అయిన ఓ మంత్రం నా హృదయంలోంచి ఎగసిపడుతోంది.

ఈ మంత్రం నా నుంచి నీకు చేరుతోందా, లేదా నీ నుంచి నాకు చేరుతోందా, లేదా నీవు, నేను, ఈ విశ్వమూ, ఈ అద్భుతమంత్రమై భాసిస్తోందా? ఏమో నాకు తెలియదు. ఇప్పుడే నాకు ఆ ఎరుక కలిగింది.... ఈ విశ్వమంతా ఒక్కటిగా ఆ మంత్రధామమై ప్రకాశిస్తోందన్న సంగతి తెలిసిన అనుభూతి కలుగుతోంది.

ఇంక నీవూ, నేను అన్నవి కాని, ఈ విశ్వం వేరొకటిగా కాని లేవన్న భావనలో... ఈ ఉన్నతమూ, అనంతమూ అయిన ఓ గొప్ప సమగ్ర సామరస్యత అన్నింటిని పాలిస్తున్నదన్న ఈ సత్యమును ప్రతివారు ఓ రోజు గ్రహిస్తారు. అదే అవధులు లేని ఆ ప్రేమసామరస్య భావం. ఆ ప్రేమ ఈ బాధలపై, ఈ అస్పష్టతలపై విజయం సాధిస్తుంది.


ఈ నీ ప్రేమ అనుశాశిత పాలనలో నాకు మరింత సమగ్రంగా జీవించాలని ఉంది. నా సర్వస్వం ఏ మినహాయింపు లేకుండా దానికే అంకితం.

ఆ అవ్యక్త దివ్యప్రశాంతతలో జీవన సర్వస్వమూ ఆనందంతో ఉప్పొంగుతోంది.

మూలం: శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

➤ గ్రహణశక్తి



realisation

జూలై 17, 1914

మా దృష్టిలో ఈ పృథ్విపై సాధించిన విజయాలు గొప్ప ప్రాముఖ్యతను సంతరించుకుంటాయి. ఎందుకంటే అవి మా బాహ్యస్థితి యొక్క పరిమితి పరిధికి సరిసమానంగా ఉంటాయి. అవి సాధించడం వల్లనే మేం మానవులుగా ఎదిగాం. అయితే అనన్యమైన నీ దివ్యత్వం ముందు ఈ ఐహిక సాధన ఎంత? ఎంత సమగ్రమైనా, ఎంత సంపూర్ణమైనా, ఎంత దివ్యమైనా... నీ దివ్య అనంతకాల కదలికల్లో ఓ లిప్త. దానివల్ల పొందిన ఫలితం కూడా అది ఎంత శక్తివంతమైనదైనా, ఎంత అద్భుతమైనదైనా... నీ వైపు సాగే అనంతయాత్రలో... గ్రాహ్యంకాని ఓ అణువంత. అదే నీ కార్యసాధకులు నిరంతరం గుర్తుంచుకోవాలి. ఎన్నటికీ మరువకూడదు. అలా మరచినపుడు వాళ్లు నీ సేవకు అనర్హులు.

ఓ నా మధురమూర్తీ, ప్రభూ! మా దెంత తెలివితక్కువతనం. ప్రతి చిన్న విషయానికీ మేమే బాధ్యులం అనుకుంటాం. ఇంకా పరమోన్నత దివ్య ఇచ్ఛాశక్తికి వ్యక్తిగత భావనను ఆపాదిస్తాం. నీ హృదయంలో ఐక్యత పొంది, అక్కడే శాశ్వత నివాసంగా ఉంటే, అది మాకు చాలదా! అప్పుడు మా బరువు బాధ్యతలన్నీ నీవే తీసుకొని, మా జీవితాన్ని నీ సంకల్పంతో మాకేమాత్రం తెలియనవసరం లేకుండానే, నీవే నడిపిస్తావు కదా! అన్ని బాహ్యబంధాల నించి, అన్ని విషయాసక్తుల నించి స్వేచ్ఛ, ఎంత గొప్ప విషయాలైనా... వాటన్నింటి నించీ స్వేచ్ఛ పొందినపుడే అదే నిజమైన అమూల్యమైన సాక్షాత్కారం. అదే ఉత్తమోత్తమమైన సాక్షాత్కారం. అది మాత్రమే నీతో సంపూర్ణ సాయుజ్యాన్ని కలిగిస్తుంది. నీ తోటి సన్నిహిత నిశ్చయ, సమగ్రతా అదే. అలాటి సాక్షాత్కారముతోనే, నీతో, సన్నిహిత, సమగ్ర, నిశ్చయ సమైక్యత. క్షణికము, అస్థిరము అయిన అస్తిత్వంతో కూడిన ఈ అశాశ్వత ప్రపంచ బాధ్యత నీదే, దానికి అవసరమైనది, మంచిది — ఏదో చేయవలసినది మరి నీవే. ఓ సర్వేశ్వరా! ప్రియప్రభూ! నా బాధ్యతలన్నీ నీవే తీసుకుంటివిగా. నీ దివ్య సమైక్యతతో పొందిన పరమోన్నత పారవశ్యము మాత్రము నాకు మిగిల్చినావు కదయ్యా!

మూలం: శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

➤ సాక్షాత్కారము

సాక్షాత్కారము — క్రమానుగత త్రిచలనాలు

ఒకదాని తర్వాత మరొకటిగా ఒక వరుసక్రమంలో సాగే మూడు చలనాల ద్వారా సాక్షాత్కారం సిద్ధిస్తుంది. అవి, అంతర్దృష్టి, ఆంతరికానుభవం మరియు తాదాత్మ్యత.

*

నీవు దివ్యజ్యోతిని దర్శించినపుడు అవి అంతర్దృష్టికి కలిగిన దర్శనం. నీ లోనికి దివ్యజ్యోతి ప్రవేశిస్తున్నట్లు సంవేదన లేక అనుభూతి కలిగితే అది అనుభవం. దివ్య జ్యోతి నీలో సుస్థిరంగా నిలిచిపోయి ప్రకాశాన్ని, జ్ఞానాన్ని కలిగిస్తే అది సాక్షాత్కారం లేక సంసిద్ధి. కాని సాధారణంగా అంతర్దర్శనాలను గూడా అనుభవాలనే అంటారు.

*

అంతర్దృష్టి

ప్రాచీన ఋషులు అత్యంత విలువైనదిగా భావించిన శక్తి ఈ అంతర్దృష్టి. ఇదే మనిషిని ఋషి లేక కవిని చేసింది. ఈ దృష్టి లభించిన వాడిక ఎంతమాత్రం కేవల చింతనుడుగా ఉండడు. అది జీవునిలోని ఒక విధమైన వెలుగు. దీనివల్ల కంటికి కనిపించని వస్తువులు, విషయాలు స్పష్టంగా కన్పిస్తాయి. కేవలం బుద్ధికి గాక ఆ దృష్టికి అవి చర్మచక్షువులకు కన్పించినంత వాస్తవంగా కన్పిస్తాయి. భౌతిక ప్రపంచంలో జ్ఞానాని కెపుడూ రెండు రూపాలుంటాయి. అవి ప్రత్యక్ష జ్ఞానం, పరోక్ష జ్ఞానం. చర్మచక్షువులకు కన్పించేది ప్రత్యక్షజ్ఞానం. ఒక విషయం లేక వస్తువు మన దృష్టి కతీతంగా వున్నపుడు దానిని గురించి తెలుసుకోవడానికి, సూచనాత్మకంగా అనుమానం, ఊహ ద్వారా, ఉపమానం ద్వారా, దాన్ని చూసిన ఇతురులు వర్ణించిన వివరణను వినడం ద్వారా లేదా తత్సంబంధమైన చిత్రాల అధ్యయనం ద్వారా లేదా అందుబాటులో ఉన్న ఇతర సమాచారం ద్వారా ఒక భావాన్నేర్పరచుకొనే స్థితికి, అవశ్యం వస్తాం. ఈ విధమైన వాటి తోడ్పాటుతో కొంచెం హెచ్చుతగ్గులుగా, ఆ వస్తువు గురించి లేక విషయాన్ని గురించి మనలో ఒక అవగాహ నేర్పడుతుంది, లేదా ఒక ఊహాచిత్రాన్ని రూపొందించుకుంటాం. కాని అదేమిటో

మనకింకా వాస్తవంగా తెలియదు. ఒక సత్యాన్ని గురించిన మానసిక ఊహాచిత్రమే గాని అదింకా మనకు చేజిక్కిన వాస్తవరూపం కాదు. కాని ఒకసారి దాన్ని కనులార చూస్తే — మరియే ఇతర ఇంద్రియమూ అందుకు సరైనది గాదు — దాన్ని మనం చేజిక్కించుకొన్నట్లు, అదేమిటో మనకు వాస్తవంగా తెలిసినట్లవుతుంది. సంతృప్తి చెందిన మనలో అది భద్రంగా వుంటుంది. జ్ఞానానికి సంబంధించి మనలో అది ఒక అంశము అవుతుంది. చైత్యసంబంధమైన, ఆత్మసంబంధమైన విషయాల్లో గూడా ఇదే నియమం ఖచ్చితంగా వర్తిస్తుంది. ఆత్మను గురించి స్పష్టమైన దీప్తి వంతమైన బోధనలను, వేదాంతుల దగ్గర్నుంచి లేదా ఆచార్యుల దగ్గర్నుంచి విని వుంటాం లేదా ప్రాచీన గ్రంథాల నుండి గ్రహించి ఉంటాం. ఆలోచన ద్వారా, అను మానం ద్వారా, ఊహ ద్వారా, ఉపమానం ద్వారా లేదా అందుబాటులోని ఇతర మార్గాల ద్వారా, దీనిని గురించి ఒక మానసిక రూపాన్ని చిత్రించుకొనడానికి, లేదా ఒక అవగాహనకు రావడానికి ప్రయత్నిస్తాం. ఒక సమగ్ర మరియు అన్యచిం తనలేని ఏకాగ్రతతో, ఆ అవగాహనను మన మనస్సులో స్థిరంగా చెదరకుండా నిలుపుకుంటాం. కాని దాని నింకా మనం నిజం చేసుకోవటం కాదు. భగవంతుని దర్శించటమూ కాదు. ఎంతో కాలం పాటు కొనసాగించిన ఏకాగ్రత ద్వారా లేదా మరి యితర ఉపాయాల ద్వారా మనస్సుకుగల తెరను చించివేసినపుడు లేదా ప్రక్కకు నెట్టివేసినపుడు, జాగృతమైన మనస్తత్వంపై వెలుగులు వరదలై పారినపు డు, జ్యోతిర్బ్రహ్మము దానిని ముంచివేసినపుడు, అవగాహన స్థానాన్ని, జ్ఞాన దృష్టి ఆక్రమించివేస్తుంది. ఈ జ్ఞానదృష్టి వల్ల, ఆత్మ, ప్రత్యక్షమైన, స్థిరమైన, వాస్తవమైనదిగా మన జ్ఞానాని కందుతుంది. ఈ జ్ఞానోదయం తర్వాత, వెలుగు ఎంతగా క్షీణించినా, అంధకార సమయాలు ఎంతగా జీవుని బాధించినా ఒకసారి, సిద్ధింపజేసుకొన్నదాన్ని తిరిగి పొందలేనంతగా కోల్పోవడం ఎన్నడూ జరుగదు. ఆ అనుభవం అనివార్యంగా తిరిగి ప్రాప్తించడమే గాక, సుస్థిరంగా నిలిచిపోయే దాకా చాలా తరచుగా ఆవృతమౌతుంది. ఎపుడు, ఎంత త్వరగా అనేది మనం ఎంత దృఢంగా ఎంత పట్టుదలతో అంకితమౌతామో, మన సంకల్పానికి బద్ధుల మౌతామో, లేదా మనలో దాగివున్న దైవం యెడల మనకుగల ప్రేమపాశానికి కట్టు వడి వుంటామో దాని మీద ఆధారపడి వుంటుంది.

1.జ్ఞానయోగాచరణలో త్రివిధ చర్యలు, శ్రవణ, మనన, నిధి ధ్యాసనల భావం ఇదే.

అంతర్దర్శనాలు తప్పక జరిగి తీరాలనేదేం లేదు. అవి సరైనవైతే, వాటినుండి కొంత సాయం లభిస్తుంది, అంతవరకే.

*

అవి సిసలైనవైతే, యదార్థమైనవైతే, అంతర్దర్శనాలకు, అంతర్వాణిలకు, యోగంలో స్థానముంది. కాని సాక్షాత్కారాలు కావు. ఆ వైపు వెళ్ళే మార్గంలో, ఒక ముందడుగుగా మాత్రమే వాటిని గ్రహించాలి. అందుచేత యెవరైనా సరే వాటితో ఆగిపోకూడదు లేదా సంభవించే వాటన్నింటినీ విలువైనవీ అనుకోరాదు.

*

నేను చెప్పినట్లు లోలోపలి వైపుకు లాగుతున్నట్లు అనిపించడం, లోలోనికి పయనించాలనే తపన కలగడం అవాంఛనీయం గాదు, కనుక అట్టి కదలికను అడ్డుకోవలసిన అవసరం లేదు. సృష్టి లేక అస్తిత్వ సమస్త స్తరాలకు సంబంధించిన విషయాలను చూడగల అంతర్దృష్టి వికాసంవల్ల అంతరంలో కోకొల్లలుగా దృశ్యాలు కన్పించడంతోపాటు, ఒకానొక దశలో, లోలోనికి పోవాలనే తపన కూడా కలుగుతుంది. సాధనలో సహాయకారి కాగల విలువైన శక్తి అది. అందుచేత దానిని నిరుత్సాహపరుచ కూడదు. ఆంతరిక ఆత్మను, అంటే దైవాన్ని సాక్షాత్కరింపజేసుకోవడమనే ప్రధానోద్దేశ్యాన్ని, సతతం దృష్టిలో వుంచుకొని, ఏ విధమైన భవబంధం లేకుండా వాటిని నిశితంగా గమనిస్తూండాలి. కేవలం వాటి కోసం, వాటి వెంటపడవలసిన విషయాలుగా గాక, చేతనా వికాసానికి, క్షణిక సాయమందించే అప్రధాన తాత్కాలిక విషయాలుగా వాటిని పరిగణించాలి. ప్రతిదాన్నీ దాని యథాస్థానంలో వుంచి, వేచి చూచి, దాని కార్య క్షేత్రాన్ని, స్వభావాన్ని, వివేచించి చూడగల విచక్షణాజ్ఞానం కల మనస్సు కూడా సాధకునికి వుండాలి. ఇవి, యదార్థమా కాదా అనే వివేచనాశక్తిని కోల్పోయి, ఈ అనుబంధ అనుభవాల వెంటపడాలని ఆరాటపడేవాళ్ళు కొందరుంటారు. ఈ అనుభవాలన్నింటినీ యదార్థమని భావించగూడదు. వాటిని వివేచించాలి, ఏది మానసికమైనది, లేదా స్వకపోల కల్పితం, ఏది యదార్థమైనది, ఏది విశాల మానసిక, ప్రాణిక స్తరాల నుండి కలిగిన కేవల సూచన లేదా, వాటి వాటి స్తరాల్లో మాత్రమే విలువ కలిగినవి లేదా వేటికి ఆంతరిక సాధనలోనూ, బాహ్యజీవితంలోనూ

సాయపడగల లేదా మార్గదర్శకత్వం వహించగల సామర్థ్యమున్నదో వివేచన చేసుకోవాలి.

మూలం :శ్రీఅరవిందులు
అనువాదం: కె.వి. రావు

అంతరంగ అనుభూతి

ఈ రకమైన అంతరంగ దర్శనం మానసికమైనది. ఆ అనుభవానికిది ఒక ఆకృతి. పోతే అంతరంగ అనుభూతి, అది చూచినదానికి అంత అనుగుణంగా ఉండదు. దర్శనం, ఉన్మీలనం కావిస్తుంది. లోనికి ఇముడ్చుకోదు. నేత్రం తొలిసారిగా వస్తు సముదాయాన్ని గుర్తించేందుకు ఉపకరించేదిగా ఉంటుంది. వాటి పరిపూర్ణ పరిజ్ఞానానికి — స్పర్శలాటి — మిగిలిన ఇతర జ్ఞానేంద్రియ సంవేదనల సహకారం అవసరం. అదే విధంగా ఆత్మదర్శనం సర్వేంద్రియానుభవపూర్వకమైనది కావాలి. అపుడే దానికి పరిపూర్ణత. మన సత్వమంతా పరిపూర్ణంగా భగవంతుని నపేక్షించాలి. అందుకు జ్ఞానప్రకాశనేత్ర మొక్కటే సరిపోదు. ఎందుకంటే మనలో ప్రతి ప్రధాన తత్వ మూలకము ఆత్మాభివ్యక్తీకరణమే. అందుచేతది దానియొక్క (ఆత్మ) ప్రధాన వాస్తవతత్వాన్ని పుణికిపుచ్చుకోవాలి. అనుభూతి పొందాలి. పైకి భావాత్మకంగా రూపరహితంగా అగుపించే విషయాలు మానసికంగా పొందిన ఆత్మానుభవంతో స్థిరమైన వాస్తవాలుగా అస్తిత్వజ్ఞానంతో ప్రతిష్ఠింపబడతాయి. చైతన్యము, శక్తి, ఆనందము — వీటి తాలూకు క్రియారూపాలను, పట్టుకుని వాటి జ్ఞానాన్ని స్థిరపర్చుకుంటాం. ఆ విధంగా దైవానుభూతితో మనసు పరితృప్తి నొందుతుంది. దివ్య ప్రేమ ద్వారా మనలో అనురాగపూరిత భావోద్వేగానుభూతి కలిగి ఆత్మానందాన్ని పొందగలుగుతాం. ఇంకా సర్వభూతాత్మ సంయోగానుభూతి కూడా కలుగుతుంది. ఆ విధంగా హృదయం దివ్యస్పందనలకు ఆవాసమవుతుంది. హృదయంలో దివ్యానందం చోటు చేసుకుంటుంది. మనం స్వయంగా కల్పించినవాటిలో గాని, భగవంతుని సృష్టిలోగాని ఒక హర్షాతిరేకమైన స్ఫూర్తి, సర్వసమగ్రాభిరుచి కలిగి — రసోవైసః — అన్నరసానుభూతి పొందగలుగుతాం. ఆ విధంగా సౌందర్యాభిరుచితో కూడిన బుద్ధి, ఇంద్రియసంవేదనలు, దివ్యసంవేదనానుభూతి పరితృప్తి నొందుతాయి. అలాగే మనలో, ఇతరులలో ప్రపంచంలో ప్రవర్తించే జీవన విన్యా

సాలు సర్వశక్తులలో భౌతికంగా వాస్తవమైన, బలమైన ఆత్మసంవేదన పొందగలు గుతాం. ఆ రకంగా శారీరిక, ప్రాణికపరంగా దివ్యమైన సంతృప్తి కలుగుతుంది.

మనస్సులో, ప్రాణికములో, లేదా దేహములో, యెక్కడైనాసరే సత్యానుభూతిని పొందడం దైవసాక్షాత్కారానికి తొలి మెట్టు. నేను శాంతి అనుభవాన్ని పొందినపుడు అదేమిటో గ్రహించగలను. అనుభూతి భావపరంపరలు, ఆ అనుభవాన్ని సక్రమంగా స్థిరపరుస్తాయి. అలా అది మనలో యెక్కడైనాసరే స్థిరపడితే అక్కడ భూమిక ఆ అనుభూతిని సమగ్రంగా గ్రహించగల్గినట్లవుతుంది.

స్వానుభూతి పొందిన యోగి చిన్న చిన్న స్వానుభవ ప్రారంభాలే చాల ప్రాధాన్యములని, వాటిని శాంతంతో ప్రేమతో అభివృద్ధిపరుప వలెనని గ్రహిస్తాడు. ఉదాహరణకు, ప్రాణికతృష్ణ పట్ల అసంతృప్తితో తటస్థంగా, నిశ్చలంగా వుండడం శాంతికి తొలిమెట్టని, అది అంతర ఆనందం యొక్క పులకింతలని, ఆనందసాగరధార అనీ, వెల్గుల క్రీడ అనీ, అంతరదర్శన అనుభవానికి ద్వారాలని, దివ్యసన్నిధికి ప్రథమ స్పర్శ అని తెలుస్తుంది. ఆయన ఆ అనుభవం పరిణామారంభాన్ని ఆటంకపరచని జాగ్రృతి.

*

అనుభవానికి ఉన్మీలుడవుకా. కాని ఆ యనుభవాల భోగలాలసుడవు కాకు. నిన్ను నీవు ప్రత్యేకంగా యే అనుభవానికి బంధించుకోవద్దు. అన్ని భావాలను, సలహాలను సత్యంగా గ్రహించకు. జ్ఞానాన్ని, ధ్వనిని, భావసందేశాన్ని అంతిమ సందేశంగా, కచ్చితమైన సందేశంగా పరిగణించకు. పరిపూర్ణ సత్యం ఒక్కటే నిజమైనది. నీవు ఉన్నతస్థాయికి యెదిగిచూసేకొలదీ దాని అర్థాన్ని, ఉన్నతస్థాయి నుంచి దర్శించి, మార్పును గమనిస్తావు.

*

ఈ అనుభవాలు యెల్లప్పుడు విలువలేనివని నేననను. కాని అవి కలగూరగంపగా కలసిపోయి, తికమక పుట్టిస్తాయి. విచక్షణారహితంగా వాటిని అనుసరిస్తే అవి భయంకరంగా పక్కదారి పట్టిస్తాయి.

అట్లని అలాంటి అనుభవాలన్నీ నిరుపయోగాలని, విలువలేనివని అర్థం కాదు. వాటిలో కొన్ని మేలైనవీ వున్నాయి. మరికొన్ని కీడైనవీ వున్నాయి. సరైన మార్గంలో సహాయకారులైనవి సాక్షాత్కారమార్గానికి దశలుగా, మార్గదర్శకులుగా నున్నవి

కూడా: వీటిని మీరు అభిలషించవచ్చు. వీటికై ప్రయత్నించవచ్చు, లేదా యివి శీఘ్రంగా కాని లేదా నిదానంగా కాని వస్తాయన్న నమ్మకంతో వీటికి ఉన్మీలుతులు కావచ్చు. మీ స్వీయ అనుభవాలు కొద్దిగా వుండవచ్చు. అవి ముందుకు సాగకపో వచ్చు. కాని అవి మేలైనవి కావని, నిరుపయోగమైనవని నేను చెప్పలేను. వేరు మార్గాల్లో అనేకం, అనుసరించడం కన్న వీటిలో కొన్నింటిని అనుసరించడం మంచి ది. అనుభవసంపద వల్లనే తృప్తిచెందాలని, లేదా యిలాంటి అనుభవసంపదలు లేక పోయినంత మాత్రాన అది తక్కువని, పరితపించాలని నా భావన కాదు.

ఆధ్యాత్మికసాక్షాత్కారానికి లేదా దైవసాక్షాత్కారానికి సహకారులైన అనుభ వాలు లేదా సాధనామార్గాల్లో అభివృద్ధిని తెచ్చే అనుభవాలున్నాయి. దివ్యదర్శ నాలు, కుండలినీ జాగృతి, చక్రాల ఉన్మీలనము, దైవాదేశాలు, అంతర్వాణి, అంతఃశక్తుల ఉన్మీలనము, అలాంటి కోవకు చెందినవి. ఎవరైనా జాగ్రత్తగా వుండవలసింది యేమంటే ఆ అనుభవాలు నిజాయితీ అయినవిగా వుండాలి. అది నీ నిష్కాపట్యంపై ఆధార పడి వుంటుంది. నీవు నిష్కపటంగా వుండకపోతే, దివ్యచేతనను పొందడంకన్న, దివ్యసన్నిధి నివాసంకన్న మరింత గొప్పగా యోగినని, లేదా దివ్యమానవుడనని అహంకారం కలిగివుంటే అపుడు కపటం వెల్లువలా నీలో పరవళ్ళు తొక్కుతుంది. లేదా నీవు నీ స్వీయకల్పిత అపమార్గాల్లో గిరగిర తిరుగుతావు. ఇది సత్యం

అనుభవాల కోసం వేటాడరాదని, దైవాన్ని మాత్రమే ప్రేమించి ఆయన్నే అభి లషించాలని ఆయనెవరో యెందుకంటారు? అంటే మీరు మీ ప్రధాన ధ్యేయంగా అనుభవాలనే తయారుచేసుకోరాదని, దైవమే మీ ప్రధాన ధ్యేయమని, భావన. అప్పుడు దోషభూయిష్ఠమైన అనుభవాలనుగాక, సత్యమైన అనుభవాలనే ప్రధా నంగా ఆశిస్తే, వారి యోగం సూక్ష్మ భౌతిక, ప్రాణిక, మానసిక, నిమ్న జగత్తులలో స్వార్థ కార్యకలాపాల్లో కూరుకుపోతుంది. అలాంటి చర్య వారిని అలజడిలోకి లేదా కపటంలోకి లాగివేస్తుంది. అపుడు వారు ఆత్మ పరమాత్మల మధ్య నిలిచిపోతారు. కనుక దైవం కొరకైన అభిలాష, సాధనలే మేలైనవి. కాని యీ నిబంధనలను, యీ మాటలను, వాటి వాటి పరిధుల్లోనే కొలబద్దగా గ్రహించాలి. అట్లని సహాయకారులైన ఆధ్యాత్మిక అనుభవాలను ఆహ్వానించరాదని, అవి విలువ లేనివని అర్థం చెప్పుకో రాదు. మేలైన అనుభవమునకు ఉన్మీలితమైనపుడు కేంద్రధ్యేయాన్ని దృష్టిలో వుంచు కొని, దానిని అనుసరించడం అనుమతించదగినదే.

మనస్సు ప్రశాంతతను పొందినపుడు, ఏకాగ్రత తీవ్రమైనపుడు, ఆకాంక్ష దృఢమైనపుడు అది అనుభవ ప్రారంభం అనవచ్చు. విశ్వాసం యెంత యెక్కువైతే, శీఘ్ర ఫలితాలు అంత యెక్కువగా లభిస్తాయి. తక్కిన ఫలితాలకు సాధకుడు స్వీయప్రయత్నాలపై మాత్రమే ఆధారపడరాదు. దైవస్పర్శను స్థిరపరచుకొనడంలో విజయవంతుడు కావాలి. శ్రీమాత శక్తిని, సన్నిధిని గ్రహించి స్థిరపర్చుకోవాలి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: బి. నరసింహయ్య

గుర్తింపు

ఈ విజ్ఞానం, ఈ అనుభవం, ఇవన్నీ — (జీవబ్రహ్మైక్యత యొక్క) గుర్తింపును చేరుకునేందుకు, పొందేందుకు — ప్రాథమిక సాధనాలు మాత్రమే. మనం దర్శించేది, అనుభూతిచెందేది — మన ఆత్మనే. అందుచే, ఈ అనుభవం, ఈ విజ్ఞానం, అంతా, గుర్తింపులో ముగియకపోతే — అంతా అసంపూర్ణమే. మన మహోన్నత వేదాంత విజ్ఞానం — 'అతడే నేను (సోహం)' — అనే దాన్ని — మన సత్తా అంతటిలోను, జీవించగలిగి ఉండకపోతే — అంతా — ఈ విజ్ఞానం, ఈ అనుభవం అంతా — అసంపూర్ణమే. దైవాన్ని చూడడం, కౌగిలించుకోవడం మాత్రమే కాదు — ఆ సత్యమే కావాలి మనం. ఏ ఆత్మ తన అభివ్యక్త రూపాలన్నిటికీ అతీతమైనదో, అట్టి ఆత్మతో, తప్పనిసరిగా, — మన ఉత్కృష్ట విశ్లేషణ, విచారణ, ద్వారా — ఏకం కావాలి మనం. దేని నుండి 'నేను' అనబడే అహంకారము — దానికే చెందిన, 'నాది, నా వారు' వంటి వికారాలు వెలువడ్డాయో — అట్టి అహంకారం నుండి, తనంతట తాను బయటపడటం ద్వారా — ఏకం కావాలి మనం, మన ఆత్మతో. ఏది — తన అనంత అస్థిత్వం, చైతన్యం (ఎరుక), శాంతి, ఆనందంతో — తనని తాను, మనలో — ఎరుకపర్చుకుంటుందో, ఏది తన చర్యలు, రూపాలు, క్రీడలతో — తనని తాను తెల్పుకొనుట అనే క్రీడలో — తనని తాను బంధించుకుంటుందో, ఈ ప్రపంచంలో — అట్టి మన ఆత్మతో — దాని అభివ్యక్తరూపాలు, అస్తిత్వాలు, చర్యలు, క్రీడలతో — ఏకం కావాలి మనం, లేదా మనమే కావాలి 'అది' — దాని రూపాలు, అస్తిత్వాలు, చర్యలు, క్రీడలతో సహా.

దైవాన్ని, లేదా ఆత్మను — కేవలం బుద్ధిలో మాత్రమే గాక ఇంకా ఎక్కువగా — ఎలా తెల్సుకోవాలో అర్థం చేసుకోడం, ఆధునిక (పాశ్చాత్య) బుద్ధికి — చాల కష్టం. కాని — ఈ తరహా (బుద్ధికి అతీతమైన) దర్శనం, అనుభవం, పొంది ఉండడాన్ని — ఒక ఆంగ్లకవి అంతరంగంలో ప్రకృతివల్ల కల్గిన జాగృతి నుండి — ఛాయామాత్రంగా అరువు తెచ్చుకోవచ్చు. పాశ్చాత్య ఊహకు (అందని) అట్టి దర్శనాన్ని, అనుభవాన్ని, నిజం చేశాడా మహాకవి, వర్డ్సువర్తు. అతడు — ప్రకృతి నుండి తను పొందిన అనుభవాలను, తన పద్యాలలో ప్రకటించాడు. వాటిని మనం చదివితే, ఆ అనుభవం గురించిన కొంతభావం — సుదూర భావం — మనం పొందగలం. ఎందుకంటే, మొట్టమొదట — ఈ ప్రపంచంలో ఒక ప్రత్యేకమైన దానిని దర్శించాడు, అతడు. అన్ని వస్తువులకు ఆత్మ ఏదో, అన్ని వస్తువులు దేనిలో ఉంటాయో, అట్టి ఆత్మనే అతడు దర్శించాడు; రూపాల కతీతమైన, కాని రూపాలకు కారణమైన, రూపాలలో వ్యక్తమయిన, ఉన్న శక్తి ఏదో, దానినే — అట్టి ఆత్మనే — అతడు దర్శించాడు. అట్టి సాక్షాత్కారం వల్ల కల్గే ఆనందం, శాంతి, విశ్వవ్యాపకత్వం మాత్రమే కాదు అతను పొందినది; సాక్షాత్తు దాని స్పర్శనే పొందాడు — భౌతిక, ప్రాణిక, మానసిక, రసమయ, (స్థరాలకు చెందిన), స్పర్శనే పొందాడు. ఇట్టి స్పర్శను, దర్శనాన్ని - తన సత్తలో మాత్రమే కాక — తన కత్యంత సమీపంలో ఉన్న పువ్వులో, అల్పమనిషిలో, అచలమైన రాతిలో కూడ — అతడు పొందాడు; అంతే కాదు, అప్పుడపుడు, వాటితో ఐక్యత (ఏకత్వం) కూడ సాధించాడు; తాను ఏ వస్తువుకు అంకితమయేవాడో — అదే అయేవాడు. ఈ విషయాన్నే — "ఆత్మ కప్పేసిన ఒక నిద్ర" — అనే తన పద్యంలో ప్రౌఢంగా, శక్తివంతంగా చెప్పాడు; తన సత్తాతో అతడు భూమితో ఐక్యం చెంది, "రాళ్ళురప్పలు, చెట్లతో సహా, ఆత్మప్రదక్షిణ" చేస్తున్నట్లు వర్ణించుకున్నాడు. భౌతికప్రకృతికి అతీతమైన ఆత్మసాక్షాత్కారంగా, దీనిని మనం కొనియాడవచ్చు. ఇందులో యోగవిజ్ఞానానికి చెందిన మూలాలున్నాయి. కాని, ఈ అనుభవము కూడ, కేవలం — ఒక పెద్ద భవనద్వారం వద్ద నుండే ఒక చిన్న గదిలో ప్రవేశించుట వంటిది; అతీంద్రియ, అతీతమానస, ద్వారం వద్ద, తన అంశలన్నిటికీ అతీతుడైన 'అతని' ఆత్మ ద్వారం వద్ద — ఒక చిన్న గదిలో ప్రవేశించుట వంటిది. ఇంకా అత్యున్నత జ్ఞానం పొందాలంటే, పరమమైన ఎరుక కలిగి — అక్కడ — ఇతర అనుభవాలన్నిటినీ

'పరిపూర్ణుని' లో దివ్య ఐక్యం పొందాలి; అప్పుడే అది సాధ్యమౌతుంది. దివ్యాన్వేషణకిదే ముగింపు; దివ్యానందం, దివ్యజీవనానికి కూడ, అదే ఆధారం.

సాధకులకు — సహకారం: ఇటువంటి పరివర్తన — మానవత్వం నుండి దివ్యత్వానికి, విభజన నుండి ఏకత్వానికి, ఇంద్రియగ్రాహ్య ప్రకృతి నుంచి, సనాతన దివ్యసత్యం వైపునకు — కల్గే ఆత్మపరివర్తన — ఒక సంపూర్ణ పునర్జన్మ. దీనిలో తప్పనిసరిగా రెండు దశలుంటాయి. ఒకటి, ఆత్మ ఉపకరణాలు తగిన రీతిలో పరిపక్వం చెంది సిద్ధం కావడం, రెండవది — ఆత్మ వెలుగును పొంది, తనను తాను తెల్సుకోడం, — పక్వం చెందిన తన ఉపకరణాల ద్వారా. నిజం చెప్పాలంటే, ఈ రెండు దశలను కచ్చితంగా వేరుచేసి చూపే ధృఢమైన హద్దు ఏమీ లేదు; ఇంకా చెప్పాలంటే, అవి ఒకదాని కొకటి అవసరం; రెండూ ఒకేమారు కొనసాగుతుంటాయి.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: యస్. వై. సోమయాజులు

మూడు ప్రాథమిక సిద్ధులు

దైవము యొక్క పరమార్థము అనంతమైనది. అది ఆవిష్కృతమయ్యేది అనంత బాహుళ్యరూపంలోనే. అందువల్ల ప్రకృతిలోనూ, సత్త్వంలోను నిజమైన సమగ్ర సంపూర్ణత్వం ఏ ఒక్క రకమైన సిద్ధి వల్లనో లభించదు. దివ్యానుభవపు వివిధ తంత్రులనూ అది సమ్మిళితం చేసుకోవాలె. శుద్ధ పరిపూర్ణత్వాన్ని సంతరించుకోనంత వరకూ ఏ ఒక్క రూప సముపాసన ద్వారా దాన్ని పొందలేము. అనంతత్వపు వివిధ అంశాల సామరస్యాన్ని అది సాధించాలె. మన ప్రకృతి సంపూర్ణ రూపాంతరం చెందాలంటే బహుముఖ సజీవ అనుభవంతో కూడిన సమగ్రచేతన అవసరం.

అనంతత్వపు బహుముఖ అనుభవానికీ, సమగ్ర పరిజ్ఞానానికి ప్రాథమికంగా తప్పనిసరైన అవగాహన ఒకటి అవసరం. అది వివిధ రూపాలు, అవస్థలతో మారని దివ్యత్వ సారరూపాన్ని, సత్యాన్ని గ్రహించడమే. అట్లా కానప్పుడు పైకి కనపడే విషయాల వలలో చిక్కుకుపోవడమో, లేదా విశ్వబాహుళ్యంలోనో వైయక్తిక అంశాల్లోనో గందరగోళంతో భ్రమించడమో జరుగవచ్చు. దాన్ని తప్పించుకోవాలని

ప్రయత్నించినప్పుడు ఏదో ఒక మానసిక సూత్రానికి బానిస కావటమో లేదా నియమిత వ్యక్తిగత అనుభవానికి బందీ కావటమో జరుగుతుంది. ఈ విశ్వానికి మూలాధారమైన, భద్రమైన, సమన్వయకరమైన ఏకైక సత్యం ఏమంటే పుట్టుకలేని పరమాత్మ మరియు జీవాత్మ రూపమే ఈ జీవితం — ఆ నిగూఢ పరమాత్మ స్వరూపాన్ని అది సృష్టించిన అస్తిత్వాలతో సహా సిద్ధింపచేసుకోవడమే జీవిత రహస్యాన్ని తెల్సుకోవడానికి మూలం. ఈ జీవితం వెనుక బహురూపాలను పొందిన శాశ్వత దివ్యసత్త్వపు జాడలు కనిపిస్తాయి. దీనిలో అంతటా, చుట్టూ అనభివ్యక్త కాలాతీత నిత్యుడు కాలంతో ఆవిష్కృతుడై ఆవరించి ఉంటాడు. కాని ఈ విజ్ఞానం జీవనానికీ, పరిణామానికీ సంబంధంలేని మేధోపరమైన, తాత్త్వికభావన మాత్రమే అయితే యోగానికి పనికిరాదు. సాధకుడికి మేధోపరమైన సిద్ధి ఒక్కటే సరిపోదు. యోగాన్వేషణ కేవలం ఆలోచనకో, మేధస్సుకో సంబంధించిన సత్యం కోసం కాదు. సజీవ, సగోచర ఆధ్యాత్మిక అనుభవానికి సంబంధించిన సచేతన సత్యం కోసం. ఒక సత్యమైన, అనంతమైన ఉనికికి సంబంధించిన స్థిరమైన ఇంద్రియజ్ఞానం, లోపలా, వెలుపలా, స్పష్ట అవగాహనతో, అనుభవం, సంసర్గం, భావన, సంబంధం మనలో జాగృతం కావాలి. ఆ దివ్యసాక్షాత్కారం మనం వ్యవహరించే సచేతనమైన పరివ్యాప్తమైన, దివ్య అస్తిత్వంగా మనతోనే ఉండాలి. దాన్ని ఎప్పుడూ, అంతటా విస్పష్టంగా, ప్రత్యక్షంగా, సర్వాంతర్యామిగా భావించగలగాలి. వాటి నిజమైన ఆత్మగా, అనశ్వర సారంగా, సన్నిహితమైన అంతరాంతర శక్తిగా దానిపై అధికారాన్ని మనం పొందగలగాలి. ఈ ఆత్మను, శక్తిని, అన్నిటా ఊహించుకోవటం మాత్రమే కాకుండా అన్నివిధాల చూసి, భావించి, అనుభవించి, సంసర్గం పొందగలిగి ఉండాలి. ఈ ఆత్మనే, శక్తిలో అన్నింటినీ అంతే స్పష్టంగా అనుభవించగలగాలి. ఇదే మిగిలిన ఇతర సర్వ విజ్ఞానాన్ని చుట్టపెట్టి కలుపుకొనే ప్రాథమిక అనుభవం కావాలి.

ఈ అనంతమైన, నిత్యమైన సర్వాంతర్యామి దివ్యవాస్తవం సర్వత్రా ఉన్న ఏకైక అస్తిత్వం. వివిధ జీవాల్లో అనేక రూపాల్లో కాకుండా, ఏకరూపంలో సమైక్యపరిచే ఉనికి. విశ్వంలోని ప్రతి ఆత్మలో, ప్రతి రూపంలో సమగ్రంగా దీన్ని దర్శించవచ్చు, భావించవచ్చు, కలవవచ్చు. ఎందుకంటే దీని అనంతత్వం ఆధ్యాత్మికమైనది, మూలభూతమైనది. కేవలం అంతరిక్షంలో అపరిచితమైనదో, కాలంలో అనంతమైనదో కాదు. ఈ అనంతత్వాన్ని పరమాణువులోనూ ఒకే ఒక్క క్షణంలోనూ, అదే

స్పష్టతతో బ్రహ్మాండపు అద్భుత విస్తారంలోనూ, కాలపరివ్యాప్తంలోనూ భావించవచ్చు. ఈ అనుభవం, జ్ఞానం ఎప్పుడైనా మొదలు కావచ్చు. ఏ రూపంలోనైనా ఆవిష్కృతం కావచ్చు. ఎందుకంటే దైవత్వం అందరిలో ఉంది, సర్వస్వమూ దైవ స్వరూపమే.

ఈ ప్రాథమిక అనుభవం వివిధ ప్రకృతుల్లో వివిధ రూపాల్లో ప్రారంభం కావచ్చు. సహస్రాంశాల్లో దాగి ఉన్న ఈ దివ్యసత్యం ఆవిష్కృతం కావడానికి చాలా సమయం పట్టవచ్చు. ఈ అనంత అస్తిత్వాన్ని బహుశా నేను మొదట నాలో లేదా నేనుగా భావించవచ్చు. ఆ తర్వాతే నాకు సంబంధించిన ఈ పరమాత్మ భావన, దృష్టిని సర్వప్రాణులకూ విస్తరింపయేవచ్చు. అప్పుడు ప్రపంచాన్ని నాలో లేదా నాతో ఒకటిగా దర్శిస్తాను. నా సత్త్వంలోని దృశ్యంగా, దాని రూపాంతరపు క్రియలను నాలోని విశ్వశక్తిలో రూపాల, ఆత్మల, శక్తుల సంచారంగా భావించగల్గుతాను. అంతటా నేను నన్నే కలుసుకొంటాను — మరెవరినీ కాదు. అంతేకాని, బాగా గ్రహించాలి — విస్తారమైన అహం నీడలోనే నివసిస్తూ, అహంకారాన్ని ఆత్మగా, శక్తిగా తలుస్తూ అసంపూర్ణమైన తన వ్యక్తిత్వాన్ని ప్రముఖ అస్తిత్వంగా అందరిపై రుద్దే అసుర ప్రకృతితప్పిదాలలో కాదు. జ్ఞానాన్ని పొందిన నేను నా నిజమైన ఆత్మ నిరహంకారమని గ్రహించాను. నాలోని పరమాత్మను అపౌరుషేయ (impersonal) అనంతత్వంగా, లేదా తనలోనూ తనను అధిగమించే ఉన్న వ్యక్తిత్వాలనూ ఒకేసారి కల్గి ఉన్న మూలభూత దివ్యపురుషుడిగానో భావిస్తాను. అపౌరుషేయమైనా అపరిమిత పురుషుడిగానైనా లేదా ఒకేసారి రెండూ అయినా, అది అహంకారానికి అతీతమైన అనంతత్వం. ఇతరుల్లో కాకుండా నేనుగానే నాలో నేను ముందుగా భావించటానికి కారణం దాన్ని అన్వేషించి, తెలుసుకొని సిద్ధింప చేసుకోవటం నా వైయక్తిక చేతనకి అత్యంత సులభం కాబట్టి. కాని పరమాత్మలో ఈ సంకుచిత అహం లయం చెందకపోతే, పరమోన్నతమై, శాశ్వతమైన, సృష్టిరహితమైన ఆ ఆధ్యాత్మిక 'అహం' లో స్వల్పమైన బాహిర మనస్సంభూతమైన 'అహం' నశించకపోతే నా సిద్ధి అవాస్తవమో లేదా అసంపూర్ణమో అయ్యుండాలె. నాలో ఎక్కడో 'అహం' అవరోధంగా పరిణమించిందన్న మాట. పరమాత్మ యొక్క సర్వసంలీన సత్యాన్ని నా ప్రకృతిలోని ఒక భాగం అహంకారభూయిష్టమైన నిరాకరణతో అవరోధించిందన్న మాట.

II. మరో మార్గంలో ఇది కొందరికి సులభమార్గం — మొదట నేను నాలో కాకుండా ఇతరుల్లో, నా వెలుపలి ప్రపంచంలో భగవత్తత్వాన్ని దర్శించవచ్చు. బయట కనిపించే రూపాలు, ప్రాణులు, శక్తులతో సంబంధం లేని అంతర్ముఖమైన అనంతత్వంగా భావించవచ్చు. లేదా వీటన్నిటినీ తనలో కల్గిన ఏకైక శుద్ధ ఆత్మ స్వరూపంగా శక్తిగా దర్శించవచ్చు — తద్వారా నిశ్శబ్ద సర్వవ్యాపక పరమాత్మలో నా అహంకారాన్ని పోగొట్టుకొంటాను. తర్వాత ఈ ఏకైక విశ్వవ్యాప్త అస్తిత్వం యొక్క ఉపకరణమైన నా సత్త్వాన్ని ఆవహించి, ఆధీనం చేసుకొంటుంది. అందులో నుండే నా కార్యోన్ముఖ స్పందనలూ మనోవాక్కాయ కాంతులూ, చేతనారూపాలూ, ఇతర ఆత్మరూపసంబంధాలూ, ప్రభావాలూ ఆవిర్భవిస్తాయి. అప్పుడిక నేనే మాత్రమూ ఈ అల్పవ్యక్తిగత ఆత్మను కాను. ఈ విశ్వంతో, ఆ (తత్) పరమాత్మ యొక్క లీలాస్వరూప క్రియాకలాపాలు కొనసాగించే నిర్ధారిత అంశను మాత్రమే అవుతాను.

III. మరొక ప్రాథమిక సిద్ధి అన్నింటికంటె తీవ్రమైనది. మొట్టమొదటి నిర్ణయాత్మక ఉన్మీలనంగా లేదా యోగానికి ప్రాథమికంగా ఒక మలుపునిచ్చేది — అప్పుడప్పుడు సిద్ధిస్తుంది. అది నాకు, ఈ ప్రపంచానికీ అతీతంగా ఉన్నతమైన అనిర్వచనీయమైన అవ్యక్తుడైనవాని పట్ల కలిగే జాగృతి. అందులో నేను తిరుగుతున్నట్లనిపిస్తుంది. అదొక దేశకాలావధులు లేని స్థితి — నాలోని సారభూతమైన లక్షణంగల చేతన వైపు మళ్లించేది, నచ్చచెప్పేది — అట్లాగే తలమునకలు చేసే వాస్తవం కూడా అది. అన్ని ప్రాపంచిక వస్తువులు — స్వప్నం లేదా నీడ వలె మిథ్య అనీ, లేదా అశాశ్వతం, అర్ధసత్యం, పరాధీనమైనవనే బలవత్తర భావన ఈ అనుభవంతో సాధారణంగా తోడై జతకూడి ఉంటుంది. కొంతకాలం కనీసం మన చుట్టూ కనిపించేది చలనచిత్రాల వంటి నీడలనీ పై పై రూపాలనీ, నా చర్యలన్నీ అగోచరమైన ఏదో ఒక దివ్యమూలాధారం నుండి వచ్చిన అస్థిరవ్యవస్థగా తనకంటె అతీతంగా, అసాధ్యంగా కనిపిస్తుంది. ఈ చేతనలోనే ఉండటం, ఈ ఉపదేశాన్ని పొందడం, పదార్థ సూచనను అనుసరించడం అంటే ఆత్మను, ప్రపంచాన్ని, అవ్యక్త పరమాత్మలో లయం చేయడం — మోక్ష, నిర్వాణ లక్ష్యం వైపు పయనించడమే. ఇదొక్కటే మార్గం కాదు. నాకూ నా చర్యలన్నిటికీ మూలాధారమైన అవగాహనాతీతమైన కేంద్రంతో కాలాతీత అసంపూర్ణ స్వేచ్ఛా నిశ్శబ్దం ద్వారా సంబంధం ఏర్పడేవ

రకు వేచి చూడటం మరో మార్గం. అప్పుడు శూన్యం పూరింపబడటం ఆరంభమౌ తుంది. దానిలోకి, దాన్నుండి, పరమాత్మ బహుముఖ దివ్యసత్యం వెలువడుతుం ది. సచేతనమైన అనంతత్వపు అన్ని రూపాలు, అన్ని స్థాయిల్లో ప్రవహిస్తాయి. మొదట ఈ అనుభవం మెదడుపై, తర్వాత సత్త్వమంతా ఒక నిరంకుశ, నిరవధిక, అగాధ శాంతి, మౌనాలను కలిగిస్తుంది. అందుకు వశమై, స్తబ్దమై, తననుండి తాను విముక్తమై మేధస్సు ఈ మౌనాన్నే పరమాత్మగా ఆమోదిస్తుంది. కాని తర్వాత ఇదంతా తనకు తాను తెలియని సర్వోత్కృష్టమైన అస్తిత్వం నుండి జాలువారిం దని సాధకుడు తెలుసుకొంటాడు. ఈ పరమావధికి, ఈ నిరపేక్షం, నిర్గుణమైన శూన్యం నుండి లభించే శాంతి కాదు. దానికి తనదైన అనంత సంపద ఉంది. వాటి క్షీణరూపమే మన సంపద. ఆ మౌలిక దివ్యసంభూతం లేకుంటే ఈ విశ్వమే లేదు. అన్ని శక్తులూ, క్రియాకలాపాలూ మిధ్యలే. సర్వ సృష్టి, అభివ్యక్తీకరణలూ అసాధ్య మే.

ఇవీ ప్రాథమిక సిద్ధులు. జ్ఞానయోగికి ఇవి స్వయం సమృద్ధంగా, అన్నిటికీ పరమ ప్రత్యామ్నాయంగా కనిపిస్తాయి. కాని సమగ్ర సాధకుడికి ప్రాథమిక దశలో భగవత్కృపతో సులభంగా, హఠాత్తుగా కానీ దీర్ఘసాధన, శ్రమలతో కానీ లభించి నా, అదే పరమ సత్యం కానీ అనంతత్వపు సమగ్ర సత్యానికి కేవల సాధనాలు కానీ కావు. అదొక అసంపూరక ప్రారంభం. పరమోన్నతమైన దివ్యజ్ఞానానికి విస్తృత పునాది. పూర్తిగా సాధించాల్సిన సిద్ధులెన్నో ఇంకా ఉన్నాయి. కొన్ని మొదటి చూపులో సారభూతానికి కాకుండా కేవలం అస్తిత్వానికి సాధనాలైన దివ్యాంశాలు చెప్పేవనిపించినా చివరిదాకా అనుసరిస్తే దివ్యత్వ సాక్షాత్కారానికి, అవి మార్గ దర్శకమవుతాయి. ఆ సాక్షాత్కారం లేనిదే పదార్థాల వెనుక ఉన్న సత్యశోధన — జ్ఞానం అసమగ్రం అనిపిస్తుంది. సాధనాలుగా కనిపించే ఇవి లేకుంటే ప్రాథమిక సిద్ధులు కూడా సృష్టి వైచిత్ర్యాన్ని ఛేదించలేవు. దాన్ని గురించి వ్యక్తపర్చే దృక్ప థాలన్నీ సమగ్ర విస్తృత పరిధిలోనే గ్రహించాలి.

ఈ ప్రాపంచిక క్రియాకలాపాల నుంచి నిర్గమనం, ఉత్కృష్ట విమోచన, నిశ్చ లత, సాధకుడికి పరమ ఏకైక లక్ష్య మైతే ఈ మూడు ప్రాథమిక సిద్ధులు ఆధ్యాత్మిక జీవనం ఫలించడానికి సరిపోతాయి. కేవలం వీటి మీదే దృష్టి కేంద్రీకరించినా ఇతర లౌకిక, పారలౌకిక జ్ఞానం తన నుండి దూరం అవుతుంది. తేలికగా నిత్యమైన

నిశ్శబ్దం వైపు తను నిర్గమించవచ్చు. కాని తను తన ప్రపంచాన్నీ, దాని క్రియాక లాపాన్నీ పరిగణనలోకి తీసుకోవాలి. వాటి వెనుక ఉన్న దివ్యసత్యాన్ని తెల్సుకోవాలి. దివ్యసత్యానికి, అభివ్యక్తసృష్టికీ మధ్య పైకి కనిపించే వైరుధ్యాన్ని సమన్వయపరచాలి. అదే ఆధ్యాత్మిక అనుభవానికి ప్రారంభదశ.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: ఆచార్య మాడభూషణం రాజగోపాలాచార్య

ఆత్మ సంసిద్ధి

(ఈశోపనిషత్ — శ్రీఅరవిందుల భాష్యం)

ఆత్మసిద్ధి

"బ్రహ్మమే" జీవాత్మకు సంబంధించిన 'అత్మ'. 'విశ్వాత్మ'. ఇదే విశ్వాంతర్గత మైన సర్వజీవరాశిలో, సర్వవస్తురాశిలో మార్పుచెందని అస్తిత్వం. మనలో, మనస్సు, జీవం, శరీరం, స్వభావం, కర్తృత్వం మున్నగు మార్పుచెందే సమస్తం మన నిజమైన, మార్పుచెందని అవ్యయ ఆత్మ కాదు. కాని కదిలే జగతిలో విశ్వజనీనమైన, అపరిచ్ఛిన్నమైన ఆత్మయొక్క సంభూతి పరంపరలో క్రమవికాస దశలలో ఉన్నవే ఈ జీవరాసులు. అందువల్ల ప్రకృతిలోని జీవ, నిర్జీవ వస్తురాశి, అన్ని వస్తువులు — అవి అందరిలోని ఆత్మ సంభూతి పరంపర. భిన్నంగా కనపిస్తున్న ఈ జీవులంతా ఒకే అవిచ్ఛన్న అస్తిత్వం. ఇదే ప్రతి ఒక్కరు తెలుసుకోవలసిన సత్యం.

తనలోని ప్రతి ఒక్క భాగంలో వ్యక్తి ఈ ఏకత్వాన్ని సిద్ధింపచేసుకుంటే, అతడు పరిపూర్ణు డవుతాడు. వినిర్మల మనస్కుడవుతాడు. అహం నుండి విముక్తుడవుతాడు. ద్వంద్వాలకు దూరమవుతాడు. అఖిల భగవదానంద అమృతధారలు అతనివే.

'ఆత్మ'

మనలోని నిజమైన 'ఆత్మ' 'బ్రహ్మమే'; అది వినిర్మలం. అవిచ్ఛిన్న పురుషుడు. స్వయంప్రకాసితం. చైతన్యంలో స్వయం కేంద్రీకృతం. శక్తిలో స్వయం కేంద్రీకృతం, స్వయం ఆనందమయం. ఆ ఆత్మ అస్తిత్వంలో కాంతి, ఆనందం. అది కాలరహితం, వ్యోమరహితం (spaceless), స్వేచ్ఛాయుతం.

సచ్చిదానందం

సచ్చిదానందం ఉన్నత పరపురుష అభివ్యక్తి. దాని అనంత అస్తిత్వం, చైతన్యం, శక్తి, ఆనందం — ఇవన్నీ పరాప్రకృతి. మనస్సు, జీవం, శరీరం — ఇవి అపరా ప్రకృతి.

సచ్చిదానందస్థితి విశ్వ అస్తిత్వపు పరార్థం. దీని నైజం అమృతత్వం. పదార్థంలో మర్త్యజీవిత నిమ్నస్థితి. అది అపరార్థం. దీని నైజం మృత్యువు.

శరీరంలోని మనస్సు, జీవం మృత్యుస్థితిలో వున్నాయి. ఎందుకంటే, అవి అవిద్య వశంలో సచ్చిదానందాన్ని సిద్ధించుకోలేకపోతున్నందువల్ల. సచ్చిదానందాన్ని పరిపూర్ణంగా సిద్ధింపచేసుకుంటే, మనస్సును 'సత్యం' (విజ్ఞానం) గా, జీవాన్ని చైతన్యంగా శరీరాన్ని 'సత్ ', నైర్మల్యసారంగా మార్చుకోవచ్చు.

శరీరంలో ఈ సిద్ధిని పరిపూర్ణంగా, పొందలేకపోతే, ఆత్మ తన నిజస్థితిని ఇతర జీవరూపాలలో, ప్రపంచాలలో, "సూర్య" ప్రజ్వలిత లోకాలలో, ఆనందభూమికలలో సిద్ధింపచేసుకుని, శరీరంలోని తన పరిణామక్రమాన్ని పరిపూర్తి చేసుకోడానికి భౌతిక ప్రపంచంలోకి తిరిగి వస్తుంది.

శరీరంలోనే పురోగమనశీలమైన పరిపూర్ణ ఆత్మసంసిద్ధి మానవపరిణామ లక్ష్యం. సచ్చిదానందపు వినిర్మలస్థితిలోకి అగణితకాలం పాటు ఆత్మ ఉపసంహరించుకోవడం సాధ్యమే. మనలోని "ఆత్మ" ను సచ్చిదానందంగా సిద్ధింపచేసుకోవడం మానవ అస్తిత్వ లక్ష్యం.

ఆత్మసిద్ధి దశలు: సర్వాత్ముని సాక్షాత్కారం

విశ్వంలో, ఇతర జీవులతో ఏకత్వం పొందడం ఆత్మసిద్ధిలోని మొదటి దశ. ఇతరులను అర్థంచేసుకోడం, వారికి సానుభూతి చూపడం, ఇతరులపట్ల ప్రేమను, కరుణను, తోటివారన్న సంవేదనను పెంపొందించుకొనడం, ఇతరుల కోసం మనం కష్టపడి శ్రమించాలనుకోవడం — ఇవి ప్రాథమిక దశ. మొదటి దశ.

ఆ విధంగా సిద్ధించిన ఏకత్వమే అనేకాత్మక ఐక్యత. సామూహిక జీవులను సంఘీభావంగా ఏకం చేయడం అది. అది వాస్తవ ఏకత్వం కాదు. అనేకం చైతన్యంలో యదార్థ అస్తిత్వాలుగా ఉంటారు; ఒకే భగవత్ తత్వం వాటి విశేష ఫలితం.

ప్రధానమైన ఏకత్వం చూడడంతో నిజమైన జ్ఞానం ప్రారంభమవుతోంది — బహురూపాలలో ఒకే 'పదార్థం', ఒకే 'జీవం' ఒకే 'మనస్సు', ఒకే 'ఆత్మ' ను వీక్షించడం అది.

సమస్త సృష్టిలో ఉన్న వస్తువులలో 'ఆత్మ' ను సచ్చిదానందంగా వీక్షించడంతో జ్ఞానం పరిపూర్ణమవుతుంది. పదార్థం జీవనహేల; జీవం — పదార్థంలో శక్తి రూప విన్యాసం చేస్తున్న మనస్సు యొక్క లీల. మనస్సు సత్యం యొక్క లీల. లేదా అన్ని మానసరూపాలలో వివిధ దశలలో అస్తిత్వ సత్యానికి ప్రాతినిధ్యం వహించే కారణ — భావన యొక్క లీల. సత్యం సచ్చిదానందం యొక్క లీల. సచ్చిదానందం పరబ్రహ్మం యొక్క పరమపురుషుని యొక్క స్వీయ అభివ్యక్తి.

వ్యక్తిగత చైతన్యరూపాలుగా శతసహస్రంగా మారుతున్న సచ్చిదానందం, లేదా ఒకే 'ఆత్మ' అన్ని శరీరాలలోని ఆత్మ అని మనం గ్రహిస్తాం. 'ఆత్మ' యొక్క పరివ్యాప్త అస్తిత్వంలో అన్ని మనస్సులు, జీవితాలు, శరీరాలు ఒకే అస్తిత్వపు క్రియాశీలక రూపాలుగా మనం వీక్షిస్తాం. ఆత్మలో సర్వభూతాలను దర్శించడం, సర్వభూతాలలో ఆత్మను దర్శించడం అంటే ఇదే. పరిపూర్ణ ఆంతరంగిక స్వేచ్ఛకి, పరిపూర్ణ ఆనందంకి, శాంతికి ఇదే పునాది.

తీవ్రతలో, పూర్ణత్వంలో ఈ దర్శనం మరింత వృద్ధిచెందినప్పుడు, మన మనస్సుల నుండి జుగుప్స అంతర్థానం అవుతుంది. విభజన నుండి, ఇతరుల పట్ల మనలో చెలరేగే ప్రతికూల భావాల నుండి, మనల్ని ఆవరించిన బాహ్యపరిస్థితుల నుండి పైకి ఉబికే వికర్షణ, అయిష్టత, భయం, ద్వేషం కుంచించుకునిపోయే స్వభావం వంటి ఇతర వైకల్యాలు మాయమైపోతాయి. పూర్ణసమత్వం ఆత్మనిధిగా రూపుదిద్దుకొంటుంది. (ఈ స్థితిని సమత్వభావంగా గీత వర్ణించింది. పరిమితమైన స్వకీయ మానస స్థితికి, బాహ్య పరిస్థితుల తాకిడికి మధ్య సామరస్యం లోపించినప్పుడు కలిగే వికర్షణ (repulsion) ను జుగుప్స అని గీత వ్యాఖ్యానించింది దీనితో పాటు దుఃఖం, భయం, ద్వేషం, బాధ, అసౌకర్యం కలుగుతాయి. కోరికకు, బంధాలకు మూలమైన ఆకర్షణకు ఇది వ్యతిరేకం. ఆకర్షణ, వికర్షణలు తొలగిపోతే మనకు సమత్వస్థితి కలుగుతుంది.)

జీవులలో ఆత్మ దర్శనం

దర్శనం మాత్రమే చాలదు. దేనినైతే సాధకుడు అంతరంగంలో చూస్తాడో

అదే తను కావాలి. మేధస్సు దానిని అర్థం చేసుకొనేది, అంతర్నేత్రం వీక్షించేది సాధకుని చైతన్యంలో అన్ని భాగాలలో ప్రాతినిధ్యం వహించేటట్లు సమస్త ఆంతరంగిక జీవనం పరివర్తనం చెందాలి. సత్యసాక్షాత్కార సిద్ధి ద్వారా జీవనస్థితిగతులలో సత్సంబంధాలపై పూర్ణజ్ఞానం లభిస్తుంది. సాధకుడు తన ఆలోచనలకు, ఉద్వేగాలకు, ఉద్రేకాలను సర్దుబాటు చేసుకొంటూ, ఏకత్వ దర్శనంతో (ఏకత్వం అనుపశ్యతః — సర్వత్రా ఏకత్వాన్ని దర్శించడం) సాధకుని ఆత్మ సర్వత్రా భాసించే పరమాత్మకు పరివ్యాప్తమవుతుంది. అటువంటి సాధకుని చైతన్య ప్రదీప్తమైన దివ్యకార్యం పునరావృతం కావాలి — ఆ దివ్యకార్యం ఏమిటంటే, నిరంతరంగా స్వయం వ్యక్తమైన పురుషుడు తనలో అనేకత్వాన్ని అభివ్యక్తం చేయాలి. సర్వాని భూతాని ఆత్మైవ అభూత్ — ఆత్మే (Self-Being) సంభూతి పరంపరగా అంటే సర్వభూతాలుగా మారడం. దీని అర్థం ఇది. ఈ ప్రపంచంలో స్వయంవ్యక్తమైన అనేకానేక జీవులు విడిగా, ఇతరుల కన్నా భిన్నంగా వున్నట్లు, ఇతరుల నుండి, ప్రపంచం నుండి గరిష్ఠ ప్రమాణంలో లబ్ధిపొందడం — ఇది మనిషి దృక్పథం. అతని అహం తీరు. కాని భగవంతుడు తానే ఏకైక ఆత్మగా తానుగానే వున్న సమస్త భూతాలలో నివశిస్తూ, అందరికీ ఆధారభూతుడై, నిష్పక్షపాతంగా అందరికీ సాయంచేస్తూ, మానవజాతి దివ్యసాఫల్యం చెందే భవితవ్యాన్ని ఆవిష్కరిస్తూ, సృష్టి ఆరంభం నుండి, కోట్ల సంవత్సరాల నుండి నిర్ణయించిన నియమాలను అనుసరించి, సంభూతి విభూతుల పురోగమనశీలమైన సామరస్యం సాధించడం, పరిణామ ప్రస్థానం చివరగా, సచ్చిదానంద దివ్యరోచిర్నివహం, లేదా, అమృతత్వం, భూమికి అందివ్వడం — ఇదీ భగవంతుని దృష్టి, దివ్యదృష్టి. ఇదీ భగవంతుడు ప్రపంచాన్ని చూసే తీరు.

విశ్వచలిత చాలనంలో వసించే భగవంతుని దృష్టి అది. సాధకుడు తన మానవ, అహంకారపూరితమైన దృష్టిని దివ్య, పరమోన్నత, విశ్వజనీన దృష్టిగా మార్చుకుని ఆ సంసిద్ధిలో జీవించాలి. అందువల్ల 'సోహం' అనే మంత్రధ్యానంతో — ఏకత్వం, విశ్వాతీత పరమాత్మ జ్ఞానం పొందడం ముఖ్యం. 'సోహం' అంటే 'నేనే ఆయన' అని అర్థం. ప్రపంచంలోని అనేకత్వాన్ని కౌగలించుకోడానికి సాధకుని చైతన్యమయ అస్తిత్వాన్ని విస్తరింపచేసి, ఆ చైతన్యంలో వికాసం చెందాలి.

ఈశావాస్య ఉపనిషత్తులో ద్వివిధ ఆదర్శం, సమన్వయ ఆదర్శం: — విద్యకు

అవిద్యను, ఒకే పరమాత్మను, అనేకులైన జీవసమూహాన్ని ఒకేసారి కౌగిలిలోకి తీసుకోవడం. ప్రపంచంలో జీవించడం, మృత్యునియమావళిని, అమృతత్వ దివ్య సూత్రావళిగా మార్పుచేయడం, జన్మరాహిత్యంలోని శాంతి, స్వేచ్ఛను జన్మగ తమైన కార్యపరంపరతో ఒకేసారి పొందడం. (9-14 మంత్రచరణాలు)

సాధకుని చైతన్యంలోని నిమ్నభాగాలన్నీ ఈ సంసిద్ధికి తమ ఆమోదం తెలిపి తీరాలి. మేధస్సుతో వీక్షించడం చాలదు. విశ్వజనీన ప్రేమ, ఆనందాలకు హృదయం ఆమోదం తెలపాలి. ఎల్లెడలా భాసించే భగవంతుని, ఆత్మయొక్క పారవశ్య వివశ త్వానికి ఇంద్రియబంధిత మనస్సు ఆమోదం ఇవ్వాలి. జీవం తన చైతన్యంతో భాగంగానే ప్రపంచంలోని అన్ని శక్తులు, లక్ష్యాల అవగాహనకు తన ఆమోదం ఇవ్వాలి.

కర్తృత్వంలో దివ్యానంద ప్రాప్తి

ఈ ఆత్మ సంసిద్ధి పూర్ణమైన, నిండైన భగవదానంద ప్రాప్తి. కర్మను త్యజించ కుండా, కర్తృత్వంతోనే మోహదుఃఖాల నుంచి విముక్తి పొంది ఆనందం పొందడం విశేషం. ఆత్మ మోహానికి ఇక్కడ ఇక తావు లేదు. సృష్టి యవనిక వెనుక పరబ్ర హ్మను పొందిన ఆత్మకు సంభూతితో (జీవులతో) బంధం వుండదు. ఆకాంక్షించత గిన ప్రత్యేకమైనది ఏది వున్నా దానికి ఆత్మ పరిపూర్ణ విలువను ఇవ్వబోదు. సమస్తమూ ఆనందయోగ్యమైనదే. విలువయినదే. ఎందుకంటే ఆత్మయొక్క అభివ్యక్తికి మించి మరొకటి లేదు. ఏదైనా తన సొంతానికి కాదు. సమస్తంలో అభివ్యక్తమైన ఆత్మ కోసమే. కోరిక, భ్రమ రూపుమాసిపోతాయి. భ్రాంతిస్థానంలో జ్ఞానం, కోరిక స్థానంలో కర్తృత్వపు ఆనందం చోటు చేసుకుంటుంది. విశ్వమంతా తనదే, తన ఆనందం కోసమే. విశ్వపరిష్వంగంలోకి అంతనూ స్వాధీనం చేసుకోవడం.

అసలు దుఃఖానికి ఇసుమంత చోటు లేదు. అంతా సచ్చిదానందంగా, అనంత చైతన్య ప్రదీప్త అస్తిత్వంగా, అనంత, సంకల్ప విన్యాసంగా, అనంత ఆనంద విలా సంగా కనిపిస్తుంది. బాధ, దుఃఖం సైతం ఆనందానికి వైకల్య రూపాలుగా కనిపిస్తా యి. ఈ దుఃఖం, బాధ ఆనందాన్ని దాచివుంచుతాయి. నిమ్నజీవితాన్ని సంసిద్ధం చేస్తాయి. (పరిణామంలో బాధ అంతా బలాన్ని, ఆనందాన్ని సిద్ధం చేయడానికే). విముక్తి చెంది, పూర్ణత్వం పొందిన ఆత్మ ఆ ఆనందాన్ని తెలుసుకుంటుంది, అను

భవిస్తుంది. (అందువల్ల అవి ఆనందం యొక్క వికృతరూపాలే.) దుఃఖం, బాధ వంటి మారువేషాలు ధరించిన చిరంతన మహాసత్యాన్ని ఆత్మ సాధించింది. ఆ సత్యం తన చెంత వున్నందున బాధ, దుఃఖం అనే వైకల్యాలు ఆత్మను కలవరపర చలేవు.

కేవలం పరమాత్మ వైపు, అసంభూతి (non-becoming) వైపు ఆరోహణలో కాంక్ష, భ్రాంతులను త్యజించడం సాధ్యమే. పరిపూర్ణ బ్రహ్మజ్ఞానంతో ఈశ్వరుడు, జగత్తు మధ్య సమన్వయ సామరస్యాన్ని సాధించడం సాధ్యమే అవుతుంది. సమస్త భూతాలలో సచ్చిదానందంతో స్వేచ్ఛాయుతమైన, జ్యోతిర్మయమైన స్వీయ సాయుజ్యం ద్వారా విశ్వంలో భగవదభివ్యక్తిలో సమస్త వస్తువుల ద్వారా ఆనందం పొందడం సాధ్యమే.

శ్రీఅరవిందులు

కేనోపనిషత్తు పై శ్రీఅరవిందుల వ్యాఖ్యానం

మనలోని ఆత్మ బ్రహ్మతత్వాన్ని సిద్ధింపచేసుకొని మనం సంపాదించిన దివ్యశక్తులు, మనల్ని బలహీనతల నుండి, పరిమితుల నుండి, చీకటి నుండి, దుఃఖాల నుండి, సర్వ వ్యాపక మృత్యువు నుండి, కాపాడి ఉద్ధరిస్తాయి. జీవులందరిలోని, విశ్వభ్రమణ విన్యాసాలలోని ఒకే బ్రహ్మతత్వం నిండివున్నదన్న జ్ఞానంతో మనం వాటికి అతీతంగా అనంతాన్ని, సర్వ చిచ్ఛక్తి రూపాన్ని, సర్వజ్ఞాన తేజోరాశిని, ఆ దివ్య అస్తిత్వపు ఆనంద మహార్ణవాన్ని పొందగలం. పరవశించిపోగలం.

ఈ పాంచభౌతిక ఇహ లోకం లోనే, ఈ మృణ్మయ పరిమిత శరీరం లోనే. ఇక్కడే... ఈ మహావిజయాన్ని సాధించాలి. దీనిని సాధిస్తే, మనం మన నిజమైన అస్తిత్వ శిఖరాలు చేరుకోగలం. ఈ దృశ్యమాన ప్రపంచ నిమ్నబంధాలలో మనం ఎంతమాత్రం బంధింపబడబోము. కాని దానిని మనం ఇక్కడ సాధించలేకపోతే, విపరీత న ష్టం, వినాశనం తప్పదు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కె. యజ్ఞన్న

ఆత్మావిష్కరణ

ఆత్మసిద్ధికి మొదటి మెట్టు

అహం పట్టు నించి విముక్తి నొంది నీ నిజతత్వాన్ని తెలుసుకోవడం మొదటి మెట్టు. మిగతాదంతా దాని పర్యవసానంగా సంప్రాప్తించే ఉజ్వల ఫలితంగా సిద్ధింపచేసుకోవచ్చు. ఆ కారణం వల్లనే ఆధ్యాత్మికంగా ఒక పిలుపు వచ్చినప్పుడు అదే ఆదేశమనుకొని, మిగతా మానసిక, ధార్మిక, సాంఘిక కార్యక్రమాలన్నీ అజ్ఞానమైనవిగా పక్కకు నెట్టి, దాన్నే (ఆధ్యాత్మిక పిలుపునే) అనుసరించాలి.

ఆత్మావిష్కరణమే మొదటి మెట్టు. ఆత్మ అంటే ఆలోచనలు, ఉద్వేగాలు, కోరికలు మొదలైనవాటికి నెలవైన బాహ్య ఆత్మ కాదు. మనలో నిగూఢమై ఉండే దైవాంశ, అదే చైత్యపురుషసత్వము. అది మన స్వభావంలో ప్రబలమైనప్పుడు ఆత్మ సచైతన్యమయినపుడు మనస్సు, ప్రాణం, శరీరం దాని ఉపకరణాలుగా వాటి సక్రమ స్థానాల్లో ఉండి మనలోని సత్య, శివ, సుందర అస్తిత్వ మార్గదర్శకుని గుర్తించగలుగుతాం. సత్యజ్ఞానియైన ఆ దర్శకుడు తన ఉజ్వలశాసనంతో మన మేధస్సునూ, హృదయాన్నీ నియంత్రించి, ఆధ్యాత్మిక పరిపూర్ణత దిశగా మనలనూ, జీవితాన్నీ నడిపించగలడు. అంతే కాకుండా మనం అజ్ఞాన తమస్సులో చేసే పనుల్లో కూడా విచక్షణతో సజీవకాంతిని ప్రసరింపచేసే ఒక సాక్షిని మనలో కలిగి ఉంటాం. అది తప్పుడుదారులు తొక్కనీయని ఒక సంకల్పంగా మనస్సులోని అసత్యాన్నుంచి, సత్యాన్ని విడతీస్తూ, హృదయాన్ని తప్పుడు ఆహ్వానాలకు, తప్పుడు అవసరాలకు స్పందించనీయదు. ప్రాణిక మోహావేశాలు, ప్రాణిక స్వభావపు కుటిల అనృతాలు వాటి తామసిక ఆత్మాన్వేషణల నుంచీ, జీవితంలోని ఉత్సాహాన్నీ, దాని గతిలోని పూర్ణత్వాన్ని అది సంరక్షిస్తుంది. ఆ విధంగా ఆత్మసంసిద్ధికి ఇదే ప్రథమ సోపానము. అహం స్థానంలో, ఆత్మను, అంటే దివ్య చైత్యపురుష సత్తను ప్రతిష్టించటమే మొదటి మెట్టు.

మూలం: శ్రీఅరవిందుల

*

ప్రతి మానవునికీ అంతర్గతంగా నిగూఢంగా, ఉన్నతతరమైన చైతన్యాన్ని వహించే

అవకాశం ఒకటి ఉంది. అదే ప్రస్తుత సాధారణ జీవితపు అవధుల నధిగమించి ఒక విస్తారమైన ఉత్తమ జీవితంలో పాలుపంచుకొనే అవకాశము కలుగచేస్తుంది. అసాధారణ వ్యక్తులలో ఈ చైతన్యమే మార్గదర్శిగా, వారి జీవితాలను తీర్చిదిద్దుతూ వారి కెదురయ్యే పరిస్థితులనూ దానిపై వారి ప్రత్యేక స్పందనలనూ వ్యవస్థీకరిస్తుంది. సాధారణ మానవచైతన్యానికి అందని విషయాలనూ ఇది అందించి చేయలేని పనులను చేయిస్తుంది. వ్యక్తికి కేంద్రంలో దీపస్తంభాంలా వెలుగొందుతూ, దట్టమైన బాహ్యచేతనా స్థరాలను ప్రకాశింపచేస్తుంది.

లోనున్న చైత్యపురుషుని గుర్తెరిగి కనిపెట్టడమనేది ఎవరికి వారు సాధించుకోవలసినదే. దానికెంతో పట్టుదల, దృఢసంకల్పమూ, మనోనిశ్చయమూ అత్యవసరము. వారి వారి కెదురయ్యే కష్టాల ద్వారానే ప్రతివారూ తమ మార్గాన్ని నిర్దేశించుకోవాలి.

మొట్టమొదటగా నీవు చేయవలసినది నీలోనే ఉంటూ, నీ దేహానికి, పరిస్థితులకూ అతీతంగా ప్రత్యేకంగా ఏది ఉన్నదో దాన్ని వెతికి పట్టుకోవాలి. అది నీతో బాటుగా నీలో ఏర్పడిన నీ మానసిక రూపురేఖావిలాసాల వల్ల ఏర్పడినదిగాని, నీ భాషతో సంబంధించినది గానీ, నీ వుండే పరిసరాలకు సంబంధించినదీ, నీ ఆచార వ్యవహారాలకి సంబంధించినదికానీ, నీవు పుట్టిన దేశానికీ, నీ యుగానికీ సంబంధించినదీకానీ, కాదు. నీ అంతరాంతరాల్లోనే ఉండి, విశ్వజనీనమైనదీ, అనంతవ్యాప్తి కల్గినది అవిచ్ఛిన్నంగా కొనసాగుతున్నదీ ఏదైతే ఉన్నదో దాన్ని కనిపెట్టాలి. అప్పుడు నీవు వికేంద్రీకరించుకొని, విస్తృతి పొంది, పరివ్యాప్తమవు. అందరిలోనూ, అంతటా జీవించటం ఆరంభించు. వ్యక్తులను వేరుచేసే ఆటంకాలు వైదొలగిపోతాయి. అందరిలోనూ నీవు ఉంటావు. ఆలోచనలలో సారూప్యత కలుగుతుంది. భావసమైక్యత సిద్ధిస్తుంది. అనుభూతులు ఒకటవుతాయి. అందరి జీవితాలలో నీదీ ఒకటవుతుంది. అంతవరకూ జడజీవితంగా కనిపించినది ఒక్క సారి జీవనోల్లాసంతో తొణికిసలాడుతుంది. బండలు సచేతనమవుతాయి. చెట్లు సంవేదిస్తాయి. భావానుభూతులను పొందుతాయి. జంతువులు కూడా తమదైన మూగభాషలో భావవ్యక్తీకరణ చేస్తాయి. ఈ విధంగా సర్వమూ, కాలము, పరిమితి అని లేకుండా ఒక అద్భుత చైతన్యంతో ఉత్తేజం పొందుతాయి. చైత్యపురుషసిద్ధికి ఇది ఒక పార్శ్వం మాత్రమే. ఇంకా అనేక దృక్పథాలున్నాయి. అవన్నీ నీ అహంకారం కల్పించే ఆటంకాలను

అధిగమించడానికీ, నీ బాహ్య వ్యక్తిత్వప్రాకారాలను దాటుకొని వెళ్ళటానికి నీ ప్రతి స్పందనలలోని బలహీనతలను పోగొట్టడానికీ, నీ సంకల్పంలోని అసమర్థతలను తొలగించుకోడానికీ ఉపయోగపడుతాయి.

అయితే నేను లోగడ చెప్పినట్లు దీన్ని సిద్ధింపచేసుకొనే మార్గం చాలా విస్తార మైనది, జటిలమైనది. దారి పొడుగునా అనేకమైన బాధలు, ఆటంకాలు ఉంటాయి. వాటిని దాటి వెళ్ళాలంటే చాలా పట్టుదల కావాలి. చైత్యపురుష సిద్ధిని పొందట మంటే అజ్ఞాతదేశాలను కనుక్కోడానికి కీకారణ్యాల గుండా ప్రయాణం చేసే సాహ సికుల ప్రయాణం వంటిదే. దానికి ఎంతో ఓర్పు, సాహసం అవసరం. ఆ విధమైన సాహసం చేయాలనుకునే వారికి నేను కొన్ని సలహాలు చెపుతున్నాను.

ఈ మార్గంలో ముందుకు సాగాలనుకునేవారు మొట్టమొదట గమనించవల సిన అతి ముఖ్యమైన విషయం ఒకటి ఉంది. అదేమంటే ఆధ్యాత్మిక విషయాలను గురించి విచారించటం మనసుకు వశం కాదు. ఈ విషయమై చాలామంది రాసిన ప్పటికీ బహుకొద్దిమంది మాత్రమే దానిని తెలుసుకుంటారు. ఈ మార్గంలో ముందుకు పోవాలనుకునేవారు మనోవిశ్వాసాలకు, ప్రతిక్రియలకు దూరంగా ఉండాలి. ఇది అత్యంత ఆవశ్యకం.

తర్వాత స్వాంతసుఖాలనూ, సంతృప్తినీ, సంతోషాన్నీ వదలిపెట్టాలి. పురో గతి అనేది ఒక అగ్ని నీలో జ్వలించాలి. నీ కేమయినా అది నీ పురోగతి కోసమే ననుకొని ముందుకు సాగిపోవాలి.

చేసే పనులన్నీ ఆనందంగా చెయ్యి. అంతేకాని ఆనందం కోసం ఏ పనీ చేయకు.

ఎప్పుడూ ఉద్రేకానికీ, ఆందోళనకీ గురికావద్దు. అన్ని పరిస్థితులలోనూ ప్రశాం తంగా ఉండు. ఎప్పుడూ జాగరూకుడవై ఉండు. నీ పనిలో పురోగతిని గమనిం చు. ఇంకా ఎంత దూరం వెళ్ళాలో తెలుసుకో. ఆలశ్యం చేయకుండా పురోగమించు.

భౌతిక బాహ్య సంఘటనలకు విలువ నివ్వకు. అవెప్పుడూ గజిబిజిగా వికృ తంగా ఉంటాయి. అపుడు ఒకదాని కింకొకటి చేయటం అవుతుంది. వాస్తవమైనది మరుగున ఉండిపోతుంది.

ఎదుటవారి ప్రవర్తన గురించి ఎన్నడూ తప్పు పట్టకు — వారి ప్రవర్తనను, స్వభావాన్ని మార్చగల సమర్థత నీ కుంటే తప్ప.

నీవు ఏ పని చేస్తున్నప్పటికీ నీ ముందున్న లక్ష్యాన్ని మరువవద్దు. ఈ మహా విష్కారం కోసం నీవు చేసే కృషి అధికమైనదా, అల్పమైనదా అన్న తేడా లేదు. అన్నీ సమానమైన ప్రాముఖ్యత కలవే. ఏటొచ్చీ, వాటి విజయసాధన వేగిరమవచ్చు. ఆలశ్యం కావచ్చు. కాబట్టి భుజించే ముందు కొద్దిసేపు తినేదాని మీద ఏకాగ్రత నిలపాలి. నీవు తినబోయే ఆహారం నీ (ఆధ్యాత్మిక) ఆవిష్కార ప్రయత్నాలలో శరీరానికి తగిన శక్తిని, అందుకు అవసరమయ్యే ఓర్పు, పట్టుదలల పునాదిగ విజయవంతమవ్వాలని ఆకాంక్షించు.

నిద్రించే ముందు, అలసిన నీ నరాలు నిద్రలో పూర్తి విశ్రాంతిని పొంది తద్వారా మెదడుకు ప్రశాంతత, నిశ్చలత చేకూర్చి నిద్ర లేవగానే ద్విగుణీకృతశక్తితో సిద్ధి కోసం నీవు చేయబోయే ప్రస్థానంలో సహకరించాలని ఆకాంక్షించి, కొద్దిసేపు ధ్యానం చేయి.

ఏ పనైనా చేయటానికి ముందుగా కొద్ది నిమిషాలు ఏకాగ్రతతో నీ సంకల్పంపై దృష్టి పెట్టి ఆ పని పంథాలో సహాయపడాలని ఒకవేళ కాకపోయినా, ఆటంకమవకూడదని కోరుతూ ధ్యానించు.

మాట్లాడేముందు మాటలు నీ నుండి బయటకు రాకముందే వాటిని సమీక్షించుకొని అవసరమైన మాటలనే ప్రకటించు. నీ అశయసిద్ధికి, పురోగతికి ఏ రకంగానూ హని కలిగించే మాటలేమీ మాట్లాడకు.

సంక్షిప్తంగా చెప్పాలంటే, నీ జీవితగమ్యాన్ని, పరమావధిని ఎన్నడూ మరువద్దు. మహాసిద్ధి కోసమైన నీ సంకల్పం అన్నటికీ మించినదే అయి, పైన ఉండాలి. ఒక బ్రహ్మాండమైన కాంతి విహంగంలా, అది నీ సర్వకార్యకలాపాలను పర్యవేక్షించేదిగా ఉండాలి.

మూలం: శ్రీమాత

అనువాదం: అమరవాది ప్రభావతి, అమరవాది వెంకటరామ శాస్త్రి

సమాచార పత్రం

నవంబరు, డిశంబరు నెలల్లో ముఖ్యమైన రోజులు

నవంబరు, 17: శ్రీమాత మహాసమాధి వార్షికోత్సవ దినము.
నవంబరు, 20: శ్రీమాత పార్థివ దేహము సమాధి కావింపబడిన దినము.
నవంబరు, 24: సిద్ధి దినము — దర్శన దినము.
డిశంబరు, 5: శ్రీఅరవిందుల మహాసమాధి వార్షికోత్సవ దినము
డిశంబరు, 9: శ్రీఅరవిందుల పార్థివ దేహాన్ని సమాధి చేసిన రోజు.

శ్రీఅరవింద సొసైటీ, మహిళా సమావేశాన్ని, నవంబరు 21, 22 మరియు 23 (2009) తేదీలలో సొసైటీ బీచి ఆఫీసు ప్రాంగంణంలో నిర్వహిస్తోంది. వివరాలకు, శక్రటరీ, మహిళా విభాగం, శ్రీఅరవింద సొసైటీ, పుదుచ్చేరి — 605002 వారిని సంప్రదించవచ్చును.


శ్రీఅరవింద సొసైటీ (UK) వారు, శ్రీఅరవింద సొసైటీ, ఇండియా స్వర్ణోత్సవ సంవత్సరం సందర్భంగా పలు సమావేశాలు నిర్వహించారు. తే 15.8.2009 దీన, శ్రీ గోపాల భట్టాచార్యగారు ప్రసంగించారు. ఆగస్టు 16 న శ్రీ భట్టాచార్య గారు Harrow Arts కేంద్రంలో శ్రీ అరవిందుల బోధనలు గురించి ప్రసంగించారు.

డా. సంపూర్ణానంద మిశ్రాగారు మెస్సాచుసెట్సు USA విశ్వవిద్యాలయంలో, జూలై 16 నుంచి 19 వరకు నిర్వహింపబడిన ఆధ్యాత్మిక సమావేశంలోను, Oregon University, మరియు న్యూయార్కు నగరంలోను ప్రసంగించారు.

శ్రీమీరాంబికా ధ్యానమందిరం — Lathrop — అమెరికా — శ్రీఅరవిందుల పుట్టినరోజు, తే 15.8.2009 దిన, స్థాపించబడినది. శ్రీమతి అద్దేపల్లి ఉమాదేవి (ఆశ్రమవాసిని, పాండిచేరి) ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరై, నిర్వహించారు. దీని సంస్థాపకులు శ్రీ అద్దేపలి సంతోష్ కుమార్, కాలిఫోర్నియా (USA)

Rs. 15

సుఖనిద్ర పొందడం ఎలా



అఖిల

అఖిల భారత పత్రిక

డిశంబరు 2009

4.4.2009 — 4.4.2010

శ్రీఅరవిందులు పాండిచ్చేరి చేరుకుని నూరు వసంతాలు నిండిన సంవత్సరము.

19.9.2009 — 19.9.2010

శ్రీఅరవింద సొసైటీ స్వర్ణోత్సవ సంవత్సరం.

హాయిగా నిద్రించటమెలా?

ఆధ్యాత్మిక, నైతిక, లేదా, ఆచరణాత్మకమైనదే అయిన సమస్యతో సాయంత్రం అంతా సతమతమై పరిష్కారం, కనుగొనటంలో విఫలమై, ఇక నా వశం కాదు, అనుకున్నదానికి ఉదయం నిద్ర లేచాక స్పష్టమైన, నిర్దుష్టమైన పరిష్కారం కనుగోవటం — ఈ అనుభవం ఎవరికి ఉండదు?!

శ్రీమాత



నిద్రపోవట మెలాగో నేర్చుకో

హాయిగా నిద్రపోవట మెలాగో నేర్చుకోవాలి. శారీరకంగా బాగా అలసట చెందిన పుడు వెంటనే నిద్రకు ఉపక్రమించటం మంచిది కాదు. అలాగైతే నిశ్చేతనలో పడి పోతావు. బాగా అలసిపోయినపుడు అలా కాస్సేపు నరాల బిగువులు సడలించుకొనేటట్లు పక్క మీద వాలు. చెల్లాచెదురుగా పక్క మీద పడేసిన బట్టలా పడుకో. లోపలి కండరాలు ఎముకలు దూదిపింజెల్లా మెత్తగా తేలికగా అయిపోయి నట్లుగా ఉండు. మనసు కూడా అలాగే ఉంచుకో. సమస్యల పరిష్కారానికి అపుడు ప్రయత్నించకు. పగటి పూట నీలో ఉండే భావావేశాలు, సంవేదనలు, మనోగతభా వాలు, ఆ సమయంలో మర్చిపో. అలాటివన్నీ నిశ్చలంగా నీ నుంచి అలా అలవో కగా జారిపోనీ. నీకు నీవుగా వివశుడవైపో. ఈ ప్రక్రియ నీవు విజయవంతంగా సాధించినపుడు, నీలో — ఎప్పుడూ నిన్ను విడువకుండా ఎల్లప్పుడూ ప్రకాశిస్తూ ఉండే వెలుగు — దాని అనుభూతి నీకు కలుగుతుంది. కాకపోతే నీవీ సడలింపులు నీలో సాధించగలగాలి. చూశావా! అపుడు నీలో ఉన్న ఈ చిన్ని జ్వాల ఒక్కమాటు అనుకోకుండా దివ్యజీవనానికి, సత్యానికి, దివ్యచేతనకు ప్రగాఢమైన ఆకాంక్షగా నెమ్మదిగా ప్రజ్వరిల్లుతుంది. అంతరంగ సత్వ సమైక్యతలో అది, అలా అలా, మెల్లమెల్లగా, ఊర్ధ్వముఖంగా ప్రజ్వరిల్లుతుంది. అపుడక్కడ సర్వమూ సమీకృతం కాబడుతుంది. ఆ క్షణంలో కనుక నీవు నిద్రిస్తే, అంతకంటె ఉత్తమమైన నిద్ర నీ కెన్నడూ సాధ్యపడదు. ఇది నేను నీకు హామీ ఇస్తున్నాను. మరి నీ విది మాత్రం జాగ్రత్తగా చేయాలి. నిశ్చయంగా నీకు విద్ర వస్తుంది. అదేదో చీకటి కోణంలో నిద్రించే నిద్ర కాదు. ఆత్మకాంతిలో శయనించే శయనమది. అలా ఉదయం నిద్ర లేచినపుడు నీవు ఆహ్లాదంగా, ఆనందంగా, శక్తివంతంగా, ఆనాటి పనికి, సమర్థవం తంగా సిద్ధమై ఉంటావు.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

నిద్ర పట్ల శ్రద్ధ అవసరం

జాగ్రదవస్థకి సంబంధిత కార్యకలాపంతో పోల్చి చూస్తే, స్వప్నాలకు సంబంధించిన అంశం స్వల్ప ప్రాముఖ్యం కలిగినదిగాను, స్వప్న విషయం అప్రధాన విషయంగాను తోస్తుంది.

కాని మనం యీ ప్రశ్నను మరింత లోతుగా పరిశీలిస్తే, ఆ భావన సరికాదని తెలుస్తుంది.

మన జీవితంలో మూడింటి పైభాగం నిద్రలో గడచిపోతున్నదని ముందుగా జ్ఞాపకం పెట్టుకోవాలి. ఈ కారణంగా శారీరక నిద్రాసమయం పట్ల మనం శ్రద్ధ వహించడం అర్థమైన పనే.

శారీరక నిద్ర అని అంటున్నా. ఎందుకంటే దేహం నిద్రపోతున్నప్పుడు, మన సత్తా సమస్తమూ నిద్రపోతుందని భావించరాదు.

శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించబడిన పరిశోధనల అధ్యయన ఫలితాలను ఇరవై సంవత్సరాలకు పూర్వం Dr. Vaschid చే "నిద్ర — స్వప్నాలు" పేరుతో ప్రకటించబడినది. (ఈ మాట శ్రీమాత 1912 లో తెల్పినారు.)

ఈ పరిశోధనలు నిర్వహించిన శాస్త్రవేత్తలు, మన మానసిక చర్యలు యెప్పటికీ ఆగిపోవని, మన మెదడులో కలవరంగా రికార్డు కాబడే కార్యకలాపాలకు ప్రతిరూపాలే స్వప్నాలు అని చెప్పారు. కనుక మనం గమనించినా, గమనించకపోయినా, నిరంతరం కలలు కంటూనే వుంటాము.

ఈ కార్యకలాపాన్ని పూర్తిగా అణచివేయడము, కలలు లేని పరిపూర్ణ నిద్రను పొందడము, సాధ్యమే. కాని శరీర విశ్రాంతి అలాగే సంపూర్ణ మానసిక విశ్రాంతిపై సమగ్ర ఆధిపత్యం కలిగి వుండాలి. కాని యిదంత సులభసాధ్యమైన పని కాదు.

అయినా చాలామందిలో యిలాంటి కార్యకలాపం ప్రబలంగా ఉన్నతి కాబడుతున్నది. ఎందుకంటే శరీరం నిద్రావస్థలో ఉన్నపుడు అంతశ్శక్తులు, భౌతికజీవితం చేత వినియోగింపబడవు లేదా ఎంత మాత్రము కేంద్రీకరింపబడవు.

"మనిషి యొక్క నిద్రావస్థలో అతని అసలు[1] నైజం వెల్లడి కాబడుతుంది" అంటారు.

పగలంతా చురుకైన సంకల్పశక్తికి లోబడి వుంటున్న జ్ఞానేంద్రియసత్వము రాత్రిళ్ళు దానిపై ఏ నిర్బంధం వుండనందువల్ల అది చాల తీవ్రంగా ప్రతిస్పందిస్తుంది.

మనలో అణచివేయబడిన, నిద్రాణంగా, వుంటున్న కోరికలు, నిద్రలో తృప్తిని పొందుతాయి.

కోరికలు నిజమైన క్రియాత్మరూపకల్పనా కేంద్రాలు కనుక అవి మన లోపల, బైట, మన చుట్టూ వున్న పరిసరాల్లోను, వాటికి తృప్తికరమైన, అనుకూలమైన పరిస్థితులలోను విజృంభిస్తాయి.

ఈ విధంగా పగలు మన యెరుకతో సాగే ప్రయత్న ఫలితాలు రాత్రి కొన్ని గంటల్లో నాశనం చేయబడగలవు.

మనలో మన ఇచ్ఛాశక్తి అభివృద్ధి కోసం చేసే కృషిలో మనం యెదుర్కొంటున్న ఆటంకాలకు, మనం అధిగమించలేనట్లుగా కనపించే ఆటంకాలకు, యిదే ఒక ప్రధాన కారణం. ఇదలా యెందు కవుతుందో చెప్పలేం. ఎందుకంటే మన మంచితనం మనలో ఒక పరిపూర్ణ అంతర్భాగమైనదిగా మనం భావిస్తాం.

సాగుచేయని బీడుభూమిల్లో కలుపు మొక్కలు పెరుగుతాయి. మన లోపల కలుపు మొక్కలు మన కవసరం లేదు. కనుక మన నిశాక్షేత్రాలను చక్కగా సాగు చేసి, సత్ఫలితాలు పొందే సారవంతమైన క్షేత్రాలుగా మార్చుకుందాం.

ఇది నీకు అత్యంత ఆవశ్యకమైన, ఉపయుక్తమైన గాఢనిద్రకు, విశ్రాంతికి యేమాత్రం హానికరమని నీవెంత మాత్రం భావించకూడదు. అందుకు భిన్నంగా చాలమంది రాత్రిళ్ళు పగటివేళల కన్న యెక్కువ శ్రమగా వుంటుంటాయి. అందుకు కారణాలు, వారి అవగాహనకు అందవు. వారు ఇందుకు కారణాలను తెలుసుకుని వుండాలి. ఫలితంగా వారి సంకల్పశక్తి వాటిపై పనిచేయుటకు ప్రారంభించి, వాటి

---

1. శ్రీమాత దీన్ని వివరిస్తూ 27.1.55 న యిలా చెప్పారు: "వారి స్వభావము అంటే వారి అంతరాంతర స్వభావము కాదు. వారి స్వాధీనంలో లేని స్వభావసిద్ధమైన, దురతిక్రమమైన ప్రకృతి. నిద్రలో దానిపై సంకల్పం యొక్క ఆధిపత్యం నశిస్తుంది. సంకల్పం యొక్క ఆధిపత్యం తొలగినందువల్ల జాగ్రదవస్థలో చేయని పనిని నిద్రావస్థలో చేస్తారు"

దుష్ఫలితాలను తొలగిస్తుంది. అనగా నిష్ప్రయోజనకరములు, హానికరములునైన వాటి కార్యకలాపాలను ఆపివేస్తుంది.

మన రాత్రి (నిద్ర) మనకు కొంత నూతన విజ్ఞానాన్ని పొందుటకు, అనగా సమస్యల పరిష్కారానికి, మన అంతరాత్మ తోడి సంబంధం కల్పించడానికి, మరేదైనా ప్రయోజనకరమైన పని సాధించడానికి ఉపకరిస్తే, మనం మరింత తుష్టి, పుష్టి పొందినవాళ్లంగా మేల్కొనాలి.

నిష్ప్రయోజనంగా గడిపిన సమయాలే యెంతో శ్రమని కలిగిస్తాయి.

మూలం: శ్రీమాత.

అనువాదం: బి. నరసింహయ్య

నిద్ర పరమార్థం

ప్రశ్న: అమ్మా, కేవలం శరీరమునకు విశ్రాంతి నొసగుటయే నిద్ర యొక్క పరమార్థమా? లేక నిద్రకు వేరేదైనా అంతరార్థమున్నదా? నిద్రంటే యేమిటో విశదపరచండి.

ఏకాగ్రతకు, అంతరజ్ఞానానికి నిద్ర ఓ చురుకైన సాధన కాగలదు. అక్కడ పాఠం ఎలా నేర్చుకోవాలో తెలిసి ఉంటే, నిద్ర తప్పనిసరిగా, పూర్తిగా శిక్షణ పొందవలసిన శిక్షణాలయం. తత్ఫలితంగా అంతరసత్యాలు వారి వారి భౌతిక రూపమునకు, స్వభావమునకు స్వాధీనము గాక, స్వతంత్రముగ చరించుచూ, స్వీయ చైతన్యంలో, తమ జీవితమును తాము శాసించుకొనగల ఎరుక, సమర్థత గలవారలై చెలంగెదరు.

అయితే ఇది చాలమందికి తెలియదు. ఎందుకు నిద్రిస్తున్నారో వారికే తెలియదు. ఓ విధమైన సహజ జంతుప్రవృత్తిలో , ఆహారం భుజించిట్లే, జీవితం సాగించినట్లే, గాఢ నిద్రకి కూడా లోనవుతారు. మీరిప్పు డడుగుతున్నట్లుగా, నిద్రంటే ఏమిటన్న ప్రశ్న కూడా వారిలో మెదలదు. లక్షలాది మంది జీవులు తాము ఎందుకు నిద్రపోతున్నామోనన్న ఆలోచన లేకుండానే నిద్ర అనుభవిస్తున్నారు — ఏ తర్కం లేకుండా. జంతుప్రవృత్తితో వివేకరహితంగా అన్నం తిన్నట్లు, నిద్రొచ్చినప్పుడు నిద్రపోతారు. అయితే, నిద్ర అంతరంగం ఎరుకపడినవారికి, అదో విద్యాలయం,

అధ్యయన కేంద్రం. పగటి పూట పాఠశాల కంటే భిన్నమైన విలక్షణమైన రాత్రి విద్యాలయం

అది వేరొక ప్రయోజనం కోసం ఉద్దేశింపబడిన వేరొక విద్యాలయం. ఎవరైన ను, సాధ్యమైనంత మేరకు పరమావధి నందుకోవాలంటే గరిష్ట ప్రమాణాలు సాధిం చాలంటే, వారు తప్పకుండా వారి వారి రాత్రుల నెలా ఉపయోగించుకోవాలో తెలుసుకోవాలి. సర్వసాధారణంగా జనావళి, వారేం చెయ్యాలో అసలు తెలియక జాగరణ చేయటానికి ప్రయత్నిస్తుంటారు. అలాటపుడు ఫలితంగా వారు సాధిం చేది కేవలం భౌతిక మరియు ప్రాణిక సమతౌల్యం పోగొట్టుకొనటం — ఇంకా కొన్ని సందర్భాలలో, మానసిక సమతౌల్యం కూడా కోల్పోవటం.

భౌతిక మరియు శారీరక భాగాలన్నీ పరిపూర్ణమైన విశ్రాంతిని పొందవలసి నవే. అయితే ఆ విశ్రాంతి చైతన్యరహిత స్థితి లోనికి పడిపోవటం కాకూడదు. ఇది ఒక షరతు. ప్రాణిక సత్వమునకు తప్పకుండా నిశ్శబ్ద విశ్రాంతి ఉండాలి. ఇక ఈ మూడు విషయాలు విశ్రమిస్తుంటే అంతర సత్వము తనను గురించి తాను ఎరుక జేసుకొని, మేల్కాంచి శక్తివంతమై, ఉత్తేజపూర్ణమై, శ్రద్ధాళువై, క్రింది భాగాలను ప్రభావితం చేసి నిర్నిద్ర బుద్ధిగల స్పర్శను స్థిరపరుస్తుంది. ఎందుకంటే తనను తాను స్వయం వ్యక్తీకరించుకోటానికి వీలుకానంత అత్యంత ఆడంబరముతో కూడి నదియూ మరియూ అత్యంత స్మృతి దప్పినదియూనైన బాహ్యజీవితముతో అంతర సత్వ అనుబంధము అరుదుగా ఉంటుంది కనుక. ఇదీ నిద్రకు నిజమైన కారణం. ప్రస్తుత జీవనపరిస్థితులలో నిద్ర అత్యంత అవసరమైనదన్న విషయాన్ని ప్రక్కన బెట్టినా, కార్యశీలత మరియు విశ్రాంతి, ఒకదాని కొకటి ప్రత్యామ్నాయంగా కొన సాగాలి నిరంతరాయంగా.

శరీరమునకు విశ్రాంతి ఆవశ్యకము. అయితే నేను విశదపరచినట్లుగా, ఎలా నిదురపోవాలో నన్న ఎరుకగలవారు చాలా కొద్దిమంది మాత్రమే ఉన్నారు. వారు ఎలా నిద్రిస్తారంటే, మేల్కొనగానే పునరుత్తేజం పొందినవారిలా కనిపించరు. అసలు విశ్రాంతి పొందినవాళ్లుగా ఉండనే ఉండరు. అయితే నిద్ర అనేది తెలుసుకోవల సిన పూర్ణమైన విజ్ఞానశాస్త్రం.

మూలం: శ్రీమాత

అనువాదం: అన్నవరం ఆదిశేషయ్య

ప్రయోజనకరమైన, విశ్రాంతినిచ్చే నిద్ర

నిద్ర ఎప్పుడైతే అచేతనమై, మొద్దు నిద్రలోకి జారుతుందో అపుడు శరీరం ఉత్సాహాన్ని పుంజుకునే బదులు, బరువెక్కుతుంది.

మితంగా ఆహారం తీసుకుని, అతి అన్నిటా తగ్గించడం వల్ల చాలా గంటలు నిద్రపోయే అవసరం ఉండదు. నిజానికి నిద్రకి దానియొక్క గుణశ్రేష్ఠత ముఖ్యం కాని — ఎంతసేపు నిద్రపోయామన్నది ముఖ్యం కాదు. నిద్ర నిజమైన విశ్రాంతి నిచ్చి, అలసట పోగొట్టాలంటే, పడుకునే ముందు ఓ కప్పు పాలు కాని, సూపు కాని, పండ్లరసం కాని తీసుకోవడం మంచి నియమం. తేలికైన ఆహారం తీసుకున్నప్పుడు ప్రశాంతంగా నిద్రపోగలం. ఎన్నో పదార్థాలతో కూడిన బరువైన భోజనం మంచిది కాదు. అపుడు నిద్ర కలత నిద్ర అవుతుంది. చికాకు కలిగిస్తుంది. భయంకరమైన దుస్వప్నాలు కూడా వస్తాయి. లేదా అది బరువుగా, నిరుత్సాహంగా ఉంటుంది. ఇంక అన్నిటికన్న ముఖ్యమైనది మానసిక స్థితి. మనసును నిర్మలంగా ఉంచుకోడం, ఉద్రేకాలకు దూరం కావటం — అవసరం. అదీ కాక ఎన్నో కోరికల చుట్టూ, తిరిగే మనసును అదుపు చేసుకోవాలి. ఉద్రేకాలను ఉపశమింపచేసుకోవాలి. రాత్రి పడుకునే ముందు కొంచెం విశ్రాంతిగా, స్థిమితంగా ఉండడం మంచిది. పడుకునే ముందు ఉద్రేకపూరితమైన చర్చ చేసినా, ఉత్కంఠ కలిగించే పుస్తకం చదివినా, వాటి ప్రభావం మనసుపై పడుతుంది. అలాంటపుడు కొంచెం సేపు నిశ్శబ్దంగా ఉంటె మంచిది. విశ్రాంతివల్ల మెదడు కాస్త నిశ్చలత పొందుతుంది. లేకపోతే శరీరానికి విశ్రాంతి దొరికినా, వేడెక్కిన బుర్రకి విశ్రాంతి ఉండదు. ఇక ధ్యానం చేసే వారు — ఉన్నత విషయాలపై, విశ్రాంతి నిచ్చే ఆలోచనపై కొన్ని నిమిషాలపాటు ఏకాగ్రత వహించటం, ఓ మంచి ఉన్నత ఆకాంక్షతో విస్తృత చైతన్యం కోసం ధ్యానం చేయడం మంచిది. దీనివల్ల నిద్ర చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఎందుకంటె అది నిద్రని అచేతనలో పడనివ్వదు.

ప్రశ్న: నిద్రపోయే ముందు ఏ విధంగా విశ్రాంతి తీసుకోవాలి?

చాలా రకాలుగా తీసుకోవచ్చు. నీకు ఒకటి చెప్తాను. నీ శరీరాన్ని స్వస్థతగా ఉంచు. పడక కుర్చీలోనో, పక్క మీదో కాస్సేపు వాలు. నరాలను సడలింపచేసుకో. పూర్తి విశ్రాంతిని సాధించు. మొత్తం శరీర భాగాలన్నింటినీ లేదా ఒకదాని తరు

వాత ఒకటిగా తేలికపర్చుకో. ఇది చాలా ఆసక్తికరమైన ప్రక్రియ. తరువాత నీ మెదడును నిశ్శబ్దీకరించు. ప్రశాంతంగా ఉంచు. శరీరాన్ని చిరిగిన గుడ్డలా, నిర్లక్ష్యంగా, పక్క మీద జారవిడుచు. మెదడుని మాత్రం చాలా నిశ్చలంగా ఉంచు.... ఆ తరువాత వెంటనే నిద్రపోకు. నెమ్మదిగా, క్రమంగా ఆ స్థితి నించి నిద్రలోకి తెలియకుండా జారుకో. మరునాడు నిద్ర లేచేసరికి పూర్తి శక్తితో ఉల్లాసంగా ఉంటావు. అయితే నువ్వు చాలా అలసిపోయి, ఈ శరీరానికి విశ్రాంతి నివ్వక, కాస్త నిదానించక మొద్దు నిద్రపోయావనుకో. అది నిస్సత్తువతో, అచేతనతో కూడిన నిద్ర అవుతుంది. ఆ నిద్ర ప్రాణికమును నిస్సత్తువలో ముంచుతుంది. అయితే వెంటనే ఏ ప్రభావాన్ని చూపకపోవచ్చు. అయినా బాగా అలసినపుడు కాస్త విశ్రాంతి తరువాత నిద్రించడం మంచిది.

నిద్రపోయే ముందు కాస్తంత విశ్రాంతి పొందినపుడు నిద్ర చాలా హాయిగా, ఆనందంగా ఉంటుంది. నెమ్మదిగా నరాల అలసట వదిలించుకుని కాలుచేతులు సాచుకుని రిలాక్స్ అయినపుడు అది చాలా హాయిగా ఉంటుంది. అది అనుభవంలో తెలియవలసిందే. నరాల ఉద్రిక్తతతో నిద్రపోతే కలత నిద్రలో ప్రతిక్షణం అటూ యిటూ కదులుతూ, అసౌకర్యంగా నిద్రపోతాం. అలాంటి నిద్ర ఏ మాత్రం విశ్రాంతి నివ్వదు.

మూలం: శ్రీమాత

అనువాదం: డి. సత్యవాణి

నీవు నిద్రకు ఉపక్రమించే ముందు ఏకాగ్రతతో అలసిన నీ నరాలకు ఉపశమనం కలగాలని, నీ మెదడు విశ్రాంతితో నిశ్చలంగా ఉండాలని, నీవు రెట్టింపు శక్తితో, ఉత్సాహంతో మళ్ళీ మరో ఉదయాన్ని స్వాగతీకరించి, నీ పయనం సాగించాలని గట్టిగా, ఆకాంక్షించు.

శ్రీమాత

ఉదయం మేల్కొనేసరికి అలసట యెందుకని?

ప్రశ్న: ఉదయం మేల్కొనేటప్పటికి ఎందుకు అలసిపోయి ఉంటారు? మంచి నిద్ర పట్టాలంటే ఏమి చేయాలి?

ఉదయం మేల్కొనేటప్పటికి అలసిపోయి ఉండటానికి కారణం, భయంకర మన తమస్సు. అంతే తప్ప వేరొకటి కాదు. యోగసాధన ప్రారంభించిన మొదట్లో నా శరీరంపైన దీని ప్రభావాన్ని నేను స్వయంగా గమనించాను. శరీరము పరివర్తన చెందనంత కాలము, ఇది అనివార్యం.

వెలికిలగా పరుండి కండరాలను, నరాలను అన్నింటిని సడలించాలని — దీనిని సులువుగా నేర్చుకోవచ్చు — పరుపుపై పరిచిన చింపిరిగుడ్డ మాదిరిగ ఉండాలంటాను. ఇక ఏదీ ఉండదు. మనస్సును కూడ ఈ విధంగా చేయగలిగితే, పడుకోబోయే ముందున్న దానికన్నా మేల్కొనేటప్పటికి అధికమయ్యే అలసటకు కారణమయ్యే వెర్రి కలలను వదిలించుకోవచ్చు. మెదడుయొక్క ఆంతరిక కణాల అదుపు లేకుండా కొనసాగే ప్రవర్తన వల్లనే అలసట అధికమవుతుంది. కనుక ఒక పూర్తి విశ్రాంతి ఎలాంటి అలజడి లేక సర్వము స్థంభించిపోయే ఒక రకమైన పరిపూర్ణ విశ్రాంతస్థితి కలగాలి. అయితే, ఇది ప్రారంభం మాత్రమే.

తదుపరి, స్వయంగా నఖశిఖ పర్యంతము, వెలుపలి నుండి లోతట్టు వరకు నీ సర్వస్వాన్ని సాధ్యమైనంత మేరకు, ఆత్మార్పణ గావించాలి. అహం యొక్క నిరోధతత్వాన్ని సాధ్యమైనంత మేరకు నిర్మూలించాలి. అప్పుడు — నీ మంత్రజపమును, అలాటిదేదైనా నీకు ఒకటి ఉంటే — ఆరంభించాలి — లేదా నీకు స్ఫూర్తిదాయకమైన ఏదో ఒక పదము, నీ హృదయాంతరాళంలో నుంచి తనకు తానుగా, పైకెగసినది, ఒక ప్రార్థనలాంటిది, నీ ఆకాంక్షనంతా సంక్షిప్తపరచేది — దానిని అవసరమైనన్ని సార్లు జపించాలి. తర్వాత అలాంటి అలవాటు నీకు ఉండి ఉన్నట్లయితే, ఒక పారవశ్యస్థితిలోకి ప్రవేశిస్తావు. ఆ పారవశ్యము నుండి నిద్రలోకి జారుకుంటావు. పారవశ్యస్థితి ఉండవలసినంత కాలం ఉంటుంది. పిమ్మట అతి సహజంగా నీకు తెలియకుండానే నిద్రలోకి జారుకుంటావు. కాని ఈ నిద్ర నుండి మేల్కొనగానే ప్రతి విషయం నీకు జ్ఞాపకముంటుంది. ఆ నిద్ర, పారవశ్యత యొక్క కొనసాగింపు వలె ఉంటుంది.

ప్రధానంగా, నిద్ర యొక్క ఏకైక ప్రయోజనం ఏమనగా, పారవశ్య ప్రభావము శరీరమంతటా వ్యాపించుటకుగాను దానిని ముందుగా జీర్ణించుకొనునట్లు చేస్తుంది. సూక్ష్మక్రిముల వలన ఏర్పడే విషపదార్థాలను తొలగిస్తుంది. శరీరం రాత్రి పూట చేపట్టే సహజ ప్రక్రియకు తోడ్పడుతుంది. నీవు మేల్కొనగానే శరీరభారం మచ్చుకైనా ఉండదు. పారవశ్య ప్రభావం మాత్రం కొనసాగుతూంటుంది.

పారవశ్యానుభూతిని చవిచూడనివారికి కూడ నిద్రించుటకు ముందు ఒక మంత్రమును, పదమును జపించుటయో లేక ఒక ప్రార్థన చేయుటయో ఉచితము. కాని అది సజీవంగా ఉండాలి. నా ఉద్దేశ్యము వాటికి ఏదో మేధోపరమైన ప్రాధాన్యత ఉండాలని కాదు. అలాంటిదేదీ కాదుగాని, ఒక ప్రకంపన కలిగించాలి. శరీరంపై దాని ప్రభావం అసాధారణంగా ఉంటుంది. శరీరం ప్రకంపించుట ప్రారంభిస్తుంది. నెమ్మదిగ నిద్ర ముంచుకొస్తున్నట్లుగ నీ మీద నీకున్న పట్టు సడలిపోతుంది. శరీరం మరింతగ ప్రకంపిస్తుంది. నీవెటో వెళ్లిపోతావు. ఇదే తామసిక ప్రవృత్తిని ఉపశమింపచేసే మార్గము.

కలత నిద్రకు కారణము తమస్సే. ఈ కలత నిద్ర రెండు రకాలు. ఒకటి — గడచిన దినమందు నీవు సలిపిన కృషి ఫలితాన్నంతా కోల్పోయినట్లు నీ శరీరం భారంగా కృంగిపోయినట్లుగ వుంటుంది. రెండు. నీ సమయాన్నంతా పోరాటంలో గడిపితే ఎలా శారీరకంగా, మానసికంగా అలసిపోతావో, ఆ విధంగా ఉండే నిద్ర. నేను గమనించినది ఏమిటనగా, నీ నిద్రను దఫదఫాలుగ విభజించినట్లయితే, (వ్యక్తి దీనిని అలవరచుకోవచ్చు) రాత్రుళ్లు మెరుగవుతాయి. అనగా, నీ సహజచైతన్యస్థితిని , నీ సహజ ఆకాంక్షస్థితిని ఒక నిర్ణీత విరామం తదుపరి తిరిగి పొందగలగటం — చైతన్యం యొక్క పిలుపుకు ప్రతిస్పందించినట్లుగా — కాని అందుకు అలారం గడియారాన్ని వాడకూడదు! పారవశ్యస్థితిలో నున్నప్పుడు దానిని హఠాత్తుగ భంగపరచుట శ్రేయస్కరము కాదు.

నిద్ర కుపక్రమించే ముందు, ఈ విధంగా నిర్ణయించుకోవాలి: “నేను ఫలానా సమయానికి మేల్కొంటాను” (చిన్నతనంలో ఇది బాగా చేయగలరు). మొదటి విడత నిద్రకు కనీసం మూడు గంటలైనా కేటాయించాలి; చివరి విడతకు ఒక గంట చాలు. కాని మొదటి నిద్రకు మాత్రం మూడు గంటలు తప్పనిసరిగా ఉండాలి. మొత్తం మీద కనీసం ఏడు గంటలయినా పరుండాలి. రాత్రులను ఎక్కువగ సద్వి

నియోగపరచాలంటే, ఆరుగంటల సమయం సరిపోదు. (సహజంగానే నేను దీనిని సాధనా దృక్పథంలో చూస్తున్నాను.)

రాత్రులను సద్వినియోగపరచుట అత్యుత్తమము: దీని ప్రభావం రెండు రకాలుగా ఉంటుంది. వ్యతిరేక ప్రభావ మేమిటనగా, నీవు ఆర్జించినది నీ నుంచి చేజారిపోయి, వెనుకంజ వేయిస్తుంది. ఇది నిజంగా చాలా బాధాకరం గదా — ఇక అనుకూల ప్రభావము, నీవు కొంత పురోగమనం సాధిస్తావు, ఆ పురోగమనాన్ని కొనసాగిస్తావు కూడ. నీవు రాత్రిని సద్వినియోగం చేసుకుంటావు. కాబట్టి అలసట అనేది మచ్చుకైనా ఉండదు.

రెండు విషయాలను నీవు తప్పనిసరిగా తొలగించాలి: ఒకటి అచేతనావస్థ సృష్టించే స్తబ్ధతలోకి జారిపోవుట మరియు అధోచేతన, అవచేతనలు పైకెగసి నిన్ను ముట్టడించి నీలో ప్రవేశించటం; రెండు, ప్రాణిక మరియు మానసిక చైతన్యము తీవ్రతరమైన కారణంగా, సమయమంతా పోట్లాటలతోను, ఒక విధంగా, భయానక పోరాటాలతోను గడిపే స్థితి. పిడికిటి పోట్లు తిన్నట్లుగా మిగిలిన గాయాలతో ఆ స్థితి నుండి బయటపడతారు — వారు నిజంగా పిడికిటి పోట్లు తిన్నట్లే — 'తిన్నట్లుగా' కాదు. ఒకే ఒక విమోచన మార్గం నాకు కనిపిస్తుంది: నిద్ర యొక్క స్వభావాన్ని మార్పు చేయుట.

*

ప్రశ్న: నిద్రలో కూడ చైతన్యం కలిగి ఉన్నట్లయితే, మెదడు నిద్రిస్తుందా? లేదా?

మెదడు ఎప్పుడైనా అసలు నిద్రిస్తుందా? అది నిద్రించే దెప్పుడు? ఇది అన్ని విషయాల్లోకి క్లిష్టమైనది. మెదడును నిద్రపుచ్చుటలో నీవు కృతకృత్యుడవు కాగలిగితే అది అద్భుతమే. అది ఎలా పరుగులు తీస్తుందో! లక్ష్యం లేకుండా విహరిస్తూంటుంది. మెదడుకు విరామం ఇవ్వాలి అని నేనడంలోని అంతరార్థం ఇదే. దీనిని నీవు సక్రమంగా నిర్వర్తించినట్లయితే నీ మెదడు ఒక నిశ్శబ్ద ప్రశాంత వాతావరణంలోకి ప్రవేశిస్తుంది. అది అద్భుతంగా ఉంటుంది. దానిని నీవు పొందినప్పుడు, ఆ స్థితిలో ఐదు నిమిషాలుండగలిగితే చాలు, అటు పిమ్మట నీవు ఎంతో చురుకుగా, ఉల్లాసంగా, నిర్మలంగా మారతావు. కుప్పలుగా పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించగలుగుతావు.

ప్రశ్న: మెదడు ఎప్పుడూ పని చేస్తూంటే రాత్రులందు ఏమి జరిగిందో మనకు

ఎందుకు జ్ఞాపకముండదు?

ఎందుకనగా, చైతన్యమును నిజకార్య నిర్వహణలో నున్నప్పుడు దానిని నీవు పట్టి ఉంచుకోలేవు. ఇంకొక కారణం కూడ ఉండవచ్చు. నీ మెదడులో ఏమి జరుగుతోందో అది నీకు జ్ఞాపకం ఉండి ఉంటే, బహుశ నీవు తీవ్ర భయభ్రాంతులకు లోనయ్యేవాడివి. పరస్పర ఘర్షణలకు లోనవుతూ వికటతాండవమాడుతున్న ఆలోచనలతో నిండిన మస్తిష్కము నిజానికి ఒక పిచ్చివాళ్ల కేంద్రంగా ఉంటుంది! ఒక వ్యక్తి బంతులను ఒకేసారి అన్ని దిశలకు విసురుతున్నట్లుగా ఉంటుంది. కనుక దానిని నీవు చూచినట్లయితే కొంత కలత చెందుతావు.

మూలం: శ్రీమాత

అనువాదము: అందుగులపాట కైలాసపతి, జానకి

నిద్రించే సమయము

ప్రశ్న: అమ్మా, త్వరగా నిద్రపోవటం త్వరగా మేల్కొనటం, ఎందువలన మంచిది?

జవాబు: సూర్యాస్తమయం తర్వాత ఒక విధమైన శాంతి భూమిని ఆవరిస్తుంది. ఆ శాంతి నిద్రకు ఉపయుక్తమైనది.

సుర్యోదయం తర్వాత తీక్షణమైన శక్తి భూమిని చేరుకోవడం వలన మన దైనందిన పనులు చేసుకొనుటకు ఉపయోగపడుతుంది. నీవు ఆలశ్యముగా నిద్రకుపక్రమించి ఆలశ్యముగా మేల్కొనుట ప్రకృతిసిద్ధమైన శక్తులకు విరుద్ధము గాన అది వివేకమైనది కాదు.

*

ప్రశ్న: అమ్మా, నిద్రపోవుటకు అర్థరాత్రికి ముందు సమయం అర్థరాత్రి తర్వాత సమయం ఎందువలన మంచిది?

జవాబు: అర్థరాత్రి వరకు, ఆ సమయం సూర్యాస్తమ సమయానికి ప్రతీక. అర్థరాత్రి దాటిన తర్వాత తొలిగంట నుండీ సూర్యోదయము మొదలవునుగాన అర్థరాత్రికి ముందు గంటలు నిద్రకు ఉపయుక్తమైనది.

పసిబిడ్డ దినచర్య లెటులుండినా, అతనికి వలసినన్ని గంటలు తప్పనిసరిగా

అతను నిద్రించాలి. నిద్రించే గంటలు వయసును బట్టి మారుతాయి. ఊయాల లోని బిడ్డ నిద్రించే సమయము మెలకువగా ఉన్నదాని కంటె ఎక్కువగా ఉండాలి. బిడ్డ వయసు పెరిగేకొద్దీ నిద్రించే సమయం తగ్గుతూ ఉంటుంది. కాని యుక్తవయసు వచ్చు వరకు చక్కని గాలి తగిలే ప్రదేశంలో నిద్రించు సమయము 8 గంటలు తగ్గకుండా ఉండాలి. అర్థరాత్రి ముందు గంటలలో నిద్రించుట వలన నరములకు తగిన విశ్రాంతి లభిస్తుంది.

*

15 సంవత్సరములలోపు వయసుగల పిల్లలు తప్పనిసరిగా రాత్రి 9 గంటలకు ముందే నిద్రించాలనే నిర్ణయాన్ని నేను నొక్కి వక్కాణిస్తున్నాను.

మూలం: శ్రీమాత

అనువాదం: సిద్ధులగారి త్రివేణి

పీడ కలలు

ప్రశ్న: పీడకలల్లో సత్వం యొక్క ఏ భాగం శరీరం లోంచి బయటకి పోతుంది?

నీ ప్రాణిక సత్వంలో ఒక భాగం — అంతేకాని పూర్తిగా కాదు — బయటకి షికారుకి పోతుంది. పూర్తిగా పోతే దానికి అపస్మారక స్థితి కలుగుతుంది. సత్వంలో కొన్ని ఎప్పుడూ అత్యంత అసహ్యకరమైన స్థలాలకు పోతూంటాయి. అందుకే అలాటి వాటికి రాత్రులు చెడుగా ఉంటాయి. ఈ నిశావిహారాలు ఎన్నో లెక్కలేనన్ని సంభావ్యతలతో కూడి ఉంటాయి. అలా విహారానికి వెళ్లిన సత్వభాగం దుర్బలమైనదే కావచ్చు. సత్వంలో అది అల్పమైనదే కావచ్చు. అది చాలు నీలో ఏ కాస్తంత పీడకలమైన కన్పించేందుకు.

మీకు తెలుసు. మీరు నిద్రలో ఉన్నపుడు అంతరంగ సత్వాలకు శరీరంపై పట్టు సడలుతుంది. అవి బయటకి పోతాయి. స్వేచ్ఛగా ఉంటాయి. పరిమిత స్వేచ్ఛయే అది — అయినా అది స్వేచ్ఛయే. అవి తమ స్వీయక్షేత్రాలలో నివాసాలకి పోతాయి. మనస్సు అయితే మరీని. ఇది శరీరాన్ని పట్టి ఉండదు. ప్రాణిక సత్వం శరీరాన్ని దాటిపోయినా, శరీరంపై ఇది కొంత కేంద్రీకతృమై ఉంటుంది.

అయితే ఒక విషయం. మనసు ఎంతో మృదువైన పదార్థం.అందుచేత అది మాన సికంగా ఏ కాస్తంత ఆలోచించినా ఆ వ్యక్తిని అంటిపెట్టుకుని ఉంటుంది. కనీసం పాక్షికంగా అయినా. నీ వొక స్థలాన్ని గురించి బలంగా ఆలోచిస్తే చాలు, నీ మనసు యొక్క కొంత భాగం (ఆలోచన) అక్కడ ఉంటుంది. మనసుకు దూరప్ర సక్తి లేదు. శరీరాన్ని మాత్రమే కేంద్రీకత్వం చేసుకుని మనసు ఉండాలంటే అందుకు తగినంత శిక్షణ కావాలి. చక్కటి ప్రస్ఫుటమైన ఆకృతి దాల్చి ఉన్న మనసు కలిగి ఉండటం ఏ కొద్దిమందికో కాని సాధ్యం కాదు. అది చుట్టు తిరుగుడు తిరుగుతూ వస్తూ పోతూ ఉండే మేఘశకలాల వలె ఉంటుంది. భౌతిక శరీరానికి సాదృశరూ పంగా ప్రాణికసత్వం ఉన్నప్పటికీ కూడా, దాని విశిష్ట లక్షణం దానికి ఉండాలి. కేంద్రీకృతమై ఉండాలి. మానసికం ఇంకా విస్తృతమై ఉండాలి. ఇది పూర్తిగా ఏకీ కృతం కాబడి, పరిపూర్ణ వైశిష్ట్యంతో చైత్యపురుష సత్తకి చుట్టూ వ్యవస్థీకరింపబడి ఉండాలి. అపుడే అది తన నిర్దిష్ట రూపాన్ని సంతరించుకుంటుంది.

ప్రశ్న: మానసికమైన పీడకలలు అంటే ఏమిటి?

బుర్ర గందరగోళంగా ఉన్నపుడు, అలజడి ఉద్రేకంతో ఉన్నపుడు, మితిమీరిన శ్రమపడినపుడు, అదుపుతప్పినపుడు, అనేక ఆకృతులు అక్కడ రూపుదిద్దుకుని, మనసు వాటికి నిలయమవుతుంది. వ్యక్తి వాటికి వశమై ఉంటాడు. ఇలా జరగటం సర్వసాధారణం. ఈ ఆకృతులన్నీ తనకు తానే వ్యక్తి రూపొందించుకుంటాడు. ఇవన్నీ వివేకవంతమైన జాగృత చేతన అధీనంలో ఉండవు. అందుచే అవన్నీ బుర్రలో పిచ్చి ఉద్రేకంలో కరాళనృత్యం చేయటం ఆరంభిస్తాయి. ఏవేవో కలగా పులగంగా చిక్కుముడులతో ఢీ కొంటూ ఘర్షణ పడుతూ ఉంటాయి. ఇదంతా వాస్తవానికి మిథ్యాభావనల సంఘర్షణే. ఇదంతా ప్రాణిక పీడకలలకి పది రెట్లు అల జడి సృష్టిస్తుంది — గొప్ప మనశ్శాంతి, నిశ్చలత, పటిష్ఠమైన స్వచ్ఛ తేజస్సు నీలోకి తెచ్చుకొనగలిగే శక్తి నీకు లేకపోతే, నిన్ను చంపాలనుకున్న నీ శత్రువుతో పోరాటానికి సంబంధించిన పీడకల ఏదైనా అది పీడకలల్లో కెల్లా అత్యంత దుర్భర మైనది. ఆ పోరాటంలో నీ శత్రువుని అత్యంత క్రూరంగా దెబ్బలు కొడతావు. కాని నీవు కొట్టే ఆ దెబ్బలు వాడికి తగలవు. నీ బలాన్నీ, శక్తినీ, అందుకు పూర్తిగా విని యోగిస్తావు. అయినా నీ ప్రత్యర్థిని నీవేమీ చేయలేవు. వానిని తాకటం కూడా నీకు వశం కాదు. వాడు మళ్లీ నీకు ఎదురుగానే ఉంటాడు. నిన్ను భయపెడతాడు. నీకు

ఊపిరాడనీయడు. నీ శక్తినంతటినీ కూడతీసుకుని వానిని కొట్టడానికి ప్రయత్నిస్తావు. కాని వాడినేదీ స్పృశించదు. పోరాటం అలా సాగుతూనే ఉంటుంది. బాహా బాహీ ముష్టియుద్ధంలా సాగుతుంది. ఓ జీవుడు నీ మీద పడతాడు. ఇది నీకు మరింత బాధాకరంగా ఉంటుంది. అందుచేతనే నీవు నీ శరీరాన్ని విడిచి బయటికి పోకూడదు — అందుకు నీకు అవసరమైన శక్తి, స్వచ్ఛత ఉంటే తప్ప. ఇలాంటి పీడకలల్లో నీవు ఉపయోగించాలనుకునే శక్తి భౌతికశక్తి యొక్క 'స్మృతి'. నీకు ఎంతో శారీరక శక్తి ఉండవచ్చు. నీవు ముష్టియుద్ధ వీరుడవే కావచ్చు. అయినా ప్రాణికలోకంలో అశక్తుడవే అయిపోతావు. ఎందుకంటే నీకు కావలసిన ప్రాణికశక్తి నీకు ఉండదు. ఇక మానసిక పీడకలల గురించి చెప్పాలంటే — మనసులో అవి కరాళ నృత్యమే చేస్తాయి. పిచ్చెక్కించేస్తాయి.

మూలం: శ్రీమాత

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

స్వప్నాలు

ప్రశ్న: అమ్మా పగలంతా బాగా చైతన్యవంతంగా ఉంటే రాత్రి నిద్రలో మంచి మంచి కలలు వస్తాయా?

అది దేని మీద ఆధారపడి ఉంటుందో చెప్పడం కష్టము. ఏదో ఒక విషయంలో నీ స్వభావం నీకు అర్థం కావలసిన అవసరం ఉంటే, దానికై నీవు చేయాల్సిన కృషి ఏమిటో నీకు తెలిపే సూచనగా ఒక కల రావచ్చు.

బహుశా అది ప్రతి ఒక్కరినీ కనిపెట్టి ఉండే ఒకానొక చైతన్యంపై ఆధారపడి ఉంటుందేమో. వ్యక్తిలో ఏ కొంచెం వికాసమున్నా అది వారికి సూచన లిచ్చి నడిపించగలదు.

సర్వసాధారణంగా ఎక్కువ భాగం కలలు పనికిమాలినవే, వాటి వల్ల అలసటే తప్ప ఏమీ ఉండదు. అవి రాకుండా చేసుకోవచ్చు. దానికి కొంచెం ప్రయత్నం అవసరం. నిద్రించేముందు మనసును ఏకాగ్రం చేసుకొని తనలోని మంచి విషయం మీద కేంద్రీకృతం చేయాలి. అది ఆకాంక్షతో కానీ, ప్రార్థన ద్వారా కానీ చేసుకొని ఆ తర్వాతే నిద్రించాలి. ఇష్టమైన వాళ్లు ప్రయత్నపూర్వకంగా ధ్యానం చేస్తూ

క్రమంగా నిద్రలోకి జారుకోవచ్చు. ఈ విధంగా చేస్తే నిన్ను కలవరపెడుతూ విశ్రాంతి పొందనీయని వ్యర్థస్వప్నాలను తప్పించుకోవచ్చు. ఈ విధంగా చేయ గలిగినప్పుడు నిద్రలో వచ్చేవి కేవలం కలలుకాక మంచి అనుభవాలే అవుతాయి. నీకు ఎంతో ఉపయోగకరమైన సూచనలు, నీ అభివృద్ధికి తోడ్పడే విషయాలుగా నీకు తెలుస్తుంది. అవి ఒక్కొక్కసారి నిన్ను నీవు ప్రశ్నించుకుంటే దొరకని సమాధా నాలు కావచ్చు. కొన్ని కొన్ని పరిస్థితుల్లో నీవు నిర్ణయం తీసుకోలేని సమస్యకు ఒక నిర్ణయానికి రావటానికి దోహదం చేస్తాయి. ఇంతే కాకుండా ఒక్కొక్కసారి నీలో నీకు తెలియకుండా ఉన్న గుణం ఒకటి నీ పురోగతికి అడ్డం తగులుతూ, నీ చైత న్యాన్ని మసగబరుస్తూ ఉంటే, దాన్ని ఒక సంకేతపూర్వకంగా తెలియజేస్తూ ఒక కల వస్తుంది. దానితో నీకు స్పష్టంగా తెలుస్తుంది. అపుడు నీవు ఏమి చేయాలో అది చేయవచ్చు.

ఇదంతా కూడా పగలు నీవు ప్రవర్తించే తీరు మీద ఆధారపడదు. కలలన్నీ పగలు నీవు చేసినదాని మీద కాకుండా నీవు నిద్రకు ఉపక్రమించే పద్ధతి మీద ఆధా రపడి ఉంటాయి. నిద్రించటానికి ముందర క్షణంలో నీ ఆకాంక్ష మనస్ఫూర్తిగా ఉంటే అది సరిపోతుంది. నిద్ర అనేది నీ చైతన్యాన్ని చీకటిమయంగా చేయకూడదనీ, తెలియనివి తెలుసుకొని అనుభవం పొందాలనీ ఆకాంక్షించాలి. అనుభవాలు ఎల్ల ప్పుడూ కలుగకపోయినా, కలిగే అవకాశం ఉంది.

ప్రతివారూ నిద్రలో అనేక పనులు చేస్తూంటారు. అవి వారికి తెలియవు. కానీ చైతన్యవంతంగా ఉండటం నేర్చుకుంటే వాటిని నియంత్రించుకోవచ్చు. ఆ విధ మైన చైతన్యాన్ని పొంది అంటే నిద్రపోయేటపుడు నీ పైన అంటే నీ చర్యలపై నీకు నియంత్రణ ఉన్నట్లయితే నీ నిద్ర సుఖవంతంగా ఉంటుంది. సాధారణంగా నిద్ర పోయే ముందు నీవు ఎంత అలసట చెంది ఉంటావో నిద్ర లేచాక అంత అలసటా గమనిస్తావు. ప్రొద్దున లేచినప్పుడు అలా బడలికచెంది ఉన్నావంటే రాత్రి నిద్రలో ఎన్ని పనికిమాలిన పనులు చేసి ఉంటావో తెలుస్తుంది. ప్రాణికలోకం అంతా చుట్టబె డుతూ ఉండటంవల్ల కానీ, మనస్సంతా వెర్రిమొర్రి వ్యవహారాలతో చెదరిపోతూ ఉండటం వల్ల కానీ అలిసిపోయి ఉదయం లేచినపుడు బడలికగా ఉంటావు.

వాటిని నియంత్రణ చేయకలిగితే పూర్తిగా ఆపేయవచ్చు. నిద్రపోవటానికి ముందే ఆ పని చేయవచ్చు. నీ మనస్సును నిశ్చలంగా ఉంచుకుని విశాలంగా,

ప్రశాంతంగా నిలకడగా ఉండే విశాల సముద్రంగా భావిస్తూ నిద్రిస్తే అప్పుడు అద్భుతంగా నిద్ర పడుతుంది.

అయినా కూడా నిద్రలో ప్రాణికలోకాల్లో తిరుగాడే వాళ్ళుంటారు. ఆ లోకాలు చాలా చెడ్డవి కాబట్టి అటువంటివారు తిరిగి వచ్చాక విపరీతంగా అలసిపోతారు. ఒక్కొక్కసారి జబ్బులు పడతారు. దానికి కారణం ఆ చెడ్డ ప్రదేశాల్లో తిరగటమే కాక అక్కడ దెబ్బలాటలు కూడా. అయితే ఇది కూడా జాగ్రదావస్థలో వారుండే చైతన్యస్థితిని బట్టి ఉంటుంది. ఉదాహరణకు పగలంతా నీ వెవరి మీదైనా కోపంగా ఉంటే, రాత్రి నిద్రలో ఈ విధమైన ప్రాణిక పోరాటాల్లో ఇరుక్కుంటావు. ఇలా జరుగుతూ ఉంటుంది.

*

ఇప్పుడిక స్వప్నాలు, స్వప్నలోకాలలో మనం ఏ విధంగా నడుచుకోవాలో తెలుసుకుందాం. మొట్టమొదట చైతన్యవంతంగా ఉండి నీ కొచ్చే కలలను పరిశీలించుకో. వాటికీ పగటి పూట జరిగిన సంఘటనలకీ మధ్యన ఉండే సంబంధమేమిటో గమనించు. రాత్రి జరిగినదేమిటో గుర్తున్నప్పుడు ఆ పరిస్థితులకీ పగలు జరిగేవాటికీ మధ్యనుండే అన్వయం బోధపడుతుంది. సాధారణంగా నిద్రలో మానసిక, ప్రాణిక భూమికల్లో ఏవో చేష్టలు జరుగుతాయి. అవే నీ మెలకువ ఘడియల్లో నీ చైతన్యాన్ని నడిపిస్తాయి. ఇంకా చెప్పాలంటే ఎవరైనా తమని తాము నిష్ణాతులుగా చేసుకోటం కోసం తపనతో పగలంతా కృషి చేస్తూ రాత్రి నిద్రపోయి మళ్లీ తెల్లవారి లేచినప్పుడు క్రిందటి రోజు సాధించినదాని జాడేదీ లేనట్లు తెలుసుకుంటారు. అప్పుడు కృషి మళ్లీ ప్రారంభించాల్సిందే. దీనికి కారణం పగటిపూట శ్రమపడింది గానీ, సాధించిందికానీ తేలికైన బాహ్యాంశలు, జాగృత భాగాలు మాత్రమే. ఇవి కాక వ్యక్తిలో నిద్రాణంగా అంతరాంతరాల్లో ఉన్న అంశలు చాలా ఉంటాయి. ఇంతవరకూ చేసినదేమీ వాటికి అంటదు. నిద్రలో వారు ఈ చైతన్యరహిత భాగాల పట్టులోకి వెళ్లిపోవడం వల్ల పగటి పూట చైతన్య ఘడియల్లో కష్టపడి సాధించిందాన్నంతా ఇవి కబళించివేస్తాయి.

చైతన్యవంతంగా ఉండు. పగలూ రాత్రీ కూడా చైతన్యవంతంగా ఉండాలి. చైతన్యవంతంగా ఉండగలిగితే నియంత్రణ వస్తుంది. కలలు బాగా గుర్తుండేవారికి స్వప్నావస్థలో, అది కల మాత్రమే, నిజం కాదు అనే విషయం జ్ఞప్తిలో ఉండటం

అనుభవమే. అలా కనక తెలిస్తే నీ చైతన్యాత్మక సంకల్పంతో స్వప్నానుభవగతినే మార్చుకోవచ్చు.

నీ చైతన్యం వృద్ధి పొందుతున్నకొద్దీ పగలు నిన్ను నీవు ఏ విధంగా నియంత్రించుకుంటావో అంతగానూ, లేక ఇంకా ఎక్కువగానూ నిద్రలో నిన్ను నీవు నియంత్రించుకోవటం మొదలుపెడతావు. కారణం శరీరయంత్రాంగపు పట్టు రాత్రి వేళ నీపై ఉండదు కాబట్టి. దైహిక చైతన్య ప్రక్రియలన్నీ చాలా కఠినమైనవి. మానసిక, ప్రాణిక ప్రక్రియలకన్నా మారే స్వభావం తక్కువ కావటం వల్ల వాటిని నియంత్రించడం చాలా కష్టము. రాత్రి పూట మానసిక, ప్రాణిక భాగాలు చాలా చురుకుగా వ్యవహరిస్తాయి. పగటి పూట భౌతిక చైతన్యం తనను తానుగా వాటి స్వేచ్ఛావిహారాన్ని, వ్యక్తీకరణను నొక్కిపట్టి ఉంచుతుంది. రాత్రి పూట ఈ అదుపు లేకపోవటం వల్ల వాటి సహజగతులన్నీ బయటపడుతూ ఉంటాయి.

*

ఎక్కువ భాగం కలలు అర్థం పర్థం లేనివే. నిద్రలో భౌతికమానసం అదుపుతప్పి యాంత్రికంగా పనిచేస్తూండటం వల్ల ఆ కలలు వస్తాయి. ఆ సమయంలో మెదడులోని కణాలు, బాహ్యంగా గ్రహించిన దృశ్యాలకు అనుగుణంగా, మానసిక చిత్రాలు, ముద్రణలు సృష్టించే యంత్రాలుగా పనిచేస్తూ ఉంటాయి. ఈ కలలు చాలా భాగం అప్పుడున్న శరీర పరిస్థితుల వల్ల — ఆరోగ్యస్థితి, జీర్ణక్రియ, నిద్ర సౌకర్యము — వీటి వల్ల వస్తాయి.

తనని తాను పరిశీలించుకొని, కొన్ని జాగ్రత్తలు పాటిస్తే, ఈ రకమైన శారీరకంగా బడలిక కలిగించే, పనికిరాని కలలను నివారించుకోవచ్చు.

ఇంకొక తరహా కలలుంటాయి. మనస్సుకు సంబంధించిన కొన్ని శక్తుల వెర్రిమొర్రి చర్యలవల్ల చెత్త చెత్తగా ప్రకటితమౌతాయి. అవన్నీ కూడా కొన్ని భావాలు, సంభాషణలు, జ్ఞాపకాలు కలగాపులగంగా కలిసిపోయి ఈ విధంగా క్రమరహితంగా ప్రకటితం అవుతాయి.

ఇలాంచి స్వప్నాలు ముందే గమనార్హంగా ఉంటాయి. ఎందుకంటే ఇవి క్రమరాహిత్యమైన కార్యకలాపాలు. మానసికసత్వంలో అనుభావ్యమయే గందరగోళాన్ని ఇవి తెలియచేస్తాయి. ఇదిలా యెందుకు జరుగుతుందంటే మానసిక సత్వము, మన ఇచ్ఛాశక్తి అధికారానికి లోబడి ఉండకపోవటం వల్ల ఈ సత్వము ఇంకా వ్యవస్థీ

కరించబడనిది, క్రమబద్ధీకరింపబడనిది, పరిణతి చెందనది కావటం వల్ల. అందుచేత అది ఇంకా స్వయం ప్రతిపత్తి కలిగిన జీవనానికి అనర్హమైనది అని ఇది తెలియచేస్తుంది.

ఇటువంటి కలల మాదిరే ఉంటూ ఇంతకంటే ముఖ్యమైన పర్యవసానాన్ని సూచించే కలల గురించి నేను మీకు చెప్పాను. అవి ఆంతరంగిక సత్త నుంచి వెలువడతాయి. మనం దానిపై విధించిన ఆంక్ష నుంచి ఒక్క క్షణం నిడుదలైతే వెంటనే మన మీద కసి తీర్చుకోటానికి ప్రయత్నిస్తుంది. అప్పుడొచ్చే కలల వల్ల మనకు తెలియకుండా లోపలున్న మన వైఖరులు, అభిరుచులు, ప్రేరణలు, కోరికలు తెలుస్తాయి. ఇంతకాలం ఆదర్శసిద్ధి కోసమైన మన సంకల్పం ఎక్కడో మన అంతరాళంలో చీకటి కోణాల్లో, వీటిని దాచిపెట్టడంవల్ల మనకి తెలియకుండా ఉండిపోతాయి.

మనకేమీ తెలియకుండా వాటిని లోలోపలే మూసిపెట్టి ఉంచుకోకుండా ధైర్యంగా, సాహసంగా వెలుపలకి తెచ్చి ఎప్పటికీ మన నుంచి నెట్టివేసుకోగలగడమే మేలైన పని అని నీకు బాగా అర్థమై యుంటుంది.

అందువల్ల మన కలలను శ్రద్ధగా పరిశీలించుకోవాలి. మనం ఆత్మవిజయం పొందటానికి, మనకి గొప్ప సహాయం చేసే శిక్షకులుగా అవి మనకి ఉపయోగపడతాయి.

మూలం: శ్రీమాత

అనువాదం: అమరవాది ప్రభావతి, అమరవాది వెంకటరామశాస్త్రి

ప్రస్తుత దేహ పరిస్థితికి నిద్ర అనివార్యం. క్రమానుగతంగా అవచేతనపై నియంత్రణ సాధించిన తరువాత నిద్ర ఇంకా మరింత చైతన్యవంతమవుతుంది.

శ్రీమాత

సమస్యను మనలో ఉంచుకొని రాత్రివేళ నిద్రిస్తే ఆ సమస్య మన అస్తిత్వం యొక్క ఉన్నతసీమల లోనికి పోతుంది. తెల్లవారేసరికి మనకు సమాధానం, సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ఎందుచేతనంటే, మన బాహ్యచేతనకు తెలియని విషయాలు, అక్కడ, మన చేతన యొక్క లోతుల్లో తెలుస్తాయి.

*

ప్రశ్న: అమ్మా! "నిద్రను క్రమంగా యోగనిద్రగా మార్చుకోవాలి అంటే అర్థం యేమిటి?"

యోగనిద్ర అంటే చేతనారహిత నిద్రకు బదులు — దాన్ని నిద్ర అనే అనదలచుకొంటే — అదొక సచేతనమైన, ఎరుక కలిగిన నిద్ర. దేహం పూర్తి విశ్రాంతి స్థితిలో వుంటుంది. నాడీ వ్యవస్థ, కండరాలు బిగువు లేకుండా సడలించబడి సంపూర్ణ విశ్రాంతితో సేదదీరడం. ఆ స్థితిలో అతనికి సంపూర్ణ విశ్రాంతి లభిస్తుంది. కాని ఆతని ఆంతర అస్తిత్వం (the Spirit) ఎరుక కలిగే వుంటుంది. అది ప్రాణికాన్ని మనస్సును గూడా విశ్రమింప జేయగలిగేటంతటి ఎరుకతో వుంటుంది. చేతనకు పూర్ణస్వేచ్ఛను కలిగించడానికి, మిగతా భాగాలన్నింటినీ ప్రశాంతంగా, నిశ్చలంగా, ఏ కదలికలూ లేకుండా చేస్తుంది. అపుడు చేతన కూడా కావాలనుకుంటే విశ్రాంతి తీసుకొంటుంది. లేదా అవసరముంటే పనిచేస్తుంది. ఏదేమైనప్పటికీ, తను కోరుకున్న విధంగా చేయడానికి, కోరుకొన్న సీమలకు వెళ్ళడానికి స్వేచ్ఛ కలిగి వుంటుంది. ప్రస్తుత భౌతిక అస్తిత్వానికి సంబంధించిన అంశాలు అంటే మనస్సు, ప్రాణికం, భౌతికం పూర్తిగా విశ్రమించి ఒక రకమైన చలనరహితస్థితిలో వుంటాయి. అందువల్ల యెక్కువ గంటల నిద్రతో అవసరం వుండదు. దేహాన్ని ఈ విధమైన విశ్రాంతి స్థితిలో వుంచగలిగితే, నిద్రకు కావలసిన సమయాన్ని బాగా తగ్గించుకోవచ్చు. కాని అందుకోసం చాలా శ్రమించాలి, సచేతనంగా శ్రమించాలి. చూడూ — అది చాలా సచేతనంగా, చాలా పట్టుదలతో కొనసాగే శ్రమయై వుండాలి. అయినా వెనువెంటనే ఫలితం లభించదు, కొన్ని సంవత్సరాలు పట్టవచ్చు. ఒకసారి దానిని సాధించగలిగితే, అతని నిద్ర మీద అదుపును సాధించినట్లే, నిద్ర లేకుండా చేసుకోగలడు. ఉదాహరణకు, చాలామంది నిద్రకు ఉపక్రమిస్తున్న

ప్పుడు బాగానే వుంటారు. కాని ఉదయం నిద్ర లేచినపుడు బాగా చీకాకుతో వుంటారు. గత దినం వాళ్లు సాధించినాదాన్నంతా పోగొట్టుకుంటారు. అలా ఎందుకు జరుగుతుందంటే వాళ్లది అచేతనమైన నిద్ర. ఆ నిద్రలో వాళ్ళు ప్రాణికం లోనికో, లేదా మానసికస్థాయి లోనికో లేదా సూక్ష్మ భౌతికం లోనికో, పయనిస్తారు. అవాంఛనీయ స్థలాలలోనికో, లేదా, నిశ్చేతన లోనికో పోయి అంతకు ముందు వాళ్లు సంపాదించుకొన్నదానిని అచట పోగొట్టుకొంటారు.

యోగనిద్ర చాలా అవసరం. కాని దాన్ని సాధించుకొనడం అంత తేలిక కాదు. చాలా కష్టంతో సాధించబడే స్థితుల్లో అదొకటి. కాని యోగనిద్ర చాలా ఉపయోగకరమైన స్థితి. అత్యంత సన్నిహితంగా వుండి, మార్గదర్శకత్వం వహించేవారు లేకుండా దానిని అనుష్ఠించడం చాలా కష్టం. ఎందుకనంటే ప్రతి సూక్ష్మవిషయాన్నీ చక్కగా పాటించకపోయినట్లైతే, మతిలేని పనులు చేసే ప్రమాదంలో పడిపోయే అవకాశం వుంది.

ఏదెలా వున్నా, నిద్ర కుపక్రమించే ముందు ఏ విధమైన ముడుచుకుపోవటాడాలు, బిగుసుకుపోవడాలు లేకుండా, పక్క మీద ఒక మృదువైన దుప్పటిలా దేహం పరుచుకొన్నదన్నట్లుగా పడుకోవాలి. ఏ విధమైన బిగుతూ ఎక్కడా లేకుండా, సావధానుడవై, భౌతికదేహంలో ఎక్కడా వత్తిడి లేకుండా, సడలించుకొని ప్రయత్నించు. పూర్తి భద్రతగల పద్ధతి ఇది. తర్వాత ప్రాణికాన్ని శమింపజేయడం: ప్రాణికాన్ని శాంతింప చేయాలి. చేయగలిగినంతగా దాన్ని శమింపజెయ్యి. వీలైనంత ప్రశాంతంగా కదలికలు లేకుండా వుండేట్లు చూడు. అలాగా మనస్సును గూడ, దాన్ని కూడా అలాగే వదిలెయ్యి. ఏ మాత్రం మానసిక కార్యకలాపాన్ని నీకుగా నీవు కల్పించుకోకుండా దాన్ని వదిలెయ్యి. మస్తిష్కం మీద ఏ వత్తిడీ లేకుండా బలమైన శాంతి, స్థిర అచంచలత, వీలైనంత నిశ్చల నీరవతలతో ఉండేలా, చూడు. ఏ ఆలోచనలూ పెట్టుకోవద్దు. అందుకోసం ప్రత్యేకంగా శ్రమించకు. ఏమీ చేయకు, ఏమీ చేయవద్దు. అక్కడ కూడా కదలికలన్నింటినీ విడిచెయ్యి. కాని వాటిని ఒక రకమైన నిశ్చల నీరవతలో, వీలైనంత మహనీయ ప్రశాంతస్థితిలో సేద దీరేటట్లు వదిలెయ్యి.

ఒకసారి నీ విదంతా సాధించిన తర్వాత, నీ స్వభావానికి తగినట్లు ఒక ప్రార్థన లేక ఆకాంక్షను లేదా రెంటిని దానికి జోడించు. ఆ ప్రార్థనలో, ఆకాంక్షల ద్వారా

చేతనకు, శాంతి, లభించాలని, నిద్రలో వున్నంత కాలం, దుష్టశక్తుల నుండి రక్షణ కల్పించాలని, నిశ్చల ఆకాంక్ష, రక్షణలపై ఏకాగ్రత నిలిచి వుండాలని అర్థించు. నిద్రాస్థితిలో దైవకృప నిన్ను గమనిస్తూండాలని నిద్రించు. ఆ తర్వాత నిద్రలోకి వెళ్లు. ఇది అత్యంత శుభప్రదమైన స్థితుల్లో సాగే నిద్ర. యోగనిద్ర. ఆ తర్వాత ఏం జరుగుతుందనేది, నీ అంతఃప్రేరణల మీద ఆధారపడి వుంటుంది. దీన్ని అలాగే విడువకుండా సాగిస్తే, ఇలా ప్రతి రాత్రి కొనసాగిస్తే కొంతకాలం పోయాక దాని ప్రభావం కన్పిస్తుంది.

మామూలుగా, పరుండి, వీలైనంత త్వరగా నిద్రలోనికి జారుకోవాలని, సాధారణంగా ప్రయత్నిస్తారు. ఎలా నిద్రించితీరాలో ఏమాత్రం తెలియని స్థితిలోనే అది జరిగిపోతుంది. కాని నీవు క్రమం తప్పకుండా నేనింతకు ముందు చెప్పినట్లు చేస్తే, దాని ప్రభావం కన్పిస్తుంది నీకు. రాత్రి సమయాల్లో జరిగే దండయాత్రలు, తద్వారా నివారించబడ్తాయి. పడుకొనే ముందు అంతా బాగానే వున్నా లేచేసరికి ఏమీ బాగుండదు. ఇది పూర్తిగా ముప్పు కలిగించే విషయం. రాత్రి వేళ, సంపూర్ణ చేతనారహిత స్థితిలో ఎక్కడో అతని కేదో జాడ్యంతో సంపర్కం కలిగి వుంటుంది.

*

ప్రశ్న: స్వప్నరహిత నిద్ర స్వభావ ం యెలా వుంటుంది?

కలలు లేని నిద్రని నీవు చెప్పేది, రెండు స్థితులలో ఏదైనా కావచ్చు. నీవు కన్న కల నీకు గుర్తు లేకపోవడమో లేక సంపూర్ణంగా చేతనరహితస్థితిలోనికి అంటే దాదాపు మరణం లాంటి స్థితి — మృత్యువును చవిచూచు స్థితిలో పడిపోవడమో జరిగి వుంటుంది. కాని మరో స్థితిగల నిద్రకు కూడా అవకాశముంది. ఆ స్థితిలో నీవు పరిపూర్ణ, నిశ్చల నీరవతలో ప్రవేశిస్తావు. నీ అస్తిత్వపు భాగా లన్నింటిలో ప్రశాంత చలనరహిత స్థితి నెలకొని నీ చేతన సచ్చిదానందంలో లయమై పోతుంది. దాన్ని నిద్ర అనలేం. ఎందుచేతనంటే అది చాల తీవ్రమైన సచేతన స్థితి. ఆ స్థితిలో నీ వుండేది కొద్ది నిముషాలే అయినా, ఆ కొద్ది నిముషాలు, కొన్ని గంటలు సాగే సాధారణ నిద్ర కన్నా అధిక విశ్రాంతిని, ఉల్లాసాన్నీ కలిగిస్తాయి. ఆ స్థితిని

యాదృచ్ఛికంగా నీవు పొందలేవు. దానికి చాలా సుదీర్ఘ శిక్షణ అవసరం[1].

మూలం: శ్రీమాత

అనువాదం: కె. వి. రావు

శ్రీమాత సమాధానాలు

ప్రశ్న: నేను బాగా నిద్రపోవటానికి ప్రాణిక సత్వాన్ని ఏ విధంగా ప్రశాంతపరచగలను? ఆకాంక్షతోనా?

శ్రీమాత: మరియు ఏకాగ్రతతో, వ్యాకులత్వాన్ని నిరాకరించే ఇచ్ఛతోను.

*

ప్రశ్న: ఈ ప్రాణిక ప్రపంచంతో సంబంధాల నుంచి అలసట చెందకుండా ఏ విధంగా తప్పించుకోగలను?

శ్రీమాత: నిద్రపోయే ముందు నీ ఇచ్ఛాశక్తిని ఉపయోగించాలి. నిద్రలో ప్రశాంతతను ఇచ్చే విశ్రాంతికై ఇచ్ఛ కలిగి వుండాలి.

*

ఆహారం తగ్గించినంత మాత్రాన నిద్ర సచైతన్యమవదనేది నా అనుభవం; శరీరం వ్యాకులతకు లోనవుతుంది, కాని అది ఏ విధంగానూ చైతన్యస్థితిని అధికం చేయదు. చక్కటి, గాఢమైన, ప్రశాంతమైన నిద్రలోనే ఎవరికైనా తమ లోలోతులలో ఉన్న అంతరంగ భాగంతో సంపర్కం ఏర్పరచుకోగలుగుతారు.

*

ప్రశ్న: మధుమయి మాతా, గత ఇరవై అయిదు సంవత్సరాలు నుంచీ నిద్రలేమి నన్ను వేధిస్తోంది. దాని నుంచి నాకు విముక్తిని కలిగించమని అర్థిస్తున్నాను. నిన్న రాత్రి నేను కేవలం ఒక గంట మాత్రమే నిద్రపోయాను. గత ఇరవై రోజులుగా రాత్రిళ్ళు నాకు చాల మటుకు నిద్ర లేదు. డా. జడ్., ఏమంటున్నారంటే, ఈ వ్యాధికి మందు లేదు, ఒక్క నిద్రమాత్రలు తప్ప అని. కాని కొన్ని సంవత్సరాల క్రితం తమరు నిద్రమాత్రలు వేసుకోరాదని చెప్పారు.

[1] సచ్చిదానందంలో విశ్రమించడాన్ని గురించి దివ్యమాత 27.1.1951; 15.12.1951 (CWM Vol. 4, pp. 62-63; 107-08) లోనూ 23.6. 1954 (CWM Vol.6, pp.185-86) లోనూ మాట్లాడారు.

శ్రీమాత: నిద్రలేమిని నివారించడానికి ఒకటే మార్గం. ఇచ్ఛాశక్తితో మానసిక నిశ్శబ్దాన్ని పొంది, నిద్ర అవసరమే లేకుండా చేసుకోగలగాలి. నీవు ఇచ్ఛతో నిశ్శబ్దాన్ని అందుకోగలగటానికి, శరీరాన్ని తప్పనిసరిగా సంపూర్ణ విశ్రాంతిని పొందే పరిస్థితిలో ఉంచి, పక్క మీద హాయిగా చాచుకుని పడుకోవాలి. తరువాత సంపూర్ణమైన మానసిక నిశ్శబ్దత కలిగే దాకా అంతర్ముఖుడవు అవుతూ, సుఖమైన గాఢనిద్రలోకి జారుకోవాలి. దానిని స్వేచ్ఛగా పొందడం తెలిసి, ప్రతి రాత్రి క్రమపద్ధతిలో చేసినప్పుడు, నీకు నిద్ర అవసరం లేకుండా చేసుకోగలవు.

అలా కాకపోతే, నీకు నిద్ర మాత్రలే శరణ్యం. అందుకు సిద్ధపడాలి.

*

ప్రశ్న: స్వీట్ మదర్, నిద్ర పోతున్నప్పుడు స్వాధిపత్యం సాధించటం సాధ్యమా? ఉదాహరణకు, నేను మిమ్ములను నా కలల్లో దర్శించాలనుకుంటే, నా కది నా ఇచ్ఛానుసారంగా సాధ్యమా?

శ్రీమాత: నిద్ర మీద ఆధిపత్యం పూర్తిగా సాధ్యమే, నీ ప్రయత్నాన్ని పట్టుదలతో క్రమపద్ధతిలో కొనసాగిస్తే. కలలను గుర్తు పెట్టుకోవటంతో నీవు మొదలుపెట్టి తరువాత క్రమంగా నీ నిద్రలో సచైతన్యంగా ఉండగలుగుతావు. నీవు నీ కలలను నియంత్రించగలగడమే కాక, నిద్రలో నీ వ్యవహారసరళిని నిర్దేశించగలుగుతూ, వ్యవస్థీకరించగలుగుతావు.

నీ ప్రయత్నంతోనూ, ఇచ్ఛతోను పట్టుదలతో కొనసాగిస్తే నీవు తప్పకుండా రాత్రిళ్ళు నీ నిద్రలో నా దగ్గరకు వచ్చి చూడగలగటం నేర్చుకుంటావు. దాని తరువాత ఏం జరిగిందనేది కూడా గుర్తుంచుకోగలుగుతావు.

దీనికి రెండు విషయాలు అవసరమవుతాయి. వాటిని ఆకాంక్షతోను, ప్రశాంతతతోను, కృతనిశ్చయంతో కూడిన ప్రయత్నంతో అభివృద్ధి చేసుకోవాలి.

1) నీ ఆలోచనను నా వద్దకు వచ్చి చూడాలనే ఇచ్ఛ మీద కేంద్రీకరించు. తరువాత ఆ ఆలోచననే అనుసరించు, మొదట భావనాశక్తితో, అటు పిమ్మట స్ఫుటంగా దానిని వాస్తవం చేసుకునే పద్ధతిలో వృద్ధి చేసుకుంటూ, నీవు నా సన్నిధిలోకి చేరే పర్యంతం కొనసాగించాలి.

2) మెలకువకు, నిద్రపోయే చైతన్యస్థితికి మధ్య ఒక విధమైన వారధిని స్థిరప

ర్చుకోవాలి. ఫలితంగా మెలకువ వచ్చినపుడు నీకు ఏం జరిగిందనేది గుర్తుకొస్తుంది.

నీవు వెంటనే దీనిని సాధించగలవేమో కాని, తరచుగా అది కొంత సమయం తీసుకుంటుంది. దృఢమైన పట్టుదలతో నీ ప్రయత్నాన్ని తప్పక కొనసాగించాలి.

మూలం: శ్రీమాత

అనువాదం: డా. టి. ప్రసన్న కృష్ణ

జీవితంలో సమన్వయ లోపం

ఒక వుపాధ్యాయుడు: పగలు సమయం చాలకపోవడం చేత రాత్రి తప్పనిసరిగా మేము పాఠాలు తయారుచేసుకోవలసి వస్తున్నది.

శ్రీమాత: ఓహో! పనులు చెయ్యాల్సి వచ్చినపుడు చెయ్యడానికి, మానడానికి కూడా అనేక కారణాలుంటాయి. అందుకు నీ వొక నైతిక సమస్యను సృష్టించకూడదు. పూర్తి నిస్వార్థంతో మీ కర్తవ్యాన్ని మీరు నిర్వర్తించగలగాలి. అప్పటికీ నిద్రాభంగం లాంటి సమస్య ఉంటూనే వుంటుంది.

అంతర్గర అభివృద్ధికి నైతిక వ్యవహారాలతో సంబంధం లేదు. నేను నీ కిది చెప్పవలసి వచ్చినందుకు విచారిస్తున్నాను. అయినా ఎవరి మార్గం వారిది. పూర్తి నిస్వార్థంతో పనిచేయటానికి అస్వస్థత లాంటి ఆటంకం ఎప్పుడూ ఉంటుంది. నిస్వార్థమంటే చూడండి! స్వార్థమన్నది అసలు యే కోశాన యే విషయంలోను యెందులోనూ వుండకూడదు. పూర్తిగా స్వార్థపరులుగా వుండాలనుకుంటే అలాగే వుండండి. అది దేనికీ అడ్డు రాదు. కాని ఇలాంటి నైతికత్వం సమర్థనీయం కాదు.

నైతిక వివేకానికి, సత్యమును వ్యక్తీకరించే చైతన్యానికి చాల వ్యత్యాసం ఉంది. నేను స్పష్టంగా చెప్తున్నాను. నిరంతరం సత్యాన్ని వెలిబుచ్చే చైతన్యం కలిగి వుండడం, నైతిక భావన కంటె మిక్కిలి కష్టమైనది. ఎందుకంటే యెంత తెలివిమాలినవాడికైనా సామాజిక నియమాలు పాటించడం తెలుస్తుంది. కాని సత్యచైతన్యం కలిగివున్నవాడు తెలివిమాలినవాడు కానక్కర్లేదు. ఇది (సత్యచేతన) మొట్టమొదటి నిబంధన.

వుపాధ్యాయుడు: దీని వలన ఒక సంవత్సరం నించి నాకు రాత్రులన్నీ వ్యర్థమయి పోతున్నాయి.

శ్రీమాత: సరే కాని, ఇదంతా నీ జీవితంలో సమన్వయ లోపంగా నువ్వు గ్రహించడం లేదా? పరిస్థితు లెలా వున్నా మనిషి క్షణ క్షణం సందర్భానుగుణంగా జీవిస్తూనే వుంటాడు. లేదా కొందరు కొంత ప్రయత్న ఫలితంగా మానసిక సమన్వయం సాధిస్తారు. కాని అది సత్య సదృశం కాదు. అందుచేత ప్రతి క్షణం అది విఘాతం కలిగిస్తూనే వుంటుంది.

కాని వ్యక్తి ఒక వున్నత చైతన్యాశయానికి అనుగుణంగా తన జీవితాన్ని సమన్వయపరుచుకున్నట్టయిన, యెటువంటి తడబాటు లేకుండా ప్రయత్నం చేసినట్టయిన అదే ప్రతి క్షణం వొక స్పష్టమయిన సూచన లిస్తుంది. ఏం చెయ్యాలో యెలా చెయ్యాలో సూచిస్తుంది. ఆ విధంగా పరిస్థితుల్ని సమర్థతతో అదుపు చెయ్యగలిగిన వారికి యేదీ విపత్కరమైన కష్టం కాదు.

సాధారణంగా మనిషి తను చెయ్యదల్చుకున్న పనిని జాగ్రత్తగా యెంపిక చేసుకుని తను సరిగ్గా యెంత చేయగలడో అంతే తీసుకుని తను చెయ్యగలిగినంత చక్కగా శక్తివంచన లేకుండా చెయ్యాలి. కాని అందుకు బదులు మనిషి తరుచు తన శక్తిని యెక్కువగా అంచనా వేసుకుని అత్యధికం చెయ్యడం ప్రారంభిస్తాడు. అలా తీసుకున్నదాంట్లో చాలా వరకు లేదా కనీసం కొంత భాగమైనా పని కిరానిదే వుంటుంది. అది సాధ్యమయినంత తగ్గించుకుంటే, అంటే ఫలితం చెడకుండా వుండేంత తగ్గించుకుంటే బాగుంటుంది. అలాగని యిది అందరి విషయంలో వర్తించే నిబంధనగా చెప్పడం లేదు. నా అనుభవాన్ని బట్టి చెప్పేను. వ్యక్తిగత అంతర్వాణి సూచనల విషయంలో శ్రద్ధగా వుండాలి. అప్పుడే బాహ్యం నుండి వచ్చే అలజడి వల్ల యేర్పడే సంశయాస్పదమైన ఆలోచనల్ని తిరస్కరిస్తాడు. ఈ అలజడి యితరుల సంకల్పాల వల్ల వుత్పన్నమయేది కొంత, రోజూవారీ పరిస్థితుల వల్ల కలిగేది కొంత. ఇదేమీ కాకపోతే ప్రతికూలమైన వ్యతిరేకశక్తుల వల్ల వచ్చేది కొంత. యిలా అన్ని రకాల అలజడుల వల్ల పుట్టుకొస్తాయి. అందుచేత అలా వాటివల్ల నెట్టి వేయబడడానికి బదులు మనిషి తన అంతర్వాణి సూచనలను యెంతో నిర్దుష్టంగా, యెంతో స్పష్టంగా స్వీకరించాలి. నిర్ద్వంద్వంగా దాని ననుసరించాలి. నిస్సంశయంగా, ఖచ్చితంగా, నిజాయితీగా ఆ సూచనలు పాటించాలి. అవతలివారి

కది నచ్చకపోయినా సరే. పైగా అది వాళ్లకి చెడు అనిపించినా సరే. పరిస్థితుల మీద అదుపు సాధించాలంటే యీ విధంగానే సాధ్యమవుతుంది. అలాంటివాళ్ళే పరిస్థితుల కనుగుణంగా జీవితాన్ని సమన్వయపరుచుకున్న వాళ్ళు. అలాంటి వ్యక్తే అతి తక్కువ సమయంలో అతి యెక్కువ పనిచేయగలడు.

మూలం: శ్రీమాత

అనువాదం: నడిమింటి విజయలక్ష్మి

శ్రీఅరవిందుల మార్గ నిర్దేశం

ఇటీవలి వైద్యశాస్త్రి సిద్ధాంతం ప్రకారం వ్యక్తికి నిద్రావస్థలో ఎన్నో దశలు ఉంటాయి. వాటిని దాటిన పిమ్మట పరిపూర్ణ విశ్రాంతి, నిశ్శబ్ద స్థితికి చేరుకుంటాడు. ఈ స్థితి కేవలం పది నిముషాలు మాత్రమే ఉంటుంది. మిగిలిన సమయమంతా ఈ దశను చేరుకొనేదానికి, తిరిగి మళ్లీ వెనక్కి మెలకువ స్థితికి ప్రయాణించేదానికి సరిపోతుంది. ఈ పది నిముషాలు నిద్రనే — నేను అనుకుంటాను — బ్రహ్మలోకం లేక బ్రహ్మన్ లో సుషుప్తి అని పిలువబడేది మిగిలినదంతా స్వప్నలోక సంచారం. (చైతన్య భూమికలు లేక దశలు). ఈ పది నిముషాల సమయంలోనే జీవుడు శక్తిని తిరిగి పుంజుకుంటాడు. ఇది లేకుండా నిద్ర విశ్రాంతి నివ్వదు.

శ్రీమాత యొక్క అనుభవం, జ్ఞానం ప్రకారం మెలకువ నుంచి నిద్రలోకి తీసుకుపోయే అవస్థలు ఎన్నో. ఈ దశల్లో జీవుడుకి ఎన్నో లోకాలలోకి ప్రవేశం, సంచారం ఉంటాయి. ఆ విధంగానే స్వచ్ఛ సచ్చిదానంద ప్రశాంతత, తేజస్సు, నిశ్శబ్దతల లోనికి చేరుకోవడం జరుగుతుంది. తర్వాత భౌతికంగా మెలకువ స్థితికి వచ్చిన దారినే తిరిగి వెనక్కి వెళ్లి చేరుకోవడం జరుగుతుంది. నిద్రకి బలవర్ధకమైన విలువ నిచ్చేది ఈ సచ్చిదానందస్థితియే. ఈ రెండు వివరణలూ కూడా, ఆధునిక శాస్త్రి విజ్ఞానం, నిగూఢ ఆధ్యాత్మిక విజ్ఞానం ప్రకారం కూడా ఒక్కటే. పోతే, ముందుది ఈ మధ్యనే కనుగొన్నది. నిగూఢ ఆధ్యాత్మిక విజ్ఞానానికి ఇది యెప్పుడో తెలుసు.

గాఢ నిద్ర గురించి ప్రజల్లో పూర్తిగా పొరపాటు భావన నెలకొని ఉంది. గాఢ

నిద్ర గురించి వాళ్ల అభిప్రాయం ఏమంటే అవచేతనలో బాహ్యచేతన పూర్తిగా మునిగిపోయి ఉంటుందని. అంతే. దానినే వాళ్లు స్వప్నరహిత నిద్ర అంటారు. నిజానికది ఒక్క స్థితి మాత్రమే. అది ఉపరితల నిద్రావస్థ చేతనాస్థితి. అది ఇంకా క్రియాశీలంగానే ఉంటుంది. కాకపోతే ఆ చైతన్యం కలల యొక్క రూపురేఖా విన్యాసాలను రికార్డు చేసి భౌతిక మనసుకి అందించగలిగే స్థితిలో ఉండదు. వాస్తవానికి నిద్ర అంతా కలల మయమే. బ్రహ్మలోక సుషుప్తిలో — ఆ కాస్త సమయంలో మాత్రమే — కలలుండవు.

నిద్రపోయే సమయం ఏడెనిమిది గంటలు. వయసు మళ్ళినవాళ్ల కిది ఇంకా తక్కువ. మరి కాస్త నిద్రాసమయం తక్కువ — 5 లేక 6 గంటలు — అయినా శరీరం సర్దుబాటు చేసుకుంటుంది. ఒక వేళ, నిద్రాసమయం యొక్క నిర్దేశిత ప్రమాణం సడలినపుడు, వెంటనే శరీరం ఆ బకాయిని భర్తీ చేసుకోచూస్తుంది. సాధారణంగా అల్పంగా ఆహారం తీసుకోవటానికి ప్రయత్నించే వ్యక్తి కాస్తంత తిండి గురించి సడలింపు ఇచ్చాడనుకోండి — అపుడు శరీరానికి తిండి ఆబ ఎక్కువైపోతుంది. లాభనష్టాలు భర్తీ చేసుకోవాలనుకుంటుంది. ఇది సాధారణంగా జరిగే విషయం.

*

జాగృదావస్థలో జీవనాన్ని నిర్దేశించేది జాగృత మనసు. ఆలోచన, ఇచ్ఛ — వీటిని నిగ్రహించి నిర్దేశించేది అదే. నిద్రలో ఆ మనసు ఉండదు. ఆ నిగ్రహమూ ఉండదు. మనస్సు కలలు వగైరాలను చూడదు. నిద్రావస్థలో అది అసంబద్ధమైన చైతన్యం కలిగి ఉంటుంది. అప్పుడే అవచేతన అని పిలువబడే చైతన్యం బహిర్గతమవుతుంది. ఆలోచనా బుద్ధి చురుగ్గా ఉంటే అసలు నిద్ర పట్టనే పట్టదు.

*

నిద్ర, మెలకువలు వాస్తవ సత్వము లేక చైత్యపురుష సత్వముచే నిర్ణయింపబడవు. మానసికమైన జాగృదవస్థ, లేదా, మానసిక క్రియాశీలత, లేదా, దాని యొక్క నిష్క్రియాత్మకత — ఇవీ నిర్ణయించేది. అపుడు అవచేతన ఉపరితలానికి చేరుకుంటుంది. నిద్ర వస్తుంది.

*

నీవు వర్ణించిన నిద్రలో కాంతివంతమైన నిశ్శబ్దం ఉంది. పోతే కణాలలో దివ్యా

నందం చోటు చేసుకుంది. నిస్సందేహంగా ఇవి ఉత్తమోత్తమమైన అవస్థలు. నిశ్చైతన్యంగా ఉన్న ఆ క్షణాలు గాఢ నిద్రావస్థ క్షణాలు కావచ్చు. అపుడు నీవు భౌతికం నుంచి మానసిక, ప్రాణిక లేదా ఇతర భూమికల లోనికి చేరుకుని ఉంటావు. నీవు నిశ్చైతన్యంగా ఉన్నాననవచ్చు. కాని అది కాదు. జరిగినదేదో నీకు జ్ఞాపకం లేక పోవచ్చు. అంతకు తప్ప మరేమీ కాదు. ఎందుకంటే మళ్ళీ తిరిగి నువ్వు చైతన్యం లోకి వచ్చినపుడు ఆ చైతన్యం తలక్రిందులవటమో, లేక, మార్పుచెందటమో జరుగుతుంది. నిద్రలో నీవు పొందిన అనుభవమంతా, గాఢానుభూతిపరమైనదిగా, లేక, అన్నిటికీ చివరి సంఘటనై ఉండకపోతే, అంతా శూన్యమైపోతుంది. శూన్యమైన స్థితి మరొకటి ఉంది. అది ఒక జడత్వస్థితి. అది శూన్యము కాదు. విస్మృతి. భారమైనది. ఆ పరిస్థితి ఎపుడు వస్తుందంటే, గాఢమైన, మోటైన అవచేతనాస్థితికి జారుకున్నపుడు. మరీ లోతైన అవచేతనాస్థితికి జారుకోవటం ఏ మాత్రం అభిలషనీయం కాదు. ఇది చేతనను దిగజారుస్తుంది. అస్పష్టంగా ఉంచుతుంది. ఇది విశ్రాంతి నివ్వకపోగా అలసట కలుగ చేస్తుంది. ప్రకాశవంతమైన నిశ్శబ్దం తారుమారవుతుంది.

*

సాధన ద్వారా జాగృత చైతన్యం లభింపచేసుకున్న ఉన్నతస్థాయి, రాత్రి నిద్రావస్థలో కిందికి దిగజారుతుంది. నిద్రాసమయంలో చైతన్యాన్ని పైకి ఉద్ధరించే ప్రత్యేక అనుభవాలు, లేదా, అవచేతనా జడత్వపు దిగజారుడుతనాన్ని విపరీత ప్రక్రియలో నిరోధించే యోగపరంగా సంపాదించిన చైతన్యం, శరీరంలో ఎంతో బలంగా ప్రవర్తిస్తున్నపుడు అలా జరుగదు. సాధారణ నిద్రలో శరీరంలోని చైతన్యం, భౌతిక అవచేతనకి సంబంధించినదిగా ఉంటుంది. అది నీరసవడిన చైతన్యం. మిగిలిన సత్వమువలె, జాగృతమై, అంత చురుకుగా ఉండదు. మిగిలిన సత్వం అంతా మరుగున పరోక్షంగా ఉంటుంది. దాని యొక్క చైతన్య భాగం కొంతమేరకు ఇతర భూమికల లోనికి చేరుకుంటుంది. దానియొక్క అనుభవాలు స్వప్నాలుగా నమోదు కాబడి ఉంటాయి. ఇపుడు నీవు చెప్పినవి అదే — వెళ్ళకూడని స్థలాలకు వెళ్లడం లాంటివి. దీని అర్థం నీవపుడు ప్రాణిక లోకంలో ప్రవేశించావు. ప్రతి ఒక్కరి విషయంలోనూ ఇదే జరుగుతుంది. ప్రాణికలోకం అలాటి స్థలాలకి, అనుభవాలకి ఆలవాలమై ఉంటుంది. నీవు చేయవలసినది వాటి నుంచి తప్పించుకోవటం కాదు. అది అసాధ్యం

కూడా. అలా కాక పూర్తి రక్షణ కలిగి ఉండాలి. ఆ రక్షణ పొందేందుకు, భౌతికాతీత దివ్య స్వభావ భూమికలపై నీకు ఆధిపత్యం ఉండాలి. అందుకు శ్రీమాత నెపుడూ విస్మరించకూడదు. స్మృతిపథంలో ఉంచుకోవాలి. ఆమె దివ్యశక్తికి తెరుచుకుని ఉండాలి. నిద్రపోయే ముందు నీవు ఇది చేయాలి. నీ విది ఎంతవరకూ విజయవంతంగా అలవాటు చేసుకుంటావో, ఆ మేరకి, రక్షణ నీకు లభ్యమవుతుంది.

*

ఏకాగ్రతలోనే రాత్రి నీవు నిద్రలోకి జారుకోవాలి. కళ్లు మూసుకుని, పరుండి, ఏకాగ్రత వహించాలి. ఆ ఏకాగ్రత, నిద్రగా ప్రగాఢమవాలి. అంటే అర్థం — నిద్ర ఏకాగ్రతతో కూడిన బాహ్య జాగృదవస్థకి దూరంగా, అంతర్ధ్యానం కావాలి. అవసరమనుకుంటే కాస్సేపు కూర్చుని ఈ సాధన చేయవచ్చు. తర్వాత పడుకోవాలి, పదిలంగా ఉంచుకున్న ఏకాగ్రతలో.

*

రాత్రి మేల్కొని ఉండటం సరియైన పద్ధతి కాదు. నిద్రని బలవంతంగా అణచివేయటం వల్ల శరీరం తామసికమవుతుంది. మేల్కొన్న సమయాలలో ఏకాగ్రతకు ఇది భంగం కల్గిస్తుంది. నిద్రను రూపాంతరీకరించటం సరియైన పద్ధతి. అంతేకాని అణచివేయటం కాదు. నిద్రలోనే మరింత చైతన్యవంతంగా ఉండటం అవసరం. నీవు నేర్చుకోవలసినది, ఇదీ. ఇదే కనుక జరుగుతే, అంతరంగంలో చైతన్యం పని చేసే విధానంగా, నిద్ర పరిణామం చెందుతుంది. అక్కడ కూడా, జాగృదవస్థలోనే సాధన సాగుతుంది. అదే సమయంలో, భౌతికంగాకాక, ఇతర చైతన్య స్థరాలలో ప్రవేశించగల్గటం సాధ్యమవుతుంది. ఇంకా, అపారమైన విస్తృతి కలిగిన విషయసేకరణతో కూడిన ఉపయుక్తమైన అనుభవాన్ని అందుకుని స్వాయత్తం చేసుకోగల్గటం సాధ్యమవుతుంది.

*

నిజానికి నిద్రలో మన చైతన్యంలో చాలా భాగం అవచేతనలో మునిగి ఉండదు. ఆ తెర నుంచి వైదొలగి సత్వము యొక్క ఇతర భూమికలలో — భౌతికాతీత అస్తిత్వ స్థరాలు, మానసిక, చైత్యపురుష, ఉన్నతతర జీవనలోకాలు — వీటిలో సంచరిస్తూంటుంది. ఇవి మనకు తెలియకుండానే మనలను ప్రభావితం చేస్తాయి. ఈ భూమికల నుంచి ఎపుడైనా మనకు స్వప్నం వస్తుంది. అది కేవలం స్వప్నము

మాత్రమే కాదు. అంతకు మించినదిగా ఉంటుంది. అదొక స్వాప్నిక అనుభవం. మనకు, మన చుట్టూ జరిగిన సంఘటనలకి ప్రతీక. వాటికి ప్రత్యక్ష రికార్డు. అంతరంగ సాధనవల్ల చైతన్యం వికసించే కొలదీ ఇలాటి కలలలో కలిగే అనుభవాలు పెరుగుతాయి. పారదర్శకంగా ఉంటాయి. సుసంగతమై, నిర్దిష్టంగా ఉంటాయి. మరింత చేతనానుభవ వికాసం తర్వాత, జాగ్రత్తగా పరిశీలిస్తే అవి అవగాహన అవుతాయి. అంతరంగ జీవనానికి వాటి ప్రాచుర్యం కూడ అవగతమవుతాయి.

నిద్రావస్థలో ఈ రకమైన జాగృతి, జాగృత అవస్థలో చైతన్యము ఒకటే కావు. నీవు గ్రహించినది ఇది రైటే. ఈ రెండూ సత్యము యొక్క రెండు పార్శ్వాలు.

మూలం: శ్రీఅరవిందులు

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

శ్రీఅరవిందులు అనుగ్రహించిన ప్రార్థన

పగటిపూటలో లానే, రాత్రీ నా తోనే యెల్లప్పుడూ ఉండు. నీ అస్తిత్వజ్ఞానాన్ని మెలకువలో వలెనే నిద్రలోనూ నాకు యెల్లప్పుడూ కలిగించు. దివ్యసత్యము, చేతన, దివ్యానందము నిరంతరాయంగా నాలో యెల్లవేళలా నిలిచి ఉండనీ, వికసించనీ.

కొసమెరుపు

ఒక ఖైదీ ఉండేవాడు. చేసిన నేరానికి జైలు శిక్ష అనుభవిస్తూన్నాడు. కోపంతో, దుఃఖంతో, భయంతో ఎప్పుడూ ప్రతి వారం ఉండేవాడు.

అలా ఉండగా, ఒక వారం మాత్రం తేడాగా కనిపించాడు. ఆ వారంలో తాను జ్ఞప్తికి తెచ్చుకున్నది నాకు చెప్పాడు. ఒక వారాంతంలో తనూ, తన కొడుకు కలిసి ఉన్నారు. ప్రక్కనున్న రాష్ట్రానికి కేంపుకి బయల్దేరారు. తిరిగి ఇంటికి వస్తూంటే మధ్యలో పెనుతుఫాను చెలరేగింది. చిన్న కుర్రాడు తండ్రిని చూసి అన్నాడు, "డాడీ, రోడ్డు అంత బాగా లేదు. అయినా నువ్వు మంచి డ్రైవరువి. నీ వొడిలో తలపెట్టుకుని పడుకుంటానూ?" పిల్లావాడు తండ్రి వొళ్లో పడుకున్నాడు.

ఆ సంఘటన గుర్తుచేసుకుని ఖైదీ చిన్నపిల్లాడిలా ఏడ్చానని చెప్పాడు. తర్వాత భగవంతునితో అన్నాడు: "దివ్యమాతా, ఇప్పటి నుంచి నీవే డ్రైవరు. రోడ్డు అంత బాగా లేదు. అయినా నాకు నీ పైన నమ్మకం ఉంది." ప్రశాంతత తనలో పొంగి పొరలింది ఆ తర్వాత.

ఇది రెండు సంవత్సరాల క్రితం మాట. ఇప్పటికీ ఖైదులో ఆతను మాత ఒడిలో తన శిరసుంచి పడుకుని నిద్రపోతాడు.

(రచయిత తెలియదు)

అనువాదం: కర్రా వెంకటేశ్వర్లు

కాంతికిరణాలు

నిశ్చలత:

నిశ్చలంగా, ప్రశాంతంగా ఉండేలా జాగ్రత్తపడు. నీ సత్వములో సమగ్ర సమచిత్తము (integral equanimity) క్రమక్రమంగా పరిపూర్ణంగా స్థిరపడనీ. మనసును, సంక్షోభపడేంతటి క్రియాశీలంగా ఉంచకు. విషయాలను బాహ్యంగా దర్శించిన వెంటనే తొందరపడి నిర్ణయాలకు రాకు. తగినంత సమయం తీసుకో. శ్రద్ధగా పరిశీలించు. నిశ్చలంగా నిర్ణయం తీసుకో. కష్టాలలో నిశ్చలంగా, ప్రశాంతంగా ఉండటం తప్పనిసరిగా నేర్చుకో. అవరోధాలవప అధిగమించే పద్ధతి ఇదే.

*

ప్రశాంతత:

ప్రశాంతంగా ఉండటం నిశ్చయంగా తమస్సు కాదు. వాస్తవానికి ప్రశాంతంగా ఉన్నప్పుడే విషయం చక్కబడుతుంది. వ్యాకులపాటు లేకుండా పనిచేయటం, ప్రతి విషయాన్ని కలతపడకుండా పరిశీలించటం — ఇదే ప్రశాంతత అంటే అని నేనంటాను.

*

వ్యక్తి అన్ని సంఘటనలనపట్ల ఎంతో ప్రశాంతంగా ఉంటూ, అన్ని పరిస్థితులలోను సమచిత్తం పాటిస్తూ, తన స్వాధిపత్యాన్ని నిలుపుకొని, ఏమి జరిగినా, ప్రశాంతంగా ఉంటూన్నప్పుడు, లక్ష్యసాధన దిశగా తను ఎంతో పురోగమిస్తాడు.

శాంతి ప్రశాంతతలలో మాత్రమే సర్వోత్కృష్టంగా చేయవలసినది, ఏదో, తెలుసుకోగలుగుతాడు.

నవంబరు 3, 1937

*

ప్రశాంతతను కనుగొనవలసినది బాహ్యపరిస్థితులలో కాదు; నీ అంతరంగంలో. నీ అంత స్సత్త్వపు లోతుల్లో శాంతి ఉంది. నీవు అనుమతిస్తే కనుక, అది నీ సత్త్వమంతా శరీరం వరకు ప్రసరిస్తుంది.

నీవు అన్వేషించవలసిన ప్రశాంతత అదే. అపుడే నీవు కోరుకున్న ప్రశాంతత నీకు లభ్యమయేది.

*

శాంతి:

నీ హృదయంలోనే ప్రశాంతత లేకపోతే మరెక్కడ దానిని పొందగలవు!

*

స్వచ్ఛమైన మనసుకంటె ఉత్కృష్టమైన శాంతి మరెక్కడా లేదు.

*

సాధకుడు శాంతిని పొందేది భగవంతుని నుంచే. అది బాహ్యపరిస్థితులపై ఆధారపడి ఉండదు. స్వతంత్రమైనది. ఎక్కువ దైవము పైననే దృష్టి మరల్చి ఉంచు. నిజమైన అంతరంగ ప్రశాంతతనే ఆకాంక్షించు. అపుడు అలజడి లేకుండా నా కార్యాన్ని నిర్వహించటానికి కావల్సిన శాంతి నీకు లభ్యమవుతుంది.

నీవు నిరంతర దివ్యసన్నిధాన చైతన్యస్థితిని ఎంతగానో కలిగి ఉండేది — శాంతి, అంతరంగ నిశ్శబ్దాలలోనే.

*

సనాతనుడు (the Eternal) శాంతి, నిశ్శబ్దాలలో అభివ్యక్తమై ఉంటాడు. మరేమీ చికాకుపడకు. సనాతనుడు అభివ్యక్తమవుతాడు.

మే 12, 1954

సమాచార పత్రం

సావిత్రి అధ్యయన శిబిరం

శ్రీఅరవింద సొసైటీ, పుదుచ్చేరి, బీచ్ ఆఫీసు ప్రాంగణంలో 1010 సం. ఫిబ్రవరి 22 వ తేది నుంచి 28 వ తేదీ వరకు, ప్రతి సాయంకాలం 5 గం. 15 ని.ల నుంచి 7.00 గం.ల వరకు శ్రీ డా. అలోక్ పాండేగారిచే సావిత్రి అధ్యయన శిబిరం నిర్వహింపబడుతోంది. ఇందుకు అందరూ ఆహ్వానితులే.

శ్రీఅరవింద సాంఘిక శాస్త్రి పరిశోధనా సంస్థ

శ్రీఅరవింద సొసైటీ విభాగం వారు — Iternational Society for Technology in Education (ISTE) USA వారి అనుబంధ సంస్థగా, వారి సహకారంతో, సమగ్ర విద్య, బోధన, అభ్యసన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందుకుగాను శ్రీఅరవింద సొసైటీ, పుదుచ్చేరివారు, పుదుచ్చేరిలో, Indian Council of Integral Education అనే సంస్థను రూపొందించారు. వివరాలకు సంప్రదించవలసినది వారి Web site: http://www.sriaurobindosociety.org.in/activity/icie.htm.

శ్రీఅరవిందాశ్రమంవారి నూతన ప్రచురణ:

Th God-Touch and Lights from Sri Aurobindo's "Savitri " సేకరణ: డా. ఎ.యస్. దలాల్; పేజీలు xxi+139 - ఖరీదు రు 65/- ప్రాప్తి స్థానం, 'శబ్ద', పాండిచేరి – 605002.

ఒక సవరణ: నవంబరు 2009, 'అఖిల' సమాచార వార్త:

Lathrop, అమెరికా — లో, శ్రీఅరవిందుల జన్మదినం నాడు, ప్రారంభోత్సవ కాబడిన, శ్రీమీరాంబికా ధ్యానమందిర సంస్థాపకులు: శ్రీ అద్దేపల్లి సతీష్ కుమార్‌గారు (సంతోష్ కుమార్ గా ప్రచురితమైనది). సవరణ గమనించగలరు.